

తాళ్ళపాక సంకీర్తనలు

పరిశోధనలో కొత్తగా వెలుగు చూస్తున్న
తాళ్ళపాక కవుల పదసాహిత్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

శ్రీ తాళ్లపాకవారి పదసాహిత్యము - ప్రత్యేక సంపుటము

తాళ్లపాక వాఙ్మయోద్ధారకులైన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి ప్రేరణతో

తిరుమల తిరుపతి దేవస్థానములకు 1941లో చేరిన శ్రీ తాళ్లపాక వేంకట శేషాచార్యుల

వ్రాతప్రతి ఆకరముగా

తాళ్లపాక సంకీర్తనలు

(పరిశోధనలో కొత్తగా వెలుగుచూస్తున్న తాళ్లపాక కవుల పదసాహిత్యం)

సంపాదకత్వం - పరిష్కరణ

డా॥ వేటూరి ఆనందమూర్తి

గంధం బసవ శంకరరావు

'పద్మభూషణ్' డా॥ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2022

శ్రీ తాళ్లపాకవారి పదసాహిత్యము – ప్రత్యేక సంపుటము
తాళ్లపాక సంకీర్తనలు
(పరిశోధనలో కొత్తగా వెలుగుచూస్తున్న తాళ్లపాక కవుల పదసాహిత్యం)

© తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
T.T.D. Religious Publications Series No. 1408

పరిష్కరణ:
డా॥ వేటూరి ఆనందమూర్తి
గంధం బసవ శంకరరావు
'పద్మభూషణ్' డా॥ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి

ముఖచిత్రం, లోపలి చిత్రములు:
'కళాప్రపూర్ణ' బాపు

ముఖచిత్రాలంకరణ:
గిరిధర్‌లాల్ అరసవెల్లి

ఛాయాచిత్రములు:
ఆచార్య వేటూరి ఆనందమూర్తి

ప్రకాశకులు:
డా॥ కె.ఎస్. జవహర్‌రెడ్డి, ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

సహకారం:
శాంతా వసంతా ట్రస్ట్
ప్లాట్ నెం.: 16 & 17, గ్రీన్ వాక్ వేస్,
రాజేంద్రనగర్, హైదరాబాద్–500030

ప్రథమ ముద్రణ: 2022

ప్రతులు: 1000

వెల: **₹ 120.00**

ముద్రణము:
శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ.

"తాళ్లపాక సంకీర్తనలు" – వ్రాతప్రతి పుస్తకాన్ని
శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థకు (SVORI) 1941 సం.లో అందించిన
మహనీయులు **శ్రీ తాళ్లపాక వేంకట శేషాచార్యులుగారు – వారి ధర్మపత్ని**

"అన్నమాచార్య చరిత్ర" – వ్రాతప్రతి పుస్తకాన్ని
శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థకు (SVORI) 1940 సం.లో అందించిన
మహనీయులు **శ్రీ తాళ్లపాక సూర్యనారాయణయ్యగారు – వారి ధర్మపత్ని**

ఆమోదం

తొలి తెలుగు వాగ్గేయకారులైన శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులు మొదలుగా తాళ్లపాక కవులు శ్రీవేంకటేశ్వర స్వామివారి సేవలో తరించినవారు. ఈ భక్తకవులు అందించిన సాహిత్యం తెలుగు వాఙ్మయంలో మకుటాయమానమైనది. తాళ్లపాక కవుల సంకీర్తనలు "శ్రీనివాస సేవాప్రబంధం"గా వివిధ కైంకర్యాలలో, ఉత్సవాలలో గానం చేయబడుతున్నాయి. ఆబాలగోపాలం ఈ సంకీర్తనా మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నారు! తెలుగువారికి తరగని సాహిత్య సంపదను అందించిన అన్నమయ్య కుటుంబీకులకు తెలుగుజాతి ఎంతగానో ఋణపడియున్నది.

రాగిరేకులలోని తాళ్లపాక కవుల సాహిత్యాన్ని తిరుమల తిరుపతి దేవస్థానములు వివిధ దశలలో 1949–1999 సం.ల మధ్య కాలంలో ప్రకటించింది. తాళ్లపాకవారి రచనలు రాగిరేకులలో మాత్రమే కాక, తాళపత్రాలు, కాగితపు ప్రతులలో కూడా లభ్యమైనాయి. సంగీత సాహిత్యపు చవి కలిగిన వీరి సంకీర్తనలు వందల ఏళ్ల క్రితమే దక్షిణ భారతదేశమంతా విస్తరించాయి.

ఇది ఇలా ఉండగా, తాళ్లపాక వంశస్థుల దయతో 289 సంకీర్తనలు, శ్రీవేంకటేశ్వర సుప్రభాత స్తవం (ద్విపద) కలిగిన "తాళ్లపాక సంకీర్తనలు" అనే వ్రాతప్రతి లభించింది. శ్రీమాన్ తాళ్లపాక శేషాచార్యులుగారు (1897–1972) ఈ వ్రాతప్రతిని 1941లో దేవస్థానం ఏలుబడిలో ఉన్న శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనసంస్థకు సమర్పించారు. 1949లో వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే పరిష్కృతాలై ప్రకటింపబడిన 'వేడుకొందామా', 'పొడగంటిమయ్య', 'కంటి శుక్రవారము' వంటి విశిష్టమైన సంకీర్తనలు ఈ వ్రాతప్రతిలోనివే! కాని కాలాంతరంలో ఈ వ్రాతప్రతి, దీనిలోని సంకీర్తనలు మరుగునపడిపోయాయి. వీటిలో కొన్ని అన్నమయ్య లేదా వారి వంశస్థులవి కావనే వాదాలూ, విమర్శలూ ఉన్నాయి.

ఈ సందర్భంలో ఈ వ్రాతప్రతిపై విశేషమైన పరిశోధన చేసి, ఈ కీర్తనలన్నీ తాళ్లపాకవారివే అని సోపపత్తికంగా నిరూపించే ప్రయత్నం చేశారు ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారు. ఈ వ్రాతప్రతిలోని సంకీర్తనలు కొన్ని శ్రీవేంకటేశ్వర ముద్రాంకితాలు, కొన్ని శ్రీకృష్ణ నామాంకితాలు, అయినా శ్రీవేంకటేశ్వర చరణాంకితాలే! ఈ సంకీర్తనలను వెలుగులోకి తెచ్చి అందరికీ అందించటానికి తిరుమల తిరుపతి దేవస్థానం పూనుకొంది.

తాళ్లపాక శేషాచార్యులవారి వ్రాతప్రతిలో మనకు సంకీర్తన సంపుటాలలో 65 కీర్తనలు, శ్రీకృష్ణ నామాంకిత కృతులు 15, అన్నమాచార్య చరిత్ర పీఠిక వ్యాఖ్యానములో ప్రస్తావించబడిన కీర్తనలు 12 దర్శనమిస్తున్నాయి! తక్కిన సంకీర్తనలన్నీ వెలుగు చూడని శ్రీవేంకటేశ ముద్రాంకిత సంకీర్తనలే! వీనిలో కొన్ని అసంపూర్ణంగా స్ఖాలిత్యములతో, శైథిల్యముతో ఉన్నమాట వాస్తవం. వాటిని విద్వాంసులు వేటూరి ఆనందమూర్తిగారు పూరించడం ఔచిత్యముగా భాసిస్తున్నది.

ఈ సుహృద్ యజ్ఞంలో ప్రధానపాత్ర వహించి, వ్రాతప్రతులను పరిశీలించి పరిష్కరించిన మాన్యులు ఆచార్య వేటూరి ఆనందమూర్తి మహోదయులకు ధన్యవాదాలు! ఈ కార్యక్రమంలో పాలుపంచుకొన్న డా॥ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, (శాంతా వసంతా ట్రస్ట్, హైదరాబాదు), శ్రీ గంధం బసవ శంకరరావుల కృషి శ్లాఘనీయం!

ఈ పుస్తకాన్ని తిరుమల తిరుపతి దేవస్థానములు ద్వారా ముద్రాపించడానికి ఆమోదించిన కమిటీ సభ్యులు: మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు, ఆచార్య కె. సర్వోత్తమరావుగారు, పదరాగిణి సంస్థ (వెంకటగిరి సంస్థానం) అధ్యక్షులు డా॥ వి.బి.సాయికృష్ణ యాచేంద్రగారు మరియు ఈ కమిటీకి సంచాలకులుగా ఉన్న అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు డా॥ ఆకెళ్ళ విభీషణశర్మగారు. వీరందరికీ ధన్యవాదములు.

తాళ్లపాక వాఙ్మయారాధకులకు "తాళ్లపాక సంకీర్తనలు"ను శ్రీవారి అక్షరప్రసాదంగా సమర్పిస్తున్నాము.

డా॥ కె.యస్. జవహర్‌రెడ్డి, I.A.S.
శ్రీకార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

మరుగు నుంచి వెలుగులోకి వచ్చిన మరకతాలూ, మాణిక్యాలు - కొన్ని అన్నమయ్య సంకీర్తనలు

డా॥ కె.ఐ. వరప్రసాద్‌రెడ్డి

శాంతా వసంతా ట్రస్ట్

దాక్షిణాత్యభాషల్లో ప్రథమవాగ్గేయకారుడు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యులవారు. తెలుగులో పదకవిత రచనకు శ్రీకారం చుట్టి, తెలుగుజాతికి అన్నమయ్య ఇచ్చిన వాఙ్మయసంపద అపారం! అమూల్యం!! వాగ్గేయకారుల రచన ధాతు మాతువుల సంయోగంగా సాగుతుంది. ధాతువు అంటే సంగీతం, మాతువు సాహిత్యం. ఎవరు స్వయంగా గీతరచన చేసి, స్వరాలు కూర్చి, గానం చేస్తారో వారు వాగ్గేయకారులుగా పరిగణింపబడతారు. అన్నమయ్య తన 32 వేల సంకీర్తనల సంఖ్యాబలంతో అటు రాశిలోనూ, ఇటు వాసిలోనూ సుప్రసిద్ధ వాగ్గేయకారులలో ప్రథమస్థానంలో ప్రకాశించారు. వారి పదకవితల్లో భావపుష్టి, రాగసృష్టి సమాంతరంగా సాగిపోతాయి.

అన్నమయ్య 32 వేల పదకవితలను వెలువరించగా మనకు కేవలం 14వేలు మాత్రమే లభ్యమవటం మన దురదృష్టం. మిగతావి అనేక విధాలుగా, అనేక కారణాలుగా మనకు లభించలేదు. కొన్ని పదకవితలను అన్నమయ్య వంశీకులు తమ వారసత్వసంపదగా భావించి వారి ఇంట అటకలపై భద్రపరచి వుండవచ్చు. కాలప్రభావంతో జీర్ణమై ఎవరికీ అందని సౌభాగ్యంగా కాలగర్భంలో కలిసిపోయి వుండవచ్చు. కొందరు నిరక్షరకుక్షుల చేతికందిన సంకీర్తనలు, ఆ వాఙ్మయసౌరభాల విలువ తెలియక ఆ పదకవితలున్న రాగిరేకులను, రాగిరేకుల విలువకే కరిగించి, తెగనమ్మి సొమ్ముచేసుకుని వుండవచ్చు. కొన్ని తాళపత్రాలలో నిక్షిప్తమైనవి అగ్నికి, కాలానికి జీర్ణమైపోయి వుండవచ్చు. కొన్ని అన్యాపదేశంగా ఎక్కడో, ఏ మారుమూలో, ఏ గ్రంథాలయాల్లోనో, ఏ ఇంటిచూరు లోనో అనామకంగా వుండిపోయివుండవచ్చు. ఏది ఏమైనా, ఏ కారణాలవల్లనైనా లభ్యమైన వాటికంటే అలభ్యమైనవే ఎక్కువ.

కొందరు జిజ్ఞాసువులు, కీ॥శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు లాంటి మహనీయులు, దొరకని పదకవితలపై మనసు పెట్టి అప్పుడప్పుడు, అక్కడక్కడ దొరికిన కొన్ని సంకీర్తనలను,

సుదీర్ఘంగా పరిశీలించి, అవసరమైనచోట పరిష్కరించి, అవి అన్నమయ్య విరచితాలేనా, కాదా అని నిర్ధారించుకొని వాటిని వెలుగులోకి తెచ్చారు. అలా అప్పుడప్పుడు దొరికినవి భాషాపరిశోధకుల పరీక్షలో నిగ్గుతేలినవి, కొన్ని వందల సంఖ్యకే పరిమితమైనవి.

గత ఐదు శతాబ్దాలుగా మరుగున వుండిపోయిన తాళ్లపాక సంకీర్తనల వ్రాతప్రతులను 1941వ సంవత్సరంలో శ్రీమాన్ తాళ్లపాక శేషాచార్యులవారు వెలుగులోకి తెచ్చి తిరుమల తిరుపతి దేవస్థానంవారికి సమర్పించగా ఆ వ్రాతప్రతి తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థకు చేరింది. శ్రీమాన్ తాళ్లపాక శేషాచార్యులవారు వెలుగులోకి తెచ్చిన కారణంగా, అది “శేషాచార్యుల వ్రాతప్రతి”గా నామాంతరం చెందింది. ఇందులో 289 సంకీర్తనలు దర్శనమిచ్చాయి. ఆ వ్రాతప్రతులకు 80 సం॥ల పైచిలుకు వయస్సు వున్న కారణంగా శిథిలావస్థలో వుండి కొన్ని అక్షరాలు, కొన్నిచోట్ల కొన్ని పదబంధాలు మన చర్మచక్షువులకు అందని పరిస్థితి ఏర్పడింది. అవి పూరించడానికి, పరిష్కరించడానికి, వయోవృద్ధులు ఆధ్యాత్మభావపరంపరలో శేషజీవితాన్ని ప్రశాంతంగా గుండెను గుడిగా చేసుకుని జీవనయానం సాగిస్తున్న విద్వన్మణులు శ్రీమాన్ వేటూరి ఆనందమూర్తి గారిని శ్రీ వేంకటేశ్వరుడే నాకు, శ్రీ శంకరరావుకు స్ఫురింపచేశారు.

ఈ పవిత్రకార్యంలో శంకరరావు కృషి మరువరానిది, ప్రస్తావించదగినది. అన్నమయ్య పదకవితామృతం ఎంతో కొంత సేవించి, అందులోని భక్తి, జ్ఞాన, వైరాగ్య భావనలలో తరించే కొందరిలో ఒకరు మా సంస్థలో నా సహచరుడు, కేవలం లౌకిక అవసరాల కోసం ఉద్యోగం చేసే శ్రీ గంధం బసవశంకరరావుగారు. తనలో జ్వలిస్తున్న అన్నమయ్య పదాలపై ఆర్తిని, ఆరని దాహాన్ని నేను గమనించడం జరిగింది. సంకీర్తనలపట్ల అతని అంకితభావం, భావోద్వేగం నన్ను కదిలించాయి. అతనిని శ్రీవేంకటేశ్వరుడే అజ్ఞాతసంకీర్తనాపుష్పాలను సేకరించే పుణ్యకార్యానికి నా వద్దకు పంపాడనిపించింది. ఒకవైపు తన ఉద్యోగధర్మం నిర్వర్తిస్తూ, మరోవైపు తన ఆత్మానుగతమైనటువంటి ఆర్తితో అన్నమయ్య కీర్తనల సేకరణ కోసమే ఎక్కువ సమయాన్ని కేటాయించారు. అలా తన తపనతో, శ్రద్ధతో పలు ప్రదేశాలకు స్వయంగా వెళ్లి ఆయా గ్రంథాలయాల్లో తాను చూసి, సేకరించిన కొన్ని కీర్తనలను, కొన్ని పదకవితలను క్రమబద్ధీకరణ చేస్తూ వచ్చారు.

ఇలా సేకరించిన అనేక కీర్తనలను, శేషాచార్యుల వ్రాతప్రతిలోని కీర్తనలను అందులో పూరించవలసిన భాగాలును, పరిష్కరించవలసిన అవసరాలను, గుర్తించి ఈ పదకవితలను అన్నమయ్య తాళ్లపాకవారి వంశానికి చెందినవారే వ్రాసారనీ నిర్ధారించగలిగే విద్వన్మణులు రసపరిశోధకులు శ్రీమాన్ వేటూరి ఆనందమూర్తిగారేనన్న నిర్ణయానికి నేను, శంకరరావుగారు వచ్చాము. గతంలో ఇటువంటి పుణ్యకార్యాన్ని ఆనందమూర్తిగారి పితృపాదులు కీ॥శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు నిర్వర్తించియున్నారు. వారికి, ఆనాటికి లభ్యమైన కీర్తనలను పరిష్కరించి అవి తాళ్లపాకవారివేనని నిర్ధారించుకున్నాక, తిరుమల తిరుపతి దేవస్థానంకు సమర్పించి ముద్రణాభాగ్యం కల్పించారు.

వారి తనయులు శ్రీ వేటూరి ఆనందమూర్తిగారికి అదే పవిత్రబాధ్యతను శ్రీవేంకటేశుడే అప్పగించినట్టుగా మనం భావించాల్సి వుంటుంది. శ్రీమాన్ ఆనందమూర్తిగారు వయోభారంతో ఉండి కూడా ఈ పవిత్రకార్యాచరణలో

గత ఐదు సంవత్సరాలుగా పరిశీలన, పరిశోధనాపటిమతో సేకరించిన కీర్తనలకు పదకవితలకు ఒక సమగ్రరూపాన్ని ప్రామాణికతను ప్రసాదించారు. వారు చేసిన ఈ కృషి కారణంగా అజ్ఞాతంలో వుండిపోయిన ఈ పదకవితలకు, కీర్తనలకు ముద్రణాభాగ్యం లభించింది.

ఈ గ్రంథ ప్రచురణ గురించి గత ఆరేడు సంవత్సరాలుగా చేస్తున్న నా కృషి ఫలించలేదు. శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షాలతో, ఇంత కాలానికి ప్రసుత్తం 'తిరుమల తిరుపతి దేవస్థానం' ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈ.వో.)గా వున్న శ్రీమాన్ జవహర్‌రెడ్డి, I.A.S. గారిని ఈ సంకీర్తనలను దేవస్థానం తరఫున లోకానికి అందించాలని కోరగా, ఈ గ్రంథం రూపుదిద్దుకోవడంలో రసపరిశోధకులు శ్రీమాన్ వేటూరి ఆనందమూర్తిగారి ప్రమేయం వుందని తెలిసిన వెంటనే గ్రంథప్రచురణకు 'తిరుమల తిరుపతి దేవస్థానం' వారి ఆమోదముద్రను తెలియపరిచారు. అందుకు శ్రీమాన్ జవహర్‌రెడ్డిగారికి శతాధికవందనాలు. వారి ఈ నిర్ణయానికి శ్రీవేంకటేశ్వరుని ప్రచోదనమే కారణమై వుండవచ్చు. వారికి శ్రీవారి ఆశీస్సులు మెండుగా లభించాలని కోరుకుంటున్నాను.

ఈ మహత్కార్యానికి పూనిక వహించి తమవంతు సాయమందించిన అన్నమయ్య సంకీర్తనల ప్రేమికులు, సహృదయులు తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి. ధర్మారెడ్డిగారికి ధన్యవాదాలు. శ్రీనివాసుని కరుణ ధర్మారెడ్డిగారిపై నిరంతరం ప్రసరించాలని ఆకాంక్షిస్తున్నాను.

శ్రీకార్యనిర్వహణాధికారిగారి సూచనలను పాటిస్తూ ఈ సంపుటంపై గ్రంథప్రచురణామోద కమిటీని ఏర్పాటుచేసి, సత్వరమే కమిటీ సానుకూల నిర్ణయాన్ని, ఆమోదాన్ని తెలిపిన అన్నమాచార్య ప్రాజెక్ట్ సంచాలకులు డా॥ ఆకెళ్ళ విభీషణశర్మగారికి ధన్యవాదాలు. వీరికి శ్రీవారి కృపాకటాక్షములు యితోధికముగా లభించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

శ్రీమాన్ తాడేపల్లి పతంజలిగారితో నా పరిచయకాలం రెండు దశాబ్దాలు. వారు నాకు గురుతుల్యులు. తెలుగులో ఏ జటిలపదబంధమో, సుదీర్ఘసమాసమో కొరుకుడు పడనివేళ వారే నాకు దిక్కు. ఎన్నో పర్యాయాలు సందేహనివృత్తి చేసి నా గ్రంథపఠనశీలతను సుగమం చేసిన మహానుభావుడు. సంస్కృతంపై, తెలుగుపై అందునా అన్నమయ్య పదకవితలపై భక్తిశ్రద్ధలు కలగలసివున్న ప్రతిభాశాలి. గతంలో నా అభ్యర్థనతో 'అన్నమయ్య అన్నమాట', 'అన్నమయ్య 'గీతోపదేశం', 'అన్నమయ్య పదం–పరమార్థం' వంటి అన్నమాచార్య సంకీర్తనల గ్రంథాలను తన విశ్లేషణాత్మక వ్యాఖ్యలతో వెలువరించిన కవిపండితులు శ్రీమాన్ పతంజలిగారు. వారు ఈ గ్రంథానికి పీఠిక వ్రాసిన చందం గుమ్మానికి బొట్టు పెట్టినంత అందంగా వుంది. చదువరులకు ఉత్సాహాన్ని ప్రచోదనం చేస్తున్నారు. వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

ఎన్నో ఒడిదుడుకులతో, ఎంతో కాలయాపనలతో, నా ప్రయత్నం ఫలించని కారణంగా కలిగిన నిస్పృహలను అధిగమించడానికి, కారకులు, ప్రేరకులు 'వేంకటగిరి రాజావారు' శ్రీమాన్ వి.బి.సాయికృష్ణ యాచేంద్రగారు. నాతో తరచూ ఈ గ్రంథప్రచురణ విషయమై చర్చిస్తూ, ప్రోత్సహిస్తూ నాలోని ఆశావాదానికి జీవం పోసినవారు. వారికి సర్వదా నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకం సర్వాంగసుందరంగా రూపొందించాలనే ఉద్దేశ్యంతో, తెలుగు భాషాప్రేమికుడు, రచయిత, విమర్శకుడు, ప్రచురణానుభవం కలిగిన సుమనస్కుడు, నా స్నేహితుడు మోదుగుల రవికృష్ణని (సమన్వయకర్త, పుస్తక ప్రచురణ విభాగం, వివిఐటి, నంబూరు) ఆ బాధ్యత తీసుకోమని సూచించగా – అందుకు భక్తితో సమ్మతించి, యీ పుస్తకాన్ని సుందరరూపం, సురుచి, సువాసనలతో అలంకరించి ముద్రణాలయానికి పంపారు. ఇందరి కృషితో ఈ పుస్తకం మీకు లభ్యమవుతోంది.

దీనికి జనబాహుళ్యంలో గుర్తింపు రావాలంటే ఒక సాధికారత ఉండాలన్న ఆలోచనతో తిరుమల తిరుపతి దేవస్థానం వారిని సంప్రదించి ప్రకాశకులుగా ఉండమని ప్రార్థించాం. వారి అంగీకారంతో ఈ పుస్తకం తిరుమల తిరుపతి దేవస్థానం సమర్పణంగా తెలుగువారికి లభ్యమవుతోంది. శాంతా వసంత ట్రస్ట్ పుస్తక ముద్రణ యోగ్యతాదశ వరకు చేసిన కృషికి అనుబంధంగా అవసరాన్ని బట్టి ఆర్థికంగానూ తోడ్పడటానికి సిద్ధంగా ఉంది. ఇది స్వామి సేవగానే భావించాము కాబట్టి పుస్తకంపై ఎలాంటి హక్కులు ట్రస్ట్‌కు ఉండనవసరం లేదు.

ఈ కృషిలో పాల్గొన్న అందరూ శ్రీ వేంకటేశుని కృపాకటాక్షవీక్షణాలకు నోచుకున్నవారే!

చివరగా,

ఈ సంకీర్తనలలోని విశిష్టలక్షణం – కేవలం భక్తి జ్ఞాన వైరాగ్య భావభరితంగా మాత్రమే కాకుండా అంతర్లీనంగా సామాజికస్పృహ ప్రసారమవుతూనే ఉంటుంది. సర్వమానవ సమానత్వం గురించిన సందేశం ప్రసరిస్తూ ఉంటుంది. జీవాత్మ పరమాత్మల పునఃసమాగమం వైపు నడిపించే ఆధ్యాత్మికతను పుష్కలంగా తన పదకవితలలో నిక్షిప్తం చేసారు అన్నమయ్య. ముక్తి, దాని వెన్నంటి వుండే విముక్తి, రక్తి, వెనువెంటనే వెంబడించే విరక్తి వంటి తత్వోపదేశాలను తన సాహితీపటిమతో హృదయాలకు హత్తుకునేట్లు పదకవితలుగా మనకు అందించారు. నిర్గుణము, నిరుపాధికమైన బ్రహ్మమును వేంకటేశ్వరపరబ్రహ్మంగా సంభావించి, తనను ప్రేయసిగా భావించుకొని పరబ్రహ్మ సాక్షాత్కారానికి తహతహలాడే మధురభక్తి సంప్రదాయంలో ఎన్నో సుమధుర పదకవితలు మనకు ఇచ్చారు. పరమాత్మ నుండి విడివడిన జీవాత్మ తిరిగి ఆ పరమాత్మలో ఐక్యమవ్వాలని తహతహలాడే తపన, యాతన, నివేదన, ఆవేదన, ఆర్తి భక్తిగా పరిణమించడమే మోక్షకాముకత్వమని తన సంకీర్తనలలో వివరించారు. ఈ తాత్వికతను ఆయువుపట్టుగా అన్నమయ్య తన పదకవితలను తీర్చిదిద్దారు.

అన్నమయ్య పదాలు వేదాలు...పౌరాణిక వాదాలు...పదకవిత్వవాణీవీణానాదాలు...

చదవండి, చదివించండి, తరించండి!

మోక్షమార్గాన్ని సులభతరం చేసుకోండి!!

ఓం నమో వేంకటేశాయ!!!

అముద్రితములైన "తాళ్లపాక సంకీర్తనలు" ఒక పరిశోధనాత్మక పరిశీలన

(మొదటి పీఠిక - 2005)❖

– వేటూరి ఆనందమూర్తి

సాహితీ పరిశోధకుడు

1.0. "తాళ్లపాక సంకీర్తనలు" అనే కాగితపు వ్రాతపుస్తకము తాళ్లపాకవారి యింటి వ్రాతప్రతి. శ్రీ తాళ్లపాక శేషాచార్యులుగారు 1941 సం.లో ఈ వ్రాతపుస్తకాన్ని తి.తి.దేవస్థానం లైబ్రరీకి అందజేశారు. ఈ ప్రతి గ్రంథసంఖ్య 6609A. పితృపాదులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఈ వ్రాతప్రతిని ప్రప్రథమంగా తమ అన్నమాచార్యచరిత్ర పీఠికలో (1949, పునర్ముద్రితము 2001) పేర్కొని కొన్ని పాటలను పరిష్కరించి (పుటలు 6, 13, 21, 23, 29,32, 61, 63,111, 112) ప్రకటించారు.

1.1. ఆ తర్వాత పూజ్యపాదులు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు సంకీర్తన సంపుటాల పీఠికల్లో (1955, 56) ఈ వ్రాతప్రతిని పేర్కొని పరిశీలించారు. శ్రీ వేటూరివారికన్నా (1949) పూర్వం ఈ వ్రాతప్రతిని పరిశీలించి పేర్కొన్న పరిశోధకుల జాడ కానరాదు. అలాగే శ్రీ రాళ్ళపల్లివారి (1955,56) తర్వాత ఈ వ్రాతప్రతినంతగా పట్టించుకొన్న పరిశోధకుల జాడా కానరాదు.

2.0. "తాళ్లపాక సంకీర్తనలు" వ్రాతప్రతి తిరుపతి చేరిన కాలానికి ఇంచుమించు సమకాలంలోనే శ్రీ తాళ్లపాక సూర్యనారాయణయ్యగారి మూలంగా, వారి యింటి తాళపత్ర ప్రతులనుండి యెత్తి వ్రాసిన, చిన్నన్న కృతమైన అన్నమాచార్యచరిత్ర ద్విపద కాగితపు వ్రాతప్రతి కూడా తిరుపతి లైబ్రరీకి చేరినది. దాని వివరాలివి – "ఈయన్నమాచార్య చరిత్ర కాగితపు వ్రాతపుస్తకమును కడపజిల్లా రాయచోటి తాలూకా మడితాడు గ్రామవాసి

❖ తొలుత ఈ పీఠిక అక్షర, డి.ఆర్.అభినందన సంపుటి, నవంబరు, 2005లో ప్రచురితంకాగా కొలది మార్పులతో పునర్ముద్రిస్తున్నాము. – వేటూరి ఆనందమూర్తి

శ్రీ తాళ్లపాక సూర్యనారాయణయ్యగారు తిరుపతి వేంకటేశ్వర ప్రాచ్య గ్రంథాలయమున కొసగిరి. ప్రాత తాటాకు ప్రతిననుసరించి వారు దానిని 1940 సం.లో వ్రాసిరట. దానితో రేవణూరి వేంకటాచార్యుని శ్రీపాదరేణు మాహాత్మ్యమును, తాళ్లపాక చిన్నన్న తామ్రశాసనమునుగూడ వారీ గ్రంథాలయమున కొసగిరి. తామ్రశాసనమును శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు ఇక్కడి జర్నల్ వాల్యూం 1, పార్టు 1లో ప్రకటించిరి. ఈయన్నమాచార్య చరిత్ర వ్రాతప్రతిలో గ్రంథము ముగిసిన తర్వాత 7 పుట 'శ్రీ తాళ్లపాక తిరువేంగళనాథుని జీవితచరిత్రము కార్వేటి నగర సంస్థానములో ఉన్నది. చూడవలెను' అని కలదు. అట్లది కార్వేటినగరమున గలదేమో" (చూ. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరించి ప్రకటించిన అన్నమాచార్యచరిత్ర పీఠిక పుట 1 (1) పాదసూచిక – 1949).

2.1. 1940లో తిరుపతి చేరిన శ్రీ అన్నమాచార్యచరిత్ర ద్విపద కావ్యవ్రాతప్రతి ఏడెనిమిదేళ్లు అట్లే పడివుండినది. స్వామి సంకల్పం నెరవేరే సమయమాసన్నంకాగా 1948లో పితృపాదులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు కావించిన కృషిఫలంగా అన్నమాచార్యచరిత్ర ద్విపదకృతి గొప్పపీఠికతో 1949లో ముద్రితమైంది. ఆ పీఠిక మూలంగానే శ్రీ అన్నమాచార్యులవారికీర్తి మూర్తిమంతమై నేడు ప్రకాశిస్తున్నది.

2.2. తాళ్లపాక తిరువేంగళనాథుని జీవితచరిత్రమునకై కార్వేటినగరం ప్రాంతాలలో ఇంకా అన్వేషించ వలసివుంది. ఈ తిరువేంగళనాథుడు సాత్త్వికశుభమూర్తిగాను సంగీతసత్కవిత్వాధికుడుగాను కీర్తింపబడిన పెదతిరువేంగళనాథుడే కాబోలును. ఆ పెదతిరువేంగళనాథుని తమ్ములైన తాళ్లపాక చిన్నన్నకూ చినతిరువేంగళ నాథుడనే పేరున్నది, అలాగే మరో తమ్మునికి కోనేటి తిరువేంగళనాథుడనే పేరున్నది. కనుక పైన పేర్కొనబడిన తిరువేంగళనాథుని జీవితచరితము పేరునుబట్టి, వారిలో ఎవరిని గూర్చినదో తెలియరాదు. మరి తాతగారి జీవితచరిత్రను, ఆమీద తన సోదరులలో మరొకరి చరిత్రను రచించిన చిన్నన్న పూజ్యుడైన తనతండ్రి పెదతిరుమలాచార్యులవారి జీవితచరితను రచింపకుండునా? అన్వేషించి పరిశీలించవలెను. శ్రీ రాళ్ళపల్లివారన్నట్లు పరిశోధనరసికుల కిందు చాలా పనివున్నది. ముందు ఆ తిరువేంగళనాథుని జీవితచరిత్ర లభించినగానీ ఇతర వివరాలు తెలియరావు.

3.0. తాళ్లపాకకవుల జీవితచరిత్రలకు సంబంధించిన వ్రాతప్రతుల విషయమిలావుండగా 'తాళ్లపాక సంకీర్తనలు'(6609A) అనే కాగితపు వ్రాతపుస్తకము అశ్రద్ధకు గురికావడము మరీ విచారకరముగా వున్నది. లభ్యముకాని తిరువేంగళనాథుని జీవితచరిత్రమును అన్వేషించి సంపాదించలేకపోతిమిగదా అన్న చింతకన్నా 1941 సం.లోనే తిరుపతి చేరిన 'తాళ్లపాక సంకీర్తనలు' లభించి అరవైనాలుగేళ్లు కావస్తున్నా, ఇంకా వెలువడక అజ్ఞాతంగానే వుండిపోయెనుగదా అన్నచింతే అధికంగా వున్నది.

4.0. ఈ 'తాళ్లపాక సంకీర్తనలు' వ్రాతప్రతిని పితృపాదులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు పరిశీలించి పేర్కొని ఉదాహరించినా ఆ గ్రంథాన్ని వారప్పుడు పూర్తిగా పరిష్కరించి ప్రకటించే ప్రయత్నం చేయలేదు. దానికి కారణం, వారప్పుడు వ్రాయకున్నా, జిజ్ఞాసువులు భావించవచ్చు. రాగిరేకులలోని పాటల పరిష్కరణ కార్యం అప్పుడప్పుడే ఆరంభమైంది గనుక ఆ వ్రాతప్రతిలోని పాటలు రేకులలోనూ వుండవచ్చునేమో వేచిచూద్దామనే భావనే కావచ్చును.

(వాస్తవానికి అందులోని కొన్నిపాటలు రేకులలోనూ వున్నవి). అనుకోకుండా, ప్రభాకరులు శ్రీవేంకటేశ్వర మ్యూజియం స్థాపన సందర్భంలో, అస్వస్థతకు గురై తిరుపతిలోనే 1950లో అస్తమించారు.

5.0. ప్రామాణికులైన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి తర్వాత 'సంగీత సాహిత్య పరిపుష్టు'లని వారిచేతనే కీర్తింపబడిన పూజ్యపాదులు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ఈ వ్రాతప్రతిని గురించి తాము పరిష్కరించిన సంకీర్తన సంపుటాల పీఠికల్లో (1955, 56) ఇలా వ్రాశారు. "తిరుపతివాసులైన శ్రీ తాళ్లపాక వేంకటశేషాచార్యుల యింటి వ్రాతప్రతి యొకటి వారి దయతో లభించినది.(SVO6609). ఇందు శృంగారాధ్యాత్మరచనలు 275 కలవు. కాని యిందును కర్తలపేర్లు తెలియవు. మరియు తరువాతి పదకవుల రచనలును ఇందు కలసినట్లున్నది. కొని పాదముల సవరణలకిదియు నుపకరించినది" (1955). వారే ఇంకా ఇలా పేర్కొన్నారు. – "11వ సంపుట మందువలె ఇందును సాధారణరేకులు (సా.రే.), నిడురేకులు (ని.రే.), పెద్దరేకులు (పె.రే.), తంజావూరి సరస్వతీభండారపు వ్రాతప్రతి (తం.ప్ర). శ్రీ తాళ్లపాక వేంకటశేషాచార్యుల వారింటి వ్రాతప్రతి (తా.వెం.)– అనునైదు మూలములను పోల్చి సరిచూచి పాఠములను నిశ్చయించితిని. పాఠభేదములు క్రింద సూచింపబడినవి" (సం.12 పీ.పు.iii, 4.10.1956).

5.1. ప్రామాణికులైన ఈ పెద్దలమాట "పరిశోధన రసికులకు" ఎంతో పని కల్పించినది. 'నిరుత్తరములుగా నిలిచిన ఎన్నో సందేహము'లకు సమాధానములందించే అన్వేషణకూ పురిగొల్పినది. వేటూరివారు పరిష్కరించిన 'కరముజీడిపులుసు గలిగిన మామిడి' (శేషాచార్యులవారి వ్రాతప్రతి) అనే పాట తాళ్లపాక పదకవులలో అజ్ఞాతుడుగా వుండిన నాలుగో పదకర్తను గూర్చిన తెలివిడికి దోహదం చేసింది. 'ఇందును కర్తలపేర్లు తెలియవు మరియు తరువాతి పదకవుల రచనలును ఇందు కలిసినట్లున్నది' అన్న రాళ్ళపల్లివారి అభిప్రాయము ఇందులోని ముద్రావిభేదాలను గూర్చిన శోధనకు; 'శ్రీకృష్ణ' పదాల కర్తృత్వానికి సంబంధించిన ఆలోచనకు ప్రేరణ కల్గించింది. (చూ.రసమయి ఆగస్టు 2005లో ఆరంభమైన 'శ్రీకృష్ణపదాలెవరివి?'అనే ధారావాహిక వ్యాసము).

6.0. లభ్యములైన రేకులలోని తాళ్లపాకవారి పదాలన్నీ పరిష్కృతాలై 35 ప్రాత సంపుటాలుగా ప్రకటింపబడడానికీ, అవే, 29 కొత్త సంపుటాలుగా పునర్ముద్రితాలు కావడానికీ ఒక అర్ధశతాబ్దికి పైగానే (1948–1999) పట్టింది. ఈ కార్యమంతా ముగిసి, ఇప్పటికి అయిదేళ్లు దాటినా అలనాటి (1941) 'తాళ్లపాక సంకీర్తనలు' వ్రాతప్రతిని పరిశీలించి ప్రకటించే యత్నం మాత్రం జరుగలేదు.

7.0. ఈ రచయిత గతంలో (1953–65 సం. మధ్య) కావించిన పరిశోధనా సందర్భంలో ఆ వ్రాతప్రతిని అప్పటికవసరమైన మేరకు పరిశీలించి తన సిద్ధాంతవ్యాసంలో, అందులోని వరదరాజస్వామివారి మీద పాటలొకటి రెండింటిని తాళ్లపాకవారివిగా పేర్కొని ఉదాహరించడం జరిగింది.

7.1. ఈశ్వర సంకల్పమెట్టిదోగానీ ఈ మధ్యనే – అనగా 5–6–2005 నాడు తాళ్లపాక సంకీర్తనలున్న ఆ వ్రాతపుస్తకం ప్రతి పరిష్కరణార్థమై యీ రచయిత చేతికి వచ్చింది. ఎన్నడో 24–02–1941లో తిరుపతి

లైబ్రరీకి చేరిన ఆ పుస్తకం వ్రాతప్రతి స్వామివారి ప్రేరణగా, ఎవరి నిమిత్తకారణంగానో, ఎవరి దోహదంచేతనో పరిష్కరణార్థమై ఈ రచయిత ననుగ్రహించడానికై వచ్చి చేరినట్లుగా తోచింది. పైతృకమైన నిధి లభించినంతగా సంతోషాన్ని కలిగించింది. స్వామివారి ఆదేశమో, తాళ్లపాక పదకవుల అనుగ్రహ విశేషమో కాని ఆ వ్రాతప్రతి నందుకొన్నదే తడవుగా ఏదో తెలియని ఆవేశంతో, ఆనందంతో ఒక నెల తిరిగేలోగానే గ్రంథపరిశీలనము, పరిష్కరణము, విశ్లేషణతో కూడిన పీఠికారచనము, సర్వమూ ఒక దీక్షగా సాగి ముగిసినవి. ఈ రచయితను పరిష్కరింపుడని కోరినవారి అవ్యాజమైన అభిమానాన్ని అర్థం చేసుకొనేలోగానే, అచ్చువేయదలచిన వారింకా ఆలోచించి నిర్ణయించుకొనేలోగానే, పరిష్కరణకార్యా న్నీవిధంగా సఫలం చేసిన స్వామి కృపావిశేషాని కీరచయిత వినమ్రాంజలి ఘటిస్తున్నాడు.

7.2. ఈ వ్రాతప్రతిని పరిష్కరింపజేసి ప్రకటింపజేయాలన్న విశుద్ధభావనతో స్వామిపాదాల కర్పించి, శ్రేయోభిలాషుల సూచనతో కాబోలును, పరిష్కరణార్థం ఆ వ్రాతప్రతి నీరచయిత చేతికందించి ఆ దిశగా నిమిత్తకారకుడైన వ్యక్తి శ్రీ గంధం బసవ శంకరరావుగారు, చదువులో బయోకెమిస్టు. వృత్తిచేత శాంతాబయోటెక్నిక్స్‌లో రీసెర్చి ఎసోసియేటు. తెలుగు తాను చదువుకొన్న విషయంకాకున్నా, ఆయనకు తాళ్లపాక పదకవుల సాహిత్యమంటే అభిమానం. 288 పుటలున్న ఆ వ్రాతప్రతిని, దానితోపాటు తాను గుర్తించగలిగినంతమేరకు, అందులోని పాటలెన్నో, పల్లవి ఆరంభములెట్టివో, పాట శృంగారకీర్తనమా, ఆధ్యాత్మమా, అచ్చుపడెనా లేదా అనే అంశాలుగల ఒక వివరణ పట్టికనూ చి॥ శంకరరావుగారు ఈ రచయితకిచ్చి, గ్రంథాన్ని పరిష్కరింపుడనీ, ఆదినుండీ తాళ్లపాక కవులమీద జరిగిన పరిశోధనకు సంబంధించిన సమగ్రమైన వివరణంగల పీఠికను వ్రాయుడనీ కోరెను. ఇదీ ఈ గ్రంథపరిష్కరణం వెనుకగల నిమిత్త కారణం. పైన చెప్పిన వివిధ భౌతికాంశాల గుర్తింపులో దొరలిన జారుపాట్లను తప్పించి, ఈ చిరంజీవి కూర్చిన పట్టిక తరువాతి విషయవిశ్లేషణలో ఈ రచయిత కుపకరించినది. ఇందుకు చి॥ శంకరరావుగారికి ఆ తిరుమలగిరిదేవుని దీవెన లందునుగాక!

7.3. ఇక దోహద విషయమా! ఒకరినొక రెరుగకున్నా అవ్యాజమైన అభిమానంతో ఈ గ్రంథ పరిష్కరణకార్యాని కంగీకరింపగోరుతూ తాము బెంగుళూరికి ఫోనుచేసి, మిత్రులచేత చేయించీ, కలిసీ, సహృదయాన్ని ప్రకటించిన శాంతా బయోటెక్నిక్స్ అధినేత 'పద్మభూషణ్' డా॥ వరప్రసాద్‌రెడ్డిగారి సౌజన్యమే దీనికి కీలకము. స్వామి సంకల్పము వీటికన్నిటికి మూలకము. శ్రీవేంకటేశ్వరస్వామివారి దివ్యమైన సృష్టికార్య రచనాప్రణాళికలో నిమిత్తమాత్రంగా ఇందరమూ పాలుపంచుకోవడమే ఈ తాళ్లపాక వాఙ్మయ పరిశోధనలోని రహస్యమన్నది ఈ రచయిత విశ్వాసము.

8.0. ఈ వ్రాతప్రతిలో వున్నవన్నీ తాళ్లపాకవారి పదకవితలే అనడానికి సందేహమవసరంలేదు. కారణం, "తాళ్లపాక సంకీర్తనలు" అని ఆ గ్రంథం పేరులోనే వున్నది. పైగా ఇది తాళ్లపాకకవుల యింటివ్రాతప్రతి, ప్రాతతాళపత్రాల నుండి రాగాల క్రమంలో కాబోలు యెత్తి వ్రాసి కూర్చుకొన్నది. ఇదీ ఈ వ్రాతప్రతిలో గుర్తింప దగిన మరో విశేషము. వెనుక రాగిరేకుల మీద కెక్కించినపుడు, వారి దృష్టి ప్రధానంగా, శ్రీ అన్నమాచార్య జీవిత

చర్యాక్రమం ఆధారంగా, ఆ పదకవిత్రయంవారి కర్తృత్వవిశ్లేషణచర్చ కనువుగొల్పే తీరుగానే సాగినట్లున్నది. అయినా కొన్నిచోట్ల ఒకరి రచనలు మరొకరివిగా చేరిపోయిన సందర్భాలూ లేకపోలేదు. అలాటి జారుపాట్లు అంతటి మహోద్యమంలో జరగడం సహజమే. వాటిని గుర్తించి సరిచేసుకోవడమే పరిశోధన రసికుల కర్తవ్యము కావలెను. రాగాల వరుసలో తమ సంకీర్తనలను కూర్చుకొనే యత్నంలో కాబోలును ఈ వ్రాతప్రతిలో ఆ పదకవుల రచనలు సహజంగానే కలగలిసివున్నాయి. అయినా, ఈ పాటల్లో మూడు ప్రధాన విభాగాలున్నవి.

1. శ్రీవెంకటముద్రగల సంకీర్తనలు;

2. శ్రీకృష్ణముద్ర మాత్రమేగల దైవపరములైన సంకీర్తనలు;

3. శ్రీకృష్ణచరితాన్ని ద్విపదమాలికగా శ్రీవేంకటేశ్వరార్పణంగా చెప్పిన (ప్రభాతస్తవము) మేలుకొల్పు పాట.

ఈ మూడు విభాగాలు తాళ్లపాకవారి రచనలే కావలెను.

8.1. వీటిలో మొదటి విభాగం రేకులకెక్కని వేంకటముద్రగల పెక్కు సంకీర్తనలు. ఇదీ కలగలుపుగా వున్నా క్రమంగా శ్రీ అన్నమాచార్యులవారివిగానూ, పెదతిరుమలాచార్యులవిగానూ, చినతిరుమలాచార్యులవిగానూ, ఇప్పుడు మనకు తెలిసిన వారివారి ముద్రావిభేదాలనుబట్టి వింగడించి చూపదగినవిగా వున్నవి. 'శ్రీవేంకటనాథ' ముద్రగలవి చినతిరుమలాచార్యులవనీ; 'శ్రీవేంకటేశ/అలమేల్మంగా సమేత శ్రీవేంకటేశ్వర' ముద్రగలవి పెద తిరుమలాచార్యులవనీ; ఈ ముద్రలన్నిటికీ మూలమనదగిన రీతిలో పరిపరి విధాలుగా సాగిన 'తిరువేంకటనాయక' మొదలైన అనేక ముద్రాంకాలతో కూడినవి శ్రీ అన్నమాచార్యులవారివనీ ఈనాడు మనకు స్పష్టమైనది. (చూ. "ది తిరుమల మ్యూజిక్ ఇన్‌స్క్రిప్షన్" పు. intro 13,14 అనుబంధాలు 2,10 తి.తి.దే. ప్రచురణ నవంబరు 1999). ఈ విభాగంలో వేంకటముద్రగల అచ్చుకాని కొత్తకీర్తన లించుమించు 150కి పైగానే వున్నవి. వీటినీ రచయిత పరిష్కరించెను. (గ్రంథపీఠికలో వాటి వివరణ చూడనగును.)

8.2. ఈ రచయిత దృష్టిలో ఇందులోని ప్రధానమైన రెండవ విభాగం 'శ్రీకృష్ణ' సంకీర్తనలు. ఈ విభాగాన్ని గూర్చి పరిశీలించిన జాడ గతంలో తాళ్లపాకవాఙ్మయ పరిశోధనారంగంలోగానీ, ఇతరత్రాగానీ వుండినట్లీ రచయిత దృష్టికి రాలేదు. ఇలాటి 'శ్రీకృష్ణముద్రగల పదాలిందులో ఇంచుమించు 15 వున్నవి. ఇలాటివే శ్రీకృష్ణపదాలు మరో 21 తంజావూరు లైబ్రరీ కాగితపు వ్రాతప్రతి "వేంకటేశపదములు/నానావిధములు" (డి.నెం. 465–బి.నెం. 11658– ఈ రచయిత 9–7–58లో కాపీ వ్రాయించి తెప్పించుకొన్నది) అనే సంకలనంలో వున్నవి. వీటిని ఈ రచయిత పరిష్కరించి ముద్రణకు సిద్ధపరచెను. ఈ శ్రీకృష్ణపదాలను గూర్చి, వీటి కర్తృత్వాన్నీ గూర్చి ఈ రచయిత గావించిన పరిశోధనాత్మక విశ్లేషణ 'రసమయి' ఆగస్టు 2005 సంచిక నుండీ ధారావాహికంగా ప్రచురితమయినది (పాఠకులు పరిశీలింప ప్రార్థితులు). పరిశీలనానంతరమివన్నీ కూడా తాళ్లపాకవారి రచనలే కాదగునన్న భావన బలపడుతున్నది. ఈ దిశగా శోధన ఇంకా సాగవలెను. వీటిని తాళ్లపాకవారి రచనలు కావేమో అనే సంశయదృష్టితో ప్రక్కన పెట్టడం గతంలో తిరుమలస్వామిసన్నిధిని లభించిన "ప్రథమోపలబ్ధ స్వరసహిత సంకీర్తన శిలాలేఖము–

ది తిరుమల మ్యూజిక్ ఇన్స్క్రిప్షన్” తాళ్లపాకవారిది కాదేమోనన్న భ్రమతో వెనక్కి నెట్టిన అపచారమే కాగలదు. అవి ఎవరి రచనలైనా దిగులు లేదు కాని, దేవుని పేరుతో వున్నవి కాబట్టి ముందు వాటిని పరిష్కరించి, ప్రకటించి, పరిశీలించడం మన కర్తవ్యం కావలెను.

8.3. ఇక ఇందులోని మూడవవిభాగం ప్రభాతస్తవము. పితృపాదులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు మద్రాసు రాజకీయ ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోని ప్రభాతస్తవ లిఖితప్రతి ఆధారంగా పరిష్కరించి 1945లో శ్రీవేంకటేశ్వర వచనాలతో చేర్చి ప్రకటించారు. ఈ రచయిత దీనిని తన సిద్ధాంతవ్యాసంలోనూ పరిశీలించెను. (చూ. తాళ్లపాక కవుల కృతులు – సం. 1 పుట 172, 1974) ఈ ప్రభాతస్తవము శ్రీవేంకటేశ్వర స్తుతిరత్నమాలలోనూ ముద్రితమైనది. (చూ. పు. 1–6).

9.0. శ్రీకృష్ణపదాలను గూర్చిన పరిశోధనాత్మక వ్యాసం 'రసమయి' సంచికల్లో ప్రకటితమవుతున్నది గనుక ప్రస్తుతానికీ వ్యాసంలో తొలి విభాగానికి చెందిన వేంకటముద్రగల తాళ్లపాకవారి సంకీర్తనల సంగ్రహ పరిచయముంటుంది. పరిష్కృత పాఠస్వరూపం తెలియడానికై మాదిరికి కొన్ని సంకీర్తనలు ❖శ్రీ అన్నమాచార్య, పెదతిరుమలాచార్య, చినతిరుమలాచార్యులవారివిగా విశ్లేషించి చూపి, తాళ్లపాకవారిలో నాలుగవ పదకర్తగానూ శ్రీకృష్ణపదాలకర్తగానూ (చూ. రసమయి – ఆగష్టు 2005) భావింపబడిన తాళ్లపాక చిన్నన్న(?) కృష్ణపదాలొకటి రెండు మచ్చుకు ప్రదర్శించి, వ్యాసాంతంలో (రాగాలక్రమంలో కూర్చినట్లున్న) ఈ వ్రాతప్రతిలోని పదాల పట్టికను కూడా ఈ రచయిత అందిస్తున్నాడు – అసంపూర్ణాలు, పునరుక్తాలు, వగైరాలన్నిటితో కూడుకొని ఈ వ్రాతప్రతిలో మొత్తం 289 పాటలు గుర్తింపబడినవి✻. ఈ వ్రాతప్రతిలో, ప్రాచీనాలు కావడంచేత కాబోలు ఎక్కువశాతం శిథిలప్రాయాలుగా కానవస్తున్నవి, శ్రీ అన్నమాచార్యులవారివిగా ముద్రనుబట్టి గుర్తింపబడుతున్న రచనలే. అసంపూర్ణములైనవీ, అధికభాగం శిథిలములైనవీ పూరించడం కుదరదు తగదు, గనుక, వాటిని యథోచితంగానే పేర్కొనడంకన్నా మించి చేయవలసింది లేదు. అట్టివాటి నలాగేవుంచి, సాధ్యమైన శిథిలపూరణలను బ్రాకెట్లలో సూచించి, గ్రంథాన్ని పరిష్కరించడం జరిగింది. ఈ ప్రయత్నం మరుగునపడిన అలనాటి తాళ్లపాక పదకవుల నూతన సాహిత్యాన్ని వెలుగులోకి తెస్తుందనీ, భావిపరిశోధనకు పథనిర్దేశం చేస్తుందనీ ఆశించవచ్చును.

❖ అక్షర (డి.ఆర్.అభినందన సంపుటి) వ్యాసంలో ప్రకటింపబడిన సంకీర్తనలు, పదాల పట్టిక ఈ సంపుటంలో అకారాది క్రమంలో ముద్రింపబడటం చేత వాటిని ఇక్కడ అనుబంధంగా చేర్చలేదు, అటులనే సంపుటంలో పేర్కొన్న సంకీర్తనలన్నీ తుది పరిష్కరణ పాఠాలుగా పాఠకులు భావించవలయును.

✻ సంకీర్తనల రాగతాళాలు, ముద్రాపదాలను తెలియజేస్తూ, విపులమైన పట్టికను పరిశోధకుల కొరకు పుస్తకం చివరలో అనుబంధంగా చేర్చుటాయెను.

తాళ్లపాక సంకీర్తనలు

(రెండవ పీఠిక - 2022)

- వేటూరి ఆనందమూర్తి
సాహితీ పరిశోధకుడు

పదిహేను పదహారు శతాబ్దులనాటి తాళ్లపాక వాగ్గేయకారులను గూర్చిన పరిశోధనలో అమూల్యములైన రెండు మౌలిక వ్రాతప్రతులు నేటి తాళ్లపాకవంశంవారి ఔదార్యం మూలంగా 20వ శతాబ్ది మధ్యలో తిరుపతి ప్రాచ్య పరిశోధన సంస్థకు చేరినవి. వానిలో మొదటిది ప్రఖ్యాత ద్విపదకవి తాళ్లపాక చిన్నన్న రచించిన “అన్నమాచార్య చరిత్రము.” తరతరాలుగా కాపాడుకొన్న తమ యింటి వ్రాతప్రతికి మాతృకయైన దాని నకలును[1] తిరుపతికి 1940లో చేర్చినవారు శ్రీ తాళ్లపాక సూర్యనారాయణయ్యగారు. దీనిని పరిష్కరించి విపులమైన పీఠికతో యస్.వీ.ఓ.ఆర్.ఐ. గ్రంథమాల 12వ కుసుమంగా (1949, పునర్ముద్రితం 2001) దేవస్థానం పక్షాన ప్రకటింపజేసినవారు తాళ్లపాక వాఙ్మయ పరిశోధనకు మూలపురుషులు, కారణజన్ములు నైన గురుదేవులు మా పితృపాదులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు.

రెండవ పుస్తకం మన కిప్పుడు ప్రసక్తమైన ‘తాళ్లపాక సంకీర్తనలు.’ దీని ప్రాచీన వ్రాతప్రతి నకలును 24.02.1941లో తిరుపతికి చేర్చినవారు శ్రీమాన్ తాళ్లపాక శేషాచార్యులుగారు.

వీరి స్మరణకొరకే ‘శేషాచార్యుల వ్రాతప్రతి’ అనే నామాంతరము కూడా దీనికి కలదు. ఈ సంకలనము వారు క్రొత్తగా కూర్చుకొన్నది కాదు. తమ యింటి ప్రాచీన వ్రాతప్రతికి వారు కూర్చుకొన్న నకలు మాత్రమే. అమూల్యమైన యీ ప్రాచీన గ్రంథనామమును బట్టియే “తాళ్లపాక సంకీర్తనలు”లోని సంకీర్తనాదు లన్నియు

---

1. అ.చ.పీ. పుట 1 మరియు Tirumala Music Inscription (TMI) అనుబంధము 2-పు.10).

అలనాటి తాళ్లపాకవారు అభిమానముతో చేర్చి సంకలనపరచుకొన్న తమ యింటి ప్రాచీన వ్రాతప్రతిలోనివే అగుటచేత ఇవి అన్నియు వారివే అగుటయు, వారివే యగునని పరిశోధక జిజ్ఞాసువులెల్లరునూ భావించుటయు, రెండును సంభావ్యములే! ఈ భావనలకు భిన్నములైన బలవత్తరములైన ఆధారముల అచూకీ యెక్కడైనా ఎదురైనపుడు అట్టివానిని గుర్తించి, హేతుబద్ధములైన సమాధానము లరయదగును. అంతేకానీ మన బుద్ధితో వానిని విసర్జించుటయో, అజ్ఞాతపరచుటయో తగదని మా భావము[2].

మీది రెండు గ్రంథాలూ తిరుపతి చేరడానికిని, వానిమీది చర్చకును, ముద్రణమునకునూ కారకులు ప్రేరకులు అయినవారు కూడా గురుదేవులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారే అని గుర్తించగలము[3]. తొలుత ఈ వ్రాతప్రతిని పరిశీలించి, అందుండి కొన్ని పాటలను ఉద్ధరించి పరిష్కరించి తమ అన్నమాచార్యచరిత్ర పీఠిక (1949)లో ప్రకటించినవారును శ్రీ ప్రభాకరశాస్త్రిగారే అను విషయమూ విజ్ఞు లెరిగినదే! పరిశోధనలో ఆ విషయమై తంటాలుపడుచున్న మేమందరమును వారి తరువాతివారమే.

ఆ వ్రాతప్రతి దేవస్థానంవారి సొత్తు గనుక దానిని వారే పరిష్కరించే బాధ్యత వహించి, యేదో ఒకనాడు తప్పక ప్రకటించగలరని లోకము భావించుచుండెను. రేకులలోని తాళ్లపాకవారి సాహిత్యమంతయూ అచ్చుపడి కూడ బహుకాలమైనది. కానీ 'తాళ్లపాక సంకీర్తనలు' గ్రంథము మాత్రము ఇంతవరకునూ ప్రకటితము కాలేదు. కారణ మనూహ్యము. నాకు తెలిసినంతలో రేకులలోని సాహిత్యమంతయు అచ్చుపడిన తరువాత ఈ విషయమును గూర్చిన జిజ్ఞాసతో ఆ వ్రాతప్రతిలోని సంకీర్తనములలో అచ్చుపడినవి ఏవి? కాని వేవి? అని గుర్తించే ప్రయత్నము సాధ్యమైనరీతిలో తొలుత కావించి, పట్టిక రూపమున నా కందించిన యువపరిశోధకుడు మాత్రము చిరంజీవి గంధం బసవశంకరరావుగారే అని తెలియవచ్చుచున్నది[4]. ఆతడు 'శాంతా వసంతా ట్రస్ట్' అధినేత, పద్మభూషణ బిరుదాంచితులు, మాన్యశ్రీ డాక్టర్ కోడూరు ఈశ్వరవరప్రసాద్ (మాన్యశ్రీ వరప్రసాద్)గారి పనుపుపై నన్ను చూడవచ్చిననాడు తాను ఆ వ్రాతప్రతి నకలును, దానికి తాను కూర్చిన పట్టికను నాచేతి కొసగి 'యిది మీరే పరిష్కరించవలె'నని కోరెను. అదే ఆతనితోడి నా ప్రథమ పరిచయము! అప్పుడు 'ఇది తిరుపతి దేవస్థానం విద్వాంసుల బాధ్యతేమో కదా?' అని నేనంటిని! మా నాయనగారు అన్నమాచార్యచరిత్ర పరిష్కరించే సందర్భంలో నేనూ ఆ వ్రాతప్రతిని గూర్చి యెఱుగుదును.

---

2. సందర్భవశమున ఈ పీఠికలో అట్టి అంశములు కానవచ్చినపుడు పాదసూచికలలో చర్చింపబడెను. ఉదా. పరిశోధనలో సౌకర్యం కొరకు ఇందు కూర్చిన అకారాది పట్టికలోని 'అంగనా మంగనాం' అనే మొదటిపాటే వీరిది కాదనీ, లీలాశుకులవారదనీ కదా యిన్నాళ్లూ భావించుచుంటిమి! అయినా వారు యీ గ్రంథమున దానిని తమ రచనగా పేర్కొనిరి గనుక, తొలగించక దాని నట్లే అకారాదిక్రమాన లిస్టులో చివరిదిగా పేర్కొని అందుకు సమర్థక మగు పాదసూచికను చేర్చితిమి).

3. చూ. అన్నమాచార్య చరిత్ర పీఠిక పుట 1. పాదసూచిక; మరియు పుట 99 మొదటి పేరా).

4. చూ.అక్షర డి.ఆర్. అభినందన సంచిక పుట 891 అంశాలు-7.0, 7.1, 7.2)

ఈశ్వర సంకల్పమెట్టిదో కానీ ఇంచుమించు ఇప్పటికి ఎనభై సంవత్సరాల క్రితం యస్.వీ.ఓ.ఆర్.ఐ.కి చేరిన యీ విశిష్టగ్రంథం వ్రాతప్రతి నకలును, మాన్యశ్రీ వరప్రసాద్‌గారి ప్రేరణతో చిరంజీవి గంధం బసవ శంకరరావుగారి ద్వారా, 2005 జూన్ 5వ తేదీనాడు పరిష్కరణార్థమై నా చేతికి రావడంపై నేను మొదట కొంత విస్మితుడ నైతిని. అప్పటి యీ ప్రాచీన వ్రాతప్రతికే కొత్తగా తామొక నకలు తీయించుకొని, స్వామి పాదాలపై నుంచి, ప్రార్థనాపూర్వకమైన క్రింది ప్రమాణము గావించిరట. (1) దీనిని సత్వరమే ప్రకటించవలెనని. (2) ప్రథమముద్రణాన్ని ఉచితంగా అన్నమయ్య భక్తులకు పంచిపెట్టవలెనని.

అట్టి గ్రంథము పరిష్కరణార్థమై నాచేతికి వచ్చుట నా యదృష్టమని భావించి తప్పక దైవకార్యము నెరవేరునుగాకని కోరితిని. ఇట్టి ధర్మకార్యమున నేనూ ప్రతిఫల మపేక్షింపక సహకరింతునుగాకని ఆనాడే బాస చేసికొంటిని. కొంత చర్చ జరిగిన పిమ్మట నేనూ దైవప్రేరణతో జరుగుతున్న పవిత్రకర్తవ్యంగానే దీనిని భావించి, దేవస్థానంవారి ఉత్తరువు లేకున్నా, మాన్యశ్రీ వరప్రసాద్‌గారి మాటమీది గౌరవంతో పరిష్కరించడానికి అంగీకరించాను. వారప్పుడు అమెరికా టూరు తొందరలో ఉండి తిరిగిరాగానే కలియగలమనిరట! ఆ వ్రాతప్రతిని గ్రహించి – నేనపుడు మా చిన్నకుమారుని వద్దకు దుబాయ్ వెళ్లియుంటిని! – హాయిగా, తీరికగా, ఏదో తెలియని ఒక అభినివేశంతో ఒకటి రెండు మాసములలోనే, అప్పటికి సాధ్యమైనరీతిని చదువుచూ ఆ వ్రాతప్రతి మీదనే, పరిష్కరణదిశగా కొంత మౌలికకృషి జరిపితిని.

ఎన్నడో మరపున పడిపోయిన విషయము గుర్తుకువచ్చిన దన్నంత సులువుగా మార్పులూ, చేర్పులూ, లుప్తపూరణలూ జరిగే అనుభూతి కలగడం నాకే కాక నా చుట్టూ గమనిస్తున్నవారికినీ తోచడం కూడా ప్రోత్సాహకరంగానే ఉండినది. మాదిరికి ఒందు రెండు ఉదాహరణలు. (చూడుడు XX పుటలోని పరిష్కృత వ్రాతప్రతి పాఠము, నా మార్పులూ చేర్పులూ).

ఆరంభములోనే నేను లెక్కించిన ప్రకారము పాట 7 మొదలుకొని 11 వరకు గుర్తింపబడిన సంకీర్తనములు (పాతలెక్కలో 6 నుండి 8వరకు) కలవు. పదవ పాటలో పల్లవి లోపించినది. అప్రయత్నముగ నా చేయి "పరమయోగిని శివా–ర్పణ బుద్ధి కాదిది / తరుణి తాపము వింత–తప మాయెగాని // అని పూరించుట నాకే కొంత వింతగా తోచినది!...అట్లే చరణము లందలి నిర్మాణ శైథిల్యమునూ పసికట్టి వ్రాతప్రతిలోనే జరిపిన మార్పులు చేర్పులు నా వెనుకగా ఉండి నడిపిస్తున్న యేదో శక్తి యన్న అనుభూతి నినుమడింప జేసినది! (చూడుడు XXI పుటలోని పరిష్కృత వ్రాతప్రతి పాఠము, నా మార్పులూ చేర్పులూ).

ఈ పట్టుననే మరికొంత వివరణ మావశ్యకమని తలతును! ఇది ఒక ప్రాచీన శిథిల వ్రాతప్రతికి నకలు కాబోలును. గ్రంథమంతటను శైథిల్య సూచన లున్నవి. పుట 5 నుండి పుట 11 వరకునుగల రచన లిందు కానరావు. ఈ శైథిల్యము మూల తాళపత్రప్రతిలోనే కలదో లేక నకలు వ్రాసినవారి మూలమున తరువాత కలిగెనో తెలియదు! ఈ శైథిల్యము లన్నీకూడా ఈ వ్రాతప్రతి ప్రాచీనతకే నిదర్శనములు.

రెండుమూడు నెలల తరువాత మేమందరమూ తిరిగి హైదరాబాదులో కలసికొన్నప్పుడు, కొన్ని కారణాంతరాలచేత నా జరిపిన కృషి ఆపుదలకు గురియైనమాట నిజమే! అందుకు చిరంజీవి శంకరరావు





అత్యుత్సాహముతో కూడిన వేగిరపాటు కారణము కాదగు ననుకొంటిని. కొంతకృషి జరిపించిన పిమ్మట విశిష్టమైన ఈ ఆకరగ్రంథాన్ని పరిష్కర్త భావించినట్లు పూర్తిగా ప్రకటించవలెనా లేక ముద్రాపకులు భావించినట్లుగా త్రుంపులు గావించి సంగ్రహంగా అవసరమున్నమేరకు మాత్రమే ప్రకటన ముగించవలెనా అనే చర్చ కొత్తగా తలెత్తుట, అభిప్రాయాలు కలవని కారణంచేత, అప్పటికి అంతటితో ఆ పని లిఖితపూర్వకంగానే నిలిచిపోయి వాయిదా పడినది. తరువాత ఒక పదేళ్లపాటు ఆ పరిష్కృత వ్రాతప్రతి నావద్దనే ఉండిపోయింది.

అప్పుడు ఆ గ్రంథ ప్రాముఖ్యాన్నీ, జరిగిన కృషినీ సమీక్షిస్తూ, అప్పటి నా యెఱుకతో రాసిన విశ్లేషణాత్మక వ్యాసం ఒకటి మాత్రం అక్షర డి. ఆర్. అభినందన సంపుటి (నవంబర్ 2005) లో ప్రకటితమైంది. తాళ్లపాక సాహిత్య పరిశోధనకు సంబంధించిన కొన్ని మౌలిక విషయాల చర్చగల నా సుదీర్ఘ వ్యాసం కలిగించిన ప్రేరణచే కాబోలు మిత్రులు డా. వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్రగారు, నా అనుమతి తీసుకునే, "తాళ్లపాక పదకవులు – ఒక పరిశీలన (డా. వేటూరి ఆనందమూర్తి వ్యాససంపుటి)" అనే శీర్షికతో 2016లో దానిని గ్రంథరూపాన కూడా వెలువరించారు. అదే ఇందునూ పునర్ముద్రితము. ఇది యీ గ్రంథానికి సంబంధించిన పరిశోధనలోని మలిదశయే! తొలిదశ గురుదేవులు V.P.S (1949 అ.చ.పీ.లో) గావించినదే.

అర్ధాంతరంగా అట్లు 2005లో వాయిదాపడి ఆగిపోయిన మునుపటి కృషికి దైవప్రేరణ తోడయినట్లుగా ఐదారేళ్ల క్రితం అక్టోబరు 2015 నాటి లేఖతో తిరిగి ఊపిరిపోశారు, ఇప్పటి మా యీ కృషికంతా ఆద్యప్రేరకులైన శాంతా వసంతా ట్రస్టు వ్యవస్థాపకులు మాన్యశ్రీ 'పద్మభూషణ' పురస్కృతులు కె.ఐ. వరప్రసాద్‌గారు. వారి యీ పూనికవల్ల మేలే జరిగింది అనుకొన్నాను!

గ్రంథ పరిష్కరణ ముద్రణాది విషయాలలో అనుకోని విధంగా ఆలస్యం జరిగినా, అంతా మనమంచికే అన్న చందాన మేలే కూర్చిందని ఇప్పుడు నేను భావిస్తున్నాను. ఎందుకంటే 2015–2017 మధ్య టాగోర్ నేషనల్ ఫెలోగా మధ్యయుగంనాటి తాళ్లపాకవారి సంగీత వాఙ్మయరంగ పరిశోధన విషయమై నేను పరిశ్రమిస్తున్నపుడు తాళ్లపాక పదకవుల సంగీత వాఙ్మయమూల్యానికి విలువను పెంచే మరికొంత అధిక రచనా సామగ్రి తంజావూరులో నాకు లభ్యమైంది. అందులో ముఖ్యంగా శ్రీ శేషాచార్యుల వ్రాతప్రతి (6609)కి మరింత ప్రామాణికత్వాన్ని కూర్చే సంగ్రహ సమాంతర తాళపత్ర లేఖనాలనదగిన రచనలు మరికొన్ని తంజావూరు సరస్వతీ మహలు లైబ్రరీలో కొత్తగా వెలుగు చూచినవి. వానినిగూర్చిన యెఱుక నాకీ గ్రంథపరిష్కరణ విషయంలో మరికొన్ని మెరుగులు దిద్దుకోవటాని కెంతగానో తోడుపడినది.

కృతజ్ఞతాపూర్వక సంస్మరణము

తాళ్లపాక పదకవుల పరిశోధనవిషయమై గురుదేవులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పేరును స్మరించినట్లే, నేటితరం తాళ్లపాక కవికుటుంబంలో పేరెన్నికగన్న ప్రముఖులిద్దరి పేర్లనూ మనము ప్రత్యేకముగా ఇక్కడ స్మరించి తీరవలెను. అందులో ఒకరు శ్రీమాన్ తాళ్లపాక శేషాచార్యులవారు (1897 – 02.11.1972). వీరే "తాళ్లపాక సంకీర్తనలు" వ్రాతప్రతిని 1941 ఆరంభంలో తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయానికి చేర్చినవారు.

రెండవవారు తాళ్లపాక చిన్నన్న కృతమైన "అన్నమాచార్యచరిత్ర ద్విపద" కావ్య వ్రాతప్రతిని తిరుపతి ప్రాచ్యపరిశోధనాలయానికి చేర్చిన మహోపకారి శ్రీ తాళ్లపాక సూర్యనారాయణయ్యగారు (1875–1970). వీరిద్దరినీ స్వామికృపతో, గురుదేవులు తమకడకు రప్పించుకొని, వారి కడనున్న యీ అమూల్యనిధులను తిరుపతి దేవస్థానములవారికి సమర్పించుకొనే ప్రేరణ కలిగించిరి. ఈ పట్టున యిద్దరు ముగ్గురు ప్రముఖ పరిశోధకులనూ మనం స్మరించుకొనుట ఆవశ్యకమగును. వారిలో సర్వప్రథములు కవిచూడామణిగాను, విమర్శకాగ్రేసరులుగాను ప్రసిద్ధులైన గురుదేవులు శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు (1888–1950). వీరే ఇరవయ్యో శతాబ్ది ఆరంభమున, ఆధునిక సాహిత్యచరిత్రలో అన్నమాచార్యుల పేరును ప్రసిద్ధికి తెచ్చినవారు.

రెండవవారు శ్రీమాన్ మానవల్లి రామకృష్ణకవిగారు. ఎం.ఏ. (ఎం.ఆర్.కవిగా ప్రసిద్ధులు 1866–1957). వీరిద్దరూ 1939–40లలో స్థాపితమైన శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయ పరిశోధకవిద్వాంసులై, ప్రత్యేకించి నాట్యశాస్త్రానికీ, తాళ్లపాక పదకవులనుగూర్చీ కావించిన సేవ పరిశోధన రంగంలోనే అత్యంతమూ విశిష్టమైనది[5].

ఇక మూడవవారు 'సంగీతసాహిత్యపరిపుష్టు'లని శాస్త్రిగారిచే కొనియాడబడిన శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు (1893–1979). ప్రభాకరశాస్త్రిగారి నిర్యాణానంతరము, వారి సూచనమేరకు, అప్పటి దేవస్థానము ప్రధానాధికారియైన శ్రీ చెలికాని అన్నారావుగారిచే తాళ్లపాకవారి తదుపరి కార్యక్రమనిర్వాహమునకై ప్రత్యేకముగా ఆహ్వానింపబడినవారు.

ఇప్పుడిక శ్రీ శేషాచార్యుల వ్రాతప్రతిని గూర్చి ముఖ్యముగా చెప్పుకొనవలసిన విషయము: ఇది మూడువిభాగములుగా ఉన్నది.

1. తిరుపతి తాళ్లపాక రేకులలో కానరాని, అచ్చుకాని సంకీర్తనములు శ్రీవేంకటేశ్వర శ్రీకృష్ణ ముద్రాంకితములు కొన్ని.

2. రేకులలో ఉండి అచ్చుపడిన సంకీర్తనములు కొన్ని.

3. 'శ్రీ వేంకటేశ్వరప్రభాత స్తవము' అను పేరునగల పెదతిరుమలాచార్యులవారి ద్విపదకృతి.

ఈ కృతినే దేవస్థానము ముద్రణముగా గురుదేవులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరించి 1945లో ప్రకటించిన 'శ్రీ వేంకటేశ్వర వచనములు' అను గ్రంథమున కనుబంధముగా మదరాసుప్రతి ఆధారముగా ప్రకటించియుండిరి. తదుపరి ఈ గ్రంథములోని అధిక ద్విపదలనుకూడా వారే గుర్తించి అచ్చుప్రతిలో స్వహస్తలిఖితరూపమున చేర్చుకొనియుండిరి. ఇట్లు ముత్తెఱగుల నున్న యీ 'తాళ్లపాక సంకీర్తనములు' వ్రాతప్రతిని అదే క్రమమును పాటించి యిందు ప్రకటించుచున్నాము.

---

5. చూ. అన్నమాచార్యచరిత్ర పీఠిక (1949–పుట1. మరియు అనుబంధము–3, శ్రీ ఏ. వి. శ్రీనివాసాచార్యులుగారి విశిష్ట ప్రసంగము, 'తిరుమల సంగీత శాసనము' (తి.తి.దే ప్రచురణ 1999).

ఆకర గ్రంథాలైన సంకీర్తన తాళపత్రాల, సంగీతశాసనాల వైశిష్ట్యము, శోధన

ఈ సందర్భంలోనే తాళ్లపాక పదకవులమీది సక్రమ పరిశోధన దిశగా దేవస్థానమున 1949–1999 మధ్య శ్రీ ప్రభాకరశాస్త్రిగారి విశిష్టకృషితో ఆరంభమై, వారి నిర్యాణానంతరము కొనసాగిన కృషి వైశిష్ట్యము పేర్కొనదగినది.

1. 20వ శతాబ్ది ప్రారంభములో అన్నమాచార్యులవారి పేరు, వారి సాహిత్యము తొలిసారిగా ఆంధ్రసాహిత్యచరిత్ర పుటలకెక్కినవి గురుదేవుల మూలముననే.

2. అంతకు పూర్వము, అనగా 'ప్రబంధరత్నావళి'(1918)కి పూర్వము ఆధునిక సాహిత్యపరిశోధకులకు అన్నమాచార్యులపేరుతోకానీ, వారి సాహిత్యముతోకానీ పరిచయము లేదు. వారి చరిత్రను గూర్చియు, సంకీర్తన మాహాత్మ్యమును గూర్చియు అసలే తెలియదు.

3. అన్నమాచార్యచరిత్ర ప్రకటనము – శాస్త్రిగారి పీఠికా రచనము (1949 లో) జరిగిన తరువాతనే ఆ దిశగా పరిశోధన కొనసాగుటకు అవకాశము కలిగినది.

4. మరొక విశేషము, 1949లో గురుదేవులు శ్రీ శాస్త్రిగా రుండగానే "తిరుమల సంగీత శాసనము" ఉపలబ్ధ మాయెను – తాళ్లపాకవారి స్వరసహిత సాహిత్యమునుగూర్చిన పరిశోధన కదియే నాంది. అది 1949లో లభించినా శ్రీ శాస్త్రిగారి నిర్యాణము(1950) కారణముగా దాని పఠనము, పరిష్కరణము, ప్రకటనము కొనసాగి నెరవేరుటకు దాదాపు నాలుగైదు దశాబ్దులకాలమునకు పైగానే పట్టినది (1949 –1999). పట్టువిడువని నా ప్రయత్నముమూలమున పలురంగాలలో ఆరితేరిన నిపుణులతో కూడిన ఒక సంయుక్త సంపాదకమండలివారి సమష్టికృషి ఫలించి యెట్టకేలకు 1994 నాటికి దైవకృపచే మా కృషి ఫలప్రదమైనది. దేవస్థానమువారి, వేటూరి ప్రభాకరశాస్త్రి స్మారకట్రస్టువారి సంయుక్త ఆధ్వర్యవమున మా యీ కృషి 1999 నాటికి గ్రంథరూపమున వెలువడినది.

5. అన్నమాచార్యోత్సవముల ప్రారంభము – తద్వికాసము. దేవస్థానమువారి పూనికతో, గురుదేవులు ప్రభాకరుల ఉపజ్ఞతో 1949 లో తొలిసారిగా ఆరంభమైన శ్రీ అన్నమాచార్య సంగీతోత్సవములు, నాటి మేటి సంగీత సాహిత్యవిదుల భాగస్వామ్యంతో, ఆలిండియా రేడియోవారి తోడ్పాటుతో, వైభవోపేతంగా సాగినవి. (అప్పటి ఆహ్వానపత్రములు, పాల్గొన్నవారి పేర్లూ, నివేదికలూ వగైరాలను నేను భద్రపరచుకొంటిని. వాని యెఱుక చాలనివారికిని, అట్టి విశేషములను కోరినవారికి పంచితిని).

6. శ్రీ వేంకటేశ్వర మ్యూజియము స్థాపనము – తాళ్లపాక వాగ్గేయకారుల విగ్రహముల శిల్పాకృతుల గుర్తింపు, సేకరణము సాగెను. అప్పుడే సంకీర్తనభండారము గోడలమీది రెండు వాగ్గేయకార శిల్పాకృతులనూ, భండారమునుండి రెండు ఉబ్బెత్తు చిత్రములుగల రాగిరేకులను కొత్తగా గుర్తించుటాయెను. వాని గుర్తింపునకు గురుదేవులునూ, వారి శిష్యులైన శ్రీనివాసాచార్యులవారునూ, తిరుపతి పురప్రముఖులగు కొచ్చి వెంకటేశ్వరరావు గారునూ ప్రధానకారకులు. బహుశా ఇప్పటికి గుర్తింపబడిన తెలుగు వాగ్గేయకారుల శిల్పాకృతులలో తాళ్లపాకవారివే ప్రథమోదాహరణము లనదగును.

7. తాళ్లపాక సంకీర్తనల సక్రమ శోధనము, ప్రకటనము – తద్వికాసము; 1978లో స్థాపితమైన అన్నమాచార్య ప్రాజెక్టువారి కొనసాగింపు కార్యక్రమమున – ఇంచుమించు 1900 నుండీ ఒక శతాబ్ది పాటుగా సాగిన యీ కృషిలో లభ్యము లైనంతవరకును తాళ్లపాక పదకవుల సాహిత్యపార్శ్వము మూర్తిమంతమై వెల్లడియైనది.

8. శనివారము 28 నవంబరు, 1998 ఆంధ్రప్రభ దినపత్రిక ప్రకటించినట్లు నా పరిశీలనమున తాళ్లపాక పెదతిరుమలాచార్యులువారి రెండు ఝొంబడప్రబంధములు స్వరసాహిత్యములతో, ముద్రాంకితములతో లభించుట.

9. తదాది 21వ శతాబ్దిలో టాగోర్ నేషనల్ ఫెలోగా(2015 –2017 మధ్య సాగిన) నా పరిశోధనమున తాళ్లపాకవారి సంగీత ప్రజ్ఞావిశేషములు మరింతగా వెల్లడియైనవి. చూ.– ఆ విషయమై సాగిన నా రెండవ పరిశోధన థీసీసు వ్యాస సమర్పణము నా అనారోగ్యము కారణముగా కొంత ఆలస్యమై – ఫిబ్రవరి 2019లో సమర్పితమైనది. మరియు దానిపై ప్రముఖ సంగీతవిద్యా కోవిదులు, బెంగళూరు వాస్తవ్యులు, NAAC డైరెక్టరు డాక్టర్ యస్.సి. శర్మగారు నా కోరికపై స్పందించి విశ్లేషణాత్మకమైన తమ అభిప్రాయమును వెల్లడించిరి. ఇవి కొన్ని అప్పుడప్పుడు ఫేస్‌బుక్‌లో ప్రచురితములు.

'తాళ్లపాక సంకీర్తనలు' వ్రాతప్రతి ప్రాశస్త్యము–పరిష్కరణము–గుర్తింపబడిన విశేషముల పునస్సమీక్ష:

1. గ్రంథ శీర్షికనుబట్టియే శేషాచార్యుల వ్రాతప్రతిలోని సంకీర్తనములన్నియు తాళ్లపాకవారివని భావించదగును. సందేహ మున్నచోట పాదసూచిక లుంచుటాయెను.

2. శేషాచార్యుల వ్రాతప్రతిలో అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు 275 కలవని శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు తాళ్లపాక పదసాహిత్యం, అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం 4 పీఠిక(1955 సం.) లో తెలియజేశారు, కానీ నాకందిన శేషాచార్యుల వ్రాతప్రతిలో మొత్తము సంకీర్తనలు 278 అని గుర్తింపబడి యున్నవి. ఆ సంఖ్యను చి. శంకరరావుగారే గుర్తించి, తాను రూపొందించిన పట్టిక ద్వారా నాకు అందించినట్లు తెల్పిరి. నా పరిశీలనమున అవి 288 కాదగునని గుర్తించుటైనది. ఆ సంఖ్యనే డి.ఆర్.అభినందన సంపుటిలోని పట్టికలోనూ ముద్రించితిని. ఆ సంఖ్య నేటి పరిశీలనమున మరి యొకటి రెండు పెరుగగా వాటినీ తగు విధముగా చేర్చితిని.

3. ఈ వ్రాతప్రతి ఆరంభములోనే పుటలు 6 నుండి 10 వరకును గలపత్రములు లుప్తములు. నడుమ నడుమ పల్లవులు, చరణములు కలగలుపులైన పట్టులును కలవు. అట్టివానిని గుర్తించుటైనది.

4. ఈ ప్రతిలో ప్రధానముగా మూడు విభాగములు గుర్తింపబడినవి.

1. లభ్యములైన రేకులలో కానవచ్చి ముద్రితములైన పాటలు.
2. రేకులలో కానరాని కొత్త పాటలు.
3. పెదతిరుమలాచార్యులువారి మేలుకొలుపు ద్విపదులు.

ఇందు కొన్ని మదరాసు ప్రతిలో కానరాని కొత్త ద్విపదులను శ్రీ శాస్త్రిగారే గుర్తించియుండిరి. వ్రాతప్రతిలోనూ ఎడనెడ శాస్త్రిగారి దస్తూరీ కాననాయెను.

5. వీలైన చోట్ల లుప్తభాగములను బ్రాకెట్లలో సూచించి పూరించుటాయెను. వీలుకాని చోట్ల చుక్కలతో సూచించి విడిచితిని. ఈ ప్రతిని ప్రకటించుటలోప్రధాన లక్ష్యము కీర్తనములను ముద్రించుటయే కావున అన్నిటికినీ సంపూర్ణ వ్యాఖ్యలు జత చేయలేదు. అవసరమని తోచినమేరకు మాత్రమే వివరించుటాయెను.

6. అర్థముకాని తావుల ప్రశ్నార్థక చిహ్నములతో విడచి పుచ్చితిని. నవనాథ సిద్ధులనుగూర్చిన మూడు పాటలు అట్టివే. మిత్రులు డా. పతంజలిగారు సూచించిన పరిష్కృత పాఠమును జతచేయుటాయెను.

7. ఈ సందర్భముననే మరొక్క విషయమును పేర్కొనుట ఆవశ్యకము. మేము కోరిన ప్రకారము ఈశ్వరానుగ్రహపాత్రులు, విద్వాంసులు నైన డాక్టరు తాడేపల్లి పతంజలిగారు ఈ గ్రంథమునకు ముందుమాట నందించుటకు అంగీకరించిరి. అందు వారు ఈ వ్రాతప్రతి వైశిష్ట్యమును, తాళ్లపాకవారి కవితావైభవమును, పరిష్కరణ విధానమును, గ్రంథప్రకటనౌచిత్యమును కొనియాడిరి. అందుకు వారికి మా ప్రత్యేక ధన్యవాదములు.

8. ఈ వ్రాతప్రతిలో కొన్ని పాటలు క్షేత్రయ్యపదములకు మార్గము చూపునట్టివిగా ఉన్నవి. మువ్వగోపాలముద్ర ఉంటే వానిని క్షేత్రయ్య పదాలని భ్రమించే అవకాశమున్న రచన లవి. మువ్వగోపాల ముద్రలేని ఆ సంకీర్తనము లిందున్నవి గనుక వానినట్లే ఉంచితిమి.

9. సంగీత సాధనలో గీతరచనల వంటి ప్రయోగ ప్రయోజనముగల కొన్ని సంకీర్తన రచనలిందున్నవి.

10. నేడు యువకవుల కవితా రచనల ప్రోత్సాహమునకై మైసూరులో ఏర్పడిన 'ధ్వన్యాలోక' శిబిరమునకు పూర్వరూప మనదగినటువంటి ప్రయోగశాలను పెదతిరుమలయ్య నాల్గయిదువందల యేండ్లకు పూర్వమే తమ సంకీర్తన భండారమున పదరచనల విషయమై నిర్వహించెనేమో అనుకోదగినట్టి ఆస్కారమున్న సంకీర్తనరచనల తునుకలునూ ఇందున్నవి. లభించిన పాఠాంతరములనుబట్టి ఇట్లు భావించుటాయెను.

11. నేటి లింగ్విస్టిక్స్ అధ్యయనంలోని డిస్కోర్స్ అనాలిసిస్ కి సంబంధించిన 'స్కెమేటా'కు తుల్యమైన తాళ్లపాకవారి 'భావకోశము'ను గుర్తింపదగిన సంకీర్తన రచనలునూ ఇందున్నవి. నా దృష్టిలో తాళ్లపాకవారి సంకీర్తనములన్నియు ఇట్టి భావసంవాదములకు (Discourse Analysis) పరమోదాహరణము లనదగినవే. గ్రంథ విస్తరభీతిచే ఈ సరిక్రొత్త భాషాశాస్త్ర విషయమును విస్తరించక సూచించి విడిచితిని.

12. మరీ ముఖ్యముగా మా యీ కృషి కంతటికీ వెనుబలమై నిలిచి, ముద్రణమునకు పూనుకొని, తమ మున్నుడి నందించిన శ్రీయుతులు డా॥ కె.ఐ. వరప్రసాద్‌రెడ్డిగారికి కృతజ్ఞులము.

13. గ్రంథప్రకటన సందర్భమున ఎంతో శ్రద్ధతో నాకు తోడుగా నిలిచిన చిరంజీవి గంధం బసవ శంకరరావుగారిని హృదయపూర్వకంగా అభినందించి ఆశీర్వదిస్తున్నాను.

14. "తాళ్లపాక సంకీర్తనలు" వ్రాతప్రతిపై మా యీ కృషిని ఆమోదించి, శ్రీ తాళ్లపాక పదసాహిత్యము ప్రత్యేక సంపుటముగా సాధికారతను సమకూర్చిన తిరుమల తిరుపతి దేవస్థానంవారిని, శ్రీకార్యనిర్వహణాధికారులైన శ్రీ కె.ఎస్. జవహర్‌రెడ్డిగారిని కృతజ్ఞతలతో అభినందిస్తున్నాను.

ముగించేముందు ప్రసిద్ధమైన ఒక చాటువు, మరికొన్ని నా పద్యములు.

అష్టదిగ్గజాలలో మేటికవియైన రామకృష్ణుని చాటు విది ప్రసిద్ధము –

"చిన్నన్న ద్విపద కెఱగును
పన్నుగ పెదతిరుమలయ్య పదమున కెఱగున్
మిన్నంది మొరసె నరసిం
గన్న కవిత్వంబు పద్య గద్య శ్రేణిన్"

శ్రీ అన్నమాచార్యుల వారసులైన పై ముప్పురు వాగ్గేయకారులను స్మరించుటలోనే రామకృష్ణకవి తాళ్లపాకవారి మూలపురుషుడైన అన్నమాచార్యులవారినీ ఆరాధించినట్లాయెనని భావించెను కాబోలును! కాక వారిపై వేరొక చాటువు మనము గుర్తింపనిది కలదో?!

ఎందుకంటే పదకవితాపితామహుడై ప్రసిద్ధికెక్కిన అన్నమాచార్యులవారే తాళ్లపాక కవివంశం వారికందరికీ మూలపురుషు లైనవారుకదా!

ఒకనాడు ఆసేతుశీతాచలమూ ప్రఖ్యాతి వహించి తరువాత బహుకాలము మరుగునపడిపోయిన అట్టి అన్నమాచార్యులవారి పేరును, వారి రచనలను, అన్నమాచార్యచరిత్రను నూతనంగా గుర్తించి, 20వ (గత) శతాబ్ది ఆరంభంలో మన ఆంధ్రసాహిత్య చరిత్రరచనకు పరిచయం చేసినఖ్యాతి గురుదేవులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిదే.

అట్లే దేవస్థానమువారి పూనికతో మూడు సంపుటాలు ముద్రితములయీ, పిదప కారణాంతరాలచేత మధ్యలోనే (1920 – 30 దశకాల్లో) అర్ధాంతరంగా ఆగిపోయిన తరువాత అన్నమాచార్యులవారి పదకవితా రచనలను ఒక క్రమపద్ధతిలో తిరిగి రేకులనుండి ఎత్తి వ్రాయించి, పరిష్కరించి, దేవస్థానమువారిచేత ముద్రింపించిన ఘనత కూడా ప్రభాకరశాస్త్రులవారిదే. ఆ కార్యమును అదే ఒరవడిని కొనసాగించిన వారిలో అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారును, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారును, గౌరిపెద్ది రామసుబ్బశర్మగారును, డా॥ పి.టి. జగన్నాథరావుగారును ప్రముఖులని చెప్పనగును. రేకులలోని సంకీర్తన లన్నింటినీ 1978లో నెలకొల్పబడిన అన్నమాచార్య ప్రాజెక్టు పక్షాన 29 కొత్త సంపుటములుగా పునర్ముద్రించి ఆ ప్రచురణ కార్యక్రమానికి తుదిరూపు దిద్ది మంగళము పాడిన పరిశోధక విద్వాంసులు శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుగారికిని, డాక్టరు మేడసాని మోహన్‌గారికిని హృదయపూర్వకముగా అభినందనలర్పిస్తున్నాము.

ఇట్లా రేకులలోని తాళ్లపాకవారి సాహిత్యమంతా అచ్చుకావడానికి ఇంచుమించు ఒక శతాబ్దికాలం పైగానే పట్టింది (20వ శతాబ్ది).

"చిన్నన్న ద్విపద కూర్చెను,
పన్నుగ సూరయ్య దాని భద్రత గోరెన్,
మున్నిదె దేవస్థానము,
అన్నయ చారిత్ర మవనియంతట నిలిచెన్.

తాళ్లపాక వారి తర్వాత అన్నయ్య
పేరు పేరుకొన్న వారి జాడె
కానరాదటన్న కలికాల మహిమెగా
వాణి వెలసె నంట వారి యింట!

పెద్దనాదు లెంచి పేరైన జెప్పిరే?
ఆంధ్రభోజు డెంత యలిగినాడొ!
అన్నమార్య పత్ని నరయని లోకమ్ము
సింగనార్య సతిని జెప్పు నేమి?

ఆదిన్ వేంగమ పేర్కొనెన్, బిదప నాంగ్లాన్వేషణల్ సాగె, నా
మీదన్ వేటూరి ప్రజ్ఞ అన్నమున కున్మేషంబు గల్గించె, స
మ్మోదంబున్ బచరించి తచ్చరిత కామోదంబు జేకూర్చె నౌ,
లేదే నెక్కడి యన్నముం డనెడి యుల్లేఖోక్తి యెట్లేర్పడున్?

సారమతుల్ సుధీంద్రులు ప్రసన్న సుధా మధురోక్తు లాత్మలం
దారసి మేలుపాడ, నొరు లద్భుత గేయ నిబద్ధ భావ సం
చారుల నోలలాడ సరసాంబుధి నీదెడు జ్ఞాన భక్తి శృం
గార విహారి నన్నముని కావ్యవినోదుని భక్తి గొల్చెదన్.

చందమామలు, లాలి, జాలి పాట లవెన్నొ
అన్నయ్య పాడెనం చరసినాము
తొలిగేయ కవయిత్రి తెలుగులో గూర్చిన
మదువె పాటకు మేను మరచినాము
అలమేలు మంగ నాచ్యారమ్మ జలకేళి
గూర్చి కట్టిన పాట నేర్చినాము

సస్వర జోమ్బుడాల్ చవులూర పెద తిమ్మ
        దేశికుల్ పాడ గుర్తించినాము

నుతులు గొన్నట్టి భజన పద్ధతికి మూల
నిధిగ నిల్చిన చిన్నయ్య నెరిగినాము
ముక్తిపథమున శృంగారభక్తి గృష్ణ
పదముబట్టిన చిన్నన న్వలచినాము.

అష్ట దిగ్గజకవు లాంధ్రభోజుడు మెచ్చ
        దెనుఁగు ప్రబంధమ్ము దీర్చి దిద్ది,
రఖిలాంధ్రమును మెచ్చ నన్నయార్యులు తెల్గు
        భాషలోన నిబంధ పదము దీర్చి,
రనయమ్ము మార్గ పద్యమె రాజ సభ కెక్కి
        జగతి కించుక దూర మగుచు జనగ,
ననియత పద మదే యనవద్యమై సాగి
        సకలాంధ్ర హృదయ రంజన మొనర్ప,

నరపర మ్మగుకైత కాదరము తగ్గె
దైవ పరమగు రచన కాదరువు హెచ్చె
రాయ బయకార కీర్తులు రాణ కెక్కె
దేవ బయకార దీప్తులు దిశల బ్రాకె.

రాజులు సభ లొక వైపై
పూజితమౌ భక్తలోక పుణ్యం బొకవై
పై జన హృదయము నూపగ
రాజితమౌ భక్తి రస భరంబై పరగెన్.

సంకీర్తనాచార్య శాసన పరిరక్ష
        శోధనాదుల కెల్ల 'సాధు' రక్ష!
స్వర కీర్తనాచార్య చిరకీర్త్యభిజ్ఞతా
        ప్రాప్తికి 'వేటూరి' ప్రాణభిక్ష!

వరకీర్తనాచార్యు స్వరమాధురీ రసా
స్వాదనాస్థకు 'రాళ్లపల్లి' శిక్ష!
హరికీర్తనాచార్యు నమర సాహిత్యాభి
వృద్ధిసిద్ధికి 'గౌరిపెద్ది' దీక్ష!

అంద రందరె ధర్మదీక్షైకపరులు
గురులు, సిద్ధులు, బుధులు, సద్గుణవిశిష్టు
లన్నయార్యుని శేషకార్యంబు దీర్ప
నవతరించిన పరమపుణ్యాత్ము లయ్య!

స్వామి కంకితమ్ము బ్రదుకు సర్వస్వమ్ము
జాతి కంకితములు సరస కృతులు
చేయ వలసినంత చేసిరి 'వేటూరి –
ట్రస్టు' వారి కదియె ప్రాణ మాయె!

"అప్పు లుంచలేదు, ఆస్తులు నా పుస్త
కాలె చాలు మేలు గాంతురేని"
అన్న నాన్న మాట లరసి మా ట్రస్టును
జాల పెంపుజేసి జగతి కొసఁగ

వారి పేర నొప్పు 'వాఙ్మయ పీఠమ్ము'
వెలసి మేలు గూర్చె, నెలవు మార్చి,
స్వీకరించి మాట చెల్లించె TTD
కోరి ముందు నిల్చి కోర్కె దీర్చె.

సర్వ నిర్వాహమును స్వామి జరుపుకొనగ
ఉభయకోవిదు లావెంట నొప్పు కనగ
చెలఁగి నా యాస విన్నవించితిని గాని
కక్కసించినవాడ నే గాను సుండు.

శాస్త్రిగారి గ్రంథసర్వస్వము మథించి
సుధను పంచిపెట్టు చొరవ మనది!
ఆ యమృతము గ్రోలి యానందమును పొంద
గలుగు టాంధ్ర జాతి ఫలము మనదె!

ఒక్కసూర్యున కెదురేగి మ్రొక్కు లిడుదు
(ఆంతర్యమున వారే ప్రభాకరులు)
జీవశక్తుల నొసగు నశ్వినుల గొల్తు
(వీరు వారి తమ్ములు, భిషగ్వరులు)
ముగురు రాముల దలపోసి మోకరిల్లి
(వీరు తిరుమల రామచంద్రులు, పుల్లెల శ్రీరామచంద్రులు, స్పెసిఫైడ్ అథారిటీ ఛైర్మన్ శ్రీ కంభంపాటి రాంబాబులు)

నలువ నెమ్మోములకు గూర్చు నతు లొనర్చి
(పుచ్చా పరబ్రహ్మశాస్త్రి, ఆకెళ్ల మల్లికార్జునశర్మ, శ్రీనివాసన్, రవ్వా శ్రీహరి)
పంచముఖుడైన సర్వజ్ఞు పదము గొల్చి
(వినాయక్)
ఆరు మోముల సామికి నంజలించి
(ఐ.వి.యస్., యల్.వి.యస్. ప్రభృతులు)
గణన కెక్కిన సప్తర్షి గణము నెంచి
(ఎడిటోరియల్ బోర్డు మెంబర్లు)
అష్టమూర్తుల కెటికో ళ్లప్పగించి
(గోష్ఠి సభ్యులు)
స్థాయి రస రత్న నిధి చక్ర తత్త్వ మెరిగి
ధర్మపథ వర్తి బహురూప ధరుని గొలిచి
(స్వామి)
శివుని సిగపూవు కళలెల్ల జేర్చి కూర్చి
చక్క నుదువీధి రిక్కల లెక్కగట్టి
(త్రినేత్రుడైన శివుని, మదనజనకుని, శ్రోతలను)

యోగ వాఙ్మయ సద్గోష్ఠి కుద్యమించి
మించు సత్కృతి నెంచి ధ్యానించి దేవ
దేవ శ్రీ శ్రీనివాస వందే యటంచు
పరమ గురునాథ సీ వీ వి ప్రణతు లనుచు
ప్రాప్య చిరజీవి తానంద భవ్యసీమ
ధరను నిల్పెడు ధ్యాన సాధన ఫలించు

సమయ మాసన్న మగుత మా జన్మ మందె
జగతి కలియుగ వైకుంఠ మగునుగాత
భవము నానందనిలయమై పరగుగాక
తనివి నిండార నారవితారకముగ॥

తాళ్లపాక పాటల మాటల మూటలు

-డా. తాడేపల్లి పతంజలి

॥ఓం నమో అన్నమయ్య వేంకటేశాయ॥

అన్నమయ్య పదసాహిత్యానికి పితామహుడు. వేంకటేశుని సర్వస్వంగా భావించి రుచిలో తిరుపతి లడ్డు ప్రసాదంతో సమానమయిన, పవిత్రమయిన కీర్తనలను స్వామివారి పదాలకు సమర్పించాడు. వేంకటేశునితో పాటు ఆయన కీర్తనలను తెలుగుజాతి హృదయాలలో దాచుకొంది.

అన్నమయ్య, ఆయన సంతతి వ్రాసిన కీర్తనలు రాగిరేకులపై, వ్రాతప్రతులపై, ఆధునిక కాలాన ముద్రిత ప్రతులుగా ప్రచారంలో ఉన్నాయి. అన్నమయ్య వ్రాసిన కీర్తనలు అన్నీ రాగిరేకులలోను, వ్రాతప్రతులలోను, ఆధునిక ముద్రితప్రతులుగా దొరుకుతున్నాయా? అన్నమయ్య, పెద తిరుమలాచార్యులు, చిన తిరుమలాచార్యులు కాక వేరే ఇంకెవరైనా పదకర్తలు తాళ్లపాక వంశంలో ఉన్నారా? వారు వ్రాసిన కీర్తనలు ఎక్కడ ఉన్నాయి? అన్వేషణలో లభించని వ్రాతప్రతులు ఏ పుణ్యాత్ముల ఇళ్ళలో అటకల మీద ఉన్నాయి? ఏ పుస్తకాల చాటున బిక్కుబిక్కుమంటున్నాయి? ఇలా ఎన్నో జవాబు దొరకని ప్రశ్నలకు కరిగిపోయిన రాగిరేకులు పెదవి విప్పవు. భూమిలో కలిసిపోయిన ఎన్నో "రేకులు" పదపరిమళాలు వెదజల్లవు.

ఈ శూన్యంలో ఒక వెలుగురేఖ ప్రస్తుతం ముద్రణాభాగ్యం పొందుతున్న ఈ తాళ్లపాక పాటలు. ఇది తాళ్ళపాక శేషాచార్యులవారి వ్రాతప్రతి.

"కామితఫలు వేంకటపతిని గొలిచి నామతి దెలిపెబో నా వ్రాత" (1-233) అంటాడు ఒకచోట అన్నమయ్య. ఇక్కడ వ్రాత పదానికి - బ్రహ్మ వ్రాసిన తలరాత అని అర్థం. కాని ఆయన కీర్తనలున్న వ్రాతప్రతులకు కూడా ఈ భావం అన్వయిస్తుంది. తాళ్లపాక వంశీయుల కవితామతిని ఆవిష్కరించేది ఈ వ్రాతప్రతి.

ఎవరీ తాళ్లపాక శేషాచార్యులు? ఆయన విశిష్టత ఏమిటి?



Copied by Sri S. Nagaraja Rao Bhaskar from the Ms got on loan from ~~Curator~~ Sri Tallapakka Venkata Seshacharyulu garu of Tirupati, the descendent of the poet.

Curator 24/2/41

పైన ఉన్న యస్.వి.ఓరియంటల్ ఇనిస్టిట్యూట్ తిరుపతివారి చివరిపుటలో శేషాచార్యులవారిని వేంకట శేషాచార్యులుగా పేర్కొనుట గమనార్హం. ఆయన తిరుపతి నివాసి. తాళ్లపాక వంశస్థునిగా పేర్కొన్నారు. పర్యవేక్షకుని (Curator) సంతకం 24-02-41 గా ఉన్నది. ఈ 41 ఎప్పటిది? 1941 కావచ్చు. కనుక శేషాచార్యులవారు 20 శతాబ్దానికి చెందినవారు. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వీరిని కలిసినట్లుగా శ్రీ వేటూరి ఆనందమూర్తిగారి చరవాణిలో విని పరవశించాను. "ఎట్టి పరవశమో యెట్టి తమకమో." (24-442).

అన్నమయ్య అని పలకటంతోనే గుర్తుకు వచ్చే ప్రాతఃస్మరణీయులు 1. శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 2. శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. వీరు తమ రచనలలో ఒకటి రెండుచోట్ల ఈ శేషాచార్యులవారి వ్రాతప్రతిని ప్రస్తావించారు. వాటిని పరిచయం చేస్తాను.

శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

అన్నమాచార్య చరిత్ర పీఠికలో శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు శేషాచార్యులవారి ప్రస్తావన ఇలా చేసారు.

"తిరుపతిలో స్వామికి సంకీర్తనకైంకర్యము జరుపుచు దాళ్ళపాక శేషాచార్యులగారు కుటుంబవృద్ధితో నున్నారు. మడితాడు గ్రామవాసి సూర్యనారాయణయ్యగారు చిన్నన్న కోవలోనివారట. నేడు తిరుపతిలో వైద్యాదివృత్తులతో సకుటుంబముగా నున్నారు. వీరే తాళ్ళపాకవారి పూర్వగాథలకై చాల శ్రమించుచున్నవారు. అన్నమాచార్యుల దేవతార్చన విగ్రహాదులను మంగాపురమునకు చేర్చినవారు వీరే." (93వ పుట).

"ఈశ్వరసంకల్ప మెట్టిదోగాని తాళ్ళపాకవారి యధ్యాత్మ సంకీర్తనములు చదువుచుండునపుడు నా హృదయ తంత్రులలో ననురణనము సాగుచు పరమానంద పారవశ్యముకలుగుచు కర్తవ్యమేదో వ్యక్తమగుచున్నట్లుండును. ఈయన్నమాచార్య చరిత్రము ముద్రించుచు నందు నరసింహరాయని దగ్గఱ నన్నమాచార్యుఁడు పాడిన శృంగార సంకీర్తన ప్రతీకము చదివి ఈ కథ నిజమా? ఇట్టి కీర్తనము దొరకఁగలదా? ఉన్నను వేలకొలఁది సంకీర్తనములలో

నెక్కడ నున్నదో కదా అనుకొనుచు జేతనున్న తాళ్ళపాక శేషాచార్యులుగారి వ్రాతప్రతిని దెఅతునుగదా సరిగా నా సంకీర్తమే యందు నాకన్ను లెదురcగానవచ్చెను. ఆనందమాయెను." (120వ పుట).

శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి కరస్పర్శ పొందిన పవిత్రమైన కృతి ఈ శేషాచార్యుల వ్రాతప్రతి.

శేషాచార్యులవారి వ్రాతప్రతిలో ఉన్న 'కురువనంబి తిరుమల కురువనంబి', 'పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా', 'కంటిగంటి నిలువు చక్కని ఎటువంటి వాడవో', 'కంటి శుక్రవారము', 'సురలకు నరులకు', 'కరము జీడిపులుసు', 'నీవుగాగ' మొదలయిన కీర్తనలను శ్రీమాన్ వేటూరివారు తమ పీఠికలో పూర్తిపాఠాలతో ఇచ్చారు.

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు తమ – తాళ్లపాక అన్నమయ్య పాటలు పీఠికలో శేషాచార్యులవారి ప్రస్తావన ఇలా చేసారు.

"ఈ శతాబ్దము – మొదటి భాగమున సంగీతరచనలు సస్వర తాళ గమక చిహ్నముగా ప్రచురించుటలో భగీరథ ప్రయత్నము చేసిన మహానుభావుడు ఎట్టయాపురపు శ్రీ సుబ్బరామదీక్షితులు. తన 'సంగీత సంప్రదాయ ప్రదర్శిని' రెండవ భాగపు అనుబంధమున 'నా మొరాలింపవే అయ్య వెంకటరమణా' అను కాంభోజిరాగ ఝంపతాళ కీర్తనను, తన ప్రథమాధ్యాయపుస్తకము నందు 'శ్రీపతిపాదతీర్థమే చెడనిమందు' అను అటతాళపు శంకరాభరణ కీర్తనను, మొట్టమొదలు ప్రకటించెను. ఈ రెండు కీర్తనలును రేకులలో కానరావు. 'శ్రీపతిపాద' అనునది మాత్రము శ్రీ తాళ్ళపాక వెంకటశేషాచార్యుల వారింటి వ్రాతప్రతిలో ఈషత్పాఠ భేదములతో నున్నది. ఇవి రెండును తాళ్ళపాక చిన్నయ్యరచనలని దీక్షితులు వ్రాసిరి. చిన్నన్నవి ద్విపదకృతులు లభించినవిగాని గేయములు ఇంకను లభింపవలసియున్నవి" అని శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మవారు తాళ్లపాక అన్నమయ్య పాటలు పీఠికలో శ్రీ తాళ్లపాక వెంకటశేషాచార్యుల వ్రాతప్రతిని ప్రస్తావించారు. (పుట 11).

హరినారాయణాచార్యులవారు

అన్నమయ్య వంశీయులు హరినారాయణాచార్యులవారు చెప్పినట్లుగా ఈనాడు దినపత్రికలో శేషాచార్యులవారి గురించి ఇలా చదివాను (అక్టోబర్ 5, 2011).

"శ్రీవారితో అన్నమయ్య ముఖాముఖి మాట్లాడేవారని మా తాత ముత్తాతలు మాకు చెప్పారు. అప్పట్లో ఏకాంతసేవకు రెండు గంటలు ముందుగానే అన్నమయ్య స్వామివారి చెంతకు వెళ్లేవారట. అక్కడ స్వామివారు అన్నమయ్యతో పలు విషయాలపై చర్చించేవారట. లోకంలోని సంగతులను అడిగి తెలుసుకునేవారట. స్వామివారి ప్రశ్నలకు సమాధానమిస్తూ అన్నమయ్య కొన్ని కీర్తనలు ఆలపించేవారట. ఒకనాడు శ్రీవారు 'అన్నమయ్యా... భక్తులు నన్నేమని పిలుస్తున్నారు?' అని అడిగారట. అప్పుడు అన్నమయ్య 'మాధవా... కేశవా... మధుసూధనా...' అనే కీర్తనను ఆశువుగా ఆలపించారట. మరోసారి 'నాతో మాట్లాడుతున్నప్పుడు నిమిషానికి 32 సార్లు కళ్లు మూసుకుంటున్నావే... రోజంతా కళ్లు తెరిచి ఉంచుతున్న నా కన్నులు ఎంత నొప్పి పుడుతాయో తెలుసా?' అని

అడిగారట. అందుకు అన్నమయ్య మాట్లాడుతూ “స్వామీ! తమరు కన్నులు మూస్తే భక్తులు ఏమైపోవాలి? అంటూ ‘చూడక మానవు చూచేటి కన్నులు’ అనే కీర్తనను గానం చేశారట. అలా అన్నమయ్య కీర్తన కోసం స్వామి ప్రయత్నించేవారట. అన్నమాచార్యులు మాత్రమే కాదు.. ఆయన తర్వాత మా ముత్తాత అనంతాచార్యులు, తాత శేషాచార్యులు కూడా శ్రీవారితో ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉండేవారని మా పెద్దలు చెబుతుండేవారు.”

పై ఉటంకింపును అనుసరించి శేషాచార్యులయొక్క గొప్పతనం మనకు తెలుస్తున్నది. స్వామివారితో మాట్లాడే అదృష్టవంతులయిన శేషాచార్యులవారి వ్రాతప్రతిని మనం చదువబోతున్నాము అనే మాటను ఊహించుకొంటేనే ఎంత ఆనందం కలుగుతుంది.?

కామిశెట్టి శ్రీనివాసులుగారు

“తాళ్లపాకవారి పదాలు ఎక్కడెక్కడో ఎన్నో రూపాలను, రూపాంతరాలను పొందినట్లు తెలుస్తున్నది. కర్త పేరు తెలియక భిన్న విభిన్న పదకర్తల రచనా సంకలనాలలో చోటు చేసుకొన్నవి. నా దృష్టికందిన కొన్ని వేంకటేశ్వర ముద్రాంకిత పదాలను ఉద్ధరించే ప్రయత్నం చేస్తున్నాను. మా గురువుగారు శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ‘ఆ పాటలు నశించిపోకుండుటకై ఇందుద్ధరించుచున్నాను’ అంటూ కొన్నిటిని ప్రకటించి నాకు మార్గోపదేశం చేసినారు. నేను సేకరించిన పాటలని కొన్నింటిని గురువుగారికి వినిపించి వారి ఆమోదముద్రను పొందినవి ఇందు పొందుపరుస్తున్నాను” అని కామిశెట్టి శ్రీనివాసులుగారు 26వ సంపుటం పీఠికలో పేర్కొన్నారు. పైవాటితోపాటు తితిదే ప్రచురించిన 29 సంపుటాల్లో పీఠికల్లో శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు మొదలైనవారు ఉటంకించినవి, శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి అన్నమాచార్య చరిత్ర పీఠికలో పేర్కొన్న–సంకీర్తనలలో కొన్ని–స్వల్పాక్షర పాఠాంతరములతో–మనం ప్రస్తుతం చదువబోతున్న తాళ్లపాక పాటలు పుస్తకంలో ఉన్నాయి.

సుమారుగా 80కి పైగా ఉన్న కీర్తనలు తితిదే పుస్తకాల్లో ఇప్పటికే ప్రచురింపబడిన సందర్భంలో మరలా వీటిని తాళ్లపాక పాటలు పుస్తకంలో పునఃప్రచురించుట ఎందుకు అనే ప్రశ్న రావచ్చు.

దీనికి వరుసగా జవాబులు ఇవి:

1. శ్రీమాన్ తాళ్లపాక శేషాచార్యులవారి కృషిని లోకానికి తెలియచేసేటందుకు.
2. కొన్ని రాగిరేకులలో దొరికి ఉండవచ్చునేమో కాని, ప్రచురింపబడిన కీర్తనల్లో అధికశాతం శేషాచార్యులవారి వ్రాతప్రతి నుంచి గ్రహించినవి కనుక.
3. ఒకే కీర్తన శేషాచార్యులవారి వ్రాతప్రతిలో ఎలా ఉన్నదో, పరిష్కృత పాఠంలో ఎలా ఉన్నదో బేరీజు వేసుకొని సరియైన పాఠాంతరమేదో విమర్శక శిఖామణులు సత్యాన్వేషణ చేయుటకు.
4. ‘శేషాచార్యులవారి తాళపత్రప్రతిలోని సంకీర్తనములుగూడ నన్నియు రాగిరేకులమీది కెక్కినవో లేవో?’ అను శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి ప్రశ్నకు ముద్రణా సమాధానము ఇవ్వటానికి. (అన్నమాచార్య చరిత్ర పీఠిక 66వ పుట).

* * *

శేషాచార్యులవారి వ్రాతప్రతి లోని 289 కీర్తనలు నేను చదివాను. అందులో ఉన్న ప్రతి కీర్తన విశేషాలు వివరించాలంటే మళ్లీ ఇంకొక గ్రంథం అవుతుంది. కొన్ని కీర్తనలవరకే నా అర్చనను పరిమితం చేసుకొంటాను.

అంగనామణి కురంగలోచన

"అం" తో ఈ కృతిలో మొదటి కీర్తన మొదలు. జిల్లెళ్ళమూడి అమ్మగా ఇరవయ్యవ శతాబ్దంలో ప్రసిద్ధురాలైన మాతృశ్రీ అనసూయాదేవి (1923–85) ఎవరైనా ఒక పుస్తకం చేతికి ఇచ్చి ఆశీఃపూర్వకంగా ఏమైనా వ్రాసి ఇమ్మంటే 'అం అ (ఆ)' అని వ్రాసి ఇచ్చేవారు. ఆమె సన్నిధిలో నివసిస్తూ రెండు సంవత్సరాలు చదువుకొనే అదృష్టం నాకు కలిగింది. 'అం' అంటే అంతులేనిదీ, 'అ' అంటే అడ్డులేనిదీ అని అమ్మ వ్యాఖ్యానం చెప్పేవారు. 'ఈ అక్షరాలను పలికితే కూడా అమ్మ అనే శబ్దమే వినిపిస్తుంది కదా!' అనేవారు. అవి బీజాక్షరాలని అమ్మ వాచ్యంగా చెప్పకపోయినా చాలామంది దానిని మంత్రంగా జపం చేస్తున్నారు. 'అం' వశీకరణశక్తి కలిగిన బీజాక్షరం, నారాయణ / విష్ణుబీజం. అటువంటి 'అం' అక్షరంతో అకారాది క్రమంగా కీర్తనలను అమర్చి ఈ పుస్తకాన్ని ప్రారంభించిన సంపాదకులు అభినందనీయులు.

ప్రతి కీర్తన కింద సంపాదకులు లఘువ్యాఖ్య ఇచ్చారు. ఈ లఘువ్యాఖ్య ఎలాంటిదంటే మన ఇళ్ళల్లో ఏదైనా వస్తువు ఎత్తుగా ఉంటే అందుకోవటానికి స్టూల్ లాంటిది వేసుకొని దాని మీద ఎక్కి అది అందుకోవడానికి ప్రయత్నిస్తాము కదా! ఇదిగో, ఆ స్టూల్ లాంటిది సంపాదకులవారి వ్యాఖ్య. కీర్తన చదివిన తరువాత పాఠకుడు సంపాదకులవారి లఘువ్యాఖ్యను జాగ్రత్తగా చదివితే కీర్తనకి సంబంధించిన తాళంచెవి దొరికిపోతుంది. జాగ్రత్తగా కీర్తన తాళం తీసి కీర్తన లోగిలిలోని ప్రతి పదగోపురాన్ని జాగ్రత్తగా అన్వేషిస్తే, వెనక ఉన్న కాంతి జిగేల్మంటుంది.

అకటకటా యింతలోనె

ఈ కీర్తనలో 'చూపోపని మాటకు సుదతి అలిగిం'దని కవి చివరి పాదాలలో చెబుతాడు. ఓపటం అంటే ఓర్చుకోవడం. సహించడం. నాయిక చెలికత్తెలు చెప్పిన ఒకమాట విన్నది. ఆ మాట చూపులు సహించలేనిది. ఇక్కడ వెంటనే మరొక ప్రశ్న...ఎవరి చూపుని సహించదు? మనకిష్టమైనవారు మన ఎదురుగా ఉంటే వారిని చూడటానికి మన చూపు సహిస్తుంది. మరల మరల చూడాలనిపిస్తుంది. అదే మనకు ఇష్టం లేనివారు మన ఎదురుగా ఉంటే వారిని చూడటానికి మనస్సు ఇష్టపడదు. వారి సన్నిధిని చూపు సహించదు. చెలికత్తెలు చెప్పిన మాట ఇలా చూపుని సహించని మాట. ఏం చెప్పి ఉంటారు? ఎందుకు ఓర్చు లేకపోతోంది? అన్నీ కవి చెప్పేస్తే అది కవిత్వం కాదు. వ్యాఖ్యానం అవుతుంది. పాఠకుడికి పాఠకుడి ఆలోచనకి తన భావాన్ని తన భావనాశక్తిలో కొంత ప్రదేశాన్ని ఉత్తమకవి వదిలేస్తాడు. సహృదయుడయిన పాఠకుడు కవి వదిలివేసిన ఖాళీ ప్రదేశాన్ని తన ఊహతో పూరించుకుని ఆలోచనామృతాన్ని పొందుతాడు. అందుకే ఉత్తమకవిత్వం చదవాలి. తాళ్లపాకవారి కవిత్వంలో ఇలాంటి ఉత్తమ పదబంధాలు ఎన్నో ఉంటాయి. ఊహించగలిగినవారికి ఊహించగలిగినంత.

అలరచంచలమైన

ఇది వ్రాతప్రతి పుటలో 189వ కీర్తన. శ్రీ వేంకటేశునికి అన్నమయ్య పాడిన ఉయ్యాల పాట ఇది.

మన మానవుల (జీవాత్మలు అని మానవులకు ఇంకొక పేరు) కోర్కెలు చంచలములు. ముందుకు వెనక్కు కోర్కెలు ఉయ్యాల వలె ఊగుచుండును. అందువలన ఆత్మలలోపల ఉన్న వేంకటేశునికి కూడా ఉయ్యాల ఊగే అలవాటు వచ్చిందని అన్నమయ్య చమత్కారం.

గాలిని లోపలికి, బయటికి పీల్చి వదిలిపెడుతుంటాము. ఇది కూడా ముందుకు వెనుకకు ఊగు ఉయ్యాల వంటిది. వేంకటేశుడు ప్రస్తుతము ఊయల ఊగుటలో – ముందుకు వెనుకకు ఊగు ఉచ్ఛ్వాస నిశ్వాసములలో తానున్న స్థితిని చెబుతున్నట్లున్నదని అన్నమయ్య భావము.

ఉదయ, అస్తమయ పర్వతములు వేంకటేశుని ఊయలకు వేసిన కంబములు. నక్షత్రమండలము ఆ ఉయ్యాలను మోస్తోంది. సూర్యాదిగ్రహములు ప్రకాశించు ప్రదేశమయిన ఆకాశము ఈ ఊయలకు సగములో (మధ్యలో) వేసిన అడ్డదూలముకాగా సమస్తములో ఆ ఊయల నిండింది.

నిలుకడగా ఋగ్వేదాది చతుర్వేదములు ఆ ఉయ్యాలకు వేసిన బంగారపు తాడులు (గొలుసులు). అందువలన ఇన్ని లక్షణములు కల ఆ ఉయ్యాలను పట్టుటకు భయమై కనబడెను. ఆ ఉయ్యాలలో వేసిన పీట ధర్మదేవత ఆసనము. ఆ ఉయ్యాలను వర్ణించుటకు ఆశ్చర్యకరమైనది (దుర్లభమైనది).

మేఘమండలము ఆ ఊయల మంచముయొక్క మెట్లు (మేలుకట్లు) కాగా మెఱుపునకు మెఱుపయినది ఉయ్యాల (అంత కాంతిమంతముగా ఉన్నదని భావము). నల్లనికొండవంటి వేంకటేశుని శరీరపుకాంతికి సత్యమైన ఆభరణమయింది ఉయ్యాల.

స్తనములు కదులుచుండగా, పైటలు రాచుకొంటూ సుందరమైన యువతులు వేగముగా ముందుకు వెనుకకు వేంకటేశుని ఊయలను ఊపారు. అంతలోనే వారికి అనుమానమొచ్చింది. స్వామివారి కడుపులో వరుసగా పదునాలుగు భువనగోళములు ఉన్నాయి కదా! మనం గట్టిగా ఊపితే అవి ఎక్కడ కదిలి పడిపోతాయోయని అని భయముతో మెల్లమెల్లగా, క్రమక్రమముగా ఊపారు.

ఓ వేంకటేశా! నీ పక్కనే ఉన్న లక్ష్మి, భూదేవి ఉయ్యాలలోని ఊపు ఊపుకు నిన్ను కౌగిలించుకో వలసివస్తోంది. దేవతా స్త్రీలకు వేంకటేశ్వరుని హావభావాలు చూసే అదృష్టాన్ని ఉయ్యాల కల్పిస్తోంది. బ్రహ్మ మొదలయినవారు నీ ఉయ్యాలను చూస్తూ కన్నులపండుగగా ఎంత అదృష్టము మాకు వచ్చిందని నిను కొనియాడారు. కోరదగిన (మనోహరమైన) ఓ వేంకట శైలపతి! నీకు ఈ ఉయ్యాల ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది.

ఈ కీర్తనలోని ఆంతర్యమిది :

ఆత్మకు నాలుగు పాదాలు. అన్నమయ్య రచించిన ఈ కీర్తనకుకూడా పల్లవితో నాలుగు దీర్ఘపాదాలు. ఓంకారంలోని అ, ఉ, మ, అధిగతమాత్రలు – ఆత్మ అనుభవించే జాగ్రత్, స్వప్న, సుషుప్త, తురీయావస్థలు. అన్నమయ్య సంకీర్తనలోని మూడు పాదాల మొదటి అక్షరాలు కూడా అ, ఉ, మే (మకారము)లతో ఉండటం గమనార్హం. "ఋషీణాం పునరాద్యానాం వాచమర్థానుధావతి" అని కదా పెద్దలమాట.

"అలరఁజంచలమైన ఆత్మలందుండ నీ(క)లవాటు జేసె నీ వుయ్యాల
పలుమారు నుచ్ఛ్వాస పవనమందుండ నీ భావంబు దెలిపె నుయ్యాల"

జ్ఞాన, (05) కర్మ ఇంద్రియాలు (05) ప్రాణాలు, (5) మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం–మొత్తం 19 ముఖాలతో మానవుడు సుఖదుఃఖాదులు మొదలైనవి అనుభవిస్తాడు. జాగ్రత్తగా పై పల్లవిని అధ్యయనం చేస్తే 19 ముఖాలలో మానవుడు సుఖదుఃఖాదులు మొదలైనవి అనుభవిస్తాడను భావం–చంచలమైన అను పద ప్రయోగములో కనిపిస్తుంది.

జాగ్రదవస్థలో బహిర్ముఖమైన ఆత్మ స్వప్నావస్థలో అంతర్ముఖమవుతుంది. భౌతికంగా కనిపించవుగాని, ఇందాక చెప్పిన 19 ముఖాలు మానసికంగా పని చేస్తాయి. తైజసుడు అను వెలుగు సమక్షంలో ఏ వ్యక్తికి ఆ వ్యక్తి ప్రత్యేకంగా తనకు తోచిన ఆకారాలు మొదలైనవి తన స్వప్నంలో సృష్టించుకొంటాడు. ఈ భావాలన్నీ అన్నమయ్య చెప్పిన "ఉదయాస్త శైలంబు లొనర గంబములైన / వుడుమండలము మోచె నుయ్యాల / అదన ఆకాశ పదమడ్డదూలంబైన / అఖిలంబునిండెనీవుయ్యాల / పదిలముగ వేదములు బంగారు చేరులై / పట్ట వెరపై తోచె నుయ్యాల / వదలకిటు ధర్మదేవత పీఠమై మిగుల / వర్ణింప నరుదాయ నుయ్యాల" అను చరణములో అంతర్నిహితములై ఉన్నవి.

సమష్టిస్థితిని దాటిన గాఢనిద్రలో ఉండే అవస్థ సుషుప్తావస్థ. ఆత్మతో పరమానందాన్ని అనుభవిస్తూ, అనుభూతిని ప్రజారూపంగా కలిగే ఈ అవస్థ "మేలుకట్లయి నీకు మేఘమండలమెల్ల మెఱుఁగునకు మెఱుఁగాయ నుయ్యాల/నీలశైలము వంటి నీ మేనికాంతికిని/నిజమైన తొడవాయ నుయ్యాల/పాలిండ్లు గదలఁగా బయ్యదలు రాఁపాడ భామినులు వడి నూఁచు నుయ్యాల/వోలి బ్రహ్మాండములు వొరగునో యని భీతినొయ్యనొయ్యన వూఁచి రుయ్యాల" అను చరణంలో కొన్ని భాగాలలో మనం గమనించవచ్చు.

తురీయావస్థ ఆత్మ యొక్క నాలుగో పాదం. ఈ అవస్థలో అంతా తానై ఉంటుంది ఆత్మ.

"కమలకును భూసతికి కదలు కదలుకు మిమ్ముఁ గౌగిలింపఁగఁజేసె నుయ్యాల/అమరాంగనలకు నీ హావభావ విలాస/మందంద చూపె నీవుయ్యాల కమలాసనాదులకుఁగన్నులకు పండుగై /గణుతింప నరుదాయ నుయ్యాల/కమనీయమూర్తి వేంకటశైలపతి నీకు/కడు వేడుకై వుండె నుయ్యాల." ఇందులో తురీయావస్థకు సంబంధించిన ఆత్మమయం ఉంది.

"కమలకును భూసతికి కదలు కదలుకు మిమ్ముఁ గౌగిలింపఁగఁజేసె" – ఈ వాక్యంలో తురీయావస్థకు సంబంధించిన పరమానందాన్ని అనుభవించే గుణం ఉంది.

సకలజీవ జగత్తునకు మూలాధారమైన సర్వాత్మ స్వరాజ్యముగా తురీయావస్థ చెబుతుంది. "కమనీయ మూర్తి వేంకటశైలపతి నీకు/కడు వేడుకై వుండె నుయ్యాల" అను పాదంలో – వేంకటేశ్వరుని సర్వాత్మగా – నిరూపింపబడింది.

అన్నమయ్య సంకీర్తనలు – అన్నమాచార్య చరిత్రలో చెప్పినట్లు శ్రుతులు, శాస్త్రాలు, పురాణకథలు, సుజ్ఞానపాఠాలు, యతిలోకాగమవీధులు, విపులమంత్రార్థాలు, నీతులు, కృతులు, నుతులు, వేంకటపతి రతి క్రీడారహస్యాలు. ఈ అలరచంచలమైన సంకీర్తన సుజ్ఞానపాఠాల కోవలోనికి చెందినది.

ఏమొకొ చిగురుటధరమున

ఇది వ్రాతప్రతిలో 22 మరియు 47 పుటల్లో ఈ కీర్తన ఉన్నది.

కస్తూరివాసన మన సాహిత్యంలో వందల సంవత్సరాల నుంచి గుబాళిస్తోంది. ఆ రోజులలో తాంబూలంలో కస్తూరి వేసుకొనేవారు. మనిషిని చూడకుండానే కస్తూరిపాళ్లనుబట్టి, తాంబూలం వేసుకొంది మగవాళ్లా; ఆడవాళ్లా అని గ్రహించే నేర్పు మన పూర్వీకులకు ఉండేది (మనుచరిత్ర).

ఆయుర్వేదాన్ని అనుసరించి మూడు రకాల కస్తూరులలో కామరూప కస్తూరి (నేపాల్ కస్తూరి, కాశ్మీరకస్తూరి మిగతా రెండు) గొప్పది. ఈ కీర్తనలో ఆ రకమైన కస్తూరినే అలమేలుమంగమ్మ వేసుకొందేమో! ఇకనేం! ఘుమాయింపులతో చెలికత్తెలకు దొరికిపోయింది.

ఆ తాంబూలపూరితముఖి (లలితాసహస్రనామాలు) అలమేలుమంగ వేసుకొన్న కస్తూరిలో కొన్నిపలుకులు నాయకుడు చేసిన పలుగాట్ల స్థానంలో అక్షరాల్లాగా పెదవులమీదకు చేరాయి. వాటిని అలమేలుమంగమ్మ ప్రియునికి రాసిన లేఖతో కవి పోల్చాడు. అమరం చదువుకొన్నవాళ్లు కస్తూరి అంటే శిరస్సునందు స్తోత్రం చేయబడేది అని అర్థం చెప్పుకొంటారు. అద్భుతమైన కస్తూరి వర్ణన చదివిన తర్వాత శిరస్సు స్థానంలో పెదవి చేరుతుంది. స్తోత్రం కస్తూరినుంచి కవిగారివైపు పాకుతుంది.

అరచేయి, అరికాలు, కంటిచివరలు, గోళ్ళు, చెంప, నాలుక, పెదవి–ఈ ఏడు ఎర్రగా ఉంటే సుఖంగా ఉంటారని సాముద్రికశాస్త్రం. సహజంగానే ఉత్తమ సాముద్రికలక్షణాలున్న అలమేలుమంగలో కంటిచివరల ఎరుపు ఎందుకు వచ్చిందంటే స్వామివైపు చూసే చూపులను ఎవరో పెరికినట్లుగా ఊహించి మెప్పించాడు అన్నమయ్య. గోటినొక్కులను మహాకవి "వేసవికాలపు వెన్నెల" అన్నాడు. ఇక్కడి పోలికలో అనుభూతి ప్రధానం. శరత్కాలపు వెన్నెలలో హాయి ఉంటుంది. వేసవికాలపు వెన్నెలలో హాయితోపాటు తృప్తి ఉంటుంది. పగలంతా ఎండలో శ్రమపడి ఉంటాం. రాత్రయేసరికి వెన్నెల, అంటే శ్రమ తర్వాత సుఖం కనుకనే హాయితోపాటు తృప్తి. వేసవికాలపు వెన్నెల ప్రయోగ ఆంతర్యం ఇప్పుడు తెలుసుకోవచ్చు. ఈ కీర్తనలో చకోరానికి ఎర్రటికళ్లున్న గబ్బిలమని అర్థం చెప్పారు రాళ్ళపల్లివారు. ఆయనకంటే గొప్పగా అన్నమయ్యను అర్థం చేసుకొన్నవారు అరుదు. అందుకే ఆ అర్థాన్ని ఒప్పుకోవాలి.

ఈ కీర్తన విన్న సాళువ నరసింహరాయలు తనమీదకూడా ఇటువంటి కీర్తన రాయమన్నాడు. "హరిని పొగడిన నా నాలుక నిన్ను పొగడదు" అని అన్నమయ్య తిరస్కరించాడు. అన్నమయ్యకు సంకెళ్లువేసి జైలులో పెట్టాడు రాజు. తర్వాత వేంకటేశ్వరుడిని కీర్తించిన వెంటనే అన్నమయ్య సంకెళ్ళు తెగిపోయాయి (అన్నమయ్యచరిత్ర). ఈ ఏమొకో...కీర్తనలో శృంగారం ఉన్నట్లు మనకు అనిపిస్తుంది కాని మధురభక్తిలో పండిపోయిన అన్నమయ్య ఈ కీర్తనలో హరిని పొగిడానని, లౌకికశృంగారదృష్టితో చూడొద్దని రాజుగారితోపాటు మనకు కూడా బోధించాడు.

ఆళ్వారులు (ద్రావిడప్రబంధకర్తలయిన విష్ణుభక్తులు) స్వామిని కీర్తించే విధానంలో మూడు అవస్థలు ఉన్నాయన్నారు విమర్శకులు. అవి 1. తోరిమార్(సఖి) అవస్థ, 2. తాయ్మార్(తల్లి) అవస్థ, 3. మకళ్(నాయిక) అవస్థ. ఇందులో మూడవ అవస్థను విష్ణుభక్తుడయిన అన్నమయ్య ఈ కీర్తనలో పాటించాడనిపిస్తుంది.

ఈ విషయాన్ని శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు నిర్ధారిస్తూ ఇలా చెప్పారు. "స్వామికి సేవకులకు, తండ్రికి బిడ్డలకు, గురుశిష్యులకు, ప్రభు భృత్యులకు చాలా చాటుమాటులు పొరపులు ఉండగలవు. కాని మిత్రులకు పరస్పరము పొరలులేని చేరికయుండును. ఆ మైత్రి దాంపత్యరూపమేని తెరచాటులులేని సమైక్యమే కలుగును. ఆళ్వారాచార్యాదులు తాము నాయికలై స్వామిని నాయకునిగాగొని యానందించిరనుట ప్రఖ్యాత విషయము. ఆళ్వారాచార్యులు తీరువారే తాళ్లపాకవారును. తాళ్లపాక యన్నమాచార్యుల సంకీర్తనము అనేకములు తిరువాయ్మొళీ (దివ్యప్రబంధ) భాష్యరూపములు. దివ్యప్రబంధము నాలుగువేల పాటలదికాఁగా తాళ్లపాకవారి పాటలు నలువదివేలదాకా నున్నవి. తాళ్లపాకవారు శ్రీ వేంకటేశ్వరైకశరణ్యులు. (శ్రీ అన్నమాచార్యోత్సవ క్రమం, తి.తి.దే. 1950, అనుబంధం 04లో).

ఇందులో తాళ్లపాకవారి పాటలు నలువదివేలని శ్రీమాన్ వేటూరివారి మాట. ఇది భావి పరిశోధకులకు కరదీపిక.

తానే రాధగా మారి చైతన్యుడు కృష్ణుడిని ఆరాధించి ప్రసిద్ధుడయ్యాడు. తానే అలమేలుమంగగా మారి అన్నమయ్య వేంకటేశుని కీర్తించి ఇటువంటి కీర్తనలద్వారా ఆరాధ్యమానుడయ్యాడు.

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా

'నాన్నగారు' అంటే గౌరవం. మనస్సుకు కొంచెం దూరం. అయ్య అంటే మనస్సుకు చాలాదగ్గర. అయ్య అని పిలవవలసిన తీరులో పిలిస్తే, ఎదుటివాడి శరీరంలో రక్తం కాసేపు ప్రవహించటం మానేసి, ఆత్మీయత ఉరకలెత్తుతుంది. ఆ ప్రేమశక్తిని గ్రహించిన అన్నమయ్య జగాలను కన్నతండ్రిని 'అయ్య' అని పిలిచాడు.

నిధానము(=నిధి), నిధనము(=మరణము) దగ్గరసంబంధమున్నపదాలు. ధనసంబంధం దేనిలో పోతుందో అది నిధనం; దేనిలో ఉంటుందో అది నిధానం. అసలైన ధనం మనమనుకొనే ఆస్తులు కాదు. స్వామి అనుగ్రహం అనేది ఒకనిధి అని పెద్దలు నేర్చుకొని, తరతరాలకు తరగని నిధిగా దానిని మనకు ఇచ్చిపోయారట. నిధనము వచ్చేలోగా స్వామి అనుగ్రహం కోసం తాపత్రయపడమని కవి ఉపదేశిస్తున్నాడు.

మనస్సులను ప్రేరేపిస్తుంది కాబట్టి నలుపు రంగుకు కాలమని ఇంకొకపేరు. తడిపేది మేఘం. నల్లగా ఉన్న స్వామి అన్నమయ్యకు కాలమేఘమయ్యాడు. ఆర్తుడు, జ్ఞానుల్లో సామాన్యమైన లక్షణం తహతహ. ఇది దాహానికి సంకేతం. ఈ దాహాన్ని పోగొట్టే నల్లటిమేఘం నీ ఎదురుగా ఉంది. తప్పకుండా ఆ కాలమేఘం ఆదరించి (గారవించి) దాహాన్ని పోగొడుతుందని కవి అభయం.

మందారం, పారిజాతం, సంతానం, కల్పవృక్షం, హరిచందనం అని అయిదు దేవతావృక్షాలున్నాయి ఎవరేది అడిగినా ఇచ్చే ఆ పారిజాతం ఇంద్రుడి అధీనంలో ఉంటుంది కాని, మన అధీనంలో ఉన్న పారిజాతం స్వామి అని కవి చమత్కారం.

వరాహావతారంలో స్వామి భూమిని మోశాడు. అందుకే ఆయన ధరణీధరుడు. తిరుమలలో స్వామివారు ఉండటానికి స్థానాన్నిచ్చింది వరాహస్వామి. అందుకు ప్రతిఫలంగా కొండకు వచ్చే భక్తులు వరాహస్వామిని మొదటిదర్శనం చేసుకొనేటట్లు వాగ్దానం పొందాడు. తిరుమల వెళ్లినవారు వరాహస్వామిని చూడకుండా వేంకటేశ్వర దర్శనం చేసుకోకూడదు. ఇద్దరూ ఒకటే అని జ్ఞాపకం చేస్తూ, 'తావై' అన్న మాటలో వరాహస్వామి విశిష్టతను కవి తెలియజేశాడు.

వైద్యో నారాయణో హరిః అంటుంది మన సంప్రదాయం. అన్నమయ్యకూడ స్వామివారిని వైద్యునితో పోల్చి ఆయన ప్రసాదించిన శరణం అనే ఔషధాన్ని భక్తితో సేవించమన్నాడు.

ప్రీతిని కలిగించేవాడు బంధువు. వేంకటేశ్వరస్వామి ప్రాణబంధువు. మనకున్న పంచప్రాణాలలో ఒకటి వాక్కు అనే ద్వారంలో ఉంటుంది (నాగం). రెండోది కంటిరెప్పలలోఉంటుంది (కూర్మ). మూడవది ముక్కులో ఉంటుంది (కృకరం). నాలుగవది కంఠం అనే ద్వారంలో ఉంటుంది (దేవదత్తం). అయిదవది శరీరమంతటా ఉంటుంది. చనిపోయిన తర్వాతకూడా చాలాసేపటివరకు శరీరానికి బలం ఇస్తుంది (ధనంజయం). ఈ ప్రాణాలు ప్రతిజీవికి చాలా చాలా ఇష్టమైన బంధువులు. ఈ అయిదు ప్రాణవాయువులలో ఏ ఒక్క బంధువు తన దగ్గరనుంచి వెళ్లటానికి జీవి ఇష్టపడదు. మనల్ని విడవకుండా ఉండే ఈ ప్రాణాలంటే ఎంత ఇష్టపడతామో, స్వామి అంటే కూడ అంతే ఇష్టపడాలని అన్నమయ్య ఆయనని ప్రాణబంధువన్నాడు.

'ఓం నమో వేంకటేశాయ' అనేది ఏది కావాలన్నా ఆ సిద్ధిని కలిగించే మంత్రం. పరమేశ్వరుడు మన కంటికి కనిపించే విగ్రహరూపంలో, మంత్రరూపంలో, యంత్రరూపంలో ఉంటాడు 'చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా!" అనే పాదంలో మంత్రరూపంలో ఉన్న స్వామిని అన్నమయ్య కీర్తించాడు.

ఇలా ఈ వ్రాతప్రతిలోని ప్రతి కీర్తన అద్భుత వ్యాఖ్యాన ప్రతిపత్తి కలిగినది. వాచవికి పై కీర్తనలు వ్యాఖ్యానించాను. ఇప్పుడు వివాదాస్పదమయిన ఈ వ్రాతప్రతిలోని కీర్తనను ప్రస్తావిస్తాను.

అంగనామంగనామన్తరే

అంగనామంగనామన్తరేమాధవో....కేకికేకా.., క్వాపివీణా... అనే మూడుశ్లోక చరణాలపాట తాళ్లపాకవారి పాటలలో కనిపించుట విశేషం. ఇవి బిల్వమంగళుడు అనబడే లీలాశుకుని శ్రీకృష్ణకర్ణామృతములో ఎనిమిది చరణాల అష్టకంలో మొదటి మూడు శ్లోకాలుగా ప్రసిద్ధి.

ఇప్పుడు ప్రశ్న – ఈ శ్లోకాలు రచించినవారు అన్నమయ్య లేదా బిల్వమంగళుడా?

శ్రీకృష్ణకర్ణామృతంలోని కొన్నిశ్లోకాలు ఇప్పటికీ కర్తృక విషయంలో సందేహాస్పదాలు. 1939లో ఈ గ్రంథానికి టీకా తాత్పర్యాలు వ్రాసి ప్రచురించిన తేవప్పెరుమాళ్లయ్యగారు "ఇతను జీవించియుండిన కాలమిది యని నిశ్చయించుటకు నాధారము లింతవఱకుఁ గానిపింపకున్నవి" అని ముందుమాటలో వ్రాసారు.

ఈ మూడు శ్లోకాలలో చెప్పబడిన మధుర భావాలు ఇవి–

1. ఒక్కొక్క స్త్రీకిని నడుమ కృష్ణుడు ఉన్నాడు. తన రెండురూపములనడుమ ఒక్కొక్క స్త్రీ ఉండి మండలముగా నిలబడ్డారు. వారి నడుమలో తాను వేరొకనిగా నిలబడి శ్రీకృష్ణుడు చక్కగా గానము చేసాడు.

2. కృష్ణుని శరీరకాంతిని చూచి మబ్బు అని నెమళ్ళు కేకలిడగా, వర్షాకాలమని బెదరి పెక్కుతామరలలో ఉన్న హంసలు పైకి లేచాయి. అది మబ్బు గాదు శ్రీకృష్ణుడని తన ధ్వనిచేత హంసలకు దెలిపి, వాటికి సంతోషమును కలిగించు పిల్లనగ్రోవిని చేతిలోకి తీసుకొని కంసవంశవినాశకుడైన శ్రీకృష్ణుఁడు గానము చేసాడు.

3. ఆ రాసకేళిలో శ్రీకృష్ణుడు ఒకచోట వీణలు వాయించుటకు అనుగుణముగా ఆడుతున్నాడు. ఒకచోట వీణాధ్వనులకు అనుగుణముగా చిఱుగంటలు మ్రోగిస్తున్నాడు. ఒక చోట నడుమనడుమ వీణలు వాయింపఁగా పాడుతున్నాడు. వేణువును గ్రహించి గానము చేసాడు.

ఇక్కడొక పెద్దలమాట గుర్తుకు వస్తున్నది. ప్రతిభావంతుల బుద్ధులు ఒకదానితో ఒకటి పోలును (సంవాదిన్యో మేధావినాం బుద్ధయః). అనగా ఒక కవి ఒక పుస్తకంలో వ్రాసిన మాటలు–ఇంకొక కవి మాటలుగా–మూడు పద్ధతులలో ఇంకొక పుస్తకంలో కనిపిస్తుంటాయి.

ఈ పోలికలు మూడు విధములుగా ఉంటాయి.

1. ప్రతిబింబాకార సంవాదము

బింబం ఎలా ఉంటుందో ప్రతిబింబం కూడా అలానే ఉంటుంది. అలాగే అచ్చుగుద్దినట్టుగా ఒక కవి రాసిన మాటలు ఇంకొక కవి తన పేరు మీదుగా అలాగే ప్రచారం చేసుకుంటే అది ప్రతిబింబాకార సంవాదము. ఇది వదిలివేయదగిన పద్ధతి.

2. అలేఖ్యాకార సంవాదము

ఒక బొమ్మలాగా ఇంకో బొమ్మ వేద్దాం అనుకున్నప్పుడు రెండవబొమ్మ మొదటిబొమ్మకన్నా అందంగా ఉండవచ్చు లేదా మొదటిబొమ్మకన్నా అందవిహీనంగా కూడా ఉండవచ్చు. ఇలాగే ఒక కవిని అనుసరించి ఇంకొకకవి అదే పద్ధతిలో వ్రాద్దామనుకొన్నప్పుడు అది మూలంకన్నా బాగుండవచ్చు లేదా మూలముకన్నా తక్కువస్థాయిలో కూడా ఉండవచ్చు. ఇది మధ్యమమైన పద్ధతి.

3. దేహాంతరతుల్య సంవాదము

ఒక మనిషిని ఇంకొక మనిషి పోలి ఉంటాడు. ఇద్దరి రూపాలు ఒకటే కానీ వ్యక్తిత్వశైలి వేరు. ఇలాగే ఒక కవి రాసిన దానిని ఇంకొకకవి అదే పద్ధతిలో వ్రాసాడు అనిపించవచ్చు కానీ అందులో కవిముద్ర వేరుగా ఉంటుంది. ఈ మూడింటిలో ఇది ఉత్తమమైనది.

ఇంతకీ మనం ప్రస్తుత విషయానికి వస్తే లీలాశుకుడు అన్నమయ్యను అనుసరించి వ్రాసాడా? అన్నమయ్య లీలాశుకుడిని అనుసరించి వ్రాసాడా? ఇది తెలియాలంటే ఇద్దరు జీవించిన కాలాలు నిర్ధారణ కావాలి. అన్నమయ్య కాలం నిర్ధారణ అయింది. కాని లీలాశుకుని కాలం కచ్చితంగా నిర్ధారణ కాలేదు. కనుక ఇద్దరిలో ముందు ఎవరు? తరువాత ఎవరు? తెలియటం ప్రస్తుతానికి కష్టం.

శ్లోకాల రచయిత అన్నమయ్యే

అంగనామంగనామన్తరేమాధవో... కేకికేకా.., క్వాపివీణా శ్లోకాల రచయిత అన్నమయ్యే అనుకోవటానికి కాస్త వీలుగా ఉంది. దానికి నేను అభిప్రాయపడిన కారణాలు ఇవి. తాళ్లపాకవారి కీర్తనలకు మురారి కీర్తనలు అని ఇంకొక పేరు ఉందని పెద్దలు చెప్పారు. అన్నమయ్య సంస్కృతశ్లోకాలు దురదృష్టవశాత్తు మనకు అధికంగా దొరకటంలేదు కాని అపారమైన తాళ్లపాక సాహిత్యంలో 90కి పైగా సంస్కృతకీర్తనలు మనకు ఈరోజు లభిస్తున్నాయి. వాటన్నింటిని నేను అన్నమయ్య కౌముది పేరుతో అర్థవిశేషాలతో ప్రచురించాను.

అన్నమయ్య సంస్కృతకీర్తనలలో అంగనామంగనామన్తరే శ్లోకాలస్థాయిలో ఉన్న పాదాలు ఉన్నాయి. ఉదాహరణకు 'గరుడగమన గరుడధ్వజ' కీర్తనలో 'ఘనఘనా ఘనకాయవర్ణ' (వర్షాకాలంలో ఉండే దట్టమైన నల్లని మేఘమువంటి శరీరకాంతి కలిగినవాడా!) అని స్వామివారిని వర్ణిస్తాడు. "పొడగంటిమయ్యా" అని మనం ముందు చెప్పుకొన్న కీర్తనలో కూడా కాలమేఘమా అని చెప్పాడు. "తవమాం ద్రష్టుం దయాస్తివా / త్రివిధైర్ఘానానితే నామాని" అను సంస్కృతకీర్తనలో వీణలతో అందమైన భావాలను పలికించాడు.

ఆ కీర్తన యొక్క తాత్పర్యము మూలముతో ఇది.

నీకు నన్ను చూడటానికి దయ ఉందా!? నీ పేర్లు మూడు విధాలుగా గొప్పవి (తవమాం ద్రష్టుం దయాస్తివా త్రివిధైర్ఘానానితే నామాని).

1. కరరమణీ కంకణైర్ఘనకుచ గిరౌ స్థాపిత కిన్నరీయం సరసం మ్లేచ్ఛరచనాని త్వయి స్థిరా నదయతి తే నామాని.

చేతులకు మణులతో కూడిన కంకణాలు ధరించిన ఆ స్త్రీ తన స్తనపర్వతములో కిన్నర అను పేరుగల వీణను హత్తుకొంటూ సరసమైన అన్యదేశ రచనలు కలిగిన నీ పేర్లను వీణపై స్థిరంగా పలికిస్తోంది. (ఎంతగా ఆవిడని కరగించావో! ఆవిడగారు నీ పేర్లు వీణలో పలికిస్తూ తాదాత్మ్యంలో కరిగిపోతోంది!)

2. కలరవ కంపిత కంఠవిలసనం కిలకిలమేళన కిన్నరీయం లలనా కావా లంఘితవాద్యం తిలకయతి తదా తే నామాని.

పావురంలా వణుకుతున్న కంఠవిలాసంతో కిలకిలధ్వనుల మేళనమున్న కిన్నరవీణతో వాయిద్యాల ధ్వనిని మించిపోయేటట్లు ఈ అమ్మడెవరయ్యా బాబూ! నీ పేర్లను ఆ వీణాధ్వనిలో మాకు దర్శింపచేస్తోంది.

3. నిరతమూర్ఛనా నిబిడతాళరవ గిరాయోజిత కిన్నరీయం తరుణీరణయతి తదా సమీపే తిరువేంకటవర తే నామాని.

ఎప్పుడూ స్వరమూర్ఛనలతో (సప్తస్వరములయొక్క ఆరోహణావరోహణములను మూర్ఛనలందురు) దట్టంగా ఉన్న తాళాలమోతతో, వాక్కులతో కూడిన ఈ కిన్నరవీణను నీ సమీపములో కూర్చొని ఇంకొక తరుణి ఓ తిరుపతిదేవా! నీ పేర్లు వచ్చేటట్లుగా మోగిస్తోంది.

అన్నమయ్య "తవమాం ద్రష్టుం" మూలాన్ని పైకి చదువుతుంటే వీణలు మ్రోగుతున్నట్లుగా ఉంటుంది. క్వాపివీణా శ్లోకం వ్రాసిన కవి – ఈ సంస్కృతకీర్తన వ్రాసిన కవి ఒకటే అని అంతరాత్మ పలుకుతున్నది.

తాను సంస్కృతంలో వ్రాసిన అంగనామంగనా... మొదలయిన శ్లోకాలలోని కొన్ని మధురభావాలను ముచ్చటపడి తెలుగులోకికూడా అన్నమయ్య అనువదించినట్లుగా ఈ తాళ్లపాక సాహిత్యాన్ని చదువుతుంటే అనిపిస్తుంది. ఎచ్చటఁ జూచిన నితఁడై కృష్ణుడు (29–31), ఒక్కొక్క సతినడుమ నొక్కొక్కరూపు గైకొని (22–146), వాలి మబ్బులు కవిశీ వన్నెమేనను(17–320), అట్టె నాట్యము లాడఁగ అంకించిపాడఁగాను ఇట్టునట్టు వీణలు వాయించఁగాను (23–454), నిగిడి నెన్నడుమనే నెమలియుఁ జెలరేఁగె మిగుల విభునికాంతి మేఘోదయమున (26–121) ఈ కీర్తనలు సంస్కృత శ్లోకాల భావ ఛాయలో నడిచినవి.

మొత్తము మీద లీలాశుకుని కాలనిర్ధారణ జరిగేటంతవరకు ఈ అంగనామంగనా శ్లోకాలకర్త అన్నమయ్యే అని, ఎవరో ప్రక్షిప్తకారులు ఈ మూడు శ్లోకాలను లీలాశుకుని గ్రంథంలోకి చేర్చి ఉంటారని, అన్నమయ్య సంకీర్తనల సాక్ష్యంతో నా హృదయం చెబుతున్నది.

ముగింపు

ఈత రానివాడిని సముద్రం ముందు నిలబెట్టి 'నువ్వు ఈత కొట్టి రత్నాలను బయటికి తీసుకురా' అన్నట్లు ఉంది నా పరిస్థితి. నాకున్న సాహిత్యబలమెంత? నేనెంత? కానీ, మూడు విషయాలు ఈ ముందుమాట రాయడానికి నన్ను ఒప్పించాయి.

90 ఏళ్ళ వయస్సులో తాళ్లపాక శేషాచార్యులు వ్రాతప్రతిలోని అన్నమయ్య పదమంజీరస్వనాలను క్రమబద్ధం చేసి తాను వింటూ భవిష్యత్ తరాలకి ఉపయోగపడటం కోసం వాటిని ఒకచోట చేర్చి, వాటి రంగు రుచి వాసనలను విడమరిచిన ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారి అద్భుతశేముషి–దానికంటే ముందు వారి కృషి– నా ఈ ముందుమాట అనే అక్షరాభ్యాసానికి ప్రేరణ కలిగించింది.

తాము ప్రచురించబోతున్న ఈ గొప్పపుస్తకానికి నాచేత ముందుమాట వ్రాయిద్దామని వేటూరివారు చెప్పిన వెనువెంటనే అంగీకరించిన 'పద్మభూషణ్' శ్రీ వరప్రసాద్‌రెడ్డిగారి సౌజన్యం, వారికి నాపై ఉన్న అభిమానం ఈ కలం ముందుమాట గళం విప్పడానికి కారణమైంది.

దాదాపుగా ఒక దశాబ్దం అయిందేమో–శంకరరావుగారి నోటినుండి ఈ శేషాచార్యులు వ్రాతప్రతి మాట విని. అన్నమయ్యకు దొరికిన మరొక చినతిరుమలాచార్యులు మా శంకరరావుగారు. మేమందరం అన్నమయ్య సాహిత్యమనే రుచిగల పదార్థం దొరికిన తరువాత దానిని ఆస్వాదిస్తూ మైమరిచిపోతున్నాం. శంకరరావుగారు కూడా మాతో సహపంక్తి భోజనం చేస్తూనే మేము ఇంత వరకు ఆస్వాదించని అన్నమయ్య సాహితీపదార్థాన్ని తన కఠోరశ్రమతో ఈరోజు బయటికి తీసుకువచ్చి మనముందు ఉంచుతున్నారు. శంకరరావుగారి పరిశోధనాసక్తి నా ఈ ముందుమాట రాయడానికి ఇంకొక కారణం.

తిరుమల వేంకటేశుని లీలలను అర్థం చేసుకోవటం ఎంత కష్టమో, శాసనాలలో, వ్రాతప్రతిలో ఉన్న అన్నమయ్య కీర్తనలను పరిష్కరించటం అంతే కష్టం. ఈ దుష్కరకార్యక్రమాన్ని నెరవేర్చిన శ్రీ వేటూరి ఆనంద మూర్తిగారు, శ్రీ శంకరరావుగారు అభినందనీయులు.

అందంగా ప్రచురిస్తూ భావితరాలకు అన్నమయ్య నిధానాన్ని అందుబాటులో ఉంచుతున్న 'పద్మభూషణ్' వరప్రసాదరెడ్డిగారికి అన్నమయ్య అభిమానులమందరం ఋణపడి ఉంటాం. వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఒక ధార్మికగ్రంథం విడిగా ప్రచురింపబడితే దానికున్న విలువ వేరు. ప్రపంచప్రఖ్యాతి వహించిన తి.తి.దే. వారి ప్రచురణ అయితే ఆ గ్రంథానికి విలువ పదింతలు పెరుగుతుంది. తి.తి.దే. ప్రచురించిన పుస్తకమంటే ఐ.యెస్.ఐ. మార్క్ ప్రామాణిక విలువలతో కూడుకొన్నది. ఇంతటి భాగ్యాన్ని కలుగచేస్తూ ఈ తాళ్లపాక సంకీర్తనల పుస్తకాన్ని ప్రచురిస్తున్న తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారులైన శ్రీ కె.ఎస్. జవహర్‌రెడ్డిగారికి, యితర దేవస్థానపు అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు. "మేలుమేలు నీ భాగ్యము మెరసె నిందరిలోన" (అన్నమయ్య 22–512).

అన్నమయ్య సాహిత్యం అపారమైన సముద్రం. ఎవడి ఓపిక వాడిది. లోతుకి వెళ్లి అన్వేషిస్తే రత్నాలు దొరుకుతాయి. ఓపిక లేకపోతే ఒడ్డున ఉన్న గవ్వలు లభిస్తాయి. స్వస్తి.

॥ఓం నమో నారాయణాయ॥

॥ఓం శ్రీ తాళ్లపాక గురుదేవ నమో నమస్తే॥

"ఇదొక భగీరథ ప్రయత్నం...!"

శ్రీహరి పాదాల పుట్టిన పావనగంగ భరతావనిని పవిత్రం చేసింది, సాగరసంగమమై ఇక్ష్వాకువంశాన్ని తరింపజేసింది. తాళ్లపాకవారి వాఙ్మయగంగ ఆ శ్రీవేంకటగిరి శిఖర విహారుని, కొండలలో నెలకొన్న కోనేటిరాయుని అభిషేకించింది. ఆ శ్రీహరి పాదతీర్థం మనందరికీ మోక్షగంగయైనది. (శ్రీహరి పాదతీర్థంబే చెడనిమందు, మోహపాశాలు గోసి మోక్షమిచ్చే మందు, ఈ సంపుటం, సంకీర్తన-263) ఈనాడు 'తాళ్లపాక సంకీర్తనలు' అనే సంచయం తెలుగువారందరికీ సుపరిచయం కాబోతున్నది! కాని దీని వెనకున్న తపన, సాధన, వాఙ్మయతపస్సు ఓ దీక్షవలే వ్రతసమానంగా నడచి ఆ శ్రీ వేంకటేశ్వరుని కృపకు పాత్రమైనవి.

ఎన్నాళ్లు, ఎన్నేళ్లు, ఎంతమంది మహానుభావుల కృషి! వెరసి ఈనాడు అందరికీ ఈ పదసంపద శాశ్వతంగా అందించబడుతుంది, వారందరికీ వందనాలు! ఆనాటి ఆ గంగ భువి నుండి దివికి దిగింది. ఈనాటి ఈ పదగంగ 'తాళ్లపాక సంకీర్తనలు' రూపంలో ఏడుకొండలెక్కి, శ్రీనివాసునికి స్వరాభిషేకం చేసి, శ్రీహరి పాద తీర్థమై అందుకున్న వారికి ఆనందాన్ని పంచుతుంది! పులకల మొలకల పున్నమి వేళ ఇది! 'అసూర్యంపశ్య' గా ఉన్న అన్నమయ్య పదకాంతులు ఈనాడు జగద్విఖ్యాతమవుతున్నాయి! 'ఇదిగాక తపము మరి యిదిగాక వైభవంబిదిగాక' అన్న అన్నమయ్య మాటలు మదిలో మెదిలి నిరతిశయమైన ఆనందాన్ని అందిస్తున్నాయి!

ఓ ఎనభై ఏళ్ల క్రితానికెళ్తే – తాళ్లపాక వంశస్థుల నుండి 'తాళపత్ర ప్రతి' రూపంలో పదనిధిగా 'తాళ్లపాక సంకీర్తనలు' పేరుతో సంక్రమిస్తున్న సంకీర్తన గుచ్ఛము ననుసరించి శ్రీ తాళ్లపాక వేంకటశేషాచార్యులుగారు కాగితపుప్రతిని తయారు చేశారు! అది 24.02.1941న మూలప్రతి ననుసరించి శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థ అధికారులు నకలు చేశారు (SVORI 6609A&B). మూలప్రతి తిరిగి శ్రీ తాళ్లపాక శేషాచార్యులుగారికి ఇవ్వబడినది. శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థకు ఆ విధంగా తాళ్లపాక శేషాచార్యుల ప్రతి చేరినది.

తాళ్లపాక శేషాచార్యుల వ్రాతప్రతిలో 289 పాటలు కలవు. అధికభాగం వేంకటముద్రతోను, మరికొన్ని కృష్ణముద్రతోను కలవు. ఇదిగాక పెదతిరుమలయ్య విరచిత "శ్రీవేంకటేశ్వర సుప్రభాతస్తవం" (ద్విపద) కలదు. ఈ ద్విపద రచన కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే ఇదివరకు పరిష్కృతమై ప్రకటింపబడియున్ననూ, ఇందు లభించినదానిలో కొన్ని ద్విపదలు అధికంగా కలవు.

తాళ్లపాక శేషాచార్యుల వ్రాతప్రతిని తొట్టతొలుతగా గుర్తించినది వేటూరి ప్రభాకరశాస్త్రిగారే! వారు 1949లో అన్నమాచార్య జీవితచరిత్రను పరిష్కరిస్తూ, సందర్భములకు తగిన సాక్ష్యములకై రాగిరేకులతోపాటు ఈ వ్రాతప్రతినీ ఆశ్రయించారు. ఆ విధంగా ఈ వ్రాతప్రతిలోని ఓ పది సంకీర్తనలను 'అన్నమాచార్య జీవితచరిత్ర' పీఠికలో పరిష్కృతపాఠాలతో ఉదహరించారు. ఈ పాటలలో రాగిరేకులలో కానరాని "పొడగంటిమయ్య", "కంటి శుక్రవారము", "వేడుకొందామా", "శరణు శరణు సురేంద్రవందిత" ఉండటము, అవి ప్రపంచమంతా పరివ్యాప్తి నొందటం చూస్తున్నాం! అయితే వారు తదనంతరకాలంలో శేషాచార్యుల వ్రాతప్రతి పరిష్కరణకు పూనుకోకపోవటానికి కారణం, అప్పటికి పరిష్కృతములు కావలసిన రాగిరేకులు, వాటిలోనున్న పాటలు వేల సంఖ్యలో ఉండటమే! అందునా మొదట రాగిరేకులలోని మొత్తం సంకీర్తనలు ప్రకటితమైతే తప్ప, ఎన్ని కొత్త పాటలు (రాగిరేకులలో లేనివి) ఈ ప్రతిలో కలవో తెలియును. అయిననూ శ్రీ శాస్త్రిగారి దృష్టి చాలా నిశితమైనది. అందుకే వారు 'అన్నమాచార్య జీవితచరిత్ర పీఠిక', పుట 65లో ఈ విధంగా తెలియయజేశారు: "క్రీ.శ. 1560కి పూర్వమే కొన్ని సంకీర్తనములు తంజావూరికి చేరి యుండును. అక్కడ సంకీర్తనములన్నియు తిరుపతి రాగిరేకుల మీద నున్నవో లేవో? శేషాచార్యులవారి తాళపత్ర ప్రతిలోని సంకీర్తనములు గూడ నన్నియు రాగిరేకుల మీది కెక్కినవో లేవో? పెదతిరుమలాచార్యుడు గూడ దినమునకొక సంకీర్తనము చొప్పున తండ్రి యానతిని రచించెను. అవి కొన్ని వేలుండవలెను గదా! కానరావు". శ్రీ శాస్త్రిగారి పరమపదానంతరం మరలా శేషాచార్యుల వ్రాతప్రతి కీ.శే. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారిచే పరిశీలింపబడినది. రాళ్ళపల్లివారు కొత్త పాటల అన్వేషణకు కాక, రాగిరేకులలోని పాఠభేదముల కొరకు, పాదముల సవరణలకు మాత్రమే ఈ ప్రతిని ఉపయోగించినారు. ఈ విషయమును వారు పరిష్కరించిన 4,5 సంపుటముల పీఠికలలో 30-03-1955 మరియు 04-10-1956 సం.లలో తెలియజేశారు.

శ్రీ శాస్త్రిగారి శిష్యులైన శ్రీమాన్ కీ.శే. అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారు తాము పరిష్కరించిన సంపుటాల పీఠికలలో వివిధ ప్రాంతాలలో సేకరించవలసిన తాళ్లపాకవారి కొత్త కీర్తనలను తెలియజేస్తూ, 8వ సంపుటము పీఠికలో "శ్రీ తాళ్లపాక శేషాచార్యుల ప్రతి" నుండి, తంజావూరి సరస్వతీ మహలులోని ప్రతి నుండి శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయము వారు వ్రాయించుకొన్న ప్రతులలోనివి సరిచూచి యిప్పటి రేకులలో కానరాని సంకీర్తనలు ముద్రించవలసియున్నవ"ని 12-03-1961 సం.లోనే తెలియజేశారు! అప్పటికి రాగిరేకుల సాహిత్యమంతా ప్రకటింపబడలేదు కాబట్టి ఇది కొంత కష్టసాధ్యమైన విషయమే! ఈ విషయాలను ఆ మహనీయులు 2002 సం.లో నాకు ప్రత్యక్షంగానూ చెప్పారు!

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగార్ల తరువాత 1953-65 సం.లలో శేషాచార్యుల వ్రాతప్రతిని తమ పరిశోధనలో భాగంగా కొంతమేర ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారు పరిశీలించారు. వీరి తర్వాత ఈ వ్రాతప్రతిని పట్టించుకున్న పరిశోధకుల జాడ కానరాదు. ఈ విధంగా ఓ అర్ధ శతాబ్దం "అసూర్యంపశ్య" గా ఉన్న ఈ వ్రాతప్రతిని కార్యకారణముల సర్వమునకూ కర్తయైన శ్రీవేంకటేశ్వరుని అపారమైన అనుగ్రహభాగ్యంతో 29-03-2005న తిరుపతి శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థ నుండి సేకరించే భాగ్యం నాకు కలిగింది. ఆ

వ్రాతప్రతిని, అందులోని సంకీర్తనలను చూసినదే తడవు, ఏదో దివ్యానుభూతి! ఓ పెద్దనిధి దొరికినంత సంబరం! ఆనందం! (నా పాలి ఘననిధానమవు నీవే!) అంతలోనే స్వామిమహిమ వెల్లడి కావడానికి మరో సందర్భం!

తిరుపతి నుండి హైదరాబాదుకు నా తిరుగు ప్రయాణం కూడా రద్దయి, మరలా స్వామివారి దర్శనానికి ఏర్పాటు జరిగింది. అది ప్రత్యేక దర్శనం! ఆ సందర్భంలో 'శేషాచార్యుల వ్రాతప్రతి' నకలును తిరుమల స్వామివారి పాదసన్నధిలో ఉంచి, తులసితో అర్చన చేశారు, తిరుమల ఆలయ అర్చకులు! ఇది కదా, స్వామి అనుగ్రహ భాగ్యమంటే! అని కనులు ఆనంద బాష్పాలతో, మనసు సంకీర్తనల మధురిమలతో పరవశించాయి!

ఇప్పుడు మరలా నా 'అన్నమయ్య సాహితీ ప్రస్థానంలో' వెనకకి వెళితే, ఇన్ని విశేషాలకు కారణభూతులైన వ్యక్తులెందరో! అందరికీ వందనాలు! వృత్తిచేత నేను హైదరాబాదు 'శాంతా బయోటెక్నిక్స్' ఉద్యోగిని! ఆ సంస్థ అధినేత పద్మభూషణాలంకృతులు డా. కె.ఐ. వరప్రసాద్‌రెడ్డిగారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలపై, సంగీత సాహిత్యాలపై ఆదరాభిమానాలు కలిగి, బయోటెక్నాలజీ రంగంలో తెలుగువారి తేజాన్ని భారతీయ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన సేవాభావ సహృదయులు వీరు! సాహిత్యంలో పిపాస కలిగిన నాకు వారు ఉద్యోగమివ్వటమేకాక, ప్రత్యేక సెలవులు మంజూరు చేసి పరిశోధన నిమిత్తం తంజావూరు, శ్రీరంగం, కుంభకోణం, మధురై మొదలైన దక్షిణదేశ ప్రాంతాలకు సైతం పంపారు! ఈ విధంగా కార్పొరేట్ రంగంలో ఒక ఉద్యోగిని సాహిత్యపరిశోధనలో జీతభత్యాలతో ప్రోత్సహించటం అరుదైన, అసాధారణమైనదేకాక మిగిలిన సంస్థలకు ఆదర్శనీయమైన విషయం! దీని ఫలితమే తంజావూరు సరస్వతీ మహలులో తాళపత్రాలలోని తాళ్లపాక కవుల కీర్తనలను సేకరించటం! అటు పిమ్మట తిరుపతి శేషాచార్యులవారి వ్రాతప్రతిని సేకరించటం!!

ఇక మలిదశలో తిరుపతి శేషాచార్యుల వ్రాతప్రతిని సేకరించటానికి ఆధారభూతమైన అంశాలను 21వ శతాబ్దపు పరిశోధన స్ఫూర్తిగా అందించటం ఆవశ్యకమైన అంశం!

1999 సం.లో తి.తి.దే., అన్నమాచార్య ప్రాజెక్ట్‌వారు తాళ్లపాక పదసాహిత్య సంపుటాలను 29 సంపుటాలుగా పునర్ముద్రించి, లభ్యమైన సంకీర్తనలన్నీ సమగ్రంగా ప్రకటించామని తెలియజేశారు! ఈ 29 సంపుటాల పీఠికలన్నీ, అన్నమాచార్య జీవితచరిత్రను సమగ్రంగా అధ్యయనం చేసిన తరువాత అనేక కొత్త విషయాలు తెలిశాయి.

అందులో ప్రధానంగా ఆసక్తిని కలిగించిన అంశం, తిరుపతి రాగిరేకులలో కాకుండా, ఇతర ప్రాంతాలలో ఉన్న తాళ్లపాకవారి సాహిత్యం! ఆ విషయాన్ని లోతుగా చర్చిస్తే...

రాగిరేకులలో లభ్యంకానివి, కాలగర్భంలో నష్టం చెందిన రాగిరేకులలోనివి, రాగిరేకులకెక్కక తాళపత్రాలలో మాత్రమే ఉన్నవి ఇలా అనేకమైన రూపాలలో తాళ్లపాకవారి సాహిత్యం దొరకవచ్చును కదా అని ఆలోచన కలిగినది. ఇటువంటి సాహిత్యం తంజావూరు, శ్రీరంగం, అహోబిలం (రంగనాథస్వామి, నరసింహస్వామి ఆలయాలలో కొన్ని రాగిరేకులు లభించాయి), మధురై, కుంభకోణం మొదలైన ప్రాంతాలకు చేరుకున్నట్లు పలు ఆధారాలు లభించాయి! ఇంతేకాక, తాళ్లపాక వంశస్థులవద్ద పారంపర్యంగా వస్తూ ఉండిన తాళపత్రముల నుండి కాగితపు ప్రతులకెక్కిన సాహిత్యం ఈ శతాబ్దపు పరిశోధనకు మూలద్రవ్యము!

21వ శతాబ్దపు పరిశోధనకు ఆరంభ సూచకంగా 'ప్రథమోపలబ్ధ స్వరసహిత శిలాలేఖము"ను పరిష్కరించిన డా. వేటూరి ఆనందమూర్తిగారే 1998లో "తంజావూరు సరస్వతీ మహలు" నుండి పెదతిరుమలయ్య విరచిత సస్వరఝొంబడ ప్రబంధాలు రెండింటిని, మరికొన్ని తాళ్లపాకవారి పదాలు తంజవూరు, తిరుపతి ప్రాంతాలనుండి సేకరించారు, సేకరిస్తూ వస్తున్నారు!

తాళ్లపాక కవికుల గురువు అన్నమాచార్యుల కీర్తనల సంఖ్యలో అనుమానం లేదు. అవి ముప్పది రెండు వేలు. శ్రీ వేంకటనాథుడు అన్నమయ్య పదహారవయేట ప్రత్యక్షమై, దినమునకొక్క సంకీర్తన తక్కువ కాకుండా సమర్పించమని ఆనతినివ్వడం, అదే ఆనతిన ఆచార్యుడు స్వామికి నివేదించుట జరిగినది. అన్నమయ్య జీవించిన కాలంలోనే సంకీర్తన రచన చేపట్టిన పెదతిరుమలయ్య తండ్రి పరమపదం పొందినవేళ నుండి శ్రీ స్వామివారు తండ్రికిచ్చిన ఆజ్ఞ తాను శిరసావహించాడు. దీనికి పెదతిరుమలయ్య సంకీర్తనల తొలి రాగిరేకు సాక్ష్యంగా నిలుస్తుంది. ఈ విధంగా పెదతిరుమలయ్య విరచిత కీర్తనలు కూడా వేల సంఖ్యలో ఉంటాయి. తరువాత కాలంలో చినతిరుమలయ్య ఆ మార్గాన్ని అనుసరించాడు. నిశిత దృష్టినిసారిస్తే, తాళ్లపాక కవులవి కీర్తనలు మాత్రమే యాభైవేలకు పైగానున్నా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఇందులో మనకు లభ్యమైన రాగి రేకులలోని కీర్తనలు పదిహేనువేలు మాత్రమే!

పైన తెలిపినదంతా తామ్రపత్రాల చరిత్ర, అందులోనున్న కీర్తనలున్నూ! మరి తాళపత్రాల చరిత్ర ఏమిటి? అందులోనున్న కీర్తనలేమిటి? తామ్రపత్రాలలోనున్న కీర్తనలే తాళపత్రాలలో ఉన్నాయా? తామ్రపత్రాలు నష్టం చెందగా అ పాటల నకలు తాళపత్రాలలో ఉన్నాయా? అనే ప్రశ్నలు తాళ్లపాక వాఙ్మయ పరిశోధకులందరికీ మదిలో మెదలవలసిన ప్రాథమికస్థాయి విషయాలు.

నా పరిశోధనకు పై ప్రశ్నలే ఆలంబన! ఈ విషయాలను సమగ్రంగా పరిశీలించిన పిమ్మట రాగిరేకులలో లేని అనేక కీర్తనలు తాళపత్రాలలో చూడటం జరిగినది. తాళపత్రాల కీర్తనల సేకరణా కార్యక్రమం ఆరంభమైనది. శ్రీరంగం, తంజావూరు, కుంభకోణం, మధురై ప్రాంతాలలో అన్వేషిస్తే తంజావూరు తాళపత్ర గ్రంథాలయంలో తాళ్లపాకవారి పదాలు లభ్యమైనాయి.

తంజావూరి ప్రతిలో 'వెంకట'ముద్రతో ఉన్న తాళ్లపాకవారి 39 అజ్ఞాతకీర్తనలను వెలికితీయడం జరిగినది. ఈ 39 పదాలతో పాటు రాగిరేకులలో లభించిన మరికొన్ని పదాలూ, 'శ్రీకృష్ణముద్రగల మరికొన్ని పదాలూ, ఈ ప్రతిలో ఉన్నాయి. అప్పటి నా యెరుకను అనుసరించి వెంకటముద్రగలవి మాత్రమే తాళ్లపాకవారి పదాలుగా భావించి అజ్ఞాతసంకీర్తనలు 39తో పాటు, రాగిరేకులకు ఎక్కి పాఠభేదాలతో ఉన్న 28 పాటలను, రాగిరేకులలో లేక వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే అన్నమాచార్య జీవితచరిత్ర పీఠికలో ఉదాహృతమైన 2 పాటలను కలిపి మొత్తం 59 సంకీర్తనలుగా లెక్క తేల్చడం జరిగింది. తంజావూరిప్రతిలో లభించిన సంకీర్తనలన్నీ శృంగారసంకీర్తనలు. ఈ ప్రతిలో మరో విశేషమేమంటే ప్రతి సంకీర్తనకు రాగంతోపాటు తాళం కూడా సూచించబడింది. రాగిరేకులలో వలెకాక, మొదట చరణం వ్రాసి, తరువాత పల్లవి, తరువాత మిగిలిన చరణాలు వ్రాశారు.

ఇక మరలా ప్రస్తుతాంశమైన శేషాచార్యుల వ్రాతప్రతి విషయానికొస్తే –

శేషాచార్యులవారి వ్రాతప్రతిని తిరుపతి నుండి సేకరించిన తరువాత అందులోని సంకీర్తనలను రాగిరేకులలోని సంకీర్తనలతో సరిచూచి, ఈ ప్రతిలోని ఎన్ని సంకీర్తనలు రాగిరేకులలో ఉన్నాయి? అవి అధ్యాత్మ సంకీర్తనలా? శృంగార సంకీర్తనలా? అచ్చుపడెనా? లేదా? వంటి విషయాలతో ఓ పట్టికను కూర్చటం జరిగింది. ఈ పట్టికయే అనంతరం ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారికి అందించాను (చూ. అక్షర వ్యాసం, ఇదే సంపుటంలోని ఆనందమూర్తిగారి మొదటిపీఠిక పుట XIV). "తాళ్లపాక కవుల అజ్ఞాత సంకీర్తనలు" శీర్షికతో ఓ పరిశోధన వ్యాసం రాసి తి.తి.దే.వారి సప్తగిరితో (ఏప్రిల్–మే, 2007) పాటు అనేక ప్రముఖ పత్రికలలో, విశేష సంచికలలో ప్రచురించటం జరిగింది.

వాటిలో ముఖ్యమైనవి కొన్ని –

1. "వివేచన", పరిశోధన పత్రిక, ఉస్మానియా విశ్వవిద్యాలయం (2006)
2. స్వర్ణోత్సవ సంచిక, శ్రీవేంకటేశ్వర ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (2007)
3. తెలుగు వాగ్గేయకారులు: అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం, ఆంధ్ర సారస్వత పరిషత్ సంచిక (2007)
4. ప్రత్యేక సంచిక, ప్రపంచ తెలుగు సమాఖ్య, జనవరి (2009)
5. ప్రపంచ తెలుగు మహాసభల సంచిక (2012)

ఇక పరిశోధన ప్రసంగాలకొస్తే – ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పాలమూరు విశ్వవిద్యాలయం, ఆంధ్ర సారస్వతపరిషత్తు, తి.తి.దే అన్నమాచార్య ప్రాజెక్టులలో ఈ వ్రాతప్రతి విశిష్టతను గూర్చి ప్రసంగించటం జరిగింది. ఆంధ్ర సారస్వత పరిషత్ (ఈనాటి తెలంగాణ సారస్వత పరిషత్)లో ప్రసంగించినప్పుడు కీ.శే. ఆచార్య బిరుదురాజు రామరాజుగారు ఈ వ్రాతప్రతిని తమకందిస్తే తమ వ్యయంతో ప్రచురిస్తామన్నారు.

"అన్నమయ్య పదగోపురం" పేరుతో 2013లో కడప ఆకాశవాణి కేంద్రంవారు ప్రసారం చేసిన కార్యక్రమంలో "తాళ్లపాక కవుల అజ్ఞాత కీర్తనల"పై ప్రసంగించటం జరిగింది. ఈ కార్యక్రమం అనంతర కాలంలో తిరుపతి, విజయవాడ, హైదరాబాదు వంటి ఇతర ఆకాశవాణి కేంద్రాల ద్వారా కూడా ప్రసారమై విశేష ఆదరణ నొందినది.

భారత కేంద్రప్రభుత్వ ప్రసార సంస్థ, ప్రసార భారతివారు శేషాచార్యులవారి వ్రాతప్రతిలోని కొన్ని సంకీర్తనలను "అన్నమయ్య అపురూప సంకీర్తన"ల పేరుతో శ్రీమాన్ యస్పీ బాలసుబ్రహ్మణ్యం మరియు శ్రీమతి నిత్యసంతోషిణిలతో గానం చేయించి శ్రవ్య గీతమాలికను విడుదల చేశారు.

కొన్ని సంకీర్తనలను కర్ణాటక శాస్త్రీయ సంగీత విద్వాంసులు శ్రీ గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌గారు మరియు శ్రీ సత్తిరాజు వేణుమాధవ్‌గార్లు స్వరపరిచి గానం చేశారు.

289 సంకీర్తనలు, పెదతిరుమలాచార్యులవారిచే ద్విపదశైలిలో రచింపబడిన 'శ్రీవేంకటేశ్వర సుప్రభాత స్తవము'లను తమ అపారమైన పరిశోధన ప్రతిభతో పరిష్కరించి జాతికి అందిస్తున్నారు ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారు!

ఈ వ్రాతప్రతి పరిష్కరణ విషయికంగా–ఓ దశాబ్దానికిమించి వారి పర్యవేక్షణలో వ్రాతప్రతిలోని సంకీర్తనలను పరిశీలించటం, అకారాది క్రమంలో కూర్చటం, తంజావూరు ప్రతులతో సరి చూడటం, రాగిరేకుల సంకీర్తనల పాఠాలు పరిశీలించటం, తుది పాఠాలను అక్షరబద్ధం చేయటం... ఇలా అనేకమైన అంశాల సమాహారంగా కృషి పరిఢవిల్లినది! ఈ క్రమంలో ఓ మూడు పర్యాయాలు బెంగుళూరు వెళ్ళి ఆచార్య ఆనందమూర్తిగారి ముఖతః సాగిన పరిష్కరణయజ్ఞంలో ప్రత్యక్షంగా పాల్గొనటం జరిగింది. ఇంతటి బృహత్తర పరిష్కరణలో సంగీత సాహిత్య నాట్య అలంకార శాస్త్ర సమన్వితమైన అనేకమైన విషయాలను, తాళ్లపాక కవులకు సంబంధించిన చారిత్రక సత్యాలను ఆచార్య ఆనందమూర్తిగారి నుండి నేరుగా తెలుసుకున్నాను. ఇందులకు వారికి శతధా ధన్యవాదాలంటే, కృతజ్ఞతలంటే చాలా చిన్నమాటే కాగలదు! 'నీ నామము వెల సులభము, ఫలమధికము' అని అన్నమయ్య అన్నట్లుగా నా ఆసక్తి అల్పమైననూ, శ్రమ స్వల్పమైననూ ఆనందమూర్తిగారు నా కనుగ్రహించిన జ్ఞానసంపద అపారమైనది.

పరిష్కరణ దశలో ఆచార్య ఆనందమూర్తిగారు భావి పరిశోధకులకు మూలద్రవ్యమనదగిన అనేక విషయాలను ప్రస్తావించారు. వాటిలో అతిముఖ్యమైనది "భావకోశం." పదాలకు అర్థాలను సాధించటం ఒక ఎత్తయితే – దానిని మించి సమభావంకల పదాల ఆధారంగా వివిధ సంకీర్తనలలోని భావాన్ని అవగతం చేసుకోవటానికి భావకోశం సాధికారికంగా ఉపయోగపడుతుంది. అందుకు తాళ్లపాకవారి సాహిత్యం ఓ సాగరగర్భం! సంగీత, సాహిత్య రత్నాకరం! తాళ్లపాకవారి పలుకుబళ్లతో రాబోయే కాలంలో ఈ భావకోశం సిద్ధించునుగాక!

ఇక ఈ ప్రతిలోని కొన్ని సంకీర్తనలు వివిధ భౌగోళిక ప్రాంతాల ప్రస్తావనతో చారిత్రక విషయాలను, ఆలయాలను, అక్కడి దైవతాలను మన ముందు ప్రత్యక్షం గావిస్తున్నాయి! అందులో కొన్నిటిని ఇక్కడ ప్రస్తావన చేయాలి.

1. ఎటువంటి రాజీకమే చెలియ : గోరంట్లసీమ, మధ్యదేశము (మహారాష్ట్ర ప్రాంతము కావచ్చును) మధురాపురము, కాశ్మీరమండలము, కుంతలరాజ్యము, కుంభకోణము, గోలకొండ వంటి ప్రాంతాల ప్రస్తావన ఈ సంకీర్తనయందు కలదు.

2. కురునూతల చెన్నకేశవ : తాళ్లపాక కవులు అనేక ప్రాంతాలలో వెలసిన చెన్నకేశవుని తమ సంకీర్తనలలో కీర్తించారు. విశేషించి ఈ ప్రతి మూలాన కడపజిల్లా కురునూతల చెన్నకేశవుని గురించి తెలియవస్తుంది.

3. తెరువు వెంట వచ్చే వరదరాజులను మరియు దేవరకే చెల్లెనో దేవరాజ : కంచిలోని వరదరాజ స్వామిని కీర్తించిన పాటలు.

4. శంఖమా పోయివత్తునా చక్రమా పోయివత్తునా : ఈ సంకీర్తనలో ఆనాడు తిరుమలలో ప్రసిద్ధమైన "నీడతిరుగని చింతచెట్టు" ప్రస్తావన కలదు.

అన్నమాచార్య చరిత్ర పీఠికలో (పుట.11) శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు చింతచెట్టును గూర్చి ఈ విధంగా ప్రస్తావించారు–

అడిపడిదగ్గఱనే గొప్ప చింతచెట్టు నేడును గలదు. శ్రీ వేంకటేశ సేవాక్రమమున నది ప్రస్తుతి గన్నది. అన్నమాచార్యుడు దీని పేర్కొన్నట్టు లేదు.

చించా మున్నిద్రసుభగాం దివ్యాం తన్మూలత శ్శుభే।
శ్రీనివాసపదాంభుజే స్వసంకల్పాత్ సముత్థితే॥
తన్మూలత స్స్వయంవ్యక్తా సరోయోగిముఖానపి।
లక్ష్మీనృసింహం శేషాద్రిం ప్రణిపత్య కృతాంజలిః॥

– శ్రీవేంకటేశసేవాక్రమః

5. రారా నన్నేలుకోరా తిరువళ్లూరి వీరరాఘవ : తిరువళ్లూరులోని వీరరాఘవుడిని కీర్తించిన పాట.

6. చక్రమల్లూరి సౌందరనాథ : శ్రీవైష్ణవ సంప్రదాయంలో విశిష్టమైన దివ్యక్షేత్రాలలో ఒకటి చక్రమల్లూరు. ఇది తిరువళ్లూరుకు సమీపంలో ఉన్నది. ఇక్కడ కొలువైన సౌందరనాథునిపై వెలయించిన శృంగార సంకీర్తనమిది.

ఈ వ్రాతప్రతిలో మరో ముఖ్యాంశం శ్రీకృష్ణముద్రతో తాళ్లపాకవారి పదాలు లభ్యం కావటం! ఇది నూతనపరిశోధనకు తావిస్తున్నది. అలాగే చిన్నన్నకృతంగా భావించే సంకీర్తనలూ ఇందున్నాయి.

పై విషయాలన్నీ తాళ్లపాక కవులపై పరిశోధన గావించదలసిన రసికులకు ఊటబావి!

తాళ్లపాక అక్షర స్వరూపం: ఇప్పటివరకూ వచ్చిన వివిధ సంపుటాలలో తాళ్ళపాక మరియు తాళ్లపాక ఆరోపాలు రెండూ ముద్రణలో ఉన్నాయి. కాని ఉచ్చారణలో తాళ్లపాక మాత్రమే వినిపిస్తున్నది. ఈ సందర్భంలో రాగిరేకులను పరిశీలించగా తాళపాక, తాళ్లపాక (అధ్యాత్మ, శృంగార సంకీర్తనల అవతారికల రేకులు) అను రూపాలు కనిపిస్తున్నాయి. అందువల్ల ఈ సంపుటంలో తాళ్లపాకను ప్రామాణిక స్వరూపంగా స్వీకరించటమైనది.

తాళ్లపాక కవుల సంకీర్తనల కొరకు ఇంకనూ అన్వేషించవలసియున్నది, కొన్ని రాగిరేకులు, తాళపత్ర గ్రంథాలు ఆనాడే తిరుపతి మరియు కడపజిల్లాలోని తాళ్లపాక వంశస్థుల ఇళ్ల నుండి ఇతర ప్రాంతాలకు తరలినట్లు (చూ. అన్నమాచార్యచరిత్ర పీఠిక పుట. 92 మరియు తాళ్లపాక పదసాహిత్య సంపుటాలు (8 & 11) పీఠికలు, పరిష్కర్త అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు) తెలుస్తున్నది, తిరుపతి, అహోబిలం, తంజావూరు, శ్రీరంగం, మధురై, కుంభకోణం, మేలట్టూరువంటి ప్రాంతాలలో తాళపత్రాలు, మౌఖికసాహిత్యంలో ఉన్న తాళ్లపాకవారి కీర్తనలను సేకరించవలసిన ఆవశ్యకత ఎంతో యున్నది. నా వంతు కృషి చేస్తూనే, భావి పరిశోధకులు ఇందుకొరకు ప్రయత్నిస్తారని కొండంత ఆశతో అందులకై ఆ స్వామిని ప్రార్థిస్తున్నాను.

రాగిరేకుల పరిష్కరణతో పోల్చినపుడు శేషాచార్యుల వ్రాతప్రతి పరిష్కరణ కష్టసాధ్యమైన విషయం! అందుకు కారణాలెన్నో, చిక్కుముడులెన్నో, కలగలుపులెన్నో, సందిగ్ధతలెన్నో! తాళపత్రాలలోని సంకీర్తనలను వ్రాతప్రతికి

మార్చటం కూడా ఒక కారణం! మూలద్రవ్యమైన తాళపత్ర ప్రతి కోసం కూడా ప్రయత్నించడం జరిగింది, కాని ఫలితం ఎండమావే! కాని ఎక్కడో ఓ మూల ఆశ! ఎన్నటికైనా దొరకకపోవునా అని! ఆపై భగవదేచ్ఛ!

శేషాచార్యులవారి వ్రాతప్రతిలోని సంకీర్తనలు చాలా శైథిల్యం చెందినరీతిలో నున్నవి. సంక్లిష్టతతో కూడినవి, అనేకచోట్ల కలగలుపులు, చిక్కుముడులతో పెనబడినవి. పరిశోధనలో మరో మాతృకగాని, ఆలంబనగాని లేని కాగితపుప్రతి యిది. ఇలాంటి వ్రాతప్రతిని 90 సం.ల వయసున సైతం పరిష్కరించి, భావి పరిశోధకులకు స్ఫూర్తిని, ప్రేరణను కలిగిస్తూ, అనేక చారిత్రకాంశాల ప్రస్తావనతో విపులమైన పీఠికతో "సంకీర్తన నైవేద్యం"గా శ్రీవేంకటేశ్వర స్వామివారికి సమర్పించి, ఆ 'సంకీర్తన ప్రసాదాన్ని', శాశ్వతనిధిగా మనందరికీ అందిస్తున్న ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారి పాదపద్మములకు ప్రణతులు సమర్పించటం నా కర్తవ్యం!

చారిత్రకాంశాలతో కూడిన సంకీర్తనలను తాళపత్రాలనుండి సంగ్రహించి, కాగితపు ప్రతిగా రూపాంతరం చేసి ఈ (వి)జ్ఞాననిధిని మనందరికీ అందించిన శ్రీమాన్ తాళ్లపాక శేషాచార్యులవారికి తెలుగుజాతి, ప్రత్యేకించి అన్నమయ్య పదప్రేమికులు ఋణపడియున్నారు! వారికి నమోవాకములు! అలాగే మూర్తిమంతమైన అన్నమాచార్యులవారి జీవితచరిత్ర ప్రతిని అందించిన శ్రీమాన్ తాళ్లపాక సూర్యనారాయణయ్యగారిని ఈ సందర్భంలో స్మరిస్తూ ప్రణతులు సమర్పిస్తున్నాను.

ఈ సంపుటంలోని 289 సంకీర్తనలలో 65 సంకీర్తనలు రాగిరేకులలో ఉండి పరిష్కృతాలు కాబడి, తి.తి.దే. తాళ్లపాక పదసాహిత్య సంపుటాలలో అచ్చు కావడంచేత ఆ సంకీర్తన పాఠాలనే యధాతథంగా స్వీకరించటం జరిగింది. ఈ సందర్భంలో ఆయా పరిష్కర్తలకు ధన్యవాదాలు సమర్పించుకుంటున్నాము.

ఇక ఇంతటి విశాలమైన వాఙ్మయాన్ని తెలుగువారందరికీ అందించాలనే దొడ్డ సంకల్పం మాన్యులు శ్రీ డా. వరప్రసాద్‌రెడ్డిగారిది. ఎన్నో ఏళ్లనుండి సంయమనంతో తి.తి.దే శ్రీకార్యనిర్వహణాధికారులతో ఈ వ్రాతప్రతి ప్రచురణ విషయమై అలుపెరగని రీతిలో చర్చలు జరుపుతూ ఈనాటికి ఈ యజ్ఞాన్ని పరిసమాప్తి గావించి అవభృథతీర్థాన్ని మనందరికీ అందించిన వరప్రసాదులవారికి గుండెగుడిలో నింపుకున్న భక్తితో, మనసా నమస్సులు, కృతజ్ఞతలు!

నా పరిశోధన తొలిదశలో ప్రోత్సాహమిచ్చి అన్నమయ్య సాహితీరంగంలో పాదుకొని తరించటానికి మూలకారణమైన 'అన్నమయ్య పదకోకిల', 'పద్మశ్రీ' డా. శోభారాజుగారికి పాదాభివందనాలు, కృతజ్ఞతలు సమర్పిస్తున్నాను.

ఈ పుస్తకానికి అడిగినదే తడవుగా, తాళ్లపాక సాహిత్యచరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పీఠిక "తాళ్లపాక పాటల మాటల మూటలు" అందించి నన్నాశీర్వదించిన పెద్దలు, అన్నమయ్య పదసేవక బిరుదాంకితులు డా॥ తాడేపల్లి పతంజలిగారికి వేల వందనాలు. డా॥ పతంజలిగారు వందలకొలది అన్నమయ్య సంకీర్తనలకు చక్కటి వ్యాఖ్యానం అందించి అన్నమయ్య పదప్రచారంలో అగ్రేసరులైనారు. వారు ఈ సంపుటానికి ముందుమాటను

అందించటమే కాక, 'ఆహా శ్రీవేంకటాద్రినాథురే' (సంఖ్య: 30) సంకీర్తనను పరిష్కరించి వ్యాఖ్యానాన్ని అందించారు! వారికి ఈ సందర్భంలో మరోమారు ధన్యవాదాలు!

2005 సం.లో ఈ వ్రాతప్రతి నకలును అడిగిన వెంటనే అందించిన SVORI పూర్వ సంచాలకులు శ్రీ వేమూరు వేంకటరమణారెడ్డిగారికి ధన్యవాదాలు. పరిశోధన విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ప్రోత్సహిస్తూ వస్తున్న వెంకటగిరి సంస్థానాధీశులు, శ్రీ వేంకటేశ్వర భక్తిఛానల్ ఛైర్మన్ శ్రీ వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్రగారికి ధన్యవాదాలు! ఈ సంపుటం లోకం వెలుగు చూడాలని గాఢంగా అభిలషించినవారిలో మరొకరు శ్రీ వే.ఆ.కృ.(వి.ఎ.కె.) రంగారావుగారు. తమదైనశైలిలో లేఖలు రాసి ప్రోత్సహించిన శ్రీ రంగారావు గారికి ధన్యవాదాలు.

సర్వశ్రీ తాళ్లపాక శేషాచార్యులు, తాళ్లపాక సూర్యనారాయణయ్యగార్ల ఛాయాచిత్రములను అడిగిన వెంటనే పంపిన శ్రీ తాళ్లపాక హరినారాయణాచార్యులవారికి ధన్యవాదాలు. ప్రస్తుతం శ్రీ హరినారాయణాచార్యులుగారు తిరుమలలో శ్రీవారి సుప్రభాత సేవాకైంకర్యంలో తరిస్తున్నారు.

అముద్రితాలుగా ఉన్న కొన్ని సంకీర్తనలను సుజనరంజని "అన్నమయ్య పదమందాకిని" పుస్తకంలో ప్రచురించిన శ్రీ మహీధర సీతారామశర్మగారికి ధన్యవాదాలు!

నేను బెంగుళూరు వెళ్లిన ప్రతిసారి నాకు చక్కటి వసతి సదుపాయం కల్పించటమేకాక, విలువైన ఈ గ్రంథానికి ముఖ్యసూచనలందించిన సాహితీమిత్రులు డా॥ అద్వితీయ దీక్షిత్‌గారికి, వారి కుటుంబానికి ధన్యవాదాలు.

ఈ సంపుటి ప్రాథమికదశలో డి.టి.పి. చేసి సహకరించిన శ్రీ తొడుపునూరి నవీన్‌కు ధన్యవాదాలు.

ఈ పుస్తకం ఈ విధంగా తొలుతటి అన్నమయ్య కీర్తనల సంపుటాలవలె శ్రద్ధగా తీర్చుతీర్చి మీ ముందుకు తీసుకురావడమేకాక, నిర్మాణాత్మకమైన సూచనలిచ్చి ప్రధానపాత్ర పోషించిన శ్రీ మోదుగుల రవికృష్ణకి (కో–ఆర్డినేటర్, పుస్తకప్రచురణ విభాగం, VVIT నంబూరు) కేవలం ధన్యవాదాలతో కృతజ్ఞత తీరదు.

ఈ పుస్తక పరిష్కరణకు కరోనా వైపరీత్యం కొంత అవరోధం కల్పించినప్పటికీ స్వామి కృపచే దానిని కూడా అధిగమించి ముందుకెళ్లగలిగాం! అందుకు వేంకటనాథునకు వేవేల ప్రణతులు!

పదిహేనేళ్ల ఈ పుస్తకప్రయాణంలో నా వెన్నంటి ఉన్న తల్లిదండ్రులు శ్రీ గంధం గంగయ్య, శ్రీమతి అలమేలుమంగలకు పాదాభివందనాలు, నాలో భాగమై నాతో నడుస్తున్న నా ధర్మపత్ని శ్రీమతి లక్ష్మీలావణ్యకు నిండైన మనసుతో ధన్యవాదాలు, ఆశీస్సులు.

"తాళ్లపాక సంకీర్తనలు" ను తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణగా స్వీకరించటంతో ఈ సంపుటానికి సాధికారత సిద్ధించి, తాళ్లపాక పదసాహిత్యంలో ప్రత్యేక సంపుటంగా శాశ్వతస్థానాన్ని పొందింది. ఇందులకు ప్రధానకారకులైన తిరుమల తిరుపతి దేవస్థానముల శ్రీకార్యనిర్వహణాధికారులు డా॥ కె.యస్. జవహర్‌రెడ్డి, I.A.S గారికి ధన్యవాదములు, కృతజ్ఞతలు సమర్పించుకుంటున్నాను.

శరణాగతులకు ఆశ్రితకల్పవృక్షమైన ఆ శ్రీవేంకటేశ్వరుని శ్రీపాదాలకు ప్రణమిల్లుతూ, ఆ స్వామి పాదాలనభిషేకించిన శేషాచార్యులవారి వ్రాతప్రతి సంకీర్తన గంగ శ్రీహరి పాదతీర్థంగా అనతికాలంలోనే అందరికీ అందాలనీ, సంగీత సాహిత్య నాట్య ప్రవచనాలతో పరివ్యాప్తం కావాలని ఆ దేవదేవుణ్ణి వేడుకొంటూ...

ధర నెవ్వరు వేడినా – తగ నందరిని
తిరువేంకటనాథుడవై – వరమిత్తువు వరదరాజ

(ఈ సంపుటిలో 164వ సంకీర్తన)

ఈ భగీరథ ప్రయత్నం సాఫల్యం చెంది, ఈనాడు సంకీర్తన గంగతో అవబృథస్నానం చేస్తున్నందుకు సంతసిస్తూ...

తిరువేంకటాచలాధిపు నిజధ్యానంబు
నరులకును సోమపానంబు గావలదా
పరగ నాతని కృపాపరిపూర్ణజలధిలో
నరుహులై యవబృథంబాడంగవలదా

(తాళ్లపాక పదసాహిత్యం, సంపుటం,1 – సంకీర్తన 40)

శ్రీవేంకటేశ్వర చరణ శరణాగతుడు,
అన్నమయ్య పదదాసుడు,

– గంధం బసవ శంకరరావు

సంకీర్తనాక్రమం

1	అంగనామణి	5
2	అకటకటా! యింతలోనె	6
3	అక్కరో తానేటి కలిగినాడే	7
4	అతివె ఉపరతియను వర్షాగమంబు	8
5	అదె వచ్చె చెలియ	9
6	అని చెలులు జయవార్త	10
7	అనువెరగంగలేని	11
8	అయ్యయ్యో! వేంకటరమణా!	12
9	అయ్యో! నా వెతకుగా	13
10	అయ్యో! నీవెంత సేసినా	14
11	అయ్యో! రామామణి!	15
12	అయ్యో! యేమరి	16
13	అయ్యో! హా! నిను బాసి	17
14	అరయ నాలుగు జాతులందా	18
15	(అల) మంగ చూపులో	21
16	అలయ గౌగిట నోలలాడు	22
17	అలరఁజంచలమైన	23
18	అలికి (అళులు) సంపెంగ	24
19	అలివేణి జవ్వనం	25
20	అలుగక కూటమి చవి	26
21	అవునయ్యా! లెస్స	28
22	ఆటదానవె పో నీరజదళాక్షి!	30
23	ఆటది జాణ కాకుంటే	31
24	ఆన పెట్టుదువు నీవప్పటి	32
25	ఆపరాని వలపాయ	34
26	ఆపాటి కీపాటి	35
27	ఆమని కాలమునై–భామ!	36
28	ఆయనాయ	37
29	ఆయెబోయె నింకనేటి	38
30	ఆహా శ్రీవేంకటాద్రినాథురే	39
31	ఇంకనేలే నీవు నాతో	45
32	ఇంత తరితీపులేలే?	46
33	ఇంత నేరకుండిన దేఁటి	47
34	ఇంత సేసితివి నీవే	48
35	ఇట్టె నా సేవలును	49
36	ఇది నమ్మరాదు	51
37	ఇన్ని యుపాయము లింక	52
38	ఇరు కత్తులొక్క యొర	53
39	(ఈ) జవ్వనంబేలె బాలా	54
40	ఈ తప్పు జేసినందుకా	56
41	ఈయవే నాకభయంబు	57
42	ఈలాగు ప్రాణేశు	58
43	ఉత్తమము చెప్పబోతే	59
44	ఉవిదతనులత	60
45	ఎంతకత నడిపితివి	61
46	ఎంతగాలమొకదా	62
47	ఎంతదొరవైన నీవు	63
48	ఎంత నెరజాణడమ్మ	64
49	ఎంత మాయదారివాడు	65
50	ఎంత మాయదారి	66
51	ఎంత మేలు చేసినదో	67
52	ఎంత రాతి మనసుది	68
53	ఎంత సేసినా సేయనీ	69
54	ఎటువంటి మోహమో	70
55	ఎటువంటి రాజీకమే	71
56	ఎటువంటివాఁడవో	72
57	ఎటువలె నా ప్రాణేశుని	73
58	ఎట్టుగలిగెనె లలన	74
59	ఎట్టు గలిగెరా మోహమింతలో	75
60	ఎదురుగా వచ్చేవు	76
61	ఎన్ని తపంబులు	78
62	ఎమ్మె నెరపుదాని	79
63	ఎలనాగ నేనేమైన	80
64	ఎలనాగ! పంచాంగ	81

65	ఎలనాగ యాలౌట	82
66	ఎవ్వరికి జెప్పరా	83
67	ఏకాలము నామనే	84
68	ఏటికని నే వగతునో	86
69	ఏటిపొందు యేఁటిగుణము	87
70	ఏటిమాటలాడేవు	88
71	ఏమని యెంచేవమ్మ	89
72	ఏమని వినేమొకో	90
73	ఏమిటను గొద లేదు	91
74	ఏమిసేతు నమ్మలాల	93
75	ఏమి సేతు నిన్ను బాసి	94
76	ఏమి సేయుదునమ్మ	95
77	ఏమి సోద్యమైన సురత	96
78	ఏమొకొ చిగురుటధరమున	97
79	ఏమొకో చూచెదరు	98
80	ఏల యలవోక సేసే	99
81	ఏలయ్య మదనచల	101
82	ఏలర? నాతో యింత	102
83	ఏల వలచితిమి	103
84	ఏ వూరికేవూరు	104
85	ఒంటినేల తిరిగేవే	105
86	ఒడలి తాపముమీఁద	106
87	ఒరిమె నెప్పుడు నివి	107
88	ఓరీ రారా! వొద్దికై రారా!	109
89	ఓహోహో యనరో పారి	110
90	కంకణ మిదిగో చూడ	111
91	కంటిఁగంటి నిలువుచక్కనిమేను	112
92	కంటి శుక్రవారము	113
93	కటకటా! అయ్యో! కాంత నింత	114
94	కటకటా! విరహు లెక్కడ	115
95	కనుపట్టె చెలికి	116
96	కప్పురపు (కళుకులు)	117
97	కరము జీడిపులుసు	118
98	కరుణానిధిం గదాధరం	121
99	కలకంఠు (లాలా)	122
100	కలిగెగా మనల	124
101	కాకకొన్నాడు నీ	126
102	కాతరపుదాన నేను	128
103	కామయాగము చేసె	129
104	కాముడు సంభ్రమము	130
105	కాముఁ డెవ్వరి నేసె	131
106	కురువనంబి తిరుమల	132
107	కొండవలె నిను జూచు	134
108	కొమ్మ నీ పలుకులకు	135
109	గందము వూసేవేలె	137
110	గారవమున శ్రీవేంకటపతి	138
111	గుజగుజ రేకుల	140
112	గుజ్జనఁగూడు వండెనె	142
113	చందమామ రావో జాబిల్లి రావో	143
114	చాలదే ఒకనాడైనను	144
115	చీచీ నరుల దేఁటి	146
116	చూచేవారికి ధర్మము	147
117	చెప్పరాదుగదే మన	148
118	చెలిమితో కూడితివి	149
119	చెలియ! నాపై యెంత	150
120	చెలులార చూడరే	151
121	చెలులారా! చేరిచూడరే	152
122	చేతకాని పనులెల్ల	153
123	చేతు లలయ పూజ	155
124	చేవమావి చిగురులివి	156
125	జీవాతుమై యుండుచిలుకా	158
126	తనకుబోదు నాకుబోదు	159
127	తప్పకజెప్పరా వోరి!	160
128	తమలోనే ఉన్నవి	161
129	తరితీపె తరుకాడు	162
130	తలఁచిన హృదయము	164

131 తలచి (పాసీ యుండ) 165
132 తలమేల కులమేల 168
133 త్వమేవ శరణం 169
134 తానట ప్రాణేశుండట 170
135 తిరుమలగురునేలు 171
136 తిరుమలయ్య విందు 172
137 తురుమున గొజ్జంగులు 173
138 తెరువు వెంట వచ్చే 174
139 తెలిసి తెలియగ 175
140 తెలిసి తెలియనివాని 176
141 తేనెను (తేగా) బోవలె 177
142 దంటమాటలనె నన్నుఁ 178
143 దిద్దుకోవలెగాక 179
144 దినదినము (మదనుడే) 180
145 దేవదేవం భజే 181
146 దేవ నావలన గుణము 182
147 దేవరకే చెల్లెనో 183
148 దేవర వంటివాడని 184
149 నందనందన 185
150 నన్నే పిలవవయ్య 186
151 నలినాక్షి యొకతె 187
152 నాకంటె నీకు 188
153 నాకింత గుట్టు 189
154 నాకు నాకె వలపు దెల్ప 190
155 నానావుపాయముల 191
156 నాయంతనే వుద్దండంబున 192
157 నారాయణతే నమో నమో 193
158 నింద నేగురు 194
159 నిండిన వేడుకలెల్ల 195
160 నిచ్చలపువాడవై 196
161 నీకుగా మావారిలో 197
162 నీకేమి జాణకాడవు 198
163 నీపొందెన్నటికి బోదు 199
164 నీమహిమ కొనియాడ 200
165 నీలశైలము వంటి 201
166 నీవనఁగ నొకచోట 202
167 నీవు గాఁగా నేను 203
168 నెట్టన (నీ)తో 204
169 నెలఁతఁ బాసి 205
170 నెలత నెడబాయనిదె 206
171 నెలతయుపరతి 207
172 నేఁడే పెండ్లివేళ 208
173 నేను మంచిదానను 209
174 నేనెట్లు తాళుదు 210
175 నేనే వచ్చేగా నీయింటికి 211
176 నేనైతే నీడేరుదు 212
177 నే మానవతినౌట 213
178 నేరుపు కలుగువేళ 214
179 పట్టరాని వయసిన్ని 215
180 పట్టాభిరామయా 216
181 పడుచ! నీ విప్పుడే 217
182 పణతి! విరహపు 218
183 పతి మాత్రమా 219
184 పనివినుము ఓ పన్నగశయన 220
185 పరమయోగిని 221
186 పసగల ద్వారకా 222
187 పసిఁడి మెరపుతీగ 224
188 పాడరే పాడరే 225
189 పాయదు మదిలో నెప్పుడు 226
190 పుట్టక తొల్లె యెన్ని నేర్చినావే 228
191 పుట్టు భోగీంద్రుడే 230
192 పులుకడిగినయట్టి 231
193 పెనఁగకురే మీరింత 232
194 పొడగంటిమయ్య మిమ్ము 233
195 పొద్దుబోదా నీకు నేమి 234
196 పొద్దువోకలివి నీకు భువిలో 235

197	పొలతి జవ్వనముపై	236
198	పొలతి మా చెలి యనుచు	237
199	పొసగంగా చెలినడు (మది)	239
200	పోఁబొయ్యే పడుచ!	240
201	పోయే నన్న పోనీఁడమ్మ	241
202	భామ శృంగారించు భావమే	242
203	భూషణము లవి యేటి	243
204	మంచి వయసుకాలము	246
205	మంచివాడ వౌదువు	247
206	మందగమన నీదు	248
207	మగఁడని యాలని	249
208	మగల మగువల	250
209	మగువలు చూడరమ్మా	251
210	మత్స్యేంద్ర కూర్మరజతాచల	252
211	మదనజోగి వచ్చె	253
212	మదనునితల్లికి మంగళం	254
213	మదము దొలఁకెడి	255
214	మదిలో మెదలెడి పతికిని	256
215	మన చేతగావు	257
216	మనసిచ్చునో మనసియ్యదో	258
217	మనసులోని విభుఁడు	259
218	మాదృశానాం	260
219	మానుమన్న మానడమ్మ	261
220	మాయలేలనయ్య	262
221	ముద్దుగారీ నమ్మ	263
222	మేలుగావలెనే వో	264
223	మేలెరిగినవాడవు	265
224	మొక్కేర చిట్టకములు	266
225	మొల్లలేలె నాకు	267
226	రచ్చలోన మగనాలిని	268
227	రమణుని చేఁతలు దక్కెను	269
228	రారా నన్నేలు కోరా	270
229	రారో దేవతలారా	271
230	రేలు నీవేల	272
231	రేలు నీవేల వెన్నెల	273
232	లాలి లాలీ లాలి	274
233	లేఁతచిగురిదె	275
234	వద్దుర చవిగా చొక్కుదు	276
235	వనితకు నీ మీది	277
236	వలచినందుకు గురుతు	278
237	వలచినదానిని	280
238	వలవనని యనుకొనే(దే)	281
239	వాని రమ్మనవే అక్కరో!	282
240	వారివారికి తె(వులు)	283
241	వారివారికిఁ దగిన	284
242	వింటివో వింటివో	285
243	విజయీభవ	286
244	విన్నవించనెట్టువచ్చు	287
245	విభుని వినయములు	288
246	వీఁడివో యిదె	289
247	వీడె నెలకొన్నాడు	291
248	వెదకి వెదకి చొప్పు	292
249	వెనకకు వాని చేత	293
250	వెలదిరో తిల్లగోవిందుని	294
251	వేఁడుకొంటె విందుగాక	295
252	వేడుకొందామా వేంకటగిరి	296
253	వేళ కొదవినవాఁడె	297
254	శంఖమా! పోయివత్తునా?	298
255	శరణాగతవత్సల	302
256	శరణుశరణు	303
257	శృంగారశీలునకు	304
258	శ్రీనివాసా! జగదేకనాయకా!	305
259	శ్రీపతివని పెద్ద	307
260	శ్రీరంగపతి ముద్దు	308
261	శ్రీవేంకటాద్రినాథురే	309
262	శ్రీవేంకటేశ్వరుడున్నాడు	310

263	శ్రీహరిపాదతీర్థంబే	311	274	సిగ్గుతోడ గొంకితేను	323
264	శోభనమే శోభనమే	312	275	సిగ్గులు బడితే	324
265	సకలం హేసఖి జానామి	313	276	సుదతికి మీరిందరూఁజుట్టాలైన	325
266	సతముగాని వారేల	314	277	సురలకు నరులకు సొరిది	326
267	సతముగావని నిన్ను	315	278	సువ్వి సువ్వి సువ్వని	327
268	సవరని యందమది	316	279	సొగటాల సురతాణి	328
269	సహజవైష్ణవాచారవర్తనుల	318	280	సొరిదినొకరి లెస్స	330
270	సారెకు నీ వోజ	319	281	హరి యితండు హరుఁడతండు	331
271	స్వామి! చిత్తాన విచారించుకో	320	282	పల్లవి లుప్తము	334
272	(స్వామి!) వేంకటరమణ	321	283	సంకీర్తన లుప్తము	335
273	సిగ్గుగల యాఁటదైతే	322	284	అంగనామంగనామంతరే	336

1. వ్రాతప్రతిలోని 20 & 171, 21 & 32, 201 & 284, 206 & 287, 207 & 288 సంకీర్తనల సంఖ్యలు పునరుక్తాలు (5).
2. 189 సంకీర్తన రేఖామాత్రంగా లభించటం వలన పూర్తిగా లుప్తముగా భావించటం జరిగింది.
3. వ్రాతప్రతిలో పేర్కొన్న మొత్తం సంకీర్తనల సంఖ్యలను పరిగణించి 289 సంకీర్తనలుగా నిర్ధారించటం జరిగింది. వీటిలో అధ్యాత్మ సంకీర్తనలు 69, శృంగార సంకీర్తనలు 215.
4. రాగిరేకులలోను, వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే అన్నమయ్య చరిత్ర పీఠికలోను పేర్కొన్నవికాక శేషాచార్యుల వ్రాతప్రతి మూలమున కొత్తగా వెలుగు చూస్తున్న సంకీర్తనలు మొత్తం 212.

సంక్షిప్త పదవివరణ

అ.చ.పీ. – అన్నమాచార్య చరిత్ర, పీఠిక
ఉ.హ. – ఉత్తర హరివంశం
కృ.క. – కృష్ణకర్ణామృతం
చి.తి. – చిన తిరుమలయ్య
తం.ప్ర. – తంజావురి ప్రతి
తా.సం. – తాళ్లపాక సంకీర్తనలు
తా.వేం. – తాళ్లపాక వేంకట శేషాచార్యుల వ్రాతప్రతి
ని.రే. – నిడు రేకులు
పూ.ము.పా. – పూర్వ ముద్రిత పాఠం
పె.తి. – పెద తిరుమలయ్య
పె.రే. – పెద్ద రేకులు
మాచు. – మాచునూరు కైఫీయత్తు
లక్ష్మీ. – లక్ష్మీనృసింహావతారం (నృసింహపురాణము)
శ.ర. – శబ్దరత్నాకరం
సా.రే. – సాధారణ రేకులు

తి.తి.దే. – తిరుమల తిరుపతి దేవస్థానములు.
SVORI - Sri Venkateswara Oriental Research Institute, Tirupati.
TMSSM Library & RI - Thanjavur Maharaja Serfoji's Saraswathi Mahal Library & Research Institute.

శుభమస్తు ॥శ్రీమతే రామానుజాయ నమః॥

తాళ్లపాక కవులు తిరువేంగళనాథుని మీఁదను అంకితముగాను విన్నపము చేసిన అధ్యాత్మ శృంగార సంకీర్తనలు.

తాళ్లపాక కవులైన అన్నమాచార్యుల, పెదతిరుమలాచార్యుల, చినతిరుమలాచార్యులవారి సంకీర్తనల ప్రారంభ రేకులలో అవతారికలను స్మరిస్తూ ఈ సంకీర్తనల సంపుటం జగదేకారాధ్యుడైన శ్రీవేంకటేశ్వరస్వామివారి చరణారవిందములకు సభక్తిక సమర్పణ.

తాళ్లపాక అన్నమాచార్యులవారు (క్రీ.శ. 1408 - 1503)

శుభమస్తు॥ శ్రీమత్తిరామానుజాయ నమః॥ స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబు
లు 1346 అగునేంటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారు యె
ండ్లకు తిరువెంగళనాథుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు 1424
అగునేంటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బ 12 నిరుధాన తిరువెంగళనాథుని మీందను అంకితముగా
ను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన అధ్యాత్మ సంకీర్తనలు॥ ॥ శ్రీవేంకటేశాయ నమః॥ ॥
సామంతం॥ పల్లవి॥ వలచి పైకొనంగరాదు వలదని తొలంగరాదు। కలికి మరుండు సేసినాజ్ఞ కడవంగరా
దురా॥—॥ అంగడి కెత్తిన దివ్వెలంగన ముఖాంబుజములు। ముంగిటి పసిండి కుంభములును ముద్దుల
సతి యుగంబులు। యెంగిలి సేసిన తేనె లితవులైన మెఱుంగు మోవులు। బంగరు మెఱిడి హారములు వెక్క సి
నిబ్రియములు॥ 1॥ కం ● భ్రమలోని వెండి పారలు గరువంబులుం ● బాలయలు కలు। య
చ్చంగనెండ్ల లోనిడలు యెడనెడ పాదములు। తెంచంగరాని వల్లెతాళ్ళు తెలివిపడని లేంత నవ్వులు। మంచితన
ములోని నొప్పులు మాంచిలోని మాంచిలు॥ 2॥ నిప్పుల ఖండం జల్లిన నూనెలు నిగిడి తనివి తీని యాసలు। దక్కి
నియుడాగిన దుర్లతమర్మములోని తాలిమి। చెప్పంగరాని మెలుగను దశ్రీవేంకటపతింగను దలు। అప్పుని కరుణాగలి
గిమను దలంబ్బురమైన సుఖములు॥ 3॥ ॥ దేసాక్షి॥ పల్లవి॥ విడవిడ్డులు వెడకేదిమందు। ఆదినంత్యము తెలి
మందు॥—॥ అడవి మందులుం గషాయములు నెల్లవారు। కడగానక కానంగాను। తొడింబడని కమందు దొ
ర్కేమా పభువినడి యాలమైన దిఅమందు॥ 1॥ లలితరసములుం డ్లైలములు నెల్లవారు। కలకాలము గొనం
గాను। చెలువైన దారకమందు చేకె మాకు ఘుఘునల విమీటి నయద్దియామందు॥ 2॥ కడిసిన జన్మరోగముల నెల్లవా
రు కడలేక వుండంగాను। అదనశ్రీతిరువేంకటాద్రి మీందిమందు। ఆదిలో మాకు పండిచ్చినామందు॥ 3॥

తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల తొలిరేకు

తాళ్లపాక పెదతిరుమలాచార్యుల సంకీర్తనల తొలిరేకు



తాళ్లపాక చినతిరుమలాచార్యుల సంకీర్తనల తొలిరేకు

1. అంగనామణి

సంకీర్తన: 68 రాగం: పంతువరాళి
వ్రాతప్రతి పుట: 69 తాళం: లుప్తము

అంగనామణి కు - రంగలోచన భు - జంగ కచభారవే
మంగళ మలమేలు - మంగవు మదన సం-గర సవ్యసాచివే ॥పల్లవి॥

గబ్బి నీ ప్రాణేశు - డబ్బిన రతుల - నుబ్బీ ముంగురులు - గొబ్బున నొడిసీ
నిబ్బరంబు నీ - గుబ్బల నురవు - దొబ్బీ యబ్బురముగా
జొబ్బిల్లు కస్తూరి - గుబ్బలచెమట - గుబ్బెత లెల్ల - గుబ్బ లనగా
మబ్బుతేలి కడు - శిబ్బితి వేళల - అబ్బలబ్బలని - అసురుసురైతివి ॥అంగనా॥

మించి నీతో నెది - రించిన విభునీ - వంచీ కౌగిట బి - గించీ మోవప్ప
ళించి తమ్ములము - నించి నీ గుణముల - నెంచి మంచి విరుల - ముంచిన శయ్యపై
నుంచి యెద తా - టించి రవము గీ - లించి రాగె బి-గించి మర్మము కరి
గించి చలము సా - ధించి మేలు పచ - రించితి వలమేలుమంగ వైతివి ॥అంగనా॥

పంకజముఖి ని - శ్శంక నాయక గ - జాంకుశ యుత న - ఖాంక వర బిరు
దాంకురాల వని - పొంక మొప్పగా - కంకణము గట్టి - అంకెల శ్రీరమణ
వేంకటేశ్వరుని - బింకముతో పరి - యంకమున మక - రాంకుని కేళిని
సుంకణగించితి - వింక నీ సాటి - (కొంకు లేనట్టివా) రింతు లున్నారా ॥అంగనా॥

పాదానికి మూడు నాలుగేసి ప్రాసయతులతో, శబ్దాలంకారములతో, చమత్కారపు గతితో, శ్రీరమణుడైన వేంకటేశ్వరుని ప్రత్యేకముద్రతో లభించిన తాళ్లపాక పెదతిరుమలాచార్యులవారి సంకీర్తనమిది. పదేళ్లక్రితం "తాళ్లపాక సంకీర్తనలు" అనే శేషాచార్యుల కాగితపు వ్రాతప్రతినుండి నేను పరిష్కరించుకొన్న పాఠానికి నేడు తంజావూరు తాళపత్రప్రతిలో మరొక చక్కని పాఠాంతరం కూడా దొరికింది.

ఇది అలమేలు మంగాంబను గూర్చిన పాట. బహుప్రాసలుగల ఇట్టి పాటలు పెదతిరుమలాచార్యులవి మరికొన్ని గలవు. కాగితపుప్రతిలో యీ కీర్తన పంతువరాళి రాగంలో ఉండగా, తాళపత్రంలో "పంచఘాతము" అనే సంగీత పరిభాషాపదముతో గుర్తింపబడి ఉంది. ఆ అయిదు దెబ్బలు ఎట్టివో సంగీతజ్ఞులు తెలపాలి.

స్వరసహితముగా లభించిన యీ సంకీర్తన తిరుపతి రాగిరేకులకెక్కని కొత్తపాట. అట్టిది లభించేలోగా, సంగీతవిద్వాంసులు దీనికి పంతువరాళి రాగంలోనే మట్టును, మెలొడిని కూర్చి పాడదగిన పాట యిది.

- వేటూరి ఆనందమూర్తి

2. అకటకటా యింతలోనె

సంకీర్తన: 276 రాగం: ఆహిరి

వ్రాతప్రతి పుట: 261 తాళం: లుప్తము

అకటకటా యింతలోనె – (అంతకు) నెంచీ నెలనాగ
యికనొక్కనాటికి చూచేనా – యిందువదన మోము ॥పల్లవి॥

ఒకకమ్మెనానంపదాయ – వునికి దెలియ వ్రాసి
సకలము మరపించిన మానిని(తొ) – సంయోగములేక ॥అకటకటా॥

పాపపు దైవము – ప్రాణసఖిని యెడబాసీనని, మొదట
ఆపరాని విరహమెచ్చీ నిద్రా – హారము లేక ॥అకటకటా॥

యేపాపంబెరుగని మానినితొ – యెవ్వరేమని జెప్పిరో
చూపోపని వారాడిన మాటకు – సుదతియలిగె నేడు ॥అకటకటా॥

స్త్రీపురుష విరహమును సూచించునదీ సంకీర్తనము! నృత్యప్రదర్శనకు యోగ్యమైనది. నాయకుడిందు శ్రీవేంకటేశ్వరుడు. 'ఇంతలోనే', 'అంతకునెంచీ' వంటి ప్రయోగములు పోతన్నగారి పలుకు చవికి నోచుకొన్నవి. సాభిప్రాయములు. నాయికా నాయకులు ప్రణయలేఖలను గాలిపటాలపై వ్రాసి ఎగురవేసికొనుట తాళ్లపాకవారి మంజరీ రచనలో కలదు.

– వేటూరి ఆనందమూర్తి

3. అక్కరో తానేటి కలిగినాడే

సంకీర్తన : 252 రాగం: సౌరాష్ట్ర
వ్రాతప్రతి పుట: 242 తాళం: లుప్తము

అక్కరో తానేటి - కలిగినాడే
మక్కువ(తో) రమ్మనవే - మలగునియనిన్నస్వామిని ॥పల్లవి॥

తోయజాక్షి! నన్నేల - దూరేవే, నే
సేయరాని పనులేమైన - జేసితినా
వెయ్యారువిధముల తా - వేడగ ముద్దిడుచు
నయ్యెడ (నా) మోవిపంట - నదిమితినింతేకాని ॥అక్కరో॥

నారీమణి! నన్నాడు - కొనంగా నేటికే?
మేరమీరి నేజేసిన - నేరము (కాగలదా)
చేరిచేరి ప్రియములు - చెప్పగనే కాగిలించి
వూరక గబ్బిగుబ్బల - నొత్తితి నింతేకాని ॥అక్కరో॥

రామ! శ్రీవేంకటప్రభుడు - రచ్చనిడనేలే
యేమైన నా వల్ల త - ప్పింతయైననున్నదే
ప్రేమముతో తానె కాచినను - కామించి కూడగ
ఆ మెయిరతులనింత - నలయించితి నింతె కాని ॥అక్కరో॥

మల+కునియ+నిన్ర+స్వామి - కొండ క్రుంగేటంత భారముగా నిలుచున్న స్వామియని భావము. 'మలై గునియ నిన్ర పెరుమాళ్' అను తమిళవాక్యమునకు తాళ్లపాకవారి తెలుగు అనుసరణమిది!

పల్లవి భావమునుబట్టి నాయిక చెలితో ప్రణయకలహమున తన తప్పులేదని చెప్పి నాయకుని కడకు రాయబారమంపుట ప్రకరణము. చుంబనాలింగనాది శృంగార చేష్టలిందు వర్ణితములు.

రాగిరేకులలోనూ 'మలగునియ నిన్నస్వామి' ప్రయోగంతో సంకీర్తనలు కలవు. ఉదా॥ మలఘుని నిన్న పెరుమాళ్లు వీడే (14-368). మలఘుని నిన్న పెరుమాళ్ళు: మలై+కునియ+నిన్ఱ+పెరుమాళ్లు = కొండ క్రుంగునట్లు నిలుచున్న దేవుఁడు. వేంకటేశ్వరుని మూలమూర్తి. 'మలై కినియ' అని, 'తిరుమలై ఒళగు' అను గ్రంథమున నున్నది. ఇందు 'కినియ'కు వ్యాపించు అని యర్థము. (రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, సందిగ్ధ పద సమీక్ష, సం. 14, పుట. 354)

- వేటూరి ఆనందమూర్తి

4. అతివె ఉపరతియను

సంకీర్తన: 24 రాగం: శ్రీరాగం
వ్రాతప్రతి పుట: 26 తాళం: లుప్తము

అతివె ఉపరతియను వ - ర్షాగమంబు
సతులార చూడ నా - శ్చర్యమై తోఁచెన్ ॥పల్లవి॥

మృగనేత్రి తురుమనే - మేఘంబు గప్పుకొనె
మగువ ముఖమను చంద్ర - మండలంబు
అగణితంబైనట్టి - యలివేణి తనుకాంతి
మిగుల నలుగడ తీగ - మెఱపు లుదయించెన్ ॥అతివె॥

కలికి గళరవమనే - గర్జనము వే బొడమె
కలయ హారములను వడ - గండ్లు రాలెన్
కొలఁది మీరినయట్టి - కుచగిరుల వరదలై
సొలయకటు పెంజెమట - సోన వర్షించెన్ ॥అతివె॥

అతివె నిట్టూర్పులుప - రతుల నలయించి
సతిబొమ్మలవి యింద్ర - చాపమైయలరెన్
వితరణంబైన దిరు - వేంకటేశ్వరుఁ గూడ
జత గూడి యంగదే - శము జవుకు బారెన్ ॥అతివె॥

తృప్తులైన నాయికానాయకుల ఉపరతిని కవి యిందు వర్షాగమముతో పోల్చి చెప్పుట ఈ శృంగార సంకీర్తనమందలి సందర్భము. తిరువేంకటేశ్వరముద్రతోగల ఈ పాట అన్నమాచార్యులకు అనుభవగానము! రసికులైన శ్రోతలకు, భావి వాగ్గేయకారులైన తన సంతతివారికి ఇట్టి రచనలు అభ్యాసగానము!

- వేటూరి ఆనందమూర్తి

5. అదె వచ్చె చెలియ

సంకీర్తన: 48 రాగం: శంకరాభరణము
వ్రాతప్రతి పుట: 49 తాళం: ఖండచాపు

అదె వచ్చె చెలియ యొ – య్యారంబుతో ప్రియుని
సదనంబు వెదలి తన – సఖులు గనకుండ ॥పల్లవి॥

నుదుటి కస్తురి చెమట – (నొసట) పదనై జార
(నదిమి వీడిన తురుము) – గుదురుపరచి
వొదిగొదిగి తనకెవ్వ – రెదురౌదురో యనుచు
పెదవిగంటి మదుపు – తుద మాటుగొంటా ॥అదె॥

నునుగుబ్బకవ గోటి – కొన జీర మరుగువడ
పెనుగెంపుబన్నసరు – లనువుబరచి
తన కెందళుకు కన్ను – లను నిద్ర సొలయగా
వనజము మూర్కొని యూర్పు – వడి నణచుకొంటా ॥అదె॥

అలసత తత్తరపడుచు – నవ్వలివ్వల గట్టు
చలువశాటివలువ – సడలగాను
అల శ్రీవేంకటరా – యని తోడి సరసపు
కలయికలు మదిలోనఁ – దలఁచుకొంటా ॥అదె॥

ఈ ప్రతిలో రాగము పేరున్నది. పాఠాంతరములకును, మేలు పాఠ నిర్ణయమునకు సంపుటము 26 పీఠికలోని సంకీర్తనమును చూచునది.

'మగువ తన కేళికామందిరము వెడలెన్' అను క్షేత్రయ్య పదం ఈ సంకీర్తన భావాన్ని పోలియున్నది.

తంజావూరి ప్రతిలోనూ ఈ సంకీర్తన కలదు.

– గంధం బసవ శంకరరావు

6. అని చెలులు జయవార్త

సంకీర్తన: 239 రాగం: సాళంగనాట

వ్రాతప్రతి పుట: 228 తాళం: లుప్తము

అని చెలులు జయవార్త – లాడుకొనగా
　　విని సిగ్గు తోడ ని – వ్వెరగందె చెలియ ॥పల్లవి॥

భామకుచదుర్గంబు – ప్రతికొండ కలుగగా
　　కామించు పతి హస్త – గత మాయను
　　ఆ మీద జవరాలి – కంతరంగుడు మరుడు
　　చేముంచి అతను కైవశమై – చెలగునటవే ॥అని॥

చెలువ మెరపుటలుగుల– సీమ చేకూడగా
　　నలవోక నీలనిధి – యబ్బే పతికి
　　చెలగు పత్రములు సతి – చెక్కులకు జోడుగా
　　వెలలేని నిధులెల్ల – విరివాయను ॥అని॥

యింతి దువ్వలువ ప – య్యెద దివియగా పతికి
　　చింత జఘనపుదీవి – చేకూడెను
　　అంతలో శ్రీవేంక – టప్ప డతివెను గూడగా
　　అంతంత చెమట ము–త్యములు ఘనమాయను ॥అని॥

పల్లవిలోని జయవార్తలను బట్టి యీ సంకీర్తనమున చారిత్రక సన్నివేశములు గర్భితములని భావింపవచ్చును. ప్రతికొండ – పత్తికొండకును, అలకలసీమ – అలుగులసీమకును ప్రతినిధులు కాబోలును.

– వేటూరి ఆనందమూర్తి

7. అనువెరగంగలేని

సంకీర్తన: 214 రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 204 తాళం: లుప్తము

అనువెరగంగలేని - దటే యాటదనము; విభుని
యెనసి మెప్పించగలేని - దేటి యాటదనమే ॥పల్లవి॥

కొదమగుబ్బల యురము - గుబ్బ వీపున వెడల
నదమకుండగలేని - దది యేటి యాట దనమే
కదిమి మోవితేనెలూరగా - (గాడిన) కెంపులు
యెదురుగుప్పగలేని - దేటి యాటదనమే ॥అనువె॥

కదిసినప్పుడె వుపరి - గతుల బొమ జంకెనల
అదరించకున్ననది - యటే యాటదనమే
పదిలముగ పతి పొనుపు - పనులకు దనుజేర
నెదురుపట్టగలేని - దేటి యాటదనమే ॥అనువె॥

వలసినంత రతుల - కలయికల వేడుకల
నలయించగా లేని - దటే యాటదనమే
అలమేలుమంగ శ్రీవేంక - టప్పని కౌగిట గూడి
యెలమికెక్కని దది - యేటి యాటదనమే ॥అనువె॥

'పుమాన్ విష్ణురితిఖ్యాతః స్త్రీప్రాయమితరం జగత్' అన్నట్లుగా ఆ దేవదేవుడొక్కడే పరమపురుషుడు. ఆతని చేరుటయే నిజముక్తి. ఈ విధంగా జీవాత్మ తన ఆడదనాన్ని పరమాత్మకు సమర్పించుటయే ఈ సంకీర్తనయందున్న సారం!

– గంధం బసవ శంకరరావు

8. అయ్యయ్యో వేంకటరమణా

సంకీర్తన: 257 రాగం: సౌరాష్ట్ర
వ్రాతప్రతి పుట: 246 తాళం: లుప్తము

అయ్యయ్యో వేంకటరమణా - ఆడుకొందురా చెలిని
గయ్యాళియని సారెసారె - కాకు సేతురా ॥పల్లవి॥

సిగ్గువడక చెప్పేవు - చెలి నిన్ను దిట్టేనని
దిగ్గన వలపుల దిట్టు - దీవెన గాదా
యెగ్గుతిని వచ్చేవు - యింతి జడ గొట్టెనని
అగ్గలంపు మోహమున - కదె గురుతు గాదా ॥అయ్యయ్యో॥

పలుమారు దూరేవు - పాదమున దన్నెనని
పొలతి గూడుట కదె - పొత్తు గాదా
కొలదెరుగ కాడేవు - కొనగోర జీరె నని
వలపు నిలుపుట కదె - వారకము గాదా ॥అయ్యయ్యో॥

పట్టిపట్టి పెనగేవు - పంటికొద్ది నొక్కెనని
వెట్టదేరు మోహపు మోవి - విందునకు గాదా
యిట్టె యలమేల్మంగ - యెద నెక్కె ననేవు
నెట్టన వేంకటరమణ! ని - న్నేలుటకు గాదా ॥అయ్యయ్యో॥

శ్రీతోను, అలమేలుమంగ నామముతోను, అలమేల్మంగా శ్రీనివాసుల యితివృత్తముతోనూ కూడుకున్న యిట్టి రచనలన్నీ పెదతిరుమలాచార్యుల రచనలుగానే భావింతును.

ఇంతి నాయకుని జడతో కొట్టడం కూచిపూడివారి 'భామాకలాపం'లో దృగ్గోచరమయ్యే అంశం. అన్నమయ్య ఆదిగా తాళ్లపాకవారి సంకీర్తనలు కూచిపూడివారి నాట్యానికి పట్టుగొమ్మలు, జీవగర్రలు. ఈ దిశలో ఇంకా అధ్యయనం కొనసాగవలెను.

ఈ సంకీర్తన తంజావూరి ప్రతిలోనూ కలదు.

- గంధం బసవ శంకరరావు

9. అయ్యో నావెతకుగా

సంకీర్తన: 258 రాగం: సౌరాష్ట్ర

వ్రాతప్రతి పుట: 247 తాళం: అట

అయ్యో నావెతకుగా ని - న్నలయింతుగా
గయ్యాళింతుగా నిన్ను - కసరుదుగా ॥పల్లవి॥

దూరుదుగా నిన్ను చాలా - తూలనాడుదుగా
పేరుగుచ్చి తిట్టుదుగా - పెరిమెబో(నాడుదు)గా
కూరిమి కొసరుదుగా - కోపగింతుగా
వూరకె అలుగుదుగా - వుప్పళింతుగా ॥అయ్యో॥

నెరసులరయుదుగా - నేరములెంతుగా
కరకరింతుగా నిన్ను - గాసి సేతుగా
నిరసింతుగా వట్టి - నిందలే గట్టుదుగా
గొరబు సేతుగా నిన్ను - గుప్పింతుగా ॥అయ్యో॥

చనవు నెరపుదుగా - సారెకు పెనంగుదుగా
మనసరసి చూతుగా - మారుత్తరాలిత్తుగా
ఘనత యలమేల్మంగ వేం - కటేశ నిన్ననే
నెనసి పాయనియ్యగా - నేమైనా సేతుగా ॥అయ్యో॥

ఓ వేంకటేశా! నీవే సర్వం; అందుకే నిన్ను విడచి (నెనసి పాయను) ఉండలేనంటుంది ఈ సంకీర్తనలోని నాయిక!

గొరబు = వేషం, వికారం.

- గంధం బసవ శంకరరావు

10. అయ్యో నీవెంత సేసినా

సంకీర్తన: 55 | రాగం: శంకరాభరణము
వ్రాతప్రతి పుట: 56 | తాళం: లుప్తము

అయ్యో నీవెంత సేసినా - వన్నియు నేనెరుగనా
(కొ)య్యతనాలు నాతోనా - గోవిందరాజ! ॥పల్లవి॥

చాల మోము (కళలెల్లా) - సందడికొనగా మోవి
మేలి(మై)న కెంజాయలు - మించగాను
వాలుగన్ను లర - వంపుచు నెత్తురు గడు
గోలవై పవ్వళించేవు - గోవిందరాజ! ॥అయ్యో॥

(పో)పురిగొన్న నూరుపుల - బుసకొట్టుచును మేన
వరదలై పెంజెమటలు - వడియగాను
విరివిగా వాసనలు - వెదజల్లు(చు)c జెదరిన
కురుల బవ్వళించేవు - గోవిందరాజ! ॥అయ్యో॥

పచ్చిసేతలతొ నీవు - బడలుచు బంగారు
పచ్చడము నిండా నా - పైc గప్పుచు
మచ్చు జల్లి యలమేలు - మంగను నను కౌcగిట
గుచ్చుక పవ్వళించేవు - గోవిందరాజ! ॥అయ్యో॥

'కొంటె చేష్టలు నాతోనా' అంటుంది గడుసరియైన నాయిక గోవిందరాజస్వామితో.

ముద్రనుబట్టి యిది పెదతిరుమలాచార్యుల రచన యనదగును. ఈ సంపుటంలో గోవిందరాజస్వామి సంకీర్తనలు:

1) అయ్యో నీవెంత (సంకీర్తన. 10)
2) ఈ జవ్వనంబేలె (సంకీర్తన. 39)
3) ఎమ్మెనెరపువాని (సంకీర్తన. 62)
4) నిచ్చలపువాడవై (సంకీర్తన. 160)

- గంధం బసవ శంకరరావు

11. అయ్యో రామామణి!

సంకీర్తన: 191 రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 184 తాళం: అట

అయ్యో రామామణి! నిన్ను జూడనిచూపు – లవి యేటి చూపులే
నెయ్యంపు నీ జోడుగూడని – నీటులవి యేటి నీటులే ॥పల్లవి॥

వెలది! నీ మోవితేనె గూడని – వీడెమది యేటి వీడెమే
కలయ నీ మేనితావి గలయని – గంధమేటి గంధమే
పొలతి! నీ కుంతలపు తేంట్లానని – పువ్వులేటి పువ్వులే
తొలక నీ చమటల దొప్పదోగని – దుప్పటేటి దుప్పటే ॥అయ్యో॥

సుదతి! నీ పలు సోకుకెనయని నీ – సోకులేటి సోకులే
పదరేటి నీ (యుడుకుల) కులకని – పానుపేటి పానుపే
పొదలు నీ చనుమొనలు నాటని – పులకలేటి పులకలే
గదియ నీ కౌగిట బిగియానని – కాయమేటి కాయమే ॥అయ్యో॥

నారీమణి! నీ నెమ్మోము ముందర – నవ్వని నవ్వులేటి నవ్వులే
గోరురేఖలు జారని నీ జవ్వాది – జారులేటి జారులే
సారె నీ పూర్పులు పైపొలయని – చలువలేటి చలువలే
యేరా వెంకటపతియని కొసరని – యింపులేటి యింపులే ॥అయ్యో॥

పురుషవిరహానికి చక్కటి ఉదాహరణ ఈ సంకీర్తన! ఈ కోవకు చెందిన సంకీర్తనలు రాగిరేకుల్లోనూ ఉన్నాయి. అన్నమాచార్యులవారితోపాటు, పెదతిరుమలాచార్యులవారి పురుషవిరహ సంకీర్తనలు ఉన్నాయి!

– గంధం బసవ శంకరరావు

12. అయ్యో! యేమరి

సంకీర్తన: 140 రాగం: గుజ్జరి

వ్రాతప్రతి పుట: 138 తాళం: లుప్తము

❖(ఈ సంకీర్తన సంపుటం 15లో 6వ సంకీర్తన. రాగిరేకు (సంఖ్య-1)లో ఈ సంకీర్తన రాగం బౌళి.)

అయ్యో! యేమరి నేనాఁడప్పుడేమై వుంటినో
అయ్యెడ నీ దాసినైతే ఆదరింతుగా ॥పల్లవి॥

అల్లనాఁడు బాలుఁడవై ఆవులఁ గాచేవేళ
చిల్లరదూడనైతే చేరి కాతువుగా
వల్లెగా విటుఁడవై రేపల్లెలో నుండేనాఁడు
గొల్లెత నయినా నన్ను కూడుకొందుగా ॥అయ్యో॥

మేలిమి రామావతారవేళ రాయి రప్పనైనా
కాలు మోపి బదికించి కాతువుగా
వాలి సుగ్రీవులవద్ద వానరమై వుండినాను
యేలి నన్నుఁబనిగొని యీడేర్తువుగా ॥అయ్యో॥

వారిధిలో మచ్చ కూర్మావతారము లైననాఁడు
నీరులో జంతువునైనా నీవు గాతువుగా
యీ రీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టే
మోరతోపున నిన్నాళ్లు మోసపోతిఁగా ॥అయ్యో॥

భగవంతునితో నిత్యానుసంధానాన్ని అభిలషిస్తున్న భక్తుని గాఢమైన కాంక్ష ఇది. నిత్యసత్యస్వరూపుడిగా భాసించే ఆ స్వామి సన్నిధిలో ఉండి నిరతమూ ఆనందం అనుభవించాలన్నదే అన్నమయ్య అభిమతం!

– గంధం బసవ శంకరరావు

❖ తాళ్లపాక పదసాహిత్య సంపుటాలనుండి యథాతథంగా స్వీకరించిన సంకీర్తనలకు, వ్రాతప్రతిలోని తక్కిన సంకీర్తనలకు సూచించినట్లుగా యతి సమస్థానాలను సూచించలేదు. ఈ నియమం సంపుటాలనుండి స్వీకరించిన అన్ని సంకీర్తనలకు వర్తించును.

13. అయ్యో! హా! నిను బాసి

సంకీర్తన: 4 రాగం: లుప్తము

వ్రాతప్రతి పుట: 5 తాళం: లుప్తము

అయ్యో! హా! నిను బాసి మ - హా మేలు గదా
తియ్యని దిట్టతనంబున - దిరుగాడే నిదిగో ॥పల్లవి॥

(చరణములు 1,2,3 వ్రాతప్రతిలో లుప్తములు)

వ్రాతప్రతి పుట 5లో పల్లవిని మాత్రమే వ్రాసి జాగా విడిచియున్నారు. అసంపూర్ణములైన ఇట్టి పాటలను విడిచి పుచ్చుటకన్న భావి పరిశోధనకై వ్రాతప్రతిలోని పాఠమును యథాతథముగా చూపుట మేలు. ఇతర ఆకరముల నుండి ఈ పల్లవిగల పాటకై, ఇతర మూలప్రతులకై అన్వేషణము గావించవలెను. (ఈ పట్టున వ్రాతప్రతిలో 6 నుండి 10 సంఖ్య వరకు గల పుటలు లుప్తములు. ఇట్టి ఘట్టములనుబట్టి ఈ వ్రాతప్రతికిని మూలమైనట్టి తాళపత్రప్రతి యొక్క ప్రాచీనతనుగూడ గుర్తింపనగును. ఇట్టి మూలప్రతి తాళ్లపాక కుటుంబమువారి కడగాని, వేరే తావులలో గానీ, భద్రముగా యుండునని, లభించుగాకని ఆశింతముగాక.)

- వేటూరి ఆనందమూర్తి

14. అరయ నాలుగు జాతు లందా

సంకీర్తన: 87 రాగం: లుప్తము

వ్రాతప్రతి పుట: 88 తాళం: త్రిపుట

అరయ నాలుగు జాతు లందా - యాయి వేళల కళల నెలవుల
వరుస లన్నియు తెలిసి కూడెడు - వాడెపో (నె)రజాణడు ॥పల్లవి॥

వొడలు యేనుగమదపు వాసన - వున్నతపు బాహువులు, చన్నులు,
కడు ప్రియము చెంగావులకు, గజ - గమన, మెత్తన దేహము
కుడుపు కొంచము, వాడిగోరును - కుంకుమము గంధమ్ము నలదును
తొడరి మన్మథకేళి జెలగును - తొలుతఝాముస హస్తిని ॥అరయ॥

నలుపు వన్నెలు, నెమలి నడపులు - నటనసేతలు, (నాటుకన్నులు),
మలయజము మృగమదము నల(దె)డు - మదనతంత్రపు పొందులు
పలుకు వేరే రెండు భాషలు - బన్నదేహము, వేపవాసన,
అలగి యంతట గూ(డు) చిత్తిణి - అతివె రెండవ ఝాముస ॥అరయ॥

మగువ యారును బాహుమూలము - మదనగేహము నిడుపు లెన్నగ,
యిగురు చన్నులు, చిత్ర వన్నెలు, - యింపుసొంపుల పాటలు,
మిగు(ల) కొంచము కడుపు పలచన, - మేను సున్నపు వాసన,
తగులు పరచును రతుల శంఖిణి - తరుణి మూడవ ఝాముస ॥అరయ॥

వాలుగన్నులు, వంచు నడవులు, - వలుద చన్నులు, ముత్తియపుసరులు,
బాలచంద్రుని బోలు (ఫాలము), - పసిడి వలిపెములు,
మే(లములు) మాటాడ నేర్చును - మేను తామర విరులవాసన
నాలుగో ఝామునను పద్మిని - నాయకుని కరగించును ॥అరయ॥

కోరి కెరిగిన జాణ మన్మథ - కోటి లావణ్యచతురుడు
శ్రీ రమావరు డమర వందిత - చరణు, (డంబుజ) నేత్రుడు,
వారిజా క్షలమేలుమంగకు - వాసుడౌ తిరువేంకటేశుడు
వారి మర్మము లెరిగి కూడిన - వాడె (నేర్పరి) జగతిని ॥అరయ॥

రతిరహస్యాది (కొక్కోకాది) కామశాస్త్ర సంబంధముగల శృంగార సంకీర్తనమిది, లక్షణకీర్తన మనదగినది. సంగీత శాస్త్రమునకు లక్షణగీతములవలె కామశాస్త్రమున కివి నిర్వచనరూప రచనలు కాబోలును. 'తిరువేంకటేశ' ముద్ర ఉండుటనుబట్టి యిది స్పష్టముగ తాళ్లపాక అన్నమాచార్యులవారి సంకీర్తన రచనయే. ఇట్టి పద్మిన్యాది శృంగార నాయికా జాతి భేదముల నెంచిన తెలుగు వాగ్గేయకారులలో అజ్ఞాతముగా ఉండిపోయిన అన్నమయ్యగారే ప్రప్రథము లైననూ మన సాహిత్య సంగీత చరిత్రకారుల దృష్టి వారిపై 1949కి పూర్వం అంతగా పడియుండని కారణంచేతనే కాబోలు వారికి రావలసిన గుర్తింపు కలుగలే దనుకొందును.

ఈ విషయంలో కాలాన్నిబట్టి అన్నమయ్యకన్నా క్షేత్రయ్య తరువాతివాడే అయినా అతని పేరే ముందుగా మన విమర్శలోకంలో వినిపిస్తుంది. డా. వి. రాఘవన్‌గారి అక్బరుషా కృత శృంగారమంజరి (1951) పీఠికలో అన్నమయ్య పేరు విశదంగా కనపడకపోవడానికి కూడా ప్రధానకారణం అదే అనుకుంటాను. కానీ యీ లక్షణపరిజ్ఞానం కన్నడాంధ్రసాహిత్యాలలో గుర్తింపబడి ఉన్నది. దాసరి లక్ష్మణస్వామిగారి సంకలనం 'వర్ణనరత్నాకరం' – 1928 ఎడిషనులోనూ ఇట్టి వర్ణనలుగల లక్షణ పద్యానువాదా లుదాహృతా లైనవి. కానీ అన్నమయ్యగారి ప్రస్తావన మాత్రం ఎక్కడా కానరావడంలేదు!

ఇంతకూ అన్నమాచార్యుల సంకీర్తన రాగిరేకులలో పద్మిన్యాది జాతిభేదాలను అన్వయిస్తూ చెప్పిన సంకీర్తనలు కొన్ని ఉన్నా (చూ. నా సిద్ధాంతవ్యాసము–1965), పూర్తి లక్షణ సంకీర్తన రచనగా చెప్పినపాట ఒక్క శ్రీ శేషాచార్యుల వ్రాతప్రతిలో మాత్రమే కానవస్తున్నది. అదే యీ శేషాచార్యుల వ్రాతప్రతికీ, అందులోని యీ కీర్తనకూ ఉన్న ప్రాముఖ్యము! అన్నమాచార్యాదుల విస్తృత వాగ్గేయ శృంగారసాహిత్యం పుట్టి వెల్లడైన తర్వాత అలంకారశాస్త్రంలోనె బోలెడు వికాసానికే అవకాశమేర్పడింది.

కానీ తెలుగువారి దురదృష్టంవల్ల అన్నమాచార్యాదుల కృషి యీ విషయమై పూర్తిగా మరుగున పడిపోయే ఉంది. కాలమూ కరిగి ఆసక్తి పలుచబడిపోతున్నది. అస్మదాదుల శక్తియుక్తులూ చాలకున్నవి. నిష్ణాతులైన జమ్మలమడక మాధవరామ శర్మగారివంటి / డా॥ వి. రాఘవన్‌గారి వంటి / నేటి మా తరంలో నాకు తెలిసిన ఆచార్యులు, డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావుగారు, డా॥ బేతవోలు రామబ్రహ్మంగారు వంటి పండితులు తిరిగి పరిశోధనకు పూనుకొంటేనో, ప్రోత్సహిస్తేనో తప్ప ఈ రంగంలో దాగిన రహస్యాలు వెలుగులోకి వచ్చే అవకాశాలుండవేమో అని దిగులుగా ఉంది. నా దిగులు వట్టిదే అగునుగాక.

– ***వేటూరి ఆనందమూర్తి***

కామశాస్త్ర గ్రంథాలలో 'కామసూత్రాలు' (వాత్స్యాయనుడు), రతిరహస్యము (కొక్కోకుడు), అనంగరంగ (కల్యాణమల్లుడు) ప్రసిద్ధమైనవి. వీటిలో అన్నమయ్యకు పూర్వపు గ్రంథాలు కామసూత్రాలు, కొక్కోకము. అనంగరంగ క్రీ.శ. 16వ శతాబ్ది నాటిది. వివిధ లక్షణాలను బట్టి స్త్రీలను పద్మిని, చిత్తిని, శంఖిణి, హస్తిని అనే నాలుగు జాతులుగా విభజించాడు కొక్కోకుడు.

అన్నమయ్య ఈ సంకీర్తనలో పేర్కొన్న స్త్రీ లక్షణాలన్నీ ఎక్కువగా కొక్కోకమును అనుసరించి ఉన్నాయి.

చిత్తిణి (చిత్రిణి, చిత్తిని) జాతి స్త్రీ రంగురంగుల దుస్తులు యిష్టపడుతుందని, శరీరం సుగంధం వెదజల్లుతుందని కొక్కోకం పేర్కొంటే; నలుపు వన్నెని యిష్టపడుతుందని, శరీరం వేప వాసన వస్తుందని అన్నమయ్య చెబుతున్నాడు. నీలి వన్నెని యిష్టపడటం శంఖిణి లక్షణం.

హస్తిని లక్షణాలలో 'కుడుపు కొంచెము' అని అన్నమయ్య చెప్పాడు. "కుడుపున పడుపున్ ఘనంబు" అని శాస్త్రకారుడు అంటున్నాడు. ఇలాంటి స్వల్ప తేడాలు మినహాయించి కొక్కోకంలో చెప్పిన లక్షణాలనే అన్నమయ్య అనుసరించాడు.

పద్మిని, చిత్తిని, శంఖిణి, హస్తిని క్రమాన్ని అనులోమంలోనో, విలోమంలోనో కాకుండా అన్నమయ్య తన సంకీర్తనలో హస్తిని, చిత్తిని, శంఖిణి, పద్మిని వరుసలో చెప్పుటకు ఏమి కతంబొ!

ఇలా నాల్గుజాతుల లక్షణాలతో అన్నమయ్యదే అయిదవ సంపుటంలో 92వ సంకీర్తన ఉంది. ఈ సంకీర్తనలోనూ హస్తిని, చిత్తిని, శంఖిణి, పద్మిని వరుసనే అన్నమయ్య పాటించాడు. అయితే ఆ సంకీర్తన కన్నా యీ సంకీర్తన విపులమైనది.

నవరసాలు, నవరత్నాలు వంటి వర్గీకరణ లన్నింటా శ్రీనివాసుని దర్శించటం అన్నమయ్యభక్తిలో ఒక భాగం. అలాంటిదే యీ సంకీర్తన.

– గంధం బసవశంకరరావు

పెదతిరుమలాచార్యులు, అతని ధర్మపత్ని బంగారు విగ్రహాలు, చుండుపల్లి.

15. (అల) మంగ చూపులో

సంకీర్తన: 12 రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 15 తాళం: అట

[1](అల) మంగ చూపులో - అతను విరితూపులో[2]
వెలది మేలేది[3] యని - వెదకేవే ॥పల్లవి॥[4]

(పల్లవి తరువాత రెండున్నర చరణము లిందు లుప్తములుగా తోచుచున్నవి)

[5]తెలియ శ్రీవెంకటా - ధిపుని సఖి యెపుడెన్న
అలరు గాంచిన మేలు - అతివె చూపు (లవే)!

అతి సుందరమైన యీ పాట అత్యంత శిథిలమై అసంపూర్ణముగా కానవచ్చుట చింత్యము. ఇది కూడా మునుపటి పాట (అలివేణి జవ్వనం బదె యామని, వ్రాతప్రతి సంకీర్తన సంఖ్య 11) వలె ఆద్యంతము ఏకాక్షర లకారప్రాస గలదే కావచ్చును. ఏకాక్షరప్రాసగల పాటలిట్టివి తాళ్లపాకవారి రచనలలో ఉన్నవి. వారి తక్కిన పాటలతో పోల్చి భావసంవాదమును పరిశీలింపదగును. పూర్తి పాటకై అన్వేషింపవలెను. ఇంకనూ అలభ్యము.

అతను = మన్మథుడు.

- వేటూరి ఆనందమూర్తి

---

1. మంగచూపులో అన్న యారంభమున లకార ప్రాసభంగమున్నది. **2.** సన్నులలో **3.** మేపెది, **4.** (లుప్త పూరణము) **5.** తేలి

16. అలయ గౌగిట నోల

సంకీర్తన: 144 రాగం: శ్రీరాగం

వ్రాతప్రతి పుట: 142 తాళం: లుప్తము

అలయ గౌగిట నోల - లాడు టెరుగుదుగాని
చెలరేగి విభుడేమి - సేసెనో యెరుగ ॥పల్లవి॥

(తలపుగొని నునుగొప్పు) - దడుముటెరుగుదుగాని
వెలలేని జాజి విరు - లలముటెరుగ
వెలిపట్టు రవికె ముడి - విడుచు టెరుగుదుగాని
కులుకు చనుమొన గోరు - కొన జీరుటెరుగ ॥అలయ॥

అదన నా మోవి రుచు - లా (ను టెరుగుదుగాని)
పెదవిపై గెంపుమొల - పించుటెరుగ
తుద గోర జిరు చెమట - తుడుచుటెరుగుదుగాని
కదిసి చెక్కిలి ముద్దు - గదియించు టెరుగ ॥అలయ॥

యీటుగా మేను (మెయి - నెనయు టె) రుగుదుగాని
గీటి కళలంటి చొ - క్కించు టెరుగ
బోటి వేంకట(పతి) ని - బొందుటెరుగుదుగాని
గాటంపు రతులచే - గరగించు టెరుగ ॥అలయ॥

ఉత్తమ నాయికానాయకుల శృంగారములోని విశిష్టాద్వైత రసానందానుభూతికి యీ తాళ్లపాక సంకీర్తనము వెలలేని వ్యాఖ్యానము.

- వేటూరి ఆనందమూర్తి

17. అలరఁజంచలమైన

సంకీర్తన: 197 రాగం: ఆహిరి

వ్రాతప్రతి పుట - 189 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన సంపుటం 1లో 67వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 11) లో ఈ సంకీర్తన రాగం: ఆహిరి)

అలరఁజంచలమైన ఆత్మలందుండ నీయలవాటు సేసె నీవుయ్యాల
పలుమారు [1]నుచ్ఛ్వాస పవనమందుండ నీ భావంబు దెలిపె నీవుయ్యాల ॥పల్లవి॥

ఉదయాస్తశైలంబు లొనరఁ ❀గంభములైన వుడుమండలము మోఁచె నుయ్యాల
అదన నాకాశపద మడ్డదూలంబైన అఖిలంబునిండె నీవుయ్యాల
పదిలముగ వేదములు బంగారుచేరులై పట్టవెరపై తోఁచె నుయ్యాల
వదలకిటు ధర్మదేవత పీఠమై మిగుల వర్ణింప నరుదాయ నుయ్యాల ॥అలర॥

మేలుకట్లయి మీకు మేఘమండలమెల్ల మెఱుఁగునకు మెఱుఁగాయ నుయ్యాల
నీలశైలమువంటి నీమేని కాంతికిని నిజమైన తొడవాయ నుయ్యాల
పాలిండ్లు గదలఁగాఁ బయ్యదలు రాఁపాడ భామినులు వడినూఁచు నుయ్యాల
వోలి బ్రహ్మాండములు వొరగునోయని భీతి నొయ్యనొయ్యన వూఁచి రుయ్యాల ॥అలర॥

కమలకును భూసతికి కదలుకదలుకు మిమ్ముఁ గౌఁగిలింపఁగఁజేసె నుయ్యాల
అమరాంగనలకు నీ హావభావ విలాసమందంద చూపె నీ వుయ్యాల
కమలాసనాదులకుఁ గన్నులకు పండుగై గణుతింప నరుదాయ నుయ్యాల
[2]కమనీయమూర్తి వేంకటశైలపతి నీకు కడువేడుకై వుండె నుయ్యాల ॥అలర॥

రేకుల్లోనూ ఉన్న ఈ అద్భుతసాహిత్యానికి శ్రావ్యమైన సంగీతం జోడై భక్తుల ఉచ్వాస నిశ్వాసాలలో అలరారే సంకీర్తన 'అలర చంచలమైన ఆత్మలందుండ'!

❀ స్తంభము (ప్రకృతి) - కంబము (వికృతి). వ్రాతప్రతిలోను, రాగిరేకులోను 'కంభం' అని ఉండుటచే సరిదిద్దక అట్టే ఉంచితిమి.

- గంధం బసవ శంకరరావు

---

1. 'నుశ్వాస' అనియే రేకు. 'ఉయ్యాల' పదము రేకునందంతటా 'ఉయ్యాలా' అనియే ఉన్నది.

2. 'కమనియ్య' అని రేకు. నిడురేకు 11 లోని పాఠములు

18. అలికి (అళులు) సంపెంగ

సంకీర్తన: 36 రాగం: ఆహిరి

వ్రాతప్రతి పుట: 37 తాళం: అట

అలికి (అళులు) సంపెంగ – తావి కణఁగినట్టు
తొలఁగీ నుదుట జారి – తుమ్మెదల పిల్లలు ॥పల్లవి॥

వెలఁదియారను పాము – వెంటఁబెట్టుకొని రాఁగా
తలఁకి చంద్రుఁడు – వోయి దాఁగినట్టు
పలువన్నె మెఱుఁగుల – పయ్యదలోనె దాఁగె
చలివేఁడి మెఱుఁగుల – చందమామ పిల్లలు ॥అలికి॥

కోవిలపలుకుదాడి – కోపగించి వెంటరాఁగా
తావుల చిగురువోయి – దాఁగినట్టు
మోవి సూదివాటులై – మొనసి కానవచ్చీని
మావుల చిగురులోని – మాణికాల పిల్లలు ॥అలికి॥

భారమైన విరహతాపపు – సూరియుండు రాఁగా
తారితారి చకోరాలు – దాఁగినట్టు
కూరిమి వేంకటపతిఁ – గూడిన తమకమున
గోరగించీనిదివో చ–కోరముల పిల్లలు ॥అలికి॥

అన్నమయ్య కవితాచంద్రుడు వెదచల్లే పొగరు వెన్నెలకు నిలువెత్తు దర్పణం ఈ సంకీర్తనం! అన్నమయ్య పదకవితలు ప్రబంధకవులకు సాహితీభిక్షను ఒసగాయనటానికి ఈ సంకీర్తన చక్కని ఉదాహరణ!

రెండవ చరణం రేకులలోని 'వలపుల దాడి వచ్చె వనితలారా' అనే సంకీర్తనను జ్ఞప్తికి తెచ్చుచున్నది.

ఆరు (ఆఱు, నూగారు) = బొడ్డునుండి మొదలయ్యే సన్నని నూగువంటి రోమావళి. నూగారును అన్నమయ్య 'ఆరు' అనే వ్యవహరించును. ఇదే సంపుటంలోని 14వ సంకీర్తన 'అరయ నాలుగు జాతులందా' లో కూడా మూడవ చరణంలో 'ఆరు' అనే ప్రయోగమే ఉంది.

– *గంధం బసవ శంకరరావు*

19. అలివేణి జవ్వనం

సంకీర్తన: 11 రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 14 తాళం: ఝంపె

అలివేణి జవ్వనం - బదె యామని
పొలతికి పోకకును - పుట్టెడాయ వలపు ॥పల్లవి॥

నెలత నునుచనుదోయి - నీరాడుగొంది[1], పై
మెలపుతో బతిచూపు - మెఱపు మెరసె
పులకపైరుల కెల్ల - ప్రోదియై చెలువారు
వలి మీరు చిఱు చెమట - వాన లిక నలవే ॥అలివేణి॥

అలరి యంతంత కు - ననలు కొనలు బారి
నలువొందు వయసు దా - నాముదేరి
కలకంఠి చిఱుదొడలు - కఱకు పైకట్లాయె?
చెలియ యిక పూవిల్తు - సీమ [2]వెలుగులుగా ॥అలివేణి॥

కులుకు నెత్తావి కుం - కుమ సుంకురాలంగ
ఎలనాగ యానెడి - యెడద వేదికపై
[3]అలమేలుమంగ శ్రీ వేం-కటాధీశు డెనయంగ
మొలకలై నోచు నో - ములపంట పండె ॥అలివేణి॥

ఈ పాట ఆద్యంతము లకార ప్రాసాక్షరముతో ఏకాక్షర ప్రాసబంధము. ***- వేటూరి ఆనందమూర్తి***

'ఏమని పొగడుదుమే యిక నిను' (18-538) అని ప్రకృతి స్వరూపిణి యైన అలమేల్మంగను కీర్తించిన వైనం ఈ సంకీర్తనలో ప్రత్యక్షం! ***- గంధం బసవ శంకరరావు***

---

1. నిరాళ్లగొంది; **2.** వెరదరుగా; **3.** నా పరిశీలనమున ముద్రను బట్టి యిది పెద తిరుమలాచార్యుల రచనగా గుర్తింపబడుచున్నది. లయకొాదుగకున్నా ముద్రా సంబోధనములందలి 'శ్రీ' కారములిట్టివి భక్త్యతిశయ ప్రకటనమునకే!

20. అలుగక కూటమి చవిగా

[1]సంకీర్తన: 59　　　　　　　　　　　　　　　　　　　　　రాగం : బిలహరి

వ్రాతప్రతి పుట: 60　　　　　　　　　　　　　　　　　　　　తాళం: లుప్తము

అలుగక కూటమి చవి[2]గా – దనుచును బలికేవు, నీ
వలిగిన[3] ప్రాణము లేమౌనో – నావల నీ[4]మే లెవరికిరా　　　　॥పల్లవి॥

తనివోవగ నీ మోమును – దప్పక కనుగొను వేళను
తను పరవశమైనంతట – (కను) రెప్పలు[5] మూయుదును
దినము లవెన్నో దోయుచు – దిగులుపడుచును జూచి
కనురెప్పలను మూయఁ[6] – గా వెరచియుండ, నాతో　　　　॥అలుగక॥

తమకమున నినుగవసి – తనువు లెడయకయుండి
అమర కౌఁగిట బిగియు – నావేళ
రమణిమై కంఠహా – రము లడ్డమైనయెడ
భ్రమసి యతి దూరమై – భావించియుండ, నాతో　　　　॥అలుగక॥

చిలుకురతి గలసి య – గ్గలమైన[7] బడలికల
అలసి శ్రీకృష్ణాయని – యక్కుపై[8] పవళించి
పలుకఁజాలక యుండి – బాసియున్న దనఁగ
తలఁచి నామదిని పరి – తాపమందియుండ, నాతో　　　　॥అలుగక॥

నీ అలుకను, ఎడబాటును ఓపలేనంటుంది నాయిక.　　　　***– గంధం బసవ శంకరరావు***

---

1. ఈ పాటయే పాఠాంతరములలో నీలాంబరి – జంపె తాళమున సంగీత సర్వార్థ సారసంగ్రహమున గలదు. ఆ పాట రూపము విడిగా చూపబడును. **2.** చలి **3.** వలుగక **4.** యామీఁదటి **5.** నంతట రెప్పలు (యతి భంగము) **6.** కనురెప్ప మరల మూయ **7.** రతిగలనగ్గఅల **8.** యాకుపై. వీరభద్రయ్యగారి పదాలుగా వీణ రామానుజయ్యగారు తమ సంగీత సర్వార్థ సారసంగ్రహము (పు. 143–145)న ఆరుపాటలుదాహరించిరి. అందు:

1. అక్కరో యిపుడు – (దర్బారు – రూపక తాళము) **2.** లలనీవిరహ – (జంజూటి – రూపక తాళము) అనునవి వరదవేంకటకృష్ణననుగూడి – నరపరమైన పదము. **3.** ఆలెహోవెలాల్లా – (నాదరామక్రియ – అటచాపు

తాళము) అనునవి – ఘనుడ వేంకటకృష్ణననుగూడి – నరపరమైన పదము. **5.** దాని నన్నెడబాపవలెనా – (ఆనందభైరవి– ఆదితాళము) వేంకటరమణముద్ర గల యీ పాట తాళ్లపాకవారి సంకలనములందు, ఆకులలోగాని, రేకులలోగాని కానరాదు. కనుక తాళ్లపాకవారిది కాదేమో! **6.** తరుణి నిన్నుజూచి – (మణిరంగు – రూపకతాళము) అనుపాట బృహన్నాయకా ముద్రలో నున్నది. ఇక ఇందలి 4వ సంఖ్యగల 'అలిగిగూడితే చవిగదా' (నీలాంబరి రాగము – ఝంపె తాళము) అను శృంగారపదము శ్రీకృష్ణముద్ర గలది. ఇదే పాట రూపాంతరమంది అవే చరణములతో ప్రాసలతో "తాళ్లపాక సంకీర్తనలు" అను వ్రాతప్రతిలో 59వ పాటగా కలదు. కనుక ఈ శ్రీకృష్ణపదము తాళ్లపాక పదకవుల రచన (తిరువేంగళనాథుని పదము)గా గుర్తింపబడుచున్నది. రామానుజయ్యగారుదహరించిన పాటను యథాతథముగా ఇట చూడదగును.

– వేటూరి ఆనందమూర్తి

రాగం: నీలాంబరి తాళం: ఝంపె

అలిగి గూడితే చవిగదా – యనుచు బలికేరు ॥పల్లవి॥
అలిగితే ప్రాణ మేమౌనో – యామీద నామే లెవరికిరా ॥అనుపల్లవి॥

తన విభుని మోము – తప్పక కనుగొను వేళ
తనువు పరవశమైన రెప్పలు – కనుమూయునంతలోనె
దినములెన్నొ కొదలచి – దిగులుపడి నినుజూచి
కనురెప్ప మరి ముయ్య – కను వెరచియుండునను ॥అలిగి॥

తమకమున నిను గదసి – తనువు లెడయక నుండి
యదెర కౌగిట బిగి – య నావేళను
రమణ యురమున కంటహా – రము లడ్డమైన నదర భ్రమసి
యది దూరమని భావించి – యుండును ॥అలిగి॥

చెలగరతిగతుల నగ్గల – మైన బడలికల
కళలూర శ్రీకృష్ణు – గలిసి నాపై నొరగి
పలుకనేరక యెడ – బాయకున్న
పలుకరించునంతలోనె – పరితాపము బొందు నను ॥అలిగి॥

21. అవునయ్యా లెస్స తగ

సంకీర్తన: 182 రాగం: కేదార

వ్రాతప్రతి పుట: 176 తాళం: అట

అవునయ్యా లెస్స తగ - వాయ(బో) నేడు (బా)
తవిలి తప్పొకరిది - దండన వొకరిదా ॥పల్లవి॥

దిద్ది నీ చెక్కిట గోరు - తీర్చిన వారుండగా
అద్దము చూచుకొమ్మంటే - (అదె) అపరాధమా
వొద్దిక నీ మోవి కెంపులుంచిన - వారుండగా
అద్ది కప్పురము వెట్టుటే - (అదె) అపరాధమా ॥అవునయ్యా॥

నెరయ నీ మేన చెమట - నించినవారుండగా
అరసి సురటి విసరితే - (అదె) అపరాధమా
శిరిగల నీ కొప్పు - జిమ్మినవారుండగా
అరుదుగ ముడుచుటే - (అదె) అపరాధమా ॥అవునయ్యా॥

యెలమి తన్నుల - యించినవారుండగా
అలసి వచ్చితి నంటె - (అదె) అపరాధమా
అలమేలుమంగ వేంక- టప్పడవై గూడితివి
అలుగకు మనంటె - (అదె) అపరాధమా ॥అవునయ్యా॥

అనుబంధం: తంజావూరు సరస్వతీ మహలులోని తాళపత్ర ప్రతి పాఠం
(కాంబోది - అట తాళం. (డి. 459 - బి.11657. తాళపత్రం-తంజావూరు)

అవునయ్యా లెస్స తగ - వాయ(బో) నేడు (బా)
తవిలి తప్పొకరిది - దండన వొకరిదా ॥పల్లవి॥

దిద్ది నీ చెక్కిట గోరు – తీర్చినవా రుండగా
అద్దము చూచుకొమ్మంటే – అదె నేరమా
వొద్దికి నీ మోవికెంపు – లుంచినవా రుండగా
అద్ది కప్పురము వెట్టు – టదె నేరమా ॥అవునయ్యా॥

నెరయ నీ మేన చెమట – నించినవా రుండగా
అరసి సురటి విసరితే – అదె నేరమా
సిరి గలిసి కొప్పు – చిమ్మినవా రుండగా
అరుదుగా ముడుచు – టదె నేరమా ॥అవునయ్యా॥

యెలమి త న్నల – యించినవా రుండగా
అలసి వచ్చితి నంటె – అదె నేరమా
అలమేలుమంగ వేంక – టాధీశు గూడితివి
అలుగకు మనంటె – అదె నేరమా ॥అవునయ్యా॥

(యీ సంకీర్తన యింతె)

వ్రాతప్రతిలో (ఇది సంకీర్తన) – (ఈ సంకీర్తన యింతే) అనే గుర్తింపు అన్ని సంకీర్తనలకూ కలదు. ప్రతివిలేఖకుల ఇట్టి సూచనలు స్పష్టత కొరకే అని తెలియవలెను. అయినా తంజావూరు వ్రాతప్రతి టాగ్ షీట్ లోని గుర్తింపు ఇట్లున్నది.

"సంగీతం క్షిత్రియ (సంకీర్తనలు అనేది కొట్టివేసి) పదాలు–తెలుగుభాష..." అని. ఇది చింత్యము. ఇట్టి 'కీర్తన' లన్నీ తాళ్లపాకవారివే అనడంలోనూ సందేహం లేదు.

ముద్రనుబట్టి యిది పెదతిరుమలాచార్యులవారి రచన.

– వేటూరి ఆనందమూర్తి

22. ఆటదాననె పో

సంకీర్తన:117 రాగం: కన్నడ

వ్రాతప్రతి పుట: 117 తాళం: త్రిపుట

ఆటదాననె పో నీరజద - ళాక్షి!వానినిప్పుడె
(చాటి) నాకైవ - శము చేసుకోకున్నను ॥పల్లవి॥

మిగుల మాటపట్టు - మీరు చూడగనిచ్చి
తగవుదప్పి ఆకె - దండనున్నందుకు
బిగువుగుబ్బల గుమ్మి - (బీరము)లాడుచు
మొగమోటములేక వాని - మోవినొక్కకున్నా, నే ॥ఆటదాననె॥

యీరాని బాసలెల్ల - నింతులెరంగ, నిచ్చ
మేరకిచ్చి యాకెతో- మేలమాడినందుకు
సారెకు రాకొట్టుచు - దూరుచు (బెక్కులు)
జీరలుగా వాని- చెక్కులు చేయకున్నా, నే ॥ఆటదాననె॥

యెక్కడికి తాబోనని- యిందరిలో నాడి
టక్కరించి (వేగమె)దానితో- (చొక్కి)తేలినందుకు
పెక్కువగలవాని - బెనగుచు నలయింపుచు
యెక్కువ వేంకటనాథ- యెదనెక్కకున్నా, నే ॥ఆటదాననె॥

నాయిక చెలితో తన పంతాన్ని చాటుతున్నది

అన్నమయ్య శృంగార పదాలలోని నాయికలు కేవలం స్వామి భక్తిపరాయణలే కాక, సర్వ స్వతంత్రభావాలను కూడా వెల్లడించేవారు! నాయకునికి దీటైనవారు! ఈ మధురపదంలోని నాయిక కూడా ఆరీతినే తన భావాలను నిర్భయంగా వ్యక్తం చేస్తుంది.

రేకులలోని "అయ్యో వీడు నన్నణకించీనే వీని-కొయ్యతనాలణచక కోపమేల తీరునే" (5-147) సంకీర్తన కూడా ఈ కోవలోనిదే!

- గంధం బసవ శంకరరావు

23. ఆటది జాణ కాకుంటే

సంకీర్తన: 204 రాగం: మారువధన్యాసి
వ్రాతప్రతి పుట: 197 తాళం: లుప్తము

ఆటది జాణ కాకుంటే - అందేమున్నది
నీటుతో తిరిగినదే - నేరుపింతే గాక ॥పల్లవి॥

పనిలేని సుద్దులెల్లా - పచరించగానేమి
ననిచిన యీ పొద్దె - నడి జామాయ
యెనసి యిప్పుడేమి - యేకాంతమాడీనే
చనవున సరసాన - సంగడి గూర్చుండీనిది ॥ఆటది॥

వెడమాయల జాలి వేరే - బెట్టంగా (నేమి)
చిడిముడి యిది యెంత - సేపాయ
జడియక తానెన్ని - సటలు సేసీనే
తొడపై దొడ వేసీని - దొరతనమున ॥ఆటది॥

ఆవలీవల నెలత - (లమరు) కోగానె
శ్రీవేంకటనాథుని - చిత్తమెట్లాయ
యీ వేళ నాకు చన - విచ్చి కూడేనే
వోవరిలో తానేల - వూరకే వుండినది ॥ఆటది॥

వోవరి (ఓవరి) = చంద్రశాల.

ముద్రనుబట్టి యిది చినతిరుమలాచార్యుల రచన కాదగును. తాత తండ్రుల రచనా మార్గదర్శనమున మనుమని అభ్యాస గేయరచనమని తోచును. ఈ సంపుటమునందలి కొన్ని కొన్ని రచనలను పరిశీలించునపుడు పెదతిరుమలాచార్యుల పంచకల్పతరువులైన తన సంతతివారికి, తరువాతి తరపు వాగ్గేయకారులకు, శిక్షగా చెప్పి, చెప్పించిన కృతి రచనా విశేషములిందున్నవేమో అని తోచును. **-వేటూరి ఆనందమూర్తి**

జాణతనాన్ని ప్రదర్శిస్తూ, స్వామిపట్లగల చనవును వ్యక్తపరుస్తుంది నాయిక. ***- గంధం బసవ శంకరరావు***

24. ఆన పెట్టుదువు నీవప్పటి

సంకీర్తన: 246 రాగం: భైరవి

వ్రాతప్రతి పుట: 235 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన సంపుటం 5లో 222వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 68)లో ఈ సంకీర్తన రాగం భైరవి)

ఆన వెట్టుదువు నీవప్పటి[2] నానోరణఁచి వోరి[3]
నీ నిజానకు నాతో నేఁడైన మానరా[4] ||పల్లవి||

పచ్చడాన జవ్వాది పరిమళమేడదిరా
పచ్చిసేఁతలు చెక్కిళ్లపై నీకేడవిరా
గచ్చుమోవిమీఁదనున్న కసిగాటులేడవిరా
యిచ్చకుఁడ కనుఁగెంపులేడవి గలిగెరా[5] ||ఆన||

ముద్దుల[6] చక్కని నీదు మోముకళలేడవిరా
కొద్దిగాని సందొత్తుగోరేడదిరా[7]
గద్దరీఁడ యీ చిట్లు[8] గందము నీకేడదిరా
తిద్దెను గస్తూరిబొట్టు దిమ్మరి యెవ్వతిరా[9] ||ఆన||

భీతితో నీవాడేటి[10] తబ్బిబ్బు మాటలేడవిరా
రాతిరేడ నుండితి[11] వెరవక చెప్పరా
యేతరీఁడ తిరువేంకటేశ నన్ను నేలితివి[12]
యేతులతో వలపించ నెంత కలికివిరా[13] ||ఆన||

గడుసరియైన నాయిక (ఖండిత) నాయకుడిని నిలదీసి అడుగుతున్న వైనం ఈ సంకీర్తనలోని విషయం. ఎంత నిలదీసి అడిగిననూ సంకీర్తనాంతంలో నాయకుడికి వశమై నన్ను 'ఏలితివి' అంటూ ఆనందాన్ని వ్యక్తం చేస్తుంది.

– గంధం బసవ శంకరరావు

---

1. తం.ప్ర 30. ధ్రువతాళం; **2.** తా.వేం.235; తం.ప్ర.ఆనలు వెట్టేవు సారె అప్పు; **3.** 'వోరి' లేదు; **4.** తం.ప్ర. ఆనాలు నీకే తోడగురా అది యింకా మానవురా; తా.వెం. ఆనలు నీకు తోడారా నేడింక మానవురా.



తిరుమలలో తాళ్లపాకవారి స్వగృహం

5. తా.వెం. గెంపులివి యేడవిరా **6.** తం.ప్ర. ముద్దుగారేనీ **7.** కొద్దిగా నొక్కిన సంది గోళ్ళేడవిరా; తా.వేం. కొద్దిగా నూఁదిన సంది **8.** తా.వేం. చిట్లిన **9.** సా.రే. తిద్దినది గోరు జూటుదిమ్మరి యెవ్వతెరా (తా.వేం.లో ఈ చరణము 1, 2 పాదములు తారుమారైనవి) **10.** సా.రే. బీతు లేక నీవాడే **11.** తా.వేం. రాతిరెందు వోతివో **12.** తం.ప్ర. ఈతరి శ్రీవేంకటేశ యిట్టె ననుఁ గూడితివి **13.** ఈ తీరు సారె వలపించ యెంత కలికివిరా; తా.వేం.ఈతరి చొక్కించితివి యెంత.

25. ఆపరాని వలపాయ

సంకీర్తన: 284 రాగం : ఆహిరి
వ్రాతప్రతి పుట: 268 తాళం: జంపె

ఆపరాని వలపాయ – నమ్మలార! యింతి
యేపులకు లోనాయ – నికనేమి సేతుమే ||పల్లవి||

ఆరగించుమనగదరె – అమ్మలార! అయో,
నీరు పుక్కిలించ దిది – నిన్నట నుండి
ఆరినది బోన మెల్ల – అమ్మలార! అయో,
శ్రీరమణుడింతట వి – చ్చేయడేమి సేతమే ||ఆపరాని||

అద్దమరేతిరి యాయ – అమ్మలార! చెలి
నిద్దుర కంటబెట్టదు – నిన్నటి నుండి
అద్దంపుజెక్కులవాడె – అమ్మలార! నేడు
యిద్దరి కోపము దీర – దిక నేమి సేతమే ||ఆపరాని||

అల సతే ఘనమాయ – నమ్మలార! దీని
నిలుపవశము గాదు – నిన్నట నుండి
అలమీ వేంకటపతి – అమ్మలార! యిప్పు
డెలయించి కూడకున్నా – డిక నేమి సేతవే ||ఆపరాని||

'చెప్పదు తల్లికిం దలపు చిక్కు' అన్న రుక్మిణీవిరహ స్మరణమిందు కలదు.

ఈ సంకీర్తన తంజావూరు ప్రతిలో కలదు.

బోనము = భోజనము.

– గంధం బసవ శంకరరావు

26. ఆపాటి కీపాటి

సంకీర్తన: 72 — రాగం : శంకరాభరణము

వ్రాతప్రతి పుట: 73 — తాళం: లుప్తము

ఆపాటి కీపాటి - కాయమేమియు లే(దు)
యేపాటయిన బాళి - కెంత సేయుదువో ॥పల్లవి॥

చక్కగ పోకలంతేసి - చన్నులయినంతలోనె
నిక్కుచు నూరకే నిద్ర - నీల్గే (వదేమే)
నిక్కమందరివలె - నిండు వయసు తొట్టితే (?)
చక్కగ పాదాలు నేల - సరిమోపవేమో ॥ఆపాటి॥

కురులు దువ్విన (నెరులు) - కొప్పుగూడవు సమము
విరుచుక వికవిక న-వ్వేవదేమే?
తరుణి పిక్కలు దాఁక - నెరులానగలిగితే
గురుతెవ్వరని నీవు - యెరుగలేవేమో ॥ఆపాటి॥

కలియనెరుఁగవు చక్క-గా నీవు విభునితో
పొలతి పోకలవెన్ని - (బొయ్యేవె నీవు)
కలసితే గనక వేం-కటగిరి దేవునకు
అలమేలుమంగవై - అల(రార వేమే)! ॥ఆపాటి॥

పోకలంతేసి చనులు, కురులు కొప్పుగూడవు వంటి ప్రయోగములు పింగళి సూరన రచన (కళాపూర్ణోదయం)ను తలపునకు దెచ్చుచున్నవి.

- వేటూరి ఆనందమూర్తి

27. ఆమని కాలమునై భామ!

సంకీర్తన: 205 రాగం: లుప్తము

వ్రాతప్రతి పుట: 197 తాళం: లుప్తము

(రాగాల వరుసను బట్టి ఈ సంకీర్తన రాగం ఆహిరి కాదగును)

ఆమని కాలమునై – భామ! నీ వయసునైతే
వేమారు తలపోయు నా – వేడుకేమి చెప్పేది ॥పల్లవి॥

పున్నమ వెన్నెలయునై – పొలతి నీ నవ్వునైతే
యెన్నరాని వేడుక – కేమి చెప్పేది
కిన్నెర వాద్యమునై – సఖి నీ పాటనైతే
విన్నదికన్నది కాని – వేడుకేమి చెప్పేది ॥ఆమని॥

చక్కెర పానకమునై – సఖి! నీ మోవినైతే
యెక్కువైన వేడుక, యి – కేమి చెప్పేది
చొక్కపు కపురమ్మునై – సుదతి! నీ తావినైతే
వెక్కసమైనట్టి యా – వేడుకేమి చెప్పేది ॥ఆమని॥

సేవంతి పూచెండ్లునై – చెలి! నీ గుబ్బలునైతే
యేవేళ తలపోయు వేడ్క – యేమి చెప్పేది
నే వేంకటపతియునై – నీ వలమేల్మంగవునైతే
వేవేలు తెరఁగుల నా – వేడుకేమి చెప్పేది ॥ఆమని॥

చక్కని నిర్మాణ సౌష్టవము గల శృంగార పదమిది.

ముద్రను బట్టి యిది పెదతిరుమలాచార్యుల రచన యనదగును. అన్నమయ్యదీ కావచ్చును. విన్నకన్నది; విన్నది కన్నది మొ॥ ప్రయోగములు పెదతిరుమలాచార్యుల వారి పదములలో అధికము. ***–వేటూరి ఆనందమూర్తి***

భామ వయసు వసంతకాలమట! నవ్వు పున్నమి వెన్నెలయట! ఆమె పాట కిన్నెర వాద్యమట! చెలి హృదయ సంపద సేవంతి పూచెండ్లట! ఈ మాటలంటున్నదెవరో కాదు, ఆ శ్రీవేంకటేశ్వరుడు!

– గంధం బసవ శంకరరావు

28. ఆయనాయ

సంకీర్తన: 177 — రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 172

ఆయనాయ చాలులె - మ్మన్నట్టుండవమ్మా, పొందు
సేయసేయ సేయంగ మరి - సేయనే మనసయీనమ్మా ॥పల్లవి॥

వోడక చూచితే నున్న - ట్లుండదోయమ్మా, యప్పని
చూడజూడ జూడగామరి - చూడనే మనసయీనమ్మ ॥ఆయనాయ॥

తనివి లేదు వాని కత లెం - త విన్న మరి
వినవిన వినగా మరి - విననే మనసయీనమ్మ ॥ఆయనాయ॥

చేనంటి యలమేల్మంగ -శ్రీవేంకటేశా యని
యానయాన నానగా మరి - యాననే మనసయీనమ్మ ॥ఆయనాయ॥

'జగన్మోహనాకార చతురుడవు' (సంపుటం: 2, సంకీర్తన: 375) అనే అధ్యాత్మ సంకీర్తనంలోని భావమే ఈ సంకీర్తనంలో ప్రతిబింబించింది.

- గంధం బసవ శంకరరావు

29. ఆయెబోయె నింకనేటి

సంకీర్తన: 199 రాగ: ఆహిరి

వ్రాతప్రతి పుట: 192 తాళం : లుప్తము

ఆయెబోయె నింకనేటి - కమ్మలాల, వొక
చాయ జేసుకోకుంటే - సతమాయె వలపు ॥పల్లవి॥

అ(ల)సి యెదురుమాట - లాడ నేరనివాడు
అలుగ నేరిచె నే - డమ్మలాల
చలపట్టి వానినే - సాధించేనంటేను
కలకాల మెవ్వరికైనా - కాణాచాయ వలపు ॥ఆయెబోయె॥

తిట్టినాను కొట్టినాను - తెగి మోమెత్తనివాడు
అట్టే పోయెనొక వీధి - నమ్మలాల
కట్టుమట్టు చేసి వాని - కదలనియ్యనంటేను
గట్టిగా నెన్నాళ్లకైనా - కాణాచాయ వలపు ॥ఆయెబోయె॥

గారవించి పొత్తున గాని - భుజించనివాడు
ఆరగించ జొచ్చే - నమ్మలాల
నేరుపుతో వేంకట - నిలయుడు నన్ను గూడె
కారణమింతె గాక - కాణాచాయ వలపు ॥ఆయెబోయె॥

'వలపు' అనే భావకోశం ఇందు ప్రస్ఫుటమవుతున్నది.

కాణాచి (కాణయాచి) = చిరకాల నివాసస్థానం.

- గంధం బసవ శంకరరావు

30. ఆహా శ్రీవేంక - టాద్రినాధురే

సంకీర్తన: 91 రాగం: మాళవిగౌళ

వ్రాతప్రతి పుట: 92 తాళం: అట

ఆహా శ్రీవేంక - టాద్రినాధురే
చోర వేంకటపతి జాణరే
ఆహాసిత కర్పూరభూతి జోగిరే ॥ఆహా॥

ధవళకర్పూరభూతి ధారాధరురే
భువనసంచిత కుక్షి - పొంకణ సుగుణురే
నవవాసుగంధయోగ - నాధురే
పవనాశనాద్రిపాల - పాలితురే ॥ఆహా॥

అహెూమత్స్యేంద్రకూర్మ రజ-తాచల సింగినాధురే
గోబలనాథ సిద్ధయోగి
కంకణకింకిణి - శంఖలాంకృత
శంకర వినుతురె - వేంకటనాధురె ॥ఆహా॥

కాళీదేహాళీతాపత్రయజి
కేళీనయన వి - శాలయోగిరే
సంకుసింగినాధురే సిత క
ర్పూరభూతి యోగిరే ॥ఆహా॥

అలమేల్మంగసారంగ తురంగ
అంగాంగప్రియ కాళింగ మర్దనురే ॥ఆహా॥

మత్స్యేంద్రకూర్మ రజతాచల సిద్ధనాదం
గోపాలనాథ...సిద్ధయోగిం
భువనత్రయదేసి దూతికచ్చరారయోగిం
శ్రీశంభునవనాథ సిద్ధ యోగిం ॥ఆహా॥

సిరినాథు........

అభినవ కాళీతాండవాకారురే

ఆదినాథ పరమానందసింధురే

భూధారాధమరే భుజగశయనురే

దుగదుగదాందిగిదిగి ధింతద్ధిమి

ధిమికిట తంగిణి ధిమికిట తాండవకరురే ॥ఆహో॥

డా॥ తాడేపల్లి పతంజలిగారు అర్థతాత్పర్యాలతో అందించిన పరిష్కృత పాఠం

ఆహో శ్రీ వేంకటాద్రినాథ!రే!

ఆహో వేంకటాద్రినాథ!రే!

చోర వేంకటపతి భోగి! రే! ॥పల్లవి॥

ఆహో సిత కర్పూరభూతి భోగి!రే! ॥అనుపల్లవి॥

ధవళ కర్పూర భూతి ధారాధర!రే

భువన సంచిత కుక్షింభర ధీర సుగుణ! రే

నవ వాసుకీ గంధ యోగినాథ! రే

పవనాశనాద్రి కృపా పాలిత! రే ॥ఆహో॥

ఆహో! మత్స్యేంద్రాకులిత రజతాచల సింగినాదం!

ఆహో! గోరక్షనాథ ప్రసిద్ధయోగం

అహెూ భువన త్రయ దేవ దూతి అవిర్భోత్ర యోగం

అహెూ శంభు నవనాథ సిద్ధ యోగం ॥ఆహో॥

ఆహో! అభినవాకుళితతాండవాకర! రే

ఆహో! ఆదినాథ పరమానందసింధు! రే

ఆహో! ధీర ధారాధర! భుజగశయన! రే

ఆహో! ధిమికిటధిమికిటమంజుతాండవ కర! రే ॥ఆహో॥

తాత్పర్య వివరణ: పల్లవి –

ఆహా శ్రీ వేంకటాద్రి నాథ!రే!

చోర వేంకటపతి భోగి!రే!

ఆహా = ఆనందంలో ప్రశంసార్థకం

రే శ్రీ వేంకటాద్రినాథ = ఓరి వేంకటాచలపతీ!

రే చోర వేంకటపతి భోగి = ఓరి చోరకళలో నిష్ణాతుడైన వేంకటాచలపతీ! భోగీ! (నువ్వెంతవాడివిరా!.. ఇంత గొప్పవాడివని చెప్పలేకపోతున్నాను!.. ఆహా!)

విశేషాలు:

"రే"

ఈ కీర్తనలో అన్నమయ్య వేంకటేశునిలో నవనాథుల దర్శనం చేస్తున్నాడు. ఆ దర్శించిన అనుభూతిలో 'రే' అనే అక్షర ప్రయోగం కీర్తనలో చాలాచోట్ల చేశాడు. భక్త కవుల్లో "రే" అక్షర ప్రయోగం చాలాచోట్ల మనకి కనిపిస్తుంది. ఉదా. మానస సంచరరే. ఇందులో మనసుని "రే మానస" అని కవి సంబోధించాడు. అలాగే మిగతా భక్త కవుల కృతులలో కూడా చాలా చోట్ల "రే" అను అక్షరం కనిపిస్తుంది. అదే పద్ధతిలో అన్నమయ్య కూడా వేంకటేశుని భక్త్యాతిశయమైన చనువుతో "రే" అని పిలుస్తున్నాడు.

"రే" అను సంస్కృత ఏక అక్షరానికి 'ఓరి' అని తెలుగు అనువాదం. (ఆధారం సర్వశబ్దసంబోధిని సంస్కృతనిఘంటుః – ఆంధ్రటీకాసహితః పరవస్తు శ్రీనివాసాచార్య 1875).

భోగి అనగా ఊరి దొర అని అర్థము ఉంది. ఇక్కడ ఊరు సమస్త ప్రపంచానికి ప్రతీక. దానికి దొర అని అర్థం చెప్పుకోవాలి.

అనుపల్లవి:

ఆహా సిత కర్పూర భూతి భోగి! రే!

ఆహా = ఆనందంలో ప్రశంసార్థకం

విశేషాలు:

శ్రీవేంకటేశ్వరస్వామివారికి పచ్చకర్పూరంతో తిలకం పెడతారు. ఆ నలుగు పెట్టిన పచ్చకర్పూరం, పునుగుపిల్లి తైలమిశ్రమమునకు శ్రీపాదరేణువు అని పేరు. దానిని సంపాదించటానికి భక్తులు తహతహలాడతారు. ఈ పచ్చ కర్పూరపు రంగు తెలుపు. ఈ పచ్చకర్పూరపు ఐశ్వర్యముతో (భూతి) ప్రకాశించే ప్రపంచపు దొరా! (భోగి) అని ఒక అర్థం.

పచ్చకర్పూరాన్ని తాంబూలంలో తగుపాళ్లలో వాడటం భోగచిహ్నం. అటువంటి పచ్చకర్పూర తాంబూల భోగము కలిగినవాడా! అని రెండవ అర్థం.

1వ చరణం:

ధవళ కర్పూర భూతి ధారాధర! రే
భువన సంచిత కుక్షింభర ధీర సుగుణ! రే
నవ వాసుకీ గంధ యోగినాథ! రే
పవనాశనాద్రి కృపా పాలిత! రే

ధవళ కర్పూర భూతి ధారాధర! రే = భక్తులు భక్తితో సమర్పించే తెల్లని కర్పూర హారతి ప్రకాశపు ఐశ్వర్యంతో సంతోషించి వారు కోరిన కోరికలు మేఘంలా వర్షించేవాడా!

భువన సంచిత కుక్షింభర ధీర సుగుణ! రే = అతలము, వితలము, సుతలము, తలాతలము, మహాతలము, రసాతలము, పాతాళము, భూలోకము, భువర్లోకము, సువర్లోకము, మహాలోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము అను పదునాలుగు లోకములను కడుపులో కుప్పగా భరిస్తున్న ధైర్య సుగుణము కలవాడా!

కుక్షింభర – ...రక్షార్థంబు భరింపరాదె యభవున్ త్రైలోక్యకుక్షింభరున్." (భీమ. 4–105) అని శ్రీనాథుని ప్రయోగం.

నవ వాసుకీ గంధయోగినాథ! రే = నూతన వాసుకము (వైకుంఠము) వలె సుగంధభరితము ప్రకాశిస్తున్న తిరుమలలో అనుగ్రహిస్తున్న యోగినాథుడా!

పవనాశనాద్రి కృపా పాలిత! రే = గాలిని ఆహారముగా స్వీకరించు పాములరాజయిన ఆదిశేషుని పర్వతముపై (శేషాద్రి) నివసిస్తూ దయతో మమ్మల్ని పాలించువాడా!

2వ చరణం:

ఆహా! మత్స్యేంద్రాకులిత! రజతాచల సింగినాదం

ఆహా! మత్స్యేంద్రనాథ సిద్ధునితో (1) కూడిన వెండికొండ యొక్క సింహనాదము కలవానిని (ధ్యానిస్తున్నాను)

మత్స్యేంద్రనాథుని జనన వృత్తాంతమిది

ఉపరిచరవసువు ఊర్వశిని చూసి మోహించిన సందర్భంలో అతని వీర్యం యమునానదిలో పడింది. (శివపార్వతుల క్రీడలోని వీర్యమని గౌరన నవనాథ చరిత్ర) ఆ వీర్యాన్ని ఒక చేప తాగింది. ఆ మత్స్యం నుండి పుట్టినవాడు మత్స్యేంద్రనాథుడని కథనం.

ఆహా! గోరక్షనాథ ప్రసిద్ధయోగం.

మత్స్యేంద్రనాథుడు దేశసంచారం చేస్తున్నప్పుడు కొంత భస్మాన్ని ఒక సంతానంలేని స్త్రీ కివ్వగా ఆమె దాన్ని పెంటకుప్పలో పడేసింది. అందులోనుండి గోరక్షనాథుడు (2) ఉద్భవించాడు. అతనిని ప్రశంసిస్తూ ధ్యానిస్తున్నాను.

అహో భువన త్రయ దేవదూతి అవిర్హోత్ర యోగిం

అవిర్హోత్రుడనగా నాగేశనాథుడు (3). దేవదూతగా పరమశివుడు త్రిపుర నాశనము చేసాడు. ఆ శివుడే వటసిద్ధనాగనాథుడనే పేరుతో జన్మించాడు.

బ్రహ్మ వీర్యంలో కొంతభాగం ఒక నాగసర్పం తలమీద పడగా దాన్ని అది తినే పదార్థమనుకుని తిని గర్భం ధరించింది. తక్షకుని పుత్రిక ఆ సర్పాన్ని ఒక మర్రిచెట్టు తొర్రలో దాచి ఉంచింది. అందులోనుండి వటసిద్ధనాగనాథుడనే పేరుతో అవిర్హోత్రుడు జన్మించాడు. అతనిని ప్రశసింస్తూ ధ్యానిస్తున్నాను.

ఆహా శంభు నవనాథ సిద్ధ యోగిం.

ఆహా ! శివుని అనుగ్రహముచే నవనాథులలో ఒకరిగా అవతరించిన సిద్ధబుద్ధనాథుని (3) ధ్యానిస్తున్నాను.

3వ చరణం:

ఆహా! అభినవాకుళితతాండవాకర! రే

= కొత్తదైన నృత్యరీతులతో కూడుకున్న తాండవపు స్థానము కలవాడా! విరూపాక్షనాథుడు (5)

ఆహా! ఆదినాథ పరమానందసింధు! రే

= ఆదినాథుడా! పరమానంద సముద్రమా! (ఆదినాథ సిద్ధుడు (6)

ఆహా! ధీర ధారాధర ! భుజగశయన! రే

= ధైర్యమేఘమా! పాము శయనముగా కలిగినవాడా! మేఘనాథ సిద్ధుడు (7), ధారధర పదంలోను, వ్యాళిసిద్ధుడు (8) భుజగశయన పదప్రయోగంలోను స్ఫురిస్తున్నారు.

ఆహా! ధిమికిటధిమికిట పదసంచలనంతో అందంగా నృత్యం చేస్తున్న మంజునాథసిద్ధుడా!

మంజునాథ సిద్ధుడు (9).

విశేషాలు

శైవసిద్ధులగు నవనాథులవలె, వైష్ణవసిద్ధులగు నవనాథులు కూడా ప్రసిద్ధులని కోరాడ రామకృష్ణయ్యగారు తమ నవనాథచరిత్ర కావ్యపీఠికలో చెప్పారు (14వ పుట) ఈ కీర్తనలో అన్నమయ్య వైష్ణవసిద్ధులగు నవనాథులను, శైవసిద్ధులగు నవనాథులను కలగలిపినట్లు తోస్తున్నది.

నవనాథ సిద్ధుల పట్టిక రకరకాలుగా ఉన్నది.

1వ పట్టిక:

ఋషభ చక్రవర్తికి ఉన్న 100 మంది కుమారులలో నారాయణాంశ కలిగినవారు నవనాథులు.

1. సత్యనాథుడు, 2. సతోకనాథుడు, 3. ఆదినాథుడు, 4. అనాదినాథుడు, 5. అకుళితనాథుడు, 6. మాతంగనాథుడు, 7. మత్స్యేంద్రనాథుడు, 8. ఘటియంత్రనాథుడు, 9. గోరక్షనాథుడు. (ఆధారం – సంకేత పదకోశము – సంపాదకులు ఆచార్య రవ్వా శ్రీహరి)

2వ పట్టిక:

మహాశివుడి అంశతో జన్మించిన మత్స్యేంద్రనాథుడు ఆ మహాదేవుడి గురుత్వంలో ఆధ్యాత్మిక విద్యను అభ్యసిస్తాడు. ఎన్నో తీర్థయాత్రలు చేసి చౌరంగి, గోరక్ష, విరూపాక్ష, మేఘ, నాగార్జున, ఖణిక, వ్యాళిసిద్ధ, మంజునాథ అనే ఎనిమిదిమందిని శిష్యులుగా స్వీకరిస్తాడు (గౌరన నవనాథ చరిత్ర – మద్రాస్ యూనివర్శిటీ ప్రచురణ 1937).

3వ పట్టిక:

గోరఖ్‌నాథ్, జలంధర్‌నాథ్, చరఫట్‌నాథ్, అపభంగనాథ, కానీషనాథ్, మచ్చీంద్రనాథ్, చౌరంగీనాథ్, రేవనాథ్, బర్తరినాథ్ (నవనాథ పురమయిన నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లోని సిద్ధులగుట్ట స్థలపురాణం).

ఇంకా శ్రీపాద వల్లభామృతచరిత్ర మొదలయినవి ఈ నవనాథుల పట్టిక కొరకు చూసాను.

వీటిలో కొన్నిపేర్లు మాత్రమే అన్నింట్లోను సమానంగా ఉన్నాయి.

అందువలన ఈ మూడు పట్టికలలోని నవనాథుల పేర్లను అన్నమయ్య కీర్తనలో అన్వేషించాను. స్వామి అనుగ్రహంతో నాకు స్ఫురించినంతవరకు వీటిలో కొన్నింటిని సమన్వయం చేయటానికి తీవ్రమైన మానసిక తపస్సు చేసాను. అందులో భాగంగా కీర్తనలో కొన్ని పదాలను మార్చే సాహసం కూడా చేసాను.

ఇది ప్రామాణికమని చెప్పే దుస్సాహసం నాకు లేదు.

అన్నమయ్య కీర్తనను అర్థసమన్వయంగా అందచేయాలనే ప్రయత్నపుపూజలో ఇది ఒక అడుగు.

ఇంకా పెద్దలకు మరికొంత స్ఫురించి, మారిస్తే సంతోషించేవారిలో ప్రథముడిని.

ఇందిరానాథుడవు యిందరికి నేలికవు
చిందరవందరలైన చింతలు మరేలా (4-209)

– తాదేపల్లి పతంజలి

31. ఇంకలేలే నీవు నాతో

సంకీర్తన: 60 రాగం: బౌళి

వాతప్రతి పుట: 62 తాళం: మఠ్య

ఇంకలేలే నీవు నాతో - నింత సేయను
అంకెకాడ వౌదువు శే - షాద్రినాథా ॥పల్లవి॥

చల్లలమ్మేవారికేలే - చందనము
చెల్లు నీవే పూసుకోరా - చిన్నివాఁడా
కల్లరివై నీవునాతో - గయ్యాళించవే
మల్లాడ వీవదినెనా - మరదలనో ॥ఇంకలేలే॥

జట్టిగా గొల్లెతలకేలే - చంద్రకావి
గట్టిగాను నీవే దట్టి - గట్టుకోరా
గట్టువాయితనమున - గవిసేవే నన్ను
పట్టకురా చుట్టమునో - పక్కమునో (నేను) ॥ఇంకలేలే॥

మందలో వారికేలే - మల్లెలు
ముందుగా నీ కొప్పులోనే - ముడుచుకోరా
అంది శ్రీవేంకటనాథ - అవురా మేలు
అందముగాగూడితివి నీ - యాలనటరా ॥ఇంకలేలే॥

'మొల్లలేలే నాకు తన్నె ముడుచుకొమ్మనవె' (సంపుటం: 6, సంకీర్తన: 108) అనే అన్నమయ్య సంకీర్తనలోని గడుసరి నాయికే ఈ సంకీర్తనలోని నాయిక కూడా!

ఈ సంకీర్తన చినతిరుమలాచార్యులవారిది! రాగిరేకులలో (చి.తి.శృ.రేకు.17) ఈ సంకీర్తన కొలది పాఠభేదాలతో బౌళి రాగం, 'వర్మ' తాళంలో ఉంది.

- గంధం బసవ శంకరరావు

32. ఇంత తరితీపులేలే?

సంకీర్తన: 234 | రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 223 | తాళం: లుప్తము

ఇంత తరితీపులేలే? – యేల గరిసించేవురా
యింతి! వింతవాడ నటవే – యిట్లైతే సమ్మతించ(ను)రా ॥పల్లవి॥

పయ్యెదలోని వేటివే – బంగారుకుండలురా
తొయ్యలిరో వెలయేమే అం – దుకు వెలలే(దురా) ॥ఇంత॥

మోవి మాట లవి యేమే – మొలకవెన్నెలలురా
పూవుబోడి పైజల్లేవే – పూవిలుతుని యాజ్ఞరా ॥ఇంత॥

(కావి)యెండ లవి యేమే – పూవు బొందు దండలురా(?)
శ్రీవేంకటనాయకుడనె – చేరి సేవసేసేరా ॥ఇంత॥

ఇది నాయికానాయకుల నడుమ సాగిన సంవాదపదముగానున్నది. వాగ్గేయరచనలశిక్షకై తమవారికి పెదతిరుమలాచార్యాదులు అలనాడు కావించిన కృషి యిందున్నట్లున్నది. ఇవి నేటికాలపు Workshop Products అనదగినవి. ఎందుకంటే తాళ్లపాకవారు వాగ్గేయరచనలు చేయుటేకాక వర్ణపద్ధతిలో పాడి చెప్పి, చెప్పించి, మెప్పించి, 'ఊరివారికెల్ల నోరనూరిపోసి'న వారుగా ప్రసిద్ధులు కదా!

– వేటూరి ఆనందమూర్తి

33. ఇంత నేరకుండిన దేఁటి

సంకీర్తన: 187 రాగం: తోడి

వ్రాతప్రతి పుట: 181 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 17వ సంపుటంలో 42వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 8)లో రాగం శ్రీరాగం)

ఇంత నేరకుండిన నదేఁటి యింతి
వింత చెలుల నెరపు విడిపించే దింతి ॥పల్లవి॥

తనిసిన మగవాని తమిరేఁచినదే యింతి
కొనగోరిసోఁకు లియ్యకొనఁ జేసినదే యింతి
కనుమూయించి నిద్దురకలలోఁ గూడిన దింతి
తననేరుపు పిమ్మటఁ దలఁపించే దింతి ॥ఇంత॥

కూడి తెల్లవారుటకు గుండె బెదరించే దింతి
ఆడఁ జేయరాని వినయాలు సేయించే దింతి
వాడుమోము తనుఁ గంటివడిఁ గళ రేఁచే దింతి
జోడువాసినఁ గన్నీరు జొబ్బిలించే దింతి ॥ఇంత॥

వన్నె ప్రాయము తనకే వ్రతము పట్టించే దింతి
యెన్నికె నిక్కువనుండి యెదురు చూపించే దింతి
యిన్నిటా శ్రీవేంకటేశు నిట్లానే చేసి కూడె
నెన్నఁగ నలమేల్మంగ యీకెపో యింతి ॥ఇంత॥

ఈ సంకీర్తన రాగిరేకులలో, శేషాచార్యులవారి వ్రాతప్రతిలో మరియు తంజావూరి ప్రతిలోనూ కలదు.

ఇంతి సౌభాగ్యమంతా ఆ శ్రీవేంకటేశ్వరునికే, ఆ ఇంతి మరెవరో కాదు, వక్షస్థలంలో కొలువైన అలమేల్మంగయే!

– గంధం బసవ శంకరరావు

34. ఇంత సేసితివి నీవే

సంకీర్తన: 184 | రాగం: నాదనామక్రియ
వ్రాతప్రతి పుట: 178 | తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 23వ సంపుటంలో 115వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 1320)లో రాగం దేసాళం)

ఇంత సేసితివి నీవే యిందాఁకాను
యెఁ(యెం)తైనాఁ గద్దు చలము యేమిసేతురా ॥పల్లవి॥

మంచిమాఁట లాడేనంటే మరి వెంగేలే తోఁచీ
చుంచుల నిచ్చకములు సూటిపడవు
లంచము మోవిచ్చేనంటే లావులఁ బెనఁగీ మోము
యెంచరాదు నాపంతము యేమిసేతురా ॥ఇంత॥

సేవలు సేసేనంటే చేతి కొనగోరు దాఁకీ
వోవరిలో మనసులు వుడికించీని
భావించి నవ్వేనంటే పగిడివెట్టినట్టయ్యీ
యీవిధము నావుదుటు లేమిసేతురా ॥ఇంత॥

మెచ్చి కాఁగిలించుకొంటే మేనిగురుతులు రాఁగీ
కొచ్చికొచ్చి సిగ్గులెల్లా గుంపుగూడీని
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితి వింతలో నన్ను
యెచ్చరించీ మర్మములు యేమిసేతురా ॥ఇంత॥

'ఇంతటికీ కారణము నీవే!, నేను నీ స్వాధీనురాలను' అంటుంది నాయిక.

వోవరి (ఓవరి) = చంద్రశాల.

– గంధం బసవ శంకరరావు

35. ఇట్టే నా సేవలును యిచ్చేటి

సంకీర్తన: 82 రాగం: శంకరాభరణము

వ్రాతప్రతి పుట: 82 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 282వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు(సంఖ్య 50)లో రాగం సామంతం)

ఇట్టే నా సేవలును యిచ్చేటి నీ యీవులును
గట్టిగా నే నల్పుఁడను ఘనుఁడవు నీవు ॥పల్లవి॥

చిన్ననిమ్మపండే కాదా చేతికిచ్చి రాజులచే
యెన్నరాని భూములకు నేలికయ్యేది
పన్ని పేరుకొని యొకపద్యము చెప్పే కాదా
సన్నల సర్వార్థములు బాగము కొనేది ॥ఇట్టే॥

గవ్వవేసి తూఁచి కాదా ఘనమైన వజ్రము
చివ్వనను విలువలు చేసుకొనేది
అవ్వల జుట్టెఁడు తాఁటియాకువాసి వేసి కాదా
యెవ్వరిచే ధనమైనా నిప్పించుకొనేది ॥ఇట్టే॥

కసవుకట్టలు వేసి కాదా గోవులచేత
కొసరుచుఁ బాలిప్పించుకొనియెడిది
యెసఁగ శ్రీవేంకటేశ యిట్టే నేను మొక్కి కాదా
పసగల నీ కృపకుఁ బాత్రుఁడ నైనది ॥ఇట్టే॥

శ్రీవేంకటేశ్వరునిపై నిండైన భక్తితో ఒక్క మొక్కు చాలు, అదియే భవసాగరాన్ని దాటించే తెప్ప!

పెదతిరుమలాచార్యులవారి సంకీర్తన.

"నీకు కేవలం ఒక మ్రొక్కు మ్రొక్కి నీ కృపకు పాత్రుడనగుచున్నాను" అని అన్నమయ్య వేంకటేశునికి విన్నవిస్తూ కొన్ని యిహలోక ఉదాహరణలు యిస్తున్నాడు.

1. చిన్ననిమ్మపండే కాదా

రాజును దర్శించబోవునప్పుడు ఎవ్వరూ రిక్తహస్తాలతో పోరాదు. తమ స్థాయికొలది ఏదో ఒక కానుకను తప్పనిసరిగా సమర్పించుకోవాలి. రాజు అనుగ్రహించి అంతకు మించిన వరాలను యివ్వవచ్చు గాక. అయితే, విప్రోత్తములు రాజదర్శనం చేసేటప్పుడు, ధనం యివ్వకపోయినా 'కానుక యివ్వాలి' అనే ఆచారము పోకుండా ఒక నిమ్మపండునో, కొబ్బరికాయనో సమర్పిస్తారు. తదుపరి తమ పాండిత్య ప్రదర్శన ద్వారా అగ్రహారాలను పొందవచ్చు. ఆ అగ్రహార భూములను సంపాదించటానికి పెట్టుబడి నిమ్మకాయ.

2. అవ్వల జుట్టెడు తాటియాకు

రాజును పొగడుతూ తాటాకు మీద కావ్యమో, దండకమో, తారావళో రాసి రాజుకు సమర్పించి, ఆయన మెచ్చి యిచ్చిన ధనాన్ని స్వీకరిస్తారు. ఆ ధనాన్ని స్వీకరించడానికి పెట్టుబడి తాటాకే కదా.

3. కసవు కట్టలు

ఎండుగడ్డి మోపులు ఆవులకు వేసి, అమృతం వంటి పాలను స్వీకరిస్తాము.

అలాగే "నీకు నేను ఒక్క మ్రొక్కు సమర్పించి అనంతమైన నీ కృపకు నోచుకున్నాను" అని అన్నమయ్య అంటున్నాడు.

– *గంధం బసవశంకరరావు*

చినతిరుమలాచార్యులు, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీనివాసమంగాపురం

36. ఇది నమ్మరాదు మన

సంకీర్తన: 27 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 29

ఇది నమ్మరాదు మన - మెన్నటికిని
పదిలము గాదిది - పాతకపు గొంప ॥పల్లవి॥

యెనసి కట్టిన యిండు - లెమ్ముకలె వాసాలు
పెనగొన్న నరములే - పెండెకట్లు
ఘనమైన చర్మంబు - కప్పు యిందుకును
మొనసి కట్టిన యంట్ల - మొత్తమీ కొంప ॥ఇది॥

వాకిండ్లు తొమ్మిది - వరుసలో నిందుకును
ఆకలియు దప్పులును - అను దినమును
మూకలను గూడుకొని - ముచ్చులొక యైదుగురు
చేకొని యుండేటి - చెరసాల కొంప ॥ఇది॥

సారమా నేటి సం- సారమే సంకెళ్లు
భారంపు కర్మాలు - పైకావలి
కోరి శ్రీవేంకటేశుఁ- గొలువ నేరనివాఁడు
యీ రీతినే వీడు - నీ మాయకొంప ॥ఇది॥

అశాశ్వతమైన, మాయతో కూడిన శరీరమనే కొంపను ఈ సంకీర్తనంలో అన్నమాచార్యులవారు వర్ణిస్తున్నారు. అధ్యాత్మవిద్యను బోధించే ఇటువంటి సంకీర్తనలు రాగిరేకుల్లో అనేకం ఉన్నాయి!

ఉదా: పదిలము కోట పగవారు (సం.1-సంకీ.61)

పై సంకీర్తనలో 'ముచ్చులొక యైదుగురు అన్న అన్నమయ్య రేకులోని సంకీర్తనలో 'దొమ్మికాండ్లైదుగురుందురు అని అని ప్రయోగించాడు.

- గంధం బసవ శంకరరావు

37. ఇన్ని యుపాయము లింక

సంకీర్తన: 139 — రాగం: గుజ్జరి

వ్రాతప్రతి పుట: 137 — తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 10వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు(సంఖ్య 2)లో రాగం గుజ్జరి)

ఇన్ని యుపాయము లింక నేడ కెక్కు శ్రీహరి
పన్ని నీ [1]మఱఁగు చొచ్చి పాయకుండీఁ గాక ॥పల్లవి॥

అనంతకోటి జన్మములందుఁ జేసిన పాపములు
మొనసి నే నొక జన్మమున నీఁగినా
ననిచి కర్మానుష్ఠానము నేఁడు సేయఁబోతే
పనివడి ముంతనీట బడబాగ్ని ఆరునా ॥ఇన్ని॥

పెక్కు కవిలెలవ్రాఁత కుంభీపాకరౌరవాలు
వొక్క దేహాననే పొంది వుత్తరించేనా
తక్కక నేఁడీ ఘోరతపములు [2]సేయఁబోతే
గక్కన జలధి బుఙ్జకాయ నిండేనా ॥ఇన్ని॥

బలువై అనాది వేళ్లు వారిన సంసారము
తలమోచి నేఁడింతలో తవ్వివేసేనా
నెలవై శ్రీవేంకటేశ నే నేఁడు పుణ్యమంటితే
చెలఁగి పెను[3] గాలికి చింపిచేఁటలడ్డమా ॥ఇన్ని॥

ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్ను గొలిచి ఆ పుణ్యాన్ని పొందితే, అనంతకోటి జన్మపాపాలు పరిహారమవుతా యంటున్నారు పెదతిరుమలాచార్యులవారు! ***– గంధం బసవ శంకరరావు***

---

1. మరంగు, **2.** శాయంబోతే, **3.** ఘాలికి.

38. ఇరు కత్తులొక్క యొర

సంకీర్తన: 8 రాగం : గౌడిపంతు

వ్రాతప్రతి పుట: 12 తాళం: లుప్తము

(ఇరు కత్తులొక్క యొర - యింతి! యెట్లుండె?
తరితీపులెట్లైన - దమి యొకటె గదరా!)[1] ॥పల్లవి॥

(జుట్టు బాయని జోడు - జక్కవ పిట్టలు
గుట్టుగా పడఁతి! యెద - గూడుండెనే
తెట్టెలై సరసాంబు)[2] - ధిలో రెండు
గుట్టలు తల దాచు - కొని యుండవేరా ॥ఇరు॥

తలచ చేగకు బుట్టు - తరుణి! నీ కన్నులు
యెలమి రెప్పల (నెట్టు - లిమి)[3] డుండెనే
పలచగా కరసాన - బట్టిన క్రొవ్వాడి[4]
యలుగులు దొన లందు - నణిగుండ వేరా ॥ఇరు॥

చూడ వేడుకయైన[5] - సుదతి! నీ నుదు[6] రెట్టు
యీడు కురులలోన - నిమిడుండెనే
యీడైన దిరువేంక-టేశుండ![7] తొలు సందె
కాడ చంద్రుని మబ్బు - గప్పియుండ దేరా! ॥ఇరు॥

శిథిలప్రాయమైన యీ రచన అన్నమాచార్యులవారిదే కాదగును. వ్రాతప్రతిలో పల్లవి భాగము, తొలి చరణమున రెండు పాదములు లోపించినవి. లుప్త పూరణములు పరిష్కర్తవి. గౌళిపంతు రాగమున తాళపత్రములందు తాళ్లపాక వారివిగా గుర్తింపబడిన ఇతర రచనలు లేకపోలేదు.

చూ. వేళ కొదవినవాడె (తంజావురు ప్రతి) - గౌడిపంతు రాగం - అట తాళం. **- వేటూరి ఆనందమూర్తి**

ఇది నాయికానాయకుల మధ్య వాకోవాక్యము. ***- గంధం బసవ శంకరరావు***

1,2, (శిథిల పూరణములు); **3.** యలమి రెప్పలలోనయిమి; **4.** పలచగాఁట్టిన క్రొవ్వాండి కడసాన; **5.** లైన; **6.** నిదు; **7.** వేంకటప్పడ (యతిభంగము).

39. (ఈ) జవ్వనం - బేలె బాలా

సంకీర్తన: 130 రాగం: మధ్యమావతి
వ్రాతప్రతి పుట: 129 తాళం: లుప్తము

(ఈ) జవ్వనం - బేలె బాలా, రవికోటి
తేజుడగు గోవింద - రాజు గలియని శ్రీల ॥పల్లవి॥

ములువాడి గోర జీ-రలు (దీర్చి చలపట్టి
పలుగాట్లు మోవి కెం-పులు గూర్చుకొను) దిట్ట
గళరేచి మిగుల తమ-కాన దనకు దాను
కళలెంచి కౌగిటను - గదియనేరని బాల ॥కీ జవ్వనం॥

పూని యారిట నీవి - పోదిగిచి యా వరుస
గా నాభిపై నురము - గండభాగములు జ
వ్వని(?) బట్టి మకరికలు - వ్రాసి చొక్కించు
వాని జొక్కగ జేసి - వన్నెకెక్కని (బాల) ॥కీ జవ్వనం॥

శ్రీవేంకటనిలయుడై - (సిరులిచ్చు) నీ తిల్ల
గోవిందుఁడేలెని ని - న్నే వగలు (పొరయక
భావించి సతిపతులు- పాటించి) మెచ్చ
భావజులన భూమి - ప్రౌఢి గాంచని బాల ॥కీ జవ్వనం॥

తిల్లగోవిందుడు

తిరుపతిలో కొలువు తీరి ఉన్న గోవిందరాజస్వామి మొదటి నివాసం చిదంబరం. ఈ క్షేత్రంలో 'తిల్ల' వృక్షాలు ఎక్కువగా ఉండటం వలన 'తిల్లారణ్యం', 'తిల్లై' అనే పేర్లు వచ్చాయి. చోళరాజైన మొదటి కులోత్తుంగుని కాలంలో (క్రీ.శ. 1070-1120) చెలరేగిన మతఘర్షణలలో చిదంబరంలోని గోవిందరాజస్వామి విగ్రహం దెబ్బతినకుండా భక్తులు తిరుపతికి చేర్చి సంరక్షించారు. 'తిల్లై' నుండి వచ్చిన స్వామి కాబట్టి తిరుపతిలోని గోవిందరాజస్వామిని 'తిల్ల గోవిందరాజస్వామి' అంటారు.

ఇంకొక ఐతిహ్యం ప్రకారం చిదంబరంలోని గోవిందరాజస్వామి సముద్రం పాలవ్వగా 'తిల్ల' అనే పేరుగల స్త్రీ ఏదోవిధంగా కాపాడి తిరుపతికి చేర్చింది. 'తిల్ల' రక్షించిన గోవిందుడు కాబట్టి ఆ స్వామికి 'తిల్లగోవిందుడు' అని పేరు వచ్చింది. (తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి దేవాలయము, డా॥ పి. నారాయణ, 2004, పుట. 49)

చారిత్రకంగా చూస్తే రెండవ ఐతిహ్యం కంటే మొదటి ఐతిహ్యం విశ్వసనీయం. ప్రాచీన క్షేత్రమైన చిదంబరం నుండి వచ్చుట చేత గోవిందరాజస్వామిని తిరుమల శ్రీనివాసునికి అన్నగా భావిస్తారు. తిరుపతిలో గోవిందరాజస్వామి ప్రతిష్ఠ 24.2.1130 న జరిగి ఉండవచ్చు. (తిరుపతి చరిత్రము, అను: దీవి రంగనాథాచార్యులు, తి.తి.దే. ప్రచురణ, 2003, పుట.306)

సంపుటము 13లో 334వ సంకీర్తన "తేటతెల్లమాయె తిల్లగోవిందుడా" అనే కీర్తన మరొక్కటి మాత్రమే తిల్లగోవిందుని ప్రస్తుతిస్తున్నది. ఈ సంపుటంలో తిల్లగోవిందునిపై మరొక రెండు సంకీర్తనలు ఉన్నాయి. అన్నమాచార్యులవారి గోవిందరాజస్వామి కీర్తనలు పరిశీలిస్తే అన్నమయ్య దృష్టిలో గోవిందరాజస్వామికి, శ్రీ వేంకటేశ్వరునికి అభేదమని తెలుస్తున్నది.

– గంధం బసవ శంకరరావు

శ్రీరంగదేవాలయ స్తంభంపై అన్నమయ్య

40. ఈ తప్పు జేసినందుకా

సంకీర్తన: 46 రాగం: శంకరాభరణం

వ్రాతప్రతి పుట: 47 తాళం: లుప్తము

ఈ తప్పు జేసినందుకా - యింత జేసేది
మతకరివాని పొందు - మరి నమ్మ దగదు ॥పల్లవి॥

కలికి! నీ గుబ్బలపై - గందము బూసినందుకా
వులికి నన్ను జూసి - వొరసేది
యిలలో కఠినుల - కెంత సేవ చేసినా
మొన(ల?) జూపేది వారి గుణ - ముగదె చెలియ ॥ఈ తప్పు॥

ముదిత! నీ కెమ్మోవి - ముద్దు గొన్నందుకా
చెదరిన రాగముతొ - జిమ్మిరేగేది!
పదరి బత్తి సేసితే - పలుచనివాఁడు, తన
యెదలోనినొప్పిగా - నెంచగా దలఁచునా ॥ఈ తప్పు॥

కామిని నీ మేను బిగ్గె - కౌగిలించినందుకా
చేమంచి రతుల నన్ను - జెనకేది!
యీ మై శ్రీవేంకటప్పఁ - డెద నుంచినందుకా
వోమి నా చేత తన - వోజలు విడి(చేది)! ॥ఈ తప్పు॥

నాయకుడు నాయికపై కుమ్మరిస్తున్న వలపు ఇది! వలపు భావకోశంలో ఇదొక మేలిమి ముత్యం!

మతకరివాడు = మాయావి.

- గంధం బసవ శంకరరావు

41. ఈయవే నాకభయంబు

సంకీర్తన: 42 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 43

ఈయవే నాకభయంబు - యింతిరో! నీవు నేను
పాయము కాయము (గదిసి) - పదవిపై నుందామే ॥పల్లవి॥

తమకపువాన గురిసెనే - తరుణీ! తాళగలేనే
ప్రమదముతో నేనీ పయ్యెద - పంచ జేరియుండేనే
కొమరుదేంట్లు తరమీనే - కోమలి వెరపయ్యానే, నె
య్యము మీరగ జోడుకూడి నీ - యండనె జేరుండేనే ॥ఈయవే॥

వలపు వెల్లిబారీనే ఓ - వనితా యీదగలేనే
కొలదిమీరు నీ చను - గొండలైన బ్రాకుండేనే
చిలుకు చిగురు మరుడేసీనే ఓ - చెలియా తాళగలేనే
కలికీ! నీకౌగిటి పాళ్యాననైన - కాపురముండేనే ॥ఈయవే॥

వేడి వెన్నెల చీకట్లాయనే - వెలదీ దిగవిడువకువే
చూడజూడ నీ చూపుల వెలుగున - సుఖమువాడనై వుండేనే
నాడెల్లా నేలు శ్రీవేంకట - నాథుఁడ రమ్మని కూడితివి
జోడువీడక మేడమీద - వేడుకతో గూడుందామే ॥ఈయవే॥

తిరుపతి తాళ్లపాక సంకీర్తనలు ప్రతిలోనేకాక యీ సంకీర్తనము తంజావూరు తాళపత్ర ప్రతి D465లోనూ కలదు. కానీ సొగసైన భావాలు గల ఈ పాట రెండు వ్రాతప్రతులలోనూ శిథిలమై రూపు చెడియున్నది. తృప్తిగాలేకున్నా, విడువను మనసు రాక, దిద్దనూ కుదరక, రెండు పాఠాంతరాలనూ దగ్గరపెట్టుకొని దీనికొక రూపు కల్పించుటైనది.

నాయకుడు తనను విడిచి పెట్టవద్దని నాయికకు వేడికోలు.

పదవి = ఉన్నతస్థితి (శబ్దరత్నాకరము).

- గంధం బసవ శంకరరావు

42. ఈలాగు ప్రాణేశు

సంకీర్తన: 186 రాగం: నాదనామక్రియ
వ్రాతప్రతి పుట: 180 తాళం: లుప్తము

ఈలాగు ప్రాణేశు - డెన్న డెడబాయడే
యేలాగు వేగించు - నికను నేను ॥పల్లవి॥

అలిగినపుడే విభుని - ఆలింగనము చేసి
కలకలని నవ్వింతు - గానా నేను
చె(చ)లిమి బలిమిని మోవి - చవి చూపి తమ్ములము
కలయ వాతెర నుంతు - గా నేను ॥ఈలాగు॥

పరిమళములు నింద గు - బ్బల మీద నలదుకొని
గరగరకెతో నుందు - గా నేను
సరసతను సురతోప - చారమున విభు మనసు
కరగించిపైకొందు - గా నేను ॥ఈలాగు॥

చలముకొని విభు పచ్చ - డములో బవళించి
కల సుద్దులేమందు - గా నేను
అలమేలుమంగ (శ్రీ) వేంక - టాచలాధీశు కౌగిట
కలికితనమున నుందు - గా నేను ॥ఈలాగు॥

ఉచ్చారణా రూపాంతరాలు ఇందు గుర్తించవచ్చును ఉదా: చెలిమి - చలిమి

పచ్చడము = పఱపుమీఁద పఱచెడు దుప్పటి;

"వెన్నెల వెల్లపచ్చడము విచ్చిన యంబరశయ్య మీఁద." లక్ష్మీ. 3,ఆ (శబ్దరత్నాకరము).

గరగరికె = శుభ్రము.

కలికితనముతో విభుని అలరించు నాయిక ఈ సంకీర్తనలో ప్రత్యక్షం!

- గంధం బసవ శంకరరావు

43. ఉత్తమము చెప్పబోతే

సంకీర్తన: 131 రాగం: ముఖారి

వ్రాతప్రతి పుట: 129 తాళం : లుప్తము

ఉత్తమము చెప్పబోతే - ఒకటిపై నొకటవు, వాని
చిత్తము రంజిల్ల సేవ - జేయవే గొబ్బునను ॥పల్లవి॥

చేరెడు పంచదార వే - (సినదా చిలుకకు బుద్ధి సెప్పి
చేరదీసి మాటలెల్లా - జెప్పి యొప్పించేది)
సారెకు మొక్కిమొక్కి వే - సారితిమి యీ యలక
దీరదు నీ చేతగాని - దిద్దవే గొబ్బునను ॥ఉత్తమము॥

పుట్టెడు జవ్వాది - (పూసిగాదె పడతుల
నొట్టి రతుల కువ్వి - ళ్లూరించేది)
గుట్టుతోడ పాదాలు - బట్టుకొని వేసారితిమి
కట్టడిగాదు సమ్మతి - గా జేయవే గొబ్బునను ॥ఉత్తమము॥

యిచ్చవచ్చినట్లెల్లా - (మచ్చిక గల విభునితో
ముచ్చటలాడంగ నే - మో)పమమ్మ
గుచ్చి (యలమేల్మంగ - గూడితె శ్రీవేంకటేశ
హెచ్చు వేడుకలకుర - మెక్కవే గొబ్బునను ॥ఉత్తమము॥

మూడు చరణాలలోనూ మొదటిపాదంలో సగం, రెండవపాదం పూర్తిగా లుప్తములు, వీటిని పరిష్కర్త పూరించెను.

- గంధం బసవ శంకరరావు

44. ఉవిదతనులత యేఁటికులికి

సంకీర్తన: 282 రాగం: ఆహిరి

వ్రాతప్రతి పుట: 267 తాళం: జంపె

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 348వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 89)లో రాగం ఆహిరి)

ఉవిదతనులత యేఁటికులికి పడెనే
కవ మదనబాణాగ్నిఁ గాఁగదుగదా ॥పల్లవి॥

వనితలావణ్యంపు వదనశశికలములు
చనుగిరులపైనేల జారిపడెనే
వెనకఁదుర(రు?)మను రాహు వేవేలు రూపులై
తనర ముఖచందురుఁడు తలకఁడుగదా ॥ఉవిద॥

మొలకలై గుమురులై ముదితమై మరునంప-
ములుకులంతటనేల ముణుఁగఁబడెనే
పొలయు మరునస్త్రమటు[1] పుంఖానుపుంఖములు
పొలఁతిమీఁదనె రాశివోయఁడు గదా ॥ఉవిద॥

కొమరైన పెనుదండు కుసుమాయుధుఁడు గదలి
తెమలి రాకిపుడెట్లఁ దిరుగఁబడెనే
విమలాంగికౌఁగిటను వేంకటేశ్వరునిఁ గని
భ్రమసి ప్రతిదండనుచు పదరఁడుగదా ॥ఉవిద॥

నాయిక తనువనే లత మదనుని దండుకు గురియైనదట! ప్రతి దండు వేంకటేశ్వరుడట!!

– గంధం బసవ శంకరరావు

1. ములు.

45. ఎంతకత నడిపితివి

సంకీర్తన: 175 రాగం: నాదనామక్రియ

వ్రాతప్రతి పుట: 170 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 2వ సంపుటంలో 315వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు(సంఖ్య 165)లో రాగం నాదరామక్రియ)

ఎంతకత నడపితి వేమి జోలిఁ బెట్టితివి
చింతించ లోకములు నీచేతివే కావా ॥పల్లవి॥

కౌరవులఁ బాండవుల కలహము వెట్టనేల
నేరిచి సారథ్యము నెఱపనేలా
కోరి భూభార మణఁచే కొరకైతే నీచే చక్ర-
మూరకే వేసితే దుష్ట లొక్కమాటే తెగరా ॥ఎంత॥

చేకొని వానరులఁగాఁ జేయనేల దేవతల
జోకతో లంకాపురి చుట్టుకోనేల
కాకాసురు వేసినకసవే రావణుమీఁద-
నాకడఁ జంపువెట్టితే నప్పుడే సమయఁడా ॥ఎంత॥

గక్కన శ్రీవేంకటేశ కంబములో వెళ్లనేల
చొక్కముగాఁ బ్రహ్లాదుఁడు చూపఁగనేల
చిక్కక హిరణ్యకశిపునాత్మలో నుండక
తక్కించి నీవెడసితే తానే పొలియఁడా ॥ఎంత॥

ఓ స్వామీ! నీ లీలలు ఆశ్చర్యకరములు! జగన్నాటక సూత్రధారివి! నీవంటున్నాడు అన్నమయ్య!!

– గంధం బసవ శంకరరావు

46. ఎంతగాలమొకదా

సంకీర్తన: 33 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 34

(ఈ సంకీర్తన 1వ సంపుటంలో 316వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 62)లో రాగం శ్రీరాగం)

ఎంతగాలమొకదా యీ దేహధారణము
చింతాపరంపరలఁ జిక్కువడవలసె ॥పల్లవి॥

వడిగొన్న మోహంబువలలఁ దగులై కదా
కడలేని గర్భనరకము లీఁద[1]వలసె
నడిమి సుఖములచేత ననుపు సేయఁగఁగదా
తొడరి హేయపుదిడ్డిఁ దూరాడవలసె ॥ఎంత॥

పాపపుంజములచేఁ బట్టువడఁగాఁగదా
ఆపదలతోడి దేహము మోవవలసె
చూపులకులోనైనసుఖము గానక[2] కదా
దీపనభ్రాంతిచేఁ దిరిగాడవలసె ॥ఎంత॥

హితుఁడైన తిరువేంకటేశుఁ గొలువకకదా
ప్రతిలేని నరకకూపమునఁ బడవలసె
అతని కరుణారసం బబ్బకుండఁగఁగదా
బతిమాలి నలుగడలఁ బారాడవలసె ॥ఎంత॥

'పునరపి జననం; పునరపి మరణం అన్న రీతిలో ఎన్నాళ్లు ఈ దేహాన్ని ధరించటం (విశిష్ట ప్రయోగం) – ఈ క్రమాన్ని, చక్రాన్నీ ఛేదించాలంటే హితుడైన తిరువేంకటేశ్వరుణ్ణి కొలువమంటున్నారు అన్నమాచార్యులవారు!

– *గంధం బసవ శంకరరావు*

తా.వే.శేషాచార్యులవ్రాతప్రతిలో (34) **1.** నరకగర్భమునఁ బడవలసె నిడురేకు 18; **2.** గోరఁగఁగదా?

47. ఎంతదొరవైన నీవు

సంకీర్తన: 167 రాగం: పంతువరాళి

వ్రాతప్రతి పుట: 163 తాళం: పంచఘాత

ఎంతదొరవైన నీవు పెనంగక - నేనూరకుండుదునా
వంతుకు వంతునే (సేసి - వదలక) మానను ॥పల్లవి॥

చెంగావి పయ్యెదజార నా గుబ్బలు - చేత నీకు బిగబట్టవచ్చునట
చెంగట నా కొనగోర నీ - చెక్కిలి జీరగరాదా
రంగుగ నా మేని గంధమెల్ల నీకు - రాజిల్ల బెనగవచ్చునట
యెంగిలంటా చౌకరించేవు నీ మోవి - యించుక నొక్కరాదా ॥ఎంత॥

కురులవిరులు జారగా నాకిటు - గొప్పుననొడిసి పట్టవచ్చునట
నెరజాణ ననుకొందువు నే - నీముంగురులైన బట్టరాదా
తరితీపుల నీవు నన్నిట్టె - తమకించి యలయించవచ్చునట
కరకరిజేసి నా కౌగిటిలో నిన్ను - కళలంటియుంచరాదా ॥ఎంత॥

కడు తమకాన శయ్యపై నీవు నా - కట్టుకొంగెడవించవచ్చునట
జడియక నేనిన్ను బట్టి యుపరతి - సలుపగరాదా
బడలికదీర అలమేలుమంగ - పతినై కూడుండవచ్చునట
తడబడక శ్రీవేంకటనాథ నే - దక్కితిననరాదా ॥ఎంత॥

పంచఘాత: అయిదు దెబ్బలతో నడిచే తాళమా? సంగీతజ్ఞులు తెలుపవలయును.
ముద్రను బట్టి చినతిరుమలాచార్యులవారి పదం కావచ్చును.

- గంధం బసవ శంకరరావు

48. ఎంత నెరజాణడమ్మ వాడు

సంకీర్తన: 251 రాగం: సౌరాష్ట్ర
వ్రాతప్రతి పుట: 241 తాళం: అట

ఎంత నెరజాణడమ్మ వాడు, తన - పంతము చెల్లించుకొనెను
చెంతజేరి పాయకుండునె యేవేళ - చెంజి నవనీతకృష్ణుడు ॥పల్లవి॥

ముద్దుపెట్టుకొనవచ్చునె నా - చెక్కుటద్దములు మాటిమాటికి
కొద్దిగా గమ్మ కస్తూరి నానుదుట - తిద్దేననునే గోర ॥ఎంత॥

గట్టిగుబ్బలె మర్దించి యిరుగేల - బట్టుపట్టి బిగియించునే
గుట్టుతోడనుండ నియ్యడే, యిందరిలో - చెట్టబట్టి తియ్యవచ్చునే ॥ఎంత॥

శృంగారముగా నెదమీద నిన్నలమే - ల్మంగవలె నుంచేననేనే
అంగన! వేంకటరాయడు ననుప్రేమ - నంగజకేళి గూడెనే ॥ఎంత॥

అలమేలుమంగతో కూడిన వేంకటముద్రను బట్టి యీ శృంగారకీర్తనము పెదతిరుమలాచార్యులవారిది కాదగును. కాని, యిది చెంజినవనీతకృష్ణ ముద్రాంకితము గనుక చిన్నన్న రచనయు కావచ్చును. ఎవ్వరిదైనను ఇది మాత్రము తాళ్లపాకకవుల సంకీర్తనమే అనుట విదితము. తాళ్లపాక సంకీర్తనలు అను గ్రంథనామమే అందుకు నిర్ధారకము. ఇందలి యతులు, ప్రాస యతులు తెలుగుదనమును చాటుచున్నవి. పల్లవి ఆరంభమే దీనికి నిదర్శనము.

- వేటూరి ఆనందమూర్తి

నవనీతకృష్ణుడు ప్రేమతో చెంతచేరి నాయికను వీడకున్నాడట!

'చెంజి' (జింజి) తమిళనాడులోని విళ్లుప్పురం జిల్లాలో ఉన్న ఒకప్పటి బలమైన రాజధాని కేంద్రం. విజయనగరం సామంతరాజ్యాలలో ఒకటి. విజయనగరకాలంలో నాటి ప్రసిద్ధ స్థలాలలో నవనీతకృష్ణాలయాలను నిర్మించారు.

- గంధం బసవ శంకరరావు

49. ఎంత మాయదారివాడు

సంకీర్తన: 107 — రాగం: అమరసింధు

వ్రాతప్రతి పుట: 107 — తాళం: ఏక

ఎంత మాయదారివాడు - యెట్టులైన సేయగలడు
వింతలు నేర్చినవాడు గో - (విందుడు వీడు) ॥పల్లవి॥

మ్రొక్కేననినా వినడు - ముద్దు వెట్టినా నొల్లడు
పక్క పండనైనా రాడు - పణతీ! వీడు
నిక్కెపు మాటలాడడు - నేరమిదనీ యెంచడు
దక్కితినన్న గైకోడు - తరుణీ! వీడు ॥ఎంత॥

పువ్వులు సిగజుట్టడు - పొత్తులనారగింపడు
నవ్వు(తా)యింటికి రాడు - నాతిరో! వీడు
రవ్వగా మాటలాడడు - రంగుగ జోడుపాడడు
దవ్వులనుండీ చూడడు - తరుణీ! వీడు ॥ఎంత॥

గందము మేనబూయడు - గట్టిగ గుబ్బలలమడు
సందీయని కౌగిలీయడు - సఖియా! వీడు
విందై వేంకటరాయడు - వెలదిని గూడిపాయడు
యిందరిలో నెవ్వతె నా - యీడూ జోడూ? ॥ఎంత॥

వింతలు నేర్చిన గోవిందుని చేష్టలను నాయిక తేటతెల్లం చేస్తుంది.

- గంధం బసవ శంకరరావు

50. ఎంత మాయదారి

సంకీర్తన: 183 | రాగం: కేదార
వ్రాతప్రతి పుట: 177 | తాళం: లుప్తము

ఎంత మాయదారి వీ - డెంత యాగడీడు
కాంతరో యిట్టివాని - గంటిమా యెందైనా ॥పల్లవి॥

చిన్ననాడె నేను - జన్నెవట్టితి నేను
కన్నెరో! యెన్నడాయ - కనికరము లేక ॥ఎంత॥

కొమరె పాయము నాడె - కోరికమీదెత్తితి
రమణి! యింటికొక్కసారి - రాడాయ వీడు ॥ఎంత॥

వయసునాడె లేమకై - వ్రతము బట్టితి, వలపు
భయము లేక శ్రీవేంకట - ప్రభుడు నన్నిపుడు గూడె ॥ఎంత॥

చరణానికి రెండేసి పాదాలు మాత్రమేకల సంకీర్తన ఇది. ఇటువంటివి తాళ్లపాకవారి సాహిత్యంలో కలవు.

మాయదారి, ఆగడీడైన వేంకటప్రభుని వలపులకై పరితపించి, తుదకు ఆ వలపును సొంతం చేసుకుంటుంది. ఈ సంకీర్తనలోని నాయిక.

- గంధం బసవ శంకరరావు

51. ఎంత మేలు చేసినదో

సంకీర్తన: 217 రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 206 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 6వ సంపుటంలో 42వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 48)లో రాగం సామంతం)

ఎంత మేలు చేసినదో యేమిచెప్ప చిత్త
మంతయు నీకిచ్చిన యొయ్యారి యెవ్వతెరా ॥పల్లవి॥

దాడింబ పువ్వులవన్నె తళుకుఁబయ్యెద కొంగు
వేడుకతో వల్లెవాటు వేశి
గోడనెక్కి చూచి తనకొప్పు చెంగలువబంతి
నోడక వేసినయట్టి యొరపరెవ్వతెరా ॥ఎంత॥

కంకణాల మెఱుఁగుల కరము లొయ్యన యిరు
వంకల చెలులమీఁద వైచి
కొంకక తమలపాకు కొనవంక గఱచి నీ
వంక చూచి సన్న సేసె వనిత యెవ్వతెరా ॥ఎంత॥

పిక్కటిల్లునట్టి తన బిగువుఁజన్నుల కాంతి
వెక్కసమై యిరువంక వెడల
యెక్కువతోఁ దిరువేంకటేశుండ నిన్నుఁ గూడి
చెక్కునొక్కి కౌఁగిలించె చిత్తిణి యెవ్వతెరా ॥ఎంత॥

చిత్తమంతా శ్రీవేంకటేశ్వరునికే సమర్పించినదట నాయిక, ఇదే కదా అనన్యమైన భక్తి!

దాడింబ = దానిమ్మ.

– *గంధం బసవ శంకరరావు*

52. ఎంత రాతి మనసుది

సంకీర్తన: 120 — రాగము: సౌరాష్ట్ర

వ్రాతప్రతి పుట: 119 — తాళం: లుప్తము

ఎంత రాతి మనసుది - యెంత కట్టడి గలది
పంతమిందునగానియేరు - పడదాయనా ॥పల్లవి॥

పక్కున పూవుదాకితేనే - పాలుగారీని చెక్కులు
ఉక్కుగోటికొద్ది యెట్టు - నొక్కి చొక్కించితిరా
మక్కువ నాసరిగా - మన్నించితేనేమాయ, తన
చక్కదనమిందుగాని - యెక్కుడు గాదాయనా ॥ఎంత॥

అంటిన గొబ్బునకందు - నంట నీమోవి వజ్రపు
పంటికొద్ది యెట్టునొక్కి - గంటి జేసితివిరా
నంటున గోరంటగా చ - నవిచ్చితేనేమాయ, తన
దంటతనమెందునగాని - తలకూడాదాయనా ॥ఎంత॥

వొరసితే వసివాడు - (విరిచెండు నీతనువు)
బిరుసు చంటి కొద్ది యెటు - బిగియించితివిరా
తిరువేంకటాధిప! నీ - తరుణైతె నేమాయ, తన
దొరతనమందుగని - తుదిముట్టదాయనా ॥ఎంత॥

నాయిక చక్కదనము, దంటుతనము, దొరతనము వర్ణితాలు!

- గంధం బసవ శంకరరావు

53. ఎంత సేసినా సేయనీ

సంకీర్తన: 242 రాగం: భైరవి

వ్రాతప్రతి పుట: 231 తాళం: లుప్తము

ఎంత సేసినా సేయనీ - యేమాయను, నా
యంతరంగమెల్ల తా - నై యున్నాడే చెలియా ॥పల్లవి॥

చలము సాధించి నాకు - చనవియ్యకుండుగాని
కలనైనా కూడకుండఁ - గర్తయటవే
పలుకబడీనని కో - పము దెచ్చుకొనీగాని
సొలసి దవ్వులనుండి - చూడనైనా నియ్యడా ॥ఎంత॥

కనుగొందునోయని యి - క్కడికి రాకుండుగాని
తనమేలు విని సం - తసమంద నీయడా
తనుసంగమమునకు - దాకర్త యింతేకాని
మనసులో కూడకుండ - మగువ! తానెవ్వడే ॥ఎంత॥

చిత్తములో ప్రేమ వం - చించుగాక నామేన
హత్తుకొన్న పులకల - నాగీనా తాను
చిత్తజుకేళిని నేడు - శ్రీకృష్ణుడు ననుగూడె
కొత్తలు సేసితే తన - గుట్టు నే దెలియనా ॥ఎంత॥

చక్కటి ఈ శ్రీకృష్ణపదం పరమాత్మపట్ల అనన్యమైన భక్తిని ప్రకటిస్తున్నది.

తన అంతరంగమంతా తానే ఉన్నాడని పరమాత్మపట్ల అనన్యమైన భక్తిని ప్రకటిస్తున్నది ఈ సంకీర్తనలోని నాయిక!

- గంధం బసవ శంకరరావు

54. ఎటువంటి మోహమో

సంకీర్తన: 122 రాగం: సౌరాష్ట్ర
వ్రాతప్రతి పుట: 121 తాళం: లుప్తము

ఎటువంటి మోహమో - యింతి! యిదిగో నేడు
తటుకున నిన్ను పేర్కొని - తనకు దానె సిగ్గుపడును ॥పల్లవి॥

అప్పటప్పటికి నీముద్రిక - నట్టె కన్నులనొత్తుక
తప్పక (మదిని) నీ మాటలే - తలచి తల యూచును
చొప్పడ నీరూపమె వ్రా - సుక చూచి ముద్దాడును
కప్పిన తమిని తానె పలికి - కన్నీరు లోలో నించును ॥ఎటువంటి॥

(చెలితోడ) నీమన్ననలెల్ల - చెప్పి చాలాపులకించును
వులికి నిన్నూరకే పిలిచి - వుసురని వెరవుపడును
నెలవుగ అన్నియు మాని నీ - కాలి (చప్పుడాలకించును)
తొలగక నీవు వచ్చే - దోవే తప్పకచూచును ॥ఎటువంటి॥

గక్కున నిన్ను కనుగొంటేను - కడు తానె ముందైపైకొనును
అక్కరతో నిన్ను దగ్గరున్నప్పుడె - యట్టె (తానునరుగును)
(చక్కని) యలమేలుమంగ - సరుగున శ్రీవేంకటేశ
చిక్కి నీకౌగిటిలో నీ - చిత్రమై పరవశమౌను ॥ఎటువంటి॥

అభిసారికయై 'స్మరణ' భక్తితో పరవశించే నాయిక ఈ సంకీర్తనలో సాక్షాత్కరిస్తుంది.

- గంధం బసవ శంకరరావు

55. ఎటువంటి రాజీకమే

సంకీర్తన: 143 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 141

(ఈ సంకీర్తన 13వ సంపుటం పీఠికలో ఉదాహృతమైనది, రాగం కేదారగౌళ, తాళం ఝంపె)

ఎటువంటి రాజీకమే చెలియ నేడు
కటకటా యెందైన కంటిరా మీరు ॥పల్లవి॥

గోరంట్లసీమ పెనుకూటంబు మూకచే భారంబుదుర్గములు పట్టువడెను
సారెసారెకు మధ్యదేశంబు బయలాయె చేరి మధురాపురము సూరలటు బోయెన్ ॥ఎటువంటి॥

కదిసి యట్టిట్టాయె కాశ్మీరమండలము నెరిచిక్కువడెను కుంతలరాజ్యము
మ(వ?)రుస చీకాకాయె నెరి కుంభకోణంబు తురువుగాయల గోలకొండలోనాయెన్ ॥ఎటువంటి॥

వింతపూర్వుల పూర్వులిదదండు విడిచిన కొండ తామెరకోలన కోలుపాయె
నంత శ్రీవేంకటేశుడలమేలుమంగజేరి సంతతము కల్యాణసామ్రాజ్యమేలెన్ ॥ఎటువంటి॥

చెన్నపురి వీణ రామానుజయ్య అను పండితుడు 1912లో ప్రకటించిన 'సంగీత సర్వార్థసార సంగ్రహము' గ్రంథం నుండి ఈ సంకీర్తనను ఉద్ధరించి శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు తాళ్లపాక పదసాహిత్యం సంపుటం 13 పీఠికలో ప్రకటించారు!

తంజావూరి ప్రతిలోనూకల ఈ సంకీర్తన చారిత్రక సత్యాలను ప్రకటిస్తున్నది.

– *గంధం బసవ శంకరరావు*

56. ఎటువంటివాఁడవో నీ మహిమ

సంకీర్తన: 54 రాగం: శంకరాభరణం

వ్రాతప్రతి పుట: 55 తాళం: అట

(ఈ సంకీర్తన అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుట 23-24లలో ఉదాహృతం)

ఎటువంటివాఁడవో నీ మహిమ లెట్టు దెలియవచ్చును
నిటలలోచనుఁడు అజుఁడు తెలియలేరు నిన్నెట్లు దెలిసేరు మానవులు ॥పల్లవి॥

తిరుమలనంబి తా తాత యన్ననాఁడె తెలిసెఁ బో మీ పెద్దతనములు
కురువనంబిగారి చేతి బంకమట్టి పువ్వులు కొన్ననాఁడె తెలిసె మీ భోగము
మఱియు ననంతాళువారి చెఱువు గట్ట మన్ను మోయఁగా దెలిసె మీ నటనలు
గరుడగంభముకాడ కాసు కొక్కవరమిచ్చి గడియించఁ దెలిసె మీ సంపద ॥ఎటువంటి॥

తొండమాంజక్రవర్తికి సంపద తొలుత నియ్యఁగాఁ దెలిసె మీ యీవులు
అండ యెఱుకువారి కొఱ్ఱచేని యెన్ను లారగించఁగాఁ దెలిసె మీ రుచులు
వుండి గొల్లల కావిళ్ల పాలెల్ల వుట్టుకోఁగఁ దెలిసె మీ నేమములు
దండిగ సంపంగిమాఁకుల నడిపించ దైవరాయ తెలిసె మీ విద్యలు ॥ఎటువంటి॥

మును దాసు తిమ్మన్న తుంబురుకొండకు మోక్షమియ్యఁగాఁ దెలిసె మీ బుద్ధులు
పనివడి తాళ్లపాక అన్నమయ్యగారి పదములలోఁ దెలిసె మీ వోజలు
యెనయ శ్రీవేంకటనాథ యలమేల్మంగ నెద నుంచఁగాఁ దెలిసె మీ గోప్యము
వెనుకొని పరుషవారి కెదురువోయి వెంటరాఁగాఁ దెలిసె మీ రాజసము ॥ఎటువంటి॥

అనేకమంది వైష్ణవభక్తులను ఆ వేంకటేశ్వరుడు కరుణించిన వైనమే ఈ సంకీర్తనం!

పరుషవారు = తీర్థయాత్రికులు.

- గంధం బసవ శంకరరావు

57. ఎటువలె నా ప్రాణేశుని

సంకీర్తన: 230 రాగము: శంకరాభరణం

వ్రాతప్రతి పుట: 219 తాళం: లుప్తము

ఎటువలె నా ప్రాణేశుని - యెప్పుడు నాతో గూరిచి
(యి)టువలె నా ప్రాణంబులు - యెత్తుకొనే వొకొ చెలియా ॥పల్లవి॥

పడతుక! (మల్లెలు మొల్లలు) - పచరించిన చిరునవ్వులు
అడవిని కాసిన వెన్నెల - యై పోవకయుండా;
విడువక[1] వీనులవిందై - వేడుక చూపెడు నా పా
టడరెడు చెవికి (ది) కిన్నెర - యై పోవక యుండా ॥ఎటువలె॥

జలజానన! చొక్క (పు పొం - జక్కవలగు) పాలిండ్లివి
అలుకని చిలుకని విందులె - యై పోవకయుండా;
కొలదికి మీరిన తేనెలు - గులికెడు నా కెమ్మోవు(ల)
ఫలమందని మాని ఫలం - బై పోవక యుండా ॥ఎటువలె॥

ఘనకుచ![2] పసుపడు[3] మినుకులు - దొణికెడు ముద్దుల నా మో
మనిశము (చే)కొను [4](న)ద్దం - బై పోవకయుండా;
పనివడి సమరతి వేంకట - పతితోనే నా ముచ్చట
లనయము [5]రాచిలుకల చదు - వై పోవకయుండా ॥ఎటువలె॥

ఈ వ్రాతప్రతిలోని పాటలు కొన్ని శిథిలప్రాయములై ఉన్నవి. సాధ్యమైన తావుల శక్యమైన సంస్కారములు సూచితములైనవి. లేనిచోట్ల అట్లే విడచుటైనది. "వేంకటపతి" ముద్రతో శిథిలరూపానగల యీ పాట ఇప్పటికి మనమెరిగినవారిలో ఎవ్వరిదో స్పష్టముగా తెలియరాకున్ననూ ఇది నాటి తాళ్లపాకవారిదన్నది మాత్రము నిశ్చయము.

- వేటూరి ఆనందమూర్తి

---

1. చెవుల బడలిక తొలగించే ఇంపైన పాటలూ, కిన్నెర మీటులూ కూడా శూలములవలె విరహుల చెవులకు బాధను కలిగించుచున్నది. తాళ్లపాకవారి భావకోశములో నున్నమాటే! అట్లు కాకుండుగాక అని భావము; **2.** పసుపడు = అలవాటగు; **3.** మినుకులు = జిగేలు మను కాంతులు; **4.** అద్దంబైపోవుట = అద్దములోని ప్రతిబింబము వలె అస్థిరమగుట; **5.**రాచిలుకల చదువులు = అర్థము తెలియని, అనుభవమునకు రాని అనుకరణ ప్రాయములైన చదువులని భావము.

58. ఎట్టుగలిగెనె లలన

సంకీర్తన: 49 రాగం: శంకరాభరణం
వ్రాతప్రతి పుట: 50 తాళం: లుప్తము

ఎట్టుగలిగెనె లలన - యెటు (నే) దెలియగలన
యిట్టి మధుకర కలన - హృదయేశువలన ॥పల్లవి॥

కొప్పుఁగూడని కురులు - కురువాడియున్న విరులు
ముప్పిరిగొను కంటసరులు - ముద్దుమోముపై గురులు
దప్పిదేరు ముఖసిరులు - దళుకొత్తు కుచగిరులు
చిప్పిలు నొసటి చెమరులు - చెక్కు చందురులు ॥ఎట్టు॥

నడపులోపలి యలపు - నవ్వుమాటల సొలపు
నిడుదపయ్యట వలపు - నిదుర కలగలపు
వొడలి పులకలమొలపు - వువిదయుండెడి సొలపు
సుడిగొన్న మైయలపు - సోద్యంపు తలఁపు ॥ఎట్టు॥

పలుకులోపలి కొదలు - పతినిబాయని కదలు
గిలుకు మెట్టెల (రొదలు) - కెంపు కనుతు(దలు)
పొలుపారు నీవి వదలు - పొందు హర్షపు కథలు
గెలుపు సంపద (మెదలు) - కృష్ణుగూడిన మొదలు ॥ఎట్టు॥

వ్రాతప్రతిలో నిండలి తృతీయ చరణమున వేటూరి ప్రభాకరశాస్త్రిగారి చేతివ్రాతలోగల మార్పు సూచనలున్నవి.

శ్రీకృష్ణపదం.

హృదయేశుడైన శ్రీకృష్ణుని ప్రణయ సౌందర్యాన్ని నాయిక ప్రకటిస్తున్నది.

- గంధం బసవ శంకరరావు

59. ఎట్టు గలిగెరా మోహమింతలో

సంకీర్తన: 194 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 187

ఎట్టు గలిగెరా మోహ - మింతలో నీకు
తట్టుపడి తిరిగేవు - తాళుకోరాదా ॥పల్లవి॥

మురిపాన కొనగోర - ముద్దు చెక్కుల మీన
నొరసి జీరలు చీరె - నువిద నిన్ను
నెరిగురులు జారగా - నిదుర కన్నుల లేచి
మరచి దాని పేర - మమ్ము (బిలుతువుగదర) ॥ఎట్టు॥

నిండు చెమటలు జార - నిట్టూర్పు లెడలేక
నుండు బడలికెల - నులికి పడుచు
అండ కౌగిటిలోన - నంటిన వాసనలు
మెండుకొని నీ మేన - మేళవించె గదర ॥ఎట్టు॥

పగడంపు వాతెరను - పలుగంటి సేవలను
నిగిడి కెంపుల చాలు - నించి నించి
అగపడి కూడితివి - అన్నిటను శ్రీకృష్ణ!
తగిలి జిగిబిగి రతుల - తమకింతువదెరా ॥ఎట్టు॥

శ్రీకృష్ణపదం.

రాగాలక్రమం బట్టి కాంబోది కావచ్చు.

ఎనలేని మోహం (ప్రేమ) ఎవరికి ఎవరిపట్ల? నాయకునికి నాయిక పట్ల! నిదురలో సైతం విడలేని వైనం!!

- గంధం బసవ శంకరరావు

60. ఎదురుగా వచ్చేవు

సంకీర్తన: 31 రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 32 తాళం: జంపె

ఎదురుగా వచ్చేవు - యెందు బోయితివిరా
నిదురకన్నుల మలగు - నియ నిద్ర స్వామి ॥పల్లవి॥

పెదవికాటులతోను - పెను జమ్మటలతోను
వదలు గోణముతోను - వందనముతోను
చెదరు (కురు)లే గట్టి - సిగ తాయెతులె జుట్టి
పదములను బంగారు - పావలను మెట్టి ॥ఎదురుగా॥

చెక్కు జీరలతోను - చిటులు గంధముతోను
పుక్కి(టను) నిండు(కొని) - పొదలు వీడెము తోను
సొక్కుచును నొక (చేత) - సురటి మాటుగ బట్టి
యక్కడను లేదనే - యట్టి యెమ్మెల తోను ॥ఎదురుగా॥

గురుతు జడ వాటులతో - గుబ్బ (చను) పోతులతో
వర చెలువ వేంకటేశ! - వగ లేల నాతో(ను)
మ(రులుకొని) నే విన్న - మగువ చేత (ల కేమి)
మరులుకొంటిర నిన్ను - మలగునియ నిద్ర స్వామి ॥ఎదురుగా॥

ఈ పాటలో విశేషము ఇందులో "చెలువ వేంకటేశ్వర"/"మలై కునియ నిద్ర పెరుమాళ్లు" (తిరుమల కొండ క్రుంగేటంత గౌరవభావంతో నిలిచిన దేవుడు అని పాటలో, నిద్ర అని తేలిక ఉనికితో పలుకవలెనేమో!) ప్రస్తావన ఉండటము, స్వామి దక్షిణ నాయకత్వానికిది చక్కని ఉదాహరణం. ఇందులో "మొవ్వ గోపాలముద్ర" లేదు. కనుక ఇది క్షేత్రయ్యకును మార్గదర్శకమైన పదము కావచ్చును.

ఇట్టి "చెలువ" ముద్రలతోగల పాటలు మరికొన్ని తంజావూరు వ్రాతప్రతులలోనూ, శేషాచార్యుల వ్రాతప్రతిలోనూ కానవస్తున్నవి. ఇంతటి మాధుర్యంగల రచనలు తిరిగి మనకు మహారాష్ట్రుల కాలం నాటి "త్యాగేశ పదాల" లోనే దర్శనమిస్తాయి. ఇప్పటికీ నేను సేకరించినవేకాక, నాతో సహకరిస్తున్న మా మిత్రులు

డా॥ వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్రగారు సమకూర్చినవీ వెరసి, పాతిక ముప్పై పాటలకు పైనే ఉండునేమో!

వీటిని విడిగా గుర్తించి పరిశీలించిన జాడ మన సంగీత గ్రంథాలలో నేను చూచినంతవరకును కానరాలేదు. ఇవి బహుళముగా తాళ్లపాకవారి సంకీర్తనలున్న వ్రాతప్రతులలో వాటి సరసనే ఉండి ప్రత్యేకమైన "చెలువ వేంకట" ముద్రతో "శ్రీకృష్ణ/వేంకట పర్యాయ నామముద్రలు" గలవై ఉన్నవి. ఈ కొత్త సంకీర్తనలను కూడా తాళ్లపాక తిరువేంగళనాథాదుల రచనలు కాదగునన్న స్ఫూర్తితో సేకరించి పరిశీలించడం జరుగుతున్నది.

ఇవి నేటి మైసూరు రాజ్యములోని మేల్కోటే "చెలువ వేంకటేశ్వరుని" పరముగా తిరుపతి వేంకటకృష్ణునకభేదము కల్పించి చెప్పినవని తెలియవచ్చును. చెలువ, చెలువుడు, చెలువ వేంకట, సెల్వపిళ్ల, చెల్లపిళ్ల రాయదుల పర్యాయనామాలే! పైగా మైసూరు ప్రాంతాలలోని 'పంచనారాయణ క్షేత్రాలను" గూర్చిన యెరుక తాళ్లపాక వారి రచనలలోనూ కానవచ్చిన విషయమే!

వారి వారి ముద్రాభేదాల గుర్తింపు మూలంగా ఇట్టి శోధన సాధ్యపడుతున్నది. భావి పరిశోధనలో ఇవి మరింతగా నిరూపితములయ్యే అవకాశమున్నదని మాత్రము ఇప్పటికి చెప్పవచ్చును. ఆసక్తికలవారి ప్రతిస్పందన ఈ దిశగా దోహదపడును. సహస్రవర్ష తేజోరాశియైన భగవద్రామానుజులకు శ్రీరంగం, చిదంబరం, మేల్కోటే, తిరుపతి చరిత్రలకు గల సంబంధము, దక్షిణ – ఉత్తర భారతముల సంబంధము కూడా ఈ సందర్భమున పరిశీలనార్హమగును.

– వేటూరి ఆనందమూర్తి

చిటులు గంధము ప్రస్తావన, ఈ సంపుటం సంకీ. 61లోనూ కలదు

ఈ సంపుటంలో మలగునియ స్వామి సంకీర్తనలు.

1) అక్కరో తానేటి (సంకీర్తనం.3)

2) ఎదురుగా వచ్చేవు (సంకీర్తనం. 60)

3) మేలేరిగిన వాడవు (సంకీర్తనం. 223)

4) వాని రమ్మనవే (సంకీర్తనం. 239)

– గంధం బసవ శంకరరావు

61. ఎన్ని తపంబులు

సంకీర్తన: 232 రాగం: శంకరాభరణం

వ్రాతప్రతి పుట: 221 తాళం: అట

ఎన్ని తపంబులు చేసి - నిన్ను పెండ్లాడెనొ మంగ!
చెన్నుమీర చెంచువాడె - శ్రీమంతుడు (కాగలిగె) ॥పల్లవి॥

నారచీరలే గట్టి - నడచేటివానికి
గారవాన పీతాంబరములు - గట్టగలిగె
కోరి రేగు, జీడిపండ్లు - ఏరుకొని తినేవానికి
సారె సారె పంచదార - లారగించ గలిగె ॥ఎన్ని॥

పన్నుగ పొదరిండ్లలోన - పవ్వళించేవానికి
వున్నతంపు మేడలోన - నుండగలిగె
సన్నపు గొజ్జంగి దండ - సందిట గట్టిన వానికి
మిన్నలు ముత్యంపు సరులు - మెడ(న) వేయగలిగె ॥ఎన్ని॥

పలుమారు గువ్వల - పలుకులు వినేవానికి
వెలయగాను సంగీతము - వినగలిగె
అలమేలుమంగ! (నీవె - కొలువై యక్కున జేరగ)
అలరీ శ్రీవేంకటేశు - డనే పేరుగలిగె ॥ఎన్ని॥

ఇదొక అద్భుతమైన సంకీర్తన. జానపదరీతిని సాగినది. చెంచు నాయకుడైన అయ్యగారి సౌహార్దమునకు అమ్మగారి సౌభాగ్యము తోడైనది. ముద్రనుబట్టి యిది తాళ్లపాక పెదతిరుమలాచార్యులవారి రచన. "శ్రీవేంకటేశు"డనగా శ్రీరమణియైన మంగమ్మతో కూడినవాడనియే అర్థము. **-వేటూరి ఆనందమూర్తి**

"తిరుమలయ్య విందు మంచిదే వుండంటే వుంటినమ్మ" (సంపుటం 26, పీఠిక పుటలు 12,13)లో నాయికను ఇదే తరహాలో వర్ణించటం జరిగింది. శేషాచార్యుల వ్రాతప్రతిలోని సంకీర్తనలు తాళ్లపాకవారివే అనటానికి ఇది ప్రబల సాక్ష్యం!

గొజ్జంగిదండ = గులాబీదండ. ***- గంధం బసవ శంకరరావు***

62. ఎమ్మె నెరపుదాని

సంకీర్తన: 95 రాగం: కేదారగౌళ

వ్రాతప్రతి పుట: 96 తాళం: అట

ఎమ్మె నెరపుదాని - యింటికే పొయ్యేవా
కొమ్మ మాయలాడి - గోవిందరాజ ॥పల్లవి॥

పందెమాడియోడి - పడతికేమిచ్చినా
అందుకు నిన్ను నే- మైనా నందునా
ముందే నిన్ను తన సొ - మ్ముగా గెల్తునని
కొందలమందేను - గోవిందరాజ! ॥ఎమ్మె॥

పగలు రేలు దాని - పాటలే విని వింత
వగయని మెచ్చితే - వగతునా
పొగడి పాడి నన - బోడి పాడి నిల్పునన
వెగటయ్యీ మదికి గో - విందరాజ ॥ఎమ్మె॥

యెట్టి కేళికి నీ వా - యింతి గూడితేను
చిట్టకాన కగడు - సేతునా
యిట్టె వేంకటరాయ - యెద దిగకుండునన
గుట్టు కనుపించెనో - గోవిందరాజ ॥ఎమ్మె॥

కొందలము = కలత, దుఃఖము, వ్యథ

ఎమ్మె = 1. విలాసం, 2. చక్కదనం, 3. గర్వం

చిట్టకము = శృంగారచేష్ట

అగడు = నింద్యం, అపనింద.

- గంధం బసవ శంకరరావు

63. ఎలనాగ నేనేమైన

సంకీర్తన: 52 రాగం: శంకరాభరణము

వ్రాతప్రతి పుట: 53 తాళం: ధ్రువ

ఎలనాగ నేనేమైన – నెగ్గుమాటలాడితినా
చలము సాధించి నాతో– జగడించేవదేమే ॥పల్లవి॥

తొట్టిన పెంజెమటలు – దుడుచుకొమ్మంటే
అట్టె కోపగించద – వదేమే
చుట్టుకొన్న ముంగురులం – చునదేర్చుకొమ్మంటే
నెట్టన బొమముడి – వెట్టేవదేమే ॥ఎలనాగ॥

(చి) టులు గంధము నల – చి వేసుకొమ్మంటే
(అటు) మిట్టి పడే – వదేమే
(నటనలు) తడబడక – నడచుకొమ్మంటే
కటకటా కన్నుల – గద్దించేవదేమే ॥ఎలనాగ॥

అలవి మీరిన పులకల – నణచు కొమ్మంటే
అలివేణి నాతోడ – నలిగే వదేమే
యెలమి వేంకటపతి చి – న్నెలు దాచుకొమ్మంటె
(కొలదెరుంగని సిగ్గు – గులికేవదేమే) ॥ఎలనాగ॥

చిటులు గంధము = చిట్లిన గంధము (ఎండిన గంధము)

మేనిపై గంధం పూసుకున్న తరువాత, కొంత తడవుకు తడి ఆరిపోయి, చిన్న చిన్న పెళ్లలుగా పెట్లుతుంది. అదే చిటులు గంధము, చిట్లు గంధము.

ఎలనాగ = యౌవనవతి (శబ్దార్థదీపిక).

– గంధం బసవ శంకరరావు

64. ఎలనాగ! పంచాంగ

సంకీర్తన: 96 రాగం: కేదారగౌళ
వ్రాతప్రతి పుట: 96 తాళం: అట

ఎలనాగ! పంచాంగ – మేటికి వినవలె?
తెలియంగ నీ (వల్లె) – కలిగె నిన్నియును ॥పల్లవి॥

నను గనినయంతనే – నగుమోముతో నేడు
వనిత! నీవెదురుగా – వచ్చుటే రాక
ఒనరంగ నీ వమృత – మూర నేర్పు మిగుల
యెనసి మాటాడు నదె – యిందువాసరము ॥ఎలనాగ॥

జలజాక్షి! పెనకువ – జడ నన్ను జుట్టుకొన
చెలిమి నలముటె యా – శ్లేష భాషితము
చెలువుడ! నీవు నా – చెంత రారా యని
సొలపుతో గూడునది – శోభనయోగము ॥ఎలనాగ॥

(వెలది!) శ్రీవేంకట – (విభు) నన్ను రతి గూడి
బలిమి నెద కెక్కుటే – భద్ర కరణము
కలికి! నీ వన్నిట – గారవించితి గాన
జలజాస్త్రు విజయమై – సాగు (నను) దినము ॥ఎలనాగ॥

అద్భుతమైన యీ శృంగార చమత్కార సంకీర్తనము వర్ణనలో చేయి తిరిగిన తాళ్లపాక వాగ్గేయకారునిది. నాయకుడైన శ్రీవేంకట విభుడు దివ్యనాయికయైన అమ్మవారికి ఖగోళ జ్యోతిశ్శాస్త్ర సమ్మతమైన పంచాంగ విషయమును శృంగారపరముగా అన్వయించి, వినిపించిన ఇతివృత్తము గలది. అచ్చుకానిది. తిరుపతి రాగిరేకులలో కానరానిది. "తాళ్లపాక సంకీర్తనలు" వ్రాతప్రతిలో నున్నది. తాళ్లపాకవారు తప్ప వేరొకరు వ్రాయలేనిది.

తిథి, వారము, నక్షత్రము, యోగము, కరణము అనునవి పంచాంగములు. ఇట్టి ఖగోళశాస్త్ర విషయమును "నీ వల్లనే (వల్లె) కలిగె నిన్నియును" అని అమ్మవారి పరముగా చెప్పుటలోనే శక్తివిశిష్టుడైన స్వామివారిని గూర్చిన కవియొక్క తాత్వికదృష్టి యెట్టిదో తెలియనగును. అయ్యవారి చైతన్యస్పందనకు అమ్మవారి చైతన్యమే మూలశక్తి అందురు కదా!

అసలు పల్లవి ఆరంభమే చమత్కారముగా నున్నది. "పంచాంగ మేటికి వినవలె" – 'ఎందుకు వినవలె" అను కవి ప్రశ్న యందే 'సంవత్సర ఫలితము లెరుగుటకై వినవలె" నను ప్రత్యుత్తర మున్నట్లున్నది! 'రాక"లోని తిథితోపాటుగా తక్కిన అంగములనూ సహృదయులూహింపగలరు. **– వేటూరి ఆనందమూర్తి**

65. ఎలనాగ యాలౌట

సంకీర్తన: 157 | రాగం: మేచబౌళి

వ్రాతప్రతి పుట: 96 | తాళం: లుప్తము

ఎలనాగ యాలౌట - యిది నీకు చాలదా
చెలగి నీవిక వేరె - చింతింపవలెనా ॥పల్లవి॥

ఒకనాడు చెలివద్ద - నుండినను చాలదా
అకట దేవేంద్ర పద - మది యేలవలెనా
శుకవాణి మోవిచవి - చూచినను చాలదా
(నికటామృతము వేరె - నెమ)కంగవలెనా ॥ఎలనాగ ॥

నెనరైన సతిగుబ్బ - నిమిరిన చాలదా
కనక దుర్గంబులవి - గైకొనగవలెనా
వనితచూపులకు కై - వశమైన చాలదా
మనసులో వేడుకలు - మదికోరవలెనా ॥ఎలనాగ॥

అలమేలుమంగ గూడి - యలమిన చాలదా
అలరు బ్రహ్మానంద - మది వేడవలెనా
యిల శ్రీవేంకటేశ - యీ పొందు చాలదా
కలికి సంపదలింక - (కలిసి) రావలెనా ॥ఎలనాగ॥

అలమేలుమంగను కూడుటయే శ్రీవేంకటేశ్వరునికి బ్రహ్మానందమట!

నెమకుట = వెదకుట.

- గంధం బసవ శంకరరావు

66. ఎవ్వరికి జెప్పరా

సంకీర్తన: 18 రాగ తాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 20

ఎవ్వరికి జెప్పరా – (దిట్టి సౌభాగ్యమ్ము)
[1]నివ్వటిలు నీ వేడ్క – నీవె వినవమ్మ ॥పల్లవి॥

సరవినే[2] దుర్గములు – సాదించెనొ యెరుగము
గిరికుచ నీవె త – ర్కించవమ్మ
సిరినే[3] రాజుతో సంధి – సేసెనో యెరుగము
హరిణాంకముఖి! నీవె – యాలోకించవమ్మ ॥ఎవ్వరికి॥

బలిమినే[4] ఘనుని (చెర) – బట్టెనో యెరుగము
జలదవేణి! నీవె వి –చారించవమ్మ
మెలగి యే[5] చక్ర మాక్ర – మించెనో యెరుగము
యిల (సైకత) నితంబ! యూ – హించవమ్మ ॥ఎవ్వరికి॥

చేవనే[6] సింహాసనము – చేకొనీ నెరుగము
సోవల హరిమధ్య! – శోధించవమ్మ!
ఆ వేంకటపతి యే నిధి[7] తా – నాశించెనో యెరుగము
వేవేగ పద్మనేత్రి! నీ – వే యరయవమ్మ ॥ఎవ్వరికి॥

ఇందు చమత్కారము, నాయకుడు దుర్గములు సాధించినవాడు నాయిక గిరికుచ; రాజుతో సంధి చేసుకున్నవాడు, చంద్రాలోకముగల హరిణాంకముఖితో కూడుట; ఇట్లే తక్కిన ప్రయోగములలోని ఔచిత్యమును భావించదగును. కడకు ఆమె పద్మావతి, పద్మనేత్రి; ఆతడు పద్మనిధి నాశించినవాడు.

ఈ సంకీర్తనలోని యితివృత్తము దివ్యదాంపత్య విషయము. ఇతివృత్తము నందలి ముద్రను బట్టీ, వారి భావకోశమును (స్కెమెటా) బట్టి ఇది పెదతిరుమలాచార్యుల పదమని భావింతును. (ఉదా: చూ. పె.తి.సం. 17 – 259, 271) ఆనాటికి వారి దృష్టిలో పదమూ, సంకీర్తనమూ పారిభాషిక పర్యాయ పదములే! (చూ. 17–307) అద్భుతమైన శైలి, నిర్మాణముగల యీ పదము కాలాంతరమున కొంత శైథిల్యమునకు గురియైనట్లున్నది. (వ్రాతప్రతితో పోల్చి చూడదగును). వీరి రచనలిట్టివి చాలా కలవు. ***– వేటూరి ఆనందమూర్తి***

---

1. నివ్వటిలు = వ్యాపించు, అతిశయించు; **2.** దుర్గములు నాలుగు రీతులు, గిరి, స్థల, జల, వన దుర్గములు; **3.** రాజు = ప్రభువు/చంద్రుడు; **4.** ఘనము = దిటవైనది/మబ్బు; **5.** చక్రము = వర్తులాకృతిగల భూమి/ఇతరములు; **6.** సింహాసనము = సింహ సంబంధము గలది; **7.** నిధి = పద్మాది నిధులు తొమ్మిది

67. ఏకాలము నామనే యెటిఁగిన

సంకీర్తన: 118 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 118

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 364వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 64)లో రాగం పాడి)

ఏకాలము నామనే యెటిఁగిన దాసులకు
దాకొనీ శ్రీహరిభక్తి దారణ గలిగితేను ॥పల్లవి॥

వుడివొడేకాలము వొక్క తతి రావద్దు
చెడని శ్రీహరిభక్తి చెట్టుకట్టితే
తొడుకు మేయఁగరాదు తూర్పెత్తితేఁ బొల్లు వోదు
బడినే శ్రీహరిభక్తిపంట వండితేను ॥ఏకాలము॥

వలువ దీసితేఁ బోదు వాడుకొంటే వెల్తి గాదు
కొలచి శ్రీహరిభక్తి కుప్ప చేసితే
యెలుకకు దినరాదు యెన్నాళ్లునాఁ జివుకదు
తలఁచి హరిభక్తిచిత్తపుగాదెఁ బెట్టితే ॥ఏకాలము॥

కఱవుకు లోఁగాదు సుంకరవానికి నబ్బదు
యెఱుకతో హరిభక్తి యిల్లు నిండితే
నెఱవై శ్రీవేంకటేశ నీకృపగలవారికి
గుటిగాఁగ హరిభక్తి కూడపెట్టుకొంటేను ॥ఏకాలము॥

భక్తిని వ్యవసాయ క్షేత్రంతో సరిపోల్చి చెప్పిన సంకీర్తన! తాళ్లపాక కవులు వ్యవసాయపరమైన సంకీర్తనలు రచించటమే కాదు, రాయలసీమలో వ్యవసాయాభివృద్ధి కొరకై కాలువలు, చెరువులు త్రవ్వించారు.

పంటల భాగ్యులు వీరా బహు వ్యవసాయులు
అంటిముట్టి యిట్లఁ గాపాడుదురు ఘనులు 3-359

పొలఁతులే వలపుల పుట్టుగుల పొలములు
తెలియఁగ నెట్టువచ్చు దేవుఁడే యెఱుఁగును 28-112

తిమ్మిరెడ్డి మాకునిచ్చె దిష్టమైన పొలము
బొమ్మిరెడ్డి కప్పగించి పోదిసేసెఁ బొలము 4-52

వద్దని మానుపరమ్మ వలదాఁక పొలము
సుద్దులూనానలు వాఁడిచూపేటి వేళను 17-336.

- గంధం బసవ శంకరరావు

తాళ్లపాక పెదతిరుమలాచార్యులు, అన్నమాచార్యులు

68. ఏటికని నే వగతునో

సంకీర్తన: 185 రాగం: నాదనామక్రియ

వ్రాతప్రతి పుట: 179 తాళం: లుప్తము

ఏటికని నే వగతునో ప్రా - ణేశుడు రానందుకా
సూటిమాటల కోర్వ - జాలని - సొగటాలాడేటందుకా ॥పల్లవి॥

పూర్వపుణ్య ఫలము కతనసె - భూమి పుట్టినయందుకా
అర్వదీ నోములు నోచి నే జవ - రాల నయ్యేటందుకా
వుర్విలోవారెల్లా నా వయసు జూచి - వుప్పతిల్లేటందుకా
నీరజాక్షిరొ విభుడు నా యెడ - నేరమెంచేటందుకా ॥ఏటికని॥

ఆలియని వొకనాడు నన్ను - నాదరించని యందుకా
పాలవంటి మనసు నేటి - పాలు చేసేటందుకా
కాలయముడే (చేరి) నన్ను - గాసి చేసేటందుకా
కాలమెల్లా నలుక చేతనె - గడచిపోయేటందుకా ॥ఏటికని॥

చీమ చిటుకనగానె - జగడము సేసి పొయ్యేటందుకా
సీమలో గలవారు నన్ను - చెలగి నవ్వేటందుకా
(యేమి దూరుదు) వేంకటేశుని - యెడను బాసినందుకా
ప్రేమతో నలమేలుమంగను - పేర బిలచినందుకా ॥ఏటికని॥

అర్వది నోములు - ఏదైనా పురాణకథకు సమన్వితమా? భావి పరిశోధకులకు ఇది మూలద్రవ్యము!

- గంధం బసవ శంకరరావు

69. ఏటిపొందు యేఁటిగుణము

సంకీర్తన: 66 రాగం: భైరవి
వ్రాతప్రతి పుట: 67 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 6వ సంపుటంలో 180వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 31)లో రాగం భైరవి)

ఏటిపొందు యేఁటిగుణము యేటి సవరందనము మనసు
నాఁటుకొలుపం జేయలేని నటన లేఁటికే ॥పల్లవి॥

చూపు చూపు తారుకాణ చూపులోని నగవులెల్ల
చూపి పులకరించలేని సొబగు లేఁటికే
యేఁపు రేఁగి కోరికలకు యెత్తు సేసి మీఁదమీఁద
తాప మందఁజేయలేని తనువు లేఁటికే ॥ఏటి॥

కదిసినపుడే మేను మఱచి కౌఁగిలించినట్టి చేయి
వదలి కన్ను ముయ్యలేని వలపు లేఁటికే
తుదలనైన చెమటగముల తొప్పఁదోఁగి మోహరతుల
సదమదముగఁ దనుపలేని చనవు లేఁటికే ॥ఏటి॥

దేహధారియైన ఫలము తెలిసి వేంకటాద్రివిభుని
మోహమందఁ జేయలేని మురిప మేఁటికే
ఊహ దలఁచి తమక మంది వొకరి కొకరు యిట్ల నేఁడు
సాహసించి కలయకున్న జన్మ మేటిఁకే ॥ఏటి॥

వేంకటాద్రి విభుని చేరుకొనుటయే ఈ జన్మకు ముక్తి!

– గంధం బసవ శంకరరావు

70. ఏటిమాటలాడేవు

సంకీర్తన: 162 | రాగం: తోడి

వ్రాతప్రతి పుట: 159 | తాళం: లుప్తము

ఏటిమాటలాడేవు – యిందాకానీవు
వాటముగనిట్టే – వళుకులాడకురా ॥పల్లవి॥

పయ్యెదలో వాలినవె – పట్టియియ్యవె జక్కవల
కొయ్యకాడ కావురా సం – కోచములింతే
ముయ్యనేటికే అట్లైతే – మొనసి చూపగదే
యియ్యెడ నా పైడిబిందె – లెట్టుజూపవచ్చురా ॥ఏటి॥

వొడిలోన దాగెనదే– వొప్పగించవే సింహము
గడుసుకాడ కావురా నా – నడుమింతే
విడిచి శోధనియ్యవే – విచ్చనవిడియట్లైతే
సుడిసి ఆకాశమెట్లు – శోధనియ్యవచ్చురా ॥ఏటి॥

కుచ్చెల మరుగుజొచ్చె – కొమ్మ! నెముళ్ల నివే
అచ్చపు నడపులే గాని – (యవి నెమళ్లు కావురా)
గుచ్చి శ్రీవేంకటనాథ – గుర్తెరిగి యట్లయితే
యిచ్చ గూడితిమిక – యీ గురుతులేలరా ॥ఏటి॥

నాయికా నాయకుల నడుమ జానపదరీతిలో సాగే చక్కని సంభాషణాత్మకం. శ్రీవేంకటనాథ ముద్రను బట్టి ఇది చినతిరుమలాచార్యులవారిది కావచ్చును.

– గంధం బసవ శంకరరావు

71. ఏమని యెంచేవమ్మ

సంకీర్తన: 105 | రాగం: కేదారగౌళ
వ్రాతప్రతి పుట: 105 | తాళం: లుప్తము

ఏమని యెంచేవమ్మ – యీ (నెలత) సుద్దులు
వేమారు చెలుల కెల్ల – వేడుకలు రేచీని ॥పల్లవి॥

జవ్వనిచెక్కిలి లేత – చందమామ నెత్తికొని
యువ్విళ్లూరే చెమటల – నుగ్గువెట్టీనీ
యివ్వల నిడుద కన్ను – లిరుమేలను వెడ్డువెట్టి
సువ్వలరాగము తోడను – జోలలు పాడీని ॥ఏమని॥

కోమలి కెమ్మోవి (పైని) – కొదమ చుక్కల దాచుకొని
చామల ముద్దుల నవ్వుల – చన్నిచ్చీని
ఆమని యంగపు దీగె – అదనెరిగి (యాముకొని)
కాముని పులకల మొలకల – గడు చవిచూపీని ॥ఏమని॥

అలమేలుమంగ (తాను) – నట్టె శ్రీవేంకటనాథు(ని)
వలపుల కర్పూరాన – వాసించీని
కలసి రతులనిట్టె – కౌగిట నలముకొని
పొలివోని రతులనే – పువ్వుగట్టీని ॥ఏమని॥

సువ్వలరాగము = ఏదైనా విశిష్టమైన రాగమా?

దంపుళ్ల పాటలలో 'సువ్వి', 'ఆహా సువ్వి' అనే మాటలు లయగా వస్తూ ఉంటాయి. ఈ పాటలకు ప్రత్యేక రాగాలేవీ ఉండవు. లయ, తాళం మాత్రం ఉంటాయి. ఇటువంటి పాటలకి ఉపయోగించే ఫణతులను 'సువ్వలరాగము' అని అన్నమయ్య అంటున్నాడని నా భావన.

– గంధం బసవ శంకరరావు

72. ఏమని వినేమొకో

సంకీర్తన: 76 రాగం: కళ్యాణి
వ్రాతప్రతి పుట: 77 తాళం: లుప్తము

ఏమని వినేమొకో - యేణాక్షి విజయము
కాముసేన తన సేన - కడు తారసిల్లెనట ॥పల్లవి॥

కుంతలముల తుమ్మెదలు - కూటముల తుమ్మెదలు
యింతి మోము చంద్రకళ - లీ చంద్రకళలు
పొంత నేత్రచకోరములు - పుడమి చకోరములు
యింతి పల్కు చిలుకపల్కు - లి య్యెడ వెదకీనట ॥ఏమని॥

కొమ్మయెలుఁగు కోయిలలు - కోయని కూయు కోవిలలు
సమ్మతి చెలి కంఠ శంఖము - చక్కని మరుశంఖము
అమ్మరో! చనుజక్కవ - లవి జక్కవ(కవ)లు
క్రమ్ముక నడ హంసలును - కలహంసలాయె(నట) ॥ఏమని॥

కలికి యూర్పుల చల్లు - గాలియు నా చల్లగాలి
జలజాక్షి యౌవన వసంతుఁ - డా వసంతుడు
కలబలము గూడుకొని - కందర్పుడదె వచ్చె
అలమేలుమంగ శ్రీవేం - కటాధిపుని గూడీనట ॥ఏమని॥

అమ్మవారికి సహజసిద్ధములైన సౌందర్యాలంకారము లమరియున్నవి. తుమ్మెదలవంటి నల్లని పెద్దజుట్టు, చంద్రబింబమువంటి మోము, చకోరములవంటి కళ్లు వగైరాలు. తన తనువులోనూ, చుట్టూ ఉన్న ప్రకృతిలోనూ మరుని బలగములగు ఉపమాద్రవ్యములైన తుమ్మెదల బారులూ, బహుళములై ఒప్పారే నఖక్షతాది చంద్రకళలూ, గుండ్రని చకోరాలూ వగైరాలున్నవి. ఇటు ఏణాక్షి బలగానికీ, అటు మరుని బలగానికీ మధ్య స్పర్ధయేర్పడి పోరునకు తలపడితే మాత్రం విజయం అమ్మవారి బలగానికి తథ్యం అంటున్నాడు కవి. మేలైన ఉపమేయ బలగాల ముందు నిరసములైన ఉపమాన బలగాలన్నీ వీగిపోతాయి! అదే యీ "ఏణాక్షి విజయము" పాట!

- వేటూరి ఆనందమూర్తి

73. ఏమిటను గొద లేదు

సంకీర్తన: 93 | రాగం: నాదనామక్రియ

వ్రాతప్రతి పుట: 94 | తాళం: లుప్తము

ఏమిటను గొద లేదు - యిగురుబోణిని జూడ
నేమమున తలపోయ - నీకె తగునయ్య ॥పల్లవి॥

రమణి నీలపు (నెఱులు) - రంగు తుమ్మెద (బరులు)
నెమలి పించపు సిరులు - నెలత ముంగురులు
కమలాక్షి కనుగోము - కళల కెల్లను గీము
అమరంగ విధుసమము - అతివ నెమ్మోము ॥ఏమని॥

నిక్కపు నీడల జూపు - నీలోత్పలము యేపు
మక్కువ మదనుని తూపు - మదిరాక్షి చూపు
చక్కని బంగరు గుండ్లు - సంపెంగి పూచెండ్లు
చొక్కంపు నిమ్మపండ్లు - సుదతి పాలిండ్లు ॥ఏమని॥

రోమ (రేఖల తీరు - రోయు చీమల బారు
భామ యూరుల సౌరు - పైడి రంభల మీరు
ఆమె యమ్మలకమ్మ - యలమేలు మంగమ్మ
(ప్రేమ ముద్దులగుమ్మ శ్రీ - వేంకటేశుని కొమ్మ) ॥ఏమని॥

అనుప్రాస విన్యాసములతో ప్రబంధరీతిని రమణీయముగా సాగిన యీ శృంగార సంకీర్తనము కొంత శైథిల్యమునకు గురియైనది. ముద్రాచరణము లుప్తమై పోయినది. రచన యే ఉత్తర హరివంశమో, కవికర్ణరసాయనమో చదివిన అనుభూతిని కలిగించుచున్నది. ఈ తాళ్ళపాక సంకీర్తనమున అమ్మవారి వర్ణనము కేశాది పాదపర్యంత మున్నది. ప్రకరణానుగుణముగ ఆభోగ చరణమును పరిష్కర్త పూరించెను.

తాళ్లపాకవారి "భావకోశం" లో "వలపు" అనే పదానికిగల అర్థం యేమిటో దాని లక్షణం, నిర్వచనం, లక్ష్యరూపమైన యీ సంకీర్తనంలో నిబద్ధమైనట్లుగానే సాధారణంగా వారి అన్ని రచనల్లోనూ, "వలపు" అనే

ప్రయోగం కానవచ్చినప్పుడల్లా, అవే భావాలు పునఃపునరావృతావులవుతూనూ ఉంటాయన్నది భాషాశాస్త్ర సంవాద విశ్లేషకు లెరిగినదే! ఇది మనస్తత్త్వ శాస్త్రానికీ, భాషాశాస్త్రానికీ సంబంధించిన “డిస్కోర్స్ అనాలిసిస్” అనే సీమలోని విషయము.

అదీ నాయికా నాయకుల నడుమ దాని ప్రతిఫలనాన్ని, శృంగారాభినయానికి గల అనుకూల్యాన్నీ ప్రదర్శిస్తూ ఇటూ అలంకారికులకూ, అటు భరత కళానిపుణులకూ పని కల్పించేదిగానూ ఉంటుంది. తెలుగులో ఈ దిశగా అధ్యయనం ఇంకా సాగవలెను.

– వేటూరి ఆనందమూర్తి

కృష్ణంపల్లి (కడపజిల్లా)లో లభించిన పై శాసనంద్వారా వరదరాజులపల్లి, చెలువపల్లి, నూకనపల్లి అగ్రహారాలు పెదతిరుమలాచార్యులవారికి చెందినవిగా తెలియవచ్చుచున్నది.

74. ఏమిసేతు నమ్మలాల

సంకీర్తన: 243 రాగం:భైరవి

వ్రాతప్రతి పుట: 232 తాళం: లుప్తము

ఏమిసేతు నమ్మలాల - యెక్కడని పోరాడుదు
కోమలంపు పతి తన - గుణము మానడాయ ॥పల్లవి॥

(పనిగొని వలపుకా) - వలివెట్టి వేసారితి
నెనరు తోన వేడుక - నే వేసారితి
వొనర దినదినము మనము - వొప్పజెప్పి వేసారితి
మనసులోని దాని మీద - మక్కువ మానడాయ ॥ఏమిసేతు॥

గుట్టుతోన పలుమారు - కోపగించి వేసారితి
చిట్టకముల గాసి జేసి - సేసి వేసారితి
మట్టు మీరి కినుకతో - మారుకొని వేసారితి
అట్టే దాని తోడ సరస - మాడేది మానడాయ ॥ఏమిసేతు॥

చెలిమి హితవరులచే - (చెప్పంపి) వేసారితి
నెలకొ(ల్పు)బా - సల కొని వేసారితి
సొలుపార వేంకటాద్రిపతి - చొక్కించి వేసారితి
యెలమి దానికి చన - విచ్చేది మానడాయ ॥ఏమిసేతు॥

నాయిక చెలికత్తెలతో తన వ్యథను వ్యక్తం చేస్తుంది, నాయకుడు ఎప్పుడు తనను అక్కున జేర్చుకుంటాడోనని!

- గంధం బసవ శంకరరావు

75. ఏమి సేతు నిన్ను బాసి

సంకీర్తన: 6 రాగం:కళ్యాణి
వ్రాతప్రతి పుట: 139 తాళం: లుప్తము

ఏమి సేతు నిన్ను బాసి – యే నుండ లేనురా
నా (మొరాలకించి) – నన్ను మన్నింపరా ॥పల్లవి॥

పనిబడి నాపై యలుకలు – పచరించే వేరా, నే
మనసు (లేని) మరునిబారి – మారుకొన లేరా ॥ఏమి॥

కలనైనా నిన్ను గాన – క యున్నది (లేదురా)
కలదా (మరి) యెన్నడైన – గారవించి యేలరా ॥ఏమి॥

తలపు మెత్తనిదాన – తాప మోర్వలేనురా
(నలువున) దయతో – నన్ను నేలుకోరా ॥ఏమి॥

పలుమారు నన్నేలక – పగ చాటే వేరా
(పలుకోర్వగా లేను) – పడుచుదాన గదరా ॥ఏమి॥

ఇందు రెండేసి పాదాల చరణాలే ఉన్నవనుకొనుట లెస్స. తాళ్లపాక సంకీర్తనలు అను గ్రంథములోని యీ సంకీర్తనము = పదము, (ఆనాటికవి పర్యాయ పదములుగానే వాడబడినవి) అందలి కల్యాణి రాగమును, ముద్రారాహిత్యమును, శైలీభేదమును పురస్కరించుకొని నేటికి మనకు తెలిసిన తాళ్లపాక పదకవిత్రయము వారిది కాదేమో అనిపించినను, పరిశీలనార్థముగనే దీనిని స్వీకరించవలెను. ఇట్టివానిని ఈనాటి మన చూపుతో పరిష్కరించే యత్నము సేయక, అట్లను విడిచిపుచ్చక, ఆకర స్థానభ్రంశము కల్గించక, ఉన్నదున్నట్లు పేర్కొనుటే యుక్తము.

ఏలనగా తాళ్లపాకవారిని గూర్చిన మన పరిశోధన మింకనూ ఆకరముల సేకరణ దశలోనే ఉన్నది. తంజావూరు తాళపత్ర ప్రతులలోని వీరి పాటలకు కల్యాణి మొదలైన కొన్ని ప్రాచీనరాగముల పేర్లున్నవి. తాళ్లపాకవారి పాటల ఆకరముల సేకరణమింకనూ, తిరుపతిలోనూ తద్భిన్నములైన, ఇతర ప్రాంతములందును, నాటి తాళ్లపాక కవి కుటుంబములవారు నెలకొన్న పలుతావులందును, సాగవలసియే యున్నది!

– వేటూరి ఆనందమూర్తి

76. ఏమి సేయుదునమ్మ యిన్నియును

సంకీర్తన: 141 — రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 94 — తాళం: జంపె

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో113వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 20)లో రాగం నాదరామక్రియ[1])

ఏమి సేయుదునమ్మ యిన్నియును నిటుగూడె
[2]తామసపుఁ బ్రేమ వేదనఁ బాయనీదు ॥ఏమి॥

కినిసి నే సొలసి పలికెద నంటినా యతని-
నెనయుఁ దడఁబాటు నోరెత్తనీదు
చెనకి యలపార[3] జూచెద నంటినా యతని-
కనుఁగవ జలంబు సరుగునఁ జూడనీదు ॥ఏమి॥

కిందుపడి కదిసి మ్రొక్కెద నంటినా యతని-
యంది (నంది?) పరవశము[4] చేయాడ నీదు
డెందంబు మఱచి యుండెద నంటినా యతనిఁ
జెందిన తఁలపు మఱచియు మఱవనీదు ॥ఏమి॥

తిరువేంకటేశుఁ బొందితినంటినా[5] యతని-
దొరతనము నాగరిమ దోఁచనీదు
సిరిదొలఁకు రతుల నలసితి[6] నంటినా యతని-
సరసంబు వేడుకలఁ జాలించనీదు ॥ఏమి॥

తిరువేంకటేశుని వలపు పారవశ్యంలో తడిసి తన్మయత్వాన్నొందినది నాయిక!

– గంధం బసవ శంకరరావు

---

1. తా.వెం; తం.ప్ర. కాంబోది–ఝంపె తాళము **2.** తా.వేం. నాతామస **3.** తా.వేం. యెలవార
4. తం.ప్ర.అందినా పరవశత **5.** తం.ప్ర; తా. వేం. గలసెద నంటినా **6.** నలసెద నంటి

77. ఏమి సోద్యమైన సురత

సంకీర్తన: 169 రాగం: నాదనామక్రియ

వ్రాతప్రతి పుట: 166 తాళం: లుప్తము

ఏమి సోద్యమైన సురత - మిందువదనది
కామతంత్రరతుల (గతులు) - గలవు పెక్కులు ॥పల్లవి॥

తరుణి వుపరి సురతకేళి - తగిలి పెనగు వేగమున
కురులు వీడి ఝులుఝుల్లున - విరులు రాలగా
యెరుగులేక తరుణి విభుడు - యింద్రనీలమేఘమనుచు
గురుతరముగ పూలవాన - గురిసెననుచు భ్రమసెను ॥ఏమి॥

మదనమోహమంధకార - మైన మృగమదంబు చాయ
కదియకుచయుగంబు నడిమి - గగనవీథిని
కదిసి మణులసరులు తార - కములు నఖపద్మంబులనుచు
కొదమరేఖ చందురుడనుచు - నదరి బెదరి చూచెను ॥ఏమి॥

విమలమైన రమణినాభి - వెడలియున్న రోమరాజి
విమర్శింపలేక రాహు - విధము దోచెననుచును
కమలనేత్రి ముఖచంద్రుడు - కళలుదేర మనసులోన
(భ్రమసి) వేంకటేశు డతివె - భావమెరిగి కూడెను ॥ఏమి॥

భావకోశం గురించి చర్చించదగిన పాట ఇది.

పదకోశం పదాలకు అర్థాలను సాధిస్తే, భావకోశం విస్తృతార్థంలో ఆ పదవైశాల్యాన్ని అందిస్తుంది. వలపు అనే అంశాన్ని స్వీకరిస్తే, వివిధ సంకీర్తనల్లో ఆ అంశం ఏవిధంగా ప్రకటితమైనదో భావకోశం వలన తెలియవచ్చును.

- గంధం బసవ శంకరరావు

78. ఏమొకొ చిగురుటధరమున

సంకీర్తన: 20 & 170 రాగం:నాదనామక్రియ

వ్రాతప్రతి పుట: 22 & 167 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 82వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు(సంఖ్య 14)లో రాగం నాదరామక్రియ)

ఏమొకొ చిగురుటధరమున[1] యెడనెడఁ గస్తురి నిండెను[2]
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా ॥పల్లవి॥

కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోఁచిన
చెలువంబిప్పుడిదేమో చింతింపరె చెలులు
నలువునఁ బ్రాణేశ్వరుపై నాఁటిన యాకొనచూపులు[3]
నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు గాదు గదా ॥ఏమొకొ॥

పడఁతికి చనుఁగవ మెఱుఁగులు[4] పైపైఁ బయ్యెద వెలుపల
కడు మించిన విధమేమో కనుఁగొనరే చెలులు
ఉడుగని వేడుకతోఁ [5]బ్రియుఁడొత్తిన నఖశశిరేఖలు
వెడలఁగ వేసవికాలపు వెన్నెల గాదు గదా ॥ఏమొకొ॥

ముద్దియ చెక్కుల కెలఁకుల ముత్యపు జల్లుల చేర్పుల
వొద్దికలాగు[6] లివేమో వూహింపరె చెలులు
గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దిన సురతపుఁ జెమటల[7] అందము గాదు గదా ॥ఏమొకొ॥

సాళ్వ నరసింగరాయల ఆస్థానంలో అన్నమాచార్యులవారు గానం చేసిన సంకీర్తనమిది! ఈ సంకీర్తన వెదజల్లు కవితాకాంతి మొత్తం తెలుగు వాఙ్మయాన్నే ప్రకాశింపచేస్తుంది.

– గంధం బసవ శంకరరావు

1.ని.రే.93. చిగురట అధరము; **2.**నించిన; **3.**శ్వరుమది నాటఁగఁ జూచిన; **4.** పడతుక చనుగవ మెరుఁగుల; **5.**ప్రేమంబునఁ బ్రియు; **6.**మెరుఁగులివే; **7.**సా.రే.పతి కౌఁగిటి యధరామృతముల అద్దిన సురతపు వేళల అందము.

79. ఏమొకో చూచెదరు

సంకీర్తన: 28 | రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 29

ఏమొకో చూచెదరు - యీ చెలియ భావంబు
సామాన్యులకు నెన్న - సాధ్యంబు గాదు ॥పల్లవి॥

కోపగించుక మరుడు - కుసుమ చాపము వంచి
(యేపు మీరగ) సమర - మెసగింపగా
(లుప్తము)
(లుప్తము) ॥ఏమొకొ॥

పుప్పొడె దాని మందు - పొత్తు పూవుల చాపము
కప్పురమె మెయిపూత - కస్తూరి తిలకమ్ము
తప్ప కలమేల్మంగ - తరుణి గూడేను
వ(వొ)ప్పుగా శ్రీవేంకటేశు - పాయ కొనగూడుండు ॥ఏమొకొ॥

సంకీర్తన రచన అందదుకులుగా నున్నది. పల్లవి చరణముల పొత్తు కుదురుట లేదు. ఇంకనూ పరిశీలింపవలెను. ముద్రనుబట్టి పెద తిరుమలాచార్యుల రచనగా తోచును. రాగతాళములు తెలుపబడలేదు.

- వేటూరి ఆనందమూర్తి

80. ఏల యలవోక సేసే

సంకీర్తన: 270 రాగం: సౌరాష్ట్ర
వ్రాతప్రతి పుట: 256 తాళం: లుప్తము

ఏల యలవోక సేసే - వీవేళ నీవె, చాల
జాలి బెట్టక (సువిద) - జక్కజేయవయ్యా ॥పల్లవి॥

కొమ్మ గుబ్బలకు స - గోత్రవైరము పుట్టె
నమ్మికే లేక పుట్టిన - నాటనుండి,
సమ్మతి పడ నెడ(ద) [1]రా - చ కొమరుల నిల్పి
[2](కమ్మి కొనగోట చ - క్క)గ జేయవయ్యా ॥ఏల॥

జలజాక్షి నెమ్మేన - జాతి వైరము పొడమె
నలువు మీరిన చిన్న - నాటి నుండి,
కలిమి మెరయు ముద్ర - ధారుల బురికొల్పి
జలజలోచన! ముదిత - జక్కజేయవయ్య ॥ఏల॥

ఇందిర మోవికి - [3](నిందుబింబాస్యకు)
ముందె కలహములాయ - [4](మున్నడి) నుండి
చందమైన [5]ద్విజాళి - పొందుగా గరిపరిచి
[6]సందీక వేంకటపతి! - చక్కజేయవయ్యా ॥ఏల॥

శ్రీ శేషాచార్యుల వ్రాతప్రతిలో గల యీ అముద్రిత సంకీర్తన సౌరాష్ట్రరాగాల వరుస క్రమంలోఉన్నది. కనుక ఇదీ సౌరాష్ట్రరాగంలోనే ఉండును. ఇందలి ఇతివృత్తము దివ్యదంపతుల ప్రణయవ్యవహారము. కవి ఇందు

---

1. రాజ సంబంధముగల రాచకొమరులు=వీరులు/అర్థాంతరమున చందురుకూనలు, నఖక్షతములు; **2.** (లుప్తపూరణము) గోటితో పోయేదాన్ని గొడ్డలిదాక తెచ్చుకోవద్దని సఖి (కవి) సూచనకాబోలును; **3.** (లుప్తపూరణము) క్షీరసాగరమునపుట్టిన ఇందిరకు, చందురునకు మధ్యగల స్పర్ధ జన్మవైరముకాబోలును; **4.** మున్నడి - మున్నాడి = ముందటి; **5.** ద్విజావళి=విద్వాంసులు/అండజములైన పక్షుల వరుస; **6.** సందు ఇయ్యకుండా, అవ్యవధిగా అనుటకు.

సఖి పాత్ర నిర్వహించి నాయకునకు తగుసూచన లిచ్చుచున్నాడు. దివ్యదంపతుల ప్రణయ కలహాదులకు కవి యిందు మూడు వైరకారణములను చూపి సత్వర పరిష్కారమునకు పురికొల్పుచున్నాడు.

మొదటిది సగోత్రవైరము. గోత్రమనగా వంశమునకును, కొండకును పేరు. యౌవనకారణాన కుచగిరుల నడిమిస్పర్థ శమించుటకు నాయకుని కొనగోటి లాలింపే మార్గము. గోరుతో పోవుదానిని గొడ్డలి వరకు తెచ్చుకోవద్దని సూచన.

జలజాక్షి నెమ్మేన పొడమిన జాతివైరమునకు ఆమె అంగసౌష్టవము, జవ్వనము కారణములు. కవిసమయము లందుకు తోడుపడినవి. జలజలోచనుడైన వెంకటపతియే ప్రభుత్వము నెరపి ఆ జలజాక్షిలోని జాతివైరమును శమింపజేయదగునని సూచన.

మూడవది కవి చెప్పకయే చెప్పినది నాయికయొక్క అంగాంగ సౌష్ఠవమున గోచరించు ఆజన్మవైరము. తత్శమనమునకు అధరబింబఫలము నాస్వాదించెడి చిలుకలు; ఆయమ్మ మేని సోయగపు వెండివెన్నెలలను గ్రోలెడి వెన్నెలపులుగులైన చకోరకములు కావలసిన పక్షిబలగము.

ఇట్టి పల్లవులు, ప్రణయభావనలుగల చమత్కార రచనలు పెదతిరుమలయ్యగారి భావకోశమున మరికొన్ని గలవు."చెలియ చిత్తమెరిగి సేయవయ్యా, అట్టె నీవు / నలరు జాణడవు నీ కాకెకునే తగును" (సం. 17 –259); "ఏమయ్యా నా సేవ లెస్స యీడేరెనా / ఆముకొన్న నీ తలపు లానతీయ వయ్యా." (సం. 17–202).

– వేటూరి ఆనందమూర్తి

81. ఏలయ్యా మదనచల

సంకీర్తన: 14 రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 266 తాళం: లుప్తము

ఏలయ్యా మదనచల - మేలయ్యా నేర(మా)
(యీలాగు చెలినిట్టు - లేచంగ నేయమా?) ॥పల్లవి॥

(మిగుల కామించినా - మేలు మేలనినా
తగవు పాటించి మరి - తాల్మి విడకుండినా
తెగువ జూపించి - తరి - తీపులను రేచీనా)
మగువ తా నడుగులకు - మడుగులే పరచినా ॥ఏలయ్యా॥

నెయ్యమొనరించినా - నిజములు బలికినా
నియ్యకోలైన పను - లీడేర్చినా
(నొయ్యన మనసుగని) - యుపచారించినా
తొయ్యలి తానెంత - తోడు(నీడైనా) ॥ఏలయ్యా॥

కనుసన్న మెలగినా - కలసి నన్నీరేయి
కినుకింతలేక శ్రీ - కృష్ణుండు వుండినా
మనసెరుగ మేన్మేను - మక్కళించుండినా
తనివొంద కౌగిటను - దక్కనలము కొనిన ॥ఏలయ్యా॥

భావసంవాదముగల యిట్టి పాటే వ్రాతప్రతిలో వేరొకటి (సంఖ్య 17) కలదు. రచనలు కలగలపై పాఠాంతర ములనదగినట్లున్నవి. పల్కుబడిని, నిర్మాణభేదమునుబట్టి లుప్తభాగములను పూరింపవలసియుండును.

- వేటూరి ఆనందమూర్తి

82. ఏలర? నాతో యింత చల

సంకీర్తన: 146 రాగం: బిళాపచారి

వ్రాతప్రతి పుట: 144 తాళం: లుప్తము

ఏలర? నాతో యింత చల – మేలరా రంగా
బాల చాల నాపై మేలుదానను – జాలి బెట్టుక ప్రేమ నన్ను ॥పల్లవి॥

పిలిచినా పలుకవు – యెలమితో కన్నెత్తి
తిలకింప వొకసారి – యలవి మీరి
అలరార నాతో మా – టైన నాడవు
చెలువుడా నేనేమి – చేసితిరా నీకు ॥ఏలర॥

యెంత వేడినగాని – యింటికి రావు
సంతసాన నొకపుడు – సరసమాడవు
వింతవస్తువులేమి – వేడ్క నాకొసగవు
కాంతుడా నేనేమి – కానిపని చేసితిరా ॥ఏలర॥

వోవరికి వేగరావు – ఊరకె జాగు చేసేవు
కానరాని కళలంటి – కరగింపవు
భావజుకేళి గూడియు – బాగుగా నలయింపవు
శ్రీవేంకటప్రభుడ – వేమి చేసితిరా ॥ఏలర॥

వోవరి (ఓవరి) = చంద్రశాల
ఈ సంకీర్తనయందు నాయిక 'అభిసారిక' యై నాయకుని వలపుకై పరితపిస్తున్నది.

– గంధం బసవ శంకరరావు

83. ఏల వలచితిమి మన

సంకీర్తన: 235 | రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 223 | తాళం: లుప్తము

ఏల వలచితిమి మన - మేటికి కలిగితిమి
యీలాగు అలుక లిక - యెన్నటికి వలదు ॥పల్లవి॥

వొనగూడి యిద్దరము - వొకరి కొకరమె తగిలి
యెనసినది మొదలు - యెడబాయ మెన్నడును
మనకు అలుగుట తగదు - మనలోన యెడ (లేదు)
మనసిజుడు సందుకొని - మనల నేచీరా ॥ఏల॥

అలర నమ్మిక మాట - లాడుకొని యిద్దరము
అలనాటినుండి యెడ - మాడ(నే మె)రుగము
పలుకకేలుంటిమో - పలుకకుండగగ(లమొ)
పలుమారు మనయెడల - పలికి కోవిలలు ॥ఏల॥

అలుకదీరని రతుల - కలుకలే చవులనుచు
అలగితిమిగాక మన - కలుకలేడవిరా
అలర శ్రీవేంకటేశు - (డలమేలుమంగ యెడ
నలుక దీరిన వెనుక - నక్కు జేర్చెనుగద) ॥ఏల॥

'మనకు ఎడబాటు, అలుకలు లేవురా' అంటుంది నాయిక.

- గంధం బసవ శంకరరావు

84. ఏ వూరికేవూరు యెక్కడికి

సంకీర్తన: 277 రాగం: లుప్తము

వ్రాతప్రతి పుట: 262 తాళం: అట

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 1వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 120)లో రాగం శ్రీరాగం)

ఏ వూరికేవూరు యెక్కడికి నెక్కడ
నీవు మాకు నిఁకనేల నిజమైనాఁ జెప్పరా ॥పల్లవి॥

అద్దమరాతిరిదాఁకా నందునిందు నుండివచ్చి
వద్దువోరా నీకునింత వలసినొల్లములు
నిద్దుర గంటికి లేక నీకునుండ వారమా[1]
వొద్దిక చాలని వారముండినా నుండితిమి ॥ఏ॥

వేకమైన పరితాప వేదనఁ బొరలలేక
కాఁక పుట్టి తిరిగేవు కన్నుగానలేక[2]
యేఁకట దీర నీకు నెందరు గలరని[3]
వోఁకల పులుసు కలువులఁ బుచ్చవలెనా[4] ॥ఏ॥

అందఁగాఁడ తిరువేంకటాద్రీశ పెక్కిండ్ల-
విందవై[5] నీవా(కొ?)కతెపై వెచ్చఁదన మున్నదా
మందెమేళమున నీతో మాటలాడితిమి గాక[6]
కందువ మన్నన చాలు కలకాల మెల్లను ॥ఏ॥

నీ మన్నన నాకు కలకాలం కావాలంటుంది నాయిక.

– గంధం బసవ శంకరరావు

---

1. నిడురేకు 43 నీకు నుండనేలనీ; **2.** గాననేరక; **3.** గలరు ఈ; **4.** బుచ్చనేలరా; **5**. నిడురేకు 43 విందవు నీ; **6.** తిమినీ.

85. ఒంటినేల తిరిగేవే

సంకీర్తన: 102 రాగం: కేదారగౌళ

వ్రాతప్రతి పుట: 102 తాళం: లుప్తము

ఒంటినేల తిరిగేవే - వో చెలియ, నా
వెంట బాయకువె పది - వేలకైనా, నీవు ॥పల్లవి॥

వొంటి పొదరింటిలోన - నుండఁగా నాకన్నులకు, నీ
చంటి జంట కానరాగ - జక్కవలంటా
వుంటవింట నేసేనంట - వూకించి నేనొత్తిన గో
రంటు జూచి గుండె జల్లు - రనెగదే కోమలి ॥ఒంటినేల॥

పొదల తీఁగెచాటున - పొంచియుండ(గ) నీమోవి
తుదగానరాఁగ జూచి - దొండపండంటా
చిదిమేనంట నే బోయి - చేయి చాచి యలకెంపు
చిదురుపలంగని వెర - చితిగదే కోమలి ॥ఒంటినేల॥

(హత్తి) యలమేల్మంగ పయ్యెద - యడయైన పొక్కిలి తళు
కొత్తగా బూచిన తామెర - కొలనంటా నే బోయి
(గత్తరి) శ్రీవేంకటపతిమై - కలగని (బత్తిని)
(మెత్తని) కౌఁగిటిలో న - మ్మితిగదే కోమలి ॥ఒంటినేల॥

ఎప్పటికీ నాతోనే ఉండవే అని నాయికను నిర్దేశిస్తున్నాడు నాయకుడు!

- గంధం బసవ శంకరరావు

86. ఒడలి తాపముమీఁద

సంకీర్తన: 281 రాగం: ఆహిరి

వ్రాతప్రతి పుట: 266 తాళం: అట

(ఈ సంకీర్తన 6వ సంపుటంలో 163వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 39)లో రాగం బౌళి)

ఒడలి తాపముమీఁద నుసురనీని
కడలేని చిచ్చుమీఁద గాలి చల్లీఁ దరుణి ॥పల్లవి॥

జల్లనం గొప్పువిరులు జారఁదోచి జవరాలు
మెల్లనే తుమ్మిదలకు మేఁత వెట్టీని
చెల్లఁబో మీఁ దెఱుంగదు జెప్పరమ్మ పెనుఁబాము
పిల్లలకుఁ బాలువోసి పెంచఁజూచీఁ దరుణి ॥ఒడలి॥

గొప్పవైన గుబ్బలపైఁ గుంకుమకస్తురిపూఁత
లప్పలు గాలికిఁ దెచ్చి లంచ మిచ్చీని
ఒప్పదు మానుపరమ్మా ఉప్పతిలఁ బలుమారు
నిప్పులమీఁదటఁ దెచ్చి నేయి చల్లీఁ దరుణి ॥ఒడలి॥

చెనకించి యధరంపుఁ జిగురాకు కెంపుల
నొనరుఁ గోవిల నోరూరించీని
చనవున వేంకటస్వామి కౌఁగిటఁ గూడి
కినిసి పాసెములూఁ జక్కెర వెట్టెఁ దరుణి ॥ఒడలి॥

నాయిక విరహతాపము వేంకటస్వామి కౌగిట శమించినదట!

– గంధం బసవ శంకరరావు

87. ఒరిమె నెప్పుడు నివి

సంకీర్తన: 19 రాగం: నాదనామక్రియ

వ్రాతప్రతి పుట: 21 తాళం: లుప్తము

ఒరిమె నెప్పుడు నివి - వొక్క తీరేరా, వో
తరుణి యెంచగను - గొత్తలుగ తోచీనే ॥పల్లవి॥

చెండులవలె నున్నవి - కొండలవలె నున్నవి
వుండుండి గుబ్బ చను - లుండె తెర గేమే
దండికాడ వైతే - చెండులవలె నుండు
దండ నుంటే పెద్ద - కొండలవలె నుండు ॥ఒరిమె॥

అమ్ములవలె నున్నవి - తమ్ములవలె నున్నవి
యిమ్ముల నీ కన్నులుం - డేలాగదేందే?
యెమ్మెకాడ! దూరమైతె - యమ్ములవలె నుండు
కమ్ముకొని యుంటె - కడు తమ్ముల వలె నుండు ॥ఒరిమె॥

టంకము వలె నున్నది - కుంకుమ వలె నున్నది
వుంకువై నిన్ను బాసి - వుండేలాగేందే?
వేంకటపతి యెద యైతే - టంకము వలె నుండు
అంకెగూడి వుంటే జాతి - కుంకుమ వలె నుండు ॥ఒరిమె॥

దివ్య దంపతుల ప్రణయ మీ సంవాద పదమందు వాకోవాక్యముగా జానపదరీతిలో సాగినది. ప్రయుక్తమైన పరిభాషకూడ, పాత్రోచితమై సముచితముగ నున్నది. యక్షగాన రచనల బోలిన తాళ్లపాక వారి చెంచు గీతము లిట్టివి కొన్ని గలవు. ఇది నాడు ప్రచారము పొందిన ప్రసిద్ధ పదము కాబోలును. ఈ సంకీర్తన పదమే ఇతర వ్రాతప్రతులందునూ, నాగరలిపిలోనూ చూచిన గుర్తు.

- వేటూరి ఆనందమూర్తి

చిత్రం: బాపు

ఒరిమె నెప్పుడు నివి - వొక్క తీరేరా, వో
తరుణి యెంచగను - గొత్తలుగ తోచీనే

88. ఓరీ రారా! వొద్దికై రారా!

సంకీర్తన: 260 | రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 248

ఓరీ రారా! వొద్దికై రారా!
　　పేరడిగా వలపించిన వాడ ॥పల్లవి॥

చిన్ననాట నుండి - సిగ్గులు బడకుండ
　　సన్నలచాయల - సరసమాడి
　　కన్నెపాయపుబోటి - కడగంటి తామెర
　　కన్నులు గాసే వెన్నెల - గాసేటివాడ ॥ఓరీ॥

పిందెల చన్నులు - బిందెలుగా జేసి
　　సందుల పులకింత - కందువగా జేయుచు
　　ముందు ముందె నీ - మోవి తేనె నాకు
　　విందులు బెట్టేటి - వేడుకకాడ ॥ఓరీ॥

కలికితనంబున - కరగించితినని
　　అలమేలుమంగ మే - లని పొగడితివి
　　సలిగె యిచ్చినట్టి - జవ్వని యడవున
　　వెలయ గూడితివి శ్రీ - వేంకటనాథ ॥ఓరీ॥

శ్రీవేంకటనాథ ముద్రను బట్టి ఇది చినతిరుమలాచార్యులవారిది కావచ్చును.

కలికితనముతో నాయకుని మదిని కరగించినది నాయిక.

- గంధం బసవ శంకరరావు

89. ఓహోహో యనరో పారి

సంకీర్తన: 109 రాగం: రామక్రియ

వ్రాతప్రతి పుట: 96 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 118వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 21)లో రాగం రామక్రియ)

ఓహోహో యనరో పారి
సాహసానఁ దిరుగరో జంటపారి ॥పల్లవి॥

కోనేటిరాయఁడు కోరి నిద్రించీ వాఁడే
ఆనకమై జాలీయరో ఆఁడు బారీ
పేనిపట్టి వాకిళ్ళ బీగముద్రలాయ నిడి
కానిమ్మని వాయించరో గంట పారి ॥ఓహోహో॥

తిరుపణి మణఁగెను తిరుగరా దెవ్వరికి
మరల నెలుగియ్యరో మగపారి
పరగ దేవత లెల్ల బడకెళ మున్నారు
యిరవాయ సూర్యచంద్రు లెదురు పారి ॥ఓహోహో॥

శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తగించీ లోననదె
కోవర మెన్నికెరో కోటిపారి
ఆవల బంగారుగుదియలు ఘల్లు రనఁగా
తావుల హనుమంతునితలారి పారి ॥ఓహోహో॥

కోనేటిరాయడు నిద్రించి ఉన్న వేళ కాపలా కాయండని సేనలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు పెదతిరుమలాచార్యులవారు.

– గంధం బసవ శంకరరావు

90. కంకణ మిదిగో చూడ

సంకీర్తన: 70 | రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 71 | తాళం: ఆది

కంకణ మిదిగో చూడ - గదరమ్మ, వీర
కంకణ మతని కిగా - గట్టితి నోయమ్మలాలా ॥పల్లవి॥

నన్నిక నేమి పలుమారు - నలయించకు రోయమ్మ
కన్నెనై యతనిపై వే - కన్నులోయమ్మ
వున్నవేమి సహించవు - వూరకుండ గదరమ్మ
యెన్ని చెప్పినా మానరు - యేలచలమమ్మలాలా ॥కంకణ॥

ఒంటి నన్నేక చిత్తాన - వుండనియ్యగదరమ్మ
వెంటవెంట వచ్చి యేల - వేచేరోయమ్మ
ముంటిమీది తపమున - మునినైయున్నానోయమ్మ
అంటు బాయలేనెంతైన - అతనితో నమ్మలాలా ॥కంకణ॥

ఎరవులవారివలె - నేమియు నన్ననకురమ్మ
మరులైతినో యలమేలు - మంగనోయమ్మ
తిరువేంకటగిరి - దేవశిఖామణి
వురముపై యుయ్యాల - వూగేనిట్లేయమ్మలాలా ॥కంకణ॥

భావకోశం గురించి చర్చించదగిన సంకీర్తన!

ఈ సంకీర్తన తంజావురి ప్రతిలో కలదు.

తిరువేంకటగిరి దేవశిఖామణి ఉరమనే ఉయ్యాలపై ఆనందంగా ఊగుతుంది నాయిక!

- గంధం బసవ శంకరరావు

91. కంటిఁగంటి నిలువుచక్కనిమేను

సంకీర్తన: 212 రాగం: రామక్రియ

వ్రాతప్రతి పుట: 202 తాళం: అట

(ఈ సంకీర్తన అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుట 21-22లలో ఉదాహృతం)

కంటిఁగంటి నిలువుచక్కనిమేను దండలును
నంటుఁజూపులను జూచే నవ్వుమోముదేవుని ॥పల్లవి॥

కనకపుఁబాదములు గజ్జెలు నందెలును
ఘనపీతాంబరము పైకట్టు కటారి
మొనసి యొడ్డాణపు మొగపుల మొలనూలు
ఒనర నాభీకమల ముదరబంధములు ॥కంటి॥

గరిమ వరదహస్త కటిహస్తములును
సరస నెత్తిన శంఖచక్రహస్తములు
ఉరముపై కౌస్తుభ మొప్పగు హారములు
(తరుణి యలమేల్మంగ తాళి పద్మలును) ॥కంటి॥

కట్టిన కంటసరులు ఘనభుజకీర్తులు
కట్టాణిముత్యాల సింగారనామము
నెట్టన శ్రీవేంకటేశ నీకుఁ గర్ణపత్రములు-
నట్టె సిరసుమీఁద నమరే కిరీటము ॥కంటి॥

ఈ సంకీర్తన రెండవ చరణం నాలుగవ పాదం శేషాచార్యులవారి వ్రాతప్రతిలో లుప్తం కాగా, శ్రీవేంకటేశ్వర స్వామి వారి కృపావిశేషం చేత, శ్రీవల్లభాచార్యులవారి గుజరాతు ప్రతిలో ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారికి లభించింది. లుప్తమైన ఆ పాదపూరణ ఈ విధంగా జరిగి పూర్తి సంకీర్తన ఈనాడు లభించటం స్వామివారి దయకు సంకేతం!

స్వామి ముగ్ధమనోహర సౌందర్యాన్ని ఆపాదమస్తకం వర్ణించు సంకీర్తన!

- గంధం బసవ శంకరరావు

92. కంటి శుక్రవారము గడియ

సంకీర్తన: 3 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 4

(ఈ సంకీర్తన అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుట 29-30లలో ఉదాహృతం)

కంటి శుక్రవారము గడియ లేడింట
అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని ॥పల్లవి॥

సొమ్ములన్నీ కడఁబెట్టి సొంపుతో గోణముగట్టి
కమ్మని కదంబముకప్పు పన్నీరు
చెమ్మతోన వేష్టువలు ఔమ్ము తల మొల చుట్టి
తుమ్మెదమైచాయతోన నెమ్మదినుండే స్వామిని ॥కంటి॥

పచ్చకప్పురమె నూఱి పసిఁడిగిన్నెల నించి
తెచ్చి శిరసాదిగ దిగ నలఁది
అచ్చెరపడిచూడ అందరికన్నుల కింపై
నిచ్చమల్లె పూవువలె నిటు తా నుండే స్వామిని ॥కంటి॥

తట్టుపునుఁగె కూర్చి చట్టలు చేరిచి నిప్పు
పట్టి కరఁగించి వెండిపళ్యాల నించి
దట్టముగ మేనునిండ పట్టించి దిద్ది
బిట్టువేడుక మురియుచుండే బిత్తరి స్వామిని ॥కంటి॥

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారే ఈ తాళ్లపాక సంకీర్తనను తొలుత గుర్తించి, పరిష్కరించి 'శేషాచార్యులవారి వ్రాతప్రతి" లోనిదిగా ఉద్ధరించి చూపినారు. (చూ. అన్నమాచార్యచరిత్ర - పీఠిక పుట 29-30, 1949).

శ్రీవారి శుక్రవార మజ్జనాన్ని వర్ణించు సంకీర్తన!

- గంధం బసవ శంకరరావు

93. కటకటా అయ్యో కాంత నింత

సంకీర్తన: 58 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 59

(ఈ సంకీర్తన అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుట 112లో ఉదాహృతం)

కటకటా అయ్యో కాంత నింత యేపుదురా
అటమటముగాదు నీ యాన సుమ్మీ నిజమయ్య ॥పల్లవి॥

కొసరినా నిన్నే కాని కోపించినా నిన్నే కాని
కసరినా నిన్నే కాని కాదన్నా నిన్నే కాని
విసరినా నిన్నే కాని వేసరినా నిన్నే కాని
ఇసుమంతైనా అన్యమెఱుఁగదయ్యా ॥కటకటా॥

అలసినా నిన్నే కాని ఆఁకొన్నా నిన్నే కాని
పిలిచినా నిన్నే కాని పేరుకొన్నా నిన్నే కాని
సొలసినా నిన్నే కాని సోఁకనాడినా నిన్నే కాని
కలనైనా తలఁపెందూ కలుగదు గదవయ్యా ॥కటకటా॥

కొనియాడినా నిన్నే కాని గుంపించినా నిన్నే కాని
పని(న?)వినా నిన్నే కాని పాడినా నిన్నే కాని
మనసిచ్చి యలమేలుమంగపతి వేంకటేశ
యెనసితివి మా చెలి నింక నేచ నేమిటికయ్యా ॥కటకటా॥

శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో అనుగ్రహించిన “అనన్యాశ్చింతయంతో మాం...” (9-22) అనే చరమశ్లోకంలోని శరణాగత భక్తికి ఈ సంకీర్తన నిలువెత్తు నిదర్శనం.

– గంధం బసవ శంకరరావు

94. కటకటా విరహు లెక్కడ

సంకీర్తన: 196 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 188

(ఈ సంకీర్తన 6వ సంపుటంలో 92వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 58)లో రాగం శ్రీరాగం)

కటకటా విరహు లెక్కడ బ్రదుకఁగలవారు
కుటిలంపుఁగీరములు గూఁటఁబడవాయె ॥పల్లవి॥

పంచబాణునకు నాపద లెందు లేవాయె
మంచుఁగిరణము లతనిమీద మణఁగదాయె
పెంచుకోవిలనోరు పెడతటికిఁ బోదాయె
చంచరీకములకునుఁ జావు లేదాయె ॥కటకటా॥

చిగురాకుఁ గులమునకుఁ జే టెందు లేదాయె
పగటు నునుగాలిఁ బెనుబాము దినదాయె
సొగసుఁగమ్మని విరుల చొప్పుణఁగి పోదాయె
బిగువు నామనిమీఁదఁ బిడుగువడదాయె ॥కటకటా॥

తిరువేంకటాచలాధిపుని కరుణారసము
తరుణులకు నందటికి దైవాఱదాయె
పరివోనిసురతసంపదలఁ దెప్పలఁదేలి
వరవధూతతికిఁ బరవశము లేదాయె ॥కటకటా॥

రాగిరేకుల పరిష్కర్తలలో ఒకరైన పెద్దలు గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు "అన్నమయ్యను ఆకర్షించినది గోపికాభక్తి" అని పీఠికలలో వ్రాశారు. అవ్విధముననే ఈ సంకీర్తన గోపికాభక్తిని ప్రకటిస్తున్నది.

'పరివోని సురతసంపదల నింపులచేత
వరవధూతతికి పరవశమైన దితడు' (1-170) అని అన్నమయ్య ప్రయోగం!

– గంధం బసవ శంకరరావు

95. కనుపట్టె చెలికి

సంకీర్తన: 30 రాగం: శ్రీరాగం
వ్రాతప్రతి పుట: 31 తాళం: అట

కనుపట్టె చెలికి అం-గములెల్ల మరి చూడ
మినుకారి చూపులకు - మెరుఁగులై యుండె ॥పల్లవి॥

పుట్టచెండ్లను నవ్వు - పొదలపూఁతల దాని
గట్టి పాలిండ్లు యే - గతి నుండెను?
కట్టలుక మరి పోరు - కయ్యమున కస్తూరి
మట్టి దోఁగిన బిరుదు - జెట్టులన నుండె ॥కనుపట్టె॥

పొదలి యొయ్యారమున - పుక్కిటి విడెపు కప్పు
లెదుటికిని విచ్చు - మోవెట్లుండెను?
వెదకి విరహుల బట్టి - వేటాడు నలివేణి
పదను బెట్టిన తలిరు - పట్టె మన నుండె ॥కనుపట్టె॥

అలమేలుమంగ శ్రీవేంక - టాధీశుఁ గూడిన
చెలిమి చేసిన కలిమి - చందమెట్లుండె?
కొలదిమీరిన చన్ను - కొండపై తొలకరి
చెలువంపు వలపేరు - చిందినట్లుండె ॥కనుపట్టె॥

సంగీతము నేర్చుటకు అభ్యాసగీతములవలె ఇట్టి పదరచనలు కొన్ని సాహిత్య దృష్టితో భావపుష్టిని కలిగించుటకు ఏర్పడిన అభ్యాసపదములవలె నున్నవి.

- వేటూరి ఆనందమూర్తి

96. కప్పురపు (కళుకులు)

సంకీర్తన: 272 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 258

కప్పురపు (కళుకులు) - కలికి నీ పలుకులు
వొప్పుగ నీ వాలించితేనే చె - వులు చల్లనయ్యానీ ॥పల్లవి॥

పంచదార పానకమా - పణతి నీ కావి మోవి
యించుకంత చవి గొంటె - హెచ్చ(రిల్లీని)
కంచుతాళపు చిప్పలా - కన్నె! నీ గబ్బి గుబ్బలు
యించుకంత గోరుదా - కించితే ఖణింగురనీని ॥పల్లవి॥

జడియనెమ్మి పింఛమా - సఖియ నీ పెందురుము
తొడికితే కెంగేలు - దుసికిలీని
వడకని కారుమించా - వనిత! నీ నెమ్మేను
జిడిముడి కన్నులు - జీరికలు వారీని ॥పల్లవి॥

కనియుగానని యణువా - కన్నె నీ నెన్నడుము
ఘనముగా నూదితేనే - గాలి బొయ్యీని
తనివోని యాఖువా - తరుణి! నీ ప్రాయము
యెనసి శ్రీవేంకటపతి - (యెదను) కారించినీ ॥పల్లవి॥

ఆఖువ = జంతువు

అతివ సౌందర్యము శ్రీవేంకటపతికి అంకితము.

- గంధం బసవ శంకరరావు

97. కరము జీడిపులుసు

సంకీర్తన: 13 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 16

(ఈ సంకీర్తన అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుట 61లో ఉదాహృతం)

కరము జీడిపులుసు - గలిగిన మామిడి - కరము సోకినయంతనే
సరవిఁ జక్కెరవలెఁ - జవి గలిగించువాని - చనవరి సుతుఁ డితఁడే ॥పల్లవి॥

వేఁకరి మండెముకోట - వెళ్లుతా విచ్చన-విడి రాఁగా వొక
వీఁకతో వేసిన కత్తి - వే తునుకలాయ - వెన్ను సోఁకినయంతనే
ఆ కాలమునాఁడు రాతి నాతిఁ - జేసె ఆతఁడేపో యీతఁడు
వాకుచ్చి పొగడరో ఘనపుణ్యము (గల) తాళ - పాక తిరుమలయ్యను ॥కరము॥

గుములు గూడి యలుఁ - గులు తిరుగఁబాఱి చుట్టు - కొన్న కురువదోవ నతఁడు
కమలనయనునిఁ దలఁ - చినమాత్రాన - కకపికలై పాఱెను
అమరఁ బాం - చాలికి వలువలొసఁగి - నతఁడెవో యీతఁడు
ప్రమదముతోడుత - పేరుకొనరే తాళ - పాక తిరుమలయ్యను ॥కరము॥

దేవుఁ డొకకన్ను - దయచేసి తనవద్దికి నంపిన నతఁడు
పావను డితఁడు తా - నొక్క కన్నిచ్చె పరుషలు చూడఁగా
శ్రీవెంకటప్పని - సేవ చేయఁగోరి - చేకొన్నతను వితఁడు
భావించి పొగడరో - భాగ్యము గల తా - ళపాక తిరుమలయ్యను ॥కరము॥

తాళ్లపాక శేషాచార్యులవారి వ్రాతప్రతి నుండి శ్రీ ప్రభాకరశాస్త్రిగారీ పాట నుద్ధరించి, పరిష్కరించి, ప్రకటింపకుండిన ఈనాటికిని ఇది తక్కిన పాటలవలె అజ్ఞాతముగానే ఉండెడిది. ఏలన ఇది లభ్యములైన రేకులలో కానరాదు. శ్రీవెంకటప్ప ముద్రగల ఈ పాట తాళ్లపాక పదకవిత్రయము వారి పాట కాదన్నది నిశ్చయము. ఈ పాట మూలముననే తాళ్లపాక తిరువెంగళనాథుని (చిన్నన్న) లేదా పెద, కోనేటి తిరువెంగళనాథులలో ఒకరి రచన కాబోలునని తోచుచున్నది.

ఈ పాటలో ఆద్యక్షరమునకు ప్రతిపాదమున రెండేసి యతులున్నవి. తప్పినచోట దిద్దలేదు. యతిస్థానము గుర్తింపబడినది.

– వేటూరి ఆనందమూర్తి

అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్యలను "తాళ్లపాక పదకవిత్రయం"గా వ్యవహరిస్తారు మిగిలిన తాళ్లపాక కవులు సంకీర్తన రచన చేయలేదనే దృష్టితో! కాని, ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారి తాళ్లపాక కవుల ముద్రాపదాలను పరిశోధన దృష్టితో పరిశీలించినపుడు పై ఉదహరించిన సంకీర్తన మూలంగా తాళ్లపాక కవులలో నాల్గవ పదకర్త లోకానికి వెల్లడి అవుతున్నాడు (చూ. రసమయి – ఆగస్టు 2005 మొదలుకొని మార్చి 2006).

– గంధం బసవ శంకరరావు



అన్నమయ్య మార్గంలో లభించిన శాలివాహనశకం 1459 (క్రీ.శ. 1537) నాటి పెదతిరుమలాచార్యులవారి శాసనం. హనుమంతుని ప్రతిమను ప్రతిష్ఠించినట్లు ఈ శాసనం తెలుపుతున్నది.

చిత్రం: బాపు

వేంకటేశం వేదనిలయం శు–భాంకం లోకమయం భజే

98. కరుణానిధిం

సంకీర్తన: 174 రాగం: కన్నడగౌళ

వ్రాతప్రతి పుట: 170 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 1వ సంపుటంలో 342వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 66)లో రాగం కన్నడగౌళ)

కరుణానిధిం గదాధరం
 శరణాగతవత్సలం భజే ॥పల్లవి॥

శుకవరదం కౌస్తుభాభరణం
 అకారణప్రియ[1] మనేకదం
 సకలరక్షకం జయాధికం సే-
 వకపాలకమేవం భజే ॥కరుణానిధిం॥

వురగశయనం మహోజ్జ్వలం తం
 గరుడారూఢం కమనీయం
 పరమపదేశం పరమం భవ్యం
 హరిం దనుజభయదం[2] భజే ॥కరుణానిధిం॥

లంకాహరణం లక్ష్మీరమణం
 పంకజసంభవభవప్రియం
 వేంకటేశం వేదనిలయం శు-
 భాంకం లోకమయం భజే ॥కరుణానిధిం॥

వేదనిలయుడైన వేంకటేశ్వరుని దేవభాషలో వర్ణించు కీర్తనం!

– గంధం బసవ శంకరరావు

నిడురేకు: 7, **1.** అకారణద మనేక **2.** దనుజహరం (భయహరం అని సరియైన పాఠమేమో)

99. కలకంఠు(లాలా)

సంకీర్తన: 233 | రాగం: శంకరాభరణం

వ్రాతప్రతి పుట: 222 | తాళం: లుప్తము

కలకంఠు(లాలా) రారే – కర కంకణ తాళ గతుల–(నలుగు పెట్టుచు పాడరే)
మలసీ పన్నీరు పునుగు–తలిరూ గంధము లలది–మజ్జన (మప్ప)నికి సేయరే ॥పల్లవి॥

(నూలీ) గోణమ్ము జుట్టరే – నెత్తావి (మించు) – నూనియ (తల) నంటరే
మేలిమి కస్తూరి (మెత్తరే) – కుంకుమపూవు – మేదించి నలుగు బెట్టరే
ఆలవట్టములు (ప)ట్టరే – మా యప్పనికి – (అంది) వీడ్యమ్ములియ్యరే
చాలా బంగారు గిన్నెలా, ముంచి – జలకము పన్నీరు బోయరే ॥కలకంఠు॥

దప్పిదీర వలిప (మద్దరే) – తడయక మెయి చి – త్తడి (యారగానొ)త్తరే
కప్పుర హారతు లెత్తరే – మేన పచ్చ – కప్పురంపు ధూళి మెత్తరే
పుప్పొడి (గంధాలు మెదుచరే), తట్టు – పునుగూ మెయి నిండా – బుయ్యరే
చొప్పుదనర (కీలించరే) చిరత్న కిరీటము – సొమ్ములు నిండార జాతరే ॥కలకంఠు॥

గొబ్బున చెంగావి కట్టరే, గొప్ప (గొనబు) – కుచ్చుల కటారి జెక్కరే
(గుబ్బసరము) మంగ తాళి(రే) – కూర్చి మెడ(ను) గుచ్చి గట్టరే
గబ్బి చేతల (నెంచరే) శ్రీవేంకటేశ – గన్నుల పండువగా జూడరే
అబ్బురంపు (తోరెము లమరే) ఆనవాలు – ఆరగింపు సేసికొనరె ॥కలకంఠు॥

చాల శిథిలమైన రూపానగల యీ సంకీర్తన వేంకటప్ప నిమజ్జనోత్సవ సంరంభమును సూచించునది. తిరుమల మీదనో, శ్రీనివాసమంగాపురమునందలి యాలయముననో, లేక తాళ్లపాకవారి యింట సాగు నిత్యోత్సవ వారోత్సవ సంరంభములందో పాడుకొన్న వారి పాటలిట్టివి అనేకము లున్నవి. ఇవి ఆనాటి శుక్రవారాభిషేక క్రమ విశేషములను, అలంకార ప్రియుడగు స్వామివారి ఆభరణ విశేషములను వెల్లడించునట్టివి. అట్టివానికి



గల చారిత్రక ప్రాధాన్యమునుబట్టి పరిష్కారములో ఎక్కువ సంస్కారములు పొసగవు. పాటలో గుర్తించిన నిర్మాణ సౌష్ఠవమున కనుగుణములైన కొద్ది మార్పులే బ్రాకెట్లలో సూచింపబడినవి.

మజ్జనవేళ అలంకార ప్రియుడైన స్వామివారికి ఎక్కువగా సుగంధ జలాభిషేకమేగాని, నేడు హెచ్చుగా కానవచ్చు క్షీరాభిషేక విశేషములు, లభ్యములైన అప్పటి వారి పాటలందు, కానరాకుండుట గుర్తింపదగిన విశేషము! రేకులలోనూ, వ్రాతప్రతులలోనూ గల పాఠములీ విషయమై పరిశీలించదగును. (చూ. గురుదేవుల అన్నమాచార్య చరిత్ర పీఠిక పుటలు 28–32; మరియు వ్రాతప్రతి పాఠం) పాటకు పల్లవి ప్రాణమైనట్లే, పల్లవిలోని కలకంఠుల గానము, కరకంకణ తాళగతులతోడి నృత్య సూచనమూ పాటకు ప్రాణము పోయుచున్నవి!

– వేటూరి ఆనందమూర్తి

100. కలిగెగా మనల

సంకీర్తన: 166 రాగం: నవరోజ్

వ్రాతప్రతి పుట: 166 తాళం: అట

కలిగెగా మనల – కాదనిన ఫలము
చెలియరో నేడు – చేజేత నిపుడు ॥పల్లవి॥

తల (కొన) కొంగు గట్టు – దట్టపు జవ్వాది పట్టు
మొలక చమటల బెట్టు – ముచ్చటల మట్టు
అల(యి)క తోనే అట్టు – అంగడిబడిన గుట్టు
వలరా(జు)బాధట్టు, లే – వలపుల (మ)ట్టు ॥కలిగెగా॥

వదల బడిన నీవి – వాడు బారిన మోవి
మెదలు (చె)ప్పుడు (తావి) – మించు (టూ)ర్పుల యావి
కదలు చింతల సావి – కన్నుల (నెఱుపు) జేవి
సుదతుల పై నోవి – సొమ్ముల యీవి ॥కలిగెగా॥

మెఱుగు కన్నుల కెంపు – మేన పులకల గుంపు
గొర(బు) చేతల వంపు – గుబ్బలు గోళ్ల నింపు
వొరపైన మోము (జం)పు – వుల్లము లోపలి తెంపు
(కె)రలు కస్తురి మంపు శ్రీ – కృష్ణు గూడిన సొంపు ॥కలిగెగా॥

ఈ సంకీర్తనమందు "వేంకట" ముద్ర విడిగా కానరాదు. "అన్ని మంత్రములు యిందే ఆవహించెను" అన్నట్లుగానే "వేంకట" అంతర్లీనమైన "శ్రీకృష్ణ ముద్ర" మాత్రమే యిందు కలదు. అనగా "శ్రీకృష్ణుడే" గోవింద (వేంకట) కృష్ణుడన్న ప్రత్యయ మిందున్నట్లే!

అన్నమాచార్యుని "జో(వ)చ్యుతానంద జో జో ముకుందా – రావె పరమానంద రామ గోవింద" అను జోల పాటలోనూ "వేంకట" ముద్ర లేకుండుటకును ఇదే కారణము కావచ్చును. ఆదినారాయణుడే శ్రీకృష్ణుడు. ఆ స్వామియే శ్రీవేంకటేశ్వరుడు. తాళ్లపాకవారి దృష్టిలో శ్రీవేంకటేశ్వరుడు, శ్రీకృష్ణుడు, శ్రీవిఠ్ఠలుడు అభిన్నులే. అట్లే శ్రీనారసింహుడును, శ్రీరాముడును.

ఈ పాట "తాళ్లపాక సంకీర్తనలు" వ్రాతప్రతిలో ఉన్నది కనుక తాళ్లపాకవారిదే అనుకొనుటకు అభ్యంతరముండదు. మన తాళ్లపాక పదకవిత్రయము వారికి ముగ్గురికి మూడు ముద్రలు ప్రత్యేకముగా ఉన్నట్లే వారిలో నాలుగవ పదకర్తయైన చిన్నన్నది "శ్రీకృష్ణ ముద్ర" అని గుర్తించితిని. (చూ. రసమయి సంచికలలోని "తాళ్లపాక సంకీర్తనలు" లో "శ్రీకృష్ణ ముద్ర" యెవరిది?; "తాళ్లపాక వారిలో నాలుగవ పదకర్త ఎవరు?; "శ్రీకృష్ణ పదములు" అను నా ధారావాహిక వ్యాసము ఆగస్టు-2005 మొదలుకొని మార్చి, 2006 వరకు)

మనకు లభించిన తిరుపతి రాగిరేకులలో తాళ్లపాకవారి "కురుంజి" రాగమున్నది కాని "నవరోజ్" రాగము కానరాలేదు. తంజావూరు తాళపత్ర మూలములందు మాత్రము వీరి కీర్తనములు నవరోజ్ రాగమందున్నవి. శ్రీకృష్ణ గానమున నవరోజ్ రాగమునకు ప్రత్యేక స్థానమున్నట్లున్నది.

మీది పాటలోని పదబంధములు, అనుప్రాస శబ్దాలంకార విన్యాసములు మనోజ్ఞములు.

This is a rare Sankirtanam of Tallapaka Chinnanna who was recognised by his contemporaries as a popular singer and composer in the Tallapaka family. He is known for his mellifluous dwipada style, sweet diction and high sense of music. In fact, all the ladies, children and grand children of Annamacharya's family appear to be composers and singers as seen from the textual references and sculptural representations. Several "Sri Krishna-Mudra-Padam-s" identified with the fourth composer Chinnanna. Two songs with Venkata Mudra variants, are also being retrieved and verified like the 'Cheluva Venkateswara'/ Venkatappadu etc., mudras-s. Further study may bring more clarity in this regard.

Navaroj raga agrees with the traditional singing Sri Krishna (Laali and Jola) padam-s.

- Veturi Anandamurthy

101. కాకకొన్నాడు నీ

సంకీర్తన: 100 రాగం: లుప్తము

వ్రాతప్రతి పుట: 100 తాళం: అట (కావచ్చును)

ఆళాపచారి

కాకకొన్నాడు నీ - కాంతు డోవరిలోన
చేకొన సిగ్గేటికి - చేర గదో యమ్మ ॥పల్లవి॥

కొమిరె వయసు తోడి - (కొత్త) పెండ్లికూతురా!
కమలములోని బం - గారు బొమ్మా!
విమలమై నిలువెల్ల - వెన్నెల గాసే తల్లి
చెమరించ పాన్పు మీదికి - చేర గదో యమ్మ ॥కాకకొన్నాడు॥

చందమామ తోబుట్టు(వ!) - జవ్వనంపు చెలియ!
కందులేని నెమ్మోము(గల) - కప్పుర గంధి!
గంధపు వాసనల(తోడి) - కలశాబ్ధి కన్య!, గో
విందుని పాన్పుమీదికి - (విచ్చేయ) గదో యమ్మ! ॥కాకకొన్నాడు॥

అతి మోహనాంగియైన - యలమేలుమంగ
కతలకారి కలికి చిలు - కల కొలికి!
రతిగూడి (శ్రీ వేంకట - రమణు డోవరి, సం)
గతి గూడి వోలాడే - గదవో యమ్మా! ॥కాకకొన్నాడు॥

ఇది చక్కని నిర్మాణముగల శృంగార సంకీర్తన పదము. అలమేల్మంగా శ్రీవేంకటరమణుల ప్రస్తావన గలది కావడంచేత పెదతిరుమలాచార్యులువారి రచన కాదగును. తుదకు ఆభోగ ముద్రా చరణములోని కూర్పు, 'ఆళాపచారి' యిందుకు సూచకములు. స్వరసహితముగా గల వీరి ఝొంబడ ప్రబంధములోనూ ఆలాప సూచక మగు 'ఆళాపచారి' ఖండము కలదు.

This is another unpublished song taken from TPS vraataprati (6609, SVORI, Tirupati), not found in the Tirupati copper plates. The same song is also seen in some other manuscripts. This song appears to be that of Peda Tirumalacharya as seen from its compositional content relating to ‘AlamElmanga – Sri VenkaTa RmaNa’, which happens to be his specific mudra.

As this Song.100, in the manuscript, is grouped in the ‘KEdaaragouLa – Ata taaLa’ cluster of songs 95 to 106, the same could be in the same Raaga, though not specifically mentioned.

Although the term ‘Alaapachaari’ meaning aalapti, is familiar from the compositions of Peda Tirumalacharya, it is not known what place it has in this song except indicating the authorship.

- Veturi Anandamurthy.

102. కాతరపుదాన నేను

సంకీర్తన: 64 రాగం: భైరవి

వ్రాతప్రతి పుట: 65 తాళం: లుప్తము

కాతరపుదాన నేను - ఘనుడు తాను
గాతకింత యోర్చితే - కరుణించు మనీనే ॥పల్లవి॥

కొప్పువట్టి తియ్యరాదు - కొనగోర జీరరాదు
చెప్పితన సేవ యెట్లు - సేయింతునే?
ముప్పిరి దిట్టగరాదు - మోవిగంటు సేయరాదు
అప్పటి సరసాలె - ట్లాడు మనీనే? ॥కాతరపుదాన॥

తమ్ములము బెట్టరాదు - తతి కాలువేయరాదు
నమ్మి తనతో నెట్లు - నవ్వుమనీనే?
కిమ్ముల రాకొట్టరాదు - కిందుపరచగా రాదు
కమ్మటి తనతో నెట్లు - కత చెప్పుమనీనే? ॥కాతరపుదాన॥

చేముట్టి చెనకరాదు - చేరి పనిగొనరాదు
ఆముకొని పెండ్లియె - ట్లాడుమనీనే?
యీ మేర శ్రీవేంకటేశు - డింతలోన నన్ను గూడె
కామించి తనతో నెట్లు - కౌగిలించుమనీనే ॥కాతరపుదాన॥

నీ పట్ల విధేయతతో నున్న నన్ను కరుణించవయ్యా! అంటుంది నాయిక!

- గంధం బసవ శంకరరావు

103. కామయాగము

సంకీర్తన: 80 రాగం: భైరవి
వ్రాతప్రతి పుట: 80 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 223వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 69)లో రాగం కన్నడగౌళ)

కామయాగము చేసెఁ గలికి తన
ప్రేమమే దేవతాప్రీతిగాను ॥పల్లవి॥

పొలుపలర సురతతాంబూలరసపానంబు
నలినాక్షి సోమపానంబు గాను
కలకలంబుల మంచి గళరవంబుల మోఁత
తలకొన్న వేదమంత్రములుగాను ॥కామయాగము॥

పఁదతి తన విరహతాపమునఁ బుట్టిన యగ్ని
అదరి దరికొన్న హోమాగ్నిగాను
ఒడఁబడిక సమరతుల నుదయించిన చెమటఁ
దడియుటే యది యవభృథంబుగాను ॥కామయాగము॥

తనరఁ గుచముల రుచులు దంతా(త?)క్షత క్రీడ
ననుపైన పశుబంధనంబుగాను
యెనసి శ్రీతిరువేంకటేశ్వరుని పొందు
ఘనమైన దివ్యభోగంబుగాను ॥కామయాగము॥

శ్రీవేంకటేశ్వరుని చేరుటకు నాయిక కామయాగం చేస్తుంది.

– గంధం బసవ శంకరరావు

104. కాముడు సంభ్రమము

సంకీర్తన: 202 రాగం: వసంతభైరవి

వ్రాతప్రతి పుట: 195 తాళం: లుప్తము

కాముడు సంభ్రమము తోన - గవిసె విరహుల మీద
భామలాల! మీ ప్రాణేశుల - బాయక కూడుండరే ॥పల్లవి॥

మొల్లలేవాని మైజోడు - మొగలిరేకే జముదాళి
బల్లెమే మామిడి చిగురు - పండ్లె వాని తుమ్మెదలు
చల్లనిగాలే దళవాయి - చందురుడే ముందరి పౌజు
విల్లె శింగాణి చెఱకు - విరజాజులె అమ్ములు ॥కాముడు॥

చిచ్చుమీరి పచరించెడి తే - జికి
కుచ్చుల పొగడవాని...... దండు
పచ్చల మరువంపు - పల్లము పంకజమె వాని
యిచ్చల ...... ॥కాముడు॥

అచ్చపు సమకట్లు జల్లులు
ముచ్చు ...... ॥కాముడు॥

ఇది అసంపూర్ణము.

కాముడు తన బలగముతో విరహుల మీద వెడలిన సన్నివేశమిందు వర్ణితము. చరణ విభాగము సాధ్యమైనను వసంతభైరవి సంకీర్తనము పరిష్కారమునపేక్షించుచున్నది. పాఠాంతరములు సేకరించవలెను.

- వేటూరి ఆనందమూర్తి

105. కాముఁ డెవ్వరి

సంకీర్తన: 285 రాగం: ఆహిరి[1]
వ్రాతప్రతి పుట: 269 తాళం: జంపె

కాముఁ డెవ్వరి నేసె - కలువ యెవ్వరిగాడె[3]
కామినుల భ్రమగాక - కలఁడు వేరొకఁడు ॥పదం॥[2]

చెరకులట సింగిణులు - చిలుకలట తేజీలు
పరచు వెడదేటులట - పరివారము
మరులుకొని జనులాడు - మాట నిజమని నమ్మి
వెరవ నేటికి కొమ్మ - విడువు మీ భయము ॥కాముఁడె॥

అలరులట బాణాలు - ఆమనట దళవాయి
తలకూత పికములట - దండిపౌజు
తెలియ కిట్లాడు ప - ల్కులకేల వెరవనిటు
తలపోయ నీవంటి - తరుణికిది తగునా ॥కాముఁడె॥

చిగురులట కైదువలు - చంద్రుఁడట[4] గమికాఁడు
వెగటు చలిగాలియట - వెన్నుబలము
జిగిని యలమేల్మంగ - శ్రీవేంకటేశ్వరుని
తగిలి తివియఁగ నేల - తహతహలు నీకు ॥కాముఁడె॥

కాముని పరివారం నాయికను ఆవహించినదట! *- గంధం బసవ శంకరరావు*

---

1. ఈ పట్టున వరుసగా కొన్ని పాటలు ఆహిరి రాగంలో కలవు. కొన్నిట తాళాల పేర్లుండుట ఈ వ్రాతప్రతిలోని విశేషము. **2.** ఇది చక్కని శృంగారపదము. వ్రాతప్రతిలో 'పల్లవి' స్థానమున "పదం" అని ఉండుట కూడా విశేషమే. తిరుమల సంగీత శాసనమందును ఇట్లే కలదు. శాసనమందువలెనే ఇందును రాగతాళముల నిర్దేశము కలదు. ఇట పదమనగా సంకీర్తన లక్షణమును బట్టి అన్నమాచార్యోపజ్ఞమైన సంకీర్తన పదమనియే అర్థము. 'అలమేల్మంగ - వేంకటేశ్వరుని' అని కల ముద్రాస్వరూపమిది. పెదతిరుమలాచార్యుల వారిదిగా భాసించుచున్నది. 'పదం' అను సంకేతమును బట్టి ఇది అన్నమయ్య పదమూ కావచ్చును. **3.** కాముడెవ్వరినేసె కలువ నెవ్వరిగాడె **4.** యింద్రుఁడట. ఈ పదనిర్మాణమున 'ఇంద్రు'నకు తావు లేదు. చిగురు - చం(చెం)ద్రు - ఉచ్చారణబట్టి యిట్టి యతిని చెల్లించుట వీరి వాఙ్మయమున గలదు.

106. కురువనంబి తిరుమల

సంకీర్తన: 136 రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 134 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుట 13-14లలో ఉదాహృతం)

కురువనంబి తిరుమల కురువనంబి నీ
చరణములే కొలిచి బ్రతికె కిరీటము గలరాజు ॥పల్లవి॥

దవ్వులామటనుండి నీవు పువ్వులఁ బూజించితే అవి
చివ్వన అప్పని యడుగుఁదామెరలపై చెలఁగి యప్పుడే నిలిచె
పువ్వులకు ఱెక్కలున్నవో లేక పుండరీకాక్షుని మహిమో
నివ్వటిల్లు నీ భక్తియోకాని నేఁడు నాతోఁ జెప్పవే ॥కురువ॥

పొంకపుదోసిటి యడుసున లెస్స పొరలిన గన్నేరుఁబువ్వులు
కుంకుమగంధ మాకల్పములపై కోరి వేఁడి నిలిచె
బంకమన్నది యెంత వాసనో లేక పారిజాతముల కెక్కుడో
వేంకటపతి కెంత వేడుకో నాకు వివరింపవె అప్పయ్య ॥కురువ॥

దోసిటిలోపలఁ బెట్టిన శ్రీతులసి సేవంతిపువ్వులు
వాసిగ జగమెల్ల కుక్షిలో నిడుకొన్నవాని మేనెల్ల నిండె
వేసదారి యలమేలుమంగ శ్రీవేంకటేశ్వరుని మహిమో నీ
దాసరితనము బలమో కాని తలఁపు నాతోఁ జెప్పవే ॥కురువ॥

కుమ్మరిదాసుడైన కురువనంబి నిర్మలమైన భక్తిని ప్రకటిస్తున్నదీ సంకీర్తనం.

"కుమ్మరదాసుఁడైన కురువరతినంబి / ఇమ్మన్నవరములెల్ల నిచ్చినవాఁడు"

అంటూ 'కొండలలో నెలకొన్న కోనేటిరాయఁడు వాఁడు'(1-151) అనే సంకీర్తనలో అన్నమాచార్యులవారు కురువనంబి భక్తిని కీర్తించారు.

శ్రీవారు అర్చామూర్తిగా వెలసిన తరువాత, ఆయన పినమామ తొండమాన్ చక్రవర్తి ప్రతిరోజూ స్వామివారి దివ్యమంగళ విగ్రహాన్ని తనివితీరా దర్శించుకొనేవాడు. బంగారు తులసీదళాలతో సహస్రనామార్చన చేసేవాడు. క్రమంగా తొండమానునిలో గర్వం ఏర్పడింది. "జగద్రక్షకుడైన స్వామివారికి తులసీదళాలతో – అదీ బంగారు తులసీదళాలతో అర్చన చేయటం మద్భాగ్యవిశేషం కదా. లోకంలో ఎవరైనా యిలా చేసేవారున్నారా?" అని అనుకోవటం మొదలుపెట్టాడు.

తిరుపతికి ఒక్క యోజనం దూరంలోనే భీముడు అనే భక్తుడు ఉన్నాడు. కుమ్మరి. మట్టిని సేకరిస్తున్నా, మట్టిని అడుసు చేస్తున్నా, సారెపై మట్టిముద్దను తిప్పుతున్నా, లేచినా, కూచున్నా, పడుకొన్నా హృదయంలోను, పెదవులపైనా నిత్యం శ్రీనివాసుని నామస్మరణే అతనికి. స్వామిని దర్శించి జన్మ ధన్యం చేసుకోవాలని అతని చిరకాలవాంఛ. పని ఒత్తిడిలో తీరటం లేదు. ఒక్క యోజనం దూరమే అయినా 'అడుగు ఆమడ' అయ్యింది అతని పాలికి. ఇంట్లో శ్రీనివాసుని దారుప్రతిమ ఉంది. కుమ్మరిసారె మీద కుండలు, మూకుళ్లను తీర్చిదిద్దుతూనే, చేతివేళ్లకు అంటిన బంకమట్టిని అలా అలా సుతారంగా పూవులుగా మలుస్తూ, సారె దగ్గరనుండే పంచలో ఉన్న స్వామివారి దారుమూర్తి పైకి విసురుతూ ఉండేవాడు. అదే అతని దృష్టిలో యాత్ర, పూజ.

ఒకనాడు తొండమానుడు స్వామిని దర్శించ పోయి, పూజకు ఉపక్రమించేటప్పటికి స్వామి పాదపద్మాలపై మట్టిపూవులు కనబడ్డాయి. ఆశ్చర్యపడిన తొండమానుడు నేరుగా స్వామినే అడిగాడు. జగాలనేలే స్వామి అల్లన చిరునవ్వుతో భీముని సంగతిని చెప్పి, నిర్మలహృదయంతో తదేకచిత్తంతో ఆ భక్తుడు సమర్పించే మట్టిపూలే నీవు గర్వాతిశయంతో సమర్పించే బంగారు తులసీదళాల కంటే మిన్న" అని చక్రవర్తికి కనువిప్పు కలిగించాడు.

విదళితగర్వియైన తొండమానుడు రాజచిహ్నాలను విడిచి, పాదచారియై భీముని యింటికి వెళ్లి, శరణాగతి పొందాడు. ఆ కుమ్మరి భక్తుడు భీమునికే 'కురవనంబి', 'కురవతినంబి' అని పేర్లు. అందుకే అన్నమయ్య కురువనంబిని "నీ చరణములే కొలిచి బ్రతికె కిరీటముగల రాజు" అని ప్రస్తుతించాడు.

– గంధం బసవశంకరరావు

107. కొండవలె నిను జూచు

సంకీర్తన: 47 రాగం: శంకరాభరణం

వ్రాతప్రతి పుట: 48 తాళం: లుప్తము

కొండవలె నిను జూచు - కొనియున్నవాడ
గండు మీరు తమకము కడకు - గడు దోయకువె ॥పల్లవి॥

గుబ్బలనే కసిదీర - గుమ్మినా గుమ్ముదువు గాని
గబ్బివై యావలి మోము - గాకువే నీవు
సిబ్బెపు మైగోరి కొద్ది - జీరిన జీరుదువు గాని
మబ్బు జూపు కెంపుల బొ - మ్మముడి బెట్టకువే ॥కొండ॥

నోవపంటి కొద్ది మోవి - నొక్కినా నొక్కుదువు గాని
కైవశపు నన్నెరవు - (గా)c జూడకువే
చేవ కౌcగిట కూరాకు - సేసినా సేతువుగాని
కావరపు నా వలపు - గాడి పరచకువే ॥కొండ॥

చేరువ రతి నోటమి - సేసినా సేతువు గాని
వారకపు నాపై బత్తి - వదలకువే
గారవించి నన్ను శ్రీవేం - కటప్పడ కూడితివి
యేరీతినుండినా - యెద (నుండి) దిగకువే ॥కొండ॥

శ్రీవేంకటప్పని వక్షమున కొలువైన దేవేరిని, అక్కడి నుండి వెళ్లవద్దంటున్నాడు స్వామి! ఆ విధంగా 'నిరతానపాయిని'గా వెలుగొందుతుంది అమ్మ అలమేల్మంగ!

- గంధం బసవ శంకరరావు

108. కొమ్మ నీ పలుకులకు

సంకీర్తన: 43 **రాగతాళములు లుప్తములు**

వ్రాతప్రతి పుట: 44

కొమ్మ నీ పలుకులకు - కుశలమస్తు
సమ్మదపు వయసు కై - శ్వర్యమస్తు ||పల్లవి||

బెడగు కళలను జాల - పెంపొందుచున్న నీ
యుడురాజు మోము క - భ్యుదయమస్తు
కడు నొప్పు నీరజపు - కళికల గేరు నీ
వెడద కుచములకు నభి - వృద్ధిరస్తు ||కొమ్మ||

జిగి మిగులగ తేనె - జిలుకు చున్నట్టి నీ
చిగురు మోవికిని ఫల - సిద్ధిరస్తు
సొగసు చక్రములతో - సొలయు నీ పిరుదులకు
అగణిత మనోరథా- వాప్తిరస్తు ||కొమ్మ||

తనరు తుమ్మెదగముల - తరుము నీ కురులకును
ననుపమం బైన దీ - ర్ఘాయురస్తు
నను ద్వారకాకృష్ణు - డనుచు గూడిన నీకు
ననుదినము నిత్య క - ల్యాణమస్తు ||కొమ్మ||

ఇది తాళ్లపాక చినతిరువెంగళనాథయ్యగారి శ్రీకృష్ణసంకీర్తనం. వారి రచనలు ఇలాంటివి మరికొన్ని ఉన్నవి. "తాళ్లపాక సంకీర్తనలు" వ్రాతప్రతిలో ఈ పాట శంకరాభరణం రాగ కీర్తనల మధ్యలో ఉన్నది. కనుక అదే రాగం కావచ్చు.

This is a beautiful song of the TaaLLapaaka Poet's not found in the Tirupati Copper plates, but noticed in TaaLLapaaka Sankiirtanalu (ShESHaachaaryula vraata prati) paper manuscript and other palm-leaf manuscripts like 11640 of TMSSML&RI.

We are not sure now, whether all the compositions of all the composers in the TP family, which are still available in various second or third generation PL & Paper manuscripts in the South, have all been secured and copied earlier on copper plates Or some more of their CPs are yet to be traceable!

The readings found in the Palm-leaf mss., in charaNa-s 1.3 and 2. 1 look better than the readings found in the paper manuscript at Tirupati.

"Sri Krishna mudra" songs gathered so far which are nearly 36 (15+21) in Telugu compositions appear to be those of Chinnanna, the fourth composer in the Tallapaka family (see my research article in Rasamayi-2005). Further probe may reveal or confirm more about the other composers in the family and about their compositions as well.

- Veturi Anandamurthy

109. గందము వూసేవేలె

సంకీర్తన: 247 — రాగం: భైరవి

వ్రాతప్రతి పుట: 236 — తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 2వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 1)లో రాగం భైరవి)

గందము వూసేవేలె కమ్మని మేన యీ
గందము నీమేనితావికంటె నెక్కుడా ॥పల్లవి॥

అద్దము చూచేవేలే అప్పటప్పటికిని
అద్దము నీమోముకంటె నపురూపమా
ఒద్దిక తామరవిరినొత్తేవు కన్నులు నీ
గద్దరికన్నులకంటె కమలము ఘనమా ॥గందము॥

బంగారు వెట్టేవేలే పడఁతి నీమెయినిండా
బంగారు నీతనుకాంతి ప్రతివచ్చీనా
ఉంగరాలేఁటికినే వొడికపువేళ్ల[1]
వెంగలిమణులు నీ వేలిగోరఁ[2] బోలునా ॥గందము॥

సవర మేఁటికినే జడియు నీ నెరులకు
సవరము నీకొప్పుసరి వచ్చీనా
యివలఁ జవులు నీకునేలే వెంకటపతి
సవరని కెమ్మోవిచవికంటేనా ॥గందము॥

'చక్కని తల్లికి చాంగుభళా' అన్నట్లు; అమ్మది జగన్మోహన సౌందర్యము.

– గంధం బసవ శంకరరావు

---

1. తా.వెం. లేఁటికే యువిదనీవేళ్లకు; **2.** నిదురేకు. గోరిబోలునా

110. గారవమున

సంకీర్తన: 128 రాగం: వసంతభైరవి

వ్రాతప్రతి పుట: 127 తాళం: లుప్తము

గారవమున శ్రీవేం - కటపతి పడకిల్లు - తీరని ప్రేమతో (తేరిచూడగను)
చేరవచ్చేను - శ్రీయలమేల్మంగ - జిలుగు పయ్యెద జారఁగాను ॥పల్లవి॥

నిగరంపు - జవ్వాజి - నిగ్గుల కస్తూరి-వగల కుంకుమ మేని వాసనలతోను
మగువ మోమున నిదుర - మంపు దేరగను - నొగిలిన కెమ్మోవి నొక్కులతోను ॥గారవమున॥

ముడిపూలు జారంగ - ముంగురులు మలశాడ - విడెము కపురపు దావి వెదజల్లగా
పడతి రవళులు గిల్కు పావాల మెట్టుక - బడలికలు దెల్పేటి (నడకట్టు) తోను ॥గారవమున॥

చెలువరంగడైన - శ్రీవేంకటపతి - తలపు నెడబాయని తరుణీమణి
మొలకనవ్వుల ముద్దు మోము వలపులు (జిల్కు)
కళలూరి యొయ్యారి - కలికితనమున మీర-గా జేరి ముదమందగాను ॥గారవమున॥
మగువ పొలుపుదెలుపు మారుతగతి యిందు కలదు.

చెలువరంగడైన శ్రీవేంకటపతి మీది శృంగార పదమిది. చెల్లపిళ్లరాయ చరిత్రకర్తయగు తాళ్లపాక అన్నయ్య రచన కాదగును. మేల్కోటెలోని చెలువ నారాయణుని/శ్రీవేంకటేశ్వరుని ముద్రతో, పెక్కు ముద్రా భేదములతో ఇంతవరకు గుర్తింపబడని చెలువ వేంకటేశ్వర పదములున్నవి. అట్టివాటిలో పలు దాక్షిణాత్య భాషలలో గల చెలువ రంగ పదములు కొన్ని వాగ్గేయకారచక్రవర్తియైన రంగశాహి రచనలూ కావచ్చును.

మూలమంత్రమైన 'వేంకట' నామంతోపాటు 'చెలువరంగడు'అనే ముద్రాంకం కూడాచేరి 'తాళ్లపాక సంకీర్తనలు' అనే శేషాచార్యులవారి యింటి వ్రాతప్రతిలో ఉండడాన్నిబట్టే ఈ కీర్తన తాళ్లపాకవారిదనడం నిశ్చయమే అయినా వారిలో యిది యెవరిది అనే ప్రశ్న సహజం. కనుక దీనికి మనం సమాధానం అన్వేషించాలేగానీ ఉట్టినే కొట్టిపారవేయకూడదు. ఎందుకంటే, మన కిప్పుడు లభిస్తున్న రేకులలోని సమాచారంతోపాటు మరెంతో శోధించవలసిన విషయం వారి వ్రాతప్రతులలో దాగి ఉంది. ఈ పాట దాని కొక చక్కని నిదర్శనం.

తాళ్లపాకవంశ విఖ్యాతికి మూలపురుషుడైన అన్నమాచార్యులవారితోపాటు వారికొడుకులూ, మనుమలూ, స్త్రీలూ అందరూకూడా గాయకులూ, వాగ్గేయకారులూ కావచ్చుననే విషయం పరిశోధనలో క్రమక్రమంగా వెల్లడి

అవుతూ వస్తున్నది. తాళ్లపాకపరిశోధనలో సూర్యచంద్రులై ప్రకాశించిన పెద్దలు వేటూరివారూ, రాళ్ళపల్లివారూ అందించిన సమాచారంతో ముందుకువెళ్లి పరిశీలించగా వారివారి ముద్రాభేదాలూ, స్వరసహిత సంకీర్తనాది శిలాగీతాలూ, సంగీత రచనలూ వెలుగు చూసినవి. ఆ వంశంలో నాలుగో పదకర్తగా, శ్రీకృష్ణపదాలకర్తగా, చిన్నన్నపేరు రూఢికెక్కింది. తిమ్మక్క, నాంచారమ్మ, నరసింగన్న మొదలైన తక్కినవారి ఆచూకీలూ వెల్లడికావడం మొదలైంది.

ఇప్పుడు పెద తిరుమలయ్య సంతానంలో ఐదవ పదకర్త, అన్నివిధాలా తాతనుబోలిన మనవడు, తాళ్లపాక అన్నయ్య పేరు పరిశీలనలో ఉంది. ఆయన 'చెల్లపిళ్లరాయచరిత్ర యక్షగాన'కర్తగా ప్రసిద్ధి కెక్కడమేకాక 'చెలువ వేంకటేశ్వర' ముద్రతో పదాలు చెప్పినవాడుగా కూడా తెలియవస్తున్నాడు.

'చెలువ'అనే పదబంధంతో ముడిపడి చెలువరాముదు/రామస్వామి; చెలువుదు; చెలువ వేంకటేశ్వర; చెలువరాముడైన శ్రీవేంకటేశ్వర; చెలువారు రామస్వామి; చెలువరాముడైన గోపాలా; చెలువుడా తిరుపత్తూరి చిత్తరు శ్రీరామా; చెల్వ రామస్వామివైన వేంకటనాథా; చెలువ కృష్ణుడు; చెలువ రంగడైన శ్రీవేంకటపతి మున్నగు ముద్రారీతులుగల కొత్తపదా లిప్పుడు కొన్ని వెలుగు చూస్తున్నవి. ఇట్టి 'చెలువ వేంకటేశ్వర' ముద్రతోగల పదాలను గూర్చిన పరిశీలన మింతవరకూ జరిగిన జాడ కానరాదు. ఈ పదాలన్నీ తాళ్లపాక ఇమ్మడి అన్నయ్య కృతము లనడానికి వారి యీ యక్షగాన రచన తోడుపడుతున్నది.

మైసూరు సమీపంలో ఉన్న పంచ నారాయణ దివ్యదేశాల్లో ఒకటైన యదుగిరి తిరునారాయణ క్షేత్రం (నేటి మేల్కోటె) లో చెలువ నారాయణస్వామి ఆలయ మున్నది. తాళ్లపాక తిరుమలాచార్యులు 'బెల్లపు మాటల చెల్లపిళ్ళరాయని' పై (10-80) చెప్పినపాట ఈ దైవాన్నే స్ఫృతికి తెస్తున్నది. మిత్రులు డాక్టర్ యాచేంద్రగారి సహకారం తీసుకుని వీటి నన్నిటినీ గుర్తించి సేకరించడం జరుగుతున్నది

During the Sahasraabdi Celebration of Bhagavad Raamaanujaswami it is appropriate to pay tributes to his memory for the service he rendered towards the promotion of our Bhakti cult, Cultural renaissance, Religious tolerance and National integration.

Religious and Cultural centers like the ancient Tirumala and the Yadava Narayana Chaturvedi Mangalam (present MelkoTe region) in the south stand as shining examples in promoting Hindu Dharma through Devotional Literature and Music. The TaaLLapaaka VaaggEyakara-s have eulogized the glory of these divine Centers in their compositions.

Annayya(16thC), the grandson of Padakavita Pitamaha Taallapaaka Annamachaarya wrote a beautiful Yakshaganam based on the story line of ChellapiLLaraaya's marriage with Biibi Nancharama. The authorship of the unpublished cluster of TaaLLapaaka songs with Cheluva–VenkatEshwara mudra is now attributed to Annayya, the author of the Yakshaganam ChellapiLLaraaya Charitram. This is new information with regards to TP compositions

- Veturi Anandamurthy

111. గుజగుజ రేకుల

సంకీర్తన: 268 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 255

(ముందువెనుక గల రాగాల క్రమమును బట్టి సౌరాష్ట్ర కాదగును)

గుజగుజ రే - కుల (బాడనియ్యము)
అజుడు శివుడు వచ్చి - యడిగినగాని ॥పల్లవి॥

యిట్టి మాయింటికి తానె - యేగివచ్చినగాని
చెట్టబట్టి బువ్వాన బో - సేసినగాని
(పట్ట)పు రా(ణి పగిది) - పాలించీ ననినగాని
పెట్టు ముత్యాల సేసతో - బెండ్లాడినగాని ॥గుజ॥

సంగతి సరిలేని (నిక్కు)- జాలించినను (గాని)
అంగనపై నెవ్వతె దే - ననినగాని
అంగడి బెట్టక నింతితో - నలుగనంటే గాని
చెంగట మిమ్మిందరి ర - క్షించేనంటే గాని ॥గుజ॥

వొప్పుల మోవి సతికి - వుంకువ యిచ్చినగాని
యెప్పుడును సతి నిట్లే - యేలినగాని
అప్పుడు వేంకటరాయ - అలమేల్మంగ నాంచారి
తెప్పిరి కొమ్మ నెద - దించనంటే గాని ॥గుజ॥

తాళ్లపాక అన్నమాచార్యులే తిరుపతిలో కల్యాణోత్సవముల నారంభించినవారు. కల్యాణోత్సవముల సందర్భములలోనూ, పిల్లలాడుకొనే బొమ్మల పెండ్లిండ్ల సంభ్రమము లందునూ స్త్రీలు పాడుకొనే పాటల ప్రస్తావన యిందు కలదు.

గుజగుజరేకులు = బాలక్రీడా కల్యాణగానము; ఏగి వచ్చుట = సంభ్రమమునకు ఊరు ఏగి, ఉరేగింపుగా, తరలివచ్చుట; ఉంకువ = పెండ్లివారు కన్యార్థ మిచ్చే ధనము.

This is an unpublished song of TP Poets not found in the Tirupati copper plates.

Gujaguja Rekulu and GobbiLLu are traditional preparatory wedding group songs usually sung by young and unmarried girls.

This is a wedding song composed by TaLLapaaka Pedda Tirumalaachaarya describing the girl children’s activity on such occasions. Inscriptional evidences state that Annamacharya was the progenitor of Sri Venkateswara VaivaahikOtsavams at Turumala, where his role was that of the Father-in-law. There are hundreds of TaaLLapaaka songs on PenDli tiruNaalLLu composed during their life time.

- Veturi Anandamurthy

112. గుజ్జనఁగూడు వండెనె

సంకీర్తన: 254 రాగం: సౌరాష్ట్ర

వ్రాతప్రతి పుట: 71 తాళం: అట

(ఈ సంకీర్తన సంపుటం10లో శృంగార సంకీర్తనలలో 101వ సంకీర్తన. రాగిరేకు (సంఖ్య 17)లో రాగం బౌళిరామక్రియ)

గుజ్జనఁగూడు వండెనె కోమలి నేఁడు
గొజ్జువెన్నెలబాయిటఁ గొమ్మలుఁ దాను ॥ పల్లవి ॥

గోమున సేవంతిపువ్వు గురుగులలోపల
యేమరక పూఁదేనె నెసరు వెట్టి
ప్రేమతోఁ బచ్చకప్రపుబియ్యము కొద్దికిఁ బోసి
దోమటిగా మంచి పూవుఁదోఁట వాలెను ॥గుజ్జన॥

మచ్చికఁ బన్నీటను మారెసరుగాఁ బోసి
కచ్చుపెట్టి మల్లెమొగ్గఁ గలయఁ బెట్టి
మెచ్చుల మరువమున మించినట్టి పొంగణఁచి
ముచ్చటఁ బచ్చాకున మూఁకుడు మూసి ॥గుజ్జన॥

చెలఁగి వట్టివేళ్ల జిబిలికెను వారిచి
కులికి పుప్పొళ్లనే కూరలు వండి
కలికి చుట్టపు శ్రీవెంకటనాథురతిఁ గూడె
వెలయ నాతనికి విందు వెట్టనూ ॥గుజ్జన॥

నాయిక ప్రేమతో గుజ్జనగూడు వండి శ్రీవేంకటనాథునికి విందు పెట్టిందంటున్నారు చినతిరుమలయ్య!

జిబిలికె: అన్నం వండిన తరువాత గంజి వార్చటానికి పల్చగా చీల్చిన వెదురుబద్దలతో అల్లిన 'సిబ్బి' వంటిదాన్ని అడ్డంపెట్టి వారుస్తారు. దానికి ఉన్న సందుల నుండి గంజి అంతా కారిపోతుంది. దీనిని వ్యావహారిక భాషలో 'జిబ్బి' అనికూడా అంటారు. వట్టివేళ్లు సువాసన నిచ్చేవి కాబట్టి, ఆహారానికి మంచి వాసన అబ్బటానికి కాబోలు, అన్నమయ్య వెదురు జిబిలికెను కాక వట్టివేళ్ల జిబిలికెను ప్రస్తావిస్తున్నాడు.

– గంధం బసవ శంకరరావు

113. చందమామ రావో

సంకీర్తన: 250 రాగం: సౌరాష్ట్ర

వ్రాతప్రతి పుట: 240 తాళం: అట

చందమామ రావో - జాబిల్లి రావో మంచి
కుందనంపు పైడి వెన్న - కోర పాలు తేవో ॥పల్లవి॥

నగుమోము చక్కనియయ్యకు - నలువ బుట్టించిన తండ్రికి
నిగమములందుండే యప్పకు, మా - నీలవర్ణునికి
జగమెల్ల యేలిన స్వామికి - చక్కని యిందిర మగనికి
ముగురికి మొదలైన ఘనునికి, మా - ముద్దుల మురారి బాలునికి ॥చందమామ॥

తెలిదమ్మి కన్నుల మేటికి, మంచి - తియ్యని మాటలగుమ్మకు
కలికి చేతల కోడెకు, మా - కతలకారి యీ బిడ్డకు
కులముద్ధరించిన పట్టికు మంచి - గుణములు కలిగిన కోడెకు
నిలువెల్ల నిండు వొయ్యారికి, నవ - నిధుల చూపుల సుగుణునకు ॥చందమామ॥

సురలగాచిన దేవరకు - చుంచు గరుడని నెక్కిన గబ్బికి
నెరవాది బుద్ధుల పెద్దకు, మా - నీటు చేతల పట్టికి
విరులవింటి వాని యయ్యకు, వే - వేల రూపుల స్వామికి
సిరిమించు నెరవాది జాణకు, మా - శ్రీవేంకటనాథునకు ॥చందమామ॥

అనేక శతాబ్దాలుగా తెలుగుతల్లి సాయంసంధ్యవేళ తన మురిపాలబిడ్డకు కమ్మని గోరుముద్దలు తినిపిస్తూ వాత్సల్యంతో ఈ పాటను పాడుతూ మమకారాన్ని పంచుతుంది.

- గంధం బసవ శంకరరావు

114. చాలదే ఒక నాడైనను

సంకీర్తన: 104 | రాగం: కేదారగౌళ

వ్రాతప్రతి పుట: 104 | తాళం: లుప్తము

చాలదే ఒక నాడైనను - సఖి మది కరగగ నిటువలె
వాలాయముగా సురతపు - వైభవ మొసగిననూ ॥పల్లవి॥

అరమోడ్చిన కనుగవయును - అతిదైన్యంబగు మాటలు
అరమరపుల యెచ్చరికలూ - అగ్గలికంబులును
నెరిగురు లంటిన నొప్పెదు - నిటల స్థలమును, కాంతియు
దొరగిన చూపులు అప్పటి - తుది యలపుల గతు(లు)ను ॥చాలదే॥

శ్వాసము దెలిపెడి కుచము(ల) - సన్నలు గలుగు నురమ్మున
వేసిన ముంగొంగును కడు - వీడిన క్రొమ్ముడియును
మ్రోసెడి కంకణ ఘనరవ - ములచే భాసిలు చేతుల
గాసిల నొప్పెదు సన్నపు - గాటులు గోరుచును ॥చాలదే॥

తెప్పిలు చల్లని మోవుల - తీపుల బడలిక బాపుచు
ముప్పిరిగొను (తమకమ్మున)న - మురిగొల్పుచు రతికిని
తెప్పల తేలించెను సుద - తీమణి రుక్మిణి శ్రీకృష్ణుని
అప్పటి వేడ్కకు మరి సరి - యా (యెడనే) చూడను ॥చాలదే॥

పై సంకీర్తనకు పాఠాంతరాలతో తిరుపతి వ్రాతప్రతిలో లభించిన మరొక సంకీర్తన గురించి...

రాగం: నీలాంబరి | తాళం: అస్పష్టం

(చా)లదే ఒక నాడైనను - సఖి తన మది కరగగ నిటువలె
వాలాయముగా సురతాంతపు - వైభవ మొసగినను ॥పల్లవి॥

అరమోడ్చిన కనుగవయును - అతి దైన్యం బగు మాటలు
అరమరపుల నెచ్చరికలు - అగ్గలికములను

నెరిగురు లంటిన సల్పది - నిటలస్థలమున చెక్కిట
దొరగెడి చమటలు మిక్కిలి - తుది (యలపుల గతులున్) ॥(చా)లదే॥

(శ్వా)సము దెల్పెడి కుచములు - సన్నపు నడుమును నెదపై
వేసిన ముంగొంగును కడు - వీడిన క్రొమ్ముడియు
మ్రోసెడి కంకణ రవములు - ముసిముసి నగవులు నవ్వుచు
గాసి (మిగుల) చల్లనైన - గాడ్పుల గ్రోలుచును ॥(చా)లదే॥

తెప్పిరి పడుచును అధరము - తీపుల బడలిక బాపుచు
ముప్పిరిగొను తమకంబున - మునిపిరి గొల్పుచును
తెప్పల తేలించెడి సుద - తీమణి కృష్ణా యని
అప్పటి వేడుకలకు తా - నా యెద బూనుచును ॥(చా)లదే॥

ఇప్పటికి పదిహేడు సంవత్సరాలకు పూర్వం భక్త రామదాసు ప్రాజెక్ట్, ఖమ్మంవారి ప్రేరణతో రామదాసు కొత్త కీర్తనల కోసం తిరుపతి వ్రాతప్రతులను శోధిస్తున్నప్పుడు బయలుపడిన యీ పాటను తాళ్లపాక చిన్నన్న రచనగా గుర్తిస్తున్నాను. ఇట్టివే మరెన్నో కృష్ణ ముద్రాంకితాలు శేషాచార్యుల వ్రాతప్రతిలోనూ, తంజావూరు తాళపత్రాల్లోనూ ఉన్నవి. ప్రకరణశుద్ధిని బట్టి వాటిని గుర్తించదగును. (చూ. నా రసమయి వ్యాసాలు 2005–2006 నాటి సంచికలు. ఇప్పుడు వాటినన్నిటిని ఒక దిక్కున సంకలనపరచి నా పరిశోధనలో భాగంగా ప్రకటించే యత్నం చేస్తున్నాను.)

మొవ్వ గోపాల ముద్రతో ప్రతిష్ఠ గడించిన క్షేత్రయ్య పదాలకు తాళ్లపాకవారి సంకీర్తన పదరచనలూ, ముఖ్యంగా ఇలాంటి తాళ్లపాకం చిన్నయ్యగారి "కృష్ణ" ముద్రాంకిత పదాలూ, మనుమడు అన్నమయ్యగారి "చెలువ వేంకటేశ్వర" పదాలూ, పూర్వరంగం కల్పించిన వనుకోవచ్చును. పైని పేర్కొన్న పదంలో "మువ్వ గోపాలముద్ర" లేదు కాబట్టి అది క్షేత్రయ్యది కాదు. కేవల కృష్ణముద్రాంకితం కాబట్టి ఇదీ తాళ్లపాకవారి పదమే అని భావిస్తాను.

- వేటూరి ఆనందమూర్తి

115. ఛీఛీ నరుల దేఁటి జీవనము

సంకీర్తన: 127 రాగం: ముఖారి

వ్రాతప్రతి పుట: 126 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 86వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 15)లో రాగం ముఖారి)

ఛీఛీ నరుల దేఁటి జీవనము
కాచుకొని హరి నీవే కరుణింతుగాకా ॥పల్లవి॥

అడవిలో మృగజాతియైనాఁ గావచ్చుఁగాక
వడి నితరులఁ గొలువఁగ వచ్చునా
వుడివోని పక్షియై వుండనైనా వచ్చుఁగాక
విడువ కెవ్వరికైనా వెఁడవచ్చునా ॥ఛీఛీ॥

పసరమై వెతలేని పాటువడవచ్చుఁగాక
కసటు వొనరులఁ బొగడవచ్చునా
వుసురు మానై పుట్టివుండనైనావచ్చుఁగాక
దెసల నెక్కడనైనాఁ దిరుగవచ్చునా ॥ఛీఛీ॥

యెమ్మెల పుణ్యాలు సేసి యిల నేలవచ్చుఁగాక
కమ్మి హరి దాసుఁడు గావచ్చునా
నెమ్మది శ్రీవేంకటేశ నీ చిత్తమె కాని
దొమ్ముల కర్మము లివి తోయవచ్చునా ॥ఛీఛీ॥

మానవులందరూ ఈ మూన్నాళ్ల ముచ్చటయైన జీవితాన్ని ఏమార్చుకోవటానికి, గడుపుకోవటానికి చేయరాని పనులు చేస్తున్నారు. ఎంత నీచమైన పని ఇది! అడవిలో మృగమై పుట్టినా ఫరవాలేదు కాని, మనిషై పుట్టి ఇతరులను సేవించుట ఎంత హీనమైన పని, కాకివలే పక్షిగా జన్మించి జీవించటం మేలే కాని, పరులను యాచించుట ఎంతటి దుర్గుణమైన విషయం అంటూ అన్నమాచార్యులవారు సందేశాన్ని అందిస్తున్నారు!

– గంధం బసవ శంకరరావు

116. చూచేవారికి ధర్మము

సంకీర్తన: 57 రాగం: లుప్తము
వ్రాతప్రతి పుట: 58 తాళం: ఏక

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 339వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 59)లో రాగం నాట)

చూచేవారికి ధర్మము సులభమువలె నుండు
కాచి నమ్మి చేకొంటే ఘనునిఁగాఁ జేసును ॥పల్లవి॥

అరయ శ్రీపాదతీర్థ మల్పమువలె నుండు
వరుసఁ బాపములను వక్కలించును
వొరసి నీ నామ మొక్కమాటవలె నుండును
నరకములు తరించి నంటున రక్షించును ॥చూచేవారికి॥

మహి నీ పూజ తులసీదళమాత్రమువలె నుండును
యిహపరములు దానే యియ్య నోపును
అహరహము నీ చింత ఆందోళమువలె నుండును
విహితమై నీ కృపకు వెసఁ బాత్రుఁ జేసును ॥చూచేవారికి॥

చేరి నీకు మొక్కే మొక్కులు చేష్టలువలె నుండు
ధారుణిలో భవవార్ధి దాఁటించును
వూరకే నీ కిచ్చే కానుక వొక కాసువలె నుండును
యీరీతి శ్రీవేంకటేశ యే వరమైనా నొసఁగును ॥చూచేవారికి॥

నీ నామము వెల సులభము, ఫలమధికము (2-338) అన్నట్లుగా ఆ భగవంతుని ఆశ్రయించిన భక్తునికి స్వామి ఒసగు వరములు అపారములు.

- గంధం బసవ శంకరరావు

117. చెప్పరాదుగదే మన

సంకీర్తన: 180 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 174

చెప్పరాదుగదే మన - చిన్ననాటి నడకలు
    వొప్పులాయ తలచితే - వోలాల! ॥పల్లవి॥

పన్నీటికాలువ దండ - పచ్చకప్పురపు దిన్నె
    పొన్నలనీడ గొజ్జంగి - పొదరింటిలో
    సన్నపు పయ్యెద వెట్టి - సంది సంది గ్రుచ్చుకొని
    వున్న బాగులెంచేవు - వోలాల! ॥చెప్పరాదు॥

పొత్తుల వీడెపు మరు - బువ్వపు తమలపాకు
    లెత్తిలి యొండొరులకు - నిచ్చే తమిని
    జొత్తిలు మోపుల పలు - సోకుల కాకలకుగాక
    వొత్తుకొంటివి చెక్కు - లోలాల ॥చెప్పరాదు॥

వుక్కుగోరితాకు - లొయ్యనె కళలంటగా
    పిక్కటిల్లు రతులనే - పిరిదియ్యక
    మక్కువతో నలమేలు - మంగ శ్రీవేంకటేశ్వర
    వొక్కటైతిమిద్దరము - వోలాల ॥చెప్పరాదు॥

జానపదశైలిలో జ్ఞాపకాల దొంతరలు!

నాయికా నాయకులు సంఖ్యాపరంగా ఇద్దరైననూ, భావపరంగా ఒక్కరే!

- గంధం బసవ శంకరరావు

118. చెలిమితో కూడితివి

సంకీర్తన: 208 రాగతాళములు లుప్తము

వ్రాతప్రతి పుట: 200

చెలిమితో కూడితివి - చిత్తము వదలక - శ్రీవేంకటప్రభుడ

అసంపూర్ణము

ఈ సంకీర్తన ఇంతమాత్రమే కలదు, పల్లవిలో సగము, ఆభోగములో ముద్రాచరణమున సగము మాత్రమే కలదు. పాఠాంతరము లభించినపుడు పరిశీలించదగినది. అన్వేషింపవలెను.

- వేటూరి ఆనందమూర్తి

119. చెలియ! నాపై యెంత

సంకీర్తన: 279 రాగతాళములు లుప్తము

వ్రాతప్రతి పుట: 264

చెలియ! నాపై యెంత - సేసేవు బత్తి, యిటు
వలె ప్రియుని లాలించు - వనిత వేరె కలదా ||పల్లవి||

తలకకిటు రొమ్ము మీ - దట గ(ల)క నిదుర క
న్నులు మబ్బు దేరగా - బిలచినాను
పలుకకుండగ మోవి - పంట నొక్కుచు మేలు
కొలిపి తమ్ముల మిడిన - గలికివా నీవు? ||చెలియ!||

చెయ్యార సాము సే - సిన మేను గాగా, బడలి
వయ్యారి యింత క - ప్రం బిచ్చినాను
ముయ్య కనుగవ మీద - మొన గుబ్బ చనుదోయి
డయ్యించి యలపార్చు - తరుణివా నీవు? ||చెలియ!||

చిలు(కు)రతిగతుల నల - సిన వేళ దాన మై
నొలయు చమటలు సారె - (నుబ్బు) గాను
చెలియ నలమేల్మంగ - శ్రీ వేంకటేశు నూ
ర్పుల గాలి వడదీర్చు - పొలతివా నీవు? ||చెలియ!||

శ్రీవేంకటేశ్వరునికి అపారమైన వలపు భక్తిని కుమ్మరించుచున్నది నాయిక!

- గంధం బసవ శంకరరావు

120. చెలులార చూడరే

సంకీర్తన: 23 రాగం: శ్రీరాగము

వ్రాతప్రతి పుట: 25 తాళం: లుప్తము

చెలులార చూడరే - చిత్రమీ భావంబు
తలపోసి చూడుఁడిం - దరు వేడ్కతోను ॥పల్లవి॥

నలినాక్షి యొకతె తన - నాథునకుఁ బ్రీతితో
లలి భూషణముల న - లంకరించి
తలిరాకు వంటి పా - దము జూచి రత్నాల
(వెలుగు) పెండెము వెట్ట - వెరచె నేమిటికో (బిరుదు?) ॥చెలులార॥

పంతమున నొక నీరు - పాపగని వేడ్క నే
కాంతమున ప్రాణేశుఁ - గవియువేళ
యింతి పరపురుషుఁడని - యెంచి యంతలో గనిలేచి
నంత తన విభుని గ - (న్నదరె) నేమిటికో ॥చెలులార॥

చెలఁగి యలమేల్మంగ - శ్రీవేంకటేశుండు
(తులలేని) రతిగతుల - కలసి మెలసి
అలచంద్రుఁడని మింట - నతిభీతుఁడై లేచి
కలికి కన్నులు మూయఁ - గతమదేమిటికో ॥చెలులార॥

ఇదొక సమస్యాపదము. తొలి చరణమున ఆమె పాదము తలిరాకు - రతనాల కాఠిన్యము సోకరాదని! తృతీయ చరణమున అలమేలుమంగ పద్మజ. మింట చందమామను జూచి ముకుళించుకొను నన్న వెఱపు!

ద్వితీయ చరణమున గల భావచిత్రమెట్టిదో తలపోసి యెరుగవలెను!

- వేటూరి ఆనందమూర్తి

121. చెలులారా! చేరిచూడరే

సంకీర్తన: 34 రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 35 తాళం: లుప్తము

చెలులారా! చేరిచూడరే - శ్రీవేంకటేశుని
గలియూ నలమేలుమం - గను ॥పల్లవి॥

చందురునందు చీకట్లుండె నే, - వోయమ్మలాల!
సంపంగి పై తుమ్మెద లా డేనే
ముందు మొల్ల - మొగ్గ లొదవేనే, - వో యమ్మలాల!
మోవి పగడ కాంతులొలికేనే ॥చెలులారా॥

బంతులపై చుక్కలమరీనే - వో యమ్మలాల
పలుకు వీణె శంఖ మొత్తేనే
అంతరమున పాము నిలిచెనే - వో యమ్మలాల
అచటనొక్క కొలను బుట్టెనే ॥చెలులారా॥

యేనుగ కుంభములు కలిగెనే, - వో యమ్మలాల!
యెసఁగ పసిడి దిన్నె (లాయెనే)
పూని దామరలు పూచెనే - వో యమ్మలాల!
పొలుపుమీర కాళెలయ్యానె ॥చెలులారా॥

ప్రహేళికా రీతిలోనున్న సంకీర్తన

- గంధం బసవ శంకరరావు

122. చేతకాని పనులెల్ల

సంకీర్తన: 164 రాగం: దేశాక్షి
వ్రాతప్రతి పుట: 160 తాళం: లుప్తము

చేతకాని పనులెల్ల - జేసేది రోత
నీతిలేనివానివద్ద - నిలిచేది రోత ॥పల్లవి॥

తడవుపుట్టింటను - తరుణినుంచిన రోత
అడుగరానివాని - నడిగేది రోత
పుడమిలో వలవని - పొలతి బొందుట రోత
చెడి చుట్టము కడకు - చేరేది రోత ॥చేతకాని॥

అప్పుదీసి సౌఖ్యము - లనుభవించుట రోత
తప్పు విచా(రించక తీర్పు) - చెప్పేది రోత
ముప్పున బిన్నవయసు - ముదితచేకొన్న రోత
చెప్పరాని పనులెల్ల - జేసేది రోత ॥చేతకాని॥

కలవానితోడను - కలహించేది రోత
నలినాక్షుల పొందు - నమ్మేది రోత
అలరి శ్రీవేంకటపతి - గొలువనియట్టి
(కలి) నరుని జన్మము - కడకు రోత ॥చేతకాని॥

అన్నమయ్య సుభాషితమిది! అప్పులేని సంసారమైన పాటే చాలు" (1-114) ఈ రీతిలోని సంకీర్తనమే!

"అనుమానపు బ్రదుకది రోఁతా తన-
మనసెనయని కూటమి మరి రోఁతా" (1-26)

పై కీర్తనకూడా ఈ సామ్యంలో నడచేదే!

- గంధం బసవ శంకరరావు

చిత్రం: బాపు

నవనీతచోరుఁ డితఁడె

123. చేతు లలయ పూజ

సంకీర్తన: 275 రాగతాళములు లుప్తములు[1]

వ్రాతప్రతి పుట: 261

చేతు లలయ పూజ[2] - సేతామురారో
పూతనాసంహారుని, నవ - నీత కృష్ణుని ॥పల్లవి॥

నాథుఁడితఁడె రుక్మిణీ - నాథుఁడితఁడె
రాధికా మనోహరుఁడైన వి - నోదుఁడితఁడె ॥చేతు॥

జారుఁడితఁడే నవనీత - చోరుఁ డితఁడె
మారుని గన్నట్టి నందకు - మారుఁ డితఁడె ॥చేతు॥

(మాధవుం)[3] డితఁడె కంస - మర్దనుం డితఁడె
శ్రీధరుండైన వేంకట - నాథుఁ[4] డితఁడె ॥చేతు॥

నవనీత కృష్ణుని చేతులారా పూజ చేయమని కవి ఉద్బోధ!

- గంధం బసవ శంకరరావు

---

1. రాగాల వరుసక్రమమున గల పాటలలో దీని మీదివి కొన్ని సౌరాష్ట్రలోను, క్రిందివి ఆహిరిలోను గలవు. ఆ రెండిటిలో ఏదో ఒకటి దీని రాగము కావచ్చునేమో! **2.** పూజలు **3.** బ్రాకెట్లలోని శిథిలపూరణలు పరిష్కర్తవి. **4.** వేంకటనాథ ముద్రను బట్టి ఇది చినతిరుమలాచార్యులవారి కీర్తన కాదగును.

124. చేవమావి చిగురులివి

సంకీర్తన: 267 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 254 (రాగాల వరుసను బట్టి సౌరాష్ట్ర కావచ్చును)

చేవమావి - చిగురులివి చూడ, నీ
తావికావి మోవి(యనీ) - (తలపౌనె) ॥పల్లవి॥

బెళకెడు బేడిస - పిల్లలు చూడ, నీ
తలచుట్టు కన్నులు - తలపౌనె
(బలువు) గజనిమ్మ - పండ్లు చూడ, నీ
తళుకు పాలిండ్లు - తలపౌనె ॥చేవమావి॥

పనుపడు బంగారు - పలకలు చూడ, నీ
తనరారు చెక్కులు - తలపౌనె
గొనబడు సింగంపు - కొదమను చూడ, నీ
తనువగు లేగౌను - తలపౌనె ॥చేవమావి॥

రమణ తుమ్మెద మొగ్గ - రపు కప్పు చూడ, నీ
తమి మెచ్చు బలుగొప్పు - దలపౌనె
కమలము చూడ వేం - కటపతౌ తనకు నీ
తమిరేచు నెమ్మోము - తలపౌనె ॥చేవమావి॥

నాయిక సొబగులు ప్రకృతి సంబంధములు.

- గంధం బసవ శంకరరావు

125. జీవాతుమై యుండుచిలుకా

సంకీర్తన: 198 రాగం: ఆహిరి

వ్రాతప్రతి పుట: 191 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 1వ సంపుటంలో 50వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు(సంఖ్య 8)లో రాగం ఆహిరి)

జీవాతుమై యుండుచిలుకా నీ-
వావలికి [1]పరమాత్ముఁడై యుండుచిలుకా ॥పల్లవి॥

ఆతుమపంజరములోన నయమున నుండి నా-
చేతనే పెరిగిన చిలుకా
జాతిగాఁ గర్మపుసంకెళ్లఁబడి కాల-
జేతఁబేదైతివే చిలుకా

భాతిగాఁ జదువులు పగలురేలును నా-
చేత నేరిచినట్టిచిలుకా
రీతిగా దేహంపురెక్కలచాటున నుండి
సీతుకోరువలేనిచిలుకా ॥జీవాతుమై॥

బెదరి [2]అయిదుగురికిని భీతిఁబొందుచుఁ గడుఁ-
[3]జెదరఁగఁ జూతువే చిలుకా
అదయు [4]లయ్యిన శత్రులారుగురికిఁగాక
అడిచిపడుదువే నీవు చిలుకా

---

1. 'వావలికిఁబర' అని పూ.ము.పా
2. 'యైదుగురికిని' అని పూ.ము.పా
3. 'జెదరంగ' అని పూ.ము.పా
4. ' లైన' పూ.ము.పా

వదల కిటు[5] యాహారవాంఛ నటు పదివేలు-
వదరులు వదరేటిచిలుకా
తుదలేనిమమతలు తోరమ్ముసేసి నా-
తోఁగూడి మెలగినచిలుకా ॥జీవాతుమై॥

నీవన నెవ్వరు నేనన నెవ్వరు
నీవే నేనైయుందుఁ జిలుకా
శ్రీవేంకటాద్రిపై చిత్తములో నుండి
సేవించు కొని గట్టిచిలుకా

దైవమానుషములు తలఁపించి యెపుడు నా-
తలఁపునఁ బాయనిచిలుకా
యేవియును నిజముగా నివి యేఁటికని నాకు
నెఱిఁగించి నటువంటి చిలుకా[6] ॥జీవాతుమై॥

ఉపనిషత్తుల సారమీ సంకీర్తన. జీవాత్మకు పరమాత్మను చేరుట లక్ష్యం!

– వేటూరి ఆనందమూర్తి

---

5. 'కొను' లేక 'కొనునట్టి' కావచ్చు.

6. ఇది పెద్దపాట. దీనిలో ప్రతిచరణము రెండుపంక్తులకొక పాదముగ గుర్తించవలెను.

126. తనకుబోదు నాకుబోదు

సంకీర్తన: 106 రాగం: కేదారగౌళ
వ్రాతప్రతి పుట: 106 తాళం: లుప్తము

తనకుబోదు నాకుబోదు - తగులుచేసే మేనవావి
వెనక నేరమెంచి యెంచి - వెరపు(జూప)నేటికి ॥పల్లవి॥

చిలుకపోటు మోవితోడ - చిలుప చెమటమేనితోడ
వలపురేచ వచ్చెనమ్మ - వాడవారిమరది
అలుకసేయనేటికమ్మ - (అరసి) తానెతెలుసుకొని
పిలిచిపీట వెట్టరమ్మ - ప్రియము తోడ వీనికి ॥తనకు॥

చద్దితమ్ములమ్ము తోడ - జారు జంపుకురులతోడ
వద్దనుండివచ్చెనమ్మ - వాడవారిమరది
గద్దరింపు మాటాడీ - కతలకారి వాడు వీడు
పెద్దమేడ పాన్పు మీద - పెంపు సేయు వీనికి ॥తనకు॥

కాటుకంటు చెక్కుతోడ - కడల కెంపు చూపుతోడ
మాటలాడ వచ్చెనమ్మ - మందవారి మగడు
గాటముగను శ్రీవేం - కటనాథుడిట్టె గూడె, (ముద్దు)
మూట గట్టు మెచ్చులాడు - మొక్కరమ్మ వీనికి ॥తనకు॥

ముద్రను బట్టి యిది చినతిరుమలాచార్యుల రచన.

మన ఇద్దరి బంధం, అనుబంధం విడదీయరానిదయ్యా!

- గంధం బసవ శంకరరావు

127. తప్పకజెప్పరా వోరి!

సంకీర్తన: 188 రాగం: శంకరాభరణం
వ్రాతప్రతి పుట: 182 తాళం: లుప్తము

తప్పకజెప్పరా వోరి! - దాచక నీవు
యెప్పుడు నీ వద్ద కాక - యెడసి యుండేనా ॥పల్లవి॥

సందెకాడ రమ్మనంగ - ఝూము పోయి వచ్చితివి
విందు వలె నెవ్వతెకు - వెచ్చమైతి వో
అందరు మగువలైనా - ఆపె నంటిన కౌగిలి
యిందు గలిపేదంటా - యింత లోగేను ॥తమలోనే॥

పిలువ నంపిన చెలి - బిట్టు కూడితివిందాక
తలపు నీ కక్కడెనె - తమకించెనో
చలము నీతో గాదు - చవి దప్పినందు మీద
బలిమి గలయ బోతే - పసలేని పనులౌను ॥తమలోనే॥

కప్పురమె పంపుమంటే - గందవొడి యంపితివి
అప్పుడక్కడ ప - రాకై యుండితివో
యిప్పుడె శ్రీవేంకటేశ! - యిటు నన్ను గూడితివి
నెప్పున నీ కడమైనా - నీవే కలవు ॥తమలోనే॥

గందవొడి = గందపుపొడి (పురుషోత్తమకవీయము అను శబ్దరూపప్రబోధకవి నిఘంటు త్రితయము).

కప్పురము = కర్పూరము.

ఈ సంపుటం సంకీ. 137లో కూడా గందవొడి ప్రస్తావన కలదు.

నిన్ను విడిచిపెట్టియుండలేని నాకు కాక, మరొకరికి సొంతం కారాదనే ఖండిత నాయిక ఇక్కడ కానవస్తున్నది!

- గంధం బసవ శంకరరావు

128. తమలోనే ఉన్నవి

సంకీర్తన: 83 రాగం: శంకరాభరణం
వ్రాతప్రతి పుట: 83 తాళం: లుప్తము

తమలోనే ఉన్నవి - ధర్మాధర్మములు
భ్రమయక తలపోసి - పని గొనవలయు ॥పల్లవి॥

కన్నవారితో నెల్లా - కల్లలాడకుంటే చాలు
అన్ని జపములు చేసి - నంత ఫలమే
మిన్నక నొకరి సొమ్ములే - మీ దీసుకోకుంటే చాలు
నిన్ని దానాలందరికి - నిచ్చినంత ఫలమే ॥తమలోనే॥

వీనుల బరనిందలు - బడకుంటే చాలు
పూని పురాణాలు విన్న - పుణ్యఫలమే
తాను పరకాంతల - దలచకుంటే చాలు
నానా దానాలు చేసి - నంత ఫలమే ॥తమలోనే॥

వొట్టుక పాపాలు సేయ - కూరకుంటే చాలు
అట్టె యజ్ఞములు చేసి - నంత ఫలమే
గుట్టున శ్రీవెంకటేశు - గోరి శరణంటే చాలు
గట్టిగా సుజ్ఞానము - గైకొన్న ఫలమే ॥తమలోనే॥

ఈ కీర్తనలో ధర్మమెట్టిదో, అధర్మమెట్టిదో, ధర్మాచరణంవల్ల కలిగే ఫలమెట్టిదో సూటిగా తెలుపబడింది. అంతేకాక శ్రేష్ఠమైన సుజ్ఞానానికి, విశిష్టమైన శరణాగతి ధర్మానికి గల ప్రాశస్త్యమెట్టిదో కూడా ఇందులో సంగ్రహంగా ఉంది.

- వేటూరి ఆనందమూర్తి

129. తరితీపె తరుకాడు

సంకీర్తన: 220 రాగం: పంతురావళి

వ్రాతప్రతి పుట: 209 తాళం: లుప్తము

తరితీపె తరుకాడు - తగులె పట్టుగొమ్మ తనకు నాకు
(పరివోని సురత సం - పదలె యింపులు మాకు) ॥పల్లవి॥

నేనేమంటినమ్మ - నిన్నమాపువాడు - నెలవంక చెక్కుల నీటుతో రాగా
ఆనందాన అమాసవై రెండె దినా - లాయనంటె దోసమా
పూని చెక్కు జీరేట - ప్పుడు కలిగిన - వోరుపు నేడేల - వుడివోయనమ్మా
వానిదూరనేల - వలపుల శివమెత్తి - వలసినట్టుండ నీవే ॥తరితీపె॥

వ్యంగెమాయనట్టె - వరువాత కపురపు కెం - పులమోవితో రాగ
అంగడి జామెక్కి తెల్లవా - రంగ వచ్చెనంటె దోసమా
చెంగట ముని పల్లు నాటిం - చగా లేని సిగ్గులు
(చెంగలించి) నేడేల - చిగురించె నమ్మా ॥తరితీపె॥

అందుకేమాయనే చిత్తడి చెమట - లంటినమేనితో నంటునరాగ
అందమై వానకుము(ందెవంగు) - డాయెనంటె దోసమా
అంది శ్రీవేంకటనాథు(డరమరికలులేక) - అగ్గలపురతినేలె నోయమ్మా
మందలించనేలే - మదనకేళి జొక్కి మట్టుమీరనీవే ॥తరితీపె॥

శ్రీ వేంకటనాథ ముద్రను బట్టి ఈ సంకీర్తన చిన తిరుమలాచార్యులది కావచ్చును.

వంగుడు = బొట్లు రాలడం, చినుకులు పడడం.

వానకు ముందు వంగుడు = వర్షం కురిసే ముందు చినుకులు పడటం.

తరితీపు = మోహం/వలపు/కీర్తి/సంతోషం/తమకం/తహతహ/బాధ/అపేక్ష/శృంగారచేష్ట.

"ఇన్నిటా శ్రీవేంకటేశ! యేలితివి వేడుకతో
యెన్నేసి తరితీపుల నింపు పుట్టించేవయ్యా"

తరకాఁడు: ఈ పదం నిఘంటువుల్లో కానరాదు. ఇది తరికాడు కావచ్చునేమో! తరికాడు అంటే మథించేవాడు, చిలికేవాడు అని అర్థం. (తరవుకాడు = నిర్బంధించేవాడు)

"మనసనే మోపు నెమ్మది నీకు నప్పగించితి
ఘనదుఃఖముల తరకాండ్లేలయ" (15-111)

"తరుణి కూటమి గంటే దప్పిదేర్చనే వలే
తరకానివలె నుంటే తమి యాడది" (7-227)

"తెరలోనుండగా గుట్టు దెలుసుకొనుంటేను
తరకానివలె నేల తమకించేవే" (13-126)

– అన్నమయ్య పదకోశం, పుట 280, ఆచార్య రవ్వా శ్రీహరి (తి.తి.దే, 2012).

– గంధం బసవ శంకరరావు

130. తలఁచిన హృదయము

సంకీర్తన: 241 రాగం: కన్నడగౌళ

వ్రాతప్రతి పుట: 230 తాళం: (వాక్యం)[1]

తలఁచిన హృదయము ఝల్లను - తరుణీమణి యొయ్యారము
కలిగీనా యికనొకపరి - కన్నులఁ జూడఁగను ॥పల్లవి॥

మోమరవంచి పదాంగుట - మున నిల నొయ్యన వ్రాయుచు
కోమలి కన్నీ - రెడనెడ - గ్రుక్కుచు రెప్పలను
వేమరు నాదెస జూచిటు - వీడ్కొన నొల్లని భావము
యేమని తలపోయుదు విధి - నేమని దూరుదును ॥తలఁచిన॥

చెక్కిట చేయిడి యలసత - చే వదనము కడు వాడఁగ
వెక్కసమగు డగ్గుత్తుక - వేడుక నణఁపుచును
అక్కరదీరఁగ నాతో - నాడిన సొలపుల మాటల
నెక్కడ బొగులుదు ధైర్యం - బేగతి నిల్పుదును ॥తలఁచిన॥

నను గృష్ణాయని పేర్కొని - నవ్వుచు కౌఁగిట నలముక
అనువునఁ జిక్కితి విక ని - న్నడుగిడనీ ననుచు
తనువునఁ బులకలు నిగుడఁగ - తామరసానన యెప్పటి
చనవున నొనరించిన యుప - చారపు చందములు ॥తలఁచిన॥

పురుష విరహ సంకీర్తన! నాయకుడు నాయికను ఎడబాసి, నాయిక అందాలను తలచుకుంటూ విరహంతో పాడుకుంటున్న పాట ఇది.
- గంధం బసవ శంకరరావు

---

1. ఇది తాళ్లపాక సంకీర్తనము, శ్రీకృష్ణ పదము. ఇందులో వేంకట ముద్రకు మారుగ శ్రీకృష్ణ ముద్ర కలదు. ఈ పాటయే తంజావూరు ప్రతిలోనూ కన్నడగౌళ రాగమున వాక్యముగా సంకేతింపబడినది. సంకీర్తన రచనలో వాక్యమను నిర్దేశము తాళ్లపాకవారి రేకులందు కానవచ్చును. ఇట 'వాక్య' మనునది సంవాదరూపమగు భాషణమను నర్థమున నున్నట్టున్నది. ఈ పాట 'తాళ్లపాక సంకీర్తనల'ను వ్రాతప్రతిలోను, తంజావూరి 'వేంకటేశ' పదాలందును ఉండుటవల్లను, శైలిని బట్టియు తాళ్లపాక వారి పదముగ భావింపబడినది.

పదాంగుటము = పద + అంగుటము = కాలి బొటనవ్రేలు

131. తలచి (పాసీ యుండ)

సంకీర్తన: 249 రాగం: భైరవి

వ్రాతప్రతి పుట: 238 తాళం: అట

తలచి (పాసీ యుండ) రాదు – తలచకుండగ రాదు మదిలో
తలపు తగులుగ జేసె గదవే – తరుణి యలమేల్మంగను ॥పల్లవి॥

కలికి కౌగిట బిగిసి ఆయము – కరగు నిమిషము పేరుకొనగా
పిలిచి నే నొక మాట యడిగిన – పెదవి పెదవిని మోపుచున్
మొలకనవ్వుల పంటి మొనలను – మోవి నొక్కుచు మోద్పుగన్నుల
నలమి సిగ్గున మోము మోమున – నప్పళించే కలికిని ॥తలచి॥

అలక లటు నిటు చెదర నఖముల – నల్లనల్లన గూడ దువ్వుచు
చెలువుడా బడలితివొ యని తన – చేత నా మెయి నిమురుచు
అళులబోలెడు చూపులను నా – యాననాబ్జము నందె నిల్పుచు
తళుకుగన్నుల హరుష జలములు – తొలకరించే కలికినీ ॥తలచి॥

చిలుకగోరున నాదు చెక్కిలి – జీరి ముద్దాడుచును చెవులలొ
పలుకుచును తా బలుకరింపుచు – ప్రాణములు రెం డొకటియై
మెలకువను రతికేళి వేళల – మెచ్చు లొసగుచు ప్రియము సేయుచు
పలుకకుండిన ప్రేమమున నను – బలుకరించే చెలియను ॥తలచి॥

మొలకపులకల నాదు దేహము – కలయికల చిరుచెమట పట్టగ
వలిపపయ్యెద చెరగు సురటిగ – వామకరమున విసరుచున్
చెలియ తన వలకేల నా మెయి – చెమట దుడుచుచు బుజ్జగింపుచు
వలపు వాతెర తేనెలను నా – వాడుదేర్చు లతాంగినీ ॥తలచి॥

కులుకుగుబ్బల నాదు ఉరమున – గుచ్చి గోరాడుచు నదిమి పట్టగ
మెలకువన తన జడను జుట్టుకు – మెదలకుండను బట్టుక
పలుకురా యిక వేంకటేశ్వర – ప్రాణనాథుడ వనుచును
నలసి యురముననుండి పలికే – యట్టి యలమేల్మంగను ॥తలచి॥

ఈ సంకీర్తనకు రూపాంతరాలైన మరో రెండు సంకీర్తనలు (తంజావూరు తాళపత్ర ప్రతులు) పరిశోధన సౌలభ్యం కొరకు అందిస్తున్నాము.

కల్యాణి - అటతాళం.

తలపు పాసీ యుండరాదు - తలచకుండగరాదు మదిలో
తలపు (తగులుగ జేసెగదవే - తరుణి యలమేల్మంగనూ) ॥పల్లవి॥

కలిసి కాగిలి బిగిసి యాయము - కరగి నన్నొక పలుకు పలికితె
పిలిచి నేనొక మాట యడిగిన - పెదవి (నదిమిన యింతినీ) ॥తలపు॥

మొలకనవ్వుల పంటిమొనలను - మోవి నొక్కుచు మోడ్పుగన్నుల
నలమి సిగ్గున మోము మోమున - అప్పళించే కలికినీ ॥తలపు॥

పలుకురా యిక వెంకటేశ్వర - ప్రాణనాయక యనుచు నుపరతి
నలసి యురమున నుండి పలికే - యట్టి యలమేల్మంగనూ ॥తలపు॥

//యీ సంకీర్తన యింతమాత్రమే//

(ఇది తంజావూరు తాళపత్రప్రతి పాఠము. ఇట్టి సంకేతాలతో కూడిన ఈ "సంకీర్తన" లన్నీ తాళ్లపాకవారివే - రేకులలోఉన్నవి కొన్నీ, లేనివి మరికొన్నీ! ఇది విడిపాటగా కల్యాణి రాగమున కలదు. పదరచనలోని లోపమునూ, నిర్మాణభంగమునూ గమనించి యిట్లు (-) పరిష్కరించుటైనది. ఇది ఆద్యంతమూ లకార ప్రాసలుగల రెండేసి పాదాల నాలుగు చరణాల కూర్పుగా ఉన్నది. ఇట్టి కూర్పుగలవి తిరుపతి రాగిరేకులలోనూ కొన్ని ఉన్నవి. ఇందలి మూడవ దళమును పల్లవిగా భావించి అందలి ద్వితీయపాద లుప్తభాగమును వారి పాఠాంతరమునుండి గ్రహించితిని.

ఇట్టిదే "తలపుపాసీ ఉండరాదు" అనే ఆరంభంతో పూర్తిగా లకార ప్రాసతో నాలుగేసి పాదాలు గల నాలుగు చరణాల పాట మరొకటి యీ తంజావూరు ప్రతిలోనే కేదారగౌళ - అటతాళ సంకీర్తనగా ఉన్నది.

అది యిది.

కేదారగౌళ - అట తాళం.

(తలపు) తగులును జేసెగదవె - తరుణి యలమేల్మంగను
తలచి పాసి యుండరాదు - (తలచకుండగరాదు మదిలో) ॥పల్లవి॥

చిలుకగోరున నాదు చెక్కిలి - జీరి ముద్దాడుచును, (చెవిలో)
పలుకుచును (తా) బలుకరింపుచు - ప్రాణములు రెండొకటి(గా)
(మెలకువను) రతికేళి వేళల - మెచ్చు లొసగుచు నెచ్చరింపుచు
పలుకకుండిన ప్రేమమున తా - బలుకరించే చెలియను

అలక లట్టిటు చెదర నఖముల – నల్లనల్లన (కలయ) దువ్వుచు
చెలువుడా! బడలితివా యని తన – చేత నా మెయి నిమురుచు
అళుల బోలెడు చూపులను నా – ఆననాబ్జము నందు నిలుపుచు
తళుకు గన్నుల హరుష జలముల – తొలుక (రించే) కలికిని ॥తలపు॥

(మొలక)నవ్వుల నాదు దేహము – కలయికల చిరు చెమట బట్టగ
వలిప పయ్యెద చెరగు సురటిగ – వామకరమున విసరుచు
చెలియ తన వలకేల నా మై – చెమట తుడుచుచు బుజ్జగింపుచు
వలపు వాతెర తేనె లొసగుచు – వాడుదేర్చు లతాంగినీ ॥తలపు॥

కులుకు గుబ్బల నాదు (ఉరమును) – గుమ్మి గోరున నదిమి పట్టిన
మెలకువను (తన జడను) మెడకును – మెదలకుండగ జుట్టుక
(పలుకరా యిక వేంకటేశ్వర – ప్రాణనాయక! యనుచు నుపరతి
నలసి యురమున నుండి పలికే – యట్టి యలమేల్మంగను) ॥తలపు॥

(ఇది అధిక చరణము.)

//యిది సంకీర్తన యింతమాత్రమె//

(బహుశా భిన్నరాగాలు గల పై రెండుపాటల కలగలుపు పాఠమే నాలుగేసి పాదాలున్న ఐదుచరణాల పెద్దపాటగా, "తలచి పాయగరాదు – తలచకుండగరాదు మదిలో/ తలపు తగులుగ చేసె గదవే తరుణి యలమేల్మంగను//" అనే పల్లవితో భైరవిరాగం – అటతాళ సంకీర్తనంగా తిరుపతి 6609 (తాళ్లపాక సంకీర్తనలు) వ్రాతప్రతిలో గుర్తింపబడి ఉన్నది.

ఇప్పుడీ వ్రాతప్రతిని ఠాగోర్ ఫెలోషిప్ కృషిలో భాగంగా, సహృదయ మిత్రుల సహకారంతో పరిష్కరించే భాగ్యం నాకు కలిగిందని చెప్పడానికి సంతోషిస్తున్నాను.

ఈ మూడింటిని చూసిన పిమ్మట మూడురాగాలలో ఉన్న యీ మూడుపాటల్నీ పరిష్కరించి విడివిడిగా చూపడమే మేలని తోచింది.

ఇవి మూడూ ముద్రనుబట్టి పెదతిరుమలాచార్యుల రచనలనే చెప్పనగును. శేషాచార్యులవారి వ్రాతప్రతిలో అధిక చరణములన్నవి. ఇది మీది రెండుపాటల కలయిక కూర్పగుట, భైరవి రాగమున వేరొకపాటగా గుర్తింపబడుట విశేషము. ఇట్టివి మరెన్నో చెదురుమదురులై తంజావూరు తాళపత్రాలలోనూ, తిరుపతి వ్రాతప్రతులలోనూ చివికి శిథిలములవుతున్నవి కలవు. అశ్రద్ధ పాలైన అట్టి పాటల ఉనికికి ఈపాట ఒక్కటే చక్కని ఉదాహరణం కాగలదు. వీటి నన్నిటినీ సేకరించి, పరిష్కరించి ప్రకటించుట మన ధర్మము కావలెను. – **వేటూరి ఆనందమూర్తి**

132. తలమేల కులమేల

సంకీర్తన: 226 రాగం: పాడి

వ్రాతప్రతి పుట: 215 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 285వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 50)లో రాగం శ్రీరాగం)

తలమేల కులమేల తపమే కారణము
యెలమి హరిదాసులు యే జాతి యైన నేమి ॥పల్లవి॥

కాకమువల్లఁ బుట్టదా ఘనమైన యశ్వత్థము
దాకొని గుల్లలోఁ బుట్టదా ముత్తెము
చౌకైన విషలతనే జన్మించదా నిర్విషము
యేకడ మహానుభావు లెందు పుట్టి రేమి ॥తలమేల॥

బిడిపిరాళ్ళఁ బుట్టవా చెలువైన వజ్రములు
పుడమి నీఁగలవల్లఁ బుట్టదా తేనె
వెడఁగుఁ బిల్లిమేనను వెళ్ళదాయెనా జవ్వాది
వుడివోని పుణ్యు లెందు నుదయించి రేమి ॥తలమేల॥

పంకములోఁ బుట్టదా పరిమళపుఁ దామెర
పొంకపుఁ గీటకములందు పుట్టదా పట్టు
కొంకక శ్రీవేంకటేశుఁ గొలిచినదాసులు
సంకలేని జ్ఞాను లెందు జనియించి రేమి ॥తలమేల॥

భక్తులకు, నిజమైన హరిదాసులకు కులమతాలతో పనిలేదనే సార్వత్రిక సందేశంతో ఈ సంకీర్తన అలరారుతున్నది. సాధన, తపస్సు మాత్రమే ముఖ్యమైనవని పెదతిరుమలాచార్యులవారు తెలియజేస్తున్నారు.

– *గంధం బసవ శంకరరావు*

133. త్వమేవ శరణం

సంకీర్తన: 172 రాగం: శ్రీరాగం

వ్రాతప్రతి పుట: 168 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 1వ సంపుటంలో 323వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 63)లో రాగం శ్రీరాగం)

త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీజగన్నాథా ॥పల్లవి॥

వాసుదేవ కృష్ణ వామన నరసింహ
శ్రీసతీశ సరసిజనేత్రా
భూసురవల్లభ పురుషోత్తమ పీత
కౌశేయవసన జగన్నాథా ॥త్వమేవ॥

బలభద్రానుజ పరమపురుష దుగ్ధ
జలధివిహార కుంజరవరద
సులభ సుభద్రాసుముఖ సురేశ్వర
కలిదోషహరణ జగన్నాథా ॥త్వమేవ॥

వటపత్రశయన భువనపాలన జంతు
ఘటకారకరణ శృంగారాధిపా
పటుతర నిత్యవైభవరాయ తిరువేం
కటగిరినిలయ జగన్నాథా ॥త్వమేవ॥

నిత్యవైభవరాయడైన శ్రీవేంకటగిరి నిలయునికి శరణాగతి సంకీర్తన!

– గంధం బసవ శంకరరావు

134. తానట ప్రాణేశుండట

సంకీర్తన: 145 | రాగం: ముఖారి

వ్రాతప్రతి పుట: 143 | తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 292వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 80)లో రాగం శ్రీరాగం[1])

తానట[2] ప్రాణేశుండట తమకము తమకముఁ గూడఁగ
వేనలి జారినఁ దలఁకని వేడుకలెట్టివొకో ॥పల్లవి॥

మీఁటినఁ బగిలెడిగుబ్బలమీఁద నలందిన గందపు-
వేటులతళుకులు పయ్యెద వెలుఁపలఁ బొలయఁగను
నాఁటిన మదనునిశరముల నలఁకువనొయ్యన తోఁపఁగ
మాటకు మాఁటాడదు చెలిమర్మంబెట్టిదొకో ॥తానట॥

మించిన తొడల మెఱుంగుల మెలుఁతుక గట్టిన పుట్టము
చించుక వెడలిన నిగ్గులు సిగ్గులు దొలఁకగను
వంచినరెప్పల కన్నుల వడియు జలంబులు చెక్కుల
నించినఁ బలుకనిభావపు నెవ్వగలెట్టివొకో ॥తానట॥

కమ్మనితావుల చెమటల గాలికి నొయ్యన మెచ్చుచు[3]
సొమ్మలఁ దేలెడి మరపుల సొక్కులఁ దేలుచును
దిమ్మరికోనేటప్పని తిరువేంకటపతిఁ గూడిన
కొమ్మకు మీఁదటియాసల కోరికలెట్టివొకో ॥తానట॥

ప్రాణేశుడైన తిరువేంకటపతిని ఎడబాయని నాయిక ప్రణయసౌందర్యం శృంగారపరమైన కోరికలతో సమన్వితం!

– *గంధం బసవ శంకరరావు*

తా.వేం. 143; **1.** ముఖారి **2.** తాను ప్రాణే **3.** మెచ్చును

135. తిరుమలగురునేలు

సంకీర్తన: 179 | రాగం: శుద్ధకాంబోది
వ్రాతప్రతి పుట: 174 | తాళం: లుప్తము

తిరుమలగురునేలు - తెరవ సొబగు మరి
అరయ నందుకంటె - అరుదే నటవే ॥పల్లవి॥

అండనుండి పట్ట - నదిమి యాన బోతే
కండచక్కెర లైతే - కరగను గాక
దొండపండ్లైతే - దునుగును గాక - అమృతపు
టుండ గాబోలు నీ - యువిద కెమ్మోవి ॥తిరుమల॥

పమ్మి చేత బిగ్గ - పట్టేటప్పుడు
నిమ్మపండ్లైతే - నిగుడును గాక
తమ్మిమొగ్గలైతే - తరలునూ; పసిడి
బొమ్మరాలు గాబోలు నీ - పూబోణి కుచములు ॥తిరుమల॥

అలమేలుమంగ శ్రీవేంక - టప్పని గూడేటప్పుడు
కలువ పూదీగ యైతే - కందునూ, కాక
పెలుచు రాజిలుకైతే - బెదరునూ, రతి
పొలుచు పిలుపు గాబోలు - యీ చెలువ (పలుకు) ॥తిరుమల॥

సంగీత రచనలకు తాననిఘంటువుల వలె సంకీర్తన పదరచనానిర్మాణబోధకు ఈ "తాళ్లపాక సంకీర్తనలు" ఒక శిక్షాగ్రంథము. ప్రథమాభ్యాస పుస్తకము. అన్నమాచార్యులారంభించిన సంకీర్తనా పరిశుద్ధికై తరువాతి తాళ్లపాక కవులు కావించిన కృషిఫలితమిందు కొంత ప్రతిఫలించినదనవచ్చును.

- వేటూరి ఆనందమూర్తి

136. తిరుమలయ్య విందు

సంకీర్తన: 248 రాగం: భైరవి

వ్రాతప్రతి పుట: 237 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన సంపుటం 5లో 26వ సంకీర్తన. పీఠిక, పుటలు 12 & 13లలో ఉదాహృతం. భైరవి రాగం, ఆదితాళం.)

తిరుమలయ్య విందు మంచిదే[1] వుండంటే వుంటినమ్మ
సరవిలేని చెంచువారి సంతయేలె తనకును ॥పల్లవి॥

పరికిదండ పొగడదండ బండిగురిగింజదండ
బెరకులేని పికిలిదండ బలిదండలన్నియు
మెరసి కానుకియ్యబోతె మేనిదండలడిగెనమ్మ
మరల చెంచువారితోడి మాటలేలె తనకును ॥తిరుమలయ్య॥

ముసురుతేనె జుంటితేనె ముదిరినట్టి పెరలతేనె
పొసఁగ మించు పూవుతేనె పుట్టతేనె లన్నియు
వొసఁగి కానుకియ్యబోతె మోవితేనె లడిగె నమ్మ
యెసఁగ చెంచువారి యెంగి లేఁటికమ్మ [2]తనకును ॥తిరుమలయ్య॥

వెలగపండు జీడిపండు వెలలేని మోవిపండు
పలుకుదొండపండు పాలపండు కానుకిచ్చితే
చెలఁగి పక్కపండు మంట శ్రీవెంకటనాయకుఁడు
యెలమి కూడెనమ్మ చెంచు లేఁటికమ్మ తనకును ॥తిరుమలయ్య॥

అన్నమయ్య జానపదులనేకాక, గిరిజనులను ముఖ్యంగా చెంచువారిని తన సంకీర్తనలలో నాయికలుగా నిలిపాడు. అట్టిదే ఈ కీర్తన!

– గంధం బసవ శంకరరావు

---

1. వుండంట్ట **2.** తనకు

137. తురుమున గొజ్జంగులు

సంకీర్తన: 256 రాగం: సౌరాష్ట్ర
వ్రాతప్రతి పుట: 245 తాళం: లుప్తము

తురుమున గొజ్జంగులు - తురుమకువే వో
కరిగమన యిరులు - కవిసేటి పొద్దు ॥పల్లవి॥

పగటు గుబ్బల పచ్చ - పట్టు కంగుల రవికె
బిగియించ బోకువే - పెరిగేటి పొద్దు
తొగరు వాతెరను ల - త్తుక బెట్టకువె, వింత
వగలాడి తేనెలు - వడిసేటి పొద్దు ॥తురుమున॥

తేట చెక్కుటద్దములు - దిద్దకువె కళుకులు
గాటపు మించు ముద్దు - గారేటి పొద్దు
నీటు కన్నుగవల - నించకువె కాటుక
లేటి చూపులాడి చెంగ - లించేటి పొద్దు ॥తురుమున॥

పొంకపు నెమ్మేన గంద - వొడి నప్పళించకువె
యింక నీ కళులు తెర - లేటి పొద్దు
పంకించకువె వేంకట - పతి నిన్ను గలియగా
జంకెలాడి వలపులు - జట్టి గొనేటి పొద్దు ॥తురుమున॥

వలపులు జట్టిగొనేటి పొద్దులో నాయిక సొబగులన్నీ ఆ స్వామికే సమర్పితం! దానికై నాయికను సమాయత్తం కమ్మంటున్నాడు కవి!

యిరులు = చీకట్లు.

– గంధం బసవ శంకరరావు

138. తెరువు వెంట వచ్చే

సంకీర్తన: 209 రాగం: మోహనకల్యాణి

వ్రాతప్రతి పుట: 200 తాళం: లుప్తము

తెరువు వెంట వచ్చే - వరదరాజులను
నరులార సేవించరే మ - న కోరికలు మీర ॥పల్లవి॥

వోరగా సిగవేసి - వొప్పెన సంపంగి విరి
తీరుగా సొగసులు - మీరంగ జుట్టి
తీరుగా నుదుట క - స్తూరి నామము దీర్చి
కేరుకొంటా చెలుల - సారె ముద్దాడుకొంటా ॥తెరువు॥

హురుముంజి ముత్తియపు - నొంటులు గీలించి
పరిమళపు జవ్వాజి చెం - పల వెంట జార
వురవున కుంకుమ పు - వ్వుపట్టెలుగా దీసి
నెరిమించు చంద్రకావిని - నీటుగా గట్టి ॥తెరువు॥

వన్నెమీర నేలలు - తిన్నగా బాడుకొంట
కిన్నెర మీటుకొంట - గిలుకు పావాలు మెట్టి
చెన్ను మీరుచును - శ్రీవేంకటప్రభుడై
వన్నెకా డందణిని - వరము లొసంగుచును ॥తెరువు॥

కంచి వరదరాజుల సౌందర్యం ఈ సంకీర్తనలో వర్ణితం!

- గంధం బసవ శంకరరావు

139. తెలిసి తెలియగ

సంకీర్తన: 86A రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 86

తెలిసి తెలియగ నీదు – (తెలిసినా) తెగనీదు

(..) ॥పల్లవి॥

(..మయో)

(చలపట్టి......మరులు.... విడదు నెనరు)

చలగి ముత్యపుచిప్ప – స్వాతి చినుకాసిం

(....................వరుషించినట్లవునొకో) ॥తెలిసి॥

అకట పదియార్వేల స్త్రీలరతి గలిగినను

(సఖియ) తన రూపు మది

(....................) శ్రీకృష్ణుడిన్నియును

పేద సంపదగోరి (పెనగి)నట్లేనొకో ॥తెలిసి॥

అతి శిథిలమైన యీ పాట 'దినదినము' అనే పాటలో కలగలుపైనట్లు తోచును. ఇది వేరే పాట కాదగును. పాఠాంతరమునకై అన్వేషింపవలెను.

– వేటూరి ఆనందమూర్తి

140. తెలిసి తెలియనివాని

సంకీర్తన: 119 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి సంఖ్య: 113

తెలిసి తెలియనివానిఁదెల్ప నేడాదైన - తెలివిరాదని తెలుసుకోరె

తెలియనేర్చినవాని దెలియజెప్పుట కారు-నెలవెచాలని తెలుసుకోరె ॥పల్లవి॥

(ఇమ్ముల) గేదంగి - అమ్ములపొదలోన - నేనుగెక్కుటెయని తెలుసుకోరె

కొమ్ముటేనుగ మీద - కుఱుచ బాలకులిద్ద .....

....

శిథిలములైన యిట్టి పాటలను పూరించుటకన్న విడిచిపుచ్చుట మేలు. పాఠాంతరముల అన్వేషణకై కొంతభాగ ముద్ధరించుటైనది. పల్లవిలోని నిర్మాణరీతి చరణాలలో సాగుటకు, భావసంపూర్తికి నిందు లభించిన రచనాసామాగ్రి చాలదు. చవి గల లోకోక్తులతో జానపదుల గీతము రీతి నీపాట సాగినట్లున్నది. "పొడుస్తూ భానుడూ పొన్నపూవూ చాయ శ్రీసూర్యనారాయణ" అను మట్టులో గల రచన యిది.

- వేటూరి ఆనందమూర్తి

141. తేనెను (తేగా) బోవలె

సంకీర్తన: 153 రాగతాళములు లుప్తములు
వ్రాతప్రతి పుట: 151

తేనెను (తేగా) బోవలె - తెరువియ్యరా
ఆనలు బెట్టకురా! మా - యమ్మ వినీనీ ॥పల్లవి॥

చెట్టబట్టకురా - చెప్పిన ట్టుండరా
చెట్టు కొక రున్నారు - చెంచెతలు
పట్టపగలురా! - భయము లే దటరా?
వట్టి (నేటికి) రా! మా - వదిన వినీనీ ॥తెలిసి॥

మెల్లనె మాటా(డ)రా - మెడ చెయ్యి దియ్యరా
(కుల్లు) చెంచెతలురా - కొల్లలు కొల్లలు
చల్లుబో(?)రాడకురా - సతులు కనేరా
అల్ల వాడుగో రా మా - యన్న వినీనీ ॥తెలిసి॥

కురులు దువ్వకురా - గుబ్బ లంటకురా, యే
మఱగు నైనా వచ్చి - మన్నించే గానీ
తిరువేంకటాద్రి - దేవుడవై కూడితివి
మరలి చెంచెతనై నీ - మగువ నైతి గానీ ॥తెలిసి॥

తిరువేంకట ముద్రతోగల పదమిది. అన్నమాచార్యులదే! ఇట్టి పదాలనుబట్టి అన్నమయ్య చెంచులక్ష్మి కల్యాణకథను గానీ, అట్టి కథా సందర్భముగల పదాలను గానీ, విడిగా కొన్ని కూర్చెనేమో అని తోచుచున్నది. ఇటీవల వెల్లడియైన పరిశోధనాంశములలో తాళ్లపాకవారు యక్షగానములను, కొరవంజులను కూర్చినారనుటకు తగిన ఆధారములు కొన్ని లభించినవి. ముద్రితమైన "భీమసేన విజయము"న కానరాని అసంపూర్ణ ప్రతి జాడ కలదు. ముద్రితపాఠము "అక్కయ్య" రచనగా అన్యుల పేరనున్నది. ఇదికాక "నారద కొరవంజి" అను వేరొక రచన తాళ్లపాకవారి సంబంధము కలదిగా తంజావూరు తాళపత్రాలలో అందదుకులుగా కలదు. పరిశీలించి పరిష్కరించదగినది.

- వేటూరి ఆనందమూర్తి

142. దంటమాటలనె నన్ను

సంకీర్తన: 278 రాగం: ఆహిరి

వ్రాతప్రతి పుట: 263 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 3వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 1)లో రాగం ఆహిరి)

దంటమాటలనె నన్నుఁ దాఁకనాడేవు వోరి
జుంటితేనె తీపులెల్లఁ జూరలాడేవా ॥పల్లవి॥

అత్తయింటికోడల నన్నమ్మమీఁద నేరా నీ
తొత్తుఁ దిట్టినట్టె తిట్ట దొరకొంటివి
మెత్తనైతే దిగఁబడి మేరమీరి యింతలోనే
ఒత్తుక వచ్చేవు చక్కనుండ నేరవా ॥దంట॥

పంతపు మగఁడు గల పడఁతి నన్ను నేరా నీవు
కొంతైనా వెఱపులేక గోరనంటేవు
ఇంతలోనే వేలువెట్టి యిమ్ముగైకొని వలపు
దొంతులు వేరిచేవు బదుకనియ్యవా ॥దంట॥

ఊరివారి యింతి నన్ను వుద్దండపుఁదుటారాలఁ
బేరుకుచ్చి సొలయుచుఁ బిసాళించేవు
గారవించి తిరువేంకటరాయ నీవు నన్ను
యేరా నాగుట్టంతయు బాయిట[1] వేసేవా ॥దంట॥

దంటమాటలు = నేర్పరితనంతో కూడిన మాటలు.

అత్తయింటి కోడలు = మగనాలు, మగడు గల స్త్రీ (అన్నమయ్య పదకోశం, రవ్వా శ్రీహరి).

– గంధం బసవ శంకరరావు

---

1. నిడురేకు 39: గుట్టింతయు బయలు సేసేవా

143. దిద్దుకో వలెగాక

సంకీర్తన: 124 | రాగం: మధ్యమావతి

వ్రాతప్రతి పుట: 123 | తాళం: లుప్తము

దిద్దుకో వలెగాక - (తీవర) పడియె నౌనా
వద్దురా తిల్ల గోవింద - వయసున చిన్నది! ॥పల్లవి॥

నెలత పడుచు దైన - నేర్పుల యిక్కని
తలపు తె(లి)యక లేక - నళికీ నింతే
వలనుగా ని(క్క)పు - వజ్రమైనా సా
నలదీర కూరకే - తళకు (లీనే)నా? ॥దిద్దుకో॥

తెరవ బాల యైన - సరసముల నె(ల)వని
సరుసత నెరుగక - వెరచీ నింతే
పరగ పదార్వన్నె - బంగారమైనను
మెరుగు బెట్టక తానె - మిను(కుమనీ)నా? ॥దిద్దుకో॥

పూవుబోణి మేని - తావుల (కిక్కువ)ని
భావ మరయ లేక - పంకించె నింతె
శ్రీవేంకట ప్రభుడు - దీని జవ్వాది (యౌ)
పూవుగట్టక మే(ల్మి) - తావు లీనీనా? ॥దిద్దుకో॥

144. దినదినము (మదనుడే)

సంకీర్తన: 86 రాగం: ఘంటారవము

వ్రాతప్రతి పుట: 86 తాళం: లుప్తము

దినదినము (మదనుడే) – ననుపుకాఁడై యేయ ననబోణి తాళరాదే
తనమీద నా మనసు – తగులాయమాయ, చక్కని కృష్ణుడని పిలువ గదవోయి ॥పల్లవి॥

అలివేణి నేను ముసు – కలిసియుండిన రీతి
దలచి మదనుని – నిలుపరాదు
అలనాడు నాతో తా – నాడు మాటలు, నేడు
తలచునో లేక తా – దలచదో మదిని ॥దినదినము॥

చెలితోన నా మీద – కలవిలేనివి కొన్ని
తెలిపి తన చిత్తమును – గలతురో సఖులు
యిలను బూరుగుమాని – ఫలము నాశించేటి
చిలుక కైవడి – తెలియ నౌనొకొ అకట ॥దినదినము॥

వెలది బాసిన మొదలు – విరహసాగరమున
మునిగి యీదగ జాల నేను
కలకాల మీ వలపు – కాణయాచై నిల్ప
నిల కమలజుండేల – నిటుల వ్రాసె ॥దినదినము॥

ఈ పాట (85/86)కృష్ణముద్రగల చినతిరువేంగళనాథ (చిన్నన్న) రచనగా తోచుచున్నది. ఇందే కృష్ణముద్ర గల వేరొకపాట కూడ గుర్తింపబడని రీతిని కలగలసియున్నది. చరణ గణనమునుబట్టి వేరుపాటగా గుర్తించనైనది. పాఠాంతరము లభించిననాడు గాని, వాని స్వరూపమెరుగరాదు. అతిశిథిలమైన ఆ రెండవపాట "దినదినము" అను కీర్తనలోనే కలగలసి కానవస్తున్నది. ఈ రెండు కీర్తనలలోని (86)పద నిర్మాణసంకేతములు (అవునొకొ... ఇత్యాదులు) తుల్యములు. చరణములందలి లకార ప్రాసలు కలగలుపునకు కారణమైనా, దినదినము, తెలిసితెలియగనీదు అను పల్లవులు ఇవి రెండు పాటలను ఊహకు కారణములు. రెండును కృష్ణ ముద్రాకింతములే!

– వేటూరి ఆనందమూర్తి

145. దేవ దేవం భజే

సంకీర్తన: 78 రాగం: ధన్యాసి
వ్రాతప్రతి పుట: 79 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 1వ సంపుటంలో 314వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 61)లో రాగం ధన్నాసి)

దేవదేవం భజే దివ్యప్రభావం
రావణాసురవైరి రఘుపుంగవం ॥పల్లవి॥

రాజవరశేఖరం రవికులసుధాకరం
ఆజానుబాహునీలాభ్రకాయం
[1]రాజారికోదండరాజదీక్షాగురుం
రాజీవలోచనం రామచంద్రం ॥దేవ॥

నీలజీమూతసన్నిభశరీరం [2]ఘనవి-
శాలవక్షం విమలజలజనాభం
తాలాహినగహరం ధర్మసంస్థాపనం
భూలలనాధిపం భోగిశయనం ॥దేవ॥

పంకజాసనవినుతపరమనారాయణం
[3]శంకరార్జితజనకచాపదళనం
లంకావిశోషణం లాలితవిభీషణం
వేంకటేశం సాధువిబుధవినుతం ॥దేవ॥

"రామో విగ్రహవాన్ ధర్మః", ధర్మానికి ప్రతిరూపం శ్రీరామచంద్రుడు. దేవదేవుడైన ఆ శ్రీరాముని దివ్య ప్రభావం మహిమాన్వితమైనది. సూర్యవంశ సుధాకరుడు, ఆజానుబాహుడు, కోదండదీక్షాగురుడు, రాజీవలోచనుడు, నీలమేఘశరీరుడు, ధర్మసంస్థాపకుడు, పార్వతీస్తుత్యుడు, శివధనుస్సును అవలీలగా భంజించినవాడై శ్రీరామచంద్రుడు కలియుగంలో వేంకటేశ్వరుడై విబుధులచేత నుతింపబడుతున్నాడు.

ఆజానుబాహుడు=దీర్ఘబాహుడు, ఎత్తైనవాడు; నీలజీమూత=నీలమేఘం; పంకజాసనుడు = బ్రహ్మ; వినుతం = కీర్తింబడు. ***– గంధం బసవ శంకరరావు***

---

1. 'రామునితో యుద్ధము చేసిన శత్రురాజులు ఆతని కోదండలాఘవముతో తాము విలువిద్య నేర్చిరి' అనుభావమున ఈ సమాసమేర్పడినదేమో? అప్పుడు 'అరిరాజ' సహజము. రాజారి ప్రాస నిర్బంధము. **2.** ఈ వాఙ్మయమున విశాలవక్షం తప్పుగాదు, 'విశాలవత్సం' కావచ్చు. **3.** అర్చిత కావచ్చు, 'జనకార్చిత శంకర చాపదళనం' అను భావమేమో!

146. దేవ నావలన గుణము

సంకీర్తన: 149 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 147

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 12వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 2)లో రాగం మంగళకౌశిక)

దేవ [1]నావలన గుణము తెలిసి కాచే ననేటి
యీ వెట్టితనము మాని యిట్టే నన్నుఁగావవే ॥పల్లవి॥

నేరుపే నాకుఁ [2]గలిగితే నెట్టన నింద్రియముల
బారిఁబడి బంటనై పంపుసేతునా
ఆరీతి నేనే వివేకి నైతే హేయపుమేను
కోరి బ్రహ్మమని నమ్మి కొంకక గర్వింతునా ॥దేవ॥

నాలో బుద్ధి గలిగితే నలిఁ గామక్రోధములు
యీ లీల నాసొమ్ము లని యెన్నుకొందునా
తాలిమి నాయందు మంచితనములు గలిగితే
మూలనున్న నా కర్మములే కట్టివేసునా ॥దేవ॥

చిత్తమే కైవసమైతే చేరి సుఖదుఃఖముల
మత్తుఁడనై మఱచి యేమరివుందునా
అత్తిన శ్రీవేంకటేశ అంతర్యామిని నీవు
తత్తరపు నా పస నీ [3]వెఱుఁగవా ॥దేవ॥

స్వామీ, నేనజ్ఞానిని, జడుడను, ఇంద్రియ మత్తుడను, ఇట్టివానిని కావవయ్యా! ఓ అంతర్యామి అని పెదతిరుమలాచార్యులవారు ప్రార్థిస్తున్నారు!

– గంధం బసవ శంకరరావు

---

1. నావల్ల; **2.** గటీతే; **3.** నీవెరంగవా

147. దేవరకే చెల్లెనో

సంకీర్తన: 210 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 201

దేవరకే చెల్లెనో - దేవరాజ, నీవు
దేవర వైతివి గదా - దేవరాజ ॥పల్లవి॥

తిరుమణి సొగసాయ - దేవరాజ
తెరగెన్నడు గానము - దేవరాజ
తెరవనేల యేచేవు - దేవరాజ, అది
(తిరుమాన)మెన్నడు - దేవరాజ ॥దేవరకే॥

తీరాయ చెక్కిటి గోరు - దేవరాజ
తీరెక్కడలేదు - దేవరాజ
తేరని సొమ్మొపెకిచ్చిది - దేవరాజ, అది
తేరకగాక సతము - దేవరాజ ॥దేవరకే॥

తెరవనంపైన దేవు - దేవరాజ, యీ
(తరుణికిదే) తలపాయ - దేవరాజ
తిరువేంకటకాంతుడా - దేవరాజ, స్వామి
తిరుగా పెరుందేవి గూడితివి - దేవరాజ ॥దేవరకే॥

ఈ సంకీర్తనమున తిరువేంకట దేవుడే దేవరాజు. కనుక ఆతని యిల్లాలు కూడా పెరుందేవి తాయారే! పెరుందేవి, దేవరాజుల ప్రస్తావనలు గల పదాలు వీరివి కలవు. ఇట్టి వానిని క్షేత్రయ్య పదాలుగా భావించుట తగదు. ఈ పాట అంతా 'ర ప్రాసతో, ప్రాస పూర్వాక్షర హ్రస్వ దీర్ఘ నియతితో సాగుట కాననగును.

- వేటూరి ఆనందమూర్తి

148. దేవర వంటివాడని

సంకీర్తన: 206 & 287 రాగం: ఆహిరి

వ్రాతప్రతి పుట: 198 & 271 తాళం: లుప్తము

[1]దేవర వంటివాడని - తెలియనైతి [2]నిందాకా
చేవదేర బుద్ధి చెప్పి - సేవ గొనవయ్యా ॥పల్లవి॥

మొన్న నా కాలు దాకితే - మ్రొక్కమరచి యుండితి
(చెన్నుగా)[3] నీ వేళైనా మొక్కేను - చేరరావయ్యా
నిన్నటి మా తమ్ములము - నీ చెక్కిలిపై నున్నది
పన్నీటినైనా కడిగేను - బడినే రావయ్యా ॥దేవర॥

సారెకు నీవు రాగా మం-చము మీద నుండినట్టి
నేరము (బాపుకొనే నే - డింటికి రావయ్యా)
[4]వోరికొట్లు గొట్టితి - నుబ్బి జవ్వనమదాన[5]
గారవించవలె నే - కాంతానాను రావయ్యా ॥దేవర॥

ఏనాటికి నీవే చన - వీయగ నెదకెక్కితి
నేనాటదాన నీవే దయ - నేలుకొనగ రావయ్యా
మానిత సద్గుణ నిధాన - మాధవ కృష్ణాయని ని
న్నూనిన భక్తింగొల్చెద - నొద్దిక చేకొనుమయ్యా ॥దేవర॥

అలమేలుమంగనని - అట్టె నీ వురమెక్కితి
యెలమితోఁ గౌఁగిలించే - నీడకు[6] రావయ్యా
కలసి రతుల వేం - కటనాథ గెలిచితివి
పలుదెరంగుల మోవి - పంతమిచ్చే రావయ్యా ॥దేవర॥

---

1. ఈ పాట వ్రాతప్రతిలో పునరుక్తమైనది (చూ. సంకీర్తన - 209) ఇదే పాట తంజావూరి ప్రతిలో బిలహరిరాగమున నున్నది (సం.కీ.86) **2.** మిందాక (తా.సం.); నిందాక **3.** తం.ప్ర **4.** వోరికొట్లు (తా.సం), రాకొట్టుట వంటిదే ఓరిగొట్టు ప్రయోగము. **5.** జవ్వనముదాన (తం.ప్ర) **6.** యిటు (తా.సం) ముద్రను బట్టి ఈ పాట చిన తిరుమలాచార్యులవారిదిగా తోచును.

149. నందనందన

సంకీర్తన: 77 రాగం: ధన్యాసి
వ్రాతప్రతి పుట: 78 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 1వ సంపుటంలో 312వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 61)లో రాగం ధన్నాసి)

నందనందన వేణునాదవినోద ము
కుంద కుందదంతహాస గోవర్ధనధరా ॥పల్లవి॥

రామ రామగోవింద రవిచంద్రలోచన
కామ కామకలుషవికారవిదూరా
ధామ[1] ధామవిభవత్రపతాపరూప (?) దనుజని
ర్ధామధామకరణచతుర భవభంజనా ॥నంద॥

[1]కమల కమలవాస కమలారమణ దేవో
త్తమ తమోగుణసతతవిదూర
ప్రమదత్రపమదా[2]సుభవభావకరణ[3] (?)
సుముఖ సుధానంద శుభరంజనా ॥నంద॥

పరమ పరాత్పర పరమేశ్వరా[4]
వరద వరదామల వాసుదేవ
చిరచిర ఘననగ శ్రీవేంకటేశ్వర
నర[5] హరినామ పన్నగశయనా ॥నంద॥

నిడురేకు 50. **1.** దామ విభవ ప్రతాపరూప **2.** ప్రమదప్రమదా **3.** కారణ **4.** శ్వరపరాపర వరదా **5.** నరనామ పన్నగరాజ **1.** ఔషధమా? వైద్యుడా?

150. నన్నే పిలవవయ్య

సంకీర్తన: 261 | రాగం: సౌరాష్ట్ర
వ్రాతప్రతి పుట: 249 | తాళం: లుప్తము

నన్నే పిలవవయ్య - నాతో నీకెగ్గు లేదు
వున్నవేళ నీవు లెస్స - వున్నదే చాలదా ॥పల్లవి॥

అయ్యయ్యో యేపొద్దున ర - మ్మన్న నే రానా
దయ్యమా నా మోము చూడ - దగదా నీకు
ముయ్యక యెవ్వరి మో-ములు జూచితివో, మోవి
వయ్యలాయ చెక్కుజీరు - వారె వాతను ॥నన్నే॥

అక్కట నీ కతలె - న్నైన నూకొనన
దక్కిన నాతోనె మాటాడ - తగదా నీకు
తక్కక యెవ్వతె వాకు - దాకెనో నీ మాటలు
పెక్కువాయ మేనలసె - పెను పండుగ లాయను ॥నన్నే॥

ఔనౌ నీ కౌగిట నేను - ఆడుమన్నట్టెల్లానాడనా?
కానుకలు నారతులు - గావా నీకు
తోననెవ్వతెనంటు - దొరలెనో, నీవు
కానరాక దాగె శ్రీవేం - కటనాథ రచ్చలోన ॥నన్నే॥

ముద్రను బట్టి చినతిరుమలాచార్యుల పదం.

దయ్యమా = దైవమా.

- గంధం బసవ శంకరరావు

151. నలినాక్షి యొకతెయు

సంకీర్తన: 176 రాగం: శుద్ధకాంబోది

వ్రాతప్రతి పుట: 171 తాళం: లుప్తము

నలినాక్షి యొకతెయు - న్నది నీకే తగు నోరి
చెలియ యిందరిలోన - చెలువ మైనదిరా ॥పల్లవి॥

(గొప్పలు) కన్నులు, నడుము - కొంచెమా దాని చక్కదనము
చెప్పరాదు దాని తీరు - చెప్పరాదు రోరి
(విప్పు) జడయు వెన్నుదాటి - పిక్క రాయునంత!నే
చెప్పరాదు చేపట్టి తప్పు - (చెప్పరాదు రోరి) ॥నలి॥

సోన తేనెలు (సావి) - జొట జొట వడియు (మోవి)
మానవతిని గంటి వా - మానధిక ప్రేమ
మేను చామన మెరపు - మెరుగు గుబ్బల యొఱపు
దానికే తగును మరి - దానికీవె తగుదోరి ॥నలి॥

కలికి చిలుకల కొలికి - అలమేలుమంగ (పేర) చెలికి
కలిగిన దీని పాల - గలిగినది ప్రేమ
చెలువొసంగ గూడితివి - శ్రీవేంకటేశుడవె
తలచకురా వెనుకటివి - తలచరాదురోరి ॥నలి॥

కలికి చిలుకల కొలికియైన అలమేలుమంగ సౌందర్య వర్ణన.

- గంధం బసవ శంకరరావు

152. నాకంటె నీకు

సంకీర్తన: 181 రాగం: గుమ్మకాంబోది

వ్రాతప్రతి పుట: 175 తాళం: లుప్తము

నాకంటె నీకు గూర్చు - నా చెలియేది
యీ కతలు మానవైతి - వింతకు వచ్చియును ॥పల్లవి॥

పెట్టితి నొసల పట్టు - పిమ్మట నేటికి గుట్టు
నెట్టుకొంటీ తలయూచీ - నీడలే దాచ
ముట్టవు (ముయికి ముయంట) - ముయ్యగనేలే యింకిటు
తొట్టి మై చమటలు నా - తో నేలే సటలు ॥నాకంటె॥

మానితి నిచ్చ నగవు - మాటికినేలే తగవు
పూనితి చెక్కిట కేలు - వొద్దే వేసాలు
పూనితి తలచ గరంగు - పొద్దు పొదలే మరుగు
ఆనితి కన్నుల నీరు - అప్పటికి నేలె మీరు ॥నాకంటె॥

చక్క ముడువవు కొప్పు - సారెకు నేటికి కప్పు
యిక్కువదే చెమరీని - (యెసరేగే తమినిహో)
చక్కని వేంకటపతి - చలి వాసే నిన్ను రతి
యెక్కే నీ మోమున నిగ్గు - యిక నేలే సిగ్గు ॥నాకంటె॥

153. నాకింత గుట్టు మీఁది

సంకీర్తన: 62 రాగం: ఘంటారవము
వ్రాతప్రతి పుట: 63 తాళం: లుప్తము

నాకింత గుట్టు మీఁది - నడక చాలు
కాకరి బాగుల నీకే కాక - మాకేలరా? ॥పల్లవి॥

చనవుమాలిన యీవి - చప్పరించిన మోవి
యినుమడై నాకిచ్చిన - నేమిటికిరా
అనుమానపు వలపు - అటమటపు సొలపు
యెనయని నీ బుజ్జగింపు - యేటికిరా ॥నాకింత॥

కాంతాళపు పొందూ - కడివోయిన విందూ
యెంత నీవు జేసినా - యేటికిరా
వింత వింత మాటలూ - వేసదారి తేటలూ?
యెంతేసి నీవాడినా - యేటికి రా? ॥నాకింత॥

పలుమారు నీ యెగ్గులూ - పనిమాలిన సిగ్గులూ
యెలమి జేసిన మీదట - యేటికిరా?
అలమేలుమంగ శ్రీవేంక - టాధీశ గూడితి, న
న్నలయించీ బిలచీ బా - యగనేటికిరా ॥నాకింత॥

కాకరి = మాయగాడు.

కాంతాళము = ఈర్ష్య, తాలిమిలేమి.

154. నాకు నాకె వలపు దెల్ప

సంకీర్తన: 7 రాగం: కల్యాణి

వ్రాతప్రతి పుట: 12 తాళం: లుప్తము

నాకు నాకె వలపు దెల్ప - నయముగా దీవేళ
నీకు మేలుదానరా కస్తూరి రంగ! - నీకు మేలుదానరా
నీకు మేలుదానరా కావేటి రంగ! - నీకు మేలుదానరా ॥పల్లవి॥

సారె సారెకును నీతో - సన్నసేయగా లేను
వోర జేసుకొని నీ వా - వారిజాక్షి జూచేవు ॥నాకు॥

మాటి మాటికి నీతో - మాటలాడంగ లేను
బాటు చేసుకొని నీ వా - బోటితో ముచ్చటాడేవు ॥నాకు॥

పొంకమైన విరిశయ్య - పొందు వేడంగ లేను
వేంకటరాయ గొంకక నీ - విందరిని కౌగిలించేవు ॥నాకు॥

ఇట్టిదే మరియొక రచన నా సేకరణమునందలి వ్రాతప్రతిలో ఉన్నది. కళ్యాణిరాగ ప్రయోగము తంజావూరులోని తాళ్లపాకవారి పాటలందు కలదు.

- వేటూరి ఆనందమూర్తి

155. నానావుపాయముల

సంకీర్తన: 39 రాగం: శంకరాభరణం

వ్రాతప్రతి పుట: 40 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 370వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 65)లో రాగం శంకరాభరణం)

నానావుపాయముల నన్నుఁ గాచేది పాడి
దీన రక్షకుఁడ నాకు దిక్కయి నిలువవే ॥పల్లవి॥

శరణు చొచ్చినవాఁడు సర్వాపరాధి యైనాను
పరగఁ దప్పులు మతి పట్టఁ దగదు
సరవిఁ బాఁతవాఁడెంత సలిగలఁ బొరలినా
అరసి యందుకుఁగా నలుగఁగఁ దగదు ॥నానా॥

పంచ చేరి వున్నవాఁడు పనికిరాకుండినాను
వంచనతో వాని విడువఁగఁ దగదు
కొంచెపడి మొక్కేవాఁడు గుణహీనుఁడైనాను
అంచెల మొగమాడక అదలించఁ దగదు ॥నానా॥

మన్నన బంటైనవాఁడు మందెమేళాన నుండినా
పన్ని మనసున యెగ్గుపట్టఁ దగదు
యిన్ని విధములవాఁడ నిటు నే శ్రీవేంకటేశ
నన్నుఁ గాచుట గాని మిన్నక దూరఁ దగదు ॥నానా॥

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే
అభయం సర్వ భూతేభ్యః దదామి ఏతద్వ్రతం మమ"

(శ్రీరామ చరమ శ్లోకం, శ్రీమద్రామాయణం 12-20)

అని ఆ రామచంద్రుడు విభీషణునికి అభయం ఇచ్చినట్లు పెదతిరుమలాచార్యులవారు శరణాగతితో స్వామిని ప్రార్థిస్తున్నారు.

- గంధం బసవ శంకరరావు

156. నాయంతనే వుద్దండంబున నీ

సంకీర్తన: 116 రాగం: నారాయణగౌళ
వ్రాతప్రతి పుట: 116 తాళం: ఉుప్తము

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 423వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 74)లో రాగం మధ్యమావతి)

నాయంతనే వుద్దండంబున నీ నగరు చొచ్చి సోధించఁగ లేదు
పాయక నను మన్నించి యేలుకో నీ ప్రకాశ మౌట మేలు ॥పల్లవి॥

ధరలో నీ రూపము నీవే దాఁచుకొని యుండఁగను
గరుడధ్వజమే నీ గుఱుతు కనుపించెను నాకు
బిరుదులు వొగడే శృతులచేతనే [1]పరరేఁగితి నేను
పరగిన నీ ప్రతాపతేజమె బయలుసేసె నిన్ను ॥నాయంతనే॥

యెవ్వరికి నసాధ్యుఁడవై నీవు యేకతమున నుండఁగాను
రవ్వసేసి నిను నాకుఁ దెలిపెను రచనల నీ మహిమో
చువ్వన నీ విచ్చు వరదహస్తమె చొప్పుచూపఁగాఁ గంటిని
నివ్వటిల్లు నీ కరుణ యిందరికి నిన్నిటువలెనే ముంగిటఁ బెట్టె ॥నాయంతనే॥

శ్రీవేంకటగిరిపై రహస్యమునఁ జెలఁగుచు నుండఁగాను
భావింప నలమేల్మంగ సంపదలె పట్టిచ్చెను నీ ప్రభావము
దైవికమునఁ బ్రకటించిన తొంటి వుదారగుణము విని శరణు చొచ్చితిమి
యీవల నావల మీ చిహ్నములే యింత సేసె మిమ్ము ॥నాయంతనే॥

శ్రీవేంకటగిరిపై అమ్మ అలమేల్మంగతో కొలువైన కొండలరాయని శరణాగతితో చేరుకున్న వైనాన్ని పెదతిరుమలాచార్యులవారు వర్ణిస్తున్నారు.

– గంధం బసవ శంకరరావు

---

1. రేకు పాఠం – పెరరేఁగి

157. నారాయణతే నమో నమో

సంకీర్తన: 223 | రాగం: నారాయణగౌళ

వ్రాతప్రతి పుట: 213 | తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 4వ సంపుటంలో నిడురేకుల కీర్తనలలో 32వ సంకీర్తనగా పుట382లో ఉంది.
రాగిరేకులో రాగం పాడి)

నారాయణతే నమో నమో
నారదసన్నుత నమో నమో ॥పల్లవి॥

మురహర భవహర ముకుంద మాధవ
గరుడగమన పంకజనాభ
పరమపురుష భవబంధ విమోచన
నరమృగశరీర నమో నమో ॥నారాయణతే॥

జలధిశయన రవిచంద్రవిలోచన
జలరుహభవనుత చరణయుగ
బలిబంధన గోపవధూవల్లభ
నలినోదర తే నమో నమో ॥నారాయణతే॥

ఆదిదేవ సకలాగమపూజిత
యాదవకుల మోహనరూప
వేదోద్ధర శ్రీవేంకటనాయక
నాదప్రియ తే నమో నమో ॥నారాయణతే॥

రాగిరేకులలోనూ కల ఈ పాట ప్రత్యేకమైనది, తమిళదేశంలో "తోడయమంగళం" పేరుతో బహుళ ప్రచారంలో ఉన్న భజన సంప్రదాయకీర్తనలలో ఇది ఒకటి. ఈ సంకీర్తనకు ముచ్చటపడిన కన్నడ వాగ్గేయకారుడు పురందరదాసు ఇదే శైలిలో కీర్తనలు వ్రాశారు. భగవంతుని గుణగానమే ఇక్కడి అంశం!

– గంధం బసవ శంకరరావు

158. నిండ నేగురు

సంకీర్తన: 121 రాగం: సౌరాష్ట్ర

వ్రాతప్రతి పుట: 120 తాళం: త్రిపుట

నిండ నేగురు - నెలఁతలుండంగ - నేనెంత యింపైతినే
కొండవంటి దొర - కొలువు మొక్కుమొక్కి - కొలఁదిగానే నడిపెనే ॥పల్లవి॥

ఏటికింత యెంచె నేనేమి (సేయగల) నేమి - బ్రాతే తనకును
మాట పంతంబులు మల్లడి పొందులు - మాయకాడు గదవె తాను
పాటిలేదే తనకు - పాదమేలంటీనె - (పాదతాకు కాంతనే)
ఆటదాననింతె- అమ్మకనేజెల్ల - అందచందము లెరుగడాయె ॥నిండ॥

చలమేల చేసీనె - చక్కదనమేమో - (సటకాడు కదవే తాను)
అలపులసొలపుల - ఆసలవేసాల - అందగాడు కదవె తాను
తలపెంత మెత్తనో - తమ్ములము వేడీని - (తరితీపు సేయువాడె)
యిలువరుసలెంచ తా -నెంత నేనెంతనే-నేపాటి తెలియదటవే ॥నిండ॥

ఎంత బత్తిచేసె - నేయేరతుల మించె - నేనేమెరుంగుదునే
రంతుల పంతాల - రాపుల తీపుల - రట్టుకాడు తాను గదవే
కాంతామణిరో! - నన్ను - (కల్యాణమై) శ్రీవేం-కట నాథుడే గూడెనే
దొంతరగా నన్ను - దొరయురము పైనుంచు - దొరతనంబెరుగడటవె ॥నిండ॥

రేకుల్లోని 'కులుకక నడవరో కొమ్మలాల (5-73) అనే సంకీర్తనలోనూ పాదతాకు కాంతల ప్రస్తావన కలదు.

పాద తాకు కాంత = పాదాలు తాకే అధికారం గల స్త్రీ.

- గంధం బసవ శంకరరావు

159. నిండిన వేడుకలెల్ల

సంకీర్తన: 114 రాగం: వరాళి

వ్రాతప్రతి పుట: 114 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 272వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు(సంఖ్య 77)లో రాగం వరాళి)

నిండిన[1] వేడుకలెల్ల నీకె గాక
అండనె తాపము చల్ల[2] నమరెగా నాకు ॥పల్లవి॥

మగువకన్నుల మొక్కు మట్టెల పాదపుఁ దొక్కు
నిగుడు వాతెరనొక్కు నీకె కాక
అగడునెరుల చిక్కు అరచేతిపై చెక్కు
వగల గుక్కును[3] మిక్కు వన్నెగా నాకు ॥నిండిన॥

తొయ్యలిఁ గూడినరట్టు తుదచెమటలమెట్టు
నెయ్యపుమాటల గుట్టు నీకె కాక
పయ్యద జారినకట్టు భారంపు నొసలిపట్టు
కయ్యపుటలుక తిట్టు గలిగెఁగా నాకు[4] ॥నిండిన॥

మొగలిపువ్వులతావి ముంచినకన్నులకావి
నిగనిగ నగుమోవి నీకె కాక
సగము జారిన నీవి చనవుల నీదేవి-
నగుట వేంకటేశ నేఁడబ్బెఁగా నాకు[5] ॥నిండిన॥

---

1. తా.వెం 114 : నిండైన **2.** సా.రే. చల్లె **3.** కుక్కురు మిక్కు **4.** నిదురేకు11; నీకు
5. నీకు; నిదురేకు 81. నాకునూ.

160. నిచ్చలపువాడవై

సంకీర్తన: 126 రాగం: ముఖారి

వ్రాతప్రతి పుట: 125 తాళం: లుప్తము

నిచ్చలపువాడవై - నీవుండినపొర- పొచ్చెపు సేతల పూబోణులు
నిచ్చలు తముదామె నిను గట్టి గుబ్బల-గుచ్చి బిగించరా గోవిందరాజ ॥పల్లవి॥

ఎమ్మెజేసుకొని - యింతుల వెంట వెంట
దిమ్మరితనాన - దిరిగే(టి)వాని
నమ్మిక నీతోడ - ననిచి మాటాడుదురు ఆ
కొమ్మలే మెచ్చిన గోవిందరాజ ॥నిచ్చలపు॥

చలము చేసుకొని - జవరాండ్లలోన-
కలహములకు వేళ - గాచేటివాని
తలcపుననళుకుచు - తరుణులేకాంతాన
కొలువు సేయగ(రారె) గోవిందరాజ ॥నిచ్చలపు॥

నీటు చేసుకొని - నీవు పదార్వేల
బోటుల నొకసారె - పొందేటివాని
గాటంపు ప్రేమ వేంక-టరాయని యెద
గూటమి గలదింతి - గోవిందరాజ ॥నిచ్చలపు॥

161. నీకుగా మావారిలో

సంకీర్తన: 201 రాగం: ఆహిరి
వ్రాతప్రతి పుట: 194 తాళం: లుప్తము

నీకుగా మావారిలో - నిచ్చ నిచ్చ బొంకగా
రాక యెంచేవో వచ్చేవో - రాయడేమి చెప్పరా ॥పల్లవి॥

ఉదుటు గుబ్బల మీద - నొత్తిన గోరట్టె జూచి
అదరించి వారు న - న్నడిగిరి
పొదలేటి తోటలోన - పువ్వులు గోయబోతే
అదరి ముదురు చేమంతి ముల్లు - జీరెనంటిరా ॥నీకుగా॥

పవడంపు మోవి మీది - పంటి జాడలేవని
వివరించి మా వారు నన్ను - దిట్ట దొడగిరి
సవరంపు చిలుకతో - సారెకు ముద్దాడ బోతే
కవిసి మైదొండ చిలుక - కరిచె నంటిరా ॥నీకుగా॥

రాపు సేసి నీవు గూడిన - రతి సేతలెల్ల జూచి
కోపగించి మా వారు నన్ను - గొట్ట దొడగిరి
నీపాదమాన నౌభళ - నిలయ శ్రీవేంకటేశ
దాపగ నేరక నే నిన్ను - దగిలితి నంటిరా ॥నీకుగా॥

నీపాదమాన - అనే చక్కటి ప్రయోగం కలిగిన ఈ సంకీర్తనలో అన్నిటినీ విడచి, సర్వాన్నీ స్వామికి సమర్పించిన నాయిక కానవస్తున్నది.

ఔభళనిలయ = అహోబలక్షేత్రంలో కొలువైన నరసింహస్వామి. అహోబలమునకు 'ఔభళ'మని వ్యవహారిక రూపం.

– గంధం బసవ శంకరరావు

162. నీకేమి జాణకాడవు

సంకీర్తన: 151 రాగం: ఆహిరి
వ్రాతప్రతి పుట: 148 తాళం: లుప్తము

నీకేమి జాణకాడవు - నీవు లెస్స
కాకుసేయక తిరిగేవు - కంటిమి నీజాడలు ॥పల్లవి॥

అడవిలోనివారము - అంతలేసి నేరము
యెడల పొడల పుట్టమి - చ్చే వు (నీవు) జడిసి మారు
కడకాచీరలు గడితే - కన్నవారు బూచంటా
విడిచారల పులియంటా - వెరతురు గాని ॥నీకేమి॥

వంకలు మాకురులు మరుని - జింక వేట కురులు
కొంకక మేముండుతావు - కొండలచరులు
కంకణాలిచ్చేవు - ఘల్లుఘల్లనంగా
బింకపు మాచింకలెల్ల - బెదరీపోగాను ॥నీకేమి॥

మొగనాలిననగానే - మురియు శ్రీవేంకటేశు
డొగిమీరగా గంద - వొడిమేన జల్లేవు
మగుడీ మావారితోన - మాకుల పుప్పొడి
పొగడీ, రాలేననీ - బొంకేవే ॥నీకేమి॥

ఈ సంకీర్తనయందు గందవొడి ప్రస్తావన కలదు.
అడవి చెంచు నాయిక నాయకునితో పలుకుతున్న పలుకులు.

- గంధం బసవ శంకరరావు

163. నీపొందెన్నటికి బోదు

సంకీర్తన: 161 రాగం: పాడి

వ్రాతప్రతి పుట: 158 తాళం: లుప్తము

నీపొందెన్నటికి బోదు - నే వేగిరపు దానను
యేపున సవతుల రానీక - నీ యీవటుండవే ॥పల్లవి॥

నీముందూడిగము సేసే - నీవు పూలు గోయవే
చేముంచి యందుకోలేను - చిన్నదానను
మామకూతురవు నీవు - మాపటికి వరుసయె
యేమర నీయుపకారము - యెన్నటికిని జెడదు ॥నీపొందె॥

దోమటి నీ మారే నే - దొడికే వడ్డించవే
యేమేమో యెక్కటివలెనో(?) - యికనే ర్చెను
గోమున జేరువనుండి - గ్రుక్కిళ్లు మింగరాదు
వేమారులిందుకే నిన్నిటు - లేమరి నుతింతురిందరు ॥నీపొందె॥

పక్కనే బండేగానీ - పాదాలు నీవొత్తవే
(మిక్కిలి) శ్రీవేంకటనాథుని - మెప్పింతువు
మక్కువతో నలమేలు - మంగను భూకాంతను
నిక్కపు పేరులే వేరు - నీవె నేనే గానా ॥నీపొందె॥

నాయికానాయకుల సంవాదమైన ఈ సంకీర్తన ముద్రను బట్టి చినతిరుమలాచార్యులవారిది!

- గంధం బసవ శంకరరావు

164. నీమహిమ కొనియాడ

సంకీర్తన: 168 రాగం: సంతురావళి

వ్రాతప్రతి పుట: 165 తాళం: లుప్తము

నీమహిమ కొనియాడ - నేర్పరి యెవ్వడు
కామజనక! కామిత - కల్పభూజ! వరదరాజ!! ॥పల్లవి॥

పదం. సరసిజసంభవుడు - జన్నము సేయగను
?(సురవైరి) కనిపించ - కరుణించితివె వరదరాజ!
గరుడనిపై వేడ్క - గారవాన వచ్చి, మ
కరిగొట్టి కరిరాజు - గాచితివి వరదరాజ ॥నీమహిమ॥

దేవగురుండు భక్తితో - సేవించి సేయుపూజ
కావించిన కొండగా గై - కొంటివి దేవరాజ!
భూవివరమున బొడమి - భోగీంద్రుడా(ది)శేషుండు
భావమున నుతియించి - పాలించితివి దేవరాజ ॥నీమహిమ॥

తిరువాలవట్టము విసరు - తిరుకచ్చినంబితో, న
తిరహస్యములెల్లా - నానతిచ్చితివి దేవరాజ!
ధరనెవ్వరు వేడినా - తగనందరిని
తిరువేంకటనాథుడవై - వరమిత్తువు వరదరాజ ॥నీమహిమ॥

కంచివరదరాజులని కీర్తించిన సంకీర్తనం, ప్రేమతో దేవరాజా అని అన్నమయ్య కీర్తిస్తున్నాడు.

తిరువాలవట్టము = శ్రీవారికి వీచు వింజామర.

- గంధం బసవ శంకరరావు

165. నీలశైలము వంటి

సంకీర్తన: 37 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 38

నీలశైలము వంటి - నెమ్మేని కాంతులకు నిజమైన (నెల)వాయె - నుయ్యాలా ॥పల్లవి॥

పాలిండ్లు కదలగా - పయ్యదలు జారగా - భామినులు వడి నూతు రుయ్యాలా
ఓలి బ్రహ్మాండమ్ము - లొరుగునో యను (భీతి) - నొయ్య నొయ్యన నూతు రుయ్యాలా
॥నీల॥

కమలకును భూసతికి కదలు కదలున (డాసి) - కౌగిలింపగజేసె నుయ్యాలా
అమరాంగనలు (చూపు) - హావభావములెల్ల - నమరంగ జేసె నీ యుయ్యాలా
॥నీల॥

కమలాసనాదులకు - కన్నుల పండువై - కడు వేడుకాయ నీ యుయ్యాలా
కమనీయ మూర్తి వేం - కటశైలపతి నీకు - గడు (చేరువాయె నీ) యుయ్యాలా
॥నీల॥

తాళ్లపాక వాగ్గేయకారులు ఉయ్యాల బాలు నూచిన సందర్భాలు చాలానే ఉన్నాయి. వాటిల్లో రేకుల్లో కానరాని సొగసైన ఈ అముద్రిత ఉయ్యాల పదం మరొకటి. "భళిర గండవరేశ! పరమాత్మరూప" అని వారిదొక లాలిపాట, "మంగళము తిరుపట్లమదనగోపాల" అని వేరొక జోలపాట ప్రసిద్ధమైనవి ఉండగా, ఇది వేంకట కృష్ణుడైన "వేంకటశైలపతి" ముద్రతో ఉండటం విశేషం.

- గంధం బసవ శంకరరావు

166. నీవనఁగ నొకచోట

సంకీర్తన: 26 రాగం: శ్రీరాగం

వ్రాతప్రతి పుట: 28 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 1వ సంపుటంలో 232వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 39)లో రాగం సామంతం)

నీవనఁగ నొకచోట నిలిచివుండుటలేదు
నీవనుచుఁ గనుఁగొన్న నిజమెల్ల నీవే ॥పల్లవి॥

తనయాత్మవలెనె భూతములయాతుమలెల్ల-
ననయంబుఁ గనుఁగొన్నయతఁడే నీవు
తనుఁగన్నతల్లిఁగా తగనితరకాంతలను
అనఘుఁడై మదిఁజూచునతఁడే నీవు ॥నీవనఁగ॥

సతతసత్యవ్రతాచారసంపన్నుఁడై
అతిశయంబుగ మెలఁగునతఁడే నీవు
[1]ధృతిదూలి ద్రవ్యంబు తృణముగా భావించు-
హతకాముకుఁడైనయతఁడే నీవు ॥నీవనఁగ॥

మోదమున సుఖదుఃఖములు నొక్కరీతిగా
నాదరింపుచునున్నయతఁడే నీవు
వేదోక్తమతియైన వేంకటాచలనాథ
ఆదియును నంత్యంబు నంతయును నీవే ॥నీవనఁగ॥

వేదాల సారాన్ని అన్నమాచార్యులవారు చక్కని సూక్తులుగా ఈ సంకీర్తనలో అందిస్తున్నారు.

– గంధం బసవ శంకరరావు

---

1. 'ధృతి' రేకు

167. నీవు గాcగా నేను

సంకీర్తన: 165 రాగం: కేదారగౌళ

వ్రాతప్రతి పుట: 161 తాళం: అట

(ఈ సంకీర్తన అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుట.111-112లలో ఉదాహృతం)

నీవు గాcగా నేను గాcగా నేcటి కాయc బోయను
మీ వంటి చులుకనివారము మేమైతే మేటైనంతలేసిపనులు నేcడౌను ॥పల్లవి॥

మంచిగందము నెఱపూcత పూసుకొని మావాడ కాతcడు రాcగాపోcగాc జూచి
పొంచులు మా యింటి పంచ నుందువట బోగాలవారమటే
ఎంచనేటికి తప్ప నీ మగcడైతే యిలు వెళ్లకుండ నరికొట్టుకొని వల
పించవలెcగాక వూరివారిమీcద పొంచు లుండవచ్చునా వో చెలియ ॥నీవు॥

ఎమ్మెకాc డాతcడు మా వీథి నిలుచుండి యెవ్వరితోనో మాటలాడcగా విని
కొమ్మరో చూపెట్టుకొని వుందువట గుట్టు విడిచివున్నామా
అమ్మరో ఆతcడు నీ మగcడైతే ఆన లిడుకొని వుండవలెcగాక
దిమ్మరికత్తెవై మా యింటిచుట్టూ తిరుగులాడ నాయమా ॥నీవు॥

నాయముగా అలమేల్మంగ వేంకటనాథుcడు నను c గూడి నవ్వినంతలోనె
వోయమ్మ నేcజెల్ల వూర నాcట చాట వున్న పనులవారమా
పాయక ఆతcడు నీ పతియైతే పక్క పవ్వళించి వుండవలెc గాక
కాయని కాపులు పూయని పూతలు గట్టి కాపురాలు గుత్తగొందురటె ॥నీవు॥

ఈ సంకీర్తన ముద్రను బట్టి చినతిరుమలాచార్యులవారిది కావచ్చును.

క్షేత్రయ్యకు, సారంగపాణికి యిటువంటి కీర్తనలు దారిచూపు దివిటీలు.

– గంధం బసవ శంకరరావు

168. నెట్టన (నీ)తో

సంకీర్తన: 156 రాగం: సామంతం

వ్రాతప్రతి పుట: 153 తాళం: లుప్తము

నెట్టన (నీ)తో నెప్పుడు బాయని - నేజేరి బాసేది
చిట్టకాలనిన్ను - చిత్తరుబొమ్మ (జేసేది) ॥పల్లవి॥

కూటమిని జా(?)టి మే-కులు చేసి, బింకపు
మాటలనన్నలయించి - మరుబారి దోసి
కాటుక(కన్నుల) నిన్ను - కలిసి(కి) గుబ్బలగుమ్మి
నోటికసి (దీరనీ) ॥నెట్టన॥

ఈ సంకీర్తన అసంపూర్ణం.

169. నెలఁతఁ బాసి

సంకీర్తన: 75 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 76

(ఈ సంకీర్తన 17వ సంపుటంలో 20వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 4)లో రాగం వరాళి)

నెలఁతఁ బాసి వుండలేను నిమిష మెందు నేఁడు నాకు
తలఁపులో నీవలెనే రతుల తరుణిఁ గలయు టెన్నఁడే ॥పల్లవి॥

ముదిత నాయెదుట నిలిచి మోసులువార నవ్వు నవ్వి
కదలుఁజూపులఁ జూచి నాకు కన్ను లార్చు టెన్నఁడే
వదలుఁ బయ్యద సవదరించి వలపుతేట చవులు చూపి
కొదలు మాటల ముద్దు గునిసి కూరిమి గొసరు టెన్నఁడే ॥నెలఁతఁ॥

చెలియ సిగ్గున మోము వంచి చెక్కునఁ జేయి మాటు సేసి
మలసి వీడె మిచ్చి ఆకు మడిచి యిచ్చు టెన్నఁడే
వలుద చన్ను లురము మోఁపి వాసన యూర్పు చల్లిచల్లి
కలయ మోవితేనె లొసఁగు కంచము పొత్తులెన్నఁడే ॥నెలఁతఁ॥

యింతి నన్నుఁ జేరఁ బిలిచి యింటిలోని పరపు మీఁద
దొంతికళలు రేఁగ నంటి దొమ్మి సేయు టెన్నఁడే
వింత లేక యిపుడె శ్రీవేంకటేశ్వరుఁడనైన
పొంతనున్న నన్నుఁగూడ పొద్దు దెలియు టెన్నఁడే ॥నెలఁతఁ॥

పెదతిరుమలాచార్యులచే వర్ణితమైన పురుష విరహ సంకీర్తన!

– గంధం బసవ శంకరరావు

170. నెలత నెడబాయనిదె

సంకీర్తన: 129 రాగం: వసంతభైరవి

వ్రాతప్రతి పుట: 128 తాళం: లుప్తము

నెలత నెడబాయనిదె - ని(త్యోత్సవము)
అలివేణి రతియె ది - వ్యౌషధము ॥పల్లవి॥

కవబాసి విరహాగ్ని - గాసిబడు విభునకు
ఉవిద నెమ్మోము చం-ద్రోదయమ్ము
చివురు విల్తుని కేళి - జివికిన చెలిమోవి
ధవళ నేత్రునకు జిం-తామణి ॥నెలత॥

చెమరుమైసతి తోడ - జింత బలుకనిపతికి
రమణి పలుకులె తేనె - రసములౌ శ్రుతికి
తమితోడ దనమేన - తలకొన్న ప్రియునకును
సమదమదనగజాంకు - శమ్ము కొనగోరు ॥నెలత॥

అలరుచును నేడు మా - యలమేలుమంగ మై
జిలుకు కుంకుమకాంతి - సిందూరము
యెలమితో శ్రీవేంక - టేశుడనిశము (సల్పు)
జలజాక్షి కూటమే - సంజీవి నగము ॥నెలత॥

శ్రీవేంకటేశుడు నిరతమూ నెలతతో కొలువై యుండుటే నిత్యోత్సవము.

- గంధం బసవ శంకరరావు

171. నెలతయుపరతి

సంకీర్తన: 137 రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 135 తాళం: లుప్తము

నెలతయుపరతి సలుప - నిబ్బరమున
(గులుకు గుబ్బల పడతి - గుబ్బ) తిల్లంగా ॥పల్లవి॥

కపురగంధపు జెమట - కరగి దిగ జారంగ
....
....
డపుడె గతులకు పాత్ర - యాడినట్లుండె ॥నెలత॥

గట్టిగుబ్బలు పట్టి - కడలు కదలాడంగ
పెట్టుకొను ముత్యాల - పేరులూగాడ
చిట్టకపు గాంతలును - చేరి నర్తింపగా
మట్టుగా అపరంజి - మడచి నట్లుండె ॥నెలత॥

కొండుక సింగపునడుము - గునిసి గునిసాడంగ
మెండుకొని గళరవము - మెరయగాను
వుండర శ్రీవేంకటప్ప - (డొగి జవుల)గూడి(తే)
పండు జిగురున పక్షి - పడ్డయట్లుండె ॥నెలత॥

మొదటి చరణంలోని రెండు, మూడు పాదాలు లుప్తములు.

- గంధం బసవ శంకరరావు

172. నేఁడే పెండ్లివేళ

సంకీర్తన: 61 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 62

(ఈ సంకీర్తన 17వ సంపుటంలో 537వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 99)లో రాగం శ్రీరాగం)

నేఁడే పెండ్లివేళ నేఁడే నాగవల్లి
ఆడుచు సోబానఁ బాడు మనరే చెలులూ ॥పల్లవి॥

కనకాంబరుఁ డతఁడు కనకకుచగిరి యీకె
కొనబుగల యిద్దరికిఁ గూడెఁ బొంతనము
వనజనాభుఁ డతఁడు వనజలోచన యీకె
ఘనమైన కంకణము గట్టరే చెలులు ॥నేఁడే॥

నీలవర్ణుఁ డతఁడు నీలకుంతలి యీకె
చాలుకొని యిద్దరికి జంట దగును
ఆలరైన శంఖధరుఁ డితఁ డీకె కంబుకంఠి
యీ లీల నారతులు యెత్తరే చెలులు ॥నేఁడే॥

జలధిశాయిని యతఁడు జలధికన్నెక యీకె
కలిగె నిద్దరికి వొక్క కైవాడము
అలరు శ్రీవేంకటేశుఁ డతఁ డీకె మహాలక్ష్మి
వెలయఁగల సిరి దీవించరే చెలులు ॥నేఁడే॥

పెండ్లి సంకీర్తన! శ్రీవారికి నిత్య కళ్యాణోత్సవ సేవను ప్రవేశపెట్టినవారు అన్నమాచార్యులవారు! తాళ్లపాక కవులు వందలకొలది పెళ్లి పాటలు రచించి గానం చేశారు.

– గంధం బసవ శంకరరావు

173. నేను మంచిదానను

సంకీర్తన: 67 | రాగం: పంతువరాళి
వ్రాతప్రతి పుట: 68 | తాళం: లుప్తము

నేను మంచిదానను కాగా - కాని తప్పు కాచితి గాక
మానునా తక్కిన యింతి - మదనగోపాలా ॥పల్లవి॥

వెంట వెంట దిరుగుచు - వినయమే పచరించి
యింటికి రమ్మన్నా రాక - యెలయించేవు
వొంటి నా చే జిక్కితి - వోవరిలో పండబెట్టు
కొంటె నిను విడిపించు - కొనే దిక్కు గలదా? ॥నేను॥

చెట్టబట్టి ప్రియములే - సెప్పి పాను పెక్కుమని
వొట్టుపెట్టినా గైకోక - పూరించేవు
పట్టుబడితివి నాచే - పట్టెమంచము మీద
కొట్టి (పడ) వేసితే విడిపించు - కొనే దిక్కు గలదా? ॥నేను॥

పందె మోడి యెవతెకో - పతిపై శ్రీవేంకటేశ!
మందెమేళమున నన్ను - మరచితివి
కందర్పకేళి గూడి - కలసి పట్టుకొని
క్రిందుపఱచి ప్రౌఢి - కెక్కితే మరి నీకు దిక్కుగలదా? ॥నేను॥

ప్రౌఢనాయిక మదనగోపాలుణ్ణి ప్రశ్నిస్తుంది.

- గంధం బసవ శంకరరావు

174. నేనెట్లు తాళుదు

సంకీర్తన: 134 | రాగం: పంతువరాళి
వ్రాతప్రతి పుట: 132 | తాళం: ఉప్తము

నేనెట్లు తాళుదు – నేనేల తగుదు
తానెట్టు నడచినా – తన చెల్లుబడియది ॥పల్లవి॥

వేడుకై కెంపు మో – విని పంట నానితే
నోడకందుకు నే – నొద్దందునా
వేడుకొనినా వినక – వేమారు పంటికొద్ది
కోడెగాలకు మోవి – కుమ్మెలు వోనొక్కితే ॥నేనెట్లు॥

సరసత నా గుబ్బ – చన్నులలమితే
గరువమా నందుకు నే – కాంతాళించ
గరుసిచ్చి (?) నాతోడి – కాంతలలో పైట
చెరగు వారించి గోర – జీరలు సేసితే ॥నేనెట్లు॥

చిత్తజుకేళి నను – శ్రీవేంకటప్రభుడు
పొత్తెట్లు పనిగొన్న – పొలుపు గాదందునా
అత్తింటి కోడలని – యనుచు నందరిలోన
కొత్తగా నెదనుంచి – కొలువు సేసేనంటె ॥నేనెట్లు॥

స్వామిని అనుసరించి ఆత్మార్పణ భావంతో నడచు నాయిక ఇందుదహృతం!

కోడిగము = విలాస చేష్ట, వంచన, కొంటెతనం, పరిహాసము.

– గంధం బసవ శంకరరావు

175. నేనే వచ్చేగా నీయింటికి

సంకీర్తన: 215 రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 205 తాళం: లుప్తము

నేనే వచ్చేగా నీయింటికి - నీవలయకురా
కానుక లంపకు మీ యీసరికే - (కాని) తప్పులయ్యీని జాణ! ॥పల్లవి॥

యెడమాటలాడకురా అయ్యయ్యో - యింతులు వినేరు
పడమట పొద్దుగూడినంతలోనే - పనులు లెస్సయ్యీని జాణ! ॥నేనే॥

సన్నలు సేయకురా అయ్యయ్యో - చాల చింతయ్యీని
కొన్నెల కూడినంతలోనే నిన్ను - గూడుకొనేగాని జాణ ॥నేనే॥

అలమేలుమంగను నన్నిట్టె - ఆరడిబెట్టకురా
కలికి శ్రీవేంకటనాథ నన్ను - గారవించి కూడితివి జాణ! ॥నేనే॥

అభిసారిక లక్షణాన్ని ప్రదర్శిస్తూ నీవున్న చోటికి నేనే వచ్చాను, నన్ననుగ్రహించవయ్యా అని వేడుకొంటుంది నాయిక!

ముద్రను బట్టి ఇది చినతిరుమలాచార్యులవారి పదం!

- గంధం బసవ శంకరరావు

176. నేనైతే నీడేరుదు

సంకీర్తన: 113 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 113

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 22వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 4)లో రాగం హిజ్జిజ్జి)

నేనైతే నీడేరుదు నీకు లీలా మాత్ర మింతే
మానక నన్నేలు కొమ్మి మాధవ గోవిందా ॥పల్లవి॥

నీవు నన్ను మన్నించితే నీ మహిమలోఁ గొంత
యీవల వెలితి యౌనా యీ లోభ మేలా
కావించి పాలజలధికడ నొక్క తుంపురు
వేవేగ విదలించితే వెలితి యెందులకు ॥నేనైతే॥

వెడకర్మినైనా నన్ను వెనక వేసుకొంటేను
గొడవ నీకు వచ్చీనా కొంక నేఁటికి
గడుసుదొంగైనవాఁడొకఁడు కొండలో దాఁగితే
యెడ మిచ్చినకొండకు హీన మయ్యీనా ॥నేనైతే॥

కందువ శ్రీవేంకటేశ కరుణారసము నాపై
చిందరాదా అనుమాన చింత లేఁటికి
యిందరిపై సూర్యుఁడు యెండలు గాసితేను
అందుకొన్ని కిరణాలు అరగిపోయీనా ॥నేనైతే॥

"యిందరిపై సూర్యుఁడు యెండలు గాసితేను / అందుకొన్ని కిరణాలు అరగిపోయీనా!"

ఎంత గొప్పభావన!

– గంధం బసవ శంకరరావు

177. నే మానవతినౌట

సంకీర్తన: 112 రాగతాళములు లుప్తములు
వ్రాతప్రతి పుట: 112

నే మానవతినౌట - నిజమాయ గాన
క్షే(మంబు గూర్చుకొను - సి)ద్ధి యౌగాక ॥పల్లవి॥

యించువిలుకా(డట) - యించ నెంచీని
పంచబాణములతో - భస్మమౌగాక
మించి పున్నమరాజు - మిన్నంది కాసీని
యించు కించుక కళా - హీనుడౌగాక ॥నే॥

(పలు)మారు పూదోట - పై నేగుదెం(చీని)
చలిగాలి పెనుబాము - సమయించుగాక
యెలమావికొమ్మపై - చెలరేగి పలి(కీని)
చిలుక పంజరములో - (చెఱపడును) గాక ॥నే॥

(స్మరుడు విరహుల నేచు - సమయమే) పాయ
సరసుడౌ (విభు గూర్చు) - సమయ మౌగాక
మరుకేళి యలమేలు - మంగ శ్రీవేంకటపతి
కరుణించి రతుల నను - కరిగించుగాక ॥నే॥

నాయకునకు దూరమై విరహంతోనున్న మానవతియైన దివ్య నాయిక అలమేల్మంగ, అందుకు కారకులైన దర్పకునీ, ఆ కందర్పుని బలగాలనూ దుయ్యబడుతూ తన పతియైన శ్రీవేంకటపతి సమాగమమును కోరుకుంటున్నది.

ఇలాంటి అద్భుత శృంగార పదాల సృష్టిలో తాళ్లపాకవారికి తాళ్లపాకవారే సాటి. వారి భావకోశం నిండా మరునకూ, విరహులకూ, మరునిబలగాలకూ నడుమ జరిగే ఘర్షణలనూ, పర్యవసానాలను చిత్రించే భావ విన్యాసాలెన్నో ఉన్నాయి. దీనితో పోల్చి చూడదగిన పదమింకొకటి "తాళ్లపాక సంకీర్తనలు" సంపుటంలోనూ, రేకుల్లోనూ ఉన్నది. (చూ.కటకటా విరహులెక్కడ బ్రతుకగలవారు" - 196 సంకీర్తన, సంపుటము 6)

ఈ పదంలో మదన దర్పహరణ వృత్తాంత స్మరణంతోపాటు అతని బలగాలైన పున్నమరాజు-కళాహీనుడగుట; చలిగాలిని-పెనుపాము సమయించుట; చిలుక-పంజరములో చెఱబడుట వంటి సముచితములైన విశేషకథనాలూ ఉన్నవి. పెదతిరుమలాచార్యులవారి పాటలలో తమ తండ్రిగారి నుండి పుణికిపుచ్చుకున్న ఇలాంటి రచనా వినిర్మాణాలూ, శబ్దార్థాలంకారాల పోషణలూ పుక్కిలింతలుగా ఉంటాయి కూడా! ముద్రను బట్టి యిది వారి పాటే! దురదృష్టం చేత కొంత శైథిల్యానికి గురైంది. బ్రాకెట్లలోని పూరణలు పరిష్కర్తవి.

- వేటూరి ఆనందమూర్తి

178. నేరుపు కలుగు

సంకీర్తన: 108 　　　　　　　　　　　　　　　　　రాగం: శంకరాభరణం
వ్రాతప్రతి పుట: 108 　　　　　　　　　　　　　　　తాళం: అట

నేరుపు కలుగు వేళ - (నేము నే మనేము)
　　నేరమి నుండిన వేళ - (నీవె దిక్కనేము) ॥పల్లవి॥

(కరిణుల)తో పదివేల - గజములు కొలువగా
　　కరి నీకు యెపుడైన - మొరలు వెట్టెనా?
　　అతిముతి మకరిచే - ఆపద వచ్చిన వేళ
　　హరి! హరి! కావుమని - అపుడు దలచెను గాక ॥నేరుపు॥

(ఘనులు పాండవులతో) - కలసి యుండెడి నాడు
　　వెనుక ద్రౌపది తాను - (వేడెనా) మిమ్ము
　　(చెనటియై) కురురాజు - చీరె లొలిచేనాడు
　　వనజాక్ష!యని యపుడు - వగచి తలచెను గాక ॥నేరుపు॥

మును విభీషణు డన్న - చనవు గలిగిన నాడు
　　మనసున (నొకసారి - మరి తలచెనా మిమ్ము)
　　తన యన్న కోపమున - తలదన్నితే నాడు
　　నెనరు తోడుత దలచి - నిను గొలిచె గాక ॥నేరుపు॥

చుట్టమైన బంధువైన - స్రుక్కిన వేళల గాక
　　వట్టి మాటల నాడు - వారు మాకేల?
　　అట్టి శ్రీవేంకటేశుడు - ఆపద్బాంధవుడు గాన
　　గట్టిగ తా నభయ మిచ్చి - కరుణించె గాక ॥నేరుపు॥

ఈ నాల్గవ అధిక "పదము" (= చరణము) మీది సంకీర్తనములో ఆభోగ ముద్రాభాగమై చేరి యున్నది. మొత్తము మూడు చరణాలలోని కథాభాగము భాగవత, భారత, రామాయణేతివృత్తము కలదియగుట విశేషము. ఈ తాళ్లపాకవారి అముద్రిత సంకీర్తనము రాగతాళబద్ధమై, ఇందలి "చరణము" కూడా "పదము" అని "తిరుమల సంకీర్తన శిలాలేఖము"లో వలె, సంకేతితమై "వేంకట" ముద్ర కలిగి యుండుట గుర్తింపదగిన మరో విశేషము.

This is an unpublished new sankirtana of the Taallapaaka Comoposers retrieved from the 'TaaLLapaaka sankirtanalu' - 6609(SVORI), containing Raaga and taaLa with indications of 'Pa// ' for Pallavam(?), the Refrain and 'Padam" for 'CharaNam', the stanza. Please note the changes in nomenclature of the terms employed in the manuscript as found in the 1500 AD "Tirumala Music Inscription". (-) insertions are the Editorial amendments.

-Veturi Anandamurthy.

179. పట్టరాని వయసిన్ని

సంకీర్తన: 123 రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 122 తాళం: లుప్తము

పట్టరాని వయసిన్ని - పాట్ల బెట్ట
యెట్టు వేగించవచ్చునే - యింతియైన దీనికి ॥పల్లవి॥

వడవేఁకి గాగ గు-బ్బల మీది పయ్యెద
(నెడలించి గందమ్ము - నెదనలఁది ప్రియము
వడిన యా కల వీడి) - వచ్చి యీ నడురేయి
పడినదా విభు మీది - బాళి యెంతె దీనికి ॥పట్టరాని॥

గొంటరి కోవిలపోటు - కూఁతల ఘాతికి
గంటైన వీనులు - గడియ వేసుకొని
వొంటినే చప్పుడు సేయ -కూరకే వచ్చిన ప్రియ
మంటిన విభుని మీది - యాసెంతె దీనికి ॥పట్టరాని॥

(తావి)పూములుకులు - తాళంగ లేక
(తొవల) కౌఁగిటిజోడు - తోడు (చేసి)కొని
యేవేళనలమేల్మంగ - యెంతైన మానదు
శ్రీవేంకటవిభు మీది- చిత్తమెంతె దీనికి ॥పట్టరాని॥

నాయికకు ఆ శ్రీవేంకటవిభుని మీది గల నిండైన మెండైన ప్రణయ భక్తి ఇందుదహృతం!

- గంధం బసవ శంకరరావు

180. పట్టాభిరామయా

సంకీర్తన: 63 రాగం: ఘంటారవం

వ్రాతప్రతి పుట: 64 తాళం: లుప్తము

పట్టాభిరామయా – బాలపై దయ చాల
బెట్టి చేపట్లేల – యిట్టి జాగేల ॥పల్లవి॥

వలపు నిలువగనీదు – కలికి తాళగలేదు
చెలియ మిక్కిలి సాదు – సిలుగు పెట్టగరాదు
వెలది నీకును బోదు – వలదు సుమ్మీ వాదు
చలపట్టగా రాదు – తలపు నీకే మీదు ॥పట్టాభిరామ॥

నెలతకు నీరాని – (పలు) బాసలేలరా
కలకాలమును బోర – కలికిదె మేర
మెలుత దేబోర! తమి – దలచి బిరబిర రార
(వలచు) నీ సతి జేర – వలదా రతిని మీర ॥పట్టాభిరామ॥

వనజశరుడు మృగాంక – వదనను నలువంక
ననతూపులను గొంక – కను నేసి కింక
ననువున శ్రీవేంక – టనివాస! నీ యంక
మున నుంచి పంకజ – (ముఖి) నేలు మింక ॥పట్టాభిరామ॥

హనుమ రామ సంవాద పదమిది! ఏ హొయసల శిల్పసంపదలోని నగిషీ చెక్కడాన్నో గుర్తుకు తెచ్చినట్లైంది ఈ రచననలోని నిర్మాణ సౌందర్యము!

అది కవిప్రతిభ! అన్నమాచార్యాదుల హృదయ సౌకుమార్యము! ఆంజనేయుని వాగ్వైభవము! రామబాణాలవంటి సూటిమాటలు! మన భాషాసంస్కృతులమీది రామాయణ ప్రభావము!

'అపుడేమనె నేమను మనెను' అని ఆతురతతో శ్రీరాముడడుగగా, నమ్మినబంటు హనుమ 'తపమే విరహపు తాపమనె' అని బదులు పలికినట్లు అన్నమాచార్యులు ఒక పాటలో రాశారు. అది చాలక ఉద్విగ్నుడై 'యింకా నేమనె యింతి మఱేమనె' అని శ్రీరాముడు ఉత్సుకతను ఆపుకోలేక రెట్టించి అడుగుతున్న సన్నివేశంలో ఆ స్వామి హృదయాన్నెరిగిన ఆంజనేయస్వామి కవీశ్వరుని వాణిలో మనసు విచ్చి చెపుతున్నట్టుంది యీ పాట!

– వేటూరి ఆనందమూర్తి

181. పడుచ! (నీ) విప్పుడే

సంకీర్తన: 50 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 51

పడుచ! (నీ) విప్పుడే – (వలవంత గూర్చేవు
కడు ప్రోడవై యెంత – గాసి) సేసెదవో ॥పల్లవి॥

తలిరుబోణి! యిపుడె – మొలచె నింతలు చనులు
వెలయ ముందరి కేలె –విరిగేవే?
కొలదిలే కవి మీరి – కొండ లంతేసిగా
(చెలగిన) యపు డెంత – సేయగల దానవో ॥పడుచ!॥

చేడె! యిప్పుడె కురులు – తోడాయె నిదె జడకు
వేడుక వెనుక కేల – విరిగేవే?
[1]మోడు వీ డవి మీద – మోపరాని పాటిగా
గూడగల యపు డెట్టి – జాడ నుండేవో ॥పడుచ!॥

భామ! యిపుడు వేంకట – పతి చెట్టబట్టేవు
యీమారు [2]యిరుమేల[2] – నేల విరిగేవే?
ప్రేమ కడు మీరగా – పెచ్చుపెరిగిన రతి
సీమ నేలే యప్పు – డే మేర నుందువో ॥పడుచ!॥

ఈ సంకీర్తన మందలి యితివృత్తము అలమేల్మంగా శ్రీవేంకటపతుల ప్రణయ వృత్తాంతము. మంగాసమేతుడైన శ్రీనివాసుని శృంగార సంవాద మున్నది కనుక ఇది పెదతిరుమలాచార్యుల పదమని భావింతును.

అలనాటి ప్రబంధరీతిని సాగిన యీరచన కళాపూర్ణోదయకారునకు ప్రేరణ కలిగించిన ట్లున్నది. రచనలో తాళ్ళపాకవారికినీ, పింగళి సూరనకునూ గల సామ్యము ప్రసిద్ధమే! (చూ.నా సిద్ధాంత వ్యాసము –1965).

సూరనగారి “కూకటివేణితో కురులు గూడక మున్న కుచప్రరోహముల్/పోకలతోడి సామ్యమును పొందక మున్న ప్రసూనబాణు డ/ఱాకల బెట్టె” పద్యమున కీ సంకీర్తనము మూల మన దగి యున్నది.

– వేటూరి ఆనందమూర్తి

---

1. మోడువీడి = మొలకెత్తి, పెరిగి; **2.** ఇరుమేల = రెండువైపులా

182. పణతి(!) విరహపు

సంకీర్తన: 111 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 111

పణతి(!) విరహపు మహో - త్పాతంబు వలన
గణుతింప వలరాచ - కార్యమే మౌనొ (!) ॥పల్లవి॥

సఖియ! కుచము లనేటి - జమిలి యంగములపై
తెక తెకా నుడుకు (లె) - త్తిన గంధ మై పోయె (భౌమము)
ముఖచంద్ర మండలము - మొనసి పరివేషమై
యొక(ట) రెండు గ్రహో - లున్న వాలోన (అంతరిక్షము) ॥పణతి॥

కలికి! నిట్టూర్పు(లను) పెను - గాలి విసరగ మేన
ఝలు ఝల్లు (మంచును) - చమట వర్షము గురియ (అంతరిక్షము)
నిల రేయి కనుబొమ(ల) - యింద్రధనువులు బొడిచె (అంతరిక్షము)
కలహమున పగ(లె)చు - క్కలు రా(లె నాలోన) (దివ్యము) ॥పణతి॥

యిభగమన! నడురాజ్య - మెల్ల కరువై పోయె
నభము భువిసీమ పై - నను క(లియ) దాయె (భౌమము) ॥పణతి॥
విభుడైన శ్రీరమణి - వేంకటేశుని గూడె
గుభులు గుభులన నురిమి - గురిసె నాలోన

ఇందు నాయికా విరహమున కలిగిన దివ్య, అంతరిక్ష, భౌమములను త్రివిధ ఉత్పాతులు వర్ణితములు - ఇది సఖీ (కవి) ప్రియవాక్యముగా తోచుచున్నది. (పణతి! సంబుద్ధి. మ.పు. - గణుతింపవు - శ్రీరమణి విభుడైన వెంకటేశుని గూడెనని వాక్యాన్వయము)

This viraha shringaara sankeertana appers to be that of Annamacharya advising the Divine naayika to act suitably in view of the happenings of three types of Utpaata-s described, while describing Her beauty. Another good song for dance interpretation.

- Veturi Anandamurthy

183. పతి మాత్రమా

సంకీర్తన: 263 | రాగం: సౌరాష్ట్ర
వ్రాతప్రతి పుట: 250 | తాళం: జంపె

పతి మాత్రమా నా - (పాలి) దైవమితడే
అతనికిచ్చకముగా - నాడేనింతేకాక ॥పల్లవి॥

నీటున తానే యన్నియు - నేరవలెగాక, వెండి
మాటలాడవచ్చునా - మగవానిని
తేటచూపులనే - తెలుసుకోవలెగాక
తాటించి జంకించ - దగునా యిల్లాలికి ॥పతి॥

వలపులనె నా వద్దికిరా - వలెగాక
యెలయించవచ్చునా - యేలినవానిని
తళుకు నవ్వులనె - దయరేచవలె గాక
చలపట్టవచ్చునా - సరసురాలికిని ॥పతి॥

వాసివన్నె ప్రియాల - వడినలయుట గాక
గాసి సేతురా వేం - కటనాథుని
వోసరలేని రతుల - నోలలాడే దింతెకాక
చేసినదెల్ల చెల్లునా - సేసుకొన్నదానికి ॥పతి॥

ఈ సంకీర్తన తంజావూరు ప్రతిలోనూ కలదు.

ఈతడు పతి మాత్రమే కాదు, నా సర్వము (దైవము) అంటున్నది నాయిక! ముద్రను బట్టి చినతిరుమలాచార్యులవారి సంకీర్తన కావచ్చు.

- గంధం బసవ శంకరరావు

184. పనివినుము ఓ పన్నగశయన

సంకీర్తన: 152 రాగం: భూపాలం

వ్రాతప్రతి పుట: 149 తాళం: లుప్తము

పనివినుము ఓ పన్నగశయన – పాపాత్ముఁడు వీడనక
ఏనిక గాచేదే బిరుదయ్య – బృందారక మునివంద్య ॥పల్లవి॥

నిను సేవించగ నే నేర – నిలువెల్లా దబ్బర
మనమున భక్తి మరింతైనా లేదు – మదమత్సరములు చాలా
అనుదినమును సేసే పాపాలకు – నాదియు నంతము లేదు
నను నెటు రక్షించేవో – నగధర! నీ కృప నుంచీ ॥పని॥

ఉపవాస వ్రతములనే – (వు)సురు డాగ నే నోప
జప (తపముల) గొడ వెరుగను – జడుడను నల్బుడ, (నిన్నే)
నెపమున నైనా దలచ (ని) – నేరము లెంచక (మున్నీ)
యపరాధము సహించి కావు – మర్జునసారథి! నన్నును ॥పని॥

వేదశాస్త్ర (విధు) లెరుగను – వెతతో తిరుగుచు నుందును
సాదువులను సరకు (గొనక) – సర్వజ్ఞుడ నని యుందును
మోదముతో వెంకటరమణ! – మోసము సేయకు నను, నీ
పాదసేవకును (పనిగొను) – పరమదయాళో! నన్నును ॥పని॥

శరణంటే చాలు. అపారమైన స్వామికృప ఉంటే చాలు అన్నీ ఉన్నట్లే. అపరాధాలన్నీ మన్నించి వేంకటరమణుడైన అర్జునసారథి యీ రథాన్ని తానే నడిపి తరింపచేస్తాడని అంటున్నాడీ సంకీర్తనంలో తాళ్లపాక సుకవిశేఖరుడు.

– వేటూరి ఆనందమూర్తి

185. పరమయోగిని

సంకీర్తన: 10 రాగతాళములు లుప్తములు[1]

వ్రాతప్రతి పుట: 14

(పరమయోగిని శివా-ర్పణ బుద్ధిగాదిది)
తరుణి తాపము వింత - తపమాయగాని)[3] ॥పల్లవి॥[2]

విరహతాపముచేత - పొరలి పొరలిన వీడి
సరసంపునెరివేణి - జడగట్టెగాని
అరుదైన చింతతో - (నలయుచు)[4]ను దినదినము
సరసిజానన మేను - సగమాయగాని ॥పరమ॥

(కలకంఠిగళనీల - గరళమ్ము)[5] గాదిది
నలువైన నీలమణి - నాయకముగాని
తెలుపైన నిజభూతి - దేహంబు గాదిది
దళమైన కపురగం - ధపుపూతగాని ॥పరమ॥

తరుణ కోమల సు(ధా - కరురేఖ గాదిది)[6]
తిరువేంకటేశుఁ(డ-ద్దిన)[7] నఖము గాని
పరగంగ వైరాగ్య - భావంబు గాదిది
(వ)[8]ర వధూమణికి పర - వశమాయ గాని ॥పరమ॥

శృంగారవిరహ వర్ణనముగల సొగసైన కీర్తనమిది, తిరువేంకటేశ ముద్రను బట్టి అన్నమాచార్యులవారిదే. ఇట్టిదే హరిహరుల భేదసాదృశ్యాలనెంచే మరొక సుందర రచన ఈ వ్రాతప్రతిలో కలదు. (చూ.సంకీర్తన 281)

- వేటూరి ఆనందమూర్తి

---

1. రాగ, తాళములు లేవు; **2, 3** (లుప్త పూరణములు) **4.** నొలయుచును, **5.** నీలగళము గాదయంత; **6.** లుప్తము, **7.** డుదిదిన; **8.** ప.

186. పసగల ద్వారకా

సంకీర్తన: 28 | రాగం: లుప్తము

వ్రాతప్రతి పుట: 30 | తాళం: లుప్తము

పసగల ద్వారకా - బాలకృష్ణునిగూడి
(వస) దప్పి మీరేల - (వ)లచబొయ్యెదరో ॥పల్లవి॥

చిలుక లేలికచేత - శెలవు తీసుక వచ్చి
కలికితో సమరంబు - గావించగా
తిలకించి కంకణ - దీప్తి (మెఱయగ) జూచి
పలుక జాలక యేల - పారిపొయ్యెదరో! ॥పసగల॥

కో(వి)లలు తమలోన - గుంపు గుంపులు గూడి
ఆవ లీవల కయ్య - మందుకొనగా
ఆవేళ నీ వీణి - యను మీటి (శ్రుతి) సేయ
(చేవ) దప్పుచు నేల - చెదరి పొయ్యదరో! ॥పసగల॥

మదభృంగములు చేరి - మగువతో చల(పోరి)
పొదల మరుగున జగడ - మొనరించగా
ముదమలర బాల తన - మోము జూపగ (వెఱచి)
యెదురాడ లేకేల - బెదరి పొయ్యెదరో! ॥పసగల॥

నిండుచందురుడు తన - నెఱవై(న) వురవడిని
యండదండలచేత - నదరించగా
దండైన ఉరవీధి - తరుణి చూపిన యంత
కొండ మరుగుకు పోయి - గోడు కుడిచెదరో! ॥పసగల॥

ఈ తిరుపతి వ్రాతప్రతిలో (1949, 2005) మా పరిగణనమున ఉండియుండ వలసిన 28, 29 (చూ. అక్షర- 2005) సంఖ్యలుగల రెండు సంకీర్తనలు, వానిలోని పల్లవులూ, చరణాలూ కలగలుపులైపోయిన

కారణముగా, నిర్మాణ సౌభాగ్యమును కోల్పోయి, అయిదారు చరణాలుగాగల ఒకే ఒక 28 సంఖ్యగల వింతపాటగా వ్రాతప్రతి కెక్కినట్లు తోస్తున్నది. పరిష్కరణకు లొంగని యీ పాటను నిర్మాణదృష్టితో వివేచించి నేనిపుడు (2020) రెండు పాటలుగా గుర్తించి, అందదుకులుగా ఉన్న పల్లవులను, చరణాలను సాధ్యమైనరీతిని సరిచేసి చూపుతున్నాను. శిథిలరూపమునగల రెండవపాట రెండు చరణాల పాట కాబోలును! మార్పులలోని ఔచిత్యమును సరసులైన పాఠకులు గుర్తింపగలరని భావింతును!

వ్రాతప్రతిలో వీనికి రాగతాళములు లేవు. ఇందు 'వెంకట' ముద్ర కానరాదు. పల్లవిలోని 'ద్వారకా బాలకృష్ణుని' పేర రచన సాగినట్లున్నది. 28, 29 పాటలలోని పల్లవులు వ్రాతప్రతిలో తారుమారు లైనట్లున్నవి. పదనిర్మాణ దృష్టితో ఇందు సరిచేయబడినవి.

ఈ 28వ పాట 'కృష్ణపదము'' అగుటచేత ముద్రనుబట్టి యిది చినతిరువెంగళనాథుని (చిన్నన్న) రచనగా గుర్తింపబడుచున్నది. రెండు లేదా నాలుగు చరణాలుగల పాటలు తాళ్లపాకవారి సంకీర్తనలలో కొన్ని కలవు.

– వేటూరి ఆనందమూర్తి

187. పసిఁడి మెరపుతీగ

సంకీర్తన: 35 రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 36 తాళం: లుప్తము

పసిఁడి మెరపుతీగ భావమేమో - వో యక్కలాల
పఁడతి యొకతె మెలఁగుచున్నదే ॥పల్లవి॥

కమలమందు అరటి గాసెనే వో యక్కలాల
కామునింటి మీఁద గగనమే
రోమరేఖ పసిడికుండలే వో యక్కలాల
సోముకళలు నీలమేఘమే ॥పసిఁడి॥

పగడమందు కెంపు బుట్టె నే - వో యక్కలాల
పైని చందమామ తోఁచెనే
మిగులమంచి తెల్ల దామెరల - వో యక్కలాల
మించి యెఱ్ఱదనము గలిగెనే ॥పసిఁడి॥

యిరులబొదల తారలమరేనే - వో యక్కలాల
సరవి వింతల కలికి కూడఁగనే
సరసుఁడై శ్రీవేంకటేశుఁడే - వో యక్కలాల
(కరఁగి తా)నుపరతుల (గలియగనే) ॥పసిఁడి॥

ప్రహేళికారీతిలో చమత్కార గతులతో సాగిన సంకీర్తన.

– గంధం బసవ శంకరరావు

188. పాడరే పాడరే

సంకీర్తన: 222 రాగం: భూపాలం
వ్రాతప్రతి పుట: 211 తాళం: లుప్తము

పాడరే పాడరే – పాడి చూడరే, కుల – పావనియైన యీ పడుచును
ఆడరే చెలు – లందరును గూడుక – అలమేల్మంగనే పడుచును ॥పల్లవి॥

పాలవెల్లి దొలి – చూలు కూతురు – పసిడిబొమ్మ వంటి పడుచును
చాల ముత్తయిదువ – చందమామ – సైదోడైన పడుచును
వోలవోలా అని – జలధిలోపలి వొస – పరైనట్టి పడుచును
నీలవర్ణుని పాలి కీడుజోడైన – నెలత నీ ముద్దుల పడుచునూ ॥పాడరే॥

యేడేడు భువనమ్ములను నిల – బొమ్మరిండ్లుగా గట్టిన పడుచును
తోడునీడై తానె తొలుత బ్రహ్మండాలు – దొంతులు పెట్టిన పడుచును
యీడైన పడుచుల – నిందారి పెండ్లిండ్లు – (నేరుపడ) జేసిన పడుచును
వేడుక తో గూడి (యాడి) తమలో దామె – వియ్యాలనందిన పడుచును ॥పాడరే॥

కొండకూతురను గూడుక – తుంపెర్లు – గురియుచునుండేటి
నిండు నోములు నోచు – నెలతల కాపురాల్ – నిలువ బెట్టినట్టి పడుచును
కొండిక ప్రాయాన (కూడి) యలమేల్మంగ – కొడుకు తల్లైనట్టి పడుచును(?)
వెండియు రఘురాముడై – వెలయుచు శ్రీ–వేంకటేశ్వరుని పడుచును ॥పాడరే॥

కొడుకు తల్లైనట్టి పడుచును(?) – మదనజనని అనే అర్థంలోనా?

నీలవర్ణునికి ఈడుజోడైన నెలత, క్షీరాబ్ధికన్యకయైన పసిడిబొమ్మవంటి పడుచును, అలమేల్మంగను కీర్తించండి అంటున్నాడు కవి!

– గంధం బసవ శంకరరావు

189. పాయదు మదిలో నెప్పుడు

సంకీర్తన: 207 రాగం: నీలాంబరి

వ్రాతప్రతి పుట: 199 తాళం: లుప్తము

పాయదు మదిలో నెప్పుడు – ప్రతిబింబించిన రీతిని[1]
కాయము తన్మయ మాయనొ – (కాంతను దలచినను)[2] ॥పల్లవి॥

బొమముడిపాటును గనుగవ – [3](లమరిన తీరును), చెక్కిట
సమకొల్పిన (కేలును)[4]కడు – శ్వాసములో వణకున్
చెమటల దోగిన కుచములు – చిత్తములో తెగువయు గల
ప్రమదామణి పొలయలుకల – (భావపు చందములు)[5]. ॥పాయదు॥

వదలిన నీవియు నొక చే – వడిగొల్పిన క్రుమ్ముడి(యును)[6]
చెదరిన ముత్యపు సరులును – (చిక్కిన)[7] తనులతయున్
(కదలెడు పాదము లెడనెడ)[8] – గా (గప్పిన)[9] పయ్యెదయును
సుదతీమణి కోపముననను – జూచిన (మర్మములు)[10] ॥పాయదు॥

(వేడిన చనవులు చేకొని)[11] – విడనాడకు (న న్నెంతయు)[12]
(గాడగ కుచయుగ మురమున – గట్టిగ నూదుకొని)[13]
నేడీ నేరము (గాచితి)[14] – నిను బాయ(నులే)[15] కృష్ణా యని
వేడూర్పులు (నిగుడించిన)[16] – వెలదుక (మోదములు) ॥పాయదు॥

A = తిరుపతి తాళపత్రప్రతి – 21373 (పరిశీలింపదగిన పలువురు వాగ్గేయకారుల రచనలున్న గొప్ప సంకలనము).

B = శేషాచార్యుల వ్రాతప్రతి – 6609. ప్రముఖముగా తాళ్లపాక సంకీర్తనలుండియు ఇంతవరకూ అచ్చుకు నోచుకోని మరొక గొప్ప వ్రాతప్రతి).

1.B. ప్రతిబింబించెనొ లేదా; **2.A.** కామిని దెలుపగను; **3.A.** యును పుడమిని నీదు నీరు; **4.B.** చేయిని; **5.A.** భావము దెల్పగను, **B.** భావము లెప్పుడును; **6.A.** వొకచే; **7.A.** చిట్లిన; **8.A.** కన్యలనే పాదము లెడ, **B.** కదలెడు పదములు వెడ వెడ; **9.B.** గట్టిన. **10.B.** చందమును; **11.A.** వేడిన వరములు కొమ్మని; **12.A.** నన్నెప్పుడు; **13.A.** కాడుచు నురమున కుచమును గ్రక్కున గ్రుమ్ముచును; **14.A.** మరచితి; **15.A.** (ర); **16.A.** (నిగుడింపుచు);

ఈ పాటకు B ప్రతిలో రాగము పేరు లేదు. అంతేకాక యీ పాట B ప్రతిలో 206లో భాగమై కలిసిపోయి, (207 అంకెగల) విడిపాటగా గుర్తింపబడియుండలేదు.

'శ్రీకృష్ణ' పదమైన యీ తాళ్లపాక సంకీర్తనకు పాఠాంతర మనదగిన పాట యిది A ప్రతిలో 'నీలాంబరి' రాగమున కలదగుట ఇప్పుడు గుర్తించిన విశేషము.

క్రుమ్ముడి = కురులముడి, కొప్పు (శ్రీహరి నిఘంటువు)

కడcకతోcగూcతు క్రుమ్ముడిcగోసి

మాకు జడగట్ట మానక జారుండు

(బసవ–4–123 పుట).

– వేటూరి ఆనందమూర్తి

190. పుట్టక తొల్లె యెన్ని నేర్చినావే

సంకీర్తన: 288 — రాగం: ఆహిరి

వ్రాతప్రతి పుట: 272 — తాళం: అట

పుట్టక తొల్లె యెన్ని నేర్చినావే – పువ్వుబోణిరో నీవు
నెట్టన నీ పతి గారవించితే – నేలకు మింటికి సూత్రపట్టేవు[1] ॥పల్లవి॥

పూ(సి)న దే మంటే మృగము పేర – పొందిన పరి(మ)ళ మంటివి[2]
వా(సి)గ నీ పేరేమనంటే, దశవదనుని – వైరినే నంటివి[3]
మీ(సీ)మ యేదంటే రెండు మాకులపేర – మెరసిన పట్టణ మంటివి[4]
వో(సె)మ్మ! నే జెల్ల, నీవు నీ వుపమలు! – (వోపినంత చూడమంటివి)[5] ॥పుట్టక॥

కమ్ము(క) నీ మేన నున్న దేమనంటే – గగనము పేరిటి దంటివి[6]
(కొమ్మరో! యాపైనున్న వేమంటే – కొండలే కను మంటివి)[7]
రొమ్ము మీద చిలికించిన దే మనంటే – (ఋ)తువు (పేరంటివి)[8]
(చిమ్మనగ్రో వదేల నంటే – చిమ్మి రేగ మంటివి)[9] ॥పుట్టక॥

తృతీయ చరణము వ్రాతప్రతిలో లుప్తము. అందులోని భాగమేమో “కన్నది విన్నది గాదు” అను వాక్యాంశము మాత్రమే స్థలాంతరమున ఉన్నది. పూరణము సాధ్యము కాదు.[10]

---

1. నేలకు నింగికి తాళముల్వేయుట; నేలకు మింటికి సూత్ర పట్టుట. ప్రాచీనకవి ప్రయుక్తములైన తెలుగు పలుకుబడులు. భూమ్యాకాశాలను ఒక్కటి చేయుట, బంధించే సంరంభము కావించుట అను అర్థము స్ఫురించును; **2.** పునుగుపిల్లి లేదా కస్తూరి మృగము సంబంధము కల పరిమళమని భావము. సహజగంధము గల పద్మినీజాతి స్త్రీ అని ధ్వని. **3.** శ్రీరాముడని సూచన, భర్త పేరు చెప్పరాదన్న సంప్రదాయము చొప్పున; **4.** గుంటూరు సీమకు చెందిన రెంటచింతల వంటి గ్రామ నామమేదేని కావచ్చును. మంగళగిరి, గుంటూరు సీమతో చి.తి.కి సంబంధమున్నది; **5.** (–) లుప్త పూరణములు పరిష్కర్తవి. తరువాతి వార్తలు సామ్యాలకు సంబంధించినవని సూచన. **6.** శూన్యమైనదని “నడుము”నకు సూచన; **7.** (–) లుప్త పూరణ వాక్యము తాళ్లపాకవారి భావకోశము (స్కిమేటా)కు సంబంధించి అనుకూలమైనట్టిదే. (ప్రకృతిలో సహజముగ కొండలు దిగువన, ఆకాశము ఎగువన ఉండగా స్త్రీ వర్ణన విషయమున అవి తారుమారులైనవని కవి భావనలోని చమత్కారము. శూన్యమైన నడుము – కొండల వంటి ఉరము క్రిందుమీదు లైనవనియు; ముందుగా పొద్దు పొడువ వలసి ఉండగా పగటి

ప్రకాశము గల ముఖము ముందుగాను – చీకటిరాత్రి వంటి తురుము వెనుకగాను అయి ముందు వెనుకలైనవని స్త్రీని వర్ణించే పట్టున మరొక సంకీర్తన తాళ్లపాక వారిదే కలదు; **8.** "వసంత" మని సూచన. ఇది కాలమునకు సంబంధించినది; **9.** (–) సందర్భమును బట్టి చివరిపాద మిట్లు పూరించుటైనది; **10.** ఇట్టి ప్రహేళికలనదగిన రచనలు చి.తి.సంకీర్తనలలో కలవు. కాని ఇందు మూడవ ముద్రాచరణం లుప్తమగుట చేత కర్తృత్వ నిర్ణయముకానీ, పూరణముకానీ సాధ్యము కాదు. లుప్త చరణమును పూరించుట సాధ్యము కాదు కనుక విడచిపుచ్చుటైనది. కానీ ఇది కూర్పును బట్టి చి.తి. సంకీర్తనగా భావిస్తున్నాము.

I want to place on record here, the opening pages of "TaaLLapaaka Sankirtanalu" theTP family preserved text, introduced to the literary world for the first time in 1949 by Gurudev VPS by quoting some songs in his introduction to 'Anamaachaarya Charitra' (1949), which have also become very popular. Infact this book of songs which is the most important source text now available for research, has unfortunately become the cruel target of utter neglect by scholars for unknown or unverified reasons.

Now we are wanting to re-introduce the same which contains more than 288 new songs along with certain other compositions retrieved from repositories like TMSSML(TNJ) & SRC, IGNCA, (BLR) with a critical projection, thanks to the MOC's TNF Scheme, courtesy of SVORI, Tirupati and the enormous public interest generated.

- Veturi Anandamurthy

191. పుట్టుభోగీంద్రుడే

సంకీర్తన: 79 రాగం: ఆహిరి
వ్రాతప్రతి పుట: 80 తాళం: లుప్తము

పుట్టుభోగీంద్రుడే - పులకోర్వఁడిక రావె
నెట్టన నీపతి (కి - నీకు) మొక్కెదను ॥పల్లవి॥

తెలిమల్లిమొగ్గ మ - ట్టెలగంటు లేని పో
ట్లుల రమణుని మేను - పులిపులియై
కలికి! నీ చనుదోయి - గజనిమ్మ పండ్లకా
కలగాని మానదా - కాయంబు నొవ్వి ॥పుట్టు॥

పమ్మిపుప్పొడి నెరసు - పడి యెర్రనై కన్ను
దమ్ములను నల నీరు - గమ్మె నేడు
కొమ్మ నీ మైమరపు - కోకావియద్దు లే
తెమ్మబడు కన్నులకు - తెరపియౌ గాని ॥పుట్టు॥

పెలుచరేయెండ నే - బెగడుకొని నాయకుడు
తలకొన్నవెతలచే - దప్పిదీర
నలమేలుమంగ శ్రీవేంక-టాధీశ వడదీర
పొలచు నధరంపు క - ప్పుర వీడెమీవె ॥పుట్టు॥

ఆవి = తాపము, వేడి

వివిధ శృంగార ఉపచారములతో స్వామిని సేవించమని నాయికకు ఉద్బోధ చేస్తున్నాడు కవి!

- గంధం బసవ శంకరరావు

192. పులుకడిగినయట్టి

సంకీర్తన: 218 రాగం: పంతువరాళి

వ్రాతప్రతి పుట: 207 తాళం: ఉప్తము

(ఈ సంకీర్తన 17వ సంపుటంలో 506వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 94)లో రాగం శ్రీరాగం)

పులుకడిగినయట్టి పురుషోత్తముఁడు వాఁడె
యెలమి నారతులు మీరెత్తరే దేవునికి ॥పల్లవి॥

గొప్పయింద్రనీలాల కొండ మంచు గప్పినట్టు
నెప్పు మింట పాలవెల్లి నెరసినట్టు
విప్పు నీలమేఘముపై వెన్నెల గాసినయట్టు
కప్పురధూళిమేనఁ గప్పిరి దేవునికి ॥పులు॥

నిండు నైరావతముపై నీలిజగ గప్పినట్టు
వెండిమేడపైఁ జీఁకటి విడిసినట్టు
పుండరీకపుఁగొలను పొరిఁదేం ట్లాగినట్టు
మెండగు తట్టుపుణుఁగు మెత్తిరి దేవునికి ॥పులు॥

అదె నల్లఁగలువలన కరువు లుండినట్టు
మెదిగి కస్తూరిభూమి మేరు వున్నట్టు
యెదుట శ్రీవేంకటేశుయెద నలమేల్మంగను
గుదిగుచ్చి సొమ్ములెల్లా గుప్పిరి దేవునికి ॥పులు॥

పెదతిరుమలాచార్యులవారి అభిషేక సంకీర్తన! గొప్ప గొప్ప పదబంధాలతో, ఉపమలతో ఆ శ్రీవేంకటేశ్వరుని మజ్జనమును వర్ణిస్తున్నారు పెదతిరుమలాచార్యులవారు.

– *గంధం బసవ శంకరరావు*

193. పెనఁగకురే మీరింత

సంకీర్తన: 69 | రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 70 | తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 17వ సంపుటంలో 29వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 5)లో రాగం సామంతం)

పెనఁగకురే మీ రింత ప్రియునితోఁ బలుమారు
తనకు నిచ్చయినవేళ తలఁపు గలిగీని ॥పల్లవి॥

వలచి యలిగిన యలుక వడిఁ దేర్చవచ్చుఁ గాక
వొలసి నొల్లని యలుక లొకరి వశమా
మెలఁగి నిద్రించు విభుని మేలుకొలుపవచ్చుఁ గాక
తెలిసి వుండిన నిదుర తెగి లేపవశమా ॥పెనఁగకురే॥

చనవుగలిగినమాట చవిసేయవచ్చుఁ గాక
మనసు లెనయనిచోట మరుప వశమా
వినరే యాఁకటిపతికి విందు చెప్పవచ్చుఁ గాక
తనిసివుండినయపుడు తమ రేఁచ వశమా ॥పెనఁగకురే॥

పాయరాని చుట్టరికము పట్టిపెనఁగవచ్చుఁ గాక
కాయకపు వావులకుఁ గలయ వశమా
యీయెడల శ్రీవేంకటేశుఁడిటు ననుఁ గూడె
చాయలనాతనిమేలు జవకట్ట వశమా ॥పెనఁగకురే॥

ప్రియుని పలుమార్లు వేడవద్దని, ఆతనికి ప్రీతి కలిగినపుడే అనుగ్రహిస్తాడనే భావన నాయికది!

– *గంధం బసవ శంకరరావు*

194. పొడగంటిమయ్య మిమ్ము

సంకీర్తన: 51 రాగం: శంకరాభరణం

వ్రాతప్రతి పుట: 52 తాళం: అట

(ఈ సంకీర్తన అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుట 21లో ఉదాహృతం)

పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా, మమ్ము
నెడయకవయ్య కోనేటిరాయఁడా ॥పల్లవి॥

కోరి మమ్ము నేలినట్టి కులదైవమా, చాల
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు
చేరువఁ జిత్తములోని శ్రీనివాసుఁడా ॥పొడగంటి॥

భావింపఁ గైవసమైన పారిజాతమా, మమ్ము
చేవదేరఁ గాచినట్టి చింతామణీ
కావించి కోరిక లిచ్చే కామధేనువా, మమ్ము
తావై రక్షించేటి ధరణీధరా ॥పొడగంటి॥

చెడనీక బ్రదికించే సిద్ధమంత్రమా, రోగా
లడఁచి రక్షించే దివ్యౌషధమా
బడిఁబాయక తిరిగే ప్రాణబంధుఁడా, మమ్ము
గడియించినట్టి శ్రీవేంకటనాథుఁడా ॥పొడగంటి॥

బడిబాయక (ఎన్నడు విడిచిపెట్టక) తిరిగే ప్రాణబంధువును కీర్తిస్తున్నాడు కవి! ఇంకా స్వామివారిని తమ కులదైవంగా, పెద్దలు అందించిన ధనంగా, దప్పికను తీర్చు కాలమేఘంగా, చిత్తములో కొలువైన దేవునిగా, చేతనున్న పారిజాతంగా, రక్షించే చింతామణిగా, కోరికలిచ్చే కామధేనువుగా ఆధారభూతుడైన ధరణీశుడిగా, తప్పుదోవన బడకుండా కాపాడే సిద్ధమంత్రంగా, భవ, భౌతిక రోగాలను రూపుమాపే దివ్యౌషధంగా స్వామివారిని ఆచార్యులవారు కీర్తిస్తున్నారు. ఈ పాట అన్నమయ్య సంకీర్తనగా ప్రసిద్ధమైననూ, పెద్దలిచ్చిన నిధానముగా పేర్కొనుటద్వారాను, ముద్రనుబట్టి చినతిరుమలాచార్యులవారి కీర్తనయూ కావచ్చును.`

– గంధం బసవ శంకరరావు

195. పొద్దుబోదా నీకు నేమి

సంకీర్తన: 244 రాగం: శంకరాభరణం

వ్రాతప్రతి పుట: 233 తాళం: లుప్తము

పొద్దుబోదా నీకు నేమి - పురుషోత్తమా, మేలు
సిద్దవిద్య లాడేవు - శ్రీపురుషోత్తమా! ॥పల్లవి॥

పట్టిపట్టి యాడేవు పడతుల కుచములు - పుట్టచెండా నీకు పురుషోత్తమా!
దొట్టిన వేడుక రొమ్ము దొక్కి యిందరుండగాను - చిట్టకములు మానవైతి శ్రీపురుషోత్తమా!
॥పొద్దు॥

లలనకెమ్మోవులకు గుక్కిళ్లు మింగేవు - పులకండమా నీకు పురుషోత్తమా
వెలలేని భూకాంత వీపెక్కి వున్న - దెవ్వరి చెలి మీద చేయి చాచేవు శ్రీపురుషోత్తమా!
॥పొద్దు॥

కావరించి యింతుల పులకల తావులు గొనేవు - పూవు దండలా నీకు పురుషోత్తమా!
చేవ నన్ను గూడితివి శ్రీవేంకటనాథుడవై - శ్రీవధూటినా నీకు పురుషోత్తమా
॥పొద్దు॥

జానపదశైలిలో సాగిన ఈ సంకీర్తన ముద్రను బట్టి చినతిరుమలాచార్యులవారిది! భూకాంత ఆ స్వామి వీపుపై కొలువైయున్నదట! స్వామి వక్షస్థలాన లక్ష్మి, శిరసున తులసి, వీపున భూదేవి కొలువై ఉంటారని కదా ప్రతీతి!

- గంధం బసవ శంకరరావు

196. పొద్దువోకలివి నీకు భువిలో

సంకీర్తన: 158 రాగం: ముఖారి

వ్రాతప్రతి పుట: 155 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 275వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 77)లో రాగం ముఖారి)

పొద్దువోకలివి నీకు భువిలో నెన్నఁగ నీ
సుద్దులు చెప్పెదమన్న చూడఁజూడఁ గొత్తలు ॥పల్లవి॥

మోఁతనీటిలోని యీఁత మూఁపునఁ బుట్టిన[1] మేఁత
మూఁతిమీఁది కత్తికోఁత మొనగోరివాఁత[2]
బాఁతిలేని దారవోఁత పాపముచూడనిచేఁత
నాఁతిమీఁది తలపోఁత నాఁగేటిగీఁత ॥పొద్దు॥

వలపు చల్లినలాగు వాజినెక్కినబాగు
వలసి నొల్లములైన వలవనిజాగు
తెలిసితిమిదెనేఁడు తిరువేంకటేశ్వర
తలఁపు ప్రాణులమీఁదఁ దగులుటేలాగు[3] ॥పొద్దు॥

ఇందు దశవతార సమన్వయం గలదు.

ఓ తిరువేంకటేశ్వరా! నీ చేష్టలు (సుద్దులు) చూడ చూడ కొత్తలయ్యా అంటూ దశావతారాలను వెల్లడి చేస్తుంది నాయిక.

1. మోత నీటిలోని యీత = మత్స్య
2. మూపున బుట్టిన మేత = కూర్మ
3. మూతిమీది కత్తికోత = వరాహ
4. మొనగోరివాత = నరసింహ
5. బాతిలేని దారవోత = వామన
6. పాపము చూడని చేత = పరశురామ
7. నాతి మీది తలపోత = రామ
8. నాగేటి గీత = బలరామ
9. వలపు చల్లినలాగు = బుద్ధ
10. వాజినెక్కిన బాగు = కల్కి.

– గంధం బసవ శంకరరావు

---

1. నిడు రేకు 88: బెట్టిన, తా.వేం 155: మోఁత **2.** నిడు రేకు: వ్రాఁత **3.** దగిలేటి లాగు.

197. పొలతి జవ్వనముపైఁ

సంకీర్తన: 224 రాగ తాళములు లుప్తములు[1]

వ్రాతప్రతి పుట: 213

(ఈ సంకీర్తన 24వ సంపుటంలో 8వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 1402)లో రాగం మాళవి)

పొలతి జవ్వనముపైఁ - బయ్యకపూచె యీ తలఁపు[2]
దెలియలే (రీతరి) యిం - దుల కేమి[3] సేతామె ॥పల్లవి॥

సతి చి(ంతా)లతలను - సంపెంగ పువ్వులే (పూచె)[4]
మతి విరహము మేన - మల్లెలు పూచె
అతని నా తలపోఁత[5] - నడవి జాజులుపూచె
యీతరి దెలియలే - రిందుల[6] కేమి సేతామె ॥పొలతి॥

తొయ్యలి చెమట నీట - దొంతి తామెరలెపూచె
కొయ్యచూపు నటనలఁ[7] - గుంకుమపూచె
కయ్యపు వలపులఁ జేఁ - కటిమాకులేపూచె
యియ్యెడ దెలియ - రిందుల కేమి[8] సేతామె ॥పొలతి॥

మగువరతుల నిట[9] - మంకెన పువ్వులేపూచె
మొగిఁ గొనగోళ్లనే - మొగలిపూచె
పొగడు[10] శ్రీవేంకటేశు - పొందులఁ గ్రోవి[11] పూచె
యిగురుబోణులార - యిందుల కేమిసేతామె ॥పొలతి॥

---

1. రేకులో ఈ పాట మాళవిరాగమున కలదు (చూ. 24-8) పరిష్కర్త లీపట్టున వ్రాతప్రతిలోని పాఠభేదములను స్మరింపలేదు. **2.** పొలిఁతి జవ్వనమునఁ బూవకపూచె (ముద్రిత పాఠము). **3.** యెలమి విందుకు మనమేమి (ముద్రిత పాఠము) **4.** (పూచె) వ్రాతప్రతిలో లుప్తము **5.** అతనుని తలఁపోఁత (ముద్రిత పాఠము) **6.** హితవు దెలియదిక (ముద్రిత పాఠము). **7.** కొయ్యచూపుఁ గోపముల (ముద్రిత పాఠము) **8.** నియ్యెడఁ జెలియ భావమేమి (ముద్రిత పాఠము) **9.** లోన (ముద్రిత పాఠము). **10.** పొగరు (ముద్రిత పాఠము). **11.** గప్రము (ముద్రిత పాఠము).

ఈ పాటలో అంతటను పూవుల విషయమున్నది గనుక 'కుంకుమ'(పూవు) పూచె', 'గ్రోవిపూచె' అను పాఠములు సరసములని తోచును. ఈ సంకీర్తన రేకులో ఉన్నప్పటికీ, వ్రాతప్రతి పాఠాన్నే ముద్రణను స్వీకరించాము.

- వేటూరి ఆనందమూర్తి

198. పొలతి మా చెలి యనుచు

సంకీర్తన: 269 రాగం: సౌరాష్ట్ర

వ్రాతప్రతి పుట: 255 తాళం: లుప్తము

పొలతి మా చెలి యనుచు – బొగడే మిపుడు నీ
తలపులో లెస్సగా – తలపోసి చూడు ॥పల్లవి॥

కోడె జక్కవలు మా – కొమ్మ పాలిండ్లతో
యీ దనగవచ్చు; నొక – యింత కడమ![1]
కూడి వీడుట వాని – గుణము; వీనికి నెపుడు
కూడుటలే కాని మరి – వీడుటలు లేవు ॥పొలతి॥

[2]గొనబు బేడిసలు మా – కోమలి కనులతో
[3]నెనయంగ వచ్చు; నొక – యింత కడమ!
[4]జునిగి పెనగుట వాని – [5]సూటి; వీనికి నెపుడు
జునుగుటలే కాని మరి – [6]పొనుగుటలు లేవు ॥పొలతి॥

[7]యెలమి వేంకటపతి – (యీ) కలకంఠితో
నిల జోడనగ వచ్చు [8](నొక) – యింత కడమ!
[9]బలిసి పొలియుట వాని – బాగు; (పొలతి)కి నెపుడు
[10]బలియుటలే కాని – పొలియుటలు లేవు ॥పొలతి॥

పెదతిరుమలాచార్యులువారి యీ సంకీర్తన భావనలో స్వభావసిద్ధమైన లేశభేదమే కాని నాయికా నాయకు లిరువురును సర్దుకుపోగల సరిజోడులే అని సఖీ(కవి)వాక్యార్థము. చక్కని నిర్మాణ సౌష్టవముగల యీ శృంగార సంకీర్తనలో కవివాక్కులోని భావ సౌకుమార్యమును సహృదయులు భావించగలరు.

---

1. కడమ = కొఱత; **2.** గొనబు బేడిసలు = సొగసైన బేడిసజాతి చేపలు; **3.** ఎనయంగవచ్చు = సరిపోలవచ్చు; **4.** జునిగి = జంకుతో ఒదిగి; **5.** విధానము; **6.** పొనుగుట = కుంగుట; **7.** ఎలమి = వికాసము; **8.** (వచ్చు నొక) **9.** బలిసి పొలియుట = విజృంభించుట, శమించుట వాని స్వభావము; **10.** బలియుటలేకాని = పొలతికి సదా మార్దవ వికాసమే కాని సంకోచము లేదనుట.

తొలి రెండు చరణములోని యీ అభివ్యక్తి సౌకుమార్యమును, దిగువ పేర్కొన్న మరొక ప్రౌఢ కవి వాక్కుతో పోల్చి చూడవచ్చును.

'వ్రాలని నీ చన్నులతో/ వ్రాలెడి జక్కవలు సరియె; వలలం బెట్టన్/

జాలెడి నీ కన్నులతో /బాలకి! సదృశములె వలల బడు మత్స్యంబుల్". (క్రీడాభిరామం)

మీది శృంగారసంకీర్తనలోని భావసౌకుమార్యము చోళశిల్ప సౌందర్యమువలె సహజమైనది కాగా పద్య శిల్పము హొయసల శిల్పవిన్నాణమును బోలినది!

In this unpublished shringaara sankirtana of Peda Tirumalacharya, the poet describes the divine beauty of the Nayika's eyes, bosom and the pairing nature of the couple.

Usually breasts are compared with chakravaka birds. The comparison is not acceptable cause, the upamaana pair of birds occasionally meet and get separated, whereas the upamEyaa-s remain together for ever.

Similarly, the beautiful eyes of the Nayika can never be compared with BEDisa type of fish which frequently clash unlike the sight of the Naayika which remains constantly focussed on the Lord divinity.

The Lord (VEnkaTa) is hard in His actions, but the Lady (kalakanThi) is always sweet and soft.

- Veturi Anandamurthy

199. పొసగంగా చెలినదు(మది)

సంకీర్తన: 221 రాగ తాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 211

పొసగంగా చెలినదు(మది) - పోలగనెటులుండె
నెసగ నాకాశమ్మే - యిల తెగిపడినట్లుండె ॥పల్లవి॥

అరయగ నీ కమ - లాననకు నయనము
లొరసి యెన్నికకు నెటు - లుండె (దిలకింప)
ధరపై చంద్రో - దయమునకై కలువలు
చిరతరమ్ముగ వేచి - వికసించినటులుండె ॥పొసగంగా॥

అల(లి)వేణి వలిపె ప - య్యదలోని కుచములు
మలగిన చెలి చెలిమి - చెలువ మెటులుండె
సలిలతములైనట్టి - జక్కవ పులుగులు
చెలగి సన్నని వలను - జిక్కినటులుండె ॥పొసగంగా॥

(అరయ) నలమేల్మంగ వేంక - టాధీశుకౌగిట
నరిగాపు సేయగా - నది యెట్టులుండె
నెరయంగ గప్పిన - నీలమేఘము పొంత
(మెరసి మినుకను) తీగ - మెఱపువలె నుండె ॥పొసగంగా॥

ప్రకృతిని నాయికలో ప్రత్యక్షం చేసిన సంకీర్తనం "ఏమని పొగడుదుమే యింక నిను ఆమని సొబగుల అలమేల్మంగ" (18-538) కోవలోనిదే ఈ సంకీర్తన కూడా.

- గంధం బసవ శంకరరావు

200. పోఁబొయ్యే పడుచ!

సంకీర్తన: 84 రాగం: ఘంటారవము

వ్రాతప్రతి పుట: 84 తాళం: ఉప్తము

పోఁబొయ్యే పడుచ! - వుండవే మాట చెప్పేను
పో వోయి వగకాఁడ! నీకు - పొద్దుపోక తిరిగేవు ॥పల్లవి॥

తలమీద తుమ్మెదలున్నవి ద - గ్గర వచ్చిన రేఁచీనే
తెలియగ కురులింతె గాని - తేటిగములు కావోయి
చలమున పయ్యెదలోపల - జక్కవలనే బెట్టేవే
బలిమిగల నా గుబ్బలింతె గాని - పక్షులు గావోయి ॥పోఁబొయ్యే॥

పదనైన నీ యధరాన దొండ - పండున్నది నాకియ్యవే
పెదవింతే కాని నా - యధరానను బింబఫలము గాదోయి
వదరకువే నీ మేను కుందనము - బంగారొరసి నే జూచేనే
పొదలిన నా మేనింతె కాని - పుత్తడి గాదోయి ॥పోఁబొయ్యే॥

నిచ్చలమగు నీ చెక్కుటద్దముల - నీడలు నే జూచేనే
మెచ్చుగ నా చెక్కులింతే గాని - మెఱుగుబిళ్లలు గావోయి
అచ్చుగ శ్రీవేంకటనాథుడనై - అతివ నిన్ను గూడితిని
ముచ్చట దీరెను మొగి నిల - మ్రొక్కే నీకు పోవోయి ॥పోఁబొయ్యే॥

నాటకీయముగ సాగిన సంవాదపదము. ముద్రను బట్టి యిది చినతిరుమలాచార్యుల రచన కాదగును.

- వేటూరి ఆనందమూర్తి

201. పోయే నన్న - పోనీఁడమ్మ

సంకీర్తన: 259 రాగం: సౌరాష్ట్ర[1]

వ్రాతప్రతి పుట: 248 తాళం: లుప్తము

పోయే[2] నన్న - పోనీఁడమ్మ
పాయక నన్ను కొంగు - పట్టీ వీఁడు ॥పల్లవి॥

యెదురైతే మొక్కీ వీఁ - డెవఁడమ్మ
అదనెరఁగఁడు - యౌనే వీఁడు ॥పోయే॥

మగనాల[3] నన్న - మానఁడమ్మ
నగీ నేడ[4]నైనా - నాతో వీఁడు ॥పోయే॥

యింతలో శ్రీవేంక - టేఁశుఁడమ్మ
వింతసేసి కూడె - (వేమారు)[5] వీఁ డు ॥పోయే॥

ముద్రనుబట్టి, వ్రాతప్రతి రాగాల కూర్పునుబట్టి, ఇట్టి వొకటి రెండు పదాలు తాళ్లపాకవారి పదములుగానే కానవచ్చినా, మొగనాలు, ఆరుదూరైతి (228), వింత వస్తువులేమియు వేడుక నా కొసంగవు (82) వంటి ప్రయోగ వైఖరులు ఇతరుల రచనలేమో అనిపింపజేసినా, ఇదమిత్థమని చెప్పదగిన ముద్రావిభేదములిందులేవు. పైగా పెదతిరుమలాచార్యులవారిదిగా గుర్తింపదగిన పద మింకొకటి (262) ఈ రీతికి సమర్థకముగా నున్నది.

- వేటూరి ఆనందమూర్తి

---

1. సౌరాష్ట్ర రాగాల వరుసలోగల శృంగార పదమిది. రెండేసి పాదాలతో సాగిన రచన. **2.** పొయ్యే
3. మొగనాల **4.** నెడ **5.** నెమో

202. భామ శృంగారించు భావమే

సంకీర్తన: 195 రాగం: శ్రీరాగం

వ్రాతప్రతి పుట: 187 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 13వ సంపుటంలో పీఠిక (పుట 7)లో కేదారగౌళ రాగంతో, ఝంపె తాళంతో ఉదాహృతమైనది)

భామ శృంగారించు భావమే యందము ॥పల్లవి॥
కాముని రతిపాట కాంతకీలాగు ॥అనుపల్లవి॥

పూవొకటి వికసించె పున్నమచంద్రునివలె పూమీద మరిరెండు పూలుబూసె
రెండుపూవుల నడుమ పూసెనొకపువ్వు పూవుకింద ముప్పదిరెండు పూమొగ్గలెత్తె ॥భామ॥

పక్షియొక్కటివ్రాలె భద్రేభమనగాను పక్షిమీదను రెండుపక్షులాయెన్
రెండుపక్షుల నడుమనే వ్రాలెనొకపక్షి పక్షితో జోడుగా పలికెనొకపక్షి ॥భామ॥

చిగురెత్తునే రెంటి చెందామరోయనగ చిగురుమీదను రెండుచిగురులెత్తెన్
చిగురుబోణియింట శ్రీవెంకటేశుడు చిగురులోపలితేనె చెలగి చవిజూచెన్ ॥భామ॥

భామ శృంగారభావమే అందమట! అది కాముని రతిపాట యట! చెన్నపురి వీణ రామానుజయ్య అను పండితుడు 1912లో ప్రకటించిన 'సంగీత సర్వార్థసారసంగ్రహము' గ్రంథం నుండి ఈ సంకీర్తనను ఉద్ధరించి శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు తాళ్లపాక పదసాహిత్యం, సంపుటం 13 పీఠికలో ప్రకటించారు.

– *గంధం బసవ శంకరరావు*

203. భూషణము లవి యేటి

సంకీర్తన: 150 రాగ తాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 148

భూషణము లవి యేటి - భూషణములు
భూషణము లన నిజ - భూషణము(లే)గాక ॥పల్లవి॥

దానమే భూషణము - దనరు హస్తములకు
మానమే భూషణము - మనుజులకును
పూనికతో శాంతమే - భూషణము యోగికిని
మానినికి పతిభక్తి - మంచి భూషణము ॥భూషణము॥

కమలాక్షు జూచుటే - కన్నులకు భూషణము
శమగుణమె భూషణము - సాధులకును
విమలమగు గురుభ(క్తి) - వెలలేని భూషణము
కమలము(లె) జలములకు - కడు భూషణములు ॥భూషణము॥

నెట్టుకొని రాజులకు - నీతియే భూషణము
(గట్టులే యేరులకు) - గల భూషణములు
గట్టిగా(నె)పుడు వేం-కటనాథు పాదములు
పట్టుటే భూషణము - ప్రాణులకును ॥భూషణము॥

వేంకటనాథ ముద్రగల చినతిరుమలాచార్యుల సంకీర్తనమిది. పల్లవి యెత్తుగడలోనే భర్తృహరి సుభాషితాన్ని గుర్తుచేస్తున్నది - (కేయూరాణి న భూషయంతి పురుషం) అలాగే తొలి మలి చరణాల్లో భర్తృహరిని, పోతన్నను (దానేన పాణిర్నతు కంకణేన / కమలాక్షు నర్చించు కరములు కరములు), మూడవ చరణాంతంలో ఆళ్వారాచార్యుల మాధవ పాదసేవనాన్నీ, శరణాగతి తత్వాన్నీ, (అవధీరిత శారదారవిందౌ చరణౌ తే మరణేపి చింతయామి/ బ్రహ్మ కడిగిన పాదము), ఇలా చరణాల్లో వారి వారి పోలికలు, వీరు వీరి పాటల్లో, దండిగా కనిపిస్తాయి. ఇట్టిదే కన్నడమున శ్రీపాదరాయలవారి పాట కలదు.

- వేటూరి ఆనందమూర్తి

శ్రీపాదరాయల రచన

సారంగ రాగము ఝంపె తాళము

భూషణకె భూషణ ఇదు భూషణ
శేషగిరివాసా శ్రీవర వెంకటేశ ॥పల్లవి॥

నాలిగ్గె భూషణ నారాయణ నామ
కాలిగె భూషణ హరియాత్రెయు
ఆలయకె భూషణ తులసి వృందావన వి
శాల కర్ణకె భూషణ విష్ణుకథెయు ॥భూషణకె॥

దానవే భూషణ ఇరు హస్తంగళిగె
మానవే భూషణ మానవరిగె
జ్ఞానవే భూషణ మునియోగివరరిగె
మానినిగె భూషణ పతిభక్తియు ॥భూషణకె॥

రంగనను నోడువుదే కంగళిగె భూషణ
మంగళాంగగె మణివ శిర భూషణ
శృంగార తులసిమణి కొరళిగె భూషణ
రంగవిఠల నిమ్మ నామ అతి భూషణ ॥భూషణకె॥

తెలుగు అనువాదం - ఆచార్య వేటూరి ఆనందమూర్తి

అందమున కందము యిది యందము
అహిశైలవాస శ్రీవరవేంకటేశ ॥పల్లవి॥

నాల్కకగు నందము నారాయణుని పేరు
కాలికి యందము హరియాత్రలె
ఆలయపు టందము తులసి బృందావనము
చాల యందము చెవికి విష్ణుకథలు ॥అందమున॥

దానమే యందము యిరు చేతులకును
మానమే యందము మానవులకు
జ్ఞానమే యందము మునియోగివరులకు
మానినికి యందము పతిభక్తియె ॥అందమున॥

రంగడిని చూచుటయె కనుల కగు నందము
మంగళాంగుని గొల్చు తల యందము
శృంగార తుళసిమణి కుత్తుక కందము
రంగవిఠల నీదు పేరెంతొ యందము ॥అందమున॥

(భూషణము అంటే నగ, నగ ధరిస్తే అందముగా ఉంటుంది కదా, అందువల్ల భూషణ అనే పదాన్ని అందము అనే అర్థములో అనువాదము చేసినాను. **– వేటూరి ఆనందమూర్తి**)

ಶ್ರೀಪಾದರಾಜರ ಕೃತಿಗಳು

ಶಿಲ

ರಾಗ : ಸಾರಂಗ ತಾಳ : ಝಂಪೆತಾಳ

ಭೂವಣಕೆ ಭೂಷಣ ಇದು ಭೂಷಣ
ಶೇಷಗಿರಿವಾಸ ಶ್ರೀ ವರ ವೆಂಕಟೇಶ

ನಾಲಿಗ್ಗೆ ಭೂಷಣ ನಾರಾಯಣ ನಾಮ
ಕಾಲಿಗೆ ಭೂಷಣ ಹರಿಯಯಾತ್ರೆಯು
ಆಲಯಕೆ ಭೂಷಣ ತುಲಸಿ ವೃಂದಾವನ ವಿ
ಶಾಲ ಕರ್ಣಕೆ ಭೂಷಣ ವಿಷ್ಣುಕಥೆಯು

ದಾನವೇ ಭೂಷಣ ಇರುವ ಹಸ್ತಂಗಳಿಗೆ
ಮಾನವೇ ಭೂಷಣ ಮಾನವರಿಗೆ
ಜ್ಞಾನವೇ ಭೂಷಣ ಮುನಿಯೋಗಿವರರಿಗೆ
ಮಾನಿನಿಗೆ ಭೂಷಣ ಪತಿಭಕ್ತಿಯು

ರಂಗನನು ನೋಡುವುದೇ ಕಂಗಳಿಗೆ ಭೂಷಣ
ಮಂಗಳಾಂಗಗೆ ಮಣಿವ ಶಿರ ಭೂಷಣ
ಶೃಂಗಾರ ತುಲಸಿ ಮಣಿ ಕೊರಳಿಗೆ ಭೂಷಣ
ರಂಗವಿಠಲ ನಿಮ್ಮ ನಾಮ ಅತಿ ಭೂಷಣ

204. మంచి వయసు కాలము

సంకీర్తన: 148 — రాగం: దేసాక్షి

వ్రాతప్రతి పుట: 146 — తాళం: అట

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 204వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 36)లో రాగం దేసాళం)

మంచి వయసుకాలము మాయతో నేమరి వుండి
పంచేంద్రియసుఖము పాలాయె బ్రదుకు ॥పల్లవి॥

ముదిసే కాలమునాఁడు మోక్షము సాధించే నంటా
మదించి నూరేండ్ల ముది మది దప్పును
కదలలే కంతటను కన్నుల పొరలు గప్పి
అదెవ్వ రిదెవ్వరంటా నడుగుచు నుండును ॥మంచి॥

జవ్వనపాయము వోఁగా సన్యాసి నయ్యే నంటాను
నవ్వుతానే నరసి వణఁకఁ జొచ్చును
చివ్వన నెముక వంగి చేత నూఁతకోల వట్టి
వువ్విళ్లూర నెంగిలిలో నోలలాఁడఁ జొచ్చును ॥మంచి॥

యింక మీఁదట శ్రీవేంకటేశ్వరు సేవించే నంటా
సంకె లేక వుండఁగాను సత్వవోవును
అంకెల వీఁడు వెట్టియైనా నంతరాత్మగాన
మంకు దేర నీమాటకే మంచిగతి వెట్టుము ॥మంచి॥

కాలం మీరిన పిమ్మట అంతటా వ్యర్థమే! జవసత్వాలున్ననాడే శ్రీవేంకటేశ్వరుని సేవించవలెను.

– గంధం బసవ శంకరరావు

205. మంచివాడ వౌదువు

సంకీర్తన: 9 రాగం: గౌడిపంతు

వ్రాతప్రతి పుట: 13 తాళం: లుప్తము

మంచివాడ వౌదువు - [1]మలగ నియ్యను నిన్ను
వంచనలచే యింతుల - వలపింతు నీవు ॥పల్లవి॥

(చరణములు 1, 2, మూడవ చరణమున ప్రథమార్ధము లుప్తములు)

నాటకములు చాల - నటియించి నీవు, వేం
కటగిరి నేతౌట - వేడ్క యయ్యీని ॥మంచి॥

ఇందు పల్లవి, ఆభోగ చరణార్ధభాగము మాత్రమే కలవు. ఇట్టి శిథిల రచనలు ప్రాచీనము లనుటకు సంకేతములు.

- వేటూరి ఆనందమూర్తి

---

1. ఈ పదబంధము "మలగునియ నిన్న" అగునా?

206. మందగమన నీదు

సంకీర్తన: 15 రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 18 తాళం: లుప్తము

మందగమన నీదు - మది నెట్టులున్నదో
యిందుకంటె మేలు - యీపెరూపు ॥పల్లవి॥

చందురుని పొడుపులో - జవరాలిమోములో
అందమేదీ యని - యడిగేవే
చెందినాకుఁజూడ - చెలియ నీవిపు డెన్న
యిందుకంటే మేలు - యింతిమోము ॥మందగమన॥

యేనుగ నడుపులో - యెలనాగ నడుపులో
(అలర శ్రీవేంకటపతి) - నలయించి
(యెలయించి రతిగతుల - నెద నదిమి) నన్ను
కలసి కూడితి (వింకఁ - గడమే లేదు) ॥మందగమన॥

అలమేలు దానవో - (అలమేలు మంగవో)
(అలర శ్రీవేంకటపతి) - నలయించి
(మెలయించిన రతిగతుల - నెదనదిమి) నన్ను
కలసి కూడితి (వింకఁ- గడమే లేదు) ॥మందగమన॥

శ్రీవేంకటపతిని అలయించిన అలమేల్మంగ రూపు వర్ణితం!

- గంధం బసవ శంకరరావు

207. మగcడని యాలని

సంకీర్తన: 99 రాగం: కేదారగౌళ

వ్రాతప్రతి పుట: 99 తాళం: లుప్తము

మగcడని యాలని - మరపిన దైవము
పగలు రేయి నే - ర్పరిచె నొకో ॥పల్లవి॥

పెదవుల నమృతము - పెట్టిన దైవము
నిదురలు కంటికి - నేర్పెనొకొ
యెదురై చూడగ - నిచ్చిన దైవము
కదియ(ని) వీనుల - (గావించి) నొకో ॥మగcడని॥

నిగ్గులు నిలువున - నిల్పిన దైవము
సిగ్గుల నేటికి - జేసెనొకో
వొగ్గిన తావుల - నొసcగిన దైవము
సిగ్గరి వెరపేల - (జేసె)నొకో ॥మగcడని॥

సమరతి నామని - సలిపిన దైవము
చెమటల జడేల - చినికె నొకో
అమరిన శ్రీవేంక - టాచలనాథుడు
గమకపుదైవమై - కవిసెనొకో ॥మగcడని॥

పగలు, రేలు సాగే దాంపత్యంలోని సమరతి ఇందు వర్ణితమేమో?

ఈ సంకీర్తనములోని భావం సందిగ్ధము.

- వేటూరి ఆనందమూర్తి

208. మగల మగువల

సంకీర్తన: 133 రాగం: ముఖారి
వ్రాతప్రతి పుట: 131 తాళం: లుప్తము

మగల మగువల బొ - మ్మలవోలె నాడించె
చిగురు గైదువ వాని - చేతలిటువంటివి ॥పల్లవి॥

సతియు గడునేర్పున - గత చెప్ప వెరగంది
పతియు నూకొనకున్న - భావంబు వేరై
యతనిపై నలగి చ-య్యన నవ్వలి మోమై
అతివె పల్కకుయున్న - నలిగె నాతడును ॥మగల॥

కలకంఠి పలికిన - కత దలచి పులకింప
చెలువు సోకగ వేరె - చెలువయని తలచగా
గలుగు మైపులకలని - కాంత యవ్వల జరుగ
వెలది చలమును జూచి - విభుడును జరగేను ॥మగల॥

మునుదా బలుకు కత - ననురక్తిని గణింప
ఘనుడు శ్రీవేంకట వి-భుని భావంబు గని
ననుచు పరవశముగా - దని తెలిసి పంకజా
నన జూచి నాయకు - డును మరలి కూడేను ॥మగల॥

అభ్యాసగీతము వలెనున్నది, కళాపూర్ణోదయమును తలపించుచున్నది.

- వేటూరి ఆనందమూర్తి

209. మగువలు చూడరమ్మా

సంకీర్తన: 138 రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 136 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 17వ సంపుటంలో 514వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 95)లో రాగం బౌళి)

మగువలు చూడరమ్మా మరుఁడు సేసినమాయ
యిగిరించెఁ జక్కఁదన మేమి చెప్పేదే ॥పల్లవి॥

కందులేని చందురులోఁ గలువరేకులు వుట్టె
అందులోనే మల్లెదండ లవి మించెను
కందువఁ గమ్మర నవే కాయజునియమ్ము లాయ
యిందుముఖిచెలు వింక నేమి చెప్పేదే ॥మగువలు॥

ఆకసముమీఁదఁ గొండ లాదరువు లేక పుట్టె
ఆకడ నాపొంతఁ దీగె లవి మించెను
కైకొని యా తుదలనే కమలము లుదయించే
యీకాంత భావ మిది యేమి చెప్పేదే ॥మగువలు॥

పాయపుమెఱుఁగు దీగెఁ బగడపు బండు వండె
చాయ శ్రీవేంకటపతి చవిగొనెను
మోయుచు నిద్దరిలోన ముత్యాలవాన వుట్టే
యీయతివసొబ గింక నేమి చెప్పేదే ॥మగువలు॥

మన్మథుడు చేసిన మాయలను పెదతిరుమలాచార్యులవారు వర్ణిస్తున్నారు.

– గంధం బసవ శంకరరావు

210. మత్సేంద్ర కూర్మరజతాచల

సంకీర్తన: 90 రాగం: మాళవగౌళ

వ్రాతప్రతి పుట: 91 తాళం: లుప్తము

శ్లో॥ మత్సేంద్ర కూర్మరజతాచల సింగినాదం
(మ్రో)డాహల స్ఫటికబంధ వామభాగం
శ్రీరామచరణ తారకమంత్ర సిద్ధం
గోరొక్కనాథ ....
అంజనాచలనిధి యోగి - శైయోగి
కంకణకింకిణి శంకాలంకృత
శంకరనుతురే వేంకటనాధురె ॥ఆహో॥

కాళీదేహానాళీతాపత్రయకేళీ
నయనవిశాల యోగిరే (?)
శంకుసింగినాథురే సితకర్పూరభూతి యోగిరే
ఆహో అలమేల్మంగ సారంగ
అంగరుప్రియతుకాళింగ మర్దనురే ॥ఆహో॥

ఈ వ్రాతప్రతిలో 89, 90, 91 పాటలు మూడూ అందదుకులుగా ఉన్నవి. 9, 10 శతాబ్దులలో మహారాష్ట్ర ప్రాంతం నుండి తెలుగుదేశానికి వ్యాపించిన నవనాథసిద్ధుల సంప్రదాయానికి చెందిన యితివృత్తమిందున్నట్లున్నది. మత్స్యేంద్రనాథ, గోరక్షనాథ, జాలంధరనాథ, రేవణ, నాగనాథాదులు, నవనాథులు. తిరుమలమీది శ్రీవేంకటాద్రినాథుడు కూడా గోరక్షనాథుడైన శ్రీకృష్ణుడే! దత్త సంప్రదాయమునకు చెందిన భక్తితత్త్వ సమన్వయమును తాళ్లపాక సంకీర్తనకారులీ పదాలలో భావించినట్లున్నారు.

ఈ సంకీర్తనకు సంబంధించి డా॥ తాడేపల్లి పతంజలిగారి పరిష్కృత పాఠాలను ఇదే సంపుటం పుట 39, 40లలో చూపితిమి.

- వేటూరి ఆనందమూర్తి

211. మదనజోగి వచ్చె

సంకీర్తన: 103 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 103

మదనజోగి వచ్చె - మధుమాసవేళ - మధుపానము జేసి, యో
సుదతులార విరలేశుని జూపరో - జూటరి బాధల పడరాదు ॥పల్లవి॥

పుప్పొడిమై భూతిబూసినవాఁడె-పువ్వులలాతము ముట్టినవాడె
వొప్పుచెంగల్వ తూపులనేయువాడె - వొగిసింగినాదమూదినవాడె
కప్పురపుటుండ్ల (గళ)మాలికల వాడె - కమ్మని చెందమ్మి గంధంపు వాడె
కుప్పళించెడి (మేని)కెంపుగ్రొంజాయవాడె - క్రొంజివురు కుచ్చుల కూర్చుబొంతవాడె
॥మదన॥

మంచి గొజ్జంగి కామాక్షులవాడె - మరియల్లిపూసంకు మెడగట్టినవాడె
సంచుల నల్లని (కంచుకము) వాడె - చారుకుచకు మొక్కినవాడె
కొంచెపుటూర్పుల (కొలుచు)పట్టెవాడె - కులికేటి పావాల (గిలకల వాడె)
కొంచెముగాని కళల కొదలేటివాడె - (కొదలేని) చందమామ ఘుటికలవాడె
॥మదన॥

అలవాటైన రతియంత్రములవాడె - ఆసల తమకించు యక్షిణి వాడె
అలపుసొలపులేమి అరయనివాడె స - కలవిద్యల జూపగడిగిన వాడె
(లలి)తలపులింద్రజాలము బన్నువాడె - వాలుగన్నుల వేడ్క వరుసల వాడె
చెలి శ్రీవేంకటాచలపతి గూడి - సిరి (వేంకటనాథుడన బరగిన వాడె) ॥మదన॥

మధుమాసవేళల మన్మథమాసం శ్రీవేంకటేశ్వర సమన్వితం!

- గంధం బసవ శంకరరావు

212. మదనునితల్లికి మంగళం

సంకీర్తన: 274 రాగం: సౌరాష్ట్ర

వ్రాతప్రతి పుట: 260 తాళం: ఏక

మదనునితల్లికి మంగళం – మదగజగమనకు మంగళం ॥పల్లవి॥

కంజదళాక్షికి కప్పురగంధికి – మంజులవాణికి మంగళం
మంజరికుచకును మధుకరవేణి(కి) – మంజులపదకును మంగళం ॥మదనుని॥

ఇందువదనకు(ను) ఇభరిపుమధ్యకు – మందస్మితకును మంగళం
కుందరదనకును గురునితంబ, కబ్జ – మందిర కెపుడు(ను) మంగళం ॥మదనుని॥

అంగనామణికిని అంబుజపాణికి – మంగళపతికిని మంగళం
రంగుగ వేంకటరమణుని యలమే – ల్మంగకు నెప్పుడు మంగళం ॥మదనుని॥

ఇది శేషాచార్యులవారి కాగితపు వ్రాతప్రతిలోని సుందరమైన మంగళం. ఇది ఆడువారి మంగళ గీతాలలో తప్పకుండా ప్రచారంలోకి రావలసిన పాట. ప్రత్యేకించి "అలమేల్మంగా సమేత శ్రీవేంకటరమణ" అనే ముద్ర కలిగి ఉండటం చేత ఇది పెద తిరుమలాచార్యులవారి పాట.

రెండేసి పాదాలతో కూడిన మూడు చరణాలూ, అందులో సగమైన ఏకపాదం పల్లవిగా ఉండటంచేత తాళ్లపాకవారి "సంకీర్తన లక్షణం" ప్రకారం ఇది ఒక శిఖా పదం. మామూలుగా తాళ్లపాకవారి సంకీర్తనలన్నీ చతుష్పాద చరణాలు మూడూ, పదసమానమాన పాదయుగ్మం గల పల్లవితో కూడుకొని ఉంటాయి. ఈ వ్రాతప్రతిలోని మరో విశేషం తాళ్లపాక వారివే ఇంకా పలువురి సంకీర్తన రచనలు. (ప్రసిద్ధులైన పదకవిత్రయం వారివే కాక, చిన తిరుమలాచార్యుల వారివీ, వారితోపాటు ఆయన తమ్ములైన మరి నలుగురు వాగ్గేయకారుల రచనలు కూడా దాగి ఉన్నాయనే నా పరిశోధనలో తేలుతున్న అంశం.

ఎందుకంటే చినతిరుమలాచార్యులతో కూడుకున్న వారి అన్నదమ్ములైదుగురూ కూడా "పంచకల్ప తరువులు" గానూ, వాగ్గేయకారులు గానూ ప్రసిద్ధికెక్కినవారే!) లాలి, జోల, మంగళం, చిందు, ద్విపద వంటి విభిన్న ప్రక్రియలకు చెందినవీ, వేరు వేరు ముద్రలు కలవీ, అచ్చుపడినవీ, కానివి అన్నీ వెరసి ఇంచుమించు 289 పాటలదాకా ఉన్నవి. ఇవే కాక తిరుపతి, చెన్నై లైబ్రరీలలోనూ వారివే మరికొన్ని పరిశీలించవలసి ఉన్నవి.

– వేటూరి ఆనందమూర్తి

213. మదము దొలఁకెడి

సంకీర్తన: 155 రాగం: సామంతం[1]

వ్రాతప్రతి పుట: 152 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 54వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 9)లో రాగం సామంతం)

మదము దొలఁకెడి యట్టి మంచి వయసున మనకు
తుదలేని వేడుకలు దొరకుటెన్నఁడురా ॥పల్లవి॥

ఉదుటుఁ జనుదోయి నీవురముపైఁ దనివార-
నదిమి మోమును మోము నలమి యలమి
వదలైన నీవితో వాలుఁగన్నుల జంకె-
లొదవ నీ మీఁద నే నొరగుటెన్నఁడురా ॥మదము॥

కలికితనమునఁ నాదు కప్పురపుఁ దమ్ములము
కులికి నీ వదమునఁ గుమ్మరించి
పలచనగు గోళ్ల నీ పగడవాతెర నొక్కి
చెలువమగు నునుగంటి సేయుటెన్నఁడురా ॥మదము॥

గరగరని కురులతో కస్తూరివాసనలు
విరితావులతోడ విసరఁగాను
తిరువేంకటాచలాధిపుఁడ నినుఁ గూడి నే-
నరమరచి సదమదము[2]లౌట[2] యెన్నఁడురా ॥మదము॥

తుదలేని వేడుకలు (నిజమైన, శాశ్వతమైన) ఆనందాన్ని అపేక్షిస్తున్నది నాయిక!

– గంధం బసవ శంకరరావు

---

1. తంజావూరి ప్రతి. కాంభోజి, జంపె తాళం **2.** తంజావూరి ప్రతి. సదమదంబౌట

214. మదిలో మెదలెడి పతికిని

సంకీర్తన: 1 రాగం: లుప్తము

వ్రాతప్రతి పుట: 3 తాళం: లుప్తము

[1](మదిలో మెదలెడి పతికిని - యెదలో నొదిగిన సతివై
ముద మొందుచు కలికీ! స-మ్మోదము గూర్తువుగా) ॥పల్లవి॥[2]

చలమున నేరాయని యర - జారిన పయ్యెదతోడను
తొలఁగక యెదపై నొరగుచుఁ - దుందుడు కారఁగను
చిలుకకు బింబము నిచ్చే - చెలుపున నీ యధరమ్మును
తలఁపునఁ దమిఁ [3]జనులొత్తుచు - దయతో నిత్తువుగా ॥మదిలో॥

కొసరినను నేరా యని - కూరిమి దైవారగను
ముసిముసి నగవుల వెన్నెల - మోమునఁ గాయఁగను
వొసపరి కోయిలకును చిగు- రొసగిన వడి దోపగను
పసగల వీడెపు మడుపులు - పైకొని యిత్తువుగా ॥మదిలో॥

చనవున వెంకటపతి కను - [4]చెనకిన నేరా యనినను
మనమున మచ్చిక బాగులు - మమతల విరిగొనగా
గొనబౌ [5]జక్కవ పిట్టకు - కోరిక [6]నకరువు లిడు క్రియ
ననవిల్తుని [7]కజ్జాయము - నయమున నిత్తువుగా ॥మదిలో॥
(ఇది నాయికతో సఖి పలికిన వాక్యము)

ప్రాచీనతకు సంకేతములైన లుప్త శిథిలభాగములనుబట్టి ఇట్టి సంకీర్తన పాఠములు కొన్ని అన్నమాచార్యుల రచనలుగా భావింపనగుచున్నవి. ప్రాచీన తాళపత్ర వ్రాతప్రతులలో శైథిల్యమునకు గురైన వారి రచనలిట్టివి మరికొన్ని కలవు (చూ. అహోబలమఠ స్థాపనమహోత్సవమునాటి నా అధ్యక్షప్రసంగవ్యాసమున చర్చించిన నవనారసింహుల పాటను గూర్చిన విశ్లేషణము) ఇందు రాగతాళములతోపాటు పల్లవికూడ లుప్తమైనది. పదనిర్మాణవైఖరిని బట్టియు, పదకవుల భావకోశమును బట్టియు బ్రాకెట్లలో సూచించబడిన యిట్టి లుప్తపూరణము లందలి యౌచిత్యమును సహృదయులు భావింపగలరు. ఈ వ్రాతపతిలో అక్కడక్కడ గురుదేవులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పరిశీలించి తమ దస్తూరీలో సూచించిన చక్కని పాఠసూచనలున్నవి. (ఉదా: "తమి ససిలొత్తుచు-దమి జనులొత్తుచు" ఇట్టిదే)

- వేటూరి ఆనందమూర్తి

---

1. బ్రాకెట్లలోని అంశములు వ్రాతప్రతిలో లుప్తములు; **2.** లుప్తము; **3.** తమి సను లొత్తుచు; (వ్రాతప్రతి) **4.** కనుచెకిన (వ్రాతప్రతి) **5.** పొజ్జక్కన పిట్ట (వ్రాతప్రతి) **6.** నకరవువిడు (వ్రాతప్రతి) **7.** కెంజాయము (వ్రాతప్రతి)

215. మన చేతగావు

సంకీర్తన: 193 రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 186 తాళం: లుప్తము

(మన) చేతగావు యీా – మర్మంబులు
తనుదానె సమకూర్చు – దైవికము కాదె ॥పల్లవి॥

సరసిజానన మేన – సారెకును సారెకును
కురువేరు మరువములు – గురియగాను
మరుని చమరింపులకు – మకరందమార్గమై
తరితీపు సేసినది – దైవికమె కాదా ॥మన॥

అలివేణి (ముఖ)మున – అప్పటి నప్పటికి
కలువలును తామెరలు – క్రమ్ముకొనగా
మలయమారుతములను – మత్తభృంగములను
తలలెత్తజేసినది – దైవికమె కాదా ॥మన॥

మగువ తుదకన్నులకు – మాటికిని మాటికిని
మృగమదము జవ్వాది – మించగాను
తెగువనంతటిలోన – తిరువేంకటేశ్వరుని
తగులుగా జేసినది – దైవికమె కాదా ॥మన॥

"వలదన నొరులకు వసమటవే
తలచినట్లనె దైవము సేసె" (1–1) సంకీర్తనలోని భావకోశమే ఈ సంకీర్తనలో కూడా ద్యోతకమవుతుంది!

– గంధం బసవ శంకరరావు

216. మనసిచ్చునో మనసియ్యదో

సంకీర్తన: 190 రాగం: శంకరాభరణం
వ్రాతప్రతి పుట: 183 తాళం: అట

మనసిచ్చునో మనసియ్యదో - మాదే భారమా? నీ
మనసు రాజేయకున్నను - మాదే భారమా? ॥పల్లవి॥

ఆపె నిన్ను నొకటి సేయ - నోపిన వారమింతె గాక
మాపటి యౌగాములకును - మాదే భారమా?
వోపిక నిద్దరి మనసులు - నొకరొకరి వింతె గాక
మాపై పందెము వేసే వదియును - మాదే భారమా? ॥మనసిచ్చునో॥

అంచగమనకును నీకు - నంటు చేసేమింతె గాక
మంచము మీది సుద్దులకును - మాదే భారమా
మించిన వేడుకల ర-మించుకోవలె గాక
మంచితనము లేకున్ననదియు - మాదే భారమా? ॥మనసిచ్చునో॥

ముదితకు నీకు వియ్య - ములుచేసే మింతె గాక
మదిలోని కపటములకును - మాదే భారమా
యిదిగో శ్రీవేంకటేశ! - యింతి నీవు గూడుకొని
మది పరవశమందుటయు - మాదే భారమా? ॥మనసిచ్చునో॥

నాయికా నాయకుల మనసులు కలసి పరవశమందుట ఇతివృత్తము.

ఔగాములు = మంచిచెడ్డలు, జరుగబోవు పరిణామాలు.

- గంధం బసవ శంకరరావు

217. మనములోని విభుఁడు

సంకీర్తన: 25 రాగం: శ్రీరాగం

వ్రాతప్రతి పుట: 27 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 6వ సంపుటంలో 57వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 51)లో రాగం నాదరామక్రియ)

మనములోని విభుఁడు మఱవఁడే కాలంబు
నినుఁగలయనున్నాఁడు నీకేలె వెఱవ ॥పల్లవి॥

నెలనాళ్లవాఁడొకఁడు నిర్మలంబైన రె
న్నెలలవాఁడొకఁడు మూన్నెలలవాఁడొకఁడు
నెలలు పండ్రెండైన నిజబాలుఁడొక్కండు
నెలఁత యింతటి పనికె నీకేలె వెఱవ ॥మనము॥

ప్రొద్దుపొడుపుల దొకటి ప్రొద్దు గ్రుంకుల దొకటి
ప్రొద్దుప్రొద్దులకు రహిపొయ్యేటి దొకటి
పొద్దెఱింగిన దొకటి పొద్దెఱుంగని దొకటి
నిద్దంపుఁ బువ్వులకు నీకేలె వెఱవ ॥మనము॥

నిండుఁ జంచల మొకటి నిమిషమాత్రము దొకటి
వుండి నట్లనె వుండి వుడి వోవునొకటి
కొండలలో నెలకొన్న కోనేటిరాయండు నీ
నిండుఁ గౌఁగిటఁ గూడె నీ కేలె వెఱవ ॥మనము॥

కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు మనములోని విభుడట! ఆతడు నీవాడైనపుడు నీకు ఏల చింత అని నాయికకు హితవు పలుకుతున్నాడు కవి!

– గంధం బసవ శంకరరావు

218. మాదృశానాం

సంకీర్తన: 173 — రాగం: ముఖారి

వ్రాతప్రతి పుట: 169 — తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 1వ సంపుటంలో 325వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 63)లో రాగం ముఖారి)

మాదృశానాం భవామయదేహినాం
యీదృశం జ్ఞానమితి [1]యేఽపి న వదంతి ॥పల్లవి॥

వాచామగోచరం వాంఛాసర్వత్ర
నీచకృత్యైరేవ నిబిడీకృతా
కేచిదపి వా విష్ణుకీర్తనం ప్రీత్యా
సూచయంతో వా శ్రోతుం న సంతి ॥మాదృశానాం॥

కుటిలదుర్బోధనం కూ(కు?)హకం సర్వత్ర
విటవిడంబనమేవ వేద్మ్యధీతం
పటువిమలమార్గసంభావనం పరసుఖం
ఘటయితుం కష్టకలికాలే న సంతి ॥మాదృశానాం॥

దురితమిదమేవ జంతూనాం సర్వత్ర
విరసకృత్యైరేవ విశదీకృతం
పరమాత్మానం భవ్యవేంకటానామ-
గిరివరం భజయితుం కేవా న సంతి ॥మాదృశానాం॥

కష్ట కలికాలంలో భవములో కూరుకుపోయిన మానవుల వైనాన్ని, దైన్యాన్ని ఆచార్యులవారు వర్ణిస్తున్నారు!

– గంధం బసవ శంకరరావు

---

1. ఈ వాఙ్మయమున 'యత్, కిం' శబ్దముల ప్రయోగము శాస్త్రరీతిగా లేదు.

219. మానుమన్న మానదమ్మ

సంకీర్తన: 200 & 283 రాగం: ఆహిరి
వ్రాతప్రతి పుట: 193 & 268 తాళం: అట

మానుమన్న మానదమ్మ, చిన్న
దానసే నీమేలు - దానసే ॥పల్లవి॥

తమి పరిమళములు - చెమరీసే
చెమరిన గుబ్బలు - నిమిరీసే
నిమిరిన కౌగిట - అమరీసే
అమరిన రతులకు - తిమిరీసే ॥మానుమన్న॥

ఆసతొ నామేను - డాసీసే
డాసి చాల బత్తి - చేసీసే
చేసి చెక్కిట గోర - వ్రాసీసే
వ్రాసి పోకముడి - దీసీసే ॥మానుమన్న॥

లాలించి ననుజూచి - సోలీసే
సోలి కంతుని కేళి - దేలీసే
తేలి తియ్యనిమోవి - గ్రోలీసే
గ్రోలి శ్రీవేంకటేశు - డేలీసే ॥మానుమన్న॥

ఇందలి ముక్తపదగ్రస్తాలంకారము సుందరము. ఇట్టివే మరి కొన్ని గీతములు ఆలంకారికముగా కూర్చినవి కలవు.

ముక్తపద గ్రస్తాలంకారం లౌకిక వాఙ్మయానికి అలౌకికమైన అందాన్ని కూరుస్తుంది. అదే దివ్య శృంగార విషయంలో అయితే అందంతోపాటు అలౌకిక మహానందాన్నీ సమకూరుస్తుంది. తాళ్లపాక పెదతిరుమలా చార్యులు ఇలాంటి సంకీర్తన పదాలను కూర్చడంలో దిట్ట. జానపద రీతిని ఒక దరువుగా, నాయికా వాక్యంగా, సాగిన పాట యిది.

- వేటూరి ఆనందమూర్తి

220. మాయలేలనయ్య

సంకీర్తన: 135 | రాగం: పంతువరాళి

వ్రాతప్రతి పుట: 133 | తాళం: లుప్తము

మాయలేలనయ్య మార పంచసాయక, దయ
సేయవయ్య శ్రీవేంకటనాయక ॥పల్లవి॥

తేనెసోన పొదరింటిలోన
పూని మదన పరవశాన
మానవతియున్నది నెయ్యాన, అను
మానమేల యేలుము నియ్యాన ॥మాయలేల॥

మంతనాన తమ్మికొలని చెంత
యింతింతనరాని వలవంత
కాంతయున్నది నిజ మింత,
వింతలేల యేలుము శ్రీమంత ॥మాయలేల॥

ప్రతి పాదంలోను ఆద్యంతప్రాసలున్నవి, యక్షగానాలలోని దరువులు వలె!

– వేటూరి ఆనందమూర్తి

221. ముద్దుగారీ నమ్మ

సంకీర్తన: 271 రాగం: సౌరాష్ట్ర

వ్రాతప్రతి పుట: 257 తాళం: లుప్తము

ముద్దుగారీ నమ్మ - మోహనమురారి[1] పెద్ద
బుద్ధులును భువినెందుఁ - బుట్టనట్టి సుద్దులును ॥పల్లవి॥

చిన్నారి వదనమును - జిగి చెక్కులును సోగ
కన్నులు వెడదయౌనురము - కంబుకంఠము
వున్నతపునాసికము - వుంగరపు నెరులును
క్రొన్నన వంటి నామము - కొదలు మాటలును ॥ముద్దుగారీ॥

సెలవులవెంట జిడ్డు - చేత వెన్నముద్దయును
కలికినవ్వులు తన - గయాళింపులు
మలయు నడపులును - మందంపురూపులును
అల(య) గునిసి గునిసి - యాడేటి యాటలను ॥ముద్దుగారీ॥

నీలమేఘపుచాయ - నిండారునునుమేను
లీల తమ్మిరేకులంత - లేసి పాదాలు
బాలుఁ డలమేలుమంగ - పతి వేంకటకృష్ణుని[2]
మేలంపు సరసములు - మించు నొయ్యారమును ॥ముద్దుగారీ॥

చేరి యశోదకు శిశువితడు/ధారుణి బ్రహ్మకు తండ్రియు నితడు (3-485) అన్న రీతిలో ముద్దులు గొలుపుతున్న మద్దులు విరిచిన మోహనకృష్ణుని వర్ణిస్తున్న కీర్తన!

- గంధం బసవ శంకరరావు

---

1. ఇది మురారిపద మనదగినది. బాలకృష్ణుని మీది పదమిది. ముద్రనుబట్టి పెదతిరుమలాచార్యులవారిది కాదగును.

2. బాలుఁ డలమేలుమంగ వేంకటపతి కృష్ణుని (వ్రాతప్రతి) యతిభంగము సవరింపబడినది.

222. మేలుగావలెనే వో

సంకీర్తన: 98 రాగం: కేదారగౌళ
వ్రాతప్రతి పుట: 98 తాళం: లుప్తము

మేలుగావలెనే వో - మెలుత
చాల నోరూరించు నీ - జవ్వనమ్మునకు ॥పల్లవి॥

మొదలేరుపడి సన్న - మోసులెత్తి గనుపట్టి
తుదలొక్కించుకచూపి - తోరములై
వుదుటికి మెరుగారి - వొక్కపాటున
కదిసి గీటాడు నీ - గబ్బిగుబ్బలకు ॥మేలుగా॥

తళుకులై వీనుల - తారసిలి బెళుకులై
తెలుపుమించి మిగుల - తేటలగుచు
కెలకులను గనుగెంపు - గీలుకొని వెడదలై
కలకల నవ్వు (నీ) - కన్నుగవకు ॥మేలుగా॥

తావిమించిన తీపు - తావి కడు చల్లనై
తావి బెరసిన మంచి - సావి జెంది
వేవేలు తెరగుల - వేంకటపతినౌ నా
భావము దనియించు నీ - మోవికిని ॥మేలుగా॥

నాయిక యవ్వన సౌందర్యం వేంకటపతికి సమర్పితం! జవ్వన భావకోశానికి ఇది చక్కటి ఉదాహరణ!

- గంధం బసవ శంకరరావు

223. మేలెరిగినవాడవు

సంకీర్తన: 219 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 208

(పంతువరాళి రాగ క్రమంలో ఉండుట వలన పంతువరాళి కావచ్చును)

మేలెరిగినవాడవు - మెచ్చితి నిను జాల
(జాలి) బెట్టక చెప్పుమా దా - చక నీ(వు) నాతోడు ॥పల్లవి॥

చక్కెర పాలిత్తువో - చవిగా మోవిత్తువో
వుక్కుగోటికొద్ది - చెక్కునొక్కుదువో
కక్కసపు గుబ్బల యెద - గాడిపార నూరు(దు)వో
మక్కువతో జెప్పరా - మలగునియ నిద్ర (స్వామి)! ॥మేలెరిగిన॥

సన్నజాజుల జుట్టుదువో - సరులదండ వేతువో
పన్ని కంకణాల చేత - పాదము లొత్తుదువో
కన్నులమ్రొక్కుదువో - కైవసము చేసికొందువో
మన్ననతో జెప్పరా - మలగునియ నిద్ర (స్వామి)! ॥మేలెరిగిన॥

సందిటనుంతువో - సరసమాడుదువో
పొందుగా తమ్ముల(పు)ము - పొత్తు గలుపుదువో
కందువ కలయికల - కలిసి లో జేసుకొందువో
విందములే జెప్పరా శ్రీ - వేంకటభూధరవాస ॥మేలెరిగిన॥

మలగునియ నిద్ర స్వామిని చనవుతో నాయిక ప్రశ్నిస్తుంది. మలగునియ గురించి అక్కరో తానేటి (ఈ సంపుటం - 3) సంకీర్తనలో చర్చించటం జరిగింది. (చూ.పు. 7).

- గంధం బసవ శంకరరావు

224. మొక్కేర చిట్టక

సంకీర్తన: 44 — రాగం: శంకరాభరణం

వ్రాతప్రతి పుట: 45 — తాళం: లుప్తము

మొక్కేర చిట్టక - ములు వద్దురా
గక్కునఁ గౌఁగిటఁ - గమ్ముదువు గాని ॥పల్లవి॥

కొనగుబ్బలను గోరఁ - (గుచ్చ) గిలుకకు రా, సో
కినయంతనే గిలి - గింతలయ్యీని
కినిసి పంటిమొన - గీటకురా మోవి
అనయము మేను జ-ల్లని గగ్గురు వారీని ॥మొక్కేర॥

వుదుటు మైకొనవేల - నూదకురా, సంది
కద(లి) తమకమున - గళలు దాకీని
కొదలు మాటలు చెలిని - గొణగకురా, యింపు
గదురమై యొకరీతి - కళవళిం(రిం)చీని ॥మొక్కేర॥

తిలకించి పయ్యెదఁ - దీయకురా, తోడి
చెలులెల్ల నున్నారు - సిగ్గయ్యీని (సిగ్గులయ్యీని)
అలమేలుమంగ శ్రీవేంకటప్ప వూరుపుగ్రోలి(?)
(కలకాలమిటులనే - కలసి మెలగీని) ॥మొక్కేర॥

వెంకటప్ప ముద్ర - చిన్నన్న సంకీర్తనయా?

చిట్టకము = 1. శృంగారచేష్ట 2. లీల 3. పరిహాసం 4. మోసం 5. ఆట రూపాం. చీటకము

“చిట్టకాన కింకా నేమి సేయుమనేరే” (11-314).

- గంధం బసవ శంకరరావు

225. మొల్లలేలె నాకు తన్నె

సంకీర్తన: 229 రాగం: శంకరాభరణం
వ్రాతప్రతి పుట: 218 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 6వ సంపుటంలో 108వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 59)లో రాగం కొండమలహరి)

మొల్లలేలె నాకు తన్నె ముడుచుకొమ్మనవె నేఁ
జెల్ల పూవు కొప్పుతావి చెంచుదానను ॥పల్లవి॥

పట్టుచీ రేఁటికి నాకు పారిటాకులె చాలు
దట్టిగట్టుకొమ్మనవే తనమొలనే
పట్టెమంచ మేలె నాకు పవ్వళించు మనవె నేఁ
జెట్టుకిందఁ బొరలాడే చెంచుదానను ॥మొల్లలేలె॥

సందిదండ లేలె నాకు సంకుఁగడియమె చాలు
యిందవే యెవ్వతెకైన నిమ్మనవె
గందమేలె నాకు చక్కని తనకే కాక నేఁ
జిందువందు చెమట మై చెంచుదానను ॥మొల్లలేలె॥

కుచ్చుముత్యాలేలె నాకు గురివిందలె చాలు
కుచ్చి తనమెడఁ గట్టి కొమ్మనవె
కచ్చుపెట్టి కూడె వేంకటగిరీంద్రుఁడు నను
చిచ్చినే నడవిలో చెంచుదాననూ ॥మొల్లలేలె॥

గడుసరి చెంచునాయిక నాయకుని ప్రశ్నిస్తున్న వైనం.

– గంధం బసవ శంకరరావు

226. రచ్చలోన మగనాలిని

సంకీర్తన: 192 రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 185 తాళం: త్రిపుట

రచ్చలోన మగనాలిని - రట్టు సేతురా
మచ్చికతో రాముకదా, చక్ర - మల్లూరి సౌంద(ర)నాథ! (ర్య) ॥పల్లవి॥

చికిలి బంగారునకు - చెక్కులపై కుంకుమ
మకరికలు వ్రాసేవు - మరగు లేక
పికవాణిపై నీ కింత - ప్రియము గలిగె, నదె చాలు
మకరాంకరూప చక్ర - మల్లూరి సౌంద(ర)నాథ! (ర్య) ॥రచ్చలోన॥

తళుకుగుబ్బలపై పయ్యెద - తలగించి కస్తురి బూసి
(చలువ) ముత్తియపు (బన్న) - సరము లమరించేవు
యెలమి కలి(గె, నదె) చాలు - యేకాంతమున వెలయ
మలసే విట్ల చక్ర - మల్లూరి సౌంద(ర)నాథ ! (ర్య) ॥రచ్చలోన॥

తీరుగా గమ్మకస్తూరి (నొసల) - తిలకమ్ము నమరగ దిద్ది
గారవాన (శ్రీ)వేంకటరాయడవై - కాగిలించితి,(వదె చాలు)
కేరి (యెల్లరు) జూడగా - కిలకిల (మనుచు)నవ్వేవు
(మా)రుని గన్న చక్ర - మల్లూరి సౌంద(ర)నాథ! (ర్య) ॥రచ్చలోన॥

This is yet another unpublished new Shringaara Sankiirtanam of the TaLLapaaka Composers addressed to Chakramalluuru Soundaranaatha. ChakramallUru, near TiruvaLLuru is considered as one of the ancient 108 Vaishnava DiivyadEsham-s where Chakramalluur Sri VenkatEswara temple exists (Google search). I understand there is another ancient Chakramalluru near Madurai and one more near Vellore. (In the early sixties I saw one huge fallen wooden Door jamb near Meenakshi Amman temple, Madurai wherein, along with the Dashavatara depictions, representations of the TP VaggEyakara-s were also noticed as at Tirupati, in witness of their extent of influence in the south).

So, this song could be on any one of those Godheads. In view of the title of the text and the mudra VenkatarayaDu contained in the song the TP authorship need not be doubted.

- Veturi Anandamurthy

227. రమణుని చేఁతలు దక్కెను

సంకీర్తన: 280 రాగం: ఆహిరి

వ్రాతప్రతి పుట: 265 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 6వ సంపుటంలో 169వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 59)లో రాగం ఆహిరి)

రమణుని చేఁతలు దక్కెను రావులు రంతుకు నెక్కెను
మమతలు లోలోఁ జొక్కెను మాటలు మఱియేలే ॥పల్లవి॥

తలపోఁతలు తనుఁ గూడెను తాలిమి గంటును వీడెను
కలువలు ఇరుమైఁ గాఁడెను కటకట యిఁక నేమే
బులుపులు సిగ్గుల కోడెను పులకలు సమతలు గూడెను
చలములకును విధి మూడెను జవ్వన మిది యేలే! ॥రమణుని॥

మచ్చికమానము రేగెఁను మచ్చరములె మతి మూఁగెను
చిచ్చును గాలియుఁ గూడెను చీచీ యిఁక నేమే
ముచ్చట రతి కెదురేఁగెను మురిపెము వెనుకకు వీఁగెను
వెచ్చి వివేకము, రాఁగెను వేడుక లిఁక నేలే ॥రమణుని॥

భారపు చెమటలు జాఱెను పైచెమటలు దైవాఱెను
కూరిమి కడుఁ దుద మీఱెను కొంకెడి దిఁక నేలే!
వీరిఁడి వెఱపును జాఱెను వేంకటపతి కృపచేరెను
గారవములు కడుఁబేరెను కసరెడి దిఁక నేలె ॥రమణుని॥

రమణుని చేతలు రమణిని మురిపిస్తున్నాయి, కడకు వేంకటపతి కృపకలిగి ఆనందపారవశ్యం కలిగింది నాయికకు!

– గంధం బసవ శంకరరావు

228. రారా నన్నేలుకోరా

సంకీర్తన: 253 రాగం: సౌరాష్ట్ర

వ్రాతప్రతి పుట: 242 తాళం: అట

రారా నన్నేలు కోరా తిరువ
ళ్లూరి వీరరాఘవ యేరా ॥పల్లవి॥

యేరా నీకు మ్రొక్కేరా ముద్దిడు - కోరా మనసయ్యీరా
సారె విరి తూపు మారు డేయగ - నోరువ లేరా చలమొద్దు వొద్దురా చలమేలరా
॥రారా॥

యేరా మోవికి నోరూరితే రారా నా యాసదీర
రేరాజు వేడి జల్లీరా నీకు నీవేరా వోరీ ॥రారా॥

నీరాక(క్రై)కోరి యారు దూరైతిని రా యదనీరా
పేరామని నన్నారడి పెట్టేను - వేరెంచక శ్రీవేంకటప్రభు(డవై) (రారా) ॥రారా॥

ఇది శిఖాపదమా?

తిరువళ్లూరి వీరరాఘవుడిని నన్నేలుకోరా అని నాయిక ప్రార్థిస్తున్నది.

– గంధం బసవ శంకరరావు

229. రారో దేవతలారా

సంకీర్తన: 110 రాగతాళములు లుప్తములు
వ్రాతప్రతి పుట: 110

రారో దేవతలారా - రంభాది సుదతులార
పేరుగల యిందిరను - పెండ్లాడె శౌరి ॥పల్లవి॥

పెక్కువ శేషాచలము - పెండ్లిపీటగా జేసి
దిక్కులెల్లా (కల్యాణ)ము - తెరగాను జేసి
చుక్కలెల్ల తలబ్రాలు - సొరిది ముత్యాలు సేసి
పిక్కటిల్ల హరి నేడు - పెండ్లాడె నిదిగో ॥రారో॥

బాల సూర్యచంద్రుల - బాషికముగా జేసి
పాలజలధిని మధు - పర్కపాత్రము సేసి
(క్రాలు) బ్రహ్మాండములు పొం-కపు చవికెగా జేసి
(వ్రేలు) టెక్కెముల హరి - పెండ్లాడె నిదిగో ॥రారో॥

గుంపుల పరుషవారి-కూర్మిచుట్టముల జేసి
సొంపున నప్పగింతలు-శుభముగా జేసి
యంపలేక పురమున - నలమేలుమంగతోను
(పెంపు)తో శ్రీవేంకటేశుడు - పెండ్లాడెనిదిగో ॥రారో॥

క్రాలు = అతిశయించు
వ్రేలు = వేలాడు

తాళ్లపాకవారి వాఙ్మయంలో పెండ్లి సంకీర్తనలు అనేకం! తిరుమలస్వామికి నిత్యకళ్యాణోత్సవ వైభవాన్ని ప్రవేశపెట్టింది అన్నమాచార్యులవారు! నాటి నుండి నేటి వరకూ ఈ వైభవం అందరికీ విదితమే!

- గంధం బసవ శంకరరావు

230. రేలు నీవేల వెన్నెల

సంకీర్తన: 45 రాగం: కేదారగౌళ

వ్రాతప్రతి పుట: 46 తాళం: లుప్తము

రేలు నీవేల వె - న్నెల పాలు సేసేవె, నన్ను
దేలించు ముచ్చటలఁ - దీరదటె చెలియా ॥పల్లవి॥

(తలఁపుగు)ట్టెట్టిదో - తనకు వెరపేమి
తెలియ మూసిచ్చేది - తెరిచి వచ్చీనా)?
కలికి కెమ్మోవిపైఁ - గసి గాటులు(లవియేమి)
మిలమిలను చెక్కుల - మీది మీటు(లవిగాక)
వలుదలౌ వెన్ను జడ-వాటు లవిగాక
బలుసేస కొప్పు పడు - బాటు లవిగాక ॥రేలు॥

(కోమలమైన) సందిటి కోతలు, కదు
వాముకొన్న గు - బ్బయూతలు (?)
చేముంచిన మా - చేతిమీది చేవలు, అమ్మ
రో! మెడకడనున్న - రోతలు (జూచి?) ॥రేలు॥

కేవలమైన కను - గెంపులు, కడు
గోవరపుఁ బులకల - గుంపులు, మేని
మూవరస చెమటల - ముంపులు
యీ వేంకటపతి మది - యింపులు జూచి(?) ॥రేలు॥

ఇందలి భావమేమో బోధపడలేదు. ఇట్టిదే వేరొక పాట 53లో కలదు. రెండవ చరణములోని నాలుగవ పాదమునకు గల రూపాంతరములను పరిశీలింపగా ఇట్టివి కొన్ని అభ్యాసరచనలు కాదగుననిపించును! 45, 53లలోని రాగ భేదము కూడ దీనికి సూచకమేమో!

- వేటూరి ఆనందమూర్తి

231. రేలు నీవేల వెన్నెల

సంకీర్తన: 53 రాగం: శంకరాభరణము

వ్రాతప్రతి పుట: 54 తాళం: లుప్తము

రేలు నీవేల వె - న్నెల పాలు సేసేవె, నన్ను
దేలించు ముచ్చటలు - దీరెనటె చెలియా ॥పల్లవి॥

చల్లని గుబ్బలపై - జారేటి గందవొడి
చెల్ల రవికె(ల)పాలు - సేయంగవలెనా!
యల్ల దమిలేకనా - యదనదిమినా గాని
వుల్లమ్ముకొదమాని - వుండదటె చెలియా! ॥రేలు॥

తెరవ! ముద్దులుగారు - తియమోవి తేనియలు
చిరునగవుల పాలు - సేయంగ వలెనా!
అరయకిచ్చిన (మనసు) - అంగజుని కాకచే
మరగేటి వొడలెల్ల - మా(న)దటె చెలియా! ॥రేలు॥

కలికి! కుందనపు జా - యల మై నిగ్గులెల్ల
జిలుగు సొమ్ముల పాలు- సేయంగవలెనా
అలమేలుమంగ శ్రీవేంక - టప్పని మైనున్న
చెలరేగి చెప్పినటు - సేయదటె చెలియ ॥రేలు॥

ఇందులోని 45,53 పాటలు కలగలసినట్లున్నవి! అధికపాదములు కలవగుటచేత పునరుక్తులుగా కాక, విడివిడిగా గుర్తించి పరిశీలించవలసినవి. ఇందలి వైఖరీ భేదములను బట్టి ఇట్టివి కొన్ని తాళ్లపాకవారి అభ్యాస రచనలగునేమో!

- వేటూరి ఆనందమూర్తి

232. లాలి లాలీ లాలి

సంకీర్తన: 85 రాగం: ఘంటారవము

వ్రాతప్రతి పుట: 85 తాళం: లుప్తము

లాలి లాలీ లాలి - లాలమ్మ లాలి
లాలి యిందిర గూడి - లాలమ్మ లాలి ॥పల్లవి॥

పాలమున్నీటిపై - ఫణిరాజు తొట్టెలలో
బాలవేదపు పఱపు - బాగాయ లాలి
మేలి బంగరురేక - మించు మేల్కట్లలో
కాలమేఘుని బాగు - (కననాయ) లాలి ॥లాలి॥

చెలువంపు నవనిధుల - చెంగల్వ పొత్తిళ్ల
నెలకొన్న రవిచంద్ర - నేత్రుడా! లాలి
వెలలేని యమృతంపు - వెన్నలారగించిన
నలువ పొక్కిటి తమ్మి - నా యన్న లాలి ॥లాలి॥

మునికాంతలదె నిన్ను - ముదముతో బాడేరు
మనసిజ జనకుడవు - మా యయ్య లాలి
అనిశంబు నెదనెక్కు - నలమేల్మంగ నేలు
ఘనుడ వౌ శ్రీవేం - కటనాథ లాలి ॥లాలి॥

ముద్రనుబట్టి యిది చినతిరుమలాచార్యుల రచన.

తాళ్లపాకవారి సుందరమైన లాలి ఇది.

- గంధం బసవ శంకరరావు

233. లేఁతచిగురిదె

సంకీర్తన: 265 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 252

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 35వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 6)లో రాగం దేశి[1])

లేఁతచిగురిదె పవ్వళించవయ్య కానికె[2]
బాఁతిగాఁ గమ్మనితావిఁ బాయక[3] మీఁదైనది ॥పల్లవి॥

ఇంపుల వెలఁగపండ్లిందవయ్య కానికె
గుంపుఁ దేకుటాకు మరఁగున నున్నవి
కెంపుమోవిపండు చిత్తగించవయ్య కానికె
దింపని తేనెలపెరతీపులుసోఁకినది ॥లేఁత॥

పంచల వాఁడమ్ములివె పట్టవయ్య కానికె
పొంచి తొంగలిగరుల పొది[4] నున్నవి
కొంచెపు వెన్నెలలివె కోవయ్య కానికె
మంచిమొల్ల[5] మొగుడల మాఁటునాఁ బాయనివి[6] ॥లేఁత॥

[7]ఇప్పుడె వేంకటేశ నీకెక్కెఁగా నాకానికె
చిప్పిలుఁబన్నీటినిండుఁజెలమైనది
దప్పిదేరేమాటలతో దక్కెఁగా నాకానికె
కొప్పునెరుల విరులకుమ్మరింతలై నది. ॥లేఁత॥

నాయిక పలుకానుకలను నాయకునికి సమర్పిస్తున్నది!

– గంధం బసవ శంకరరావు

---

1. నిడురేకు 41. ఆద్యదేశ? 67 ఆద్యుల దేశి? **2.** తా. వేం.225 కామః అనియే తుదివఱకు **3.** కొమ్మతావులు ప్పాయ మీఁదై **4.** తొంగలి రెప్పల పోది **5.** మల్లెమొగడల **6.** మాటున మీఁదైనది **7.** దప్పిదేరె మోవివెదకెగా కానుక, జిప్పిలుపన్నీట నిచ్చలమైనది. ఇప్పుడె శ్రీవేంకటేశ నీకెక్కెగా కానుక, కొప్పునెరిగురులిగురించి వింతలైనది.

234. వద్దుర చవిగా చొక్కుదు

సంకీర్తన: 240 రాగం: సాళంగనాట
వ్రాతప్రతి పుట: 229 తాళం: లుప్తము

వద్దుర చవిగా చొక్కుదు - వైనను (నను) వేడెదువు
(యిద్దరమొకటై పెనగక) - యిక నెక్కడి వలపు ॥పల్లవి॥

మేనులు రెండని యెరుగక - మెలగుచునుండితి(మ)పుడు
నేనును నీవనియనగా - నేర్చితి (వి)దియేరా
కానీ తొలుతటి వారము - కామనుచుండితివిపుడెం
తైనానిక నను తడవకు - మాచెలిమే చాలునోరి ॥వద్దుర॥

పొద్దు గ్రుంకు లెరుగక - పొందుల నుండితిమప్పుడు
అద్దమరేతిరి బోయే - నంటివి యిది యేరా
అద్దిర కాలము మహిమో - అతనుడు పెట్టిన చిక్కో
కద్దోలేదో యనుటకు - మా కలయికలే చాలు నోరి ॥వద్దుర॥

పెరతేనియ చవికని వా - తెరలే నానితి మప్పుడు
అరుదుగ చక్కెర మోవి - మ్మంటివి యిది యేరా
సిరి నన్నలమేల్మంగను - శ్రీవేంకటపతి కలసిన
యిరవుగ పొందుల కంటెను - నికనెక్కడి వలపు ॥వద్దుర॥

పెరతేనియ - (ఇదే సంపుటంలోని 'తిరుమలయ్య విందు మంచిదే వుండంటే వుంటినమ్మ) అనే సంకీర్తనంలో కూడా రకరకాల తేనెల ప్రస్తావన ఉంది.

- గంధం బసవ శంకరరావు

235. వనితకు నీ మీది

సంకీర్తన: 125 రాగం: మధ్యమావతి

వ్రాతప్రతి పుట: 124 తాళం: లుప్తము

వనితకు నీ మీది - వలపెట్టిదో గాని
యెనయక కలనైన - నేమరదయ్యా ॥పల్లవి॥

నిదురబోయిపోయి - నెలతకలవరించి
అదన నీ కెమ్మోవి - అడుగునయ్యా
గుదిగొన్న పూబంతి - గోర నొక్కుచు, బి
ట్టదరి నొవ్వదు గదా - అనునయ్యా ॥వనితకు॥

సారెకు మమ్మునెక - సక్కెమాడగవచ్చి
కోరి (నిన్నెరెగిరా) - కొట్టునయ్యా
గారవమ్మున మమ్ము - పేరబిలువవచ్చి
కూరిమి నిను పేరు - కొనునయ్యా ॥వనితకు॥

చెలియ వీడెము సేసి - సేసి మరి నిన్ను
అలరి తమ్ములము గొ - మ్మనునయ్యా
అలమేలుమంగ వేంకట - ప్పడ నిను గూడి
అలరి మూడు మూపు - లౌనయ్యా ॥వనితకు॥

ఇందు ముద్రగల మూడవ చరణము వ్రాతప్రతి యందు వ్యత్యస్తముగా అరకొరగా వ్రాయబడియున్నది. సరిచేయబడినది. ప్రకరణము దూతి నాయకునకు నాయిక యొక్క ప్రేమాతిశయమును వర్ణించి గోత్రస్థలనమను అవస్థను చెప్పుట - పొసంగెననుటకు మూడుమూపులగుట, మూపులు మూడగుట తాళ్లపాక వారి సాహిత్యమున గల చవిగల పల్కుబడులు.

- వేటూరి ఆనందమూర్తి

236. వలచినందుకు గురుతు

సంకీర్తన: 92 రాగం: నాదనామక్రియ

వ్రాతప్రతి పుట: 93 తాళం: లుప్తము

వలచినందుకు గురుతు - వలె గాక, వూరకే
వలచితి ననుకో - వలె నటే తరుణి? ॥పల్లవి॥

అరుదైన తన ప్రాణ - పదమైన విభు రాక
కెదురు చూడగ సంధు - లదరంగ వలదా?
ముదముతో తన పతిని - మదిలోన దలచితే
మదన సదనమునందు - పద నెంచ వలదా? ॥వలచినందుకు॥

సదయుడు తన స్వామి - యదె వచ్చె నని వింటె
వుదుటుగుబ్బలు మిగుల - నుప్పొంగ వలదా?
కదిసి తన నాయకుని - కనులార జూచితే
పొదలి తన మేనెల్ల - పులకించ వలదా? ॥వలచినందుకు॥

పొలుచు తన వల్లభుని - పలుకు చెవులను వింటె
కలియకనె పదహారు - కళ లూర వలదా?
వెలది యలమేల్మంగ - వేంకటేశు గూడితే
పొలయలుకలు మాని - పొందు గావలదా? ॥వలచినందుకు॥

భాషానైపుణ్యాన్ని పెంచుకోడానికి 'అమరకోశా'దు లెట్టివో, సంగీత విద్యావైశారద్యానికి 'తాన నిఘంటువు' లెలాంటివో, కవి - కావ్య పరిజ్ఞానవికాసానికి పదకోశా లెటువంటివో సంగీత సత్కృతి శ్రవణానందానుభూతికీ ఆయా కవులకు సంబంధించిన భావకోశాలూ అలా తోడుపడేవే.

ఉదాహరణకు 'వలచు, వలపు' అనే మాటలకు పదకోశాలు కామించు; కామము, కోరిక అనే అర్థాలిచ్చి ఊరుకుంటాయి. అదే 'భావకోశ' మైతే ఆయా కవులు అప్పటప్పటి ప్రకరణాలనుబట్టీ, పాత్రలనుబట్టీ, ఆపదానికి ఏ అర్థాలనూ, ఎలాంటి స్పందనలనూ అపేక్షిస్తున్నారో కూడా విశదీకరిస్తుంది. దాని మూలంగా ఇలాంటి కృతిరచనల్లో పల్లవి చరణాల మధ్యనున్న నిబిడములైన భావబంధాలు కూడా, అన్వయ క్లేశమున్న తావుల్లో, సువ్యక్తములై ఆవిష్కృతము లౌతాయి.

వలచినందుకు ఏదైనా గుర్తుండిపోయే అనుభూతి మిగిలిపోవా లంటాడు ఈ సంకీర్తనలో పెదతిరుమలయ్య. ఎదురుతెన్నులు చూడడం లోనే – సంధు లదరుట, కనులార జూచితేనే –మేను పులకించుట, పలుకు వింటేనే – పదునారుకళ లూరుట వగైరాలు. అదే ఏ క్షేత్రయ్యో అయితే 'వలపనే దెటువంటి వస్తువో తెలియదే" (గిడుగు. 1 –144) అంటూనే ఒక స్వీయా–మధ్య–విరహోత్కంఠిత లక్ష్యపదాన్నే రూపు దిద్దుతాడు. తాళజాలక పోవడం, ఉన్నచోట ఉండలేక పోవడం, పొద్దుపోవక పోవడం వగైరా విశదీకరణలు అతని భావకోశానికి సంబంధించినవి.

తాళ్లపాకవారి 'భావకోశం' లో 'వలపు' అనేపదానికిగల అర్థం యేమిటో దాని లక్షణం, నిర్వచనం, లక్ష్యరూపమైన యీ సంకీర్తనంలో నిబద్ధ మైనట్లుగానే సాధారణంగా వారి అన్ని రచనల్లోనూ, 'వలపు' అనే ప్రయోగం కానవచ్చినప్పుడల్లా, అవే భావాలు పునఃపునరావృతా లవుతూనూ ఉంటాయన్నది భాషాశాస్త్ర సంవాద విశ్లేషకు లెరిగినదే! ఇది మనస్తత్త్వ శాస్త్రానికీ, భాషాశాస్త్రానికీ సంబదించిన 'డిస్కోర్స్ అనాలిసిస్' అనే సీమలోని విషయము.

అదీ నాయికా నాయకుల నడుమ దాని ప్రతిఫలనాన్నీ, శృంగారాభినయానికిగల ఆనుకూల్యాన్నీ ప్రదర్శిస్తూ ఇటు ఆలంకారికులకూ, అటు భరతకళానిపుణులకూ పని కల్పించేది గానూ ఉంటుంది. తెలుగులో ఈ దిశగా అధ్యయనం మరింతగా సాగవలెను.

– వేటూరి ఆనందమూర్తి

237. వలచినదానిని

సంకీర్తన: 160 రాగం: సావేరి
వ్రాతప్రతి పుట: 157 తాళం: లుప్తము

వలచినదానిని - వగలబెట్ట నీకు
అలవియౌనా? వోరి! - ఆదివరాహ ॥పల్లవి॥

గందవొడినే నీకు - గానుకజేసితే
అందుకొనవదేమి - ఆదివరాహ!
విందైన కప్పురపు - వీడెమిచ్చినా నొల్లవు
అందమా యిదినీకు - ఆదివరాహా ॥వలచిన॥

వేడుకనే నీతో మా-టాడగమారు మా
టాడవదేమో - ఆదివరాహ
కూడి గుబ్బలు - కుమ్మిబిగించితే
నాడుకొనేవందరిలో - నాదివరాహ ॥వలచిన॥

చక్కెరకెమ్మోవిని-చవిగొమ్మని యిచ్చితే
అక్కర గైకొనేవు - ఆదివరాహ
మక్కువ వేంకటప్రభుడ - మరుకేళిమించితే,
నక్కుదించననేవు - ఆదివరాహ ॥వలచిన॥

నీకై వలచినదానిని వగల బెట్టకుండా ఆదరించవయ్యా ఆదివరాహా! అంటూ ఆదివరాహస్వామి పరంగా చెప్పిన కీర్తన!

- గంధం బసవ శంకరరావు

238. వలవనని యనుకొనేదే

సంకీర్తన: 228 రాగం: పాడి

వ్రాతప్రతి పుట: 217 తాళం: లుప్తము

వలవనని యనుకొనే(దే) - వాని బిరుదు, వాని
వలచీ - వశ(పరచుకొనేదే) నా బిరుదు ॥పల్లవి॥

వూరక ననుగలయ - కుండే ననేదే వాని బిరుదు
పేరిమితో వాని ర - ప్పించుకొనేదే నా బిరుదు
బీరముతో (నన్నటమట) - పెట్టేదే వాని బిరుదు
చేరి వాని మత్తునిగా - జేసేదే నా బిరుదు ॥వలవనని॥

లేతమాటలను తే - లించే ననేదే వాని బిరుదు
మోతపు మోహపు జలధి - ముంచేదే నా బిరుదు
చేతలలోను గా - జేసేననేదే వాని బిరుదు
నాతిరో మోవిపై పల్లు - నాటించుటే నా బిరుదు ॥వలవనని॥

మరచి నాకు దిక్కననే - మతమిప్పుడు వాని బిరుదు
కెరల నుపరతుల జొ - క్కించుటే నా బిరుదు
యిరవొంద నాకు మన - సియ్య ననేదే వాని బిరుదు
గురిగా శ్రీవేంకటేశు దక్క - గొనేదే నా బిరుదు ॥వలవనని॥

శ్రీవేంకటేశ్వరుని కైవశం చేసుకొనుటయే నాయిక బిరుదు!

- గంధం బసవ శంకరరావు

239. వాని రమ్మనవే అక్కరో!

సంకీర్తన: 211 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 202

వాని రమ్మనవే అక్కరో! - వాని రమ్మనవె చెలియ ॥పల్లవి॥

వాని రమ్మనే ననవె - వాని రమ్మనే ననవె
మానినిరో చలము మాని - మలగునియనిద్ర స్వామిని ॥వాని॥

తనకునాకు బోదు - తరుణి! యేటివాదు
మనసు నిలువనీదు నె - మ్మదిని నిదురరాదు ॥వాని॥

చిన్ననాడె చాల - చెలిమి సేయ (మేల)
కన్నడ లికనేల - విన్నవించ జాల ॥వాని॥

కంతుఁడమ్ములేసీ - కరుణను (నెడబాసీ)
వింతజేసి శ్రీవేంకట - విభుఁడు జాగు చేసీ ॥వాని॥

పల్లవి స్థానమున శిఖాపదమిందున్నది. రెండేసి పాదముల గల నాలుగు చరణములు కలిగి అంత్యానుప్రాసలతో ఆలంకారికముగా సాగిన రచన యిది. తాళ్లపాకవారిదే 'రమ్మనవే మాని రచనలు(5-97)' అనే పాట కూడా ఇట్టి ఎత్తుగడ కలదే!

- వేటూరి ఆనందమూర్తి

240. వారివారికి తె(వులు)

సంకీర్తన: 21 & 32 రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 23 & 33 తాళం: జంపె

వారివారికి తె(వులు) – వాలాయముగ నరు(ని)
(నారి) వంకను బుట్టె – నడుమ నొక తె(వులు) ॥పల్లవి॥

యతికి గోపంబైతె – యెడద బాయని తెవులు
సతికి యవగుణమైతె – చాల తెవులు
మతిహీనుడై సుతుఁడు – మాట వినకుంటేను
ఆతని తలిదండ్రులకు – నాత్మలోఁ దెవులు ॥వారివారికి॥

పొరుగింట నే ప్రొద్దు – (పొరలేది) పెనుదెవులు
వొరిమె లేని యూర – వున్నను దెవులు
తరమెరుంగని దొరను – దగిలి కొలుచుట తెవులు
సరిగానివారితో – జగడమే తెవులు ॥వారివారికి॥

ధనవంతుఁడై దాన – (ధర్మ)మెఱుఁగని తెవులు
(నెనరుతో) నిల్లాలి – నేలనిది తెవులు
అనుదినము శ్రీవేంక – (టాధీశు) గొలువని
మనుజులకు నేప్రొద్దు – మనసులో తెవులు ॥వారివారికి॥

ఇట్టి పాటలు వ్రాతప్రతిలో కలగలుపులైనవి. పాఠాంతరమును బట్టి మాత్రమే పరిష్కరించుటైనది.

– వేటూరి ఆనందమూర్తి

241. వారివారికిఁ దగిన

సంకీర్తన: 22 రాగతాళములు లుప్తములు[1]

వ్రాతప్రతి పుట: 24 & 25

(ఈ సంకీర్తన 27వ సంపుటంలో పీఠిక (పుట xxvi) లో ఉదాహృతమైనది)

వారివారికిఁ దగిన[3] - వాఁడ లాలి
(కోరిన వారింటి - గుమ్మడ! లాలి) ॥పల్లవి॥[2]

మీనమై జలనిధి - (మించు తరగల తొట్ల)[5] మీద నూఁగినవాఁడ లాలి
ఆనందకమఠమై - అమృతంపు దొట్లలో - నంది వూఁగినవాఁడ లాలి
(కోనల గొండల - క్రోడమై వారాశి)[6] గునిసివూఁగినవాఁడ లాలి
మానారసింహుఁడై - (మహి)[7] కడపతొట్లలో - మరగివూఁగినవాఁడ లాలి ॥వారివారికి॥

వామనుఁడవై త్రిభు-వనము లను తొట్లలో - వరుసనూఁగినవాఁడ లాలి
రాముఁడై జమదగ్ని - రాజు తొట్లలోనూఁగు - రసికశిఖామణి లాలి
ఆ మీద రఘురాము - (ఁడై)[8] పుష్పకపు తొట్ల - నంది వూఁగినవాఁడ లాలి
మామకొరకు గొల్ల - మందల తొట్లలో - మరఁగి వూఁగినవాఁడ లాలి ॥వారివారికి॥

తగు బుద్ధ రూపమున - ధర్మంపు తొట్లలో - తగిలి వూఁగినవాఁడ లాలి
పొగడొంద[9] కలికివై - భూమి తొట్లలోన - పొసగనూఁగినవాఁడ లాలి
తగు నలమేల్మంగఁ - (దమిని)[10] కౌఁగిలి తొట్ల - తగిలి వూఁగినవాఁడ లాలి
[11]చిగురిం(చుమౌనిజన - చిత్తడోలిక లూఁగు) - శ్రీవేంకటారమణ లాలి ॥వారివారికి॥

---

1. తాళ్లపాక పదకవుల సుందరమైన ఈ దశావతార లాలిపాటకు వ్రాతప్రతిలో రాగతాళములు కానరావు. ఈ పాట కదు శిథిల రూపమున ముందు వెనకలుగా కూర్చబడియున్నది. **2.** ఈ సంకీర్తన పల్లవి 'వారివారికి అను అదే ఆరంభముగల మరియొక సంకీర్తన పల్లవిలో చేరికానవచ్చినది. శ్రీవేంకటరమణ ముద్రగల ఈ సంకీర్తన అన్నమయ్యదో కాక, తిరువేంగళనాథునిదో కాదగును. **3.** తెగిన **4.** లుప్తపూరణము **5.** 'మీనమై జలనిధి తెరంగల తొట్లలో' - తక్కిన అన్నిపాదములందును గల పాదమధ్యమందలి రెండవ యతి లోపించెను. 'తొట్లలో మీఁద' అన్వయభంగము వాక్యము సవరింపబడెను. **6.** గోడోల గొందుల వరాహమై తొట్లలో - ప్రాసము తప్పినది - యతి భంగము. మార్పు చేయబడెను. **7.** పాద మధ్యమున యతి కొరకు చేర్పు. మా నారసింహుడనుట మాలోల నృసింహ స్ఫూర్తి కొరకు కాబోలును లేదా మానవసింహుడై అని యుండదగునేమో. **8.** డగు **9.** సొగసొంద - యతిభంగము. మార్పు చేయబడెను. **10.** మధ్యయతి లుప్తమైనది. మార్పు చేయబడెను. **11.** చిగురింపమునుల మానుషతొట్లలోను - యతి భంగముతో పాటు నిర్మాణ భంగము. సవరింపబడెను.

242. వింటివో వింటివో

సంకీర్తన: 159 రాగం: రేగుప్తి
వ్రాతప్రతి పుట: 156 తాళం: లుప్తము

వింటివో వింటివో - వింటివో రంగని
గంటివో యక్క! - నేగంటినే; తియ్య-
వింటివానిగన్న-జంటవాడక్క! నా
చంటిమీదచెయి - చాచీనక్క!, వా
డంటిన పాపాలు-హరములౌనక్కా ॥పల్లవి॥

రాకేందువదనమా - రంగనిజూడే
జోకైనమెయిమీది-రేకలుజూడె
ఆకుపైబవళించు - నాతనిజూడె
మాకెక్కిగునిసేటి-మహిమలుచూడె
కోకలుదోచేటి-కొడిగలు జూడె ॥వింటివో॥

నాదము బట్టుక - నవ్వీజూడె
పాదుక యాలలు-పాడీ జూడె
వాదుకు రమ్మన - వచ్చీ జూడె
యాదవకులమున - యెమ్మెలు జూడె
వేదరూపమైన - వెన్నుని జూడె ॥వింటివో॥

సన్నలుసేసేటి - చిన్నెలు జూడె
నన్నెడబాయక- నవ్వీ జూడె
వెన్నలు ముచ్చిలి - తిన్నాడు జూడె
పన్నుక గుబ్బలు - పట్టీ జూడె ॥వింటివో॥
యెన్నగ శ్రీవేంకటేశు - డేలీ జూడె

రంగని మీది పదం, జానపదాల్లోని యాల పదం! *- గంధం బసవ శంకరరావు*

243. విజయీభవ

సంకీర్తన: 273 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 259

విజయీభవ శ్రీ - వేంకటరాయ
విజయీభవ ముని - వినుత దైవరాయ ॥పల్లవి॥

భవబంధ మోచన - పంకజ లోచన
భవచాప ఖండన - (బహు పాపదండన)
కువలయ పాలన - కుంభీంద్ర లాలన
దివిజేంద్ర రక్షణ - దితిసుత శిక్షణ ॥విజయీభవ॥

అకలంక చారిత్ర - హస్త కీలిత గాత్ర
మకరాలయ గేహ - మథిత (స)మ్మోహ
మకర కుండల కర్ణ - మహిత నీరద వర్ణ
సకల సద్గుణజాల - సామ గాన(వి)లోల ॥విజయీభవ॥

ఖలజన భీషణ - కౌస్తుభ భూషణ
విలసిత శార్ఙ్ర చాప - వివిధ (తనూ)రూప
బలిమద భంజన - పరమ నిరంజన
అలమేలు మంగా స - హాయ వేంకటరాయ ॥విజయీభవ॥

రాగాల క్రమమున గల 271-274 పాటల మధ్య 273 కూడ ఆద్యంతములలో ఉన్నట్లు 'సౌరాష్ట్ర'లోనే ఉండవచ్చును. 'తాళ్లపాక సంకీర్తనలు' అను ఈ వ్రాతప్రతిలో అనేక రాగతాళములు క్రమమున ఇట్లే కలవు. ఇవి ఈ కూర్పున గల శ్రద్ధావిశేషములకు తార్కాణములు రాగములును అనేకములు. 'దేవబయకారు'లైన రచయితలను భిన్నులు. స్వామివారికి విజయ సంకీర్తనలు గావించు ఇట్టి కీర్తనములును తాళ్లపాకవారి సాహిత్యమున పెక్కులు.

It appears that this compilation "taaLLapaaka Sankiirtnalu" (6609 SVORI,TPT,1941) was methodically preserved as a family text with attention to the order of Raga-s. As such we could today identify with ease, many of the missing Raga names of many new songs found in this manuscript. The importance of this manuscript is that it contains compositions of different authors of the TP family in one place, with their identified individual or variant mudras, occurring mostly in clusters of different raga-s. The present Sankirtana in 'Sourashtra' is one such example noticed.

- Veturi Anandamurthy.

244. విన్నవించనెట్టు వచ్చు

సంకీర్తన: 231 రాగం: శంకరాభరణం

వ్రాతప్రతి పుట: 220 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 28వ సంపుటంలో 4వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 1801)లో రాగం శంకరాభరణం)

విన్నవించనెట్టు వచ్చు వెలఁదియున్నచంద మిదివో
కన్నులార నీవె చూచి గతులు దెలుసుకోవయా ॥పల్లవి॥

తరుణి నిన్నుఁ దలఁచి తలఁచి తమకమాఁప నలవిగాక
శిరసు వంచి చింతలందు చిగురుగోయఁ దొడఁగెను
పురిగొనంగ నిన్నుఁబాసి పొద్దుగడపలేక కెరలి
సరుగ గాలిమంటపమున సాముశాయఁదొడఁగెను ॥విన్నవించ॥

వలపు నిలుపలేక కోరికలను [1]తాడువేఁడిపేఁడి
అలరి వేగుదాఁక ముత్తియములు గుచ్చఁదొడఁగెను
కలయుఁదాక నోర్వలేక కడుఁబరాకు సేసుకొనుచు
నెలఁత తమ్మికొలఁకులకును నీరు నించఁదొడఁగెను ॥విన్నవించ॥

దప్పిదేర నీగుణాలు దడవి విరహ మార్చుకొనఁగ
కప్పురంపుఁ బలుకులెల్ల గాదెఁ బోయఁ దొడఁగెను
యిప్పుడిట్టె శ్రీవేంకటేశ నీవు గూడఁగాను
చెప్పరాని ననలఁ బూజసేయ నిన్నుఁ దొడఁగెను ॥విన్నవించ॥

నాయిక విరహాన్ని దూతిక నాయకునికి విన్నవిస్తున్న చందము ఈ సంకీర్తన సొంతం!

– గంధం బసవ శంకరరావు

---

1. తాడు + పేఁడి = తాడువేఁడి

245. విభుని వినయములు

సంకీర్తన: 225 రాగం: పాడి

వ్రాతప్రతి పుట: 214 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 308వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 83)లో రాగం పాడి[1])

విభుని వినయములు వినవమ్మ నిను
నభయంబడిగీ నయ్యో తాను ॥పల్లవి॥

రహస్యమున శ్రీరమణుఁడు పంపిన
విహరణలేకలు[2] వినవమ్మా
అహిపతిశయనంబతితాపంబై
బహువేదనకు అగపడె నట తాను ॥విభుని॥

ఆదిమపతి నీ యడుగుల కెరగిన
వేదాంతరచన వినవమ్మా
నీదయగానక నిమిషమె యుగమై
ఖేదంబున నలఁగీనట తాను ॥విభుని॥

కింకరుఁడట నీ కినుకసేఁతలకు[3]
వేంకటపతిగతి వినవమ్మా
సంకెలేక[4] నీ చనవున జగములు
కొంకకిపుడె చేకొనెనట తాను ॥విభుని॥

విభుడు పంపిన విన్నపాలను దూతిక నాయికకు విన్నవిస్తున్న వైనం!

– *గంధం బసవ శంకరరావు*

---

1. నిడురేకు 89: పురుషవిరహం **2.** లేఖలు **3.** కినుక చూపులకు **4.** సంకెదేరె

246. వీఁడివో యిదె

సంకీర్తన: 147 రాగం: భైరవి

వ్రాతప్రతి పుట: 145 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 1వ సంపుటంలో 322వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 63)లో రాగం భైరవి)

వీఁడివో యిదె [1]వింతదొంగ
వేఁడిపాలు వెన్న [2]వెరఁజినదొంగ ॥పల్లవి॥

వెలయ నీటఁ జొప్పువేసేటి[3] దొంగ
తలగాననీక దాఁగుదొంగ
తలఁకక నేలదవ్వేటిదొంగ
తెలిసి సందెకాడఁ దిరిగేటి[4] దొంగ ॥వీఁడివో॥

అడుగుకింద లోకమడఁచేటి[5] దొంగ
అడరి తల్లికినైన నలుగుదొంగ
అడవిలో నెలవైయున్న దొంగ
తొడరి నీలికాసెతో నుండుదొంగ ॥వీఁడివో॥

మోస మింతులఁ జేయు మునిముచ్చుదొంగ
రాసికెక్కిన గుఱ్ఱంపుదొంగ
వేసాల కిటు వచ్చి వేంకటగిరిమీఁద
మూసినముత్యమై ముదమందుదొంగ ॥వీఁడివో॥

దొంగ అనే అంత్యప్రాసతో దశావతారాలను ఆవిష్కరించిన సంకీర్తన!

1. వెలయ నీట జొప్పువేసేటి దొంగ = మత్స్య
2. తలగాననీక దాగు దొంగ = కూర్మ

నిడురేకు 35, **1.** వోయల **2.** నెన్నలుఁబాలు **3.** వేసిన **4.** తిరుగాడు **5.** మఱఁచిన

3. తలకక నేలదవ్వేటి దొంగ = వరాహా

4. తెలిసి సందెకాడ దిరిగేటి దొంగ = నరసింహా

5. అడుగుకింద లోకమడచేటి దొంగ = వామన

6. అదరి తల్లికినైన నలుగు దొంగ = పరశురామ

7. అడవిలో నెలవైయున్న దొంగ = రామ

8. తొడరి నీలికాసెతో నుండు దొంగ = బలరామ

9. మోసమింతుల జేయుముని ముచ్చు దొంగ = బుద్ధ

10. రాసికెక్కిన గుఱ్ఱంపు దొంగ = కల్కి.

– గంధం బసవ శంకరరావు

అన్నమయ్య (వేంకటాచలపతి ఆలయం, తిరునెల్వేలి, తమిళనాడు)

247. వీడె నెలకొన్నాడు

సంకీర్తన: 237 రాగం: సాళంగనాట

వ్రాతప్రతి పుట: 225 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 27వ సంపుటంలో పీఠిక (పుట xxiii) లో సౌరాష్ట్ర రాగం, ఆదితాళంతో ప్రస్తావితమైనది)

వీడె నెలకొన్నాడు శ్రీవేంకటగిరి మీద
వీడె కౌరవుల పాలిటికి విశ్వరూపుడితడు ॥పల్లవి॥

త్రిపురంబులపై వ్రాలిన యాఘన తీవ్రబాణమితడు
చపలపు బాణుని మర్మభేదియగు చక్రధరుడితడు
విపరీతము కంబములో వెలసిన వీర సింహమితడు
కపటపు భస్మాసురుని పాలిటికి కాలదండమితడు ॥వీడె॥

ధరణి కింద బలి నణచిన యాపాతాళభేదియితడు
పరశురాముని గర్వము నణచిన ప్రళయ వాయువితడు
ఒరసిన నరకాసురుని పాలిటికి ఉరుమని పిడుగితడు
దురమున నెదిరిన దనుజకోటులకు ధూమకేతువితడు ॥వీడె॥

అదుగో విధిరుద్రాదుల కెల్లను ఆదిమూల మితఁడు
పదిలముగా తను గొలిచిన యాశ్రితపారిజాతమితడు
కదలని యా బ్రహ్మాండకోటులకు కన్నతండ్రి యితడు
వెదకి వెదకి వరము లొసంగెడి వేంకటపతి యితడు ॥వీడె॥

ఆదిమూలము, ఆశ్రిత పారిజాతమైన ఆ వేంకటపతి తన భక్తులకు వెదకి వెదకి వరాలనిస్తాడట!

– *గంధం బసవ శంకరరావు*

248. వెదకి వెదకి చొప్పు

సంకీర్తన: 238 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 227

(ఈ సంకీర్తన 15వ సంపుటంలో 411వ సంకీర్తనగా ఉంది. రాగిరేకు (సంఖ్య 72)లో రాగం సాళంగనాట)

వెదకి వెదకి చొప్పు లెత్తుచును విచారించితి నిన్నాళ్లు
యిదివో కంటిని శ్రీవేంకటగిరి యెదుటనే నీ శ్రీపాదములు ॥పల్లవి॥

ఘనతులసీకాననంబులో కాఁపురము సేతు వనఁగాను
అనిశమ్ముఁ బద్మవనంబునను ఆడుచు నుండుదు వనఁగాను
నిను నీ దాసులు పాడేచోట్ల నెలవై యాలింతు వనఁగాను
యినమండలమున నుండుదు వనఁగా యీమాట విని నేను ॥వెదకి॥

పైకొని క్షీరాంబుధిలో నెప్పుడు పవళించి వుందు వనఁగాను
వైకుంఠంబున వెలుఁగొందుచు సర్వము భావించే వనఁ గాను
దాకొని జీవులలో నెప్పుడు నంతర్యామివై వుందు వనఁగాను
లోకము నీవై వుండుదు వనఁగా లోలత నీమాట విని నేను ॥వెదకి॥

పరమయోగీంద్రులు తలపోయుచునున్న భావముతో నుందు వనఁగాను
పరిపరివిధముల పుణ్యకర్మము పాయక చరింతు వనఁగాను
గరిమల నెప్పుడు అలమేల్మంగ కౌఁగిటిలోవాఁడ వనఁగాను
యిరవుగ శ్రీవేంకటేశుఁడ వనఁగా యీమాట విని నేను ॥వెదకి॥

అలమేలుమంగ కౌగిటలో కొలువైన శ్రీవేంకటేశ్వరుని పెదతిరుమలాచార్యులవారు కీర్తిస్తున్నారు!

– గంధం బసవ శంకరరావు

249. వెనకకు వాని చేత

సంకీర్తన: 178 రాగం: శుద్ధకాంబోది
వ్రాతప్రతి పుట: 173 తాళం: లుప్తము

వెనకకు వాని చేత - వేగితినమ్మ, నీ దీ
వనగూడి నేడంకెకు - వచ్చేనింతే కాక ॥పల్లవి॥

చిన్ననాడె వాని వలల - చిక్కిన నాటికి నేడూ
కన్నుల గరవు దీర - గంటినోయమ్మా
చన్నులు గొప్పవైన యీ - సందికి నేగువాని
చెన్నార కౌగిట - గుబ్బితి నోయమ్మా ॥వెనకకు॥

యెనసిన వాని బాసిన - యిన్నాళ్లకు నేడువాని
తనివారా మోవితేనె - తాగితి నేయమ్మా
పెనగి పెండ్లినాడు పేరు - కొన్న దది సుంత
మనసారా వానితోడ - మాటాడితినోయమ్మా ॥వెనకకు॥

అంతయేలె నాలుమగ - లైన యిన్నాళ్లకు నేడు
చింత దీర కాపురము - చేసితి నోయమ్మా
చెంతనలమేలుమంగ - శ్రీవేంకటేశు గూడె
నింత కాలానకు నుర - మెక్కితినోయమ్మా ॥వెనకకు॥

స్వామి కౌగిట చేరి, ప్రేమతో పలుకులాడి, కాపురము చేసి వక్షస్థలమున కొలువైన నిత్యానపాయిని అలమేలుమంగ ఆనందం ఈ సంకీర్తనలో ద్యోతకం!

- గంధం బసవ శంకరరావు

250. వెలదిరో తిల్లగోవిందుని

సంకీర్తన: 154 రాగం: రమామనోహరము
వ్రాతప్రతి పుట: 151 తాళం: లుప్తము

వెలదిరో తిల్లగో - విందుని వగలు
తలచితే నిప్పుడును - తమకించీ మేనెల్లా ॥పల్లవి॥

చెక్కు నొక్కి ముద్దుబెట్టి - చిన్నిమోవిపంట నూది
సొక్కుచు నరగన్నులు - సొంపులు మీరగను
గ్రుక్కలుగా మోవితేనె కొద్దీ తేనియ - గోలుచునుండేవాని
నక్కరో పొమ్మనగానో - రాడే నటవే ॥వెలదిరో॥

చనవునుగొని మూగుచును - సరసత నిక్కువల
పనిగొనుచును పని గఱచుచు - భావము రంజిల్ల
తనువులొకటిగా బెనగుచు - (తనిసి) వారలుండగా
కినిసిననేనవ్వల బొ-మ్మన మనసౌనటవే ॥వెలదిరో॥

పచ్చవిలుతుకేళిని నెమ్మో - వానుచు కలయుచు
ముచ్చట దీర్చుచు మోమును - మోమునజేర్చుచును
పచ్చిదేర శ్రీవేంకట - ప్రభుడై ప్రేమముతో దన
యిచ్చగనెదనుంచితేను - యేనెటు కాదందునే ॥వెలదిరో॥

"తలచిన హృదయము ఝల్లను" (ఈ సంపుటం -130) అని నాయకుడు ఓ సంకీర్తనలో తలచినట్లుగా, ఇక్కడ నాయిక గోవిందరాజస్వామి వగలును, సొబగులను తలచి పరవశిస్తుంది.

- గంధం బసవ శంకరరావు

251. వేఁడుకొంటె విందుగాక

సంకీర్తన: 56 రాగం: శంకరాభరణము
వ్రాతప్రతి పుట: 57 తాళం: లుప్తము

వేఁడుకొంటె విందుగాక – వేగిరింతురా
వాఁడి చూపి రంతు సేయ – వద్దురా చెన్నుడ అయ్యయ్యో ॥పల్లవి॥

పోతరించి యిల్లు సొచ్చి – పొంచి మావారెల్ల జూడ
గాతజేసి గుబ్బ చన్నులు – కత్తిగోరను
కోతుర నే తల్లి మరగు – కూతురంటె (నీకు) మొక్కేనంటే
బూతుల దిట్ట నీతులా, కురు – నూతుల చెన్నుడ అయ్యయ్యో ॥వేఁడుకొంటె॥

యేతరివై వీధిలో సరి – యింతులెల్ల – జూచి నవ్వ
జాతి వజ్రంపు పంటిమొనలు – చౌకళించే మోవిపై
జాతిపడ నొక్కకురా పడుచు దాననంటె గుచ్చి
చేతులబట్టీ నీతులా, కురు – నూతుల చెన్నుడ అయ్యయ్యో ॥వేఁడుకొంటె॥

యీతరి నన్నిందరిలో – నెన్నికగా చనవిచ్చి
వాతుమాతు దెలిసి మీన – కేతనుని కేలి(దేలి)
వ్రేతలనలమేలుమంగ శ్రీ – వేంకటేశుడవై గూడితి
జాతులబెట్టగ నీతులా, (కురు–నూతుల) చెన్నుడ అయ్యయ్యో ॥వేఁడుకొంటె॥

వేడుకొంటేవిందుగాక – భావకోశం
మూడు చరణాలూ 'త' ప్రాసతోనే నడచినవి
కడపజిల్లా కురునూతుల చెన్నకేశవుని కీర్తించిన శృంగారసంకీర్తన!

– గంధం బసవ శంకరరావు

252. వేఁడుకొందామా వేంకటగిరి

సంకీర్తన: 5 రాగం: లుప్తము

వ్రాతప్రతి పుట: 11 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుట. 6లో ఉదాహృతం)

వేఁడుకొందామా వేంకటగిరి - వేంకటేశ్వరుని ॥పల్లవి॥

ఆమటి[1] మ్రొక్కులవాఁడే - ఆదిదేవుఁడే వాఁడు
తోమని[2] పళ్యాలవాఁడే - దురిత దూరుఁడే ॥వేడుకొందామా॥

వడ్డికాసులవాఁడే - వనజనాభుఁడే, పుట్టు
గొడ్డురాండ్రకు[3] బిడ్డలనిచ్చే - గోవిందుఁడే ॥వేడుకొందామా॥

ఎలమి[4]ఁ గోరినవరా - లిచ్చే దేవుఁడే వాఁడు
అలమేల్మంగా శ్రీవేం - కటాద్రినాథుఁడే ॥వేడుకొందామా॥

'తాళ్లపాక శేషాచార్యులుగారి వ్రాతప్రతి'లో గల యీ పదమును పరిష్కరించి ప్రకటించినవారు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు (చూ. అ.చ.పీ., పుట 6)

ఆభోగ చరణమందలి ముద్రా స్వరూపమిది పెదతిరుమలాచార్యులవారిదిగా తోచుచున్నది. చిన్నన్న ద్విపద గ్రంథమున ఉదాహృతమైన యీ పాటను ప్రభాకరులు గుర్తించి (చూ. 13 పుట) అని వ్రాతప్రతిని సంకేతించి చూపిరి. ఇది అన్నమాచార్యులవారి సంకీర్తన అగుటయు సంభావ్యమే.

- వేటూరి ఆనందమూర్తి

---

1. ఆవంటి; **2.** తొమ్మని; **3.** గొడ్డురాండ్లకు; **4.** యలమి

253. వేళ కొాదవినవాఁడె

సంకీర్తన: 94 | రాగం: నాదనామక్రియ[1]
వ్రాతప్రతి పుట: 95 | తాళం: ఉుప్తము

(ఈ సంకీర్తన సంపుటం: 26, పీఠిక, పుట 10లో ఉదాహృతం)

వేళ కొాదవిన[2]వాఁడె - విందుగాక, తన
వేళ లెంచి కొంచితే[3] - వేడుకలు పుట్టునా[4] ॥పల్లవి॥

ఇంతి మోమూ[5], నరవిరిగా జా - రే కొప్పు, విరులు
యింత వొట్టూ[6] నీకుఁ జూడ - యెట్లుండె నమ్మా[7]
చెంతరాహువు[8] తన - చెలికాని గదియఁగా
కంతుఁ డంపగమిచేతఁ - గప్పినట్లుండె[9] ॥వేళ॥

సగము జారే[10] పయ్యదా, - జవ్వని గబ్బిగుబ్బలూ
యెగువ కెంపులతాళి, - యెట్లుండెనమ్మా
మొగుడుఁదమ్ముల మంచు - ముంచుకొని రాగా[11]
తగవుగాదని రవి, - తరిమి నట్లుండె[12] ॥వేళ॥

అలమేలుమంగమేనూ - అలనాటి[13] విరహము
యెలమి శ్రీవెంకటప్ప - డెట్లుండె[14] నమ్మా
మలసి లేదీఁగె యెండ - మావుల కడువాడగా[15]
పొలుచు నీలమేఘము - పొదివి నట్లుండె[16] ॥వేళ॥

ఏలపదాల రీతిలో సాగిన పదం శేషాచార్యుల వ్రాతప్రతి సంకీర్తనను అచ్చుకు స్వీకరించటం జరిగింది.

- గంధం బసవ శంకరరావు

---

1. ఈ పాట 'తాళ్లపాక సంకీర్తనలు' (a)ప్రతిలో నాదనామక్రియలోను, తంజావూరి ప్రతి (b)లో గౌడిపంతు-ఆటతాళములోను కలదు. సం.26 పీఠిక 10లో రాగం పేరు లేదు. **2.**(a) వేళకొాదిగిన (సం.26 పీఠిక 10, వేళకొాదవిన). **3.**(b) కొంకితే **4.**(b) వేడుక పుట్టునా **5.**(a) కొంతమోమూ (ప్రాస పూర్వాక్షర నియతి తప్పెను) (కొని యిట్టివి వీరి వాఙ్మయమున లేకపోలేదు. (26-112) (b) కొంతయు (నిర్మాణ భంగము) **6.** యింతోటు **7.**(a)అన్ని చరణములందును 2,4 పాదాంతములు యెట్లుండెనే-అట్లుండెనే అనే రీతి నున్నవి. (b) అన్ని చరణములందును 2,4 పాదాంతములు యెట్లుండెనమ్మా-అట్లుండె అను రీతి నున్నవి. **8.** రాహు. **9.** కాంతుఁడంపంగాను నాగమ్మినట్లుండె **10.** జార, సం.26 పీఠిక. జారు **11.**(a) మొగడదమ్ముల పైమంచు ముంచుకొనిరాగా (b) మగటిమి తమ్ములము మయంచు ముంచు కోరాద **12.** (a) దగ్గరినట్లుండెనే (b) తరమినట్లుండె **13.** (b) ఆ తొలతటి; అలతొల్లి సం.26 పీఠిక (b) ఆనాటి **14.** (a) శ్రీవేంకటప్పా యెట్లుండెనే (b) శ్రీవేంకటప్ప యెట్లుండెనమ్మ **15.**(b) పసివాడగ **16** (a) పొదలినట్లుండెనె (b) పై బొదలినట్లుండె సం.26, పీఠిక పొడమినట్లుండె.

254. శంఖమా! పోయివత్తునా?

సంకీర్తన: 203 రాగం: వసంత భైరవి
వ్రాతప్రతి పుట: 196 తాళం: లుప్తము

శంఖమా! పోయివత్తునా? - చక్రమా ! పోయివత్తునా?
లంకెలైన (పై) రెండు (చేతులా)- (లావు మెరిసిన) మీరూ రండు ॥పల్లవి॥

నీడ తిరుగని చింతా! - నే బోయివత్తునా
తోడు నీడ(వై) నీవూ నా - తోడనే రావమ్మా
వోడక పసిడి కంభమా! (నే) - వూరికి పోయివత్తునా
యేడ నున్నను వరా - లిత్తువు నీవూ రమ్మీ ॥శంఖమా!॥

చక్కదనపుటంజన - శైలమా! పోయివత్తునా?
నిక్కువమై నాకు నవ - నిధు లిత్తువు రావమ్మా
యెక్కువ నమృతంపు కో - నేరా! పోయివత్తునా?
అక్కజపు మా జీవన - మైపోదువు నీవూ రమ్మీ ॥శంఖమా!॥

ననిచిన శ్రీ వేంకట - నాథుడా! పోయివత్తునా
నెనరు (గల) వాడవై వెంట - నీవూ రా రమ్మీ
నను గన్న యలమేల్మంగ - నాంచారీ పోయివత్తునా?
వెనక ముందర (నిలిచి) - విజయ మిత్తువు రమ్మీ ॥శంఖమా!॥

ఇది ఎవరు చెప్పిన వీడ్కోలు మాట? ఏ సందర్భంలో పాడిన పాట? ఎక్కడికి పయనము? ఏ పని మీద?

ఈ ప్రశ్నలకు బదుళ్లు మనం ఈ పాటనుంచే, లేదా వారి పాటలనుంచే, ఆ కాలపు చరిత్ర, శాసనాల నుంచే వెదుక్కో వలసి ఉంటుంది. అందుకు పాటలోని 'తోడునీడవై', 'ఊరికి పోయివత్తునా', 'జీవనమైపోదువు' 'విజయ మిత్తువుగాని' వంటి పదబంధాలు సూచకాలు. వీటినిబట్టి ఈ యెడబాటు తాత్కాలికం కాక, తిరుపతి నుండి పూనికతో స్థలాంతరంలో ఉండవలసివచ్చినప్పటి ఉనికికి సంబంధించినదై ఉంటుంది. పనిమీద ఏ తాళ్లపాకకో తాత్కాలికంగా వెళ్లివచ్చే లాంటి సందర్భం కాదిది. అట్లాగని జీవుని తుదికోరిక వంటిదీ కాదు.

'వేంకటనాథ' ముద్రనుబట్టి ఇది తాళ్లపాక చినతిరుమలాచార్యుల పాటయే. ఈ ముద్రతో అన్నమయ్య పాడి ఉండ కూడదా అంటే ఉండవచ్చునుగానీ, సమయ సందర్భాలు మనుమనికి ఒప్పినంతగా తాతకు నప్పవు. వ్యాసుడు కాశీని వీడి వెళ్లవలసి వచ్చినపుడు శ్రీనాథమహాకవి చిత్రించిన సన్నివేశం వంటిదిది.

సరిగ్గా ఇప్పటికి 480 సంవత్సరాలకుపూర్వం హేమలంబినామ సంవత్సరంలోనే చినతిరుమలాచార్యులు 1537లో తిరుపతినుంచి గుంటూరుసీమకు మకాం మార్చి మంగళగిరిలో నృసింహస్వామికి సంకీర్తనవాక్పూజలు నిర్వహించి, భజనసంకీర్తనపద్ధతికి పాదులుకట్టి వ్యాప్తికి తేవలసివచ్చింది. ఇది అప్పటి పాటై ఉంటుంది. తనకు బ్రహ్మోపదేశం చేసి సంకీర్తనభిక్ష పెట్టిన తాతగారిమీదనూ, స్వామివారిమీదనూ గల చనువుకొద్దీ చినతిరుమలాచార్యులు స్వామివారిని పరివారంతోసహా తనతోపాటు వచ్చేయమని అర్థిస్తున్నాడు. ఆ సందర్భానికి తగినట్లుగానే కాబోలు ఆయన ఒక ప్రత్యేకమైన రాగిరేకునుకూడా ముద్రింపించుకొన్నాడు. అందులో ఇటూ అటూ శంఖచక్రాలూ, మధ్యలో స్వామివారి తిరునామం, దిగువన తాతగారి స్మృతిచిహ్నంగా తన సంకీర్తన మొకటి చెక్కించుకున్నాడు. శిథిలరూపానగల ఈ 203 అముద్రితసంకీర్తనకు ఒక రూపును తెచ్చి, ఒక కథను జోడించాను. ఇందులోని నీడ తిరుగని చింతచెట్టు స్వామివారికన్నా దొడ్డదిగా ఇతిహాసమాలలో ప్రస్తుతిగన్నది. శంఖచక్రాలు భగవద్రామానుజులు తీర్చిదిద్దినవని చరిత్రచెబుతున్నది. స్వామి పుష్కరిణిగా పేరొంది, అమృతమయములైన పవిత్రజలాలతో నిండిన కోనేరు తమకు జీవనాన్నిచ్చింది.

అపూర్వమైన యీ సంకీర్తన పాఠాంతరాన్ని తంజావూరు తాళపత్రారణ్యంలోనూ చూచిన గుర్తు.

– వేటూరి ఆనందమూర్తి

Sankeertana 203 - As its content projects, this is supposed to be a farewell song sung by Tallapaaka Chinna Tirumalaachaarya to Tirumala precincts, while leaving for GunTuru siima on the divine mission of performing "Sankirtana AruLapaaDu" at MangaLagiri around 1537 AD. This song reflects many of the traditional and historical accounts of the famous twin temple towns of Tirumala-Tirupati of the 15th-16th centuries.


౧౬౮

వసంతభైరవి

ప॥ శంఖమా పోయివత్తునా చక్రమా పోయివత్తు-
నా లంకెలైన శంఖుభుజాల మేరంకంటి॥ నిరది
గంగనిమిత్త నే పోయివత్తునా తెరాదనే ధర్తె నాతో
డనె రమ్మా। వైకుంఠపతికి కంజమా పూరిపో-
యివత్తునా। ఇమెతానున్నవరాల్ అత్తువు నీవు రమ్మా॥
౧॥ చక్రధనవు టంజనశైలమా పోయివత్తునా।నిక్కి
నాంకు నవనిధు లిత్తువు రమ్మా। యెక్కువనమ్ము తంపు
కోనేరి పోయివత్తునా। అక్క శిఖమా శేవనమపో-
దువు రమ్మా॥౨॥ వనమునశ్రీ వేంకటనాథుడా పోయి
వత్తునా నానేకనరువాడవై వెంటనె నీవు రమ్మా। న-
మగన్న అలమేలుమంగ నాబారి పోయివత్తునా।
వెనకముందర నీవు విజయమిత్తువు రమ్మా॥3॥

వ్రాతప్రతిలో 'శంఖమా! పోయివత్తునా' సంకీర్తన



శంఖు చక్రాలు దిద్దిన తాళ్లపాక సంకీర్తన రాగిరేకు

255. శరణాగతవత్సల

సంకీర్తన: 38 రాగం: శంకరాభరణము

వ్రాతప్రతి పుట: 39 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన సంపుటం 27 పీఠిక, పుట xxii లో శంకరాభరణమురాగంలో త్రిపుట తాళంతో ప్రస్తావితం)

శరణాగతవత్సల - సర్వసులభ
పురుషోత్తమ! నాచే నీవు - పూజ గొనవయ్యా ॥పల్లవి॥

ముంబరపు బ్రహ్మాండములు - మోచు నీ మీదనా
చెంబులోని నీళ్లు - చిలికించేది
పంబిన నిందిరాదేవి - పగిది వాసంతపు గా
మ్యంబు దీర నాచే నీవు - మజ్జనమాడవయ్య ॥శరణాగత॥

పట్టరాని విశ్వరూ - పముఁ జూపే నిన్ను నే
పెట్టెలోనా (బిగ్గ - బట్టి) కట్టేది
పట్టమేలే కౌసల్య గ - ర్భములో నున్నయట్లు చే
పట్టి వైకుంఠపు - పట్టు జేసుకోవయ్యా ॥శరణాగత॥

అల చరాచరము లా-రగించే నీకు నే
వెలయకుండతోనా నై - వేద్యమిచ్చేది
అలమేల్మంగ శ్రీవేంకటాద్రి - నాథునకు నే
వెలయ భరద్వాజ - విందు జేసుకోవయ్య ॥శరణాగత॥

భరద్వాజ విందు ప్రస్తావితం!, చి.తి./పె.తి. ముద్ర?

విశ్వరూపుడైన శ్రీవేంకటాద్రినాథునకు శరణాగతితో సేవ చేయడం సంకీర్తన సారం!

- గంధం బసవ శంకరరావు

256. శరణుశరణు

సంకీర్తన: 88 రాగం: మాళవి

వ్రాతప్రతి పుట: 90 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుట 63లో ఉదాహృతం)

శరణుశరణు సురేంద్రసన్నుత శరణు శ్రీసతివల్లభా
శరణు రాక్షసగర్వసంహర శరణు వేంకటనాయకా ॥పల్లవి॥

కమలధరుఁడును కమలమిత్రుఁడు కమలశత్రుఁడు పుత్రుఁడు
క్రమముతో మీకొలువు కిప్పుడు కాచినా రెచ్చరికయా ॥శరణు॥

అనిమిషేంద్రులు మునులు దిక్పతు లమర కిన్నర సిద్ధులు
ఘనతతో రంభాదికాంతలు కాచినా రెచ్చరికయా ॥శరణు॥

ఎన్నఁగల ప్రహ్లాదముఖ్యులు నిన్నుఁ గొలువఁగ వచ్చిరీ
విన్నపము వినవయ్య తిరుపతి వేంకటాచలనాయకా ॥శరణు॥

భజనపద్ధతిలో అన్నమాచార్యునిదిగా నాఁటనుండి నేఁటిదాఁక సాగుచున్న యీ పై సంకీర్తనమును జదివి, పురందరదాసుగారి యీ క్రింది సంకీర్తమును గూడఁ జదువుఁడు.

(వేటూరి ప్రభాకరశాస్త్రి, అ.చ.పీ,పు. 63)

రాగం: మాళవి

శరణుశరణు సురేంద్రవందిత శరణు శ్రీపతి సేవిత
శరణు పార్వతితనయ మారుతి శరణు సిద్ధివినాయక ॥పల్లవి॥

నిటలనేత్రన దేవిసుతనె నాగభూషణప్రియనె
తటిల్లతాంకితకోమలాంగనె కర్ణకుండలధారనె ॥శరణు॥

బటువు ముత్తిన పదకహారనె బాహు హస్త చతుష్కనె
ఇట్టితొడగియు హేమకంకణ పాశ అంకుశధారనె ॥శరణు॥

కుక్షియొళు మహాలంబోదరనె ఇక్షుచాప గెలిదనె
పక్షివాహన నాద పురందరవిట్ఠలన నిజదాసనె ॥శరణు॥

అన్నమాచార్యులవారి సంకీర్తనచ్ఛాయనే పురందరదాసులవారి కీర్తనమున్నది. **– వేటూరి ఆనందమూర్తి**

257. శృంగారశీలునకు

సంకీర్తన: 73 రాగం: శంకరాభరణము
వ్రాతప్రతి పుట: 74 తాళం: లుప్తము

శృంగారశీలునకు మంగళం
సంగీతలోలునకు మంగళం ॥పల్లవి॥

కనకాంబరునకు – కరుణాకరునకు
మనసిజ గురునకు – మంగళం
మునివర దాతకును – దనుజ (వి)జేతకును
మనుకుల నేతకును – మంగళం ॥శృంగార॥

విధినుత హరికిని – విశ్వాధారునకు
మధుసంహారికిని – మంగళం
బుధపోషనకును – భోగిశయనునకు
మధు భాషణునకు – మంగళం ॥శృంగార॥

బహుమత యతికిని – మహిరమాపతికిని
మహనీయ ధృతికిని – మంగళం
విహగవాహనునకు శ్రీ – వేంకటేశునకు
మహితదేహునకు – మంగళం ॥శృంగార॥

శిఖాపదం వంటి సంకీర్తన, సుందరమైన మంగళం.

– వేటూరి ఆనందమూర్తి

258. శ్రీనివాసా! జగదేకనాయకా!

సంకీర్తన: 41 రాగం: శంకరాభరణము
వ్రాతప్రతి పుట: 41 తాళం: లుప్తము

శ్రీనివాసా! జగదేకనాయకా! - శ్రితకల్పతరువ!
గానవిలోల! భక్తవత్సల! - కరుణించవే అప్పయ! ॥పల్లవి॥

సొలవక [1]తిరుకచ్చి - నంబిపై బెట్టిన - చూపు నా పై బెట్టవయ్య!
చెలగి (నాపై) [2]తొండ - మాన్ జక్రవర్తిపై - చేసిన దయ సేయుమయ్య!
యెలమి నన్ను [3]దిరు - మల నంబిగారిని - ఏలినటువలె నేలుమయ్య!
పలుమాట లేటికి - వారి విన్నపముల - (నెలసి విన్నట్టులే) వినుమయ్య!
॥శ్రీనివాసా!॥

సరగున మును - [4]నాథముని కిచ్చినట్టి - చనవు నాకు నియ్యుమయ్య!
[5]కురువనంబిగారి - మీద నుంచినట్టి - కూర్మి నాపై నుంచుమయ్య!
అరుదుగ మును [6]ననం - తాళువారి నేలి - నటువలె నన్నేలుమయ్య!
పరమార్థమును గని - (భృత్యుని)భృత్యుని - పలుకు లాలకించుమయ్య!
॥శ్రీనివాసా!॥

అలయక (మున్ను) [7]రా - మానుజుల నేలిన - యటువలె నన్నేలుమయ్య!
తలపులోన నీ - దాసుల దాసుల - దాసుడనీ యనుమయ్య!
అలమేలుమంగ శ్రీవేంక - టప్పా! (మమ్ము) పూ - ర్వాచార్యుల జూచి (బ్రోచి)
వెలయ వారి దాసు - విన్నప (మాలించి) - వేవేగ జేకొనుమయ్య!
॥శ్రీనివాసా!॥

జగదేకనాయకా; సొలవక; విన్నపములు; మొదలగు రుచిగల ప్రయోగములతోపాటు వైష్ణవ పూర్వాచార్యుల పుణ్య స్మరణ మిందుకలదు. వైష్ణవ గురుపరంపరలోవారి కొక్కొరికినీ ఒక్కొక ప్రత్యేకస్థానమున్నది. ఇందలి ముద్రనుబట్టీ; వచనములకును, సంకీర్తనములకును మేలుకలయిక లనదగు “విన్నపము”లను విశిష్ట ప్రక్రియనుబట్టీ యిది పెద తిరుమలాచార్యుల సంకీర్తన మని గుర్తింపదగును. ఇందులోని ప్రతి పాదమున ఆద్యక్షర యతినియతి తోపాటు మరొక చోటకూడా ఐచ్ఛికముగా యతియో, ప్రాసయతియో ఉన్నట్లున్నది!

ఈ సంకీర్తనలో శ్రీవైష్ణవ మతసంప్రదాయానికి చెందిన ఏడుగురు మహాపురుషుల ప్రస్తావన మున్నది.

1. కాంచీపూర్ణులు అనబడే తిరుక్కచ్చినంబి కంచిలోని వరదరాజస్వామివారికి చామరసేవ చేసేవారు.

2. తొండమానుడు ఆకాశరాజు సోదరుడు. తిరుమలమీది ఆనందనిలయ నిర్మాతగా ప్రసిద్ధిగన్నవాడు. కలియుగ ప్రత్యక్షదైవమైన స్వామివారు ఆపదమొక్కులవాడై, పూర్ణప్రాణదాతయై, జీవుల పాపాలనణచి, మృతులనుకూడ పునరుజ్జీవితులనుజేసి చూపిన మహాయోగి.

3. తిరుమలనంబి స్వామివారిచేతనే 'తాతా' అని పిలిపించుకున్నవాడు. నియతి తప్పకుండా ఆకాశగంగా జలాలను దెచ్చి అభిషేకప్రియుడైన స్వామివారి జలాభిషేకసేవలో తరించినవాడు.

4. ఆద్యులైన శ్రీవైష్ణవమత ప్రవర్తకులలో ముఖ్యుడైన నాథముని ఆళ్వారుల నాలాయిర ప్రబంధాలను సంకలనపరచిన మహనీయుడు.

5. కురువనంబి మహాభక్తుడు. తిరుమలలో ఆలయానికి వలసిన వంటకుండలను తయారుచేసేవాడు. ఆతడర్పించిన మట్టిపూలనే స్వామివారు తొండమాన్ చక్రవర్తి సమర్పించిన బంగారుపూలకన్నా మిన్నగా సంభావించినాడన్న స్థలపురాణగాథను అన్నమాచార్యులు తమ సంకీర్తనల్లో కీర్తించారు.

6. అనంతాళ్వారు తిరుమలమీద తోటలు పెంచి, స్వామివారికి నిత్యం జరిగే పుష్ప కైంకర్యసేవలో చరితార్థులైనవారు.

7. వైష్ణవలోకాచార్యులూ, విశిష్టాద్వైత మతప్రవర్తకులూ అయిన భగవద్రామానుజులవారు దివ్యదేశా లన్నింటిలోనూ ప్రసిద్ధములైన కంచి, తిరుపతి, పంచనారాయణ క్షేత్రాలు మున్నగువాటి చరిత్రకు సుస్థిర రూపకల్పనచేసిన మహనీయులు.

– వేటూరి ఆనందమూర్తి

259. శ్రీపతివని పెద్ద

సంకీర్తన: 74 రాగం: శంకరాభరణము
వ్రాతప్రతి పుట: 75 తాళం: లుప్తము

శ్రీపతివని పెద్ద - సేసినా నెరుగవు
ఆ పనులకు మేము - నోపమా గోవింద ॥పల్లవి॥

రోల గట్టినదాని, - కాల దన్నినవాని,
మేల మాడినవాని - మెచ్చితివి;
గోలనై నే నెంత - గొలిచినా నెరుగవు
యీ లీల నను గాచు - టేలాగయ్య ॥శ్రీపతివని॥

యంగి లిడినదాని - (కడవి) నడచినవాని,
దొంగిలించినవాని - తోడయితివి;
చెంగట నీ సేవెంత - సేసినా నెరుగవు
సంగతిగ నను గాచు - జాడ యేదయ్య ॥శ్రీపతివని॥

కూర బెట్టినదాని - పేరు గుచ్చనివాని,
జారుడైనవాని - జేరి గాచితివి;
చేరి యలమేల్మంగ - శ్రీవేంకటేశ్వర
యీ రీతి ననుగాచు - టేలాగయ్య ॥శ్రీపతివని॥

ఈపాట వ్రాతప్రతిలో శంకరాభరణరాగాల వరుసలో ఉన్నదిగనుక అదే రాగమనుకొందును.

శ్రీవేంకటేశ్వరుని శ్రీపతిగా, లక్ష్మీనారాయణునిగా, దేవదేవునిగా, సర్వదేవతామూర్తిగా తాళ్ళపాక కవీశ్వరులు స్వామివారిని దర్శించారు. పెద్ద తిరుమలాచార్యులు ఈ సంకీర్తనను సకలాగమ పురాణేతిహాస మాహాత్మ్య కథాసర్వస్వంగా తీర్చినట్లున్నారు. ముచ్చటైన మూడు చరణాలలో, చక్కని నిర్మాణసౌష్ఠవంతోసాగిన యీ కీర్తనలో తొలితొలిసగాలలో భక్తుల స్మరణలున్నవి. వారిలో క్రమంగా ముందు ముందు ముగ్గురు మాతృమూర్తులు, పిదప వరుసగా ఇద్దరేసి చొప్పున పురుషస్వరూపులు ఉన్నారు. పౌరాణికులు, పాఠకులు, శ్రోతలు, తమకుగల పురాగాథల పరిచయముతో ఆయా ప్రసిద్ధపాత్రలను తేలికగా అన్వయించుకోగలరుగాకను విశ్వాసముతోనే కాబోలును కవి వారివారి పేరులను రచనలో వాచ్యము చేయలేదు. అలాగే మూడుచరణాల ఉత్తరార్ధాలలో అలమేలుమంగమ్మ స్వామివారికి విన్నవించుకొన్నట్లుగా కవివాక్కు లున్నవి. అందరినీ అనుగ్రహించిన రీతిగానే తననూ చల్లగా చూడుమని అమ్మవారి వేడికోలు.

- వేటూరి ఆనందమూర్తి

260. శ్రీరంగపతి ముద్దు

సంకీర్తన: 142 రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 140 తాళం: లుప్తము

శ్రీరంగపతి ముద్దు – తీరంగ దమి తేరె
సారంగలోచనలు – చేరంగ రారె ॥పల్లవి॥

కలికికావేరి తరగల – దేలి కంకణపు
చెలువ ముత్తియపు – సేసలుచల్లగా
బలువైన భోగీంద్రు – పడగగొడుగులనీడ
కలశాంబునిధి కన్య – కను పెండ్లియాడె ॥శ్రీరంగపతి॥

తమితోడ సదరంపు – తామెర పై నుండు
రమణి చూపులతొ నా – రతులియ్యగా
మమత కెమ్మోవి బు – వ్వములారగింపుచును
కమలనెచ్చెలిని భూ – కాంతఁ బెండ్లాడె ॥శ్రీరంగపతి॥

కెలన గనవచ్చు పొ – క్కిలి తమ్మిచౌమొగము
నలువెంటబలు శోభ – నలుపాడగా
చెలగి యలమేల్మంగ – శ్రీవేంకటేశుండు
నెలత సయిదోడుగా – (నిలిపి) పెండ్లాడె ॥శ్రీరంగపతి॥

పెండ్లి కీర్తన, చెలువ ముద్రతోడి రంగపదం.

కావేరీనదీతీరంలో కొలువైన శ్రీరంగపతిని కీర్తిస్తున్నాడు కవివరేణ్యుడు!

– గంధం బసవ శంకరరావు

261. శ్రీవేంకటాద్రినాథురే

సంకీర్తన: 89 రాగం: మాళవిగౌళ
వ్రాతప్రతి పుట: 90 తాళం: లుప్తము

శ్రీ వేంకటాద్రినాథురే - చోర వేంకటపతి (జోగిరే)
సిత కర్పూరభూతి యోగిరే, శంకు సింగినాథురే

ధవళ కర్పూరభూతి ధారయాధరురే
భువన సంచిత కుక్షి పొంకజాల సుగుణురే
నవవాసు(కీ) గంధ యోగినాథురే
పవనాశకృపాపాల పాలితురే

అభినవ కాళీతాండవాకారురే
ఆదినాథ పరమానంద సింధురే భూదారధరురే(?) భుజగశయనురే
దగదగాం దిగిదిగిం తందుగుణిధిమికిట తాండవకరురే

మచ్ఛేంద్ర కూర్మ రజతాచల సింగినాదం
మోడా(?)మల స్పటిక బంధ వామభాగం
శ్రీరామ చరణ తారక మంత్ర సిద్ధం
గోరక్కనాథ జనితామల సిద్ధరాజం

ఈ సంకీర్తన పరిష్కృత పాఠానికి ఇదే సంపుటంలోని 39, 40 పుటలలో చూడండి.

- గంధం బసవ శంకరరావు

262. శ్రీవేంకటేశ్వరుడున్నాడు

సంకీర్తన: 213 రాగం: లుప్తము

వ్రాతప్రతి పుట: 203 తాళం: లుప్తము

శ్రీవేంకటేశ్వరుడున్నాడు - చేరి యలమేల్మంగతో[1]
భావించి మనవాండ్లు - బ్రతుకరే మీరు ॥పల్లవి॥

కుచ్చికుచ్చి యాతనినే - గోరి పాడరే
(రెచ్చి)[2] తమకము - రేచి మోహించరే
ముచ్చట గొత్తగా బద - ములు చెప్పరే
పచ్చిదేర నుతియించి - బ్రతుకరే మీరు ॥శ్రీవేంకటేశ్వరుడున్నాడు॥

మొగము జూచి యాతనినే - మోహించరే
నగుతా మేలమాడి యా - నందించరే
(తగిలి)[3] సేవసేసి ముం - దర నిలువరే
పగటునఁ బ్రార్థించి - బ్రతుకరే మీరు ॥శ్రీవేంకటేశ్వరుడున్నాడు॥

శరణుజొచ్చి యాతనినే - సారె నమ్మరే
వరముల రాయని(పాడి)[4] - వర్ణించరే
ఇరవై శ్రీవేంకటేశుఁ - డేలె నన్న(నరే)[5]
పరమునిహమునిచ్చీ(ని)[6] - బ్రతుకరే మీరు ॥శ్రీవేంకటేశ్వరుడున్నాడు॥

వరముల రాయడు, కొండల కోనేటిరాయని ఆడి, పాడి ఆనందించమంటున్నాడు సంకీర్తనాచార్యుడు.

- గంధం బసవ శంకరరావు

---

1. పెదతిరుమలాచార్యులవారి పదమిది, వారి ప్రత్యేకముద్రతోనే ఆరంభించుట విశేషము. కోరిపాడుట, తమకము రేచి మోహించుట, ఆతనినే సారెనమ్ముట, పాడివర్ణించుట, ముచ్చటలుదీర క్రొత్తక్రొత్తగా పదములు చెప్పుట పదకర్త తమవారికి ('మనవాండ్లకు') చేసిన హితవు. కనుక వీరి పదముల అభివ్యక్తిలో క్రొత్తదనముండుట సహజమే.

2. వెంచి **3.** తనివి **4, 5** చేర్పులు పరిష్కర్తవి **6.** పరమునిహమూనిచ్చి

263. శ్రీహరిపాదతీర్థంబే

సంకీర్తన: 71 రాగం:శంకరాభరణము
వ్రాతప్రతి పుట: 72 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుట 32-33 లలో ఉదాహృతం)

శ్రీహరిపాదతీర్థంబే చెడని మందు
మోహపాశాలు గోసి మోక్షమిచ్చే మందు ॥పల్లవి॥

కారమై కంటగించని కడుఁజల్లని మందు
నూఱని కాచని యట్టి నున్నని మందు
కోరికతో వెలవెట్టి కొనితే వల్లని మందు
వేరువెల్లంకులు కూర్చనట్టి వెందువోని మందు ॥శ్రీహరి॥

గుఱుతైన రోగములు గుణముచేసే మందు
దురితములు పెడఁబాపే దొడ్డ మందు
నిరతము బ్రహ్మాదులు నేరుపుతో సేవించే మందు
నరకము సొరనట్టి నయమయిన మందు ॥శ్రీహరి॥

పొంకముతో భయములు పొందనియ్యని మందు
మంకుబుద్ధులు మాన్పి మన్నించే మందు
పంకజాక్ష వేంకటరమణ ప్రపన్నుని మందు
సెంకించక తనదాసులఁ జేపట్టే మందు ॥శ్రీహరి॥

264. శోభనమే శోభనమే

సంకీర్తన: 262 రాగం: సౌరాష్ట్ర
వ్రాతప్రతి పుట: 250 తాళం: అట

(ఈ సంకీర్తన సంపుటం 5వ సంపుటంలో 18వ సంకీర్తనగా ఉంది. (రాగిరేకు సంఖ్య 4)లో రాగం వసంతం[1])

[2]శోభనమే శోభనమే
వైభవముల పావనమూర్తికి ॥పల్లవి॥

అరుదుగ మును నరకాసురుఁడు
సిరులతోఁ జెరలుదెచ్చిన సతుల
పరువపు వయసులఁ[3] (లప?) బదారువేలను
సొరిదిఁ బెండ్లాడిన సుముఖునికి ॥శోభనమే॥

చెందిన వేడుక శిశుపాలుఁడు
అంది పెండ్లాడఁగ నవగ[4]ళించి
విందువలెనె తా విచ్చేసి రుకుమిణి
సందడిఁ బెండ్లాడిన సరసునికి ॥శోభనమే॥

దేవదానవులు ధీరతను
దావతిపడి వార్ధి దరువఁగను
శ్రీవనితామణిఁ జెలఁగి పెండ్లాడిన
శ్రీవేంకటగిరి[5] శ్రీనిధికి ॥శోభనమే॥

శ్రీవనితామణి (క్షీరాబ్ధి కన్యక)ని, రుక్మిణీదేవిని, పదహారువేల కాంతలను పెండ్లితో తనలో ఐక్యం చేసుకున్న వైభవమూర్తికి శోభనం (మంగళం) పలుకుతున్నాడు పదకవితాపితామహుడు!

– గంధం బసవ శంకరరావు

---

1. తా.వేం. సౌరాష్ట్రం **2.** శోభానే **3.** తా.వేం. వయసున **4.** నవఘళించి **5.** వెంకటపతికి శ్రీ.

265. సకలం హేసఖి జానామి

సంకీర్తన: 171 రాగం: లుప్తము

వ్రాతప్రతి పుట: 167 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 5వ సంపుటంలో 22వ సంకీర్తనగా ఉంది. (రాగిరేకు సంఖ్య 4)లో రాగం నాదరామక్రియ)

సకలం హేసఖి జానామి తత్
ప్రకటవిలాసం పరమం ధధసే[1★] ॥పల్లవి॥

అలికమృగమదమయ మషీకలనో
జ్జ్వలతాం హేసఖి జానామి
లలితం తవ పల్లవితమనసి ని
శ్చలతర[2] మేఘశ్యామం ధధసే ॥సకలం॥

చారుకపోల స్థల కరాంచిత వి
చారం హేసఖి జానామి
నారాయణ మహినాయకశయనం
శ్రీరమణం తవ చిత్తే ధధసే ॥సకలం॥

ఘనకుచశైలాగ్రస్థిత విధుమణి
జననం హేసఖి జానామి
కనదురసా[3] వేంకటగిరి పతే
ర్వినుత భోగసుఖ విభవం ధధసే ॥సకలం॥

ఓ చెలీ! నీవు ప్రకటిస్తున్న విలాసాలన్నీ మాకు తెలుసులే! అవన్నీ శ్రీవేంకటపతిని చిత్తములో నిలుపుకొన్న ఐశ్వర్యాలు అని అలమేల్మంగను ఆట పట్టిస్తున్నారు చెలికత్తెలు!

– గంధం బసవ శంకరరావు

---

1. 'ధత్సే' యనియుండcబోలును. నిడురేకు 106 వదసి, దదంసి, దదంసివాసి అని క్రమముగా ఈ పదరూపములున్నవి. దధాసి అను సాధురూపమును ఇట్లు అవ్యుత్పత్తిచే చెక్కినారు కాంcబోలు. **2.** నిశ్చలం మేఘ **3.** ఘనతయా వేంకట ★'దధ' ధారణే – అను దాని రూపము కావచ్చు.

266. సతము గాని వారేల

సంకీర్తన: 17 | రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 20 | తాళం: లుప్తము

సతము గాని వారేల - సతమయ్యేరే
హితవు గూరిచి మన - మెంత పాటుబడిన ||పల్లవి||

తగవులు నడపినా - తానె యని యుండినా
మిగుల యిచ్చలోనె - మెలగినా
మగువ అడుగులకు - మడుగులే బరచినా
సొగసైన కూతల - (చొక్కించినా) ||సతము||

(తప్పులు చెప్పినా - నొప్పులే పలికినా
చెప్పుడు మాటలకు - చెవులొడ్డినా
గొప్పలకు బోయినా - గోజాడి వేడినా)
(చెప్ప)జాలున మీకు - చెప్పియును మాకు ||సతము||

(నోము నోచినయమ్మ - నోముఫలమేని
నోమనమ్మకు వచ్చు - నో లేదొ కాని!)
కామించు తిరువేంకట(పతి) - కౌగిటి కొమ్మ
భామ ముద్దులగుమ్మ - బంగారు బొమ్మ! ||సతము||

శిథిలరూపమునగల యీ పాటను వారి పలుకుబడి ననుసరించి పరిష్కరించుటైనది.

నోమినవారి సొమ్ములు - నాచన సోమన ప్రయోగం.

- వేటూరి ఆనందమూర్తి

267. సతముగావని నిన్ను

సంకీర్తన: 132 రాగం: ముఖారి

వ్రాతప్రతి పుట: 130 తాళం: లుప్తము

సతముగావని నిన్ను – జట్టిగొనc గాక, ని
న్నితర కాంతల దలచ – నిత్తునా వోరి ॥పల్లవి॥

యెంత పనిరా నాకు – నిటు నిన్ను వలపించ
అంత సత్తా వుంటె(?) – నాడ గాక
మంతనంబున కెదిరి – మాటాడ గాక, (?)ని
న్నింత గుట్టున దిరుగ – నిత్తునా వోరి ॥సతము॥

యేమి యరుదునాకు – నిప్పుడిటు లలయించ
నామాట గర్వించి – యాడె గాక
కామతంత్రములచే – కరగింతుగాక, యి
న్ని మేకులు సేయ – నిత్తునా వోరి ॥సతము॥

యెదురెవ్వతెర నాకు – నీ జగంబుల నెన్న
నది యెరుంగదు వనుచు – నాడ గాక
కదిసి యొడబరచి వేం – కటరాయ కూడితివి
యిది మొదలు నిలు వెళ్ల – నిత్తునా వోరి ॥సతము॥

స్వాధీనపతికయైన నాయిక ఆభిజాత్యంతో పలుకుతున్న పలుకులు!

– గంధం బసవ శంకరరావు

268. సవరని యందమది

సంకీర్తన: 65 | రాగం: లుప్తము
వ్రాతప్రతి పుట: 66 | తాళం: లుప్తము

(సవరని యందమది - చాల కప్పటి
తివిరి దిద్దగ నేలె - దిష్టిని తాకీని) ॥పల్లవి॥

(మలక) నెలవంక నా - మము చాల కప్పటి
తిలక మేటికె నీకు - దిష్టి తాకీని
పలుచ(గ) దిద్దు పా - పట చాల కప్పటి
తెలి జేరుచుక్కేలె - దిష్టి తాకీని ॥సవరని॥

జవ్వని కంటసరి - చాల కప్పటి
(తివ్వెలే) నీకు - దిష్టి తాకీని
(పువ్వని) కుంకుమ - పువు చాల కప్పటి
(దివ్వి) జవ్వా దేటికె - దిష్టి తాకీని ॥సవరని॥

మనసు రంజిలజేయు - మాట చాల కప్పటి
(దిన మనవు) లేటికే - దిష్టి తాకీని
(యెనసి) వేంకటప్ప - (డే)లుట చాలక
దినము ఓొమ్మొక్క నేలె - దిష్టి తాకీని ॥సవరని॥

రెండు భైరవి రాగ కీర్తనల మధ్యగల యీ పాట కూడా భైరవి రాగమందే ఉండును. శిథిల రూపానగల యీ పాటకు పల్లవి కూడా లుప్తమైనది. ప్రకరణోచితమైన పూరణము బ్రాకెట్లలో గలది పరిష్కర్తది.

(మలక) = మెలిక దిరిగిన, నడకను బట్టి పాద నిర్మాణమున మార్పు చేయబడినది. ఒకప్పటి నామమే చక్కగా నుండగా కొత్తగా దిద్దనేల అని అన్వయము. అట్లే అన్ని పాదములందును.

సహజ సౌందర్యముగల అమ్మవారికి ఇతరాలంకారము లనావశ్యకములనీ, దిష్టి తాకే పనులు చేయరాదనీ తాత్పర్యము.

'గంధమేలే! కమ్మని నీ మేనికి" అన్న అన్నమాచార్యుల సంకీర్తనకోవకు చెందిన పెదతిరుమలచార్యుల పాట యిది కావచ్చును. శ్రీ వేంకటప్పని ఉరమ్మెక్కిన యింతి కథనము ఆయన ప్రత్యేకముద్రకు నీడైనదే! రేకుల కెక్కకున్నా ఈ తాళ్లపాకవారి పాట నా దృష్టికి పరమప్రామాణికమైనది.

- వేటూరి ఆనందమూర్తి

This is a well-structured song of the TaaLLapaka Pedda Tirumalacharya, describing the natural beauty of the divine heroin. Natural beauty does not require other artificial beauty aids to enhance. It radiates from within. Beware of the effects of diShTi, says the poet.

Although the opening Pallavi part of the song is missing, the inherent symmetrical structure of the composition allows editorial interventions. I supplied the missing portions within brackets based on its content and structure. We can always insert the relevant PaaThaantara if we trace the original in future research.

- Veturi Anandamurthy

269. సహజవైష్ణవాచారవర్తనుల

సంకీర్తన: 163 రాగం: సామంతం

వ్రాతప్రతి పుట: 160 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 1వ సంపుటంలో 10వ సంకీర్తనగా ఉంది. (రాగిరేకు సంఖ్య 2)లో సామంతం)

సహజవైష్ణవాచారవర్తనుల
సహవాసమె మా సంధ్య ॥పల్లవి॥

అతిశయమగు శ్రీహరిసంకీర్తన
సతతంబును మాసంధ్య
మతి రామానుజమతమే మాకును
చతురత మెఱసిన సంధ్య ॥సహజ॥

పరమభాగవతపదసేవనమే
సరవి నెన్న మాసంధ్య
సిరివరుమహిమలు చెలువొందఁగ వే
సరక వినుటె మాసంధ్య ॥సహజ॥

మంతుకెక్క తిరుమంత్రపఠనమే
సంతతమును మాసంధ్య
కంతుగురుఁడు వేంకటగిరిరాయని
సంతర్పణమే మాసంధ్య ॥సహజ॥

అనిశమూ వేంకటేశ్వరుని తలపు తరంగాలలో ఓలలాడిన అన్నమయ్య శ్రీహరి సంకీర్తనయే తనకు సంధ్య అని ఎలుగెత్తి చాటుతున్నాడు.

– గంధం బసవ శంకరరావు

270. సారెకు నీ వోజ

సంకీర్తన: 245 రాగం: భైరవి

వ్రాతప్రతి పుట: 234 తాళం: లుప్తము

సారెకు నీ వోజ తెలియనైనా, మాకు – మారు చదువు చదువవలెను
తేరక నీ మాట బొంకైనా నీ – తెలివి బొంకదాయెగా ॥పల్లవి॥

చుక్కపొడుపున వచ్చేనని మోవి – చుక్క పొడుపున వచ్చితివిగా
మిక్కిలి నీ మాట బొంకైనా, నీ – మేను బొంకదాయను
వొక్క పొద్దు చేసి వచ్చేననిన వాడ – వొక్క పొద్దు చేసి వచ్చితివిగా
చక్కదనపు నీ మాట బొంకైనా, నీ – జాడ బొంకదాయగా ॥సారెకు॥

నెల తిరుగక వచ్చేనన్న నీ వొక – నెల తిరుగ వచ్చితివి
కలికితనపు నీ మాట బొంకినా, నీ – కాలము బొంకదాయను
యిల్లు జొచ్చి వచ్చేనని పొరు – గిల్లు జొచ్చి వచ్చితివిగా
చెలిమి చేసి నీ మాట బొంకైనా, నీ – సేత బొంకదాయగా ॥సారెకు॥

సాము చేసి వచ్చేనని మరుని – సాము చేసి వచ్చితివిగా
గామిడి నీ మాట బొంకైనా – కడు నీ రతి బొంకదాయను
నేమపు శ్రీవేంకటనాథ వేడుకల – నించేనని కళలు నించితివిగా
యేమయ్య నీ మాట బొంకైనా నీ – విపుడు బొంకవుగా ॥సారెకు॥

'శ్రీవేంకటనాథ' ముద్రను బట్టి చినతిరుమలయ్య సంకీర్తనయా?

ఓజ = 1. పూనిక, ఉత్సాహం, విధం, రీతి. 2. నేర్పు, 3. న్యాయం, ప్రకృతి, స్వభావం.

"చెనకఁజూచినవేళ చేరి బాస లడిగేది
వొనరఁ దుచ్చపువారి వోజలింతేకా" (25–373)

"వెన్నలెల్లా దొంగిలి శ్రీవేంకటేశుఁడైనాడు
వున్నతిఁ దనకు గల వోజే కదే" (21–172)

– అన్నమయ్య పదకోశం, ఆచార్య రవ్వా శ్రీహరి (తి.తి.దే, 2012).

271. స్వామి! చిత్తాన విచారించుకో

సంకీర్తన: 81 రాగం:శంకరాభరణము
వ్రాతప్రతి పుట: 81 తాళం: లుప్తము

స్వామి! చిత్తాన విచారించుకో – నీ(కిట్టి)
తామసమ్మేటికి నన్ను – దయ జూడుమిపుడు ॥పల్లవి॥

కల్పకమిచ్చే ఫలము – కల్పకమీవలె గాక
నల్పపు జెట్ల వేఁడ – నవి యిచ్చీన?
వేల్పురాయఁడవు నీ – వియ్యవలె(నిటు)గాక
అల్పుల వరాలడుగ – (నటులియ్యగలరా) ॥స్వామి!॥

కామధేనువిచ్చే పాడి – కామధేనువే గాక
(యే) మేక మెడ చ – న్నీయ గలదా?
నీ మహిమ యిచ్చే యలవి నీ – వియ్య వలె గాక
(తామసుల) గొసరగా – తామీయగలరా? ॥స్వామి!॥

చింతామణిచ్చే యీవి – చింతామణే గాక
(యెంతటి మగరాయైన) – నేమీయ గలదు?
చెంత నలమేల్మంగ – శ్రీవేంకటేశ! నీ
యంతవాడే గాక – అన్యులీయగలరా? ॥స్వామి!॥

'ఏకమేవాద్వితీయం బ్రహ్మ" అని శ్రుతి పరబ్రహ్మన్ని కీర్తించినట్లుగా ఆ పరమాత్మునితో సమానమైనవారుగానీ, ఆ స్వామి అందించే వరాలు గానీ, మరొకరు అనుగ్రహించలేరని భావం!

రేకులలోని "అతని నమ్మలే రల్పమతులు భువి" (3–533) అన్న సంకీర్తన ఈ కోవలోనిదే!

– గంధం బసవ శంకరరావు

272. (స్వామి!) వేంకటరమణ

సంకీర్తన: 16 | రాగం: కాంబోది
వ్రాతప్రతి పుట: 19 | తాళం: అట

(స్వామి!) వేంకటరమణ - యేమిపరాకయ్య
నామనవి యాలించి - నను నేలవయ్య ॥పల్లవి॥

నీవే నా తల్లివి - నీవే నా తండ్రివి
నీవె నాపాలిపె - న్నిధాన మనుచు
నేవేళ నామదిలో - నెంతైన నమ్మితే
భావించి కరుణతో - బ్రోవరా వేమయ్య ॥స్వామి!॥

ఎందరను రక్షింప - వెంత సెలవుసేయ
వందులో నేను నీ - కవుదునా బరువు
కందర్పగురుఁడ నను - కావవే యిందరిలో
సందడిని మరచేవు - స్వామీ అదేమయ్య ॥స్వామి!॥

నిన్ను నమ్మినవాని - కన్నడ జేసితే
అన్యు లెవరైన నను - నాదరింతురటయ్య
నన్నేలు కృపతోడ - నాపాలి వెంకటరమణ
నిన్ను నమ్మితి నేను - నీవాఁడ నయ్య ॥స్వామి!॥

ఓ వేంకటరమణా! నీవే తల్లివి, నీవే తండ్రివి, నా సర్వమూ నీవే, నేను నీ వాడను, కృపతో నన్నేలవయ్యా అని శరణాగతితో అంటున్నాడు సంకీర్తనాచార్యుడు!

- గంధం బసవ శంకరరావు

273. సిగ్గుగల యాఁటదైతే

సంకీర్తన: 97 రాగం: సామంతం

వ్రాతప్రతి పుట: 97 తాళం: అట

(ఈ సంకీర్తన 17వ సంపుటంలో 12వ సంకీర్తనగా ఉంది. (రాగిరేకు సంఖ్య 3)లో రాగం సామంతం)

సిగ్గుగల యాఁటదైతేఁ జేర వచ్చునా
వొగ్గి నేఁ గా నీతో నొక్కటైతిఁ గాకా ॥పల్లవి॥

వొంటి వేగించఁగా లేక వొద్దికి వచ్చితిఁ గాక
యింటికివచ్చిన మోహ మితవయ్యీనా
మంట దేర నీతోను మాటలూ నాడేఁ గాక
కంటకపు నీతో పొందు కానిదే కాదా ॥సిగ్గు॥

చిత్తము నిలుపలేక సెలవి నవ్వితిఁ గాక
బత్తి సేయ నీమీఁద పాపము గాదా
తత్తర మాపఁగలేక తప్పక చూచితిఁ గాక
హత్తి నీతో మొగమోట మారడి కాదా ॥సిగ్గు॥

పొందు మరిగితిఁ గాన పొత్తుకు వచ్చితిఁ గాక
చెంది వేగిరించ నీతోఁ జెల్లునా నాకు
కందువఁ గూడితివి చాఁగలమట్టి చెన్నుఁడవై
అందపు శ్రీవేంకటేశ అరుదా నాకు ॥సిగ్గు॥

కర్నూలుజిల్లాలోని చాగలమట్టి గ్రామంలో కొలువైన చెన్నకేశవస్వామి పరంగా చెప్పిన మధుర శృంగారసంకీర్తన!

– *గంధం బసవ శంకరరావు*

274. సిగ్గుతోడ గొంకితేను

సంకీర్తన: 255　　　　　　　　　　　　　　　　　రాగం: సౌరాష్ట్ర

వ్రాతప్రతి పుట: 244　　　　　　　　　　　　　　　తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 18వ సంపుటంలో 161వ సంకీర్తనగా ఉంది. (రాగిరేకు సంఖ్య 827)లో రాగం సాళంగనాట)

సిగ్గుతోడ గొంకితేను చిక్కునా మగవాఁడు
　　బిగ్గెఁ గాఁగిలించుకొని పెనఁగినఁగాక　　　　॥పల్లవి॥

పెదవిపై మాటలఁ బ్రియములు వుట్టునా
　　వుదుటుగుబ్బలఁ బతి నూఁదినఁగాక
　　సదరపుఁజెనకుల చవులు వుట్టీనా
　　సదమదముగ రతి సలిపినఁ గాక　　　　॥సిగ్గు॥

సెలవుల నవ్వితేనే చిత్తము గరఁగునా
　　సొలయుచు మోవిచవి చూపినఁగాక
　　ములువాఁడిచూపుల మోహములు వుట్టునా
　　లలిఁ దమ్ములముపొత్తు గలసినఁగాక　　　　॥సిగ్గు॥

సరసములాడితేనే సంగాతా లెనయునా
　　సరుసఁ దనువు లొక్కజ(జం?) టైనఁ గాక
　　యిరవై శ్రీవేంకటేశుఁడింతలోనె నిన్నుఁ గూడె
　　పరవుపైనే చాలునా వురమెక్కినఁగాక　　　　॥సిగ్గు॥

275. సిగ్గులు బడితే శృంగారము

సంకీర్తన: 236 రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 224 తాళం: లుప్తము

సిగ్గులు బడితే శృంగారము - చిగురెక్కీ సుమ్మీ
యెగ్గులుబట్టేవా రిందరిలో - యెవరున్నా(రనుమీ) ॥పల్లవి॥

పులిగోటిమీద నేమిటికి తట్టు - పునుగు (మెత్తేవు?), అది
పలుమారు చురచురమనునేమో - పన్నీట గడుగరే
శలగోటి తానెందుకంటే కడు - చలదియని యందురు
కొలదిగాదు వలరాచవెజ్జుచే - గు(ణము) సేయించుడీ ॥సిగ్గులు॥

(ఇ)దె పలుగెంపు వాతెరకు వీడె - మేమిటికిచ్చేరే, కాని
కదిమి కారపు వేడిచూపునేమొ - కర్పూరము మెత్తరే
యిది నవ్వుగాదు మానిసికాటు - యింతకంటె విషము
మదనశాస్త్రమెరింగినవారి చేత - మందు వెట్టించరే ॥సిగ్గులు॥

ఎలమి నీ చెక్కుచెమటల చేతు-లెందుకు దుడిచేరే
సొలయక పట్టితే కందునేమో - (సురటి) విసరరే
అలమేలుమంగ శ్రీవేంకటేశు - డెలమి నాకె గూడె
అలరువిలుతు తంద్రికాసతిచే - అలపులు దీర్చరే ॥సిగ్గులు॥

ఈ సంకీర్తన తంజావూరి ప్రతిలో కలదు.

- గంధం బసవ శంకరరావు

276. సుదతికి మీరిందరూఁజుట్టాలైన

సంకీర్తన: 40 రాగం: శంకరాభరణం

వ్రాతప్రతి పుట: 41 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన 28వ సంపుటంలో 273వ సంకీర్తనగా ఉంది.(రాగిరేకు సంఖ్య 1847)లో రాగం భైరవి)

సుదతికి మీరిందరూఁజుట్టాలైన ఫలము
మదనుని వేఁడుకోరే మంచిదౌఁగాని ॥పల్లవి॥

జలములలో నెల్లా చంద్రకాంతాలు చల్లరే
అలతామరలగర్వ మలణఁగుఁ[1]గాని
చలపట్టి వనముల జవ్వాది వాసించరే
మలయుఁ జిలుకలకు మాటుమందౌఁగాని ॥సుదతికి॥

పొదలపై సంపెంగ పువ్వులు వెదచల్లరే
వుదుటఁ దుమ్మిదమూక లుడుఁగుఁగాని
పది దిక్కులను రఘుపతిపేరు దడవరే
గుదిగొన్న కోవిలలు కూయకుండుఁగాని ॥సుదతికి॥

పాటలలో శంకరాభరణం మాళాపించరే
నీటు చల్లగాలి సొంపు నిలుచుఁగాని
యీటున శ్రీవేంకటేశుఁ డేలె నలమేల్మంగను
చాటించరే యిన్నీఁ దొంటి జాడల నుండుఁగాని ॥సుదతికి॥

---

1. 'మణఁగుఁగాని' అనియైనా, ములణఁగుఁగాని అని యైనా వుండవచ్చునని తోచుచున్నది.

277. సురలకు నరులకు సొరిది

సంకీర్తన: 266 రాగం: లుప్తము

వ్రాతప్రతి పుట: 253 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన అన్నమాచార్య చరిత్ర పీఠిక, పుటలు, 46 & 47లలో ఉదాహృతం)

సురలకు నరులకు సొరిది విన విన
అరుదు తాళ్లపాక అన్నమయ్య పదములు ॥పల్లవి॥

చక్కెరై చవిచూపీ జాలై తావి చల్లీ
నక్కజపుమాఁతువజ్రాలై మెఱసీని
నిక్కుటద్దములై మా నిలువునీడలు చూపీ
నక్కర తాళ్లపాక అన్నమయ్య పదములు ॥సురలకు॥

పన్నీరై పైఁబూసీఁ గప్రంబై చలువ రేఁచీ
మిన్నగలముత్యములై మెయినిండీని
వెన్నుబలములై మావెంటవెంటఁ దిరిగీని
అన్నిట తాళ్లపాక అన్నమయ్య పదములు ॥సురలకు॥

నెట్టన వేదాంతములై నిత్యములై పొడచూపీ
పుట్టుతోనె గురువులై బోధించీని
గట్టి వరాలిచ్చే శ్రీవేంకటనాథుని మెప్పించీ
నట్టె తాళ్లపాక అన్నమయ్య పదములు ॥సురలకు॥

చినతిరుమలాచార్యులవారి సంకీర్తన! అన్నమాచార్యులవారి సంకీర్తనల విశిష్టతను మనుమడు తేటతెల్లం చేస్తున్నాడు. దేవతలకు, మానవులకు అన్నమయ్య పదాలు అరుదైన, విలువైన సంపద!

– గంధం బసవ శంకరరావు

278. సువ్వి సువ్వి సువ్వని

సంకీర్తన: 101 రాగం: కేదారగౌళ
వ్రాతప్రతి పుట: 101 తాళం: లుప్తము

(ఈ సంకీర్తన సంపుటం 5లో 353వ సంకీర్తనగా ఉంది. రాగిరేకులో (సంఖ్య 90) పేర్కొన్న రాగం కేదారగౌళ)

సువ్వి సువ్వి సువ్వని సుదతులు దంచెదరోలాల[1] ॥పల్లవి॥

వనితల[2] మనసులు కుందెన చేసిటు[3] వలపులు తగ నించో[4] లాల
కనుసన్నలనెడు రోఁకండ్లను కన్నెలు దంచెదరోలాల ॥సువ్వి॥

బంగారుచెరఁగుల పట్టుపుట్టముల
కొంగులు దూలఁగనోలాల
అంగనలందరు నతివేడుకతో
సంగడి దంచెదరోలాల ॥సువ్వి॥

కురులు దూలఁగ మంచి గుబ్బచన్నులపై
సరులు దూలాడఁగ నోలాల
అరవిరి బాగుల నతివలు ముద్దులు
గురియుచు[5] దంచెదరోలాల ॥సువ్వి॥

ఘల్లు ఘల్లుమని (ను?) కంకణరవములు (ల?)
పల్లవ పాణుల కో (నో?) లాల
అల్లన నడుములు అసియాడుచు సతు
లొల్లనె దంచెదరోలాల ॥సువ్వి॥

కప్పుర గందులు కమ్మని పువ్వుల
చప్పరములలో నోలాల
తెప్పలుగా రతిఁ దేలుచుఁ గోనే
టప్పనిఁ బాడెదరోలాల ॥సువ్వి॥

---

1. తా.వేం.101 రోలాల **2.** వనిత మన **3.** చేసేటి **4.** నిచ్చో **5.** మురియుచు

279. సొగటాల సురతాణి

సంకీర్తన: 264 రాగం: సౌరాష్ట్ర

వ్రాతప్రతి పుట: 251 తాళం: అట

సొగటాల సురతాణి❋ - సుదతి నేను
మగువల కీ మాట - మరి చెల్లునట రోరి ॥పల్లవి॥

దుగ1 వేసి చను దువ్వి - తూగి పందెము లాడి (2)
తిగ వంచ2య(ని) దేర - తియ్య మోవికి(ని) (3+1=4)
నిగుడి చౌవంచి3 -నిను జట్టిగొందురా (4+1=5)
వగ(ల) యి(త్తి)గ4 వేసి - వలపిం(తు) నోరి (2×3=6) ॥సొగటాల॥

(చక్కు)5 పడవేతునో - (సత్త) గోరొత్తులకు (7)
(యెక్కయు)1 (సరియు)2 దేర - చెక్కు నొక్కుదునో! (1+2 =3)
మక్కువ (దచ్చుక)6 వేసి - మాటికి వలపింతునో (2×4= 8)
యెక్కువ తొమ్మిదివేసి - యిలు వెళ్ళని(య)నోరి (9) ॥సొగటాల॥

ప(ది)ట పం(దె)ము వేసి - (ప్ర)క్క ప(వ)ళింతునో! (10)
కదిసి (యి)బ్బారతో7 - కౌగిలింతునో! (12)
అదన శ్రీ వేంకటేశ! - యవ్వనుడవై కూ(డి)
ముదముతో కెమ్మోవి - ముద్దు (గొను మోరి)! ॥సొగటాల॥

ఈ పాటలోని చమత్కార విశేషం రెండు గెలిచి రెంటిని తొడుకుట; తిగవంచలో అధరములందు ఆకృతిసామ్యము భావించుట; చౌవంచలో జట్టిగొనుట; ఇత్తిగలో వలపు వసంతము; నవసంఖ్యలో ద్వార బంధనము; పదిట రెండు స్థానాలు పక్కపక్కనే యుండి పాయని జంటయగుట; బారలో బారలు సాచిన పూర్ణపరిష్వంగము సూచితములు. ఇట్టి వన్నియూ వారి భావకోశము (స్కెమేటా) లో కానవచ్చేవే.

❋సురతాణి = ఇంద్రాణి, భోగపత్ని. యెక్క (1), దుగ (2), తిగ (3), చక్కు (4), చౌవంచ (5), ఇత్తిగ (6), సత్త (7), దచ్చుక (8), ?(9), ?(10), బార (12) విలువలు ద్యూత పరిభాషలోఉన్నవి. ఇందులో పాచిక లాడిన దివ్యులిద్దరూ పందేలు వేసుకొని అభిమత ఫలాలు అనుభవించారు.

చిన్నప్పుడు మేమాడిన నాలుగుపలకల పాచిక కోపులు రెంటిలోనూ మూడువైపులా 1, 2, 3 చుక్కలు, నాలుగోపక్కన శూన్యం ఉండేవి. గలపరించి పాచికలు వేసినపుడు రెండుశూన్యాలు పడితే బారా(12). ఒక్కశూన్యానికి విలువ లేదు. కనుక పందెంలో 1,2,3,4,5,6,12 విలువలు మాత్రమే సాధ్యం. నాలుగు వైపులలోని చుక్కల్లో మార్పుచేర్పు లున్నప్పుడు తక్కిన విలువలూ రావచ్చు నేమో!

తాళ్లపాకవారి కవితపై నాచన సోమనాథుని (ఉ.హ.) ప్రభావ మున్నది. "అత్తీవం చిత్తిగ దుగ / సత్తా దచ్చొకవంచ చౌవం చీరై / దిత్తిగ నిద్దుగ బద్రలు/చిత్తమునకు వచ్చినట్లు చేతికి దెచ్చున్//" (చూ. ఉ.హ. మరియు శ.ర.) ఇది ఒక శృంగారక్రీడా సంకీర్తనము. అలమేల్మంగా శ్రీవేంకటేశు లాడుకొన్న వినోదము. ఇట్టి వీరి లీలావినోదములలో మన కిప్పటికి లభించిన అన్నమాచార్యులవారి 25 ఏల పాటల్లోనూ పెక్కింటికి బీజము లున్నవి. ఉదాహరణకు వారి 20వ ఏలపాటకు ఇది సంకీర్తనరూప వివరణము.

అది యిది –

"నెత్తమాడే నంటా రతి
పొత్తుల పందేలు వేసి
వొత్తి నీవే వోడే వేలరా – వేంకటేశా!
కొత్తవైన జాణ వౌదువు"(20).

ఏల పాటలో పందెమోడి వినోద మనుభవించినట్లుండగా సంకీర్తనమున తొలి రెండు చరణములలోనూ నాయకుడే పందెము వేసి గెలిచి జాణతనమున శృంగార వినోద మనుభవించెను. తుది అభోగ చరణమున, సఖీ ప్రేరణ శిక్షణములతో కాబోలును నాయికయు జాణతనమును ప్రదర్శించినట్లు వర్ణితమైనది. సంకీర్తన మంతయూ సొగటాల సురతాణి స్వగతరూపమైన నాయికా వాక్యముగానే భాసించును.

This song 264 of TPS is a rare gem in their Shringaara Sankiirtana-s not found in the Tirupati Copper Plates. Its root contents are traced from one of Annamchaarya's Ela padam (20) quoted above in Telugu. Annamacharya describes in this song the native Indian ludo (paachikalu - dice) game the divine couple played as part of their love play. He employed the native traditional terminology like yekka for 1, duga for 2, tiga for 3, chouka for 4 etc. The native usages employed are significant in the context. That such a beautiful Sankirtana of the TP Poets should hide neglected till this day is a wonder!

- Veturi Anandamurthy

280. సొరిదినొకరి లెస్స

సంకీర్తన: 216 రాగం: కాంబోది

వ్రాతప్రతి పుట: 205 తాళం: లుప్తము

సొరిదినొకరి లెస్స - జూడ జాలమిగాక
యిరవొందగ తనసొ - మ్మేమైనా పొయ్యీనా ॥పల్లవి॥

కొమ్మగుబ్బలు బంగారు - కుండలవలె నుండగా
చిమ్ముల యీ నడుమేల - చిన్నబోయెనే
అమ్మకచెల్ల! యివియెల్ల మ -ధ్యమరీతి యింతేకా
కిమ్ముల జూడగా తన - సొమ్మేమైనా బొయ్యీనా ॥సొరిది॥

రామామణి నెమ్మొగము - రాజు వలె నుండగా
నాముమేసే కురులేల - నల్లనాయనే
మైమరచిన కుటిల - మార్గమింతే కాక
ఆముకొన్న తన సొమ్మే - మైనా బొయ్యీనా ॥సొరిది॥

కలకంఠి మోవి మా - ణిక్యము వలె నుండగా
మొలకదంతములేల - పలకబారీనే
పలుదెరంగుల కఠిన - పాకమింతే కాక
యిల శ్రీవేంకటపతి తన సొ - మ్మేమైనా బొయ్యీనా ॥సొరిది॥

281. హరి యితండు

సంకీర్తన: 227 రాగం: లుప్తము[1]
వ్రాతప్రతి పుట: 216 తాళం: లుప్తము

హరి యితండు హరుఁడతండు - ఆకారమొక్కటే
(హరిహరులందున)[2] - అధికులెవ్వరు (లేరు)[3] ॥పల్లవి॥

నెరిగురు లితనికి - మరుజడ లతనికి
నురగపర పితనికి - నురగము లతనికి
విరిగన్ను లితనికి చి - చ్చుఱ గన్నతనికి
(గరుడఁ డీతనికి - ఘన వృషభ మతనికి)
హరిణాక్షి వినవె యిం - దధికులెవ్వరు లేరు[4] ॥హరి॥

శ్రీతరుణి యితనికి - శ్రీగౌరి యతనికి
భూతలంబితనికి - శీతనగ మతనికి
జాతిమణు లితనికి వి - షమణు లతనికి
రీతిగంధ మితనికి - భూతిపూత లతనికి ॥హరి॥

కరిభయహరుఁ డితఁడు - కరిముఖుని గురుఁడతఁడు
నరసింహుఁడితఁ డర్ధ - నారీశ్వరుం డతఁడు
(మురవైరి యీ)[5]తఁడు - పురహరుఁ డతఁడు
పరగ శ్రీవేంకటశైల - పతి యీతఁడే అతఁడు ॥హరి॥

---

1. ఈ సంకీర్తనలో రాగతాళములు పేర్కొనబడలేదు. ముద్రను బట్టి యిది పెదతిరుమలాచార్యులవారి రచనకాదగును. పెదతిరుమలయ్య ఆనాళ్లలో హరిహరాలయములు గట్టించినట్లు కైఫియతులందించిన (మాచు. పు. 4) సమాచారమే పాటలోని భావమున కనుగుణముగ నున్నది. ఈ రచన నాచనసోముని రచనను తలపించును. **2,3** (శిథిల పూరణములు పరిష్కర్తవి) **4.** ఇందొక అధికపాదమున్నది. ఇట్లన్నిట జేర్చుటకన్న నీ చరణమున నొక అధిక పాదమును పరిహరించుట తగునేమో **5.** (శిథిల పూరణము) పరిష్కర్తది.

అనుబంధం:

హరిణాక్షి వినవే

(దేవనాగరి లిపిలో తంజావూరు సరస్వతీ మహలులో లభ్యమైన సంకీర్తన)

హరిణాక్షి వినవే ఇం – దధికు లెవ్వరు లేరు ॥పల్లవి॥

హరి ఇతడు, హరు డతండు, – ఆకార మొక్క(టే) (టి) ॥అనుపల్లవి॥

నెరి కురు లీతనికి – మరులు జడ లాతనికి
ఉరగ పా న్పితనికి – (కరి)చర్మ మాతనికి (ఇ(రి)
మెరుగుకన్ను లీతనికి – (మరుగు) కన్ను లాతనికి (ఎరని)
(గ)రుడు డీతనికి – ఘన వృషభ మాతనికి (గ్య) ॥హరిణాక్షి॥

జాతి గంధ మీతనికి – భూతి పూత యాతనికి
(జా)తిమణు లీతనికి, (వి – షమణు) లాతనికి (రీ) (ఉరగ)
శ్రీతరుణి ఈతనికి – శ్రీ గౌరి యాతనికి
భూధరము యీతనికి – పునుక యాతనికి ॥హరిణాక్షి॥

కరి భయ హరు డితడు – కరిముఖుని గురు వతడు
పురుషోత్తముం డితడు – పురహరుం డతడు
నరసింహ (మి)త (డ)ర్థ – నారీశ్వరుం డతడు
పరగ శ్రీ వెంకట – పతి యీతడే (య)తడు. ॥హరిణాక్షి॥

ఇది దేవనాగరి ప్రతి పాఠానికి తెనుగు లిప్యంతరీకరణము. ఇందులో పల్లవి "హరిణాక్షి వినవే" అని స్పష్టముగా ఉన్నది. అనుపల్లవి విభాగము కూడా తంజావూరు వ్రాతప్రతుల రచనా కాలానికి కానవస్తుంది. పల్లవి–అనుపల్లవి విభాగములప్పుడప్పుడే ఏర్పడుతున్న కాలమది. 'తాళ్లపాక సంకీర్తనలు' అనే ప్రతిలో ఉన్న శైథిల్యమూ, కలగలపు దేవనాగరి వ్రాతప్రతిలో లేవు. రెండు వ్రాతప్రతులలోని మేలైన పాఠములు గ్రహించుటకు వీలైనది. పదేళ్ల వ్యవధి తర్వాత ఆ పాటకు ఇలాంటి పాఠాంతరము లభించడం విశేషమే కదా! (ఆకరము: TMSSM Library & R.I,Thanjavur.

సంకీర్తన కుడివైపున బ్రాకెట్లలో చూపినవి నాగరిలిపిలోని మూలపాఠాలు. **– వేటూరి ఆనందమూర్తి**



దేవనాగరి లిపిలో తంజావూరు సరస్వతీ మహలులో లభ్యమైన 'హరి యితండు' సంకీర్తన

282. పల్లవి లుప్తము

సంకీర్తన: 2 | రాగం: ముఖారి

వ్రాతప్రతి పుట: 4 | తాళం: లుప్తము

(పల్లవి లుప్తము)

రెండవ చరణమున గాబోలు అందదుకులుగా కొండవేసి, జలధి ద్రచ్చి, చక్కని రమణినిట్టె, సరిటెట్టెజుమీ వంటి సముద్రమథన కథాసందర్భముగల పదబంధ శిథిలములు కొన్ని ఉన్నవి. ముఖారి రాగమున అట్టి పదబంధములున్న గేయ రచనమునకై అన్వేషించవలెను. దురుద్ధరములైన ఇట్టి పాటలను, పాటల సంఖ్యలను విస్మరించి విడిచిపుచ్చుట కన్న భావి పరిశోధనకై స్మరించి గుర్తించుట మేలు.

283. సంకీర్తన లుప్తము

సంకీర్తన: 189 రాగతాళములు లుప్తములు

వ్రాతప్రతి పుట: 182

"అమ్ముకుందువేమో" అని తృతీయ చరణాంత మొక్కటే కలదు.

– గంధం బసవ శంకరరావు

అన్నమయ్య (కోలారు, కర్నాటక)

284. అంగనామంగనామంతరే

సంకీర్తన: 115 రాగం: లుప్తము

వ్రాతప్రతి పుట: 115 తాళం: లుప్తము

అంగనామంగనామంతరే మాధవో మాధవం మాధవం చాంతరేణాంగనా।
ఇత్థమాకల్పితే మండలే మధ్యగస్సజ్ఞ గౌ వేణునా దేవకీ నందనః॥

కేకికేకాధృతానేకపంకేరుహాలీనహంసావళీ హృద్యతానృత్యతా।
కంసవంశాటవీదాహదావానలస్సంజగౌ వేణునాదేవకీనందనః॥

క్వాపివీణాభిరారావిణాకంపితఃక్వాపివీణాభిరాకింకిణీనృద్వతః।
క్వాపివీణాభిరామాకరంగాయతః సంజగౌ వేణునాదేవకీనందనః॥

Recently I received the beautifully presented 'Venugopala Satakam' from my friend Prof. Tangirala Subbaraogaru which included various compositions on Sri Krishna in anubandham-2, compiled and commented by Gottimukkala Subrahmanya Sastrygaru (p.173), which prompted me to further investigate the source, with regard to Sri Krishnashtakam as found or believed to be in Krisna Karnamrutam of Bilvamangala Lilasuka.

The following is the brief outcome of my investigation as explained in detail in the Telugu note given here under.

The real chief source of the famous 'Sri Krishnashtakam' now appears to be the'tALlapAka Sankirtanalu' the 15th century compilation and certainly not the KK as thought or discussed before by many researchers, including S. K. De (1938) and Mallampalli Sarabheswara Sarmagaru (1997).

Veturi Anandamurthy.

"tALlapAka sankIrtanalu"

ఇటీవల 'తాళ్లపాక సంకీర్తనలు' అనే శ్రీ శేషాచార్యుల వ్రాతప్రతి ప్రూఫులను పరిశీలిస్తుండగా చాలా కాలంనుండీ నన్ను వేధిస్తుండిన ఒక సాహిత్య చారిత్రక సమస్యకు రెండుమూడు నాళ్ళ క్రితమే అనుకోకుండా వేరొక సమర్థకమైన సమాధానం లభించింది. ఆ సంతోషాన్ని మిత్రులతో పంచుకోడానికి ముచ్చటపడుతున్నాను.

అచ్చులో నున్న పై వ్రాతప్రతిలోగల యీ క్రింది 115వ పాట తాళ్లపాక వారిదిగా ఉన్నది. అది

1. “అంగనామంగనా మన్తరే మాధవో
మాధవం మాధవం చాన్తరేణాంగనా।
ఇత్థ మాకల్పితే మండలే మధ్యగః
సంజగౌ వేణునా దేవకీ నన్దనః॥”

అనే సంస్కృత శ్లోకారంభం కలిగి, 2. కేకి కేకా.., 3. క్వాపి వీణా... అనే మూడు చరణాలపాట.

మీది మూడుచరణారంభాలుగల యీ పాటే 8 చరణాలుగల శ్రీకృష్ణ అష్టకముగా బిల్వ(విల్వ)మంగళ కృత కృష్ణకర్ణామృతం (2 ఆ. 35–42) లోనూ ఉంది! కానీ కృ. క. ఔత్తరాహ, దాక్షిణాత్య ప్రతు లందించే సమాచారాన్ని బట్టి దాని దేశ కాల కర్తృత్వాలను గురించిన చర్చ కూడా బోలెడు ఉంది. ఆ గ్రంథాన్ని పరిష్కరించిన (1938) సుశీల్ కుమార్ డే గారి అభిప్రాయాన్నిబట్టి కూడా ఈ అష్టకము కృష్ణకర్ణామృతం ప్రతుల్లో 15వ శతాబ్ది తర్వాత ఎప్పుడో చేరియుండవచ్చుననే విషయం స్పష్టం. అయినా అది ఏ ఆకరాల నుండి సేకరింపబడిందో వారి పరిశోధనలో వ్యక్తం అయినట్లు లేదు. (S. K. De గారి గొప్ప పీఠికతో గల శ్రీ కృష్ణకర్ణామృత కోశ కావ్య విషయం నాదృష్టికి తెచ్చి, download చేసుకోనిచ్చిన మిత్రులు డా. ఏల్చూరి మురళీధరరావుగారికి కృతజ్ఞతలు).

వరాళి (114), నారాయణగౌళ (116) పాటల మధ్య రాగనామ రహితంగా ఉన్న తాళ్లపాకవారి యీ మూడుచరణాలపాటే(115) లీలాశుక బిల్వమంగళకృత శ్రీకృష్ణకర్ణామృతం రెండవ శతకం 35–42 శ్లోకాలలోనూ ఉంది. దానిపై పండితుల విశ్లేషణలూ,వ్యాఖ్యలూ ఉన్నవికాని దాని ఆకరం తాళ్లపాక సంకీర్తనలులో ఉన్నదన్న చర్చ మాత్రం ఇంతకుపూర్వం ఎవరూ చేసినట్లు తెలియరాలేదు.

కానీ అది “తాళ్లపాక సంకీర్తనలు” అనే సంకలనంలో ఉన్నట్లూ చాలామందికి తెలియదు. ఈ శ్రీకృష్ణాష్టకం 15వ శతాబ్ది తరువాత ఎప్పుడో కృష్ణాతీరవాసియైన పాప యెల్లయసూరి కారణంగా బిల్వమంగళకృత కోశకావ్యంలో చోటుచేసుకున్నట్టు కానవస్తుంది.

ఈ రచన ఇప్పుడు 15 వ శతాబ్దినాటి తాళ్లపాకవారి యింటి వ్రాతప్రతిలో గుర్తింపబడటం విశేషమే!

మరికొన్ని అంశాలు – పాదసూచికలు:

❖ ఈ పాట “తాళ్లపాక సంకీర్తనలు” అనే తాళపత్ర ప్రతి నకలు కాగితపు వ్రాతప్రతి 6609 115వ పుటలో మూడుచరణాలపాటగా చేరి యున్నది. ఇది తాళ్లపాకవారిదే కావచ్చుననీ, లీలాశుకుల (బిల్వమంగళుల) రచన కాకపోవచ్చుననీ ఇప్పుడు అర్థమౌతున్నది.

ఈ సంకలన గ్రంథమందున్నవి మొత్తము, నేను పరిశీలించినంతలో, ఇంచుమించు 289 పాటలు. గ్రంథ ముద్రణ సందర్భమున మీది 115 పాటను పరిశోధనాంశాల వివరణతో ముద్రించి, క్రింది నూతన విషయాలను చర్చించి పాదసూచికల్లో సూచిస్తున్నాము.

ఈ శ్లోకము ప్రాచీనులైన లీలాశుక బిల్వమంగళులదే అయితే ప్రాచీనులయెడ తాళ్లపాకవారికి గలభక్తి కిది సూచక మగునని ఒకప్పుడు భావించాము.

❖ భజన పద్ధతిలోనూ, నామసంకీర్తన విధానమందునూ తాళ్లపాక దేవబయకారులైన శ్రీ అన్నమాచార్యాదులనుకూడ 'జయదేవ మాధవానల కామకందళ నారాయణతీర్థుల' కోవకు చెందినవారేనని తలచుట కలదు. కవిసమ్రాట్ విశ్వనాథవారి కృతిలో మాధవానల పరంపరస్మరణ కలదు. "గొంతెత్తి పాడేనా కొమ్మలో గోకిల మసలు వసంతాగమమ్మటంచు...(గీతము) 'మాధవనాలు నవతార మహిమ జూపు / కాంచె బిల్హణ జయదేవ కవుల రూపు / చదివినది కాదు సంగీతశాస్త్రమందు / నూలుకొని పాడెనేని వీనులకు విందు// "(శ్రీ నారాయణతీర్థులవారి చరిత్ర).

❖ తాళ్లపాకవారు తమ రచనలందు జయదేవాదులను స్మరించిరి. నేటి దాక్షిణాత్య భజనసంప్రదాయ పద్ధతికి, (భగవన్నామ సిద్ధాంత విధానానికి), తాళ్లపాకవారు మూలపురుషులని సుబ్బరామదీక్షితులవారు చెప్పిన వార్త కలదు. తద్భక్తిసూచకముగనే పైని పేర్కొన్న గేయాంశమును కలదు.

❖ ఇందుకు మరొక తార్కాణము చూపవచ్చును. తాళ్లపాక చినతిరుమలాచార్యుల సంకీర్తనలలోని (చూ. పాత 16వ సంపుటము మరియు సంకీర్తనపు రాగిరేకులు) తొలి సంకీర్తనము చిన తిరుమలాచార్యుల సంకీర్తనము కాదు. అది వారి తాతగారైన అన్నమాచార్యులవారిది. ముద్రాభేదమున్ననూ ఆ కీర్తన మట్లు చేరుటకూడా అవిచ్ఛిన్నముగా కొనసాగుచున్న సంప్రదాయానుస్మరణమునకే కావలెను!

❖ రాగాల వరుసక్రమంలో వ్రాయబడిన "తాళ్లపాక సంకీర్తనలు" అను సంకలనగ్రంథములోని గేయకృతులన్నీ తాళ్లపాక వాగ్గేయకారకుటుంబంలోని తొలి మలి తరములవారివే అనుటకు అన్నమాచార్యాదుల రచనాంశములే సాక్ష్యములు. త్రిపురుష పర్యంతము ప్రత్యక్షమును, సప్తపురుష పర్యంతము పరోక్షమును ప్రసాదింతునన్న స్వామివాక్యమే యిందుకు ప్రమాణము.

❖ ఇంకొక ప్రమాణ మిట్లున్నది! తిరుమలలో తాళ్లపాకవారు ఆరంభించిన సుప్రభాతసేవ (మేలుకొలుపు సేవ), రాత్రివేళ సాగు పవళింపుసేవ (ఏకాంతసేవ) అనునవి అనంతరకాలమున నారాయణతీర్థుల మూలమున వరాహూరునందునూ, పిదప కాకినాడ వేణుగోపాలస్వామివారి ఆలయమందును కొనసాగె ననుటకు చారిత్రక రచనాధారాలున్నవి. తిరుమలమీది ఏకాంతసేవకు తాళ్లపాకవారి పాటలూ, శిలాశాసనాలూ సాక్ష్యము పలుకుతున్నట్లే, కాకినాడ వేణుగోపాలస్వామివారి ఆలయంలో జరిగే ఏకాంతసేవకును పాతకాలపు సాక్ష్య మొకటి కొత్తగా ఇటీవలే నాకు లభించింది. (చూ. G.O.M.L. Madras-1941 కేటలాగు). అదీ నాన్నగారు కూర్చిన 20 కేటలాగులలోనిదే కావడం విశేషం! అందు వారు పేర్కొన్న వివరాలనుబట్టి –

ఏకాంతసేవ పేరున పాడుకొనే పవళింపుసేవ పాటల్లో ఒక ప్రాచీనమైన కట్టుబాటుగల సంగీతసాహిత్య వాఙ్మయప్రక్రియ ఉండేదని మనకు తెలియవస్తోంది! అది ఉభయభాషల్లో సాగే విశిష్టమైన పద్య పద సాహిత్యములకూర్పు! అందులో 1.ఒక వృత్తము, 2.ఒక దరువు, 3. ఒక సీసము, 4.ఒక సంస్కృత శ్లోకము,

5. నరసింహా! కృష్ణా! మురారే! అనే సంబుద్ధి వాక్యాంశాలున్న ఒక నామావళి ఉన్నవి. వీనితో నియమముగా సాగే ఒక విశిష్ట అష్టకరచన అది!ఇలాంటి కూర్పు ఇతర సోదర భాషల్లో ఉన్నదో లేదో తెలియదుకానీ తెలుగులో మాత్రం మొదటిసారి నేను చూస్తున్న కొత్త ప్రక్రియ యిది, కర్తపేరు తెలియని 'ఏకాంతసేవ' అనే ఒక విడి తాళపత్ర గ్రంథంలో ఉంది.

ఇది కృష్ణకర్ణామృత రచనగా లోకంలో ప్రసిద్ధమైన శ్రీకృష్ణాష్టకంతో ముడిపడి ఉండడం ఒక వింత అయితే, ఆ శ్లోకం తాళ్లపాకవారి రచనగా "తాళ్లపాక సంకీర్తనలు"లో ఉండడం మరో విశిష్ట పరిశోధనాంశం! తిరుమల ఆలయంలో సుప్రభాతగీతాలకు, పవళింపుపాటలకు తాళ్లపాకవారికి విడదీయరాని గాఢమైన అనుబంధ మున్నది. వారే ఆ సేవలను తిరుమలలో ఆరంభించినవారు. ఆ సంప్రదాయమే నేటికీ అక్కడ కొనసాగుతున్నది. దక్షిణదేశంలోని తక్కిన వైష్ణవాలయా లన్నింటికీ అదే మార్గదర్శక మైందికూడా.

❖ తాళ్లపాకవారి పదాలకు 'మురారిపదా'లనే సంకేతము కూడా ఉండె ననుకొంటున్నాను.(చూ. 'మురవైరి పదములు మోహనమూర్తులనుచు'. అన్నమాచార్యచరిత్ర).

❖ తాళ్లపాకవారి కంచి వరదరాజుల మీది ఒక పాటను (నా మనసూ వంటిదే నీ మనసైతేను–ముఖారి – అట తాళం.D. No 465 చూ. నా థీసిస్ పుట 299) అజ్ఞాత రసమంజరికారుడు (GOML అముద్రితం) 'ఇది మురారివారి పదము' అని పేర్కొనడం ఈ భావాన్ని బలపరుస్తుంది.

❖ అంతేకాదు, 'మురారివారు' అనే వాగ్గేయకార వర్గము కూడా ఒకటియుండినట్లు మధ్యకాలీన తాళపత్ర లేఖనములందు ఒకచోట కలదు. "ముద్గల, లీలాశుక, అవధూతదిగంబర, సోపంత, రమావల్లభ, రోలంబ, సంతోష, నింబయా, గంగాధర, కోనేరి, మురారి , శాంతలింగ, శ్రీకృష్ణ, గోగియా, కృష్ణదాస, తుక్కారా, రామదాస, ఆనందమూర్తీ అసే జయరామ సుతాచే వాణీ..."(చూ. శాంతనామావళీ 11741/626).

❖ ఇట్టిదే మరొక చిత్రమైన పాట వింత(?)భాషా పదజాలంతో, సంస్కృత శ్లోకంతో, నవనాథసిద్ధులను, దశావతారాలను స్మరించే పాట మరొకటికూడా మన తాళ్లపాక సంకీర్తనలు అనే సంకలనంలో ఉంది.

❖ భిన్న భాషలలో కాకున్నా విభిన్న ఛందస్సులలో కూర్చిన స్వరసహిత పదవర్ణ మొకటి, పూర్వాంగం ఒకచోటను, ఉత్తరాంగ మింకొకచోటను దొరికిన సంఘటన మధ్యకాలీనసంగీత వాఙ్మయంలో నా కొకటి కానవచ్చింది. అదే మత్తేభ ద్విపద కంద పదవర్ణము.

ఇట్టివన్నియు సంగీతాన్నీ, భజనపద్ధతిని,భగవద్భక్తినీ లోకంలో పెంపొందించడానికి వాగ్గేయకారులు తొక్కిన కొత్త పుంతలు అనవచ్చును!

❖ ఇంతకూ 'అంగనామ్' అనే సుప్రసిద్ధ అష్టకంలోని తొలి మూడుచరణాలు 'తాళ్లపాక సంకీర్తనలు' లో, అది తాళ్ళపాకవారి పాటే అన్నట్లుగా ఉండడమేకాక , ఆంధ్రదేశంలోని వైష్ణవాలయాలలో జరిగే ఏకాంతసేవగా పవళింపుసేవ జరిపే సందర్భంలో పాడేపాటగా–ఒక కట్టుబాటైన క్రమంలో మిశ్రసంచితగానంగా–రూపొందిన వైఖరి మాత్రం సంగీత ప్రక్రియాపరంగా విశిష్టమైనదీ, పరిశోధనదృష్టిలో వినూత్నమైనదియును!!

❖ "సంజగౌ వేణునా దేవకీ నందన:" అనే మకుటంగల శ్రీకృష్ణాష్టకం వెంకటకృష్ణభక్తుడైన తాళ్లపాక చినతిరువేంగళనాథుని (చిన్నన్న) రచన కాదగు ననుకొందును. ఎందుకంటే తాళ్లపాకవారిలో శ్రీకృష్ణముద్రతో పాటలు రాసిన నాలుగో పదకర్త చిన్నన్న పేరుగల చినతిరువేంగళనాథుడే మొదటి వాగ్గేయకారులని నా అభిప్రాయము!

❖ ఈ విషయంలో సంకుసాల నృసింహకవికృతమైన 'కవికర్ణరసాయనం' గ్రంథనామానికీ, 'కృష్ణకర్ణామృతం' గ్రంథనామానికీ మధ్యగల నామసామ్యం కూడా పరిశీలనార్హమే కాగలదనుకొందును.

కానీ శ్రీకృష్ణాష్టకం ఇవాళటివరకూ శ్రీకృష్ణకర్ణామృతంలోని పాటగానే ప్రచారంలో ఉన్నది! అది 9/11 శతాబ్దులకు చెందినవారుగా భావింపబడే లీలాశుకుల పాటే అని భావిపరిశోధనలో నిశ్చయంగా ఒకవేళ తేలితే, 15/16 శతాబ్దులనాటి తాళ్లపాకవారి పాటగా చెల్లుబాటు కావడంలో వింత లేదుగానీ, వీరిపాట 9/15 శతాబ్దులమధ్య ఊగిసలాడే శ్రీకృష్ణకర్ణామృతం ఉత్తర దాక్షిణాత్యప్రతులన్నింటా కలదా అన్నదే సందేహం! అదొక పెద్దచర్చ! శ్రీకృష్ణకర్ణామృత కోశకావ్యాన్ని నిశితంగా పరిశీలించి పరిష్కరించిన S. K. De పండితుడు కూర్చిన పెద్దపీఠిక చదివిన తరువాత కొత్తకొత్త ఆకరాల ఆధారాలతో ఇంకా పరిశోధించవలసిన అంశాలున్నవేమో అనిపిస్తున్నది!

1. పాప యెల్లయసూరి ఎవరు? ఎప్పటివారు?

2. చైతన్యమహాప్రభువు (1486–1533)నకు శ్రీరంగయాత్రలో నాలుగైదు నెలలపాటు ఆతిథ్యమిచ్చిన ఆ వైష్ణవభక్తు లెవరు? దాక్షిణాత్యుడైన గోపాలభట్టు అనే వైష్ణవుడు ఎవరు? 'త్రిమల్లభట్టు'గా పిలువబడినవారు 'తిరుమల (భట్టు)గురుడు'గా ప్రసిద్ధుడైన తాళ్ళపాక పెద తిరుమలాచార్యుడు కాడా? తాళ్లపాకవారి శిల్పమూర్తులు శ్రీరంగాలయంలోని స్తంభాల మీద కలవుకదా!

3. పుష్టిమార్గ ప్రవర్తకులైన వల్లభాచార్యులవారు అన్నమాచార్యులకు సమకాలికులే! వారి తెలుగు పాటలు కొన్ని ఇటీవలి నా పరిశోధనలో వెల్లడియైనవి. వారి వ్రాతప్రతులందునూ తాళ్లపాకవారి పాటలు కొన్ని చేరియున్నవి.

4. అన్నమాచార్యాదుల రచనల సంపర్కము వల్లభాచార్యులవారి మూలముననే తరువాతి కాలపు చైతన్య మార్గీయులకునూ చేరియుండును!

5. కృ. క. లోని రెండవ, మూడవ శతకాల ప్రామాణ్యము నిర్ధారితము కాలేదు. శ్రీకృష్ణాష్టకం 2వ శతకం – 35–42 శ్లోకాల ఆకరం ఇంతవరకూ గుర్తింపబడనే లేదు. (omitted in KS అని S. K. De పరిష్కర్త అభిప్రాయము). అసలు 'తాళ్లపాక సంకీర్తనలు' సంకలనములోని ఆకరమునే ఆ పరిశోధకు లెవరును చూడలేదు. వారి వాక్యాలివి పరిశీలనార్హములు.

"35-42, 87-90, 93, 95, 96, some, composed in the same metre, appear to be a series taken bodily from some unknown poem (60, 63, 76, 81), and some can be traced as old verses occurring in anthologies or devotional works"

In the history of medieval Stotra Literature the Krishna-karnamrta deservedly holds a high place, It is a remarkable collection(Kosa-Kavya) of erotico-mystic lyrics of considerable devotional fervour on the romantic theme of Krsna.

In this connection I may also add here another observation of mine on Rangasayi, the Srirangam Temple Composer's song quoted in my Tagore Fellowship Thesis Final Report(2015-2017) 'samaya mEmE sAmi samaya mEmE' (audio CD brought out by Venkatagiri Raja Saheb on Sri Rangani Padamulu - music rendering by the famous Kartika Krishnakumar ji) dealing with the daily theme of Suprabhata Seva to Ekanta Seva of the Lord of Srirangam) and conclude this discussion. This view is also supported by the pillar sculptural relief of the Tallapaka poet composer found at the same premises.

-Veturi Anandamurthy



అంగనామంగనామంతరే మాధవో మాధవం
మాధవం చాంతరేణాంగనా। ఇత్థమాకల్పితే
మండలే మధ్యగస్సంజగౌ వేణునా దేవకీనం-
దనః॥ కేకికేకాధృతానేకపంకేరుహాలీన-
హంసావళీ హ్రాద్యతానృత్యయా। తం సమంతా-
టవీదావహం దావానలస్సంజగౌ వేణునా దేవకీ-
నందనః॥ కాప్యపి వేణుస్వరారావిణాం కంపితః
కాప్యపి వేణుస్వరాకింకిణీ నృత్యతః। కాప్యపి వేణు-
స్వరామంతరం గాయతః సంజగౌ వేణునా దేవ-
కీనందనః॥3॥

వ్రాతప్రతిలో 'అంగనామంగనామంతరే'



శ్రీవారి ఆలయ ప్రదక్షణ మార్గంలో తాళ్లపాకవారి సంకీర్తన భాండాగారం

దేవబయకారులు

శ్రీవేంకటేశ్వర ప్రభాతస్తవము

శ్రీవేంకటేశ్వర ప్రభాతస్తవము

॥శుభమస్తు॥

1★. శ్రీ గురుండర్థితో శేషాద్రియందు
యోగనిద్రాకేళి నున్న యత్తఱిని ౧❖

2. వనజాసనాది దేవతలేఁగుదెంచి
వినుతించి రప్పుడవ్విధ మెట్టిదనిన ౨

3. శ్రీకర! వేంకటక్షితిధరావాస!
నాకేంద్రనుత రమానాథ మేల్కనుము ౩

4. వసుదేవదేవకీ వరగర్భజాత
కిసలాయధర రామ కృష్ణ మేల్కనుము ౪

5. తపము పెంపున యసోదానందులకును
గృపతోడ శిశువైన కృష్ణ మేల్కనుము ౫

6. పూతనాకైతవస్ఫురితదుర్వార
చైతన్యహరణ ప్రశస్త మేల్కనుము ౬

7. అఱిముఱి శకటాసురాంగంబు లీల
విఱుగఁదన్నిన యదువీర మేల్కనుము ౭

8. మద్దులఁగూల్చి ఉన్నతవృత్తి మెఱయు
ముద్దుల గోపాలమూర్తి మేల్కనుము ౮

9. ఆననంబునఁ దల్లి కఖిలలోకములు
పూని చూపిన యాదిపురుష మేల్కనుము ౧౧

★ SVORI 6609B (తిరుపతి ప్రతి)లోని ద్విపదలు రోమన్ అంకెలతో సూచించబడినవి.
తిరుపతి ప్రతిలో 6 ద్విపదలు అధికంగా కలవు.

❖ GOML (మద్రాసు ప్రతి)లోని ద్విపదలు తెలుగు అంకెలతో సూచించబడినవి.

10. సుడిగాలిరాకాసి ద్రుక్కడంగించి
గెడపిన యదు బాలకృష్ణ మేల్కనుము ౮

11. అద్రిరూపంబైన యఘదైత్యుఁ జంపి
రౌద్రంబు నెఱయు భూరమణ మేల్కనుము ౧౦

12. కాళియఫణిఫణాంగణ నృత్యరంగ
లాలితచరణవిలాస! మేల్కనుము ౧౪

13. చతురాననుఁడు వత్ససమితి నొంచినను
బ్రతియొనర్చిన పరబ్రహ్మ! మేల్కనుము ౧౩

14. గురుతర గోపాల గోపికాయాస
తరణ గోవర్ధనోద్ధరణ మేల్కనుము (లుప్తము)

15. ఖరధేనుకాసురక్రకచ! మేల్కనుము
వరగుణ అక్రూరవరద మేల్కనుము ౧౨

16. దినమణి కోటిప్రదీప్త మేల్కనుము
వినయవాక్యోద్ధవవినుత! మేల్కనుము ౧౬

17. అతులకుబ్జా మనోహరుఁడ మేల్కనుము
చతురమాలాకార శరణ! మేల్కనుము ౧౫

18. కోకలిమ్మన్నఁ గైకోకున్నబట్టి
చాకిగొట్టినయట్టి సరస మేల్కనుము (లుప్తము)

(లుప్తము) భుజ విక్రమక్రమ స్ఫూర్తిమై భోజ
గజముఁజంపిన బాహుగర్వ మేల్కొనుము ౧౭

19. జెట్టిపోరను గిట్టి చీరి చాణూరు
చట్టలువాపిన శౌరి! మేల్కనుము ౧౮

20. అరుదరుదనుచు యింద్రాదుల బొగడ
ద్విరదంబు గూల్చిన ధీర మేల్కనుము (లుప్తము)

21. శంసింప జగదేవ శరణంబవైన
కంసుని తలగుండుగండ మేల్కనుము (లుప్తము)

22. మానిత సామ్రాజ్యమందలి నుగ్ర
సేను నిల్పిన ధర్మశీల మేల్కనుము (లుప్తము)

23. పరలోకగతులైన బాలుర దెచ్చి
గురునకిచ్చిన జగద్గురుండ మేల్కనుము (లుప్తము)

24. బలభేది భేదించి పారిజాతంబు
నిలకుఁ దెచ్చిన జగదీశ! మేల్కనుము ౨౧

25. రాజసూయమున శూరతఁ జైద్యుఁ దునిమి
పూజలందిన జగత్పూజ్య! మేల్కనుము ౨౩

26. సదమలానంద! నిశ్చయములకంద!
విదురుని వింద! గోవింద! మేల్కనుము ౨౮

27. వీరకౌరవసభ విశ్వరూపంబు
ధీరతఁ జూపిన దేవ! మేల్కనుము ౨౯

28. చండ భారతరణచాతుర్య ధుర్య
గాండీవిసారథ్యకరణ! మేల్కనుము ౨౦

29. బాణబాణాసనోద్భట భీమబాణ
పాణిఖండన! చక్రపాణి! మేల్కనుము ౨౨

30. ఇంపునఁ బృథుకంబు లిడిన కుచేలు
సంపన్నుఁజేసిన చతుర! మేల్కనుము ౨౬

31. దారుణ భూభార తరణావతార
భూరిప్రతాపవిస్ఫురణ! మేల్కనుము ౨౮

32. కురుసైన్యవిదళనాకుంఠితోత్సాహ
భరితపాండవపక్షపాత! మేల్కనుము ౧౯

33. మురనరకాసుర ముఖ్యదానవులఁ
బొరిగొన్న యదురాజపుత్ర! మేల్కనుము ౨౪

34. భోజకన్యాముఖాంభోజద్విరేఫ
రాజీవ నయనాభిరామ! మేల్కనుము ౨౯

35. మంజుల సత్యభామా మనస్సంగ
రంజితగాత్ర సంరంభ! మేల్కనుము ౩౧

36. తారుణ మిత్రవిందాకుచమధ్య
హార సంయోగ విహార మేల్కనుము (లుప్తము)

37. లలితకాళిందీ విలాస కల్లోల
కలిత కేళీలోల ఘనుఁడ మేల్కనుము ౩౨

(లుప్తము) నేత్రరాగ విశేష నిచితప్రతోష
మిత్రవిందారసోన్మేష! మేల్కనుము ౩౪

38. భద్రానఖాంకుర బాలచంద్రాంక
ముద్రితభుజతటీమూల! మేల్కనుము ౩౫

39. లక్షణాపరిరంభ లక్షితోదార
వక్షోవిశాల కవాట! మేల్కనుము ౩౬

40. చారుసుదంతా విశాలాక్షి కుముదహార
సారప్రభాపూర్ణ చంద్ర! మేల్కనుము ౩౩

41. వరరూపవతి జాంబవతితోడ రతుల
నిరతిమై నోలాడు నిపుణ మేల్కనుము ౩౬

42. వేడుకఁ బదియాఱువేల కామినులఁ
గూడి పాయని పెండ్లికొడుక! మేల్కనుము ౩౭

43. కలిత నక్రగ్రాహగంభీర జలధి
వలయితద్వారకావాస! మేల్కనుము ౩౮

44. జలదనీల శ్యామ! జగదభిరామ!
వెలయ మేల్కనుమంచు విన్నవించుటయు ౩౯

45. వీనులఁ గదిసిన వెలిదమ్మికన్నుఁ
గోనల నమృతంబు గురియ మేల్కాంచి ౪౦

46. సరసిజాక్షుఁడు దేవసంఘంబుమీఁద
కరుణాకటాక్ష వీక్షణము నిగుడ్చి ౪౧

47. శ్రీవేంకటాచలశిఖరమధ్యమున
సౌవర్ణమణిమయ సౌధంబులోన ౪౨

48. పూగ చంపక కుంద పున్నాగ వకుళ
నాగరంగప్రసూన విరాజమాన ౪౩

49. తరులతాపరివేష్టితంబైన యట్టి
నిరుపమ కోనేటినిర్మలాంబువుల ౪౪

50. తిరుమజ్జనంబాడి దివ్యాంబరంబు
ధరియించి దివ్యగంధము మేననలఁది ౪౫

51. నవరత్నమయ భూషణంబులు దాల్చి
వివిధసౌరభముల విరులోలి ముడిచి ౪౬

52. ధారుణీసురులకు దానంబు లొసఁగి
చేరి యక్షతములు శిరసునఁ దాల్చి ౪౭

53. వినుతులు గావింప విబుధసన్మునుల
మనవులు విని వారి మన్నించి మించి ౪౮

54. యగణితరత్న సింహాసనారూఢుఁ
డగుచు మేరువుమీఁది యభ్రంబువోలె ౪౯

55. గరకంకణోజ్జ్వల క్వణనంబులెసఁగ
సరసిజముఖులు వెంజామరల్ వీవ ౫౦

56. బంగారుగుదియల పడవాళ్లు దొరలు
భంగించి యటు బరాబరి శేయుచుండ ౫౧

57. నారదవీణా నినాదంబులెసఁగ
చారణమునిసిద్ధ సంఘంబు గొలువ ౫౨

58. నానాప్సరస్సతుల్ నాట్యముల్ సేయ
మానవేశులు మహామహులు సేవింప ౫౩

59. ఘనతర నిత్యభోగంబులు వెలయ
జనులకెల్ల మహాప్రసాదంబు లొసరఁ ౫౪

60. గోరినవారికిఁ గోర్కులీడేర
నీ రీతి జగముల నేలుచునుండు ౫౫

61. నని భక్తిఁ దాళ్లపాకన్నమాచార్యు
తనయ తిమ్మార్యుండు తగ విన్నవించె ౫౬

62. నేచి యీకృతి ధరణీశుల సభల
నాచంద్రతారార్కమై యొప్పుఁగాక! (లుప్తము)

॥ శ్రీః శ్రీః శ్రీః ॥

శ్రీవేంకటేశార్పణమస్తు

6609 B

923

మాంకులపేర మెరసిన పట్టణమంటివి ప్రాంతమ్మనె
బల్లియింత తేళ్ళ నే వృషములు తన్న విన్నవిగాదు॥
౧॥ తమ్మున నేమేననున్న దేమనంటె గగనము
పేంటడంటవి। రామ్మువేందబి అకెంబిన దేమనంటె
కుతువు ....

6609B

శుభమస్తు॥ శ్రీగురుభక్తితో శేషాంద్రియందు
మొంగనిదాల కౌళ్ళయున్న యత్త్రిని॥ వనజాస-
నాదిదేవతలెంగులెంచి। వినుపించరప్పుడావిధ-
మెట్లనిన॥ శ్రీకర వేంకటక్షితిధరావాస। నాకే-
శనుతర మానాథ మేల్కనుము॥ వసుదేవదేవకీ
వరగర్భజాత। కౌసల యాంఘ్రి రామకృష్ణ మేల్క-
నుము॥ తపముపెంపున యశోదానందులకును
కృపతెలింత శిశువైన కృష్ణ మేల్కనుము॥ ప్రాంతనా-

ప్రభాతస్తవం వ్రాతప్రతి

౧౨౪

కైతవస్ఫురితదుర్వారచైతన్యవంచనాప్రశస్తమే-
ల్కొనుము॥ అరిమురిశకటసుర అంగంబులెల్ల విరు-
గరచ్చిన యదువీర మేల్కొనుము॥ ముద్దులుగా-
ర్చియున్నతవృత్తి మెరయు। ముద్దులగోపాలమూ-
ర్తి మేల్కొనుము॥ ఆననంబున తల్లికేఖిలలోకములు।
బ్రాని చూపిన ఆదిపురుష మేల్కొనుము॥ సుర-
గాంచ రక్కసుల ప్రక్కంగబట్టి। వెరపిన యదుబాలకృ-
ష్ణ మేల్కొనుము॥ అద్రిరూపంబైన అఘదైత్యు
జంపి। గాత్రంబు మెరయు భ్రూంకరుణా మేల్కొనుము॥
కాళియఫణిఫణాంగణాత్పత్త్వరంగలో। కేళిచ-
చరణావిలాస మేల్కొనుము॥ చతురాననుఁడువత్స
తతి దాంచినను ప్రతియొనర్చిన పరబ్రహ్మమే-
ల్కొనుము॥ గురుతరగోపాలగోపికామాన।తరణా
గోవర్ధనోద్ధరణా మేల్కొనుము॥ ఖరధేనుకాసుర-

ప్రభాతస్తవం వ్రాతప్రతి

తాళ్లపాక సంకీర్తనలు - అకారాది సూచిక

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం-తాళం	వివరణ
1	68	అంగనామణి కురంగలోచన	శ్రీరమణ వేంకటేశ్వరుని	పంతువరాళి-లుప్తము	
2	276	అకటకటా యింతలోనె	లుప్తము	ఆహిరి-లుప్తము	
3	252	అక్కరో తానేటి కలిగినాడే	శ్రీవేంకటప్రభుడు	సౌరాష్ట్ర-లుప్తము	
4	24	అతివె ఉపరతియను	తిరువేంకటేశ్వరు	శ్రీరాగము-లుప్తము	
5	48	అదె వచ్చె చెలియ	శ్రీవేంకటరాయని	శంకరాభరణము-ఖండచాపు	26, పీఠిక, 5
6	239	అని చెలులు జయవార్త	శ్రీవేంకటప్పుడు	సాళంగనాట-లుప్తము	
7	214	అనువెరగంగలేని	శ్రీవేంకటప్పని	కాంబోది-లుప్తము	
8	257	అయ్యయ్యో! వేంకటరమణా	వేంకటరమణ	సౌరాష్ట్ర-లుప్తము	తంజావూరు ప్రతిలోనూ కలదు
9	258	అయ్యో! నావెతకుగా	వేంకటేశ	సౌరాష్ట్ర-అట	తంజావూరు ప్రతిలోనూ కలదు
10	55	అయ్యో! నీవెంత సేసినా	గోవిందరాజ	శంకరాభరణము-లుప్తము	
11	191	అయ్యో రామామణి!	వెంకటపతి	కాంబోది-అట	
12	140	అయ్యో! యేమరి	శ్రీవేంకటేశ	గుజ్జరి-లుప్తము	బౌళి, 15-6
13	4	అయ్యో! హా! నిను బాసి	లుప్తము	లుప్తములు	
14	87	అరయ నాలుగు జాతులందా	తిరువేంకటేశుడు	లుప్తము-త్రిపుట	
15	12	(అల) మంగ చూపులో	శ్రీవెంకటాధిపుని	కాంబోది-అట	
16	144	అలయ గౌగిట నోల	వేంకటపతి	శ్రీరాగం-లుప్తము	
17	197	అలరఁజంచలమైన	వేంకటశైలపతి	ఆహిరి-లుప్తము	ఆహిరి, 1-67
18	36	అలికి (అళులు) సంపెంగ	వేంకటపతి	ఆహిరి-అట	ఆహిరి, 5-331
19	11	అలివేణి జవ్వనంబదె	శ్రీవేంకటాధీశుడు	కాంబోది-ఝంపె	
20	59	అలుగక కూటమి చవిగా	శ్రీకృష్ణా	బిలహరి-లుప్తము	

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం-తాళం	వివరణ
21	182	అవునయ్యా లెస్స తగ	వేంకటప్పుడు	కేదార-అట	26, పీఠిక పుట.13 తంజావూరు ప్రతిలోనూ కలదు
22	117	ఆటదాననె పో	వేంకటనాథ	కన్నడ-త్రిపుట	
23	204	ఆటది జాణ కాకుంటే	శ్రీవేంకటనాథుని	మారువధన్యాసి-లుప్తము	
24	246	ఆన పెట్టుదువు నీవప్పటి	తిరువేంకటేశ	భైరవి-లుప్తము	భైరవి, 5-222
25	284	ఆపరాని వలపాయ	వేంకటపతి	ఆహిరి-జంపె	తంజావూరు ప్రతిలోనూ కలదు
26	72	ఆపాటి కీపాటి	వేంకటగిరి	శంకరాభరణము-లుప్తము	
27	205&286	ఆమని కాలమునై-భామ!	వేంకటపతి	లుప్తములు	
28	177	ఆయనాయ	శ్రీవేంకటేశా	లుప్తములు	
29	199	ఆయెబోయె నింకనేటి	వేంకటనిలయుడు	ఆహిరి-అట	
30	91	ఆహా శ్రీవేంకటాద్రినాథురే			
31	60	ఇంకనేల నీవు నాతో	శ్రీవేంకటనాథ	బౌళి - మఠ్య	బౌళి, 10-100
32	234	ఇంత తరితీపులేలే?	శ్రీవేంకటనాయకుడ	కాంబోది-లుప్తము	
33	187	ఇంత నేరకుండిన దేఁటి	శ్రీవేంకటేశు	తోడి-లుప్తము	శ్రీరాగం, 17-42 తంజావూరు ప్రతిలోనూ కలదు
34	184	ఇంత సేసితివి నీవే	శ్రీవేంకటేశ	నాదనామక్రియ-లుప్తము	దేసాళం, 23-115
35	82	ఇట్టే నా సేవలును యిచ్చేటి	శ్రీవేంకటేశ	శంకరాభరణము-లుప్తము	సామంతం, 15-282
36	27	ఇది నమ్మరాదు	శ్రీవేంకటేశు	లుప్తములు	
37	139	ఇన్ని యుపాయము లింక	శ్రీవేంకటేశ	గుజ్జరి-లుప్తము	గుజ్జరి, 15-16
38	8	ఇరు కత్తులొక్క యొర	తిరువేంకటేశుండ	గౌడిపంతు-లుప్తము	

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం-తాళం	వివరణ
39	130	ఈ జవ్వనంబేలె బాలా	శ్రీవేంకటనిలయుడు	మధ్యమావతి-లుప్తము	
40	46	ఈ తప్పు జేసినందుకా	శ్రీవేంకటప్పుడు	శంకరాభరణం-లుప్తము	
41	42	ఈయవే నాకభయంబు	శ్రీవేంకటనాథుఁడ	లుప్తములు	తంజావూరు ప్రతిలోనూ కలదు
42	186	ఈలాగు ప్రాణేశు	శ్రీవేంకటాచలాధీశు	నాదనామక్రియ-లుప్తము	
43	131	ఉత్తమము చెప్పబోతే	శ్రీవేంకటేశ	ముఖారి-లుప్తము	
44	282	ఉవిదతనులత యేఁటికులికి	వేంకటేశ్వరుని	ఆహిరి-జంపె	ఆహిరి, 5-348
45	175	ఎంతకత నడిపితివి	శ్రీవేంకటేశ	నాదనామక్రియ-లుప్తము	నాదనామక్రియ,2-315
46	33	ఎంతగాలముకదా	తిరువేంకటేశు	లుప్తములు	శ్రీరాగం, 1-316
47	167	ఎంతదొరవైన నీవు	శ్రీవేంకటనాథ	పంతువరాళి-పంచఘాత	
48	251	ఎంత నెరజాణడమ్మవాడు	వేంకటరాయడు	సౌరాష్ట్ర-అట	
49	107	ఎంత మాయదారివాడు	వేంకటరాయడు	అమరసింధు-ఏక	
50	183	ఎంత మాయదారి	శ్రీవేంకటప్రభుడు	కేదార-లుప్తము	
51	217	ఎంత మేలు చేసినదో	తిరువేంకటేశుండ	కాంబోది-లుప్తము	సామంతం,6-42
52	120	ఎంత రాతి మనసుది	తిరువేంకటాధిప	సౌరాష్ట్ర-లుప్తము	తంజావూరు ప్రతిలోనూ కలదు
53	242	ఎంత సేసినా సేయనీ	శ్రీకృష్ణుడు	భైరవి-లుప్తము	
54	122	ఎటువంటి మోహమో యింతి!	శ్రీవేంకటేశ	సౌరాష్ట్ర-లుప్తము	తంజావూరు ప్రతిలోనూ కలదు
55	143	ఎటువంటి రాజీకమే	శ్రీవేంకటేశు	లుప్తములు	14 పీఠిక, శ్రీరాగం, జంపె తంజావూరు ప్రతిలోనూ కలదు
56	54	ఎటువంటివాడవో నీ మహిమ	శ్రీవేంకటనాథ	శంకరాభరణం-అట	అ.చ.పీ.పు.25
57	230	ఎటువలె నా ప్రాణేశుని	వేంకటపతి	శంకరాభరణం-లుప్తము	

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం–తాళం	వివరణ
58	49	ఎట్టుగలిగెనె లలన	శ్రీకృష్ణ	శంకరాభరణం–లుప్తము	
59	194	ఎట్టు గలిగెరా మోహమింతలో	శ్రీకృష్ణ	లుప్తములు	
60	31	ఎదురుగా వచ్చేవు	వేంకటేశ	కాంబోది–జంపె	
61	232	ఎన్ని తపంబులు	శ్రీవేంకటేశుడు	శంకరాభరణం–అట	
62	95	ఎమ్మె నెరపుదాని	గోవిందరాజ	కేదారగౌళ–అట	
63	52	ఎలనాగ నేనేమైన	వేంకటపతి	శంకరాభరణము–ధ్రువ	
64	96	ఎలనాగ! పంచాంగ	శ్రీవేంకటవిభు	కేదారగౌళ–అట	
65	157	ఎలనాగ యాలౌట	శ్రీవేంకటేశ	మేచబౌళి–లుప్తము	
66	18	ఎవ్వరికి జెప్పరా (దిట్టి)	వేంకటపతి	లుప్తములు	
67	118	ఏకాలము నామనే యెఱిఁగిన	శ్రీవేంకటేశ	లుప్తములు	పాడి,15–364
68	185	ఏటికని నే వగతునో	వేంకటేశుని	నాదనామక్రియ–లుప్తము	
69	66	ఏటిపొందు యేఁటిగుణము	వేంకటాద్రివిభుని	భైరవి–లుప్తము	6–180
70	162	ఏటిమాటలాడేవు	శ్రీ వేంకటనాథ	తోడి–లుప్తము	
71	105	ఏమని యెంచేవమ్మ	శ్రీవేంకటనాథు	కేదారగౌళ–లుప్తము	
72	76	ఏమని వినేమొకో	శ్రీవేంకటాధిపు	కల్యాణి–లుప్తము	
73	93	ఏమిటను గొద లేదు	శ్రీవేంకటేశు	నాదనామక్రియ–లుప్తము	
74	243	ఏమిసేతు నమ్మలాల	వేంకటాద్రిపతి	భైరవి–లుప్తము	
75	6	ఏమిసేతు నిన్ను బాసి	లుప్తము	కళ్యాణి–లుప్తము	
76	141	ఏమి సేయుదునమ్మ	తిరువేంకటేశు	కాంబోది–జంపె	నాదనామక్రియ, 5–113
77	169	ఏమి సోద్యమైన సురత	వేంకటేశుడు	నాదనామక్రియ–లుప్తము	

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం-తాళం	వివరణ
78	20&170	ఏమొకొ చిగురుటధరమున	తిరువేంకటపతి	నాదనామక్రియ-లుప్తము	5-82
79	29	ఏమొకో చూచెదరు	శ్రీవేంకటేశు	లుప్తములు	
80	270	ఏల యలవోక సేసే	వేంకటపతి	సౌరాష్ట్ర-లుప్తము	
81	14	ఏలయ్య మదనచల	శ్రీకృష్ణుండు	కాంబోది-లుప్తము	
82	146	ఏలర? నాతో యింత	శ్రీవేంకటప్రభుడ	బిళాపచారి-లుప్తము	
83	235	ఏలవలచితిమి మన	శ్రీవేంకటేశు	కాంబోది-లుప్తము	
84	277	ఏ వూరికేవూరు యెక్కడికి	తిరువేంకటాద్రీశ	లుప్తములు	శ్రీరాగం, 5-1
85	102	ఒంటినేల తిరిగేవే	శ్రీవేంకటపతి	కేదారగౌళ-లుప్తము	
86	281	ఒడలి తాపమువీఁద	వేంకటస్వామి	ఆహిరి-అట	బౌళి, 6-117
87	19	ఒరిమె నెప్పుడు నివి	వేంకటపతి	నాదనామక్రియ-లుప్తము	
88	260	ఓరీ రారా! వొద్దికై రారా!	శ్రీవేంకటనాథ	లుప్తములు	
89	109	ఓహొూహొూ యనరో పారి	శ్రీవేంకటేశ్వరుఁడు	రామక్రియ-లుప్తము	రామక్రియ,15-18
90	70	కంకణ మిదిగో చూడ	తిరువేంకటగిరి	కాంబోది-ఆది	తంజావూరు ప్రతిలోనూ కలదు
91	212	కంటిఁగంటి నిలువుచక్కనిమేను	శ్రీవేంకటేశ	రామక్రియ-అట	అ.చ.పీ.పు.22
92	3	కంటి శుక్రవారము గడియ	-	లుప్తములు	అ.చ.పీ.పు.31
93	58	కటకటా అయ్యో కాంత నింత	వేంకటేశ	లుప్తములు	అ.చ.పీ.పు.120
94	196	కటకటా విరహు లెక్కడ	తిరువేంకటాచలాధిపు	లుప్తములు	శ్రీరాగం, 6-92
95	30	కనుపట్టె చెలికి	శ్రీవేంకటాధీశు	శ్రీరాగము-అట	
96	272	కప్పురపు (కళుకులు)	శ్రీవేంకటపతి	లుప్తములు	
97	13	కరము జీడిపులుసు	శ్రీవెంకటప్ప	లుప్తములు	అ.చ.పీ.పు.6

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం–తాళం	వివరణ
98	174	కరుణానిధిం	వేంకటేశం	కన్నడగౌళ–లుప్తము	కన్నడగౌళ, 1–342
99	233	కలకంఠు(లాలా)	శ్రీవేంకటేశ	శంకరాభరణం–లుప్తము	
100	166	కలిగెగా మనల	శ్రీకృష్ణ	నవరోజ్– అట	
101	100	కాకకొన్నాడు నీ	శ్రీవేంకటరమణుడు	లుప్తము–అట	
102	64	కాతరపుదాన నేను	శ్రీవేంకటేశుడు	భైరవి–లుప్తము	
103	80	కామయాగము చేసెఁగలికి	శ్రీతిరువేంకటేశ్వర	భైరవి–లుప్తము	కన్నడగౌళ, 5–223
104	202	కాముడు సంభ్రమము	లుప్తము	వసంతభైరవి–లుప్తము	
105	285	కాముఁడెవ్వరి	శ్రీవేంకటేశ్వర	ఆహిరి–జంపె	
106	136	కురువనంబి తిరుమల	శ్రీవేంకటేశ్వర	కాంబోది–లుప్తము	అ.చ.పీ.పు.14
107	47	కొండవలె నిను జూచు	శ్రీవేంకటప్పుడు	శంకరాభరణము–లుప్తము	తంజావూరు ప్రతిలోనూ కలదు
108	43	కొమ్మ నీ పలుకులకు	ద్వారకాకృష్ణుడు	లుప్తములు	
109	247	గందము పూసేవేలె	వెంకటపతి	భైరవి–లుప్తము	భైరవి, 5–2
110	128	గారవమున శ్రీవేంకటపతి	శ్రీవేంకటపతి	వసంతభైరవి–లుప్తము	
111	268	గుజగుజరేకుల	వేంకటరాయ–	లుప్తములు	
112	254	గుజ్జనఁగూడు వండెనె	శ్రీవేంకటనాథు	సౌరాష్ట్ర–అట	బౌళిరామక్రియ, 10–101
113	250	చందమామ రావో	శ్రీవేంకటనాథు	సౌరాష్ట్ర–అట	
114	104	చాలదే ఒక నాడైనను	శ్రీకృష్ణ	కేదారగౌళ–లుప్తము	
115	127	చీచీ నరుల దేఁటి జీవనము	శ్రీవేంకటేశ	ముఖారి–లుప్తము	ముఖారి, 15–86
116	57	చూచేవారికి ధర్మము	శ్రీవేంకటేశ	లుప్తము–ఏక	నాట,15–339
117	180	చెప్పరాదుగదే మన	శ్రీవేంకటేశ్వర	లుప్తములు	తంజావూరు ప్రతిలోనూ కలదు

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం-తాళం	వివరణ
118	208	చెలిమితో కూడితివి	శ్రీవేంకటప్రభుడ	లుప్తములు	
119	279	చెలియ! నాపై యెంత	శ్రీ వేంకటేశు	లుప్తములు	
120	23	చెలులార చూడరే	శ్రీవేంకటేశుండు	శ్రీరాగము-లుప్తము	
121	34	చెలులారా! చేరిచూడరే	శ్రీవేంకటేశుని	కాంబోది-లుప్తము	
122	164	చేతకాని పనులెల్ల	శ్రీవేంకటపతి	దేశాక్షి-లుప్తము	
123	275	చేతు లలయ పూజ	వేంకటనాథుడు	లుప్తములు	
124	267	చేవమావి చిగురులివి	వేంకటపతి	లుప్తములు	
125	198	జీవాతుమై యుండుచిలుకా	శ్రీవేంకటాద్రి	ఆహిరి-లుప్తము	ఆహిరి, 1-50
126	106	తనకుబోదు నాకుబోదు	శ్రీవేంకటనాథుడు	కేదారగౌళ-లుప్తము	
127	188	తప్పకజెప్పరా వోరి!	శ్రీవేంకటేశ	శంకరాభరణం-లుప్తము	
128	83	తమలోనే ఉన్నవి	శ్రీవెంకటేశు	శంకరాభరణం-లుప్తము	
129	220	తరితీపె తరుకాడు	శ్రీవేంకటనాథుడు	పంతువరాళి-లుప్తము	
130	241	తలచిన హృదయము	శ్రీకృష్ణ	కన్నడగౌళ-లుప్తము	
131	249	తలచి (పాసీ యుండ)	వేంకటేశ్వర	భైరవి-అట	తంజావూరు ప్రతిలోనూ కలదు
132	226	తలమేల కులమేల	శ్రీవేంకటేశు	పాడి-లుప్తము	శ్రీరాగం,15-285
133	172	త్వమేవ శరణం	తిరువేంకటగిరినిలయ	శ్రీరాగం-లుప్తము	శ్రీరాగం,1-323
134	145	తానట ప్రాణేశుండట	తిరువేంకటపతి	ముఖారి-లుప్తము	శ్రీరాగం,5-292
135	179	తిరుమలగురునేలు	శ్రీవేంకటప్పని	లుప్తము	
136	248	తిరుమలయ్యె విందు	శ్రీవెంకటనాయకుఁడు	భైరవి-లుప్తము	భైరవి, ఆది, 26 పీఠిక,12 తంజావూరు ప్రతిలోనూ కలదు

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం-తాళం	వివరణ
137	256	తురుమున గొజ్జంగులు	వేంకటపతి	సౌరాష్ట్ర-లుప్తము	తంజావూరు ప్రతిలోనూ కలదు
138	209	తెరువు వెంట వచ్చే	శ్రీవేంకటప్రభుడు	మోహనకళ్యాణి-లుప్తము	
139	86A	తెలిసి తెలియగ	శ్రీకృష్ణ	లుప్తములు	
140	113	తెలిసి తెలియనివాని		లుప్తములు	
141	153	తేనెను (తేగా) బోవలె	తిరువేంకటాద్రి	లుప్తములు	
142	278	దంటమాటలనె నన్నుఁ	తిరువేంకటరాయ	ఆహిరి - లుప్తము	
143	124	దిద్దుకో వలెగాక	శ్రీవేంకటప్రభుడు	మధ్యమావతి-లుప్తము	
144	86	దినదినము (మదనుడే)	శ్రీకృష్ణ	ఘంటారవము-లుప్తము	
145	78	దేవదేవం భజే	వేంకటేశం	ధన్యాసి-లుప్తము	ధన్నాసి, 1-314
146	149	దేవ నావలన గుణము	శ్రీవేంకటేశ	లుప్తములు	మంగళకౌశిక, 15-12
147	210	దేవరకే చెల్లెనో	తిరువేంకటకాంతుడ	లుప్తములు	
148	206&	దేవర వంటివాడని	వేంకటనాథ	ఆహిరి-లుప్తము	తంజావూరు ప్రతిలోనూ కలదు
149	77	నందనందన	శ్రీవేంకటేశ్వర	ధన్యాసి-లుప్తము	ధన్నాసి,1-312
150	261	నన్నే పిలవవయ్యా	శ్రీవేంకటనాథ	సౌరాష్ట్ర-లుప్తము	తంజావూరు ప్రతిలోనూ కలదు
151	176	నలినాక్షి యొకతెయు	శ్రీవేంకటేశుడ	శుద్ధకాంబోది-లుప్తము	
152	181	నాకంటె నీకు	వేంకటపతి	గుమ్మకాంబోది-లుప్తము	
153	62	నాకింత గుట్టు మీఁది	శ్రీవేంకటాధీశ	ఘంటారవము-లుప్తము	
154	7	నాకు నాకె వలపుదెల్ప	వేంకటరాయ	కల్యాణి-లుప్తము	
155	39	నానావుపాయముల	శ్రీవేంకటేశ	శంకరాభరణం-లుప్తము	శంకరాభరణం, 15-370
156	116	నాయంతనే వుద్దండంబున	శ్రీవేంకటగిరి	నారాయణగౌళ-లుప్తము	మధ్యమావతి,15-423

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం-తాళం	వివరణ
157	223	నారాయణతే నమో నమో	శ్రీవేంకటనాయక	లుప్తములు	పాడి, 4-32 (నిడురేకులు)
158	121	నిండ నేగురు	శ్రీవేంకటనాథుడు	సౌరాష్ట్ర-త్రిపుట	
159	114	నిండిన వేడుకలెల్ల	వేంకటేశ	వరాళి-లుప్తము	వరాళి,5-272
160	126	నిచ్చలపువాడవై	వేంకటరాయని	ముఖారి-లుప్తము	
161	201	నీకుగా మావారిలో	శ్రీవేంకటేశ	ఆహిరి-లుప్తము	
162	151	నీకేమి జాణకాడవు	శ్రీవేంకటేశు	ఆహిరి-లుప్తము	
163	161	నీపొందెన్నటికి బోదు	శ్రీవేంకటనాథుని	పాడి-లుప్తము	
164	168	నీమహిమ కొనియాడ	తిరువేంకటనాథుడ	పంతువరాళి-లుప్తము	
165	37	నీలశైలము వంటి	వేంకటశైలపతి	లుప్తములు	
166	26	నీవనఁగ నొకచోట	వేంకటాచలనాథ	శ్రీరాగం-లుప్తము	సామంతం,1-232
167	165	నీవు గాఁగా నేను	వేంకటనాథుఁడు	కేదారగౌళ-అట	అ.చ.పీ.పు.119
168	156	నెట్టన (నీ)తో	అసంపూర్ణం-లుప్తము	సామంతం-లుప్తము	
169	75	నెలఁతఁ బాసి	శ్రీవేంకటేశ్వరుడు	లుప్తములు	వరాళి,17-20
170	129	నెలత నెడబాయనిదె	శ్రీవేంకటేశుడు	వసంతభైరవి-లుప్తము	
171	137	నెలతయుపరతి	శ్రీవేంకటప్పుడు	కాంబోది-లుప్తము	
172	61	నేఁడే పెండ్లివేళ	శ్రీవేంకటేశుడు	లుప్తములు	శ్రీరాగం,17-537
173	67	నేను మంచిదానను	శ్రీవేంకటేశ	పంతువరాళి-లుప్తము	
174	134	నేనెట్లు తాళుదు	శ్రీవేంకటప్రభుడు	పంతువరాళి-లుప్తము	
175	215	నేనే వచ్చేగా నీయింటికి	శ్రీవేంకటనాథ	కాంబోది-లుప్తము	
176	113	నేనైతే నీడేరుదు	శ్రీవేంకటేశ	లుప్తములు	హెజ్జిజి, 15-22

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం-తాళం	వివరణ
177	112	నే మానవతినౌట	శ్రీవేంకటపతి	లుప్తములు	
178	108	నేరుపు కలుగు	శ్రీవేంకటేశుడు	శంకరాభరణం-అట	
179	123	పట్టరాని వయసిన్ని	శ్రీవేంకటవిభు	కాంబోది-లుప్తము	
180	63	పట్టాభిరామయా	శ్రీవేంకటనివాస	ఘంటారవం-లుప్తము	
181	50	పడుచ! నీ విప్పుడే	వేంకటపతి	లుప్తములు	
182	111	పణతి! విరహపు	శ్రీరమణి వేంకటేశుని	లుప్తములు	
183	263	పతి మాత్రమా	వేంకటనాథుని	సౌరాష్ట్ర-జంపె	తంజావూరు ప్రతిలోనూ కలదు
184	152	పనివినుము ఓ పన్నగశయన	వెంకటరమణ	భూపాలం-లుప్తము	
185	10	పరమయోగిని	తిరువేంకటేశుడు	లుప్తములు	
186	28	పసగల ద్వారకా	ద్వారకా బాలకృష్ణ	లుప్తములు	
187	35	పసిండి మెరపుతీగ	శ్రీవేంకటేశుడు	కాంబోది-లుప్తము	
188	222	పాదరే పాదరే	శ్రీవేంకటేశ్వరుని	భూపాలం-లుప్తము	
189	207	పాయదు మదిలో నెప్పుడు	శ్రీకృష్ణ	నీలాంబరి-లుప్తము	
190	288	పుట్టక తొల్లె యెన్ని	లుప్తము	ఆహిరి-అట	
191	79	పుట్టుభోగీంద్రు డే	శ్రీవేంకటాధీశ	ఆహిరి-లుప్తము	
192	218	పులుకడిగినయట్టి	శ్రీవేంకటేశుయెద	పంతువరాళి-లుప్తము	శ్రీరాగం,17-506
193	69	పెనఁగకురే మీరింత	శ్రీవేంకటేశుడు	కాంబోది-లుప్తము	సామంతం,17-29
194	51	పొదగంటిమయ్య మిమ్ము,	శ్రీవేంకటనాథుడు	శంకరాభరణం-అట	అ.చ.పీ.పు.22
195	244	పొద్దుబోదా నీకు నేమి	శ్రీవేంకటనాథుడు	శంకరాభరణం-లుప్తము	
196	158	పొద్దువోకలివి నీకు భువిలో	తిరువేంకటేశ్వర	ముఖారి-లుప్తము	ముఖారి,5-275

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం-తాళం	వివరణ
197	224	పొలతి జవ్వనముపైఁ	శ్రీవేంకటేశు	లుప్తములు	మాళవి,24-8
198	269	పొలతి మా చెలి యనుచు	వేంకటపతి	సౌరాష్ట్ర-లుప్తము	
199	221	పొసగంగా చెలినడు (మది)	వేంకటాధీశు	లుప్తములు	
200	84	పోఁబొయ్యే పడుచ!	శ్రీవేంకటనాథుడు	ఘంటారవము-లుప్తము	
201	259	పోయే నన్న పోనీఁడమ్మ	శ్రీవేంకటేశుడు	సౌరాష్ట్ర-లుప్తము	
202	195	భామ శృంగారించు భావమే	శ్రీవెంకటేశుడు	శ్రీరాగం-లుప్తము	13, పీఠిక
203	150	భూషణము లవి యేటి	వేంకటనాథు	లుప్తములు	
204	148	మంచి వయసుకాలము	శ్రీవేంకటేశ్వరు	దేసాక్షి-అట	దేసాళం, 15-204
205	9	మంచివాడ వౌదువు	-	గౌడిపంతు-లుప్తము	
206	15	మందగమన నీదు	(శ్రీవేంకటపతి)	కాంబోది-లుప్తము	
207	99	మగఁడని యాలని	శ్రీవేంకటాచలనాథుడు	కేదారగౌళ-లుప్తము	
208	133	మగల మగువల	శ్రీవేంకట విభుని	ముఖారి-లుప్తము	
209	138	మగువలు చూడరమ్మా	శ్రీవేంకటపతి	కాంబోది-లుప్తము	బౌళి,17-514
210	90	మత్స్యేంద్ర కూర్మరజతాచల	వేంకటనాథురె	మాళవగౌళ-లుప్తము	
211	103	మదనజోగివచ్చె	వేంకటనాథుడు	లుప్తములు	
212	274	మదనునితల్లికి మంగళం	వేంకటరమణుని	సౌరాష్ట్ర-ఏక	
213	155	మదము దొలఁకెడి	తిరువేంకటాచలాధిపుడు	సామంతం-లుప్తము	సామంతం,5-54
214	1	మదిలో మెదలెడి పతికిని	వెంకటపతి	లుప్తములు	
215	193	మన చేతగావు	తిరువేంకటేశ్వరుని	కాంబోది-లుప్తము	
216	190	మనసిచ్చునో మనసియ్యదో	శ్రీవేంకటేశ	శంకరాభరణం-అట	

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం-తాళం	వివరణ
217	25	మనములోని విభుఁడు	కోనేటిరాయండు	శ్రీరాగం-లుప్తము	నాదనామక్రియ 6-57
218	173	మాదృశానాం	భవ్యవేంకట	ముఖారి-లుప్తము	ముఖారి,1-325
219	200& 283	మానుమన్న మానదమ్మ,	శ్రీవేంకటేశుడు	ఆహిరి-అట	
220	135	మాయలేలనయ్య	శ్రీవేంకటనాయక	పంతువరాళి-లుప్తము	
221	271	ముద్దుగారీ నమ్మ	వేంకటకృష్ణుని	సౌరాష్ట్ర-లుప్తము	
222	98	మేలుగావలెనే వో	వేంకటపతి	కేదారగౌళ-లుప్తము	తంజావూరు ప్రతిలోనూ కలదు
223	219	మేలెరిగినవాడవు	శ్రీవేంకటభూధరవాస	లుప్తములు	
224	44	మొక్కేర చిట్టకముల	శ్రీవేంకటప్ప	శంకరాభరణం-లుప్తము	
225	229	మొల్లలేలె నాకు తన్నె ము	వేంకటగిరీంద్రుడు	శంకరాభరణం-లుప్తము	కొండమలహరి, 6-108
226	192	రచ్చలోన మగనాలిని	శ్రీవేంకటరాయడు	కాంబోది-త్రిపుట	
227	280	రమణుని చేఁతలు దక్కెను	వేంకటపతి	ఆహిరి-లుప్తము	ఆహిరి,6-169
228	253	రారా నన్నేలుకోరా	శ్రీవేంకటప్రభుడు	సౌరాష్ట్ర-అట	
229	110	రారో దేవతలారా	శ్రీవేంకటేశుడు	లుప్తములు	
230	45	రేలు నీవేల వెన్నెల	వేంకటపతి	కేదారగౌళ-లుప్తము	
231	53	రేలు నీవేల వెన్నెల పాలు	శ్రీవేంకటప్ప	శంకరాభరణము-లుప్తము	
232	85	లాలి లాలీ లాలి	శ్రీవేంకటనాథ	ఘంటారవము-లుప్తము	
233	265	లేఁతచిగురిదె	వేంకటేశ	రాగతాళములు లుప్తములు	దేశి,5-35
234	240	వద్దుర చవిగా చొక్కుదు	శ్రీవేంకటపతి	సాళగనాట-లుప్తము	
235	125	వనితకు నీ మీది	వేంకటప్పడ	మధ్యమావతి-లుప్తము	తంజావూరు ప్రతిలోనూ కలదు
236	92	వలచినందుకు గురుతు	యలమేల్మంగ	నాదనామక్రియ-లుప్తము	

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం–తాళం	వివరణ
237	160	వలచినదానిని	వేంకటప్రభుడ	సావేరి–లుప్తము	
238	228	వలవనని యనుకొనే(దే)	శ్రీవేంకటేశు	పాడి–లుప్తము	
239	211	వాని రమ్మనవే అక్కరో!	శ్రీవేంకటవిభుడు	రాగతాళములు లుప్తములు	
240	21&32	వారివారికి తె(వులు)	శ్రీవేంకటాధీశు	కాంబోది–జంపె	
241	22	వారివారికిఁ దగిన	శ్రీవేంకటారమణ	లుప్తములు	27 – పీఠిక XXVI
242	159	వింటివో వింటివో	శ్రీవేంకటేశుడు	రేగుప్తి–లుప్తము	
243	273	విజయీభవ శ్రీవేంకటరాయ	వేంకటరాయ	లుప్తములు	
244	231	విన్నవించనెట్టువచ్చు	శ్రీవేంకటేశ	శంకరాభరణం–లుప్తము	శంకరాభరణం 28–4
245	225	విభుని వినయములు	వేంకటపతి	పాడి–లుప్తము	పాడి, 5–308
246	147	వీఁడివో యిదె	వేంకటగిరి	భైరవి–లుప్తము	భైరవి,1–322
247	237	వీడె నెలకొన్నాడు	వేంకటపతి	సాళంగనాట–లుప్తము	సౌరాష్ట్ర–ఆది, 27పీఠిక, XXVI
248	238	వెదకి వెదకి చొప్పు	శ్రీవేంకటేశుడు	లుప్తములు	సాళంగనాట, 15–411
249	178	వెనకకు వాని చేత	శ్రీవేంకటేశు	శుద్ధకాంబోది–లుప్తము	
250	154	వెలదిరో తిల్లగోవిందుని వగలు	శ్రీవేంకటప్రభుడు	రమామనోహరము–లుప్తము	
251	56	వేఁడుకొంటె విందుగాక	శ్రీవేంకటేశుఁడ	శంకరాభరణము–లుప్తము	
252	5	వేడుకొందామా వేంకటగిరి	శ్రీవేంకటాద్రినాథుడు	లుప్తములు	అ.చ.పీ.పు.6
253	94	వేళ కొదవినవాఁడె	శ్రీవెంకటప్పుడు	నాదనామక్రియ–లుప్తము	26, పీఠిక పుట.10 తంజావూరు ప్రతిలోనూ కలదు
254	203	శంఖమా! పోయివత్తునా?	శ్రీవేంకటనాథుడు	వసంతభైరవి–లుప్తము	

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం–తాళం	వివరణ
255	38	శరణాగతవత్సల	శ్రీవేంకటాద్రినాథుడు	శంకరాభరణము–లుప్తము	శంకరాభరణం–త్రిపుట, 27–పీఠిక XXVI
256	88	శరణుశరణు సురేంద్రసన్నుత	వేంకటాచలనాయకా	మాళవి–లుప్తము	అ.చ.పీ.పు.67
257	73	శృంగారశీలునకు	శ్రీవేంకటేశుడు	శంకరాభరణము–త్రిపుట	
258	41	శ్రీనివాసా! జగదేకనాయకా!	శ్రీవేంకటప్పా!	శంకరాభరణము–లుప్తము	
259	74	శ్రీపతివని పెద్ద	శ్రీవేంకటేశ్వర	శంకరాభరణము–లుప్తము	
260	142	శ్రీరంగపతి ముద్దు	శ్రీవేంకటేశుండు	కాంబోది–లుప్తము	
261	89	శ్రీవేంకటాద్రినాథురే	గోరక్కనాథ	మాళవగౌళ–లుప్తము	
262	213	శ్రీవేంకటేశ్వరుడున్నాడు	శ్రీవేంకటేశుడు	లుప్తములు	
263	71	శ్రీహరిపాదతీర్థంబే	వేంకటరమణ	శంకరాభరణము–లుప్తము	అ.చ.పీ.పు.34
264	262	శోభనమే శోభనమే	శ్రీవేంకటగిరి	సౌరాష్ట్ర–అట	వసంతం, 5–18
265	171	సకలం హేసఖి జానామి	వేంకటగిరి పతే	లుప్తములు	నాదనామక్రియ, 5–22
266	17	సతము గాని వారేల	తిరువేంకటపతి	కాంబోది–లుప్తము	
267	132	సతముగావని నిన్ను	వేంకటరాయ	ముఖారి–లుప్తము	తంజావూరు ప్రతిలోనూ కలదు
268	65	సవరని యందమది	వేంకటప్పుడు	లుప్తములు	
269	163	సహజవైష్ణవాచారవర్తనుల	వేంకటగిరిరాయని	సామంతం–లుప్తము	సామంతం,1–10
270	245	సారెకు నీ వోజ తెలియనైనా	శ్రీవేంకటనాథ	భైరవి–లుప్తము	
271	81	స్వామి! చిత్తాన విచారించుకో	శ్రీవేంకటేశ	శంకరాభరణము–లుప్తము	
272	16	(స్వామి!) వేంకటరమణ	వెంకటరమణ	కాంబోది–అట	
273	97	సిగ్గుగల యాంటదైతేఁ	శ్రీవేంకటేశ	కేదారగౌళ–అట	సామంతం, 17–12

సంఖ్య	వ్రాతప్రతిలో సంకీర్తన సంఖ్య	పల్లవి మొదలు	ముద్ర	రాగం-తాళం	వివరణ
274	255	సిగ్గుతోడ గొంకితేను	శ్రీవేంకటేశుడు	సౌరాష్ట్ర-లుప్తము	సాళంగనాట, 18-161
275	236	సిగ్గులు బడితే శృంగారము	శ్రీవేంకటేశుడు	కాంబోది-లుప్తము	
276	40	సుదతికి మీరిందరూఁజుట్టాలైన	శ్రీవేంకటేశుడు	శంకరాభరణం-లుప్తము	భైరవి,28-273
277	266	సురలకు నరులకు సొరిది	శ్రీవేంకటనాథ	లుప్తములు	అ.చ.పీ.పు.50
278	101	సువ్వి సువ్వి సువ్వని	కోనేటప్పని	కేదారగౌళ-లుప్తము	కేదారగౌళ, 5-353
279	264	సొగటాల సురతాణి	శ్రీవేంకటేశ	సౌరాష్ట్ర-అట	
280	216	సొరిదినొకరి లెస్స	శ్రీవేంకటపతి	కాంబోది-లుప్తము	
281	227	హరి యితండు	శ్రీవేంకటశైలపతి	లుప్తములు	
282	2	పల్లవి లుప్తము	లుప్తము	ముఖారి-లుప్తము	
283	189	సంకీర్తన లుప్తము	లుప్తము	లుప్తము	
284	68	అంగనామంగనామంతరే	వేణునాదేవకీనందనః		

1. వ్రాతప్రతిలోని 20 & 171, 21 & 32, 201 & 284, 206 & 287, 207 & 288 సంకీర్తనల సంఖ్యలు పునరుక్తాలు (5).
2. 189 సంకీర్తన రేఖామాత్రంగా లభించటం వలన పూర్తిగా లుప్తముగా భావించటం జరిగింది.
3. వ్రాతప్రతిలో పేర్కొన్న మొత్తం సంకీర్తనల సంఖ్యలను పరిగణించి 289 సంకీర్తనలుగా నిర్ధారించటం జరిగింది.

   వీటిలో అధ్యాత్మ సంకీర్తనలు 69, శృంగార సంకీర్తనలు 215.
4. రాగిరేకులలోను, వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే అన్నమయ్య చరిత్ర పీఠికలోను పేర్కొన్నవికాక శేషాచార్యుల వ్రాతప్రతి మూలమున కొత్తగా వెలుగు చూస్తున్న సంకీర్తనలు మొత్తం 212.

తాళ్లపాక సంకీర్తనలు - రాగ సూచిక

సంఖ్య	రాగం	సంకీర్తనల సంఖ్యలు	మొత్తం
1	అమరసింధు	107	1
2	ఆళాపచారి	100	1
3	ఆహిరి	36, 79, 151, 197, 198, 199, 200, 201, 206, 276, 278, 280, 281, 282, 283, 284, 285, 286, 287, 288	20
4	కన్నడ	117	1
5	కన్నడగౌళ	174, 241	2
6	కల్యాణి/ కళ్యాణి	6, 7, 76	3
7	కాంబోది (జంపె, అట, త్రిపుట తాళాలు)	11, 12, 14, 15, 16, 17, 21, 31, 32, 34, 35, 69, 70, 123, 136, 137, 138, 141, 142, 191, 192, 193, 214, 215, 216, 217, 234, 235, 236	29
8	కేదార	182, 183	2
9	కేదారగౌళ	45, 95, 96, 97, 98, 99, 101, 102, 104, 105, 106, 165	12
10	గుజ్జరి	139, 140	2
11	గుమ్మకాంబోది	181	1
12	గౌడిపంతు	8, 9, 10	3
13	ఘంటారవం/ ఘంటారవము	62, 63, 84, 85, 86	5
14	తోడి	162, 187	2
15	దేశాక్షి/ దేసాక్షి	164, 148	2
16	ధన్యాసి	77, 78	2
17	నాదనామక్రియ, రేకులలో నాదరామక్రియగా సూచితం	18, 19, 20, 25, 92, 93, 94, 141 (రేకు), 169, 170, 175 (రేకు), 185, 186	13
18	నవరోజు	166	1
19	నారాయణగౌళ	116	1
20	నీలాంబరి	207	1
21	పంతువరాళి	67, 68, 134, 135, 167, 168, 218, 219(?), 220	9
22	పాడి	161, 224(?), 225, 226, 227(?), 228	6

సంఖ్య	రాగం	సంకీర్తనల సంఖ్యలు	మొత్తం
23	బిలహరి	59	1
24	బిళాపచారి	146	1
25	బౌళి (మత్య)	60	1
26	భూపాలం	152, 222	2
27	భైరవి	64, 66, 80,147, 242, 243, 245, 246, 247, 248, 249	11
28	మధ్యమావతి	124, 125, 130	3
29	మాళవగౌళ / మాళవిగౌళ	89, 90, 91	3
30	మాళవి	88	1
31	మారువధన్యాసి	204, 205(?)	2
32	ముఖారి	2, 126, 127, 131, 132, 133, 145, 158, 173	9
33	మేచబౌళి	157	1
34	మోహన కళ్యాణి	209	1
35	రమామనోహరము	154	1
36	రామక్రియ	109, 110(?), 111(?), 112(?), 113(?), 212	6
37	రేగుప్తి	159	1
38	వసంతభైరవి	202, 128, 129, 203	4
39	వరాళి	114	1
40	శంకరాభరణం (అట, ధ్రువ తాళాలు)	38, 39, 40, 41, 44, 46, 47, 48, 49, 51, 52, 53, 54, 55, 56, 71,72, 73, 74, 81, 82, 83, 108, 188, 190, 229, 230, 231, 232, 233, 244	31
41	శ్రీరాగం	23, 24, 25, 26, 30, 144, 172, 195	8
42	శుద్ధకాంబోది	176, 178, 179	3
43	సామంతం	155, 156, 163	3
44	సావేరి	160	1
45	సాళంగనాట / సాళగనాట	237, 239, 240	3
46	సౌరాష్ట్ర	101, 120, 121, 122, 250, 251, 252, 253, 254, 255, 256, 257, 258, 259, 260, 261, 262, 263, 264, 269, 270, 271, 274	23

T.T.D. Religious Publications Series No: 1408
Price Rs: 120.00



"ఒక్క సంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించగ
తక్కినవి భండారాన దాచివుండనీ"

– తాళ్లపాక అన్నమాచార్యులు

Published by **Dr. K.S. Jawahar Reddy.** I.A.S., Executive Officer
Tirumala Tirupati Devasthanams, Tirupati.